వీరేశలింగ గ్రంథావళి

రెండవ సంపుటము

(స్వతంత్ర రచనలు)

894.8272
VEE

ప్రకాశకులు
చారిత్రక సమాజము
రాజమహేంద్రవరము

Ci

బ్రాహ్మ వివాహము

ఈనాటకమునందు వచ్చు పాత్రములు.

పురుషులు.

ధనాలకామయ్య—పెండ్లికొమార్తెయొక్క తండ్రి.

పుల్లయ్య, పిచ్చయ్య—పెండ్లికొమార్తెయొక్క బంధువులు

పేరిశాస్త్రులు, వట్టిసోమయాజులు—పెండ్లి బేరమునకుఁ బంపఁబడిన వైదికస్వాములు.

పెద్దయ్య—పెండ్లికొమారుఁడు.

పరమేశ్వరావధానులు, నీలకంఠసోమయాజులు — పెండ్లికొమారుని యొక్క బంధువులు.

బొజ్జయ్య—సిద్ధాంతి.

రామయ్య—పెద్దయ్యగారి పరిచారకుఁడు.

భోగరాజు, సుబ్బారావు, భీమరాజు, సోమరాజు, రామస్వామి, వెంకప్ప, చెవిటిచయనులు, గుడ్డి గున్నయ్యగార్లు — తాంబూలమునకు వచ్చిన పెద్దమనుష్యులు.

భాగవతుల పాపయ్య, సోమయాజులు, సాగి సర్వావధానులు, వేదుల వెంకయ్య, ముడంబి నరసింహాచార్యులు, సుబ్బావధానులు, లక్ష్మణావధానులు, సూరావధానులు—సదస్యులు.

వెంకటరెడ్డి—మాన్యముసాగుబడి చేయు కాపు.

నీళ్ళ కావళ్ళ కొండయ్య, పీనుగుల పేరయ్య—వడ్డనబ్రాహ్మణులు.

రాజన్నగారు, పాపయ్యపంతులుగా &c —పెండ్లివిందుకువచ్చినారు.

పైడిపాటి పాపావధానులు, బంధకవి భానుమూర్తి—పూటకూటింటికి భోజనములకువచ్చినారు.

స్త్రీలు.

అజ్ఞానమ్మ—పెండ్లికొమార్తెయొక్క తల్లి,

చిన్నమ్మ—పెండ్లికూతురు.

కన్నమ్మ—కామయ్యగారిపనికత్తె.

బట్టతల అలివేణి, సొట్టకాలి హంసయాన, చిలికికన్నుల చకోరాక్షి, నత్తినోటి మంజువాణి—వేశ్యలు.

బాపనమ్మ—ముత్తైదువ.

వెనుకటి అలవాటునుబట్టితిరుగుచూవున్నానుగాని దేహంలోమునుపటి సత్తువలేదు; వంట్లో రక్తమాసాదులుహరించిపోయినవి; లేస్తేకూర్చో లేను. కూర్చుంటే లేవలేను. మీదటికిబ్రతుకుచానో లేదో, మీరేమీ అడ్డంచెప్పక నాదేహంలో ప్రాణం వుండగానే యీయేడేయీకాస్త కార్యమూ కానియ్యండినాయనా! (అని పెద్దపెట్టున నేడ్చుచున్నది.)

పుల్ల—వూరుకో. పెద్ద ముత్తయిదవు, శుభకార్యం ముందు పెట్టుకుని యేమీ తెలియని దానికిమల్లే యిలాకంటతడిపెట్టుకోరాదు. కన్నీళ్లుతుడుచుకో. నీకేమి యిప్పుడు తొంభయియేళ్ళు వచ్చినవా? నూరేళ్ళువచ్చినవా? మొన్న మొన్నటిదానవు. నీకంటె పెద్దవాళ్ళం దరూ బ్రతుకుచూ వుండలేదా? నీకిప్పుడు మరేమీ భయంలేదు. నీ కూతురు ఫదిమంది బిడ్డలను గన్నదాకా నీవు బ్రతుకుచావు.

అజ్ఞా—(చేతులతో కన్నులు నలుపుకొనుచు డగ్గుత్తికతో) నాయనా! నీనోటివాక్యాన్ని అలా బ్రతుకవలెనుగాదా?

పిచ్చయ్య—నీజాతకంలో యెనభైయేళ్ళు జీవిస్తావని వ్రాసి వున్నది. అధైర్యపడకు. నీవు యిఖ ముప్పయ్యేళ్ళు అడ్డంలేకుండా బ్రతుకుచావు. భూమిమీద నీవు ఇంకా యెంతమంది మనమలనూ మనమరాళ్ళనూ యెత్తవలెనో!

అజ్ఞా—(సంతోషముతో) నా నాయన! నా తండ్రి! నీఅమ్మ కడుపుచల్లగా! నీఅత్తకడుపు చల్లగా! నాఆయువూ నీఆయువూకూడా పోసుకుని నీవే వెయ్యేళ్ళుబ్రతుకు.

కామ—మీరిద్దరూ నాకు కావలసినవారుకదా? నాకుయిప్పుడు యేమిఆలోచన చెపుతారు?

బంధువులు—మీరు యిప్పుడుతలపెట్టినకార్యం బహుసర్వోత్త మంగావున్నది. అవశ్యంగావివాహం సాధ్యమయినంతత్వరలో కావల

శిండే. అన్నీ సరేకాని మరి మీరు సంబంధం యెక్కడనైనా విచారిస్తూవున్నారా ?

కామ-సమ్మంధాలకేమి తలవెంట్రుకలన్నివున్నవి. నిత్యమూ ఫదిమందివచ్చి అడిగిపోచూవున్నారు. నాలుగుదినాలనుంచి బుచ్చయ్య చెట్టులుగారి కొమారుడు కొమరయ్య కియ్యమని ఆచిన్నవాడి మేన మామ అడుగుచూ వున్నాడు. చిన్నవాడు చూడబోతే బహుచిన్న వాడు; చిన్నతనంలోనే నాలుగు ముక్కలంటినవి; నాలుగు వందల రూపాయల నగలు పెడచామంచూవున్నారు; నాలుగుఫుట్ల మాన్యం వున్నది; పిల్లవాడు మంచి బుద్ధిమంతుడష! అన్నీ భాగానేవున్నవికాని చిన్నవాడికి అన్నదమ్ములు చాలామంది వున్నారు. అందుచేత ఆ చిన్నవాడికి యివ్వడానికి బొత్తిగా సమాధానం లేకుండావున్నది. పిల్లవాడిమేనమామ దినదినమూ వచ్చి తిరిగిపోచూవుంటే నిన్నరాత్రి పిల్లనియ్యనని స్పష్టంగా తెలియచెప్పినాను.

పిచ్చ-పోనీ, మన గునుపూడి సోమశాస్త్రికొమారుడు కామ శాస్త్రికియ్యరాదా? వాడుతండ్రికి వొక్కకొడుకు, వయస్సువిచారించ బోతే యిరవై సంవత్సరాల కన్నయెక్కువ లేదు. పిల్లవాడు మంచి రూపసి; నిరుడు యఫ్. ఏ. పరీక్ష ప్యాసయినాడు; మీదటికి బియ్యే పరీక్షకూడా ప్యాసయి ధారలచేత గొప్ప బహుమతీ పొందు చాడష! వాడు తప్పకుండా గొప్పవుద్యోగం చేస్తాడని అందరూ చెప్పు కుంచూవున్నారు. ఆసమ్మంధం మొదటినుంచీ కలిసిందికూడాను.

కామ-నామనస్సుకు యీసంబంధం యెంతమాత్రమూ బాగా వున్నదికాదు. మాన్యాలా? మళ్ళా? యేమివున్నవి? తండ్రి ఫదిరూపా యలు తెస్తే వాటితో జీవనం చేస్తూవున్నారు. పట్టుమంటే యిప్పుడు ఫదివరహాలు తేలేరు. ఇఖ నెప్పుడో పిల్లవాడువుద్యోగంసంపాదించి

గడించిపెడచాడని యిప్పుడు నోట్లో వేలుపెట్టుకుని కూర్చోవలెను. అవతలగడిస్తాడో లేదో యెవరుచూచారు? కీడెంచిమేలెంచమన్నాడు. వొక వేళగ్రహచారంచాలక పిల్లవాడుకాలంచేసెనా, తరువాతచిన్నది పూటకూటికి గతిలేక యావజ్జీవమూ మాప్రాణాలకుసూరుమనియేడుస్తూవుంచుంది. ఆపిల్లిబ్రహ్మత్యవచ్చి నాకు చుట్టుకుంచుంది. చూస్తూ చూస్తూ పిల్లదానిగొంతుక యెట్లాకొయ్యను? నాకీసంబంధంపనికిరాదు.

అజ్ఞాపిచ్చయ్యగారూ! మావారిసంగతిచూస్తూవున్నారుగదా! యెటువంటి సంబంధంవచ్చినా యేదోవకవంక పెట్టి అదిమంచిదికాదంచారు. ఎక్కడనో కొండమీదనుంచి దిగివచ్చేసంబంధం తెస్తా మంచారు. నేనెంత మొత్తుకున్నా నామాటవినరు. మాణిక్యంలాగు నా అన్నకొడుకు నలభయియేళ్ళవాడున్నాడు. పిల్లదాన్ని వాడికివ్వని నిత్యమూ చెవినియిల్లుకట్టుకొనిపోరుచాను. నామాటలు లేశమయినా చెవినిపెట్టకుండావున్నారు. నేనియ్యననడానికి రెండోపెళ్ళివాడయినా కాడుగదా! ప్రపంచంలో మాన్యాలులేని వాళ్ళందరూ బ్రతుకుచూ వుండలేదా? తనకేంభాగ్యంచూచి నాతల్లిదండ్రులు పిల్లనిచ్చినారు? లోకంలో అందరూ నగలుపెట్టెకున్నవాళ్ళే వున్నారా? పసుపూ కుంకమూ తిన్నగావుంటే, మెడకు కొయ్యపుస్తెకట్టుకొని మొగుడూ పెళ్ళామూ బలుసుకూరయేరుకునితిని బ్రతుకుచారు. మీరుఘట్టిగా కూకలువేసి మేనరికం మంచిదనివప్పించి నామేనల్లుణ్ణి యెలాగయినా వకయింటివాణ్ని చేయించండి.

కామ-నేనూ ఇంతఅనుకూలమైన సంబంధం తేవలెననే శక్తి వంచనలేకుండా ప్రయత్నంచేస్తూవున్నాను. రాత్రింపగళ్ళు నాకు దీని మీదనేధ్యానము. దైవఘటన యింకా సమకూడకుండావున్నది. యీ వూళ్లోనే వక మంచి సమ్మంధంవున్నది. వారు పిల్లదానికి ఫదివందల రూపాయల ఆభరణాలువుంచుతారు; ఫదివుట్లమాన్యంకూడావున్నది.

అంతకంటే అనుకూలమైన వరుణ్ని మనం మరివకచోట సంపాదించ లేము. పెళ్ళికొడుకును మీరున్నూ యెరుగుదురు. మీపుందర దాచడంయెందుకు? నెలదినాలకింద పెద్దింటి పెద్దయ్యగారిభార్య చచ్చిపోయింది. వారు చిన్నదాన్ని ఇమ్మని అడుగుతూ వున్నారు గాని నేనే యింకా మాట యివ్వలేదు.

అజ్ఞా—ఇదెక్కడిసమ్మంధం దొరికింది? పెళ్ళికొడుకుకు ఇది నాలుగోపెళ్ళి. వయసుకా మావారికంటెనూ అతడు చాలాపెద్ద వాడు: అంతకన్న నామేనల్లుడి కియ్యరాదా? వాడికి నలభైయే ళ్లైనా నిండాలేవు.

పిచ్చ—(తనలో) పెద్దయ్యగారికి వివాహమహోత్సవంకంటె దినవార మహోత్సవంచేస్తే బాగావుంచుంది.

పుల్ల—(పిచ్చయ్యతో రహస్యంగా) పెద్దయ్య పెళ్ళిపాలకీ యెక్కడంకంటె యేడుకట్లపాలకీయెక్కువ రేగితేదివ్యంగావుంచుంది.

కామ—ఈ వెట్టిబాగులది చిన్నదాన్ని తన మేనల్లుడికిమ్మని చంపుచూ వుంచుంది, చదువా? సంధ్యా? మాన్యాలా? మళ్లా? సొమ్మా? సంబంధమా? వాడికేమున్నది? మనం కొంచెమైనా చిన్న దాని సుఖం చూసుకో నక్కరలేదా? పిల్లదానియోగం బాగావుండి నేను చెప్పిన సమ్మంధం దొరికితే పిల్లదిచాలా సుఖపడుచుంది. వంటి నిండా పెట్టుకొన్నన్నినగలు; కట్టుకున్నన్ని కోకలు; సుఖంగాతానింత తిని వకరికింత పెట్టవచ్చును. పయిని వేరేఆజ్ఞ పెట్టడానికి అత్తా ఆడ బిడ్డా యెవరూలేరు. పెళ్ళికొడుకుజాతకంచూచాను. రమారమినలభై యేళ్ళువుంచవి. వాతశరీరంగనుక ముసలివాడులాగు కనపడచాడు. ఒకవేళ ముసలివాడే అయినప్పటికీ లోపంయేమిషి? ముసలివాళ్ళను చేసుకనిమాత్రం సుఖపడ్డవాళ్ళులేరా? వేగిరంకడుపుఫలించి దాని కడుపున నాలుగుకాయలుకాస్తే దానంత అదృష్టవంతురాలుయెవరు?

దేముడిచ్చిన కొర్రగింజంత ఆయువూ తిన్నగావుంటే, అదే యెల్ల కాలమూ కాపురంచేస్తుందేమో! దాని అదృష్టానికి యెవరుకర్తలు? దానిమంగళసూత్రబలం యెలాగంటిదో మనం. యెవరైనా చూచినామా? చూడండి. కన్నమ్మగారిపిచ్చమ్మ అరవై యేళ్ళవాణ్ని కట్టుకొని కడిపెడు బిడ్డలతల్లి అయినది. చిన్నవాళ్ళను చేసుకున్న వాళ్ళందరూ అయిదోతనమే చేస్తున్నారా? మామగారిగారమ్మకు మోచేతి పద్దంనోములోనే మొగుడి దినవారాలువచ్చినవి. ఇలాగు మూడేళ్ళ వాడిని చేసుకున్నదాని బ్రతుకుకూడా ముక్కలైపోయిందికాదా? ఇంతకూ నొసటవ్రాసివున్నవ్రాలు ప్రధానం. ఇప్పుడు పెద్దవాళ్ళను కట్టుకున్నవాళ్ళే తరుచుగా సుఖపడుచూ వున్నారు.

అజ్ఞా—(మొగముచిట్లించి) ఏమిటో! నాకీపెళ్ళికొడుకునుచూస్తే—

కామ—అవునే! వోసీ! నీకు చెవులోవకయే కాంతంచెవువాను యిలారా. (అని రహస్యంగా గుసగుసలాడుచు) నీవెంతమాత్రమూ అభ్యంతరం చెప్పవద్దు. ఈసంబంధంతప్పిపోతే యిలాగంటిసంబంధం మరిఒకటి వెయ్యేళ్ళుతల్లకిందైనా మనంసంపాదించలేము. వాళ్ళకేమి భాగ్యవంతులు! లక్షమందిపిల్లలను యిచ్చేవారువుంచారు. దీనికివప్పకుంటివా నీకు అగువులూతగువులూ బాగాజరుగుచవి. వియ్యపురాలవుగనుక నీకయిదురోజులూ చీరెలూమాడలూ దొరకుచవి. ఇంతేకాకుండా వారుమనకు యెనిమిదివందలరూపాయలు యిస్తామంచూవున్నారు. నేను వెయ్యిరూపాయలుచిల్లిగవ్వతక్కువవల్లపడదంచూవున్నాను. పెద్దముత్తయిదవు నీముద్దూముచ్చటా బాగాతీరుచుంది. అందులో నాలుగువందలరూపాయలుపెట్టి నీకు నగలుకొనిపెడచాను. పడుకోవడానికి పరుపూ పట్టెమంచమూచేయిస్తాను. ఇంకో రహస్యం కూడావున్నది. పెళ్ళికొడుకు బహుముసలివాడు, మహాబ్రతికితే ఫదియేళ్లు బ్రతుకుచాడు, పన్నెండేళ్ళు బ్రతుకుచాడుగాని అంతకంటె

యెక్కువబ్రతకడు. ఆముసలిప్రాణం కాస్తా గుటుక్కు మనడంతోటే, అవతల అతగాడి ఆస్తిఅంతా మనకే దక్కుచుంది.

అజ్ఞా—(నగలు వచ్చునన్న సంతోషముతో బంధువులవంక తిరిగి) ఆయనచేస్తానంచూ వుండడమూ నేను వద్దంచూవుండడమూ బొత్తిగా బాగా వుండలేదు. పెనిమిటిఆజ్ఞ మీరినానని వట్టిరవ్వ నాకెందుకు? పుల్లయ్యగారూ! వేగిరం ఆయన యిష్టం వచ్చిన వాడికి పిల్లదాన్నియిచ్చి వివాహం చెయ్యమనండి. ఆయనకేది సమాధానమో నాకూ అదే సమాధానము.

[తెరలో]

ఎవరయ్యా యింట్లో? ఓ కామయ్యగారూ! తలుపుతియ్యండి. ఓహోయి! తలుపుతియ్యండి.

కామ—(ఆలకించి) భార్యవంకచూచి) ఔనే! యింటిదానా! యెవరో తలుపువద్ద పిలుస్తూవున్నారు వెళ్ళితీసిరా.

అజ్ఞా—అలాగే. (అని తలుపుతీయంబోవుచున్నది)

బంధు—కామయ్యగారూ! యివాళకు ఫదిరోజులనుంచి మా యింటికి బంధువులువచ్చి తించూవున్నారు వారికి యేదో కోర్టులో వ్యాజ్యంవున్నదష! పెందలగాడేవెళ్ళవలెను. వారు మాకోసం భోజనానికి కనిపెట్టుకుని వుంచారు. ఆలస్యమయితే వారికోర్టుపనికిభంగం కలుగుచుంది. ఈపాటి మాకు సెలవిస్తారా?

కామ—చిత్తం. మీరు తిరిగీ యెప్పుడు దర్శనం యిస్తారు!

బంధు—యెప్పుడు పడితే అప్పుడేవస్తాములెండి. (అని నిష్క్రమించుచున్నారు.)

కామ—(మనసులో) అయ్యో! మనం సొమ్ముపుచ్చుకుని పిల్లదాన్ని ముసలివాడికి కట్టిపెట్ట తలచుకొంచూవున్నామే, దీనివల్ల మన

కేమయినాపాపంవచ్చి చుట్టుకుంచుందేమో! అన్నిటికీ మనశాస్త్రుల్లగా రున్నారు. ఆయననడిగి మన సంశయ నివర్తి చేసుకుందాము.

(అప్పుడిద్దఱు వైదికస్వాములు ప్రవేశించుచున్నారు)

కామ—రండి. శాస్త్రుల్లగారూ! రండి. సోమయాజులుగారూ! దయచెయ్యండి. మీయుభయులకూ నమస్కారము. (అని చేతులు జోడించుచున్నాడు.)

వైది—దీర్ఘాయుష్యమస్తు ధనకనక వస్తువాహన సమృద్ధిరస్తు! శీఘ్రమేవ సుపుత్రాప్రాప్తిరస్తు! రాజద్వారే రాజభవనే సర్వదా దిగ్విజయమస్తు! (అని కూరుచున్నారు.)

కామ—శాస్త్రుల్లగారూ! నాతో ప్రొద్దున్నేవస్తామని చెప్పి యింతప్రొద్దెక్కివచ్చినా రేమయ్యా?

శాస్త్రి—నిన్ననయితే మీతో అలాగే మనవిచేసినానుకాని పెద్దయ్యగారియింటికి వెళ్ళిమాట్లాడి నిన్ననన్నవేళకే యిక్కడికి రావలెనని వస్తూ దోవలో ముష్టికిపోచూవున్న పంచాంగంబ్రాహ్మణ్ని చూచి యివేళ వర్జ్యం యెప్పుడని అడిగినాను. అతడు యిప్పుడే ప్రవేశించిందని చెప్పినందున నాలుగు గడియలబట్టి తంబిశెట్టిగారి వీధులో నిలుచుండి వర్జ్యంపోయిన తరువాత మరీవచ్చినాను. అందు చేత యింత ఆలస్యమయింది.

కామ—మీరు మంచిపనిచేశారు. నామనస్సులో మిమ్మల్ని వక్కధర్మసందేహం అడగవలెనని వున్నది. వాస్తవం సెలవిస్తారా?

శాస్త్రి—ముఖ్యంగా అడుగునాయనా! నాకుతోచిందేమో చెబుచాను.

కామ—డబ్బుపుచ్చుకొని పిల్లదాన్ని యివ్వవచ్చునా?

శాస్త్రి—ఆ. మహారాజువలె యివ్వవచ్చును. దానివల్లదోషం యేమి?

కామ-ఏమోకాని పెద్దలందరూ కన్యాశుల్కం కూడ దంచారు. యెందుచేత?

శాస్త్రి-అలాగు చెప్పేవాళ్లు వట్టి తెలివితక్కువవాళ్లు; వాళ్ళు యేశాస్త్రాలుచూచి యీమాట చెప్పినారు? లోకంలోమనకు ప్రత్యక్షమయిన దృష్టాంతం వక్కటిచూచుకోరాదా? కన్యాశుల్కమేమూష్యమయినపక్షానికి యిప్పుడందరూ యెందుకు డబ్బుపుచ్చుకుని పిల్లలను యిస్తూవున్నారో నాకు చెప్పండి.

కామ-ఏశాస్త్రంలోనూ యెక్కడనూ బొత్తిగా నిషేధంలేక పోతేయిటువంటివార్తలులోకంలోపుట్టవే. మీరు చూచినశాస్త్రంలో యీవిషయం యెక్కడనైనా యేమయినా చెప్పబడివున్నదేమో సెలవియ్యండి.

శాస్త్రి-(ఏమో తెలిసినట్లు మిన్నువంక జూచుచునాలోచించి) ధర్మశాస్త్రంలో వక వోట కొంచెంకూడదని వున్నదికాని, అది యీ విషయంలో పనికిరాదు.

కామ-యెందుకు చేత?

శాస్త్రి-శాస్త్రకారుడు అలాగునేచెప్పినా, వ్యాఖ్యానంలో దాన్ని సవరణచేసి శాస్త్రకారుని తాత్పర్యం వివరంగావ్రాసినారు. వ్యాఖ్యానకారుడైన తాతంభట్టుగారు, కన్యను పిల్లవాడికిచ్చినప్పుడు సొమ్ముపుచ్చుకుంటే దోషమనిశాస్త్రకారుడిఅభిప్రాయంకాని ముసలి వాడికిచ్చినప్పుడుకూడా పుచ్చుకోకూడదని కాదనినిష్కర్షించివున్నారు. ఏలాగంటే, శ్లో॥ వృద్ధాయకన్యాంయోదత్వా। తద్భారద్విగుణంధనం। నోహరేత్సపుమాన్నింద్యః। స్తత్పిత్రాణామధోగతిః॥ అనినిబంధనగ్రంథంలోవ్రాసి, ఆప్రకారంగానే ఆయన తనకొమార్తెనుకూడా ధనం స్వీరించి శతవృద్ధుకిచ్చి వివాహంచేసి, ఆధనంతో తానుయజ్ఞంచేసి

పుణ్యాంసంపాదించినట్టు పెద్దలుచెప్పుకోవడం మీరువించూవుండ లేదా? శాస్త్రంయెట్లావున్నా, కన్యాశుల్కం పుచ్చుకుంచూవుండడంయిరవై ముప్పయి యేళ్ళనుంచి శిష్టాచారంగా జరుగుచూనేవున్నది. అందుకు మనపెద్దలందరూ అంగీకరించి వూరుకుంచూనేవున్నారు. కాబట్టి మీరు మనస్సులో సందేహంవుంచుకోవలసినపని లేదు. ఫదేళ్ళక్రిందట పామర్రులో భాగవతుల పరబ్రహ్మశాస్త్రుల్లుగారు పిల్లనుయిచ్చిసొమ్ము పుచ్చుకున్నారు. నిరుడుమనగ్రామంలోనే పురాణం బుచ్చయ్య సోమయాజులుగారు నూరువరహాలు పుచ్చుకొని కన్యా ప్రదానంచేసింది మీకళ్ళారాచూడలేదా? ఆయనను యెవరైనా యేమైనా అన్నారా? ఇప్పటిపెద్దలందరూ దాన్ని నిరభ్యంతరంగా అంగీకరిస్తూనేవున్నారు.

కామ-అదిసరేకాని ముసలివాడికి బిడ్డనుయిచ్చినందువల్ల మనకు యేమైనా దోషంవున్నదా?

శాస్త్రి-లేశమూదోషంలేదు. దానివల్ల విశేషించిఫలంకూడా వున్నది. పడుచువాడికి లోకంలో అందరూ కన్యనుయిస్తారు. అదివక ఫలంలోదికాదు. ముసలివాడికి పిల్లను యివ్వడమే యివ్వడము. ఫది వేలుపుచ్చుకునిఅయినా పక్క పెద్దబ్రాహ్మడియిల్లు నిలవబెడితే దాని వల్ల కోటికన్యాప్రదానాలుచేసినఫలంచులాగ్గాలభిస్తుంది. యెలాగంటే, శ్లో॥ వృద్ధవిప్రాయయోకన్యాం।దదాతి ధనకాంక్షయా । సకోటికన్యా దానస్య । లభతేహి ఫలంమహత్॥ అని ప్రమాణంవున్నది.

కామ-ధర్మశాస్త్రాలన్నీ సమగ్రంగాచదివి క్రోడీకరించి సారం తీసిన మహాపండితులైన దొడ్డబ్రాహ్మలుగనుక, మీరు నాసందేహా లన్నిటినీ నిముషంలో అవలీలగా తీర్చివేసినారు. ఇలాచెయ్యడానికి మీవలె శాస్త్రరహస్యాలు తెలుసుకోని వారికి సాధ్యం అవుచుందా?

సోమ-శాస్త్రుల్లగారివలె చిన్నప్పటినుంచీ అదేపనిగా శోధించి సాంప్రదాయ యుక్తంగా శాస్త్రధర్మం తెలుసుకోనివారు పలువురు

పలుమాటలు చెపుచారు. వారి మాటలన్నీ మనంపాటిగాపట్టరాదు. పూర్వంఒకప్పుడు యీవిషయమయ్యేనాకున్నుమరివక శాస్త్రుల్లకున్ను వివాదవచ్చి చర్చజరిగినప్పుడు, ఆయన కన్యాశుల్కంబొత్తిగా కూడదని వకస్మృతివచనం చిదివినాడు. నేను తక్షణమేఅందుకుని తడుము కోకుండాయేకాక్షరనిఘంటువునుబట్టికూడదనగా కూడుచుందనిఅర్థం చేసి నావాదం సిద్ధాంతంచేసినాను. "ధాతూనా మనేకార్థం" అని వుండడంచేత కూడదనగా కూడునని అర్థంచెప్పి నామతం సాధించి నాను. ఈశాస్త్రుల్లగారుచెప్పినధర్మశాస్త్రంకూడాకనపరచి, ఆస్మృతి వచనానికి కూడదన్న అర్థమేవప్పుకుని రెండుస్మృతులుపరస్పర విరుద్ధంగావున్నప్పుడువాపక్షంచేత దేనైనాఅంగీకరించవచ్చుననిసిద్ధాంత సమన్వయం చేసినాను.నలుగురిలోనూఆబ్రాహ్మడుచిన్నపోయి మొగమింతచేసుకుని నాముందర మళ్ళీ నోరెత్తలేకపూరుకున్నాడు. అప్పటి సభవారిలోయెవరూచదువుకున్నవారు లేకపోయినా, నాయుక్తికిన్నీ పాండిత్యానికిన్నీ అందరూహాశ్చర్యపోయినారు. నేను యిచ్చినశాస్త్ర ప్రమాణాలుచూచి, యిఖ నాయంతటి పండితుడు లోకంలో మరి వకడువుండబోడని నన్ను వెయ్యినోళ్ళ మెచ్చుకుని సంతోషించినారు. యోగ్యతగ్రహించిడానికి తెలివితేటలువుండవలెనుగాని చదువెందుకు?

(ఇంతలో అజ్ఞానమ్మ తలుపువేసి, లోపలకుపోయి యేదో యొకపని చక్కపెట్టుకొని మరలవచ్చి స్తంభముమీద చేయివేసికొని నిలుచున్నది.)

కామ—శాస్త్రుల్లగారూ! ఇట యీమాటలు కట్టిపెట్టి వెళ్ళిన కార్యం పండయిందో కాయయిందో యేమిచేసుకుని వచ్చినారో చెప్పండి. వెయ్యింటికి తక్కువలేకుండా కుదిర్చినట్టయితే మీచెవులకు కుండలాలజోడు చేయించి వేస్తానని అప్పుడే చెప్పినానుగదా!

శాస్త్రి—(అజ్ఞానమ్మవంక చూచిసంకోచముతోనూరకున్నాడు)

కామ—మా అమ్మాయితల్లికీ యిది యిష్టమే. సంశయపడక చెప్పండి.

శాస్త్రి—మీరు చెప్పినతరువాత మరివక విధంగాకూడా అవుచుందా? నాయవచ్ఛక్తి వినియోగించి మీరుకోరినరొఖంయివ్వడానికి పెద్దయ్యగారిని వొప్పించివచ్చినాను. ఇఖ నాకుండలాలజోడు సిద్ధం చేయించండి.

అజ్ఞా—(సోమయాజినిచూచి) అన్నయ్యా! చిన్నదానికి యేమి ఆభరణాలు వుంచుచారో చెప్పండి.

సోమ—అమ్మా! నగల కేమితక్కువ? మీచిన్నది పూర్వజన్మమందు బంగారపు పువ్వులతో పూజచేసుకున్నదిగనుక, యీజన్మాన్ని శరీరంనిండా నగలు దిగవేసు కోవడానికి లభించింది. వెనుకటిభార్యవి వెయ్యివరహాల నగలువున్నవి. అవి కాకుండా కొత్తగా కాసులపేరు కట్టించుచూవున్నారు. పిల్ల అదృష్టవంతురాలయి సుఖపడేయోగ్యత వున్నదిగనుకనే దైవంమీవధూవరులకు యిద్దరకూ యేకకాలమందు యీసమ్మంధం చెయ్యడానికిబుద్ధిపుట్టించినాడు. మీదంపతులపూర్వపుణ్యంవల్లనే యిటువంటి అల్లుడు మీకు లభ్యమయినాడుకాని మరివకటి కాదు.

కామ—వోసీ! లోపలికివెళ్ళి తమలపాకులు తీసుకునిరా. శాస్త్రుల్లవారిద్దరికీ తాంబూలం యిత్తాము.

అజ్ఞా—(స్తంభముచాటుకుపోయి తుగవికిక నంబడునట్లుగా లేనని మొగముత్రిప్పి సైగచేసి తనలో విసుగుకొనుచున్నది.)

కామ—(లోపలకు పొమ్మనిచేసైగచేసి) ఏమే! మొద్దులాగున అట్టే నిలుచున్నావు? వినపడలేదా యేమిటి? లోపలికి వెళ్ళి తాంబూలాలు తీసుకురమ్మంచూవున్నాను.

అజ్ఞా—(కోపముతో నడిచిపోయి) తానేమోఆకులూపోకలూ తెచ్చి యింటినిండా కుప్ప వేసినట్టే తాంబూలాలు తెమ్మనినామీదపడి

యేడుస్తాడు. ఆడదాన్ని నేను యెక్కడనుంచి తేగలను? (అని తనలో తాను సణుగుకొనుచు మరల రాకున్నది.)

కామ—ఏమే తాంబూలాలు తెమ్మంటే అదేపోకగా పోయినావు? పెట్టెతాళంచెవి కనపడలేదా యేమిషి?

అజ్ఞా—(లోపలనుండి) ఇందాకటినుంచీ దానికోసమే వెతుకుచూవున్నాను. ఎక్కడా కనపడకుండావున్నది. కుర్రముండ వకచోట వున్న వస్తువు వకచోట వుండనిచ్చి యేడుస్తుందా? అబ్బబ్బా! దాని మూలంగా నాప్రాణంవిసిగిపోచూవున్నది. తాళంచెవి యెక్కడ వేసి ఆడుకోపోయిందో! ఎప్పుడు దీన్ని అత్తవారింటికి పంపించేస్తే నాప్రాణం నిమ్మళంగా వుంచుందో! ఓపాపిష్టిదేవుడా! భూమిమీద నాకు చావు పెట్టవుగదా?

వైది—తాంబూలాలకేమి? యెప్పుడూ వచ్చిపోచూవుండే వారికి మరివకప్పుడు యివ్వవచ్చునులెండి. ఈరోజున మాకు కోర్టులో సాక్ష్యం తొందర వకటివున్నది. ఆలస్యంగా వెళితే నాలుగురూపాయలు దొరికే సొమ్ముపోచుంది. వచ్చేలాభంపోగా మీదిమిక్కిలి మునసన్నుగారు వేళకు వెళ్ళనందుకు జనుమానాకూడా వేస్తారు. యింకా ప్లీడరువద్దకుపోయి యేమిసాక్ష్యంచెప్పవలెనో నేర్చుకోలేదు. ఈ పూటకు సెలవియ్యండి మళ్ళీవస్తాము.

కామ—చిత్తం, కొంచెంసేపువుండి తాంబూలాలు పుచ్చుకోకుండానే వెళుచున్నారుగదా? ఈసారిఅయినా వెళ్ళేటప్పుడుచూచి జాగ్రతగాపొండి. మొన్నవచ్చినప్పుడు వాస్తుశాస్త్రప్రకారంగా యెత్తించిన పెద్దవీధి ద్వారబంధం తగిలి తలబొప్పికట్టి పాపం మూడురోజులనుంచీ బాధపడుచూవున్నారు.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము

ప్రదేశము — పెండ్లికొడుకుగృహములోనిగది.

(పెండ్లికొమారుఁడు పెద్దయ్యయు, బంధువులు పరమేశ్వరావధానులును నీలకంఠ సోమయాజులును ప్రవేశించుచున్నారు.)

పెద్ద—పరమేశ్వరావధానులుగారూ! దయచెయ్యండి నీలకంఠ సోమయాజులుగారూ! కూర్చుండండి.

నీల—పాపం! వార్ధకదశలో మీకుగొప్పవిచారం పట్టుకున్నది. దైవసంఘటనానికి మీరు విచారించవలసినపని లేదు. పుట్టినతరువాత యెప్పుడైనా చావువుండనేవున్నది. ఆవిడ కేమి? అదృష్టవంతురాలు. మంచంయెక్కి తీసుకోకుండా పునిస్త్రీజన్మాన్ని పసుపుకుంకాలతో కొల్లలాడుచూ లేచిపోయింది.

పెద్ద—యేపాట్లువచ్చినా నావేకాని దానికేమి? మీరు సెలవిచ్చినట్లుగా అదియెలాగయినా అదృష్టవంతురాలే. బ్రతికివున్నన్నాళ్ళూ సుఖంగా తానింతతిని వకరికింతపెట్టింది. తుదకు వకరిచేత చేయించుకోకుండా అనాయాస మరణంగా లేచిపోయింది.

పర—మీసొమ్ము సుఖంగా అనుభవించడానికి ఆమెకు భూమి మీద ఋణంలేకపోయింది గనుక తననోట్లో మన్నుకొట్టుకొని తానే యెగిరిపోయింది. మగవాళ్ళు మీకేమి? రేపీపాటికి చక్కగా మళ్ళీ భార్యా వస్తుంది. పదమూడోనాడే వివాహకార్యం జరగడానికి ప్రయత్నం చెయ్యవలసినది చేసినారుకారు. ఇఖ మూడోనెల దాటకుండానైనా శుభకార్యం జరగడానికి తగినఆలోచన చేస్తూవున్నారు గదా?

పెద్ద—ముసలివాణ్ణినాకుయీ కావివాహంయెందుకు? దేహంలో జవసత్వాలు వుడిగిపోయినవి. మొన్నపోయింది యింకానాలుగేళ్ళకు

పోవుచుందనగానే నాకు కామంపోయింది. నాకు యిప్పుడు స్త్రీ వాంఛయేమీ లేదు.

నీల—భార్యాపోయినందున విరక్తిచేత మీరీలాగు సెలవిస్తూ వున్నారేకాని నిజంగా మీకుమాత్రం మనసులో వాంఛలేకపోయిందాయేమి? మీకంటెపెద్దవారు భారతము భానుమూర్తి దీక్షితులుగారు రేపువివాహం చేసుకోరా? తొంభయిమేళ్ళుదాటిన బులుసు బుచ్చయ్యశాస్త్రుల్లుగారు మొన్న మూడేళ్ళపిల్లను వివాహం చేసుకోలేదా? పెద్దతనంలో వివాహం చేసుకుంటూవున్న వాళ్ళందరూ కామంవుండే చేసుకుంటూవున్నారా? భూమిమీదతమపేరు నిలవడానికిన్నీ, అగ్నిహోత్రాలకు భంగము కలుగకుండా వుండడానికిన్నీ, సంసారధర్మంలో భార్యాఅనివకతె అవశ్యంగా వుండవలెను.

పర—అవును; సోమయాజులుగారు సెలవిచ్చినదంతా వాస్తవము. తమ్ములున్నా తమ్ములబిడ్డలువున్నా పెట్టినప్పుడు దోచుకొనపోయ్యేవాళ్ళేకాని వొక్కళ్ళూ సమయానికి అక్కరకువచ్చేవాళ్ళుకారు. కోపంవచ్చినప్పుడు నాలుగుకొట్టినాతిట్టినా స్వతంత్రంగా చేసుకున్న పెళ్లాంవంటిది వకటికాదు. మానవధర్మము లెప్పుడూ చెప్పినట్టురావు. మీరుపెద్దలైనారు; మీకుపుపచారం జరగవలెను. యెందరు బంధువు లుంటేయేమి? కాలిమీద చెయ్యివెయ్యనా? నడుంమీద చెయ్యివెయ్యనా? రేపు కాలునొచ్చుతుంది; నడుం నొచ్చుతుంది. నామాటవిని అవశ్యంగా వివాహంకండి.

పెద్ద—తమవంటి పెద్దలందరూ ఈలాగే సెలవిస్తూవున్నారు. నాకుమాత్రమే మనసు కొలుపకుండావున్నది. అయినాకానీ గృహస్థాశ్రమంలోవున్న గౌరవంమరివక విధాన్నరాదు. ఇంతకూనాకు తిరిగీ వివాహం కావలసినయోగంవుండి, మీవంటిపెద్దలు నలుగురూ చేరి పట్టుమనిముడివస్తే అవుచుందేమో యెవరు చూచినారు?

(ఇంతలో వట్టి సోమయాజులును, పేరిశాస్త్రియు, ప్రవేశించుచున్నారు.)

పెద్ద—సోమయాజులుగారూ! మీరు వుభయులూ యిలాగు తివాసీమీద దయచెయ్యండి.

సోమ—(కూర్చుండి బంధువులనంకజూచి) పెద్దతనంలో పెద్దయ్యగారికి పెద్దగ్రహచారం తటస్థమయింది.

పర—దైవసంకల్పానికిమనంయేమిచెయ్యగలము? ఇక పెద్దయ్యగారు ధైర్యంఅవలంబించివుండవలెను. ఆట్టేవిచారించినకార్యంలేదు.

సోమ—అవును. గతించినదానికి విచారిస్తేయేమిప్రయోజనం? పోయింది పోయినా యిఖముందుమాట చూచుకోవలెనుగదా? ఇఖ జరగవలసిన కార్యంమాట యేమాలోచించినారు? కావలసినవారు మీరు యింతమంది గ్రామంలోవుండి మళ్ళీ వివాహప్రయత్నం చెయ్యకుండా వూరుకుండడం న్యాయంకాదు.

పర—ఇంతవరకూ మేము యీసంగతే చెపుచూవున్నాము. మనగ్రామంలో మీమెరకను యెక్కడనైనా ఇంత అనుకూలమైన సంబంధంవున్నదా?

సోమ—సొమ్మువుంటే సంబంధాలు లేకపోవవా? విచారిస్తే కావలసినన్ని సంబంధాలు వస్తవి.

పెద్ద—(ఒకపరిచారకుని పిలిచి) రామయ్యా! బొమ్మగంటి బొజ్జయ్య సిద్ధాంతిగారు ఫదిఘడియలకేవస్తామని చెప్పి రెండుఝాము లైనా ఇంకా వచ్చినారుకారు. నీవువెళ్ళి పెద్దయ్యగారు తీసుకరమ్మన్నారని చెప్పి ఆయనను త్వరగా పిలుచుకునిరా.

రామ—చిత్తం. (అని వెళ్ళుచున్నాడు.)

పర—(చివాలునలేచి తనలో) రెండుఝాము లవడంతోటే జ్ఞాపకంవచ్చింది. కోమటికన్నయ్యగారి యింట్లో సదస్యం వేళ మించి

పోచుంది. వేగిరం వెళ్ళవలెను. (ప్రకాశముగా) పెద్దయ్యగారూ! మేము వచ్చి చాలాసేపయింది. ఈపాటి సెలవుదయచేయిస్తారా వెళ్ళివస్తాము.

పెద్ద-చిత్తము. పోయిరండి. నమస్కారము. (అని చేతులు జోడించుచున్నాడు.)

పర-నమోనమః శీఘ్రమేవ వివాహ సిద్ధిరస్తు!

నీల-శోభనపరంపరాభివృద్ధిరస్తు! శీఘ్రమేవసుపుత్రావాప్తి రస్తు! (అని ఇద్దఱును నడుచుచున్నారు.)

పెద్ద-(వారు దూరముగా పోయినతరువాత) సోమయాజులు గారూ! మీరు వెళ్ళినకార్యం అనుకూలంగా జరిగిందా?

సోమ-సిద్ధసంకల్పులు మీరుపంపిన తరువాత కార్యం అనుకూలంగా జరగకపోవడంకూడానా? సొమ్ము విషయంలోమాత్రం మనకూ వారికీ బేరంలో కొంచెం హెచ్చుతగ్గుగావున్నది. వారురొఖం పదిహేనువందలు తెమ్మంచూవున్నారు, నేను పన్నెండువందలు ఇప్పిస్తానని చెప్పినాను. సందేహంలేదు. మీవిషయంలో యెంతశ్రమైనా పడి పన్నెండువందలకే వప్పిస్తాను. తక్కిన సంగతులన్నీ అనుకూలంగానే జరిగినవి.

పెద్ద-సొమ్ముకేమి? ఇంకారెండువంద లియ్యమన్నా ఇవ్వవచ్చును. ఘట్టిగాపిల్లదాన్ని ఇస్తామన్నారుగద?

సోమ-ఆవిషయంలో మీరుయేమీ సందేహపడవలసిన పని లేదు. పిల్లదాన్ని మీకుయిప్పించడానికినాదిపూచీ. అవతల ఇఖలక్ష సమ్మంధాలువచ్చినా పిల్లదాన్నిమాత్రం వారుమీరుకాదని మరివకరికియివ్వరు. ఆప్రకారం కాపయ్యగారిచేత నేటిపుకయూన్న నేను చేతులోచెయ్యి వేయించుకున్నాను. మీరువక్క పనిమాత్రంచెయ్యవలెను. చిన్నదానితల్లిదండ్రులు మొదటినుంచీయింతపరువుగాబ్రతికిన

వారు. మీరు వారికి సొమ్ము యిచ్చినమాట యెక్కడా బయలుపడకుండా మహా రహస్యంగా వుంచవలెను సుమండీ.

పెద్ద—ఈసంగతులన్నీ మీరు నాకు నేర్పవలెనా? నేను మాత్రం చిన్నప్పటినుంచీ లౌక్యంలోతిరిగినవాణ్ని కానా? ఈసంగతి మీకూ నాకూతప్ప బ్రహ్మకు తెలియనియ్యను.

సోమ—వివాహమయిన తరువాతకూడా యీ సొమ్ముమాట మీ మామగారితోనైనా పొరబాటున ప్రస్తావించేరుసుకుండీ? ప్రస్తావిస్తే ఆయనమనసుకునొప్పి కలిగిపోతుంది.

పెద్ద—ఆయనమనసుకేకాదు నామనసుకూనొప్పికలుగుతుంది. ఆవన్నీ నేనెరుగనివా? సొమ్మిచ్చి పెళ్ళిచేసున్నానంటే నాప్రతిష్ఠకు మాత్రం లోపంరాదా? మొన్న చచ్చిపోయినదాన్ని పెళ్ళిచేసుకున్నప్పుడు అయిదువందల రూపాయలు యిచ్చినాను. ఇప్పుడు నేను చెప్పినదాకా ఆ సంగతి మీకేమైనా తెలిసిందా?

సోమ—ఎందుకు తెలుస్తుంది? వూరికే చెప్పవలసిన ధర్మంగనుక చెప్పినాను. లౌక్యంలో మీకంటె ఘట్టివారెవరు? కామయ్యగారితో మీజాతకం తీసుకునివస్తానని చెప్పివచ్చినాను. నిన్న మనమనుకున్న ప్రకారం సిద్ధంచేయించినారా?

పెద్ద—నీచస్థానంలోవున్న గ్రహాలన్నిటినీ వుచ్చస్థానంలో వేసి, ఇప్పటికి నాకు నలభయి యేళ్ళకంటె హెచ్చులేకుండా వుండేటట్టు పుట్టినసంవత్సరం మార్చి జాతకంవ్రాసి తీసుకురమ్మని బొజ్జయ్య సిద్ధాంతిగారితో చెప్పి, ముందుగా నిన్ననే ఫదిరూపాయలు చేతిలో పెట్టినాను. ఆయనగారిఆశీర్వచనప్రకారంవివాహకార్యంకలిసివచ్చిన మీదట బహుమానంకూడా చేస్తానని ఆశపెట్టినాను. ఆయనగారు యీవేళ పదిగడియలకే నేను చెప్పినప్రకారం జన్మపత్రికను పాత తాటాకులమీదవ్రాసితీసుకొనివస్తానని నమ్మకంచేసి వెళ్ళినారు. జాత

కంలో నాకు పూర్ణాయుర్దాయమున్ను సంతానయోగమున్ను కూడా వేస్తానని సెలవిచ్చినారు. అందునిమిత్తమే మన రామయ్యను పంపినాను; ఈపాటి ఆయనను తీసుకొని వస్తూవుంటాడు.

సోమ—అన్నీసరేకాని రేపోమాపో పెళ్ళికూతురివారు పెళ్ళికొడుకు చూపులకు వస్తారు. మీరిప్పుడు మిక్కిలి వృద్ధులుగా కనంబడుచూవున్నారు. నెరిసినట్టు కనంబడకుండా గడ్డమున్ను మీసమున్ను శుభ్రముగా పనిచేయించుకోనైనా చేయించుకొన్నారు కారుగదా?

పెద్ద—చేతులోవున్నపని దానికేమి? రేపుప్రొద్దున్నే మంగలవాణ్ని పిలిపించి పనిచేయించుకొంచాను. కాని శరీరంకనబడకుండా దేహంనిండా బట్ట కప్పుకొన్నా, మొగమూమీది ముడుతలు యే ప్రకారం కనంబడకుండా చెయ్యగలనో ఉపాయంతోచకుండావున్నది.

సోమ—అవును బట్టతలకూడా శాలువు చుట్టుకోవచ్చును. మీరన్నట్టు మొగంమీంది ముడతలను కనంబడకుండా చెయ్యడానికి సాధనంతోచదు. మీరు మాట్లాడేటప్పుడు పళ్లూడిపోయినట్టుకూడా తెలుస్తుంది. ఇది ముఖ్యముగా ఆలోచించవలసిందేకాని, యీపని కూడా మన సిద్ధాంతిగారివల్లనే కావలెను.

పెద్ద—చేతనైనపని యేళ్ళు తక్కువవేసి జాతకాన్ని దిద్ది వ్రాయగలరుగాని, భగవంతుడుచేసిన ముసలితనానికి ఆయన యేమి చెయ్యగలరు?

సోమ—మనగ్రామంలో బొజ్జయ్యగారుతప్ప వేరేసిద్ధాంతులు లేరు. వారు పెళ్ళికొడుకుచూపులకు ముహూర్తంఅడుగవచ్చినప్పుడు రేపురాత్రిమంచిదని సిద్ధాంతిగారిచేత చెప్పించినట్టయితే వారుఆప్రకారంగాచేస్తారు. మీరు ఆకాలంలో స్తంభానికి జేరగిలబడినట్టు దీపం కీనీడను కూర్చుండి మాట్లాడవచ్చును. పుస్తెముడిపడ్డదాకా నాలుగు

రోజులూ కొంచెంజాగ్రత్తగా వున్నపక్షమున, తరువాత మీరే లాగున కనఁబడ్డా యిబ్బందిలేదు.

పెద్ద—(ఆశ్చర్యముతో ముక్కుమీద వ్రేలువైచుకొని) ఆహాహా ఏమి సోమయాజులుగారి ప్రతిభ! ఎంతటిమేధావులైనా మీవలె నిముషంలో యింత మంచివుపాయం వూహించగలరా? ఇంతవఱకున్ను సోమయాజులుగారంటే, ఏమో అనుకొన్నాను. మీశక్తి యిప్పుడు తెలిసింది.

సోమ—మీదయవుంచూవుండఁగా, వుపాయాలకేమితక్కువ? ఆదరించేప్రభువులులేక తెలివితేటలు బయలబఁడకుండా యీలాగున మూలఁబడి వున్నాముకాని, ప్రభువులేవుంటే ఉపాయంచేత నిముషంలో కొండలన్నీ తలక్రిందులు చేయలేకపోయినామా?

పెద్ద—మీముఖంముందఅమిమ్మలినిస్తుతిచెయ్యవలసినది కాదుగాని, ఇంతటి బుద్ధిశాలులు మీరెంతటిపని చేస్తారన్నానమ్మవచ్చును.

సోమ—మీసెలవుప్రకారంపన్నెండువందలలోనే నేనుకుదుర్చుకొని వచ్చినాను. గనుక మీరు నాకు వాగ్దానం చేసినప్రకారం కంసాలివాణ్ని పిలిపించి నాయెదుటనే ముఱుగులజోడునిమిత్తంబంగారము యిప్పించండి. పెద్దయ్యగారు పెళ్ళిలో ముఱుగులజోడు బహుమానం చేసినారని లోకమున్నంత కాలమూ చెప్పుకొంటూవుంటాను. అందుచేత మీకు శాశ్వతమయిని కీర్తి లభిస్తుంది.

(ఇంతలో నారాయ్యయు, సిద్ధాంతియు ప్రవేశించుచున్నారు.)

పెద్ద—సిద్ధాంతిగారూ! దయచెయ్యండి. (అని కొంచెము లేచుచున్నాఁడు.)

బొజ్జ—పెద్దలు తమరు లేవవలెనా? కూరుచుండండి.

సోమ—(పెద్దయ్యగారివంకఁజూచి) మనగ్రామములోబొజ్జయ్యగారు గొప్ప సిద్ధాంతులు సుమండీ.

పెద్ద-దానికి సందేహమేమి? మనసిద్ధాంతిగారు గొప్ప బుద్ధిమంతులు. మనఅందఱి పూర్వపుణ్యంచేతనూ ఈగ్రామంలో కేవలం బృహస్పతే యీప్రకారంగా అవతరించినాడుగాని మఱివకటికాదు.

బొజ్జ-మీకందరికీ నాయందు దయగనుక, అలాగున సెలవిస్తూవున్నారు. నేనుబుద్ధిమంతుణ్ణికానన్నా, మీరిప్పుడు వప్పుకుంటారా? (అని పుస్తకములోని తాటాకుముక్కలను పయికిదీయుచున్నాడు.)

పెద్ద-(చేయిచాపి పుచ్చుకొనుచు) మనమనుకొన్న ప్రకారమే దీన్ని సిద్ధము చేసినారుగదా?

బొజ్జ-రాత్రి రెండుఝాములవఱకూ నిద్రకూడా మానుకొని, తెల్లవారినతరువాతకూడాఅదేపనిచేసి మీజాతకము యింతకుముందే ముగించినాను. నాప్రాతఅని తెలియకుండావుండడానికి యెడంచేతితో పట్టివ్రాసి, మాతండ్రిసుబ్బయ్యసిద్ధాంతిగారి వ్రాతపోలికకు కష్టపడిదింపినాను. పాతతాటాకువెంట నేదొరకకచిక్కులుపడుచూ, మాఅటక మీఁద బూజుపట్టివున్న పురాణపుస్తకాల కట్టమాట జ్ఞాపకంవచ్చి, చీకటిలోనిచ్చెనవేసుకొనితీసి, పుస్తకాలనన్నిటినీ వెదకి వకముక్కను సంపాదించి దానిమీఁదవ్రాసి, కొత్తగావ్రాసినట్లు తెలియకుండామీ రామయ్యవచ్చేటప్పటికి గదిలో తలుపులువేసుకొని పొగచూరఁబెట్టుచూవున్నాను. అందుచేతనే యిక్కడకు రావడానికి యింత ఆలస్యమయినది. మీవిషయంలో నేనింత శ్రమపుచ్చుకొన్నందుకు, ముందే లాగు సంతోష పెట్టుచారో ?

పెద్ద-ఆయుర్దాయం పూర్ణంగానే వేసినారుకదా?

బొజ్జ-దివ్యముగా వేసినాను. నిన్న మీతో మనవిచేసినదానికంటెనూ ఫదిసంవత్సరములు యెక్కువచేసినాను.

సోమ-పెద్దయ్యగారూ ! ఇందాఁకా మనమనుకొన్న సంగతిసిద్ధాంతిగారితో మనవిచేతునా?

బొజ్జ— అసంగతి యేమిటో సెలవుదయచేయండి.

సోమ— మతేమీ లేదు. పెళ్ళికొమార్తె వంకవారువచ్చి పెళ్ళికొడుకు చూపులకు ముహూర్తం పెట్టండని మిమ్మల్నడిగినప్పుడు, రేపు రాత్రి ఫదిగడియలకు మంచిదని తమరు సెలవియ్యవలెను.

బొజ్జ— రేపు గురువారంగనుక రాత్రి దుర్ముహూర్తమనిఅందరికీ తెలుసునే. తొమ్మిదిగడియలకుజర్జ్యంకూడా ప్రవేశిస్తుంది. నేనొక వేళ అప్పుడేముహూర్తంపెట్టినా జ్యోతిష్కు డెవఁడైనావచ్చి యీ ముహూర్తంయేసిద్ధాంతి పెట్టినాడని అడిగితే నేనేమి చెప్పగలను? మీరు చెప్పినప్రకారంచేస్తే, నావృత్తికికూడాభంగంరాదా? జాతకపు సంగతిలో చచ్చినమాతండ్రిగారి పేరుపెట్టివ్రాసినానుగనక, ఇప్పుడు నన్నెవ్వడూ యేమీ అనేవాఁడు లేఁడు.

సోమ— నూఱుకల్లలాడి, వకయిల్లు నిలువఁబెట్టమన్న శాస్త్రం మీరువినలేదా? వివాహవిషయంలో మీరెన్ని అబద్ధాలాడినా దోషం లేదు. వృద్ధబ్రాహ్మడికి కన్యాదానం చేయించినపుణ్యంమీకువస్తుంది. మీరీసహాయంమాత్రం చెయ్యకతప్పదు. (అని పెద్దయ్యవంక చూచి, రెండుప్రేళ్ళనుచూపి సైగచేయుచున్నాడు.)

పెద్ద— (లేచివెళ్ళి పెట్టెతీసి రెండురూపాయలను తీసుకొనివచ్చి చాటుగ సిద్ధాంతి చేతిలోపెట్టి) సిద్ధాంతిగారూ! మీరుసోమయాజులుగారి మాటతీసివెయ్యక ముఖ్యంగా చెల్లించవలెను. నామాటవినండి.

బొజ్జ— (కొంచమునుమానించి) మీరింతమంది యిన్నివిధాల చెపుతూవుండఁగా మూర్ఖప్పట్టు పట్టడంధర్మంకాదు. ఈమార్గశిరశుద్ధ చవితీ గురువారం రాత్రిమాత్రం మంచిదని చెప్పి ముహూర్తంపెడుచాను. సిద్ధాంతులువచ్చినా కాచుకోవడానికి మీరొక్క సహాయం మాత్రం చేయవలెను. సోమయాజులుగారూ! మీరిప్పుడేహరిశాస్త్రిల

వారివద్దకు వెళ్ళి మనముహూర్తానికి అనుకూలముగా వక కారికను వ్రాయించుకొనిరండి.

సోమ—అదెంతపని? ఇప్పుడేపోయి మీరుకోరినప్రకారం చేయించి, యీసాయంకాలము కారికను మీయింటివద్దకు తెచ్చి యిస్తాను. భోజనానికి ప్రొద్దుపోయింది. మీరీపాటి యింటికినడవండి.

బొజ్జ—మరిచిపోకుండా తీసుకుని రావలెనుసుమండీ. (అని వెళ్లుచున్నాడు.)

పెద్ద—మూడుజాములైనది సోమయాజులుగారూ! నేనుకూడా భోజనానికి లేతునా?

సోమ—చిత్తం. వకరూపాయి దయచేస్తారా? శాస్త్రుల్లవారికిచ్చి శ్లోకంవ్రాయించుకొని వస్తాను.

పెద్ద—మంచిది. (అని లోపలికివెళ్ళి రూపాయతీసికొనివచ్చి యిచ్చుచున్నాడు.)

[అందఱు నిష్క్రమించుచున్నారు.]

తృతీయాంకము

---

౧. ప్రదేశము—పెండ్లికొమార్తెయిల్లు.

[ధనాల కామయ్య, వట్టి సోమయాజులు ప్రవేశించుచున్నారు.]

కామయ్య—సోమయాజులుగారూ! ఇప్పటికే చాలారాత్రి అయింది. ఇంకా సుముహూర్తం వ్యవధానంగా వున్నట్టున్నది. నేనొక నిద్రపోయి లేవచ్చునా?

సోమ—ఇంటియజమానులు మీరే వోపిక చెయ్యని పక్షాన్న, తక్కినవారెవరైనా మేలుకుంచారా? ఇంతవఱకూ మేలుకొన్నవారు మేలుకోనే మేలుకొన్నారు. ఇంక నాలుగ్గడియలుమాత్రం వోపిక

చెయ్యండి. రాత్రియిరవై యేడు గడియలకుముహూర్తంగదా? ఇప్పుడు యిరవై గడియలుపైగాఅయినది. ఈలోపుగా నేపెళ్ళికొడుకువారుతర్లి వస్తారు. మనం వారికేమైన కావలసినవి జాగర్త పెట్టవలెను. ఇంక నాలుగునిమిషములు నిద్ర ఆపుకోండి.

కామ-మీరందరూవుండంగా నేనుచెయ్యవలసిందియేమున్నది? అన్నీ చక్కపెట్టుకుపోవడానికిమీరేవున్నారు. పెళ్ళిపనులచేత నాలుగు దినాలనుంచీ రాత్రిళ్లుబొత్తిగానిద్రలేదు. బొజ్జయ్యసిద్ధాంతిగారు రాత్రో చించి ఈబహుళ నవమినాడు మేషలగ్నముమంచిదని మొన్నచవితి నాడు ముహూర్తంపెట్టేరారు. కార్తీకమాస మవడంచేత యీనడి శీతాకాలంలో చలిమింగివేస్తూవున్నది. వారువచ్చేలోగావక్కసారి యిట్టెమంచంమీద వొరిగిలేతునా?

సోమ-(చెవియొగ్గివిని) అదుగోదూరాన్నుంచివాద్యాలచప్పుడు వినబడుచూవున్నది. పెళ్ళికొమారుడు వస్తున్నాడు.

కామ-ఓసీ! ఓసీ! పెళ్ళివారు వస్తూవున్నారు. లేవవే, లేవవే. (అని మంచమువద్దకుపోయి అజ్ఞానమ్మను లేపుచున్నాడు.)

అజ్ఞా-(కన్నులు నలుపుకొనుచు లేచివచ్చి) పెళ్ళికొమారుడు వచ్చుచున్నాడు. హారతిపట్టుకొని వెళ్ళడానికి పళ్లెమెక్కడవున్నదో కనబడదు.

(ఇంతలో పెండ్లికొమారుడును, పేరిశాస్త్రులుమొదలగువారును ప్రవేశించుచున్నారు.)

కామ-నియ్యాలవారందరూ వచ్చినారు. పేరిశాస్త్రులు గారూ! వారి నందఱినీ చాపలువేసి కూర్చుండబెట్టండి.

బంధువులు-చాపలకేమి? సుముహూర్తం సమీపిస్తూవున్నది. పెద్దయ్యగారిని తీసుకొనిపోయి మంగళస్నానాలు చేయించండి.

కామ—పేరిశాస్త్రిగారూ! పెళ్ళికొమారుణ్ని లోపలకు తీసుకొనివెళ్ళి వుదకము ఇప్పించండి.

పేరిశా—పెద్దయ్యగారూ! ఇలాగున దయచెయ్యండి. పెద్దలయినారు జాగర్తగానాచెయ్యి పట్టుకొని మఱీరండి (అని మెల్లగానడిపించుకొని దొడ్డిలోనికి గొనిపోవుచున్నాఁడు.)

అజ్ఞా—ఓసీ! కన్నమ్మా! పెళ్ళికుమారుఁడు అప్పుడే స్నానానికి వస్తున్నాఁడు కాఁబోలును. వేణ్నీళ్ళు పెట్టినావా?

కన్నమ్మ—అప్పుడే కాదానిద్రపోచూవున్నదాన్ని లేపిచెప్పినావు. నిప్పుపట్టుకువచ్చి పొయిలో వేస్తాను. ఎంతసేపు? తాటాకులమంట పెడితే నిముషంలో నీళ్ళు కాగుచవి.

పేరి—అమ్మా! అజ్ఞానమ్మగారూ! పెళ్ళికొమారుఁడుస్నానానికి వచ్చినాఁడు. నీళ్ళుసిద్ధము చేయించినారా?

అజ్ఞా—నాయనా! నేనెన్ని పనులకని చావను. అన్నింటికీ నేనొక్కదాన్ని కొట్టుకోవలెను. అవతలవి ఘ్నేశ్వరపూజకుబియ్యమే తేనా? ఇవతల అల్లుడికి నీళ్ళే యియ్యనా? కాలికి సహాయము వచ్చేవారు లేరుగదా? చేతికి సహాయమువచ్చేవారు లేరుగదా?నీళ్ళుపెట్టుమని జాముకిందనే కన్నమ్మతోచెప్పినాను.ఆవిడకు ఇంకాపొయిలో నిప్పువెయ్యడానికే తీఱుబడికాలేదు.

కన్న—నీకేం మాటలుచెపుచావు. పనిచేసేదానికి కష్టంనాకు తెలుస్తుంది. నూతిలోనుంచి బిందెడునీళ్ళు పైకివచ్చేటప్పటికి గుండ్లు మీదికి వస్తవి. నాకుమాత్రం పనిచెయ్యడానికి వెయిచేతులున్నవా? వెయి కాళ్లున్నవా?

పెద్ద—దానికేమిలెండి. శాస్త్రప్రకారం మంగళస్నానాలు వేడినీళ్ళతో చేయనేరాదు. పేరిశాస్త్రిగారూ!నూతిదగ్గఱకువెళుదాంరండి. కన్నమ్మనీళ్లుతోడిపోస్తుంది. (అని నడచుచున్నాఁడు.)

కన్న—పెద్దయ్యగారూ! ఈయెత్తుపీటమీఁద కూర్చుండండి.
(అని నాలుగు చేదలు నీళ్లుతోడి మీఁదపోయుచున్నది)

పెద్ద—అహహహహా! ఇహిహిహిహీ! ఉహుహుహుహూహూ!
(అని వడఁకుచు వెనుక కొఱుగుచున్నాఁడు)

పేరిశా—(తటాలునఁ బడకుండఁ బట్టుకొని) కన్నమ్మా! కన్నమ్మా! ఇఁక నీళ్ళు పొయ్యకు.

కన్న—ఏమినాయనా? ఏమినాయనా? (అని పెళ్ళికొమారుని తడివిచూచి పెదవివిఱిచి పెద్దగొంతుకతో) ఓఅజ్ఞానమ్మా! ఓకామయ్యగారూ! పెండ్లికుమారుఁడు మాటలేకుండా పడిపోయినాఁడు. వేగిరము రండి. (అని కేక వేయుచున్నది.)

(ఆ కేకవిని అందఱును లోపలినుండి గొల్లున పరుగెత్తుకొని వచ్చుచున్నారు.)

సోమ—మీరెవ్వరూ తొందరపడకండి. పెద్దయ్యగారికి వచ్చిన భయములేదు. శాస్త్రిగారూ! వేగిరం చెవులు ముయ్యండి.

కన్న—ఇంకాయెక్కడిపెద్దయ్యగారునాయనా? శీతాకాలంలో రాత్రిరెండుఝాముల వేళ చన్నీళ్లు మీఁదపడఁగానే మీఁదిప్రాణాలు మీఁదలేచిపోయినవి (అని చేతులు చఱచుచు వెక్కివెక్కి యేడ్చుచున్నది.)

పేరిశా—కన్నమ్మా! బంధువులందరూ వూరుకుండఁగా, మధ్యపనికివచ్చినదానవు నీవు రాగాలుపెడుచావేమి? శుభకార్యం ముందు పెట్టుకొని, ఇటువంటిఅవాచికాలు పలుకరాదు. ఊరుకో.

సోమ—పెద్దప్రాణముగనుక వడగళ్ళవలెనీళ్ళుమీఁదపడఁగానే దేహము కొయ్య అయిపోయినదిగాని, మరేమీలేదు. ఇంకకొంచము సేపటికి తెలివి వస్తుంది. లోపలికి తీసికొని పోదాముర్రండి. (అని పేరి

శాస్త్రియు తానును తోడుపట్టి పంచపాళిలోనికిఁ గొనిపోయి చాప మీఁద పరుండఁబెట్టుచున్నారు)

పేరిశా—కామయ్యగారూ! ఆదడివి పాతతాటాకులు నాలు గందుకోండి. మంటవేతాము. ఓరీ! చాకలవెంకా! కాగడాకు వక ఆకు ముట్టించి యీలా గిచ్చిపోరా. (అని మంట వేయుచున్నాఁడు)

పెద్ద—(మంటకాకచేత కొంచెముసేపటికి తెలివివచ్చి కన్నులు విప్పిచూచి) సోమరాజుగారూ! నావంటి పడుచువాళ్ళకే చలియిలా గున ముంచుకునిపోచూ వున్నది. ఇఖముగలివాళ్ళెలావుంచారోగదా? పేరిశాస్త్రిగారూ! ముహూర్తసమయముమించిపోచుంది. వేగిరంవివాహవేదిక దగ్గఱకు వెళుదాముర్రండి (అని లేవఁబోయి లేవలేకున్నాడు)

సోమ—మీరు కొంచెం వోపిక చెయ్యండి. మెము తీసుకొని పోచాము. (అని మెల్లగా లేవఁదీసితానును పేరిశాస్త్రియు చెఱియొక చేయియుఁ బట్టుకొనిపోయి పీటమీఁదఁ గూరుచుండఁబెట్టుచున్నారు.)

పేరిశా-కామయ్యగారూ! పెద్దయ్యగారుచిన్నప్పటినుంచీమహా సుకుమారులుసుమండీ. చూచినారా? చన్నీళ్ళకు తాళలేకపోయినారు

(నాటితంతంతయు శాస్త్రోక్తముగా జరగినమీఁదట పెండ్లి కొమారుఁడు విడిదికి బోవుచున్నాఁడు.)

---

౨ ప్రదేశము—పెండ్లికూమారుని యిల్లు.

[నీలకంఠ సోమయాజులుగారు మొదలగుసభికులుకూరుచున్నతరువాత బట్టతల-అలవేణియు, సొట్టకాలి-హంసయానయు, చిలికి కన్నుల-చకోరాక్షియు, నత్తినోటి-మంజువాణియు, ప్రవేశించుచున్నారు.]

మంజువాణి-సస్సస్సభవారికి దద్దద్దణ్ణాలండి. నన్నన్ననాదరామ క్రియ మీఁది వవ్వవ్వర్ణం పప్పప్పడుదునా అండి? (అని శంఖధ్వనితో

అఅఅఅయ్యయ్యో యెగటాయనే. పప్పయ్యదమీదా సేరి పప్పవ్వళించి యుండేసామికి. అయ్యయ్యో యెగటాయనే, (సభికులవంక జూచి) అసలే నన్నన్నాది కికిక్కీచుగొంతుకండి దద్దద్దానిమీద నన్నన్నా సెల్లెలూ నెన్నేనూమమ్మమ్మాటామాటాఅఅనుకుంటేబొబ్బొంగుపోయిందండి.

[ఇంతలోకొందఱు తాబూలమునకు వచ్చిన పెద్దమనుష్యులు ప్రవేశించుచున్నారు.]

నీల—భోగరాజుగారూ! దయచెయ్యండి. భీమరాజుగారూ! కూర్చుండండి. సుబ్బారావుగారూ! మీరు పయికిదయచెయ్యవలెను.

మంజు— (అందఱికిదండముపెట్టి) అఅఅయ్యయ్యో—మద్దెల తిత్తిత్తిన్నగావాయించు- ఆఅఅయ్యయ్యో—త్రిత్రిపుటతాళము—అఅ అయ్యయ్యో—లల్లయ పడడంలేదు.

భోగ—భీమరాజుగారూ! దీనికంఠముచూచినారా? కొంచెము నత్తి అన్నమాట వక్కటేకాని, కిన్నెరస్వరముసుమండీ.

భీమ—కొంచెం బొంగుగాకూడావున్నది.

భోగ—బొంగయితేనేమి? ఎంతమార్దవంగా వున్నదో కనిపెట్టి నారు కారుగదా?

భీమ—ఆపాడేపాటలోకొన్నిఅపస్వరాలుకూడావున్నవిసుమండీ.

భోగ—ఆఅపస్వరాలుకవిత్వముచెప్పినవారివిగాని, దానివికావు.

భీమ—పతాకహస్తము పట్టినప్పుడు వేళ్లుతిన్నగా వంచలేదేమి?

భోగ—అంతకంటె వేళ్లువంగితే సొగసేలేదు. ఆలాగే వుండ వలెను.

భీమ—నాట్యముచేసేటప్పుడుభృంగివలెకాళ్లెత్తెత్తివేస్తుందేమి?

భోగ—భరతశాస్త్రమందు మీకుబాగాపరిచయంలేదుగనుక ఆలాగంటున్నారుగాని దానిపాదాభినయ మెంత అందమయినది?

భీమ—ఎంత దివ్యమయిన నాట్యమూ గాకుంటే మూడు వందల రూపాయలు పెట్టి కన్నెటికము చేసి, మీరు వూరికే నెలకు ముప్ఫయి రూపాయలిచ్చి దాన్ని వుంచుకుంటారా?

భోగ—అహహహహహ! (అని నవ్వి) ముప్ఫయిరూపాయలు లెఖ్ఖయేమిటి? నాసొమ్మంతా దానిదే. ఒక్కనాటిదాని "పాతివ్రత్యమహిమ" కు యేమి యిచ్చినా యివ్వవచ్చును.

భీమ—పరమేశ్వరావధానులుగారు రాత్రి మీయింటికివచ్చి తాంబూలానికి పిలువలేనట్టన్నదే.

భోగ—మాయిల్లు చాలాదూరమయినందున, చీకట్లో రాలేక పోయినారు. పెద్దయ్యగారి స్వజనములో వారము మమ్మల్ని వేరే పిలువవలెనా? నాకటువంటి అభ్యంతరంలేదు. పిలువకపోయినా నేను అనేకచోట్లకు వెళుతూనేవున్నాను. నామాటయందు నమ్మకము లేకపోతే, ఈమంజువాణిని అడిగిచూడండి.

భీమ—అక్కఅ లేదు. మీరుమాత్రము నాతో అబద్ధమాడుతారా? వెనుకమంజువాణి మేళముకట్టినప్పుడు మీయింటికిన్ని పిలువకుండానే వచ్చినారు అనునవును. అందఱున్ను రూపాయరూపాయవసూలు వేస్తే. మీరు నాలుగురూపాయలు వేసినారు. నాకు బాగా జ్ఞాపకమున్నది.

సుబ్బా—ఓసీ! మంజువాణీ! నీవు కొంచెంసేపు అవతలవుండి, ఒక్కమాటు చకోరాక్షిని గజ్జెకట్టుమను.

భోగ—మీరు వుంచుకొన్నది కావడంచేతనా. దాన్ని ఆడుమంటూ వున్నారు.

సుబ్బా—తొందరపడక గజ్జెకట్టనియ్యండి. మీదానిపాటకు సొగసూ మాదానిపాటసొగసూ చిత్తగింతురుగాని.

[నత్తినోటి మంజువాణి వెనుకకుపోయి, చికిలికన్నుల చకోరాక్షి గజ్జెకట్టుకొని ముందుకువచ్చి నిలుచున్నది.]

చకో—(చేతులుజోడించి) సభవారికి దణ్ణాలండి.

సుబ్బా—ఏదీ కాంభోజిరాగముమీంద "నోరెత్తనైతినమ్మా" అన్నపదముపాడు.

చకో—నోరెత్తనైతినమ్మా-ఓచెలియ నే-నోరెత్తనైతినమ్మా. పీరువారందఱు వింటే సిగ్గయ్యానని-నోరెత్తనైతినమ్మా.

సుబ్బా—భీమరాజుగారూ! కోడువవన్నీ అట్లావుండఁగా, దీని నేత్రాభినయంవక్కటే లక్ష చేస్తుందిసుమండీ

భీమ—నేత్రాభినయానికేమిగాని, పాదాభినయములో సొట్ట కాలి హంసయానఅయినా దీనికి చాలసుసుమండీ.

(ఇంతలో మఱికొందఱు పెద్దమనుష్యులు తాంబూలమునకువచ్చి ప్రవేశించుచున్నారు.)

నీల—సోమయాజులుగారూ! దయచెయ్యండి; రామస్వామి గారూ! రండి; వెంకప్పగారూ! కూర్చుండండి.

చకో—(అందఱికి దండముపెట్టి)

కలికిరోమోవిపై *కాటుకనిగ్గులతోను
చెలువుడింటికివచ్చెనె*అందుకు లోలో
పలనె నొచ్చుకొనె*పలికినందుకు విభు
డులికి రంతులుచేసెనె*ఆసుద్దులు
చెలులడిగితేనున*వ్వులకనివారితో
మలయజగంధిరో*మఱుగుచేసితినింతె.

నోరెత్తనైతినమ్మా. ఓచెలి-

సోమ—రామస్వామిగారూ! పెద్దయ్యగారి ముఖ్యస్నేహితులు గంగరాజుగారు యెందుకువచ్చినారు కారో మీరెఱుఁగుదురా?

రామ—ఆయన ఫదిదినాలకులోపల తహశీల్దారుగారు మొదలయినవారియిళ్ళల్లో సుమారు పదిపన్నెండు రూపాయలు వసూళ్ళు

చదివించినారు. ఆయనకువచ్చేది నెలకు ఫదిరూపాయలు జీతము గదా? ఆపదిరూపాయలూ యీప్రకారంగా పోయినవి. చేతిలో సొమ్ములేక యిక్కడికి రావడం మానుకొన్నారు.

సోమ—ముఖ్యస్నేహితుడికన్న తహశీల్దారుగా రెక్కువా? స్నేహితునిమనస్సు సంతోషపెట్టడానికి యేఅప్పోసొప్పోచేసి వక్క రూపాయి తీసికొనిరాలేకపోయినారా?

రా—మొన్న శిరస్తాదారుగారి యింటివద్ద యివ్వడానికిచేసిన అప్పుకే ఋణప్రదాత నిత్యమూ తొందర పెడుతూవుండగా, నేటి ఉదయాన్న దాహంతాగేకంచుచెంబు తాకట్టుపెట్టిబదులుతీర్చినారు. ఇప్పుడు మళ్ళీయెక్కడ ఋణము తేగలరు?

సోమ—అటువంటి స్థితిలో శిరస్తాదారుగారి యింటికీ, తహశీల్దారుగారి యింటికీ, యెందుకు వెళ్ళవలెను?

రామ—అక్కడికిమాత్రం వారిమీది భక్తిచేత వెళ్ళారను కున్నారా? వారిని పట్టివున్న అధికారపిశాచానికి వెఱచి వెళ్ళినారు. మొన్నకోయటి సుబ్బిసెట్టి తహశీల్దారుగారియింట్లో వసూలు వెయ్యకపోవడంచేత, ఆమర్నాడు గుమ్మంలో పెంటవున్నదని వంక పెట్టి నాల్గురూపాయలు జరుమానావేశారు చూచారుకారా?

సోమ—మన హనుమాన్లుగారుకూడా వచ్చారుకారేమి? పొద్దున్నే కనబడి నాతోవస్తానని చెప్పినారే.

రామ—ఆయన వుదయాన్నుంచీ రూపాయికోసమే తిరుగుతూ వున్నారు. ఎక్కడా అప్పుపుట్టలేదట! రూపాయిలేకుండావస్తే నలు గురూ వసూళ్ళు వేస్తూవుంటే తానుమాత్రం వెయ్యకపోతే పరువు తక్కువగా వుంటుందని యెంచి రాలేదు. పట్టితాంబూలం చేతులో పెట్టి వెళ్ళితే, తెల్లవారింది మొదలుకొని రూపాయి చేతిలోపడే దాకా నిత్యమూవచ్చి బోగంది పీడిస్తూవుంటుంది.

సోమ—ఈ హేతువుచేతనే పెద్దయ్యగారి మిత్రులు చాలా మంది రాలేనట్టున్నారు.

(చెవిటి చయనులుగారు చేయిపట్టుకొని తీసికొనిరాగా గుడ్డి గున్నయ్యగారు ప్రవేశించుచున్నారు.)

నీల—చయనులుగారూ! రండి. గున్నయ్యగారూ! దయ చెయ్యండి.

గున్న—పరమేశ్వరావధానులుగారా పలకరిస్తూవున్నారు?

చయ—నీలకంఠ సోమయాజులుగారూ! యింత పొద్దుపోయి వచ్చారేమని అడుగుచూవున్నారా?

గున్న—చయనులుగారూ! పాటకేంగాని ఈబోగంది ఆట దివ్యంగా ఆడుచూవుంది. నిజం చెపుచూవున్నాను. నేనంధుణ్ణని నమ్మకపోయేరుసుమండీ.

చయ—చెవిటివాణ్ణయితే అయినానుగాని దీని ఆటను నేను మెచ్చకోను. ఇంతకంటే చక్కగా ఆడేవాళ్లను లక్షమందిని చూచాను. యేం మెచ్చుకొన్నా దీనిపాటను మెచ్చుకోవచ్చును.

వెంకప్ప—అదుగో భోగరాజుగారు వచ్చి ఆమూలకూర్చున్నారు.

రామ—మంజువాణి వచ్చినతరువాత వారు రాకుండావుంటాగా? మొన్నటి వుదయాన్ని కళ్ళులేని బీదముసలివాడు నకడు రెండు దినాలనుంచి అన్నంలేకవచ్చి యాచించినప్పుడు, చిల్లిగవ్వయినా లేదన్నారు. నేనుకూడా బహువిధాల చెప్పిచూచానుగాని కార్యం లేకపోయింది. ఆరాత్రి శిరస్తాదారుగారి లోపల నాలుగు రూపాయిలు వసూలువేశారు సుమండీ.

వెంక—అదుగో సుబ్బారావుగారుకూడా వచ్చినారు.

[పరమేశ్వరావధానులుగారుగంధమును, నీలకంఠసోమయాజులుగారు తాంబూలములను ఇచ్చినతరువాత, సోమరాజుగారు, భీమరాజుగారు, రామస్వామిగారు, వెంకప్పగారు, లేచి ఒక్కొకరు రూపాయచొప్పున తాంబూలములోపెట్టి భోగమువానికిచ్చి వెళ్ళిరి.]

భోగ—నీలకంఠ సోమయాజులుగారూ ! వక్కసారిమంజువాణి చేత సభలో కారువాపట్టింతామా?

నీల—ఇప్పటికే రాత్రి రెండుగంటలయినది. ఈపాటి సభచాలింతాము.

(భోగరాజుగారును, సుబ్బారావుగారును, నాలుగేసి రూపాయాలు తాంబూలములోఁబెట్టి తమ ప్రియురాండ్ర చేతిలోఁ బెట్టుచున్నారు.)

పర-మంజువాణీ! యీపాటి మేళంచాలించిమీరింటికిపోవచ్చును

(భోగరాజుగారును, సుబ్బారావుగారును తోడరాఁగా వేశ్యలు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థాంకము

ప్రదేశము—పెండ్లికూఁతువారి గృహములోని చావడి.

(దంపతులు పీటలమీఁదగూర్చుండియుండఁగా, భాగవతుల పాపయ్యసోమయాజులు, సాగి సర్వావధానులు మొదలగువారు ప్రవేశించుచున్నారు.)

పాప—ఇప్పుడు మధ్యాహ్నం మూడుఝాములైంది. మనం నాల్గుగడియలనుంచి సభాపతి వేదులవెంకయ్యగారికోసంకనిపెట్టుకునివున్నాము. అదుగో ఆయనకూడా వస్తూవున్నారు. ఇఁక సంకల్పానకు సభవారి అనుజ్ఞా?

సభవారు—అయంముహూర్త స్సుముహూర్తోఅస్తు.

(వేదుల వెంకయ్య ప్రవేశించుచున్నాఁడు.)

పాప-సభాపతిగారూ! దయచెయ్యండి. మీనిమిత్తం ఝాంనుంచి సభవారందరూనిరీక్షిస్తూవున్నారు. ఇంత ఆలస్యంచేసినారేమి?

వెంక-కోమటి కన్నయ్యసెట్టిగారిలోపలసదస్యంకాగా నే నేనూ మీ వెంట నేబయలుదేరినాను. సంభావన తిన్నగాయివ్వలేదని పేరూరు నుంచి వచ్చినబ్రాహ్మలు తోరణాలు తెంపివేసికన్నయ్యసెట్టినిమీద పశికొట్టడానికి సిద్ధమయినారు. నేను వాళ్ళను బతిమాలుకొనినాలుగు రూపాయీలు కన్నయ్యసెట్టిచేత ఇప్పించి కలహం నివారించివచ్చే టప్పటికి యింత సేపయింది. అందులో నాకూడా రెండురూపాయల సొమ్ము లాభించింది.

సర్వా-గాడిదకొడుకు కన్నయ్యసెట్టి సంభావన మిక్కిలితక్కువగా యిచ్చినాడుసుమండీ. పెద్దకొడుకు పెళ్ళిచేస్తూ తనబ్రతుకుపెట్టుకొని తలకొకడబ్బా సంభావనయిస్తాడు?

వెంక—పెద్దయ్యగారిలోపల పెళ్ళవుచుందనివిని యిరవై ఆమడ నుంచి బ్రాహ్మలువచ్చారు. కాని కానిచొప్పనయిచ్చినా, ప్రత్యేకంగా సంభావనకిందమూడువందలయాభై రూపాయీలు అయినవి. సంభావన పుచ్చుకున్నవాళ్ళే కొందఱు మళ్ళీమళ్ళీపచ్చి రెండుమూడు పర్యాయములు పుచ్చుకొన్నారు.

పెద్దయ్యగారు—సభాతాంబూలం వైదీకులలో యెవరికి యిప్పించినారు?

వెంక—అమలాపురాన్నుంచివచ్చిన చతుశ్శాస్త్రిపండితుఁడైన హరిశాస్త్రుల్లగారికి యిప్పించవలెనని చాలామంది ప్రయత్నంచేశారు. కాని వారిమాట పడనివ్వక గ్రామంలోవుండేవారికే కానియివ్వగూడదని పట్టుపట్టి తుదకుమనఅప్పన్నబావగారికేయిప్పించినాను. నామేనల్లుడు శంకరశాస్త్రికి యిప్పించా లనుకున్నానుగాని, వాడు ముండయింటికిపోయి వెళకురానందున వల్లపడ్డదికాదు.

సాప—సభాపతిగారూ! సభాతాంబూలానికి సమయమయింది.

వెంక— త్రిమతస్థులకూ తాంబూలాలుపెట్టి పళ్ళెం అక్కడ వుంచండి.

ముడంబి నరసింహాచార్యులు—విశిష్టాద్వైత మతస్థులలోసభా తాంబూలం నాకు రావలెను.

సర్వా— విద్వాంసుఁడు మాడభూషి మాధవాచార్లుగారు వుండగా నీకెలావస్తుంది?

వెంక— ఆయనమాట చూచుకొందాంగాని, అద్వైతతాంబూలం ముందుగా మా శంకరశాస్త్రికిప్పించండి—ఓరీ! శంకరశాస్త్రీ!నీవు లేచివచ్చి సభాతాంబూలం పుచ్చుకో.

బ్రాహ్మణులు— అయ్యయ్యో! చదువుకొన్న పెద్దవాళ్ళంద రమూవుండగా వక్క ఆశీర్వచనపనస్సైనారాని యితనికేంతాంబూలం? ఆలోచించి మరీయివ్వండి.

వెంక—మాగ్రామంలో మర్యాదయింతే. మావాడుయీవక్క చోటనే పుచ్చుకొన్నాడాయేమిటి? వాడుండగా సభా తాంబూలం మరియెవరికీరాదు. తండ్రిపోయినముప్పయి సంవత్సరాలనుంచీ గ్రామం లోజరిగేప్రతివివాహంలోనూసభాతాంబూలంవాడికేముడుతూవున్నది ఈఆచారం తప్పించడానికి యెవరిచేత అవుతుంది? ఓరీ! శంకరశాస్త్రీ! ఎవరడ్డంవస్తారోచూతాం లేచివచ్చి తాంబూలంపుచ్చుకో.

సర్వా-రెండో తాంబూలంమాధవాచార్లుగారికిదయచెయ్యండి

వెంక-వల్లపడదు. మొన్నగొల్లమల్లిగాడింట్లో వివాహం జరిగి నప్పుడు సభాతాంబూలం నరసింహాచార్లకే ముట్టింది. అప్పుడు మాధ వాచార్లు దగ్గిరవుండి యేంచేశాడు? అప్పుడురాంది యిప్పుడుమాత్రం యెలావస్తుంది? నాలుగుముక్కలుచదువుకోఁగానే సరిఅనుకున్నారా? నంబి నరసింహాచార్లు పులిహారదద్దోజనమూ పెట్టినందుకే అగ్రతాం బూలంయివ్వచ్చును. నరసింహాచార్యులూ! వచ్చిపుచ్చుకో.

పాప—సభలో ద్వైతమతస్థులెవరైనా వున్నారా?

వెంక—గోవిందరావుపంతులుగారి వంటాచార్లుఆమూలకూర్చున్నాడు. మరి తాంబూలం ఆయన్ని పుచ్చుకోమనండి. ఆయనతప్ప మార్థులలో మరియెవరున్నారా లేదు.

పాప—సభాతాంబూలాలు యివ్వడం అయినదిగనుక సభవారీపాటిమహదాశీర్వచనం కానియ్యవచ్చు.

(అప్పుడు బ్రాహ్మణోత్తములు మహదాశీర్వచనముచేసి దంపతులమీద అక్షతలను జల్లుచున్నారు.

పెద్ద—బ్రాహ్మణులను గొడ్డిపెట్టినారా?

బ్రాహ్మణులు—పెద్దయ్యగారూ! మీప్రసిద్ధివినియిరవైఅమడనుంచి వచ్చినాము. ఇప్పుడువిరివిగా సంభావన యిచ్చారంటే, మీయశస్సు లోకంలో ఆచంద్రార్కంగా వుంచుంది. ఇక మీరుచేసే కార్యాల్లో యింతకంటేగొప్పవి లేవు.

పెద్ద—మీరందరూ దొడ్లోకిపొండి. సంభావనలో లోపంజరగనియ్యను.

పాపయ్య—సంభావనకిమిత్తం సొమ్ము తీసుకురావడానికిలోపలికి వెళ్ళినారు. వారువచ్చేదాకామనంయిక్కడనుంచికదలవద్దు. శాస్త్రీ! ఈనడుమ నీవేమో కామయ్యగారిదగ్గిర, ముసలివాడికి కన్యనుయిచ్చి చిన్నదానిబరువుకంటె రెండురెట్లుగా ధనం పుచ్చుకోవచ్చుననిన్నీ, ముసలిబ్రాహ్మడికికన్యనిచ్చిధనం పుచ్చుకొన్నవారికికోటికన్యాప్రదానాలఫలం కలుగుతుందనిన్నీ, రెండుస్మృతివచనాలు చదివినావట! వక ముసలిబ్రాహ్మడికి కన్యనుమాట్లాడవలసిఉన్నది. ఆశ్లోకాలుయేస్మృతిలోవో చెప్పి, నాకువ్రాసియిస్తావా?

శాస్త్రి—కామయ్యగారిని వొప్పించడానికి మూడుదినాలు కష్టపడి నేనే ఆశ్లోకాలనుకల్పించినాను. మొన్నవాటినితీసుకుపోయి హరి

శాస్త్రుల్ల వారికిచూపించేటప్పటికి, వాటిలో ఆరోఅక్షరం లఘువువుండ వలసిందానికి గురువుపడ్డందున రెండుశ్లోకాలకూ ఛందోభంగం కలిగిం దని సెలవిచ్చారు.

[బాహ్మణుల సందటిని దొడ్డిలోకిబొండని కేకలువేయుచు, చేతిలో రూపాయలసంచిని పట్టుకొని నీలకంఠ సోమయాజులుగారును, పరమేశ్వరావధానులుగారును ప్రవేశించుచున్నారు.]

పెద్ద—మనం సంభావన యెంతయిస్తే బాగావుంటుంది?

నీల—అంతదూరాన్నుంచిబ్రాహ్మలు వచ్చినప్పుడుపెద్దవాళ్ళకు రూపాయచొప్పునా చిన్నవాళ్ళకు అర్ధరూపాయచొప్పునా అయినా యివ్వకపోతేబాగావుండదు.

పర—వేడుకసమయంలో మనం సొమ్ముకు వెనకాముందూ చూడకూడదు. వకరికి వకలాగునామరివకరికి మరివకలాగునా యివ్వ డంకంటె చిన్నాపెద్దా అనేభేదం విచారించకుండా అందరికీయేకంగా రూపాయచొప్పునే యిస్తే బాగావుంచుందని నేను తలుస్తాను.

పెద్ద—మీయిద్దరూ ఆలోచించి మీయిష్టంవచ్చినట్టు పంచి పెట్టండి. ఇప్పుడు రెండువేలరూపాయలున్నవి. దొడ్డిపద్దకు నడవండి.

బ్రాహ్మ-నీలకంఠసోమయాజులుగారూ!—నాకు—నాకు—నాకు—నాకు.

నీల-ఏమయ్యాబ్రాహ్మడా! నీవొకసారిపుచ్చుకున్నట్టున్నావే.

బ్రా—నేను కాను. యెవరినిచూచి నన్నడుగుకొన్నారో.

పర—లోపల బ్రాహ్మలు కొట్టుకొంచున్నారు—మీదకురాకు మీదకురాకు. మీరందరూ నన్నిల్లాచుట్టుకుంటే నేనెల్లా సంభావన యిస్తాను?

బ్రా-నేను సోమయాజుల్ని. నాకందరికంటె విశేషంగా ముట్టవలెను.

పర—ఏమయ్యా! నీవక్కడపుచుకనిమళ్ళీయిక్కడికివచ్చావు?—నీలకంఠసోమయాజులుగారూ! యీబ్రాహ్మడికి మీరివ్వలేదా?

నీల—యేదీ మొఖంచూణ్ణియ్యండి. యీబ్రాహ్మడు నాదగ్గిర కూడా రెండుమాట్లు పుచ్చుకొన్నట్లు అనుమానపడ్డాను. ఇందాకా చూశారుకారా? నేనీయున్నడిగినాను.

బ్రా—రామరామా! పెద్దలు మీరేయిలాగ అబద్ధాలాడుచున్నారేమయ్యా?

నీల—మీరాసాహేబూ! దొడ్లోబ్రాహ్మల్ని యివతలికి రానియ్యకు. మేంవెళ్ళిపెద్దయ్యగార్నడిగి సొమ్ముతీసుకుని యిప్పుడేవస్తాం.

(అని నీలకంఠసోమయాజులుగారును పరమేశ్వరావధానులుగారును లోపలికి నడుచుచున్నారు.)

పర—నీలకంఠసోమయాజులుగారూ! మీరుపంచిపెట్టినవెయ్యిరూపాయలలోనూ మీరేంమిగుల్చుకున్నారు?

నీల—ముప్ఫయిరూపాయలుతీసి మొదట్నేఅంగోస్త్రంకొంగున కట్టుకొని బొడ్లోదోపుకున్నాను. అంతకంటే నేనేమీ తీసుకోలేదు. మీరేంతీసుకున్నారు?

పర—నేను చివరకు తీసుకుందామనుకొని సంభావనయిచ్చి సుమారు పాతికిరూపాయీలు చేతులోపట్టుకొనేటప్పటికి పేరూరి బ్రాహ్మలు మీఁదబడి గుప్పిలి విదిలించుకుని తీసుకుపోయినారు. వాళ్ళనువదల్చుకొని యివతలపడడమే దుర్ఘటమయింది.

నీల—పెద్దయ్యగారు వుండేవోటికి వచ్చాం, ఇక యీసంగతి మాటాడకండి.

పర—పెద్దయ్యగారూ! అధమం యింకా రెండువేల రూపాయలైనా తెప్పిస్తేనేకాని మాటదక్కేవుపాయం కనఁబడదు. రెండువేల రూపాయలూ అయినవి. ఇంకా దొడ్లోవారు తరగనేలేదు.

నీల—వేగిరం రూపాయ లిప్పిస్తేనేగాని పరువు నిలవదు. అవ తల బ్రాహ్మలల్లరి చేస్తూవున్నారు.

పెద్ద—యిదివరకే పెళ్ళివిమిత్తం మాన్యంమీద పదిహేను వందల రూపాయలు బదులిప్పించాను. మన మాన్యం చెస్తూవున్న వెంకట్రెడ్డి సావిట్లోకూర్చున్నాడు. ఇలాపిలవండి.

[వెంకటరెడ్డి ప్రవేశించుచున్నాడు]

పెద్ద—వెంకటరెడ్డీ! సంభావనవిమిత్తం మాకింకా రెండువేల రూపాయలు కావలసివున్నవి. ఇదివరకు తాకట్టుపెట్టిన మాన్యం మీద యిప్పుడే అప్పొమ్మివ్వవలెను.

వెంక—ఇదివర్కే మాన్నెంమీద పదిహేనువందల రూపాయ లిచ్చాను. మూడుసంవ్వత్సరాల్లో సొమ్మివ్వకపోతే మాన్యాలు నాకిందొచ్చేలాగు పత్రం రాసిస్తేనేకాని నేను సొమ్మివ్వను.

పెద్ద—అలాగే వ్రాసిస్తాను. నీవింటికివెళ్ళి సొమ్మట్టుకురా. యీలోగా పత్రం వ్రాయించి వుంచుతాను.—నీలకంఠసోమయాజులు గారూ! యీకాగితంమీద వెంకట్రెడ్డి కోరినట్లు నాపేరెట్టి పత్రం రాసి మీరిద్దరూ సాక్షివ్రాళ్ళు చెయ్యండి. నేను నాచేవ్రాల్చేస్తాను.

[వెంకటరెడ్డి యింటికిఁ బరుగెత్తుకొనివెళ్ళి సొమ్ము తెచ్చి పత్రముపుచ్చుకొని సొమ్మిచ్చుచున్నాడు]

పెద్ద—సోమయాజులుగారూ! సొమ్ము తీసుకొనిపోయి వేగిరం సంభావన కానియ్యండి. పడమట నాలుగ్గడియల పొద్దుంది. సంభా వన పూర్తిఅయేదాకా భోజనాలకు లేవడానికి వల్లపడదు.

బ్రాహ్మణులు—(దొడ్డిలో) రూపాయలు వస్తూవున్నవి—రూపా యలువస్తూవున్నవి—నీలకంఠసోమయాజులుగారూ! మేము గుంటూరి నుంచివచ్చాము—పరమేశ్వరావధానులుగారూ! మేము విజయనగరా న్నుంచి వచ్చాము.

నీల—తొందరపడకండి వస్తూన్నాము.

బ్రా—సుబ్బావధానులుగారూ! మనం పెద్దయ్యగారేమో వరాలో మాడలో యిస్తాడనుకొన్నాము. చివరకు తుస్సుమని రూపాయి చేతిలో పెట్టినాఁడు.

సుబ్బా—బోడిపెళ్ళిలే. ఎలాగైతేయేమి యిచ్చారు వెధవ సంభావన. సూరావధాన్లూ! యేమీలేని అటుకుల వెంకమ్మిచ్చిందే నాలుగణాలు మొన్నకూతురుపెళ్ళికి.

సూరా—లక్ష్మణావధాన్లూ! నీవుశిష్టుణ్ని చాలాపీడించినావే. నీకేమైనా యెక్కువిచ్చారా?

లక్ష్మ—యీమహాసంఘంలో అధికారం చూశేవారెవ్వరు? నీళ్ళకావిళ్ళ కొండిగాడూ నేనూ సమానమయినాము. వాడికీ రూపాయ నాకూరూపాయా?

సుబ్బా—కానూరిబ్రాహ్మలేసరి. వొక్కొక్కడు గోడల్దూకి దొడ్లోప్రవేశించి మూడేసిమూట్లు పుచ్చుకున్నవాడే మళ్ళీ పుచ్చుకున్నాఁడు.

సూరా—సుబ్బావధానులుగారూ! చూచావా? నీళ్ళకావళ్ళ కొండిగాడున్నూ పీనుగుల పేరిగాడున్నూ రామచంద్రపురాన్నుంచి వచ్చిన జటావల్లభుణ్ని యేప్రకారంగా గోడమీఁద పడదోశారో.

సుబ్బా—దానికేంగాని ముంగొండనుంచివచ్చిన ముసలిపండి తుణ్ని గుమ్మం దగ్గిరవున్న తురకసాయిబు మహాచెడ్డదెబ్బలు కొట్టినాడుసుమీ!

పర—కేకలువెయ్యకండి. కేకలువెయ్యకండి.

నీల—యెక్కణ్నో గోడపడ్డట్టు చప్పుడవుతూవున్నది.

పర—గోడపడదోసుకొని బ్రాహ్మలు మందమందలుగా వస్తూవున్నారు—ఆగు—ఆగు—మీదికిరాకు.

నీల—సొమ్ము దోచుకుపోతారు; దోచుకుపోతారు. చేతులు విరవకండి—కొట్టకండి.

పర—చచ్చిపోతిని, చచ్చిపోతిని. మీరాసాహే—

బ్రా—పెద్దయ్యయెక్కడ? వాణ్ని యిలాగురమ్మను—పట్టుకో.

లోపలివారు—బ్రాహ్మలు లోపలదూరి దొమ్మిచేస్తూవున్నారు. పెద్దయ్యగారూ! మిమ్మల్ని కొట్టిపోతారు. గదిలోకిపోయి తలుపు వేసుకోండి. ఇరుగు తోరణాలెత్తింపుతూవున్నారు—పటాలు బద్దలు కొడుతూవున్నారు.

పెద్ద—మీరుపోయి రాణాలో తెలియచెయ్యండి.

(ఆరక్షకభటులు వచ్చినతరువాత బ్రాహ్మణులు పాటి పోవుచున్నారు.)

పంచమాంకము

ప్రదేశము—నాలవనాఁడురాత్రి పెండ్లికూతురు యిల్లు.

(ధనాలకామయ్యయు, నీలకంఠసోమయాజులును, నీళ్ళకావళ్ళ కొండయ్యయు, మఱికొందఱును ప్రవేశించుచున్నారు.)

నీల-కామయ్యగారూ! యీరాత్రి పెద్దమనుష్యులు చాలా మంది భోజనానికి వస్తారు. వార్నందర్నీ మీరెల్లా పరామర్శచేస్తారో సుమండీ.

కామ-ఉభయఖర్చులూ పెట్టుకొని పెద్దయ్యగారే సమస్తం జాగర్తపెడుతూవుండఁగా నాపనియేముంది? అన్నిమీరే సమర్థించ వలెను.

నీల—కొండయ్యా! అందరునూ రెండోసారిభోజనాలకు పిల్చి వచ్చినావా?

కొండ-'వంటలయిసిద్ధంగావున్నయి, విస్తళ్ళు వేశారు. పెద్దమనుష్యులు వచ్చికనిపెట్టుకున్నారు. వడ్డనకు మీ్రావడమేఅవసిష్టం' అని అందరితోనూ దీపాలవేళ్నే చెప్పివచ్చాను.

నీల—వంటలెంతమట్టుకువచ్చినయి?

కొండ—కూరలుడికినవి. అన్నంవండడానికి నాలుగుబిందెలతో ఎసరుపెట్టినారు. ఇకపిండివంటకావలెను. వంటాలస్యంలేదు.

(ఒకతట్టలో చెంబులను మడిబట్టలను వేసికొని దానిని నెత్తిమీద బెట్టుకొని యొకబ్రాహ్మణుడుప్రవేశించుచున్నాడు)

కొండ—పేరయ్యా! యీ చెంబులెవరివి?

పేర—రామచంద్రావుగారివి. ఎక్కడపెట్టను?

కొండ—రెండోపంక్తిలో మొదటిపీటదగ్గరపెట్టు,

నీల—భోజనాలకువచ్చేవారువస్తూవున్నారు. కొండయ్యా! పీటలముందరవిస్తళ్ళు వేయించు.

(చేతిలోకంచుచెంబులతోనీళ్లుపట్టుకొని, బుజముల మీదతడిబట్టలుపెట్టుకొని, మడిబట్టలుకట్టుకొని, కొందఱుగృహస్థులు ప్రవేశించుచున్నారు.)

నీ—మంచు కొన్నిపీటలువదలి కూర్చుండండి—కొండయ్యా! నీవింకోసారివెళ్ళి వడ్డనఅవుతూందని చెప్పి రానివారినిపిలుచుకురా.

కొండ—రామన్ననుపంపినాను—అదుగో — రామన్నవస్తూవున్నాడు—ఓరీ! రామన్నా! వెళ్ళినవారేమన్నారా?

రామ—అప్పయ్యపంతులుగారు రామన్నారు. పాపయ్యపంతులుగారు అందరూ పరిషేచనాలు చెయ్యబోయేటప్పుడువచ్చి పిలువుమన్నారు. వెంకటచలంగారుఇంట్లోలేరుయిప్పుడేలాంతరుమనిషికోసమో

యెందుకో వీధిలోకి వెళ్ళినారని స్త్రీలుచెప్పినారు. విశ్వనాథంగారు మడిబట్టలు తేవడానికి బ్రాహ్మడికివర్తమానంపంపిఅతనికోసంయెదురు చూస్తూవున్నారు. సోమశాస్త్రిగారువస్తాంవెళ్ళమన్నారు. కావా వధాన్లుగారున్నూ అంతేచెప్పినారు. తక్కినవారందరూవచ్చారు.

నీల—కొండయ్యా! నీవొక్కపర్యాయంవెళ్ళి రావలసినవాళ్ళని నలుగుర్ని కేక వేసిరా.

కొండ—చిత్తం. (అని వెళ్ళుచున్నాడు)

నీల—(పీటలమీందఁ కూరుచున్నవారితో) పాపం! మీరుచాలా సేపటినుంచి కూరుచున్నారు. భోజనాలకువచ్చేవారు వేగిరంరారు.

రాజన్న— పాపయ్య పంతులుగారెప్పుడీలాగే ఆలస్యంచేస్తారు.

భీమరాజు—బుచ్చయ్యపంతులుగారింటికి కిందటిసారిభోజనానికి వెళ్ళినప్పుడు వెంకటచలంగారు యేవేళకూవచ్చారుకారు.విస్తళ్ళల్లో వడ్డించాకకూడా వర్తమానంవెళ్ళేటప్పటికి చీకట్లో లాంతరుమనిషి కోసంబయల్దేరారు. కూలిమనిషిని కుదుర్చుకునివచ్చేటప్పటికి రాత్రి రెండుఝాములయింది. కొందరుపీటలమీదేనిద్రపోయారు; వడ్డించిన అన్నమూకూరలు చల్లారిపోవడమేకాకుండా విస్తళ్ళకు చీమలుపుట్టలు పోసినయి.

రాజ—ఇప్పుడూ వెంకటచలంగారే లాంతరుమనిషికోసంవెళ్ళి నారట! యీప్రకారం పిండిఆరబోసినట్టు వెన్నెలవచ్చిందే. ఇంకా లాంతరెందుకు?

భీమ—ఆయనమనిషికోసం బయల్దేరేటప్పటికి వెన్నెలరాలేదు. అయినాలాంతరు పరువుకోసంగాని వెలుతురుకోసంకాదు.

[ఇంతలోకొండయ్య ప్రవేశించుచున్నాడు]

నీల—యేమోయికొండయ్యా!యెవరైనావచ్చారా?

కొండ-పాపయ్యపంతులుగారు అందరూవచ్చి అవుపోసనాలు పట్టేటప్పుడువర్తమానంచెప్పుమన్నారు. వెంకటచలంగారుమనిషిని తీసుకువచ్చిలాంతర్లో మైనపువత్తి కొనడానికిబజార్లోకి వెళ్ళినారు. విశ్వనాథంగారు వచ్చారు. తక్కినయిద్దరూ వస్తారు.

నీల—రామన్నా! నీవోపర్యాయంవెళ్ళిరా?

రామ—వక్కవరుగులోవస్తాను. (అనినడుచుచున్నాడు)

రాజ—నాలుగ్గడియలనుంచి విస్తళ్ళదగ్గిరమడిగట్టుకుని కూర్చున్నాము. నాకజలబాధకు పోవలసివున్నది. ఎంతో యిబ్బందిగావున్నది.

భీమ—వకరింటికిభోజనానికివస్తేయిదేబాధ సుఖంగాయింటివద్ద పెందలకాడే భోజనంచేసినంత వుత్తమపక్షంలేదు.

రామ— (మరలప్రవేశించి) వెంకటచలంగారుదయచేశారు. సోమశాస్త్రిగారు భోజనాలుపొద్దుపోతవని యిప్పుడేభోంచేసికూర్చున్నామని చెప్పుమన్నారు. కామావధాన్లుగారునాఆలస్యంలేదునీతోటే వస్తానునడవమన్నారు. పాపయ్యపంతులుగారు యిందాకాచెప్పినట్టే చెప్పినారు.

నీల-పాపయ్యపంతులుగారితోఅవుపోసనాలుపట్టబోతూవున్నారనిచెప్పి కామావధాన్లగారినికూడాకేక వేసిరా.

రామ-అభికాగం కానియ్యండి. నేను వారిద్దర్నీ నిముషంలో తీసుకునివస్తాను. (అని పరుగెత్తుచున్నాడు)

నీల—పాపయ్యపంతులుగారుదయచేశారు. ఇంకొక్కకామావధాన్లుగారుమాత్రమే రావలెను.

[అప్పుడొకబ్రాహ్మణుఁడు రోజుచుఁబరుగెత్తుకొనివచ్చికూరుచున్నవారివంక బాఅజూచుచున్నాడు]

రామ—ఏమయ్యా! నీవొచ్చావూ?

బ్రాహ్మ—భీమరాజుగారెక్కడున్నారు? ఆయన చిన్నకుమారుఁడు చంటిపిల్లవాడికి తేలుకుట్టింది యెవరెత్తుకున్నావుండక గిజగిజలాడుతూ వున్నాఁడు.

భీమ—(లేచి) నేనువెళుతాను. నాకు సెలవియ్యండి.

నీల—ముందరివిస్తరి వదలివెళ్ళకూడదు. కామావధాన్లగారి నిమిత్తం మనవారందరూ కనిపెట్టుకుంటారు. మీరీవసారాలో కూర్చుండి రెండుమెతుకులు నోట్లో వేసుకుని యిప్పుడే వెళుదురుగాని రండి—ఇక్కడ వున్నవారందరూ నామనవిచిత్తగించి అనుజ్ఞయివ్వవలెను. (అనిబలవంతపెట్టి విస్తరియొద్దఁ గూర్చుండఁబెట్టుచున్నాఁడు)

అందఱును—మాకు పరమసంతోషం—మీరుభోంచేసివెళ్ళండి.

రామ—(మరలఁబ్రవేశించి) కామావధాన్లగార్ని దుర్ఘటం మీద బయల్దేర దీసివచ్చాను. ఆయన నాలుగ్గడియలనుంచి మన కోసం కనిపెట్టుకున్నామని సెలవిచ్చారు.

[కామావధానులు వసారాలోనుండివచ్చి పంక్తులమధ్యను నిలువఁబడి మొగమెఱ్ఱచేసి చూచుచున్నాఁడు.]

రాజ—కామావధాన్లుగారూ! మీనిమిత్తం మేమందరమూ ఝాంనుంచి విస్తళ్ళదగ్గిర కనిపెట్టుకుని వున్నాము. పీటమీద శీఘ్రంగా దయచెయ్యండి.

కామ—(కోపదృష్టితో) భోజనానికి పిల్చినవారు యిలాగంటి పెద్దమనుష్యులని తెలిస్తే నేను భోజనానికి వస్తానా?

నీల—యేమి? యేమి? మావల్ల యేమి అపరాధంవచ్చింది? వస్తే మాఅపరాధం క్షమించాలెను.

కామ—పంచపాళీలో భోజనానికి కూర్చున్నవారెవరు?

నీల—మీనిమిత్తం మూడునాలుగు వర్తమానాలుపంపి, మీ రావడం కొంచెం ఆలస్య మయ్యేటప్పటికి, యీలోపుగా ఆయన

చిన్నపిల్లవాడికి తేలుకుట్టిందని వర్తమానంవస్తే ఆయన భోజనం చెయ్యకుండా వెడతానని తొందర పడడంచేత, సభవార్ని ప్రార్థించి వారిఅనుమతిమీద పంచపాళీలో వడ్డింపించినాను. సభవారందరూ మీకోసం కనిపెట్టుకొనివుంటారని సెలవిచ్చి ఆయన్ని భోజనంచెయ్య మన్నారు. నావల్ల కలిగిన అపచారం మన్నించాలెను.

కామా—మూడునాలుగుసార్లు కాదు. పందసార్లు పిలవాలెను. మొన్న బుచ్చయ్యపంతులుగారింట్లో ఫదిసార్లు పిలిపించుకొని మరీ భోజనానికి వెళ్ళినాను. వెనకసోమనాథశాస్త్రిగారిలోపల నేనువచ్చే వరకూ కనిపెట్టుకుని వుంటారో లేదో చూతామని వడ్డనయిన తరువాతకూడా మూడుఘంటలు ఆలస్యంచేశాను. ఎనరున్నూ యిలాగు చెయ్యలేదు. వారు పెద్దమనుష్యులు యెందుకు చేస్తారు? యీభీమరాజు యెలాగంటిపెద్దమనిషి? వీరందరూ చెపితే తానెలాకూర్చున్నాడు?

నీల—మావల్ల యెంతైనా అపరాధంవచ్చింది. క్షమించాలెను. (అని చేతులు జోడించుకొని బతిమాలుచున్నాడు.)

కామా—యిఖ నేనిక్కడ భోజనంచెయ్యను. ఛీ! పరువెరగని స్థలానికి యెప్పుడూ భోజనానికిరాకూడదు. (అని యడ్డమువచ్చిన వారిని త్రోచికొనుచు వెడలిపోవుచున్నాడు.)

సభవారు—మామనవి చిత్తగించాలెను-మాప్రార్థన అంగీకరించాలెను-మాయందు అనుగ్రహం వుంచాలెను. (అనియందఱును వచ్చి చేతులును గడ్డమును పట్టుకొని వేడుకొనుచున్నారు.)

కామా—నన్ను పోనియ్యండి—నాకడ్డంరాకండి.

[లోపలి కోలాహలమువిని పెద్దయ్యగారు పరుగెత్తుకొనివచ్చి, సంగతి తెలిసికొని, దీనత్వములో గుమ్మముకడ్డముగా నిలుచున్నారు]

పెద్ద—మావల్ల చాలా అపరాధంవచ్చింది. సోమయాజులు తెలివితక్కువచేత చేశాడు. మనమిద్దరమూ బాల్యస్నేహితులమూ బంధువులమూ కాబట్టి నన్నుచూచి కోపంశాంతిపొందించవలెను. (అని దీనముగా ప్రార్థించుచున్నాడు)

కామా—యిలాగంటి బుద్ధిహీనులకు పెత్తనంయివ్వడంమీదే తప్పితం. పెద్దయ్యగారూ! మీరువచ్చి బతిమాలుతూవున్నారు గనుక మాటతీసివెయ్యలేక వొప్పుకున్నాను. (అనిపీటమీదగూరుచున్నాడు)

పెద్ద—మా నీలకంఠ సోమయాజుల పొరబాటుచేత అందరూ వచ్చిన తరువాతకూడా రెండుగంటలు ఆలస్యమయింది. భోజనాలు ప్రొద్దుపోయినందుకు క్షమించవలెను. కొండయ్యా! అవుపోసనాలు పడుతూవున్నారు. నెయ్యివడ్డించు.

వడ్డించువారు (బంతులవెంబడిని దిరుగుచు)-ఘృతం-సూపం-భక్ష్యం.

రాజ—శ్లో॥ మాతానిందతి నాభినందతిపితా భ్రాతా నసంభాషతే
భృత్యఃకుప్యతి నానుగచ్ఛతిసుతః కాంతాచనాలింగతే
అర్థప్రార్థన శంకయా నకురుతేప్యాలాపమాత్రంసుహృత్
తస్మాదర్థముపార్జయ శ్రుణు సఖే చార్థేనసర్వేవశాః.
భోజనకాలే గోవిందనామస్మరణ—గో—విందా.

కొండ—ఆజ్యం—ఆజ్యం—మీకు పంతులుగారు—కొంచెం.

పాప—అల్లాపడబోస్తావేమి? వద్దువద్దంటూవుండగా అతడు అన్నమూ అలాగే పడవేసిపోసినాడు. నిష్కారణంగా పారవెయ్యవలెను.

రామ—భక్ష్యం—భక్ష్యం— యీవొక్కటే— యెక్కువయితే అన్నం దిగపెడుదురుగాని లెండి.

రాజ—కొండయ్య! యీపాటి నేతిఝూరీ అక్కడపెట్టి మజ్జిగ పుచ్చుకో.

రామ—మజ్జిగలోకి ప్రసాదం—కొంచెం ప్రసాదం.

కొండ—పెరుగు—పెరుగు—పెరుగు.

కామ—కొంచెంపులుసూ కాటుకంపూ కాని, పెరుగు బహు దివ్యంగావున్నది. వక్కరవ్వ లవణం తెప్పించు.

కొండ—బుట్టలోది—బుట్టలోది

రాజ—అందరిభోజనాలూ అయినవి లేవవచ్చునా?

పాప—లేవవచ్చును-లెండి-గోవిందా-గో-విందా.

కొండ—లేవకండి. ఇక్కడ కామానధాన్లుగారు యిప్పుడే పెరుగు బాగుందికాదని మజ్జిగ వడ్డించుకుంచూ వున్నారు.

నీల—లోపల బూజంబంతి దివ్యంగా జరిగింది. గుమ్మడికాయ కూర యెంగిలిముక్కలు పంక్తులపొడుగునా వకరివి స్తట్లోనుంచి వకరివి స్తట్లోకి గంతులు వేస్తూవున్నవి.

కామ—నాభోజనం అయింది. లేవవచ్చును.

కొండ—మీరందరూతిన్నగా వీధులోకినడవండి. రామన్ననీళ్ళ బిందె అక్కడపెట్టినాఁడు.

[భోజనములుచేసి, తాంబూలములుపుచ్చుకొని, యెవరి యిండ్లకు వారుపోయిరి.]

షష్ఠాంకము

---

౧. ప్రదేశము—పట్టణములోని వీధులు.

[నీలకంఠసోమయాజులు, పరమేశ్వరావధానులు, బంధువులును ప్రవేశించుచున్నారు.]

నీల-పరమేశ్వరావధానులూ! ఇప్పటికేపన్నెండుగడియలరాత్రి

అయింది. వూరేగింపని యెంతతొందర పెట్టినా వేగిరం భోజనాలు తెమల్నిచ్చారు కారు. పెద్దయ్యగార్ని రమ్మని చెప్పి, పెళ్ళికూతురునిద్ర పోతూవుంది కాబోలను లేపు.

పర-వూరేగింపుకుబోగం మేళంవకటివచ్చిందా?చకోరాక్షుతో నాలుగ్గడియల పొద్దుపొయ్యేటప్పటికల్లారమ్మని చెప్పినాను. యిప్పటికి రాలేదు. యిప్పుడేమివూరేగింపు? వూరందరూ గాఢమయిననిద్రలో వుంటారు.

నీల—నీవుపోయి పెళ్లికుమార్తెను లేపు—చాకలిరామిగా! పల్లకీ సిద్ధంచేసి, యిలాయీచుట్టలు వెలిగించమను.

పర—పెద్దయ్యగారూ! మీరు వెళ్ళి పల్లకీలో కూర్చుండండి. పదిలంపెద్దలయినారు. గోడపట్టుకుని మరీరండి—అజ్ఞానమ్మా! పెళ్ళి కూతుర్ని లేపినావా?

అజ్ఞా—దాన్నినిద్రలో లేపేటప్పటికి యేడుస్తూ వున్నది. యేమ యినాచేతులో పెట్టి వోదార్చమని మావారికివప్పగించివచ్చాను.

పర—బోగంమేళంవచ్చింది. భజంత్రీలు వాయిస్తూవున్నారు. పెద్దయ్యగారు పల్లకీలోకూర్చున్నారు. పెళ్ళికూతురు యింతట్లో యేడుపుమానేటట్టు కనపడలేదు. అజ్ఞానమ్మా! పెళ్ళికుమార్తెను యెత్తుకుతీసుకువచ్చి పల్లకీలో కూర్చుండబెట్టు.

అజ్ఞా — అమ్మాయీ! యేడవకు అదిగో వీధులో బాజాలు వాయిస్తూవున్నారు. చూతాంవూరుకో. (అనియెత్తుకుని తీసుకొనివచ్చి పల్లకీలో(గూర్చుండబెట్టుచున్నది.)

నీల—ఆకాశాన్ని మేఘంపట్టింది. కొంచెంసేపుచూచి మరీ బయ ల్దేరవలెను.

పర— యిది వానవచ్చేమబ్బుకాదు. రామిగా! పల్లకీ సాగని య్యండి. నీలకంఠసోమయాజులుగారూ!పల్లకీముందర యెవ్వరూలేరు.

మనం వెళ్ళిబోగం మేళం దగ్గర వుందాం రండి. ఆడవాళ్ళందరూ పల్లకీ వెనక్కు వచ్చారా?

నీల—ఓసీ! చకోరాక్షీ! "మగవారిని నమ్మరాదమ్మా" అను పదం పాడు.

చకో—మద్దెల తిన్నగా వాయించు—తాళం హంసయాన చేతి కిచ్చి నీవు తిత్తిపట్టు—ఊఁ—మగవా—

నీల—ముందుకునడువు—ఆయింటి కాడ—ఆగు—పాడు.

చకో—మగవారి—మగవారీ—మగవారీనా—

నీల—చాలించు—పయికినడువు.

పర—యిదేమిటి? గాడిదకొడుకులు బాజావాళ్ళు నిలువుమన్న ఝాంసేపటికి నిలిపి బోగంది పాడుతూవున్నంత సేపూగొల్లుమనివాయిస్తూనేవుంటారు; పాటచాలించి బోగంవాళ్ళు నడవడాని కారంభించగానే తామున్ను బాజాలు మానివేసి, వాళ్ళు మళ్ళీ పాట మొదలుపెట్టగానే యేమీవినపడకుండా తామున్ను వాయించ మొదలుపెడుచూవున్నారు.

నీల—భోగరాజుగారూ! దయచేస్తారా? వకసారితిరిగి వత్తాము.

భోగ—మీరు మేళంతో వూరేగుతారనివిని మీతో రావడానికే ఝామునుంచి వీధిగుమ్మంలో కనిపెట్టుకొనివున్నాను.

పర—మీప్రియురాలు యిక్కడవుంచూవుండగా మీరు కనిపెట్టుకొనివుండక యెక్కడికివెళుచారు? అది మేళానికి రాకపోయినట్టయితే మీరు యీపాటి దాని యింటికాడ నాలుగునిద్రలు చేసివుందురు.

నీల—నూరపరాజుగారూ! వక్కసారి విజయంచేస్తారా?

నూర-వకస్నేహితుడితో ప్రొద్దుపోయినదాకా మాటాడుతూవుండి యింతకుముందే పరున్నాను. నిద్రపట్టేటప్పటికి మీబాజాల

చప్పుడు వినబడి వులిక్కిపడిలేచినాను. మధ్యనిద్రాభంగంవస్తే మళ్ళీ వకపట్టాన్ననిద్రపట్టదు. మీబాబాలచప్పుడువిని మాఆవుబెదిరి కట్టు తెంచుకొని పారిపోయినది. చీకట్లోపోయి దాన్ని వెతికి తీసుకొనిరావ లెను. నేనురాను.

నీల—ఊఁ. సాగండి—అక్కడ నిలవబడండి.

చకో—మగవారీ—మగవారీ మగవారీనమ్మా—

పర—సోమశాస్త్రిగారూ! నాలుగడుగులు మాతో విజయం చేస్తుఱుగానిరండి.

సోమ—ఈసారికి నన్ను క్షమించవలెను. మాయింట్లోదానికి దేహంలో జబ్బుగావున్నందున నిన్న తెల్లవారినదాకా మాకెవరికీ నిద్రలులేవు. దానికిపట్టకపట్టక యిప్పుడేకొంచెంనిద్రపట్టుచూవున్నది. ఇంతలో మీవూరేగింపుమూలాన్న దాని నిద్రకు భంగంకలగడమే కాకుండా చంటిపిల్లలేచి పోరుపెడుచూవున్నది.

నీల—కొంచెము చినుకులారంభంఅయినవి. — ఎవ్వరో పల్లకీ వెనుక సందడిచేస్తూవున్నారు.

పర—మన అజ్ఞానమ్మకు తేలుకుట్టింది—కాగడా యీలాగు చూపించు—మంత్రగాడు లేడుగదా?

నీల—పెద్ద వర్షంవచ్చింది. పెళ్ళికొడుకున్ను పెళ్ళికూతురున్ను తడిసిపోవుచున్నారు—కాగడావాళ్ళు పరుగెత్తుచున్నారు.

పర—అజ్ఞానమ్మా! నాచెయ్యిపట్టుకుని మెల్లిగారా! చీకటి మూలంగా యేమీకనపడకుండావున్నది. అందరూ ముందుపరుగెత్తి పోయినారు.

అజ్ఞా—నాయనా! యిఖ నేనుబ్రతుకను. నొప్పిగజ్జలోకియెక్కి గొడ్డళ్ళతో వేసినట్లు కాలుబద్దలవుచున్నది. దాసికితోడు వర్షపుదెబ్బ కూడా మొఖంమీద కొడుచూవున్నది.

పర–కాలుజారిపడ్డాను. నడుము నొప్పిపట్టింది; బట్టలుబురదయినవి. అజ్ఞానమ్మా! కొంచెంచెయ్యిఆసరాయిచ్చి లేవతియ్యగలవా?

అజ్ఞా–నేను లేవతియ్యలేను. నా బాధచేత నేనుచచ్చిపోచూవున్నాను. మెల్లిగాలేచి మీరు వెనుకరండి, పడుచూలేచుచూ నేను ముందుకు వెళుచాను. [అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు.]

---

౨. ప్రదేశము—పెండ్లికొడుకు వారిపీఠి.

[పీనుగుల పేరయ్య, నీళ్ళకావళ్ళ కొండయ్య, నీలకంఠ సోమయాజులు మొదలగువారు ప్రవేశించుచున్నారు]

నీల–పేరయ్యా! నీవు పెళ్ళికొడుకు నెత్తుకో, కొండయ్య పెళ్ళికూతుర్ని యెత్తుకుంచాడు. దండాడింపులో నీశక్తికనపడవలెను.

పేర–తాతగారూ! రండి. నెనుమిమ్మల్ని యెత్తుకుంటాను, పల్లెంనిండా బుక్కావున్నది. చిన్నపిల్లవాడివలె చల్లవలెను.

కొండ–పెళ్ళికూతురు బుక్కా పొయ్యలేదు. మాయిద్దరి బదులూ నేనేపోస్తావున్నాను. కానుకోండి.

పేర–ఏమిరా మోటగాడిదెకొడుకా! పెళ్ళికొడుకు కంట్లోనూ నోట్లోను బుక్కాపోసినావు? మీపెళ్ళికొమార్తెకంట్లో నేనుమాత్రం పొయ్యలేననుకున్నావా?

కొండ–పెళ్ళికొడుకుకంట్లోగాదు యీసారి నీకంట్లోపోస్తాను. చేతనయితే వక చెయ్యిచూచుకుందామురా.

నీల–ఓరిదున్నపోతులారా! మీరిద్దరూపోట్లాడి పెళ్ళికొడుకును పడదోసినారేమ్రా? పెద్దయ్యగారూ!మీ కేమీ దెబ్బతగలలేదుకదా?

పెద్ద–దెబ్బతగులలేదు. మోకాలు కొంచెం కొట్టుకుపోయింది వచ్చి లేవతియ్యండి.

పేర—నీలకంఠసోమయాజులుగారూ! మీరుపొండి. పెళ్ళికొడుకును నేనెత్తుకుంటూవున్నాను - పెద్దయ్యగారూ! బుక్కాఅయిపోయింది; బుట్టలో ముగ్గుతెచ్చినాను. మీమీద పోసినందుకు మీరు యీముగ్గు పెళ్ళికూతురి కంట్లోపొయ్యవలెను.

పెద్ద—అయ్యయ్యో! సున్నపుముగ్గుకాదుగదా నాకంట్లో పోసినారు?

కొండ—కాదుకాదు సుద్దముగ్గు.

పేర—వసంతము చిమ్మిరిగొట్టముతో పొయ్యవలెనుగాని చెంబుతో పోస్తారేమి?

కొండ—చేతనైతే మీరుకూడా పొయ్యరాదా? ఈసారి చూడు బిందెతోనే పోస్తాను.

పేర—నీమోటతనమాను. వసంతంలోమునిగి పెద్దయ్యగారు వుక్కిరిబిక్కిరి అవుతున్నారు. వసంతంలో సున్నం యెక్కువపడ్డది కాబోలును ఘాటుగావున్నది. ఇఖపొయ్యకు పొయ్యకు.

పర—విస్సిగాడుపోయి వూరికేకూర్చున్న రామయ్యమీద చెంబుతోవసంతంపోసినాడు, తెల్లబట్టలుపాడయిపోయినందుకుకోపంవచ్చి వాడులేచి చేతికొద్దీ వక్కలెంపకాయ కొట్టినాడు. అందుమీదవాళ్ళిద్దరూకలియబడి జుట్టూజుట్టూపట్టుకుని యేప్రకారంగాకొట్టుకుని తిట్టుకుంటూవున్నారోచూచినావా నీలకంఠసోమయాజులూ!

నీల—విస్సిగాడెప్పుడూ బండవాడే. వాడిందాకా నామీద కూడా ఆప్రకారంగానే పోసినాడు.

పర—దానికేమిగాని భోగరాజు బోగందానిబట్ట పట్టుకుని పట్ట పగలు సిగ్గులేకుండా ఫదిమందిలోనూ యేప్రకారంగా వసంతంపోసి అల్లరిచేస్తూవున్నాడో చూడు.

నీల—ఇలాజరుగుతుందని తెలిసే యివేళ భోగంవాళ్ళందరూ మంచిబట్టలూ నగలూ తీసివేసి సాధారణబట్టలతో వచ్చినారు.

పర—భోగంవాళ్ళను ఆలాచెయ్యడం హాశ్చర్యంకాదు. మన వాళ్ళు పడుచువాళ్ళు వరుసలని పేరుపెట్టుకుని వయసులోవున్న ఆడ వాళ్ళమీదనిర్భయంగాబుక్కామన్నవసంతమున్నూపోస్తూవున్నారు. అన్నమ్మగారి సీతి పరుగెత్తుకొనిపోచుండగా, వెంటబడి తరుముకుని పోయి మొగుడుచూస్తూండగానే పైటచెంగుపట్టుకొని శాస్త్రిగాడు కొప్పుమీదను రొమ్ముమీదనూ బుక్కాపోసి రుద్దుచూవున్నాడు. వాడి పొగరుబోతుతనం చూడు.

నీల—వక్కశాస్త్రిగాడే యేమిటి? దొడ్డినిపడి గంగాళంలోని వసంతం చెంబులతో ముంచుకొని ఆడవాళ్ళూ మొగవాళ్ళూ అనేభేదం లేకుండా పడుచువాళ్ళందరూ పరుగెత్తుతూ వకళ్ళమీదవకళ్ళు పడ బోసుకుంచూవున్నారు. మగవాళ్లేలాగుచేసినా సరిపోచుందిగాని ఆడ వాళ్ళుకూడా మగవాళ్ళతోసమానంగా కేకలువేస్తూ వాళ్ళమీదపడి పెనుగులాడుచూ అలాగువసంతం దిమ్మరించడం ధర్మమా?

పర—బంధువులయినవాళ్లున్ను పెళ్లివారున్ను ఎలాచేసుకున్నా బాగావుంచుంది. ఏమీసంబంధం లేనివాళ్లందరూవచ్చి యీ ప్రకా రంగా వసంతం చల్లుకోవడము యేమిదురాచారము? పడుచువాళ్లు బావగారివరుసా మరదలివరుసా అని చెప్పుకుంచూ హాస్యంపేరు పెట్టుకొనిపాడగుచూవున్నారు.

నీల—వసంతాలాడడం అయింది. నఖశిఖపర్యంతమూ పట్టు కున్న యీబుక్కావదలడానికి మనంపోయి స్నానంచేసివత్తామురండి.

(అని అందఱు నిష్క్రమించుచున్నారు.)

---

3. ప్రదేశము—పెండ్లికూఁతువారిలోపలి చావడి.

(అజ్ఞానమ్మ, నీలకంఠసోమయాజులు మొదలగువారు పళ్లెమును పాలచెంబును చేతితోఁబట్టుకొని ప్రవేశించుచున్నారు.)

నీల—అజ్ఞానమ్మా! అప్పగింతలపాట పాడడానికి బాపనమ్మ వచ్చిందే కాదు చూచినావా?

అజ్ఞా—ఆముండ వకనాడైన వేళకువచ్చిపాటపాడియేడిచిందా?

నీల—దాని మొగుడుయెక్కడవున్నాడు? యెప్పుడూ చూడనే లేదు.

అజ్ఞా—వివాహమైన మూణ్నెల్లకో నాలుగు నెలలకో మొగుడు కాశీయాత్ర వెళ్ళి మళ్ళీరాలేదనీ, అక్కడజీవించివున్నాడనీ చెప్పుచూ వుంచుంది. నేనీవూరికి కాపరానికివచ్చిన నలబయి సంవత్సరాలనుంచీ యీప్రకారంగానే ప్రతీస్థలములోనూ ముత్తైదతనం చేస్తూవున్నది. అతఁగాడు చచ్చినాడని పెద్దభార్యకొడుకు తద్దినాలుపెడుచూవున్నాడు.

నీల—అదుగో బాపనమ్మ వచ్చింది. ఇఖ వప్పగింతలపాట కానియ్యవచ్చును.

బాప—అజ్ఞానమ్మగారూ! ఆపాలు పళ్లెంలోపొయ్యండి పిల్ల దాన్ని వప్పగింతురుగాని.

అజ్ఞా—(చిన్నమ్మచెయ్యి పాలలో ముంచి పెండ్లికొమారుని చేతిలోఁబెట్టి) ఇన్నాళ్ళూపెంచి నిన్ను వక అయ్యపాలు చెయ్యవలసి వచ్చిందిగదా చిన్నమ్మతల్లీ! (అని వెక్కి వెక్కి యేడ్చుచున్నది.)

నీల—ఏమిటావెఱ్ఱి? వూరుకో. సమస్తమూ తెలిసివుండీ సంతోష సమయంలో దుఃఖం తెచ్చుకోవచ్చునా?

అజ్ఞా—చిన్నప్పటినుంచీ పెంచి చిన్నదాన్ని వకరిచేతులోపెట్టేటప్పుడు కన్నతల్లికి దుఃఖం యెలాగు ఆగుతుందినాయనా! (అని మఱింత బిగ్గరగా యేడ్చుచున్నది.)

బాప—బంగారుపళ్ళెమున పాలమరపోసి*సీతతల్లిదండ్రిశీఘ్రమునవచ్చి హస్తకంకాణాలఅతివలనుదెచ్చి*అల్లుళ్ళచేతిలోచేయొప్పాగించిశశి పువ్వురాగిడీచేడియలదెచ్చి*శాంతమ్మచేతిలోచేయొప్పాగించి బుద్ధు లెరుగదుమంరుబుద్ధులేకాని*బుద్ధివచ్చినదాకాదిద్దూకోరయ్యా

నీల—అజ్ఞానమ్మా! ఏమిటాయేడుపు? ఏడుపుదిగమింగి ధైర్యం తెచ్చుకో.

బాప—నీలకంఠ సోమయాజులుగారూ! మీరు వూరుకోండి. ఆనిడెనూత్రం పిల్లదాన్ని అల్లుడికి వప్పగింతపెట్టలేక విచారిస్తూవున్న దనుకొన్నారాయేమిటి? వప్పగింతలకాలంలో ఆలాలాంచనం జరగ వలెను గనుక ఏడుస్తూవున్నది. అది వక విధమైన వేడుకగాని మరేమీకాదు.

అజ్ఞా—నీలకంఠసోమయాజులుగారూ! అమ్మాయినిమీరువప్ప గించుకొందురుగాని రండి. పిల్లది మీపాలైనది దాన్నియెలా చూచు కుంచారో మీ దేభారము.

నీల—చిన్నదానికేమీ లోపంలేదు. ఇటువంటి సమ్మంధం దొరకడం మీదంపతుల అదృష్టము.

బాప—అప్పగింతలయిపోయినవి. నేనుసెలవుపుచ్చుకొందునా?

(అప్పుడందఱును నిష్క్రమించుచున్నారు.)

స ప్త మాం క ము

౧ ప్రదేశము—కామయ్యగారిగది.

[అజ్ఞానమ్మయు, మగఁడును ప్రవేశించుచున్నారు.]

కామ—ఏమే! చేతులో డబ్బులేక యిబ్బందిపడవలసివచ్చింది? వివాహసమయమందు మనం పుచ్చుకున్న వెయ్యిరూపాయలలోనూ

నాలుగువందల రూపాయలు మన పుల్లయ్య బదులని పుచ్చుకుని అపహరించినాడు. యిమ్మని అడిగినప్పుడల్లా చేతిలోసొమ్ము లేదంటూ వున్నాడు. తక్కినసొమ్ము పెట్టి వర్తకం చెయ్యబోతే అసలికేదండుగ వచ్చి వెండిచెంబులజోడుకూడా అమ్మివేసినాడుకదా?

అజ్ఞా—పెద్దయ్యగారిని మళ్ళీ యేమైనా యిమ్మని అడగండి.

కామ—పెళ్లిఅయిన నాలుగేళ్ళల్లోనూ లక్షసారులుఅడిగినాను. ఒక్కగవ్వయినా చేతిలోపెట్టినపాపాన్న పోయినాడుకాడు. వాడువట్టి మలభక్షకుఁడు. ఎన్నివిధాల అడిగినా ఇయ్యకపోతేనేకాదా ముసలి ముండాకొడుకు తగిన ప్రాయశ్చిత్తం చేతామని వెండిచెంబులజోడు నిముషంలో మాయంచేసినాను. అయినా అతను మనమీదమాత్రం అనుమానపడలేదు. ఇతడు యింతకాలం బ్రతుకుతాడనితోస్తే నే నప్పుడు పిల్లదాన్ని యిస్తునా?

అజ్ఞా—జరిగిపోయినదానికివిచారించి చేసేకార్యంయేమీలేదు. ఇఖనయినాపెద్దయ్య వేగిరంచస్తేబాగావుండును. పిల్లదియెదిగిడబ్బయి యేళ్ళ ముండాకొడుకుతో కాపురంచేసి యేడుస్తుందాయేమిటి?

కామ—నాకున్ను అదేవిచారంగావున్నది. పాపిష్టిదేవుడు ముసలివాళ్లకు ఆయువు విశేషంగాపోస్తాడు. మొన్నసీతారామస్వామి వారి కోవిలకు వెళ్ళినప్పుడు పెద్దయ్య వేగిరంపోతే గరుడవాహనం చేయిస్తానని మ్రొక్కుకున్నాను.

అజ్ఞా—అరుగో పెద్దయ్యగారు స్నానానికివస్తూవున్నారు. ఇఖ మాటాడకండి. నేనుపోయి నీళ్ళియవలెను. (అని లేచిపోవుచున్నది.)

---

౨. ప్రదేశము—పూటకూటియింటిలోని వీధియరుగు.

[పైడిపాటి పాపావధానులును, బంధకవి భానుమూర్తియు ప్రవేశించుచున్నారు.]

పాపా—భానుమూర్తిగారూ! చాపమీద కూర్చోండి.

భాను—వంటచేసిన తలవెంట్రుకల వెధవ మొవ్వరొ కాని పాకం దివ్యంగా చేసింది సుమండీ,

పాపా—ఆవిడె వక్క పాకంమాత్రమే కాదు, అన్నీ మీవంటి వారి కనుకూలంగా వుండేలాగుననే చేస్తుంది. పెద్దింటిపెద్దయ్యగారని చెప్పకోగా వినలేదా?

భాను—విన్నాను. ఆయన గొప్పభాగ్యవంతుడుకాడా? ఆయన పోయినాడట భార్య యెక్కడవున్నది?

పాపా—మీరిప్పుడు శ్లాఘించిన తలవెంట్రుకలవెధవే పెద్దయ్యగారిభార్యా. ఈవిడె పూర్వంఅటుకులు కొట్టుకుంటూవుండేది. సంహ్వత్సరాన్నుంచి వంటపూటితనం చేసుకుంటూవున్నది.

భాను—పెద్దయ్యగారెంతో భాగ్యవంతులయివుండగా అంత గొప్పవాడి భార్యాకు యిటువంటిగతి యెందుకు సంభవించింది? ఆమె గారిచరిత్ర మొదటినుంచీ చెపుతారా?

పాపా—ఈవిడె పెళ్లినాటికి మూడేళ్ళచిన్నది. పెద్దయ్యగారి కప్పటికే అరవయి సంహత్సరాలు వున్నవి. పెళ్ళిఅయిన తరువాత కూడా ఫదిసంహ్వత్సరాలు బ్రతికినాడు.

భాను—అయ్యో! ఆయనజీవితకాలంలో భార్యయీడేరి అక్కరకు వచ్చిందేకాదా?

పాపా—పెనిమిటి ముసలివాడుగనుక భార్యా వేగిరం అక్కరకు రావాలేనని ప్రతిదినమూ మినపసున్ని మొదలయినవి పెట్టితల్లిదండ్రులు తమకూతుర్ని బలిపిస్తూవుండేవారు. పెళ్లిఅయింది మొదలుకొనిఅత్తగారూ మామగారూఅల్లుడివద్దనేచేరినారుగనుక వారుయేమికావాలెనంటే అవల్లా కూతురికి పెడుతూవచ్చేవారు. పెద్దయ్యగారు సంహ్వత్సరానికి పోతారనంగా చిన్నదిరజస్వలకాకముందే గర్భాదానం జరిగింది, ఆరాత్రిశోభనపుపెళ్లికొడుకు పెళ్లికూతురిమీద చెయ్యయినా

వెయ్యలేదని తలుపుకంతల్లోంచి చూచిన అమ్మలక్కలందరూ చెప్పుకున్నారు.

భాను—తుదకు పెద్దయ్యగారు యీ మెరజస్వలా మహోత్సవం కళ్ళారాచూచి మరీపోయినారా? చూడకుండానే పోయినారా?

పాపా—పుత్రసంతానం అయినరెండుమాసాలకల్లాయీ మెసమర్తాడి శక్తివంచనలేకుండా సంతానంకోసంబయటపాటుపడి మొగుణ్ణి పున్నామ నరకంలోనుంచి తప్పించడానికే ప్రయత్నం ఆరంభించింది గాని, యేటాయేటాపెళ్ళాంబిడ్డలు కంటూవుండగా కన్నులపండుగగా చూచుకుంటూవుండేభాగ్యం పెద్దయ్యగారికి లేకపోవడంచేతనూ పుట్టబోయే సంతానానికి భూమిమీద బ్రతకవలసినయోగం లేకపోవడం చేతనూ కొన్నిమాసాలకు భర్తృవియోగం సంభవించియీ మెకృషి సఫలమయిందికాదు. లోకంలోఅందరికీభార్యాలుపెద్దవాళ్ళయినకొద్ది సంతోషం యెక్కువకావడం సహజమయివుంటూవుండగా, అదియేం గ్రహచారమోకాని పెద్దయ్యగారికిమాత్రం భార్యాకువయసువచ్చిన కొద్దీవిచారం యెక్కువకావడం మొదలుపెట్టింది. ప్రతినిముషమూ భార్యాను విడవకుండా కనిపెట్టుకొనివుండి ఆవిడెను యెవరుయేమన్నా కనిపించుకునివస్తూ యెంతోమోహంతోసంచరిస్తూ వుండేవాడయినా సమర్తాడిన మర్నాటినుంచీభార్యయొక్కనవ్వుమొగంచూచినప్పుడెల్లా తెల్లతెల్లబోతూ, ఆవిడయవ్వనంతలుచుకునిదిగులుపడుతూ, బెంగపెట్టుకుని ఆదినానికాదినం క్షీణించి దేహమంతా పాలిపోయిభార్యయొక్క పరోపకారం చూడలేక లేచిపోయినాడేమో అన్నట్లుగాసాధ్యమయినంత శీఘ్రంగానే పెద్దయ్యగారు యీలోకాన్ని విడిచిపెట్టినారు.

భాను—పెనిమిటి మరణానంతరం యేమిజరిగింది?

పాపా—విభక్తికుటుంబమని చెప్పి చిన్నమ్మమీద కర్తవ్యంపెట్టి దినవారక్రియలు తండ్రి వకరిచేత చేయించినాడు. అదేప్రకారంగా సమిష్టి కుటుంబంఅనిజ్ఞాతులుకూడా వేరేవుత్తరక్రియలుజరిగించినారు. ఫదిదినములూ వెళ్ళిపోగా నజ్ఞాతుల్లోవకడు తమదిఅవిభక్తకుటుంబం గనుక పెద్దయ్యగారి ఆస్తికంతా తానేకర్తననివ్యాజ్యంతెచ్చినాడు. వారందరూవిభక్తులయినందుకుసాక్ష్యంగావాటాలజాబితానుకోర్టులో దాఖలుచేసిచిన్నమ్మతరఫునవకప్లీడరు వాదంచేసినాడు కానివాటాల జాబితాలో వ్రాళ్ళుచేసినవాళ్లు వారివద్దలంచంపుచ్చుకుని తిరిగిపోయి నారు. వ్యాజ్యం విమర్శకు వచ్చినప్పుడు పాతమునసబుగారుఅన్యాయం వేలంపాడించి పెద్దపాటమీద కొట్టివెయ్యడానికి నిశ్చయించుకునివాది పక్షం తీర్పుచెయ్యడానికి సిద్ధమయినాడు. ఇంతలో యీసంగతి తెలిసి ప్రతివాది తనమాన్యంలో వకభాగము మునసఫుగారి బంధువునిపేర అమ్మివేసినట్టుదస్తావేజువ్రాసియిచ్చివ్యాజ్యం తనపక్షంచేయించుకుంది.

భాను—ఆన్యాయాధికారిపేరు శ్రీధరులుకాదా? ఆయనవుభయ పక్షాల వారివద్దనూ కూడా లంచాలుపుచ్చుకుంటూ వుండేవాడని విన్నాను.

పాపా—ఆయనపేరేమోనాకు తెలియదు. మొదటిఅక్షరం 'శ్రీ' అనిమాత్రం జ్ఞాపకంవుంది. పేరు యెవరైతేనేమి? ఆన్యాయాధిపతి వ్రాళ్ళు తమనికావన్నసాక్షులనుతప్పుసాక్ష్యంయిచ్చినందుకుదండిస్తా నని కొట్లోపెట్టించివకదినంవుంచి తలవక్కటికిరెండేసివందలురూపా యల చొప్పున పుచ్చుకొని వదలిపెట్టినాడు. ఆ న్యాయప్రభువు వాది వద్దకూడా కొంతసొమ్ము పుచ్చుకుని ఖర్చులిచ్చుకో నక్కరలేకుండా తీర్పులో వ్రాయడమేకాకుండా ప్రతివాది అనంతరముమాన్యంతనకు చెందేటట్టుగా డిక్లెరేటరీవాహా తెచ్చుకోవచ్చుననికూడతీర్పులో అవ

కాశం కలుగజేసినాడు. తనసాక్షులు తిరిగిపోయినప్పుడు వ్యాజ్యంవాది పక్షం అవుతుందేమో అని జడిసి, భర్తగారు ఋణాలుచేసినట్టు మరి వకరిచేత వ్యాజ్యం వేయించుకొని ఆబాకీలకుచిన్నమ్మ రుజువుమోశ్ దాఖలుచేసింది. తీర్పుకాగానే ఆవాది తీర్పు మొత్తంక్రిందమరికొంత భూమి వేలంవేయించి తనడిక్రీసొమ్ము అసలుఫాయిదాలతో రాబట్టు కొన్నాడు.

భాను—ఆమెతరఫున పనిచేసినందుకు ప్లీడరు యేమిపుచ్చు కున్నాడు?

పాపా—ఆప్లీడరు మంచివయసులోవున్నవాడు. చిన్నమ్మకూడా కొత్తగానేకదా యవ్వనంపొందింది. అతడు రాత్రిభోజనంచెయ్యగానే బయల్దేరిప్రతిదినమున్ను జోరునవర్షంకురుస్తూవున్నామానకుండావచ్చి చిన్నమ్మయిల్లు చేరుతూవుండేవాడు. అటుతరువాత వారిద్దరూపడక యింట్లో ప్రవేశించి తలుపులులోపల గొళ్ళెంపెట్టుకుని నాలుగుఘడి యలసేపువుండి వెలపటికివస్తూవుండేవారు. వారు లోపలయేమిచేసు కుంటూ వుండేవారో చూచినవారు యెవ్వరున్ను లేరుకాని వారు వ్యాజ్యంవిషయంలో లోపల రహస్యం మాట్లాడుకుంటూ వుంటారని అడిగిన వారితో ఆమెతల్లీదండ్రీచెపుతూవచ్చేవారు. వ్యాజ్యంతీర్పుకాక మునుపే చిన్నమ్మకుపుత్రసంతానం కలిగిందని లోకులుమాత్రంచెప్పు కుంటారు. ఆమాటే నిజమయినట్టయితే వకవేళ పుట్టగానే స్వర్గానికి పోయినాకానీ ఆప్రథమపుతుడే తప్పకుండా పెద్దయ్యగారినిపున్నామ నరకంనుంచి ముక్తున్నిచేసివుంటాడు. ఈప్రవాదకలిగిన కాలంలోనే చిన్నమ్మయింటికి యెదురుగుండావున్న చెరువుగట్టుమీద చంపబడ్డ అప్పుడుపుట్టిన పురుషశిశువు వకటి కనబడ్డది. ఆశిశువుముఖాన్నిసందే హంలేకుండా చిన్నమ్మముఖంపోలికకూడాకొంచెం కలిగివున్నది.

భాను—వ్యాజ్యం తనపక్షం అయినతరువాత చిన్నమ్మ యేప్రకారంగా ప్రవర్తించింది?

పాపా—వ్యాజ్యంతనపక్షంకాఁగా నేప్లీడరుగారిసలహామీద తన తదనంతరంకూడా జ్ఞాతులకు చెందకుండా చెయ్యడంనిమిత్తంమాన్యాలన్నీ అమ్మివేసిచిన్నమ్మరొక్కంచేర్చుకున్నది. ఆమెతల్లిదండ్రులున్నుకూతురుముండా మొయ్యడంవల్ల కలిగిన అయిశ్వర్యం కొంతకాలం అనుభవించి మనమలనూమనమరాళ్ళనూ చూడకపోయినాకూతురు కడుపుతో వుండడంమాత్రం చాలాసార్లు చూచి సంతోషించే లోకాంతర గతులైనారు.

భాను—తల్లిదండ్రులు పోయేటప్పటికి చిన్నమ్మస్థితి అంతగా చెడి పోలేదు కాబోలును. అటుతరువాత యేమిజరిగింది?

పాపా—పూర్తిగా చెడిపోలేదు. మొట్టమొదట దాము పెళ్ళి చెయ్యకమునుపు యేస్థితిలోవుండేదోఆస్థితిలో కేమళ్ళీకుచూర్తెను తెచ్చి మరీవారు కాలంచేసినారు. తరువాత చిన్నమ్మ సర్వస్వతంత్రురాలై లోపల వక్కత్తేవుండలేక తరుచుగా విధిగుమ్మంలో నేవుంటూ చాలా మంది మొగస్నేహితులను సంపాదించుకుని రాత్రిళ్ళుభయంచేత డబ్బిచ్చిఅయినా యెవరినైనావక్కణ్ణిలోపల తనతోకూడాపడుకోవడానికి సహాయంతెచ్చుకుంటూ "పరోపకారార్థమిదంశరీరమ్" అన్న వాక్యాన్ని మరవకుండా ప్రవర్తిస్తూవుండేది. ఈప్రకారం జరుగుతూ వుండగా వకమంత్రవేత్త చిన్నమ్మయింటికి తరుచుగా వస్తూఆవిడకు ధనపిశాచం సోకివున్నదని తెలుసుకుని తన వుపాసనాబలంచేత దాన్ని నేర్పుగావదలించి తన స్వాధీనంచేసుకుని తన దారినిపోయినాడు. ఆ పయిని జీవనం జరగడమే కష్టమయి యామెఅటుకులుకొట్టుకుంటూ దారిద్ర్యాంజన ప్రభావంచేత తెలివితెచ్చుకొనిమునుపటిస్నేహితులకు

తానివ్వడం మాని వేసి తానే స్నేహితులవద్ద కొంచెం కొంచెంగా పుచ్చుకోవడాని కారంభించింది.

భాను—అటుకులవ్యాపారం మాని వేసి చిన్నమ్మ యీపూట కూళ్ళ వ్యాపారం యెందుకారంభించింది?

పాపా—తన చీకటివ్యాపారానికిఅటుకులుకొట్టుకోవడంఅంతగా అనుకూలంగాకనపడకపోవుటచేతనూ, అప్పుడువచ్చేవాళ్ళందరూ వెధవలూ యేకాదశీవ్రతాలూ మొదలయినవిచేసే ముసలివాళ్ళూ కావడంచేతనూ, తనవృత్తికనుకూలంగావుండే వ్యాపారం యేదని ఆలోచించి బుద్ధిమంతురాలుగనుక పూటకూటితనానికిమించిందిమరివకటి లేదని నిముషంలో కనుక్కొని వెంటనేఅన్నప్రదానారంభించింది. ఈనిరతాన్న ప్రదానంచేత ఆమెకీర్తి క్రమక్రమంగా దేశమంతటా వ్యాపించడంచేత యెతందూర్నాన్నుంచివచ్చినవారయినాంయీవిడెను చూచి వకటిరెండుపూటలయినా అన్నపానాదులచేత తాము తృప్తి పొందిఆమెనుకూడా సంతుష్టిపొందించి సత్కరించకుండాపోయేవారు కారు. ఆమెకూడావచ్చినవారినందరినీసమస్తోపచారాలచేతనూగౌరవపరిచి, ఎవరితో యెక్కడయే ప్రకారంగాసంభాషణచేసివారిఅభిమతం తీర్చవలెనో ఆప్రకారంగా జరిగిస్తూ మంచిపేరు తెచ్చుకుంటూ వున్నది. ఈనిరతాన్నప్రదానాన్నిపట్టి యీమెయిల్లు రాత్రింపగళ్లు సదా సందడిగావుండి కాశీలోవున్నఅన్నపూర్ణసత్రాన్నిమించివున్నది. ఈరెండు దినాలనుంచీ మీరున్నుచూస్తూవున్నారుగదా!

భాను—అవును. చూస్తూవున్నాను. ముడుగులుపెట్టుకుని దినానికి పదిసారులువచ్చి గదిలో గుసగుసలాడి పోతూవుండే బుగ్గమీసాల బ్రాహ్మడు యెవరు?

పాపా— ఆయనే యిప్పుడుచిన్నమ్మకుమనసుకలిసిన మిత్రుడు. అయినా కానీ యిప్పుడామెకు ధనలక్ష్మిఅంతక టెనూపరమాప్తురాలు గనుకఅలక్ష్మితో వచ్చినవారి నెవ్వరినీ అత్యంతప్రియుల్నిగా సంభావించి సంతోషపెట్టకుండా పంపదు. అందుచేత యిప్పుడున్నగదులు చాలకకొత్తగా కొన్నిగదులుకట్టించి యిల్లుపెంపు చేయించవలెనని ప్రయత్నం చేస్తూవున్నది.

భాను—ఆమెయింతటి ప్రసిద్ధిని పొందడానికి విశేషశ్రమను పుచ్చుకుంటూ వుండడముచేత లోకంలో జనసంఖ్యను వృద్ధిచెయ్యడానికి సమర్థురాలుకానట్టు నేను తలుస్తాను.

పాపా—ఇప్పుడామెకు వైద్యులుకూడాఅనేకులు మిత్రులయినారు. అందుచేత వారు తమయావచ్ఛక్తినివినియోగించిఆమెకుశిశుహత్యలవల్ల దోషంకలుగకుండా పిండాల్ని జీవంరాకముందే గర్భనరకాన్నుంచి తొలగించి భూభారాన్ని తగ్గిస్తూవున్నారు. ఆకారణంచేత మునుపటివలె తొమ్మిదినెలలకు వకటికాకుండా యిప్పుడు తొమ్మిదినెలలకు మూడువంతున గర్భస్రావాలు జరుగుతూవున్నవి.

భాను-ఇలా జరుగుతూవుంటేప్రజలుహర్షించివూరుకున్నారా? కులంలోనుంచి వెలివెయ్యలేదా?

పాపా—ఆమెయిప్పుడు ఫదిమందిలోనూ మహాపతివ్రతగా యెంచబడుతూ వున్నది. చుట్టుపట్లయెవరియింటపిత్రుకార్యంవచ్చినా ఆమెనే వంటకు పిలుచుకునిపోయి పిత్రుదేవతలకు గతులునిలుపుకుంటూవుంటారు. ఆవిడ సర్వపాపపరిహారార్థంగా మొన్నచేసినలక్షవత్తులవ్రతానికి జరిగిన సంతర్పణలో స్వయంగా వంటచేసినప్పుడు అహితాగ్నులందరూవచ్చి భోజనాలుచేసి పావనులైనారు. అప్పుడు వక్క బ్రాహ్మడు ఆమెచేతిపాకం పుచ్చుకోనన్నందున గ్రామంలోని సభాపతులందరూ చేరి అతణ్ని వెలివేసినారు.

భాను—గ్రామంలోవారు వుపేక్షచేసి వూరుకున్నా యిటువంటి పనిచేసి యీమె ప్రజలలో యేప్రకారంగా తలయెత్తుకుని తిరుగుతూ వున్నది?

పాపా—ఆమెకు వచ్చిననీతులు లోకంలో యెవ్వరికీరావు. ఫదిమందిచేరినప్పుడుతనపతివ్రతాధర్మంతానేవెయ్యినోళ్ళమెచ్చుకుంటూ లోకంలోని సంసారస్త్రీలందరూవ్యభిచారంచేత పాడవుతూవున్నారనీ తనమాటలువిని వారిని శిక్షించే నాథుడులేక లోకంచెడిపోతూ వున్నదనీ చెప్పుతూవుంటుంది. పరపురుషుల మొఖమయినా చూడకుండా వుండే పతివ్రతలలోసమేతూ యీమె రంకులు కట్టనివారొకరూ లేరు.

భాను—ఇటువంటి నష్టాలన్నీ తల్లిదండ్రులు డబ్బుకాశపడి కడుపునపుట్టిన బిడ్డలను ముసలివాళ్ళకు కట్టిపెట్టడంచేత కలుగుతూ వున్నది. కన్యాశుల్కం పుచ్చుకునేవార్ని ఫదిమందీచేరి వెలివేస్తే బహునష్టాలు మానిపోతయి.

పాపా—ఈచెప్పినవిమాత్రమే కావు. చిన్నమ్మసుగుణాలు చెప్ప వలసినవిలక్షలువున్నవి. తమయింటికివస్తూవుండే పురుషులసంఖ్యనానాటికి వృద్ధి అవుతూవున్నందున వారికందరికీ కావలసిన సదుపాయాలు చేసి సమర్థించడానికి వంటరికత్తె కావడంచేత సమర్థురాలుగాక వారి వుపచారంనిమిత్తం కొందర్నిజీతాలకుకుదిర్చి బాగా పనిచెయ్యడానికి దేహపటుత్వంకలిగి పడుచుతనంలోవున్న పనికత్తెలను మాత్రమే యింట్లోవుంచుకున్నది. యిరుగుపొరుగు స్త్రీలకుకూడా వేదాంత ధర్మాలు వుపదేశంచేసి వారిని తనమార్గానికి దింపి పరోపకార పారీణురాళ్ళనుగాను ధనికురాళ్ళనుగాను చేస్తూవున్నది. కాబట్టి యీవిధి స్త్రీలకందరికీ యిప్పుడీమె గురుపీఠము. ఈకలికాలంలో కన్యావిక్రయం మాన్పించడానికి ప్రయత్నంచేసే వారెవరు? పెద్ద లందరూ తమకదిలాభకరమయినపని అనిగ్రహించి యీఆచారాన్ని

నృద్ధిపొందించడానికే చూస్తూవున్నారు. ఇఖ చిన్నవాళ్ళమాటలు వినేవారెవరు?

భాను—ఈరోజంతా రంకుపురాణంతోనే కాలక్షేపంచేసి నాము. నాకీరెండు దినాలనుంచీ యీమెచరిత్ర పూర్తిగా తెలిసింది కాదు. ఇదివరకు భోజనంచేసినందుకు ప్రాయశ్చిత్తంచేసుకుని యీపూటనే మరివకచోట బసచేస్తాను. సెలవు దయచేస్తారా వెళుతాను.

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు)

స మా ప్త ము.

వ్యవహార ధర్మబోధిని.

ఈనాటకమునందువచ్చు పాత్రములు.

—:o:—

సూర్యనారాయణరావుపంతులు—వాదిప్లీడరు.

బాపిరాజు—ఏజెంటు.

రామయ్య—ప్లీడరు గుమాస్తా.

పీరన్న—కాపు, వాది.

కామావధానులు—ఒకవ్యాజ్యెగాడు.

బడేసాహేబు—జవాను.

సీతాపతిరావు—ప్రతివాది ప్లీడరు.

శేషాచార్యులు—ప్లీడరు గుమాస్తా.

దొరయ్య—ప్రతివాది.

సోమయాజులు, చలపతిరావు, కామరాజునాయుడుగార్లు—ప్లీడర్లు.

భాస్కరరావు—గుమాస్తా.

ఆనందరావు—డిస్ట్రిక్టుకోర్టు గుమాస్తా.

పుల్లయ్య, వెంకయ్య—సాక్షులు.

దానయ్య—మునసబుకోర్టు బేటామీను.

వెంకటరత్నము—కరణము.

సత్తెప్ప—పెత్తనదారు.

గుర్రాజు—మేజస్ట్రేటు గుమాస్తా.

మునసబుగారు, తహస్సీల్‌దారు. డిప్టిక్‌కలక్టరు, గుమాస్తాలు, హెడ్డుకనిష్టేబిలు, కనిష్టేబిలు, డిస్ట్రిక్టుకోర్టు డఫేదారు, జమాదారు, కాపులు, కోమటి, యెఱుకలవాఁడు.

వ్యవహారధర్మబోధిని.

ప్రథమాంకము

౧. స్థలము—ప్లీడరుయొక్క కచేరీసావిడి.

[ప్లీడరుయొక్క గుమాస్తా మొదలగువారు కూర్చుండియుండగా, పల్లెటూరినుండివచ్చిన కాపును అతనియేజెంటును ప్రవేశించుచున్నారు.]

బాపిరాజు (ఏజెంటు)—సూర్యనారాయణరావు పంతులుగారున్నారా?

రామయ్య (గుమస్తా)—ఓహోహో! బాపిరాజుగారా? దయచెయ్యండి. పంతులవారింకా శశిరేఖయింటికాడనుంచి రాలేదు. వచ్చేవేళ అయినది.

బాపి—ఇప్పుడు వేసేఘంటలెన్ని? పంతులుగారు దంతధావనం బోగందానియింట్లోనే చేసివస్తారా? లేక యిక్కడికివచ్చినతరువాత చేసుకుంటారా?

రామ—ఈగడియారప్రకారం యెనిమిదిఘంటలు కావచ్చినది. ఇదివరకు అరఘంట స్లోగా నడుస్తూవున్నది. పంతులుగారు అన్ని అవశిష్టాలూ అక్కడనే తీర్చుకొనివస్తారు. రావడంతోనే మీతో మాట్లాడి మీకార్యం ముందుగా సరఫరాచేసి మరీవకపని చూసుకుంటారు. నావెనుకటి వాలంటరీబాపతు నాలుగణాలూ దయచేశారుకాదుగదా?

బాపి—ఏమోయివీరన్నా! యింకా నిల్చునేవున్నావా? చెప్పులజోడు కిందవిడిచివచ్చి అలాచాపమీద మూలగాకూర్చో. రామయ్యగారిని యెరుగుదువా? ఈయన పంతులుగారిగుమాస్తా. నీవ్యాజ్యం

లో మంచిపనిచేస్తారు. వ్యాజ్యం గెల్చినతరువాత మంచిబహుమతీ చెయ్యవలెను.

వీరన్న (కాపు)—రామయ్యగారూ! దణ్ణాలండి.

రామ—దీర్ఘాయుష్యమస్తు. శీఘ్రమేవ లాభప్రాప్తిరస్తు.

బాపి—వీరన్నా! పిఱ్ఱలమీాదిబట్ట కిందికితీసుకొని బాగాచతికిల పడికూర్చో. యీాలాగేనా పెద్దమనుష్యులయింటికి వచ్చినప్పుడు కూర్చోవడం?

రామ—నీవ్యాజ్యం యేపాటిమొత్తం?

వీర—నాకేమీా తెల్దు. బాపిరాజుగారి నడగండి. అన్నీ ఆయనే మనవిచేసుకుంటారు.

రామ—పంతులవారు వస్తున్నట్టున్నారు. మాటలువినబడుతూ వున్నవి.

[ప్లీడరుగారు పదిమంది పార్టీలతోవచ్చి తివాసీమీాదకూర్చున్నారు.]

వీర—(నిలువబడి) పీడరుగారు దణ్ణాలండి.

సూర్య—(నఖశిఖపర్యంతము పారఁజూచి) నీదేవూరు?

బాపి—ఇతను కేసారంగ్రామపెత్తనదారు. కొంచెం భూసమ్మం ధమైన వ్యాజ్యంవుండగా తమదర్శనం చేసుకోవలెనని వచ్చినాడు.

సూర్య—నీవు యెవరిమీాదనైనా వ్యాజ్యంవేస్తావా? నీమీాద యెవరైనా వ్యాజ్యం వేశారా?

బాపి—ఇతనే అన్నగారిమీాద వ్యాజ్యం వెయ్యవలెనని మీాకు వకాల్తునామా యివ్వడానికివచ్చినాడు. మీారు ఫీజులోసదుపాయం చేసి ఇతనితరపున బాగా పనిచెయ్యవలెను. (అని చెవిలోరహస్య ముగా) వీడు డబ్బుగలవాఁడు ఫీజు దిట్టముగా మాట్లాడుకోండి.

సూర్య—పనికేమి మీాచిత్తంవచ్చినట్లు చేస్తాను—రామయ్యా! వకాల్తునామావ్రాసి అతనిచేత దస్కతుచేయించుకొని నీవున్నూ బాపిరాజుగారున్నూ సాక్షివ్రాళ్లు చెయ్యండి.

రామ—నీయింటిపేరేమి?

వీర—మాయింటిపేరాండి? తవ్వలోళ్లు.

రామ—నీవు యెవరిమీద వ్యాజ్యం వేస్తావో వారిపేరు చెప్పు.

వీర—మాఅన్నగారిమీద.

రామ—కాదోయి. పేరు.

వీర—అతనూ గ్రామానికి పెత్తనదారేనండి. నాజిరాయతీ భూమి—

రామ—అదంతాయెందుకు పేరుచెప్పవోయి.

బాపి—అన్నీ నేనుచెపుతాను వ్రాయండి. అతనిపేరు తవ్వల దొరయ్య, కేసారం గ్రామంలోవున్న పందుంజిరాయతీభూమి ప్రతి వాదివద్దనుంచి రాబట్టుకోవడమును వ్యాజ్యం.

రామ—వీరన్నా! నీవు చదువుకొన్నావా?

వీర—నేను సదువుకోలేదండి.

బాపి—నీవు వ్రాలుచెయ్యడం నేర్చుకొన్నావుకాదా? ఆకింద వ్రాలుచెయ్యి.

వీర—(అయిదు వేళ్లతోనుకలముపట్టుకొని) యిక్కడనేకాదూ?

(అని వకటిబంతి అక్షరములతో "యిరనవ్రలు" అని వ్రాసెను.)

రామ—ఏమోయి! వ్రాలుచెయ్యడానికే కలమంతా శిరా చేసినావు? అయ్యో! వకాల్తునామామీదకూడా శిరాపోసినావా? ఇలాతే; యెఱ్ఱకాకితంతో అద్దుతాను.

సూర్య—బాపిరాజుగారూ! దస్తావేజు లేమయినావుంటే రామయ్యచేతికివ్వండి.

బాపి—రామయ్యగారూ! యివి పుచ్చుకోండి. ఇది అన్న గారూ ఇతనూకలిసి వ్రాసుకొన్నదస్తావేజు. ఇది కలెక్టరుగారిపద్ద

అర్జీ యిచ్చుకుంటే శివిల్ ద్వారా న్యాయంపొందవలసినదని యిచ్చిన యిండార్సుమెంటు.

సూర్య—ఏమోయిపాపయ్యా! మాకు పాడికి బహు యిబ్బందిగా వున్నది. పూటకు శేరుపాలుయిచ్చే ఆవు నొకదాన్ని తోలిపెడుదూ.

పాప—యీవేళ మావ్యాజ్యం హీరింగుగదా. గెలవనిత్తురూ. రెండావులను తోలిపెడుతాను.

సూర్య—మొన్న చెల్లూరివారి స్థలాకాజువ్యాజ్యం గెలిపించినందుకు యాభైరూపాయలుపెట్టి ఈముగురులజోడు చేయించి బహుమతీ చేసినారు. వెధవవ్యాజ్యం వ్యాజ్యమయితే యిరవై రూపాయలదేకాని, అది మహాప్పుదలమీదవచ్చినది. ఆవ్యాజ్యంలో నేను వాదులతరపున వకాల్తునామా పుచ్చుకోకపోతే ప్రతివాదులు నూరురూపాయలు యిస్తామన్నారు. నేను హీరింగు చేసేకాలమందు కోర్టు యెగిరిపోయినది. ముసలబుగారు నావాదంచూచి హాశ్చర్య పోయినారు. ప్రతివాదిప్లీడరు నాముందర మాటాకలేక నేను రేజన్సు చెపుతూవుంటే తలవంచుకొని వూరుకున్నాడు.

బాపి—మీరుపెట్టుకొన్న బంగారపుమొల్తాడుకూడా బహుమతీచేసినదేకాదా?

సూర్య—అవును. మొన్నటిస్థలవ్యాజ్యంలో కాకర్లపూడివారు యిచ్చారు. నూరు రూపాయల కిమ్మతుచేసే నివేశనప్పెరడున్ను ఫదిరూపాయలు ఖరీదుగల ఫలవృక్షములున్నూ రావలెనని వాదులు దావాతెచ్చినారు. వాదులతరపున సాక్ష్యంపూర్తిగా రుజువయింది. క్రాసుయెగ్జామినేషన్‌లో యేలాగంటి సవాళ్ళువేసి సాక్షులను పడగొట్టినానో మీరుచూచినారుకదా? ఆలా రుజువుపడిన వ్యాజ్యం హీరింగులో నేనుచెప్పిన వక్కపాయంబుమీద యెగిరిపోయింది.

కోర్టులో నాతో సమానంగా పని చెయ్యగల ప్లీడరు నొక్కణ్ని చూపండి. కాకర్లపూడివారిపక్షమున నేనుతప్ప మఱివకప్లీడరు వకాల్తునామా పుచ్చుకుంటే వ్యాజ్యం వాదులపక్షమయినదే. వ్యాజ్యం తమపక్షమయినదన్న సంతోషముచేత సుబ్బరాజుగారు తక్షణం రెండువందలరూపాయలు పెట్టి మొల్తాడుచేయించి నేను పడ్డశ్రమకు యీ బహుమతీ చాలదనిచెప్పి దగ్గిరవుండి మొలకు పెట్టించినారు.

బాపి—మొన్న యీడిగవాళ్ళు తెచ్చిన పదిరూపాయల వ్యాజ్య మేమయినది? అందులోమీకు ఫీజు యేమాత్రంయిచ్చినారు?

సూర్య—అదీ మాపక్షమే చేయించినాను. ఇఖ నేను పట్టిన వ్యాజ్యం పోవడమనేదిలేదు. ఎంతచిన్న కేజులోనూ నేను యిరవై రూపాయలకు తక్కువఫీజు పుచ్చుకోను. అలాయిచ్చేవారే నావద్దకు వస్తారు. మూడూనాలుగూ పుచ్చుకొని పని చేసేప్లీడర్లూవున్నారు. వాళ్ళచేత పనిచేయించుకునే వాళ్ళపాట్లు చూడడంలేదా?

బాపి—అందుచేతేకదా వీరన్నను యింతమంది ప్లీడర్లుండగా మీవద్దకేతీసుకువచ్చినాను. ఈ కేజులో మీరు బాగాపనిచెయ్యవలెను.

సూర్య — ఫీజు యెంతయెక్కువిస్తే అంత దివ్యంగాచేస్తాను. మాకు నాలుగురూపాయలు యెక్కువయివ్వడమల్లా పార్టీకి లాభమే కాని నష్టంకాదు—వీరన్నా! నీది స్థలసమ్బంధమున చిక్కువ్యాజ్యం కదా? విస్తారంపనిచెయ్యవలెను. ఫీజు యేమిచ్చుకుంటావు?

వీర—తమరంతకుతక్కువ పుచ్చుకోరుగనుక యిర్వయి రూపాయాలు దాఖలుచేసుకొంటాను. మేలినవారను గ్రహించవలెను.

సూర్య—ఛీ! కల్లునీళ్ళుగీసుకొనే గమళ్ళవాడిచ్చినాడే పదిరూపాయలవ్యాజ్యంలో యిరవై రూపాయలఫీజు. నీవు వూరికి పెత్తనదారీ

చేస్తూ స్థలవ్యాజ్యంలో చచ్చుఫీజు యిరవయిరూపాయలా యిస్తా నంటావు?

బాపి—ఇందులో ప్రస్తుతం పాతికరూపాయలుయిచ్చుకుంటాను. వ్యాజ్యం గెల్చినమీదట మిమ్మలినిసంతోషపెడతాడు. అందుకు నాది పూచీ. నేను చెప్పినప్రకారం అంగీకరించవలెను.

సూర్య—బాపిరాజుగారు సిఫారుసు చేసినారుగనుక ఆప్రకారం వప్పుకున్నాను. లేకపోతే యీవ్యాజ్యంలో అధమము నూరురూపాయల ఫీజుకు తక్కువపుచ్చుకోను. ఏవీ రూపాయలు తే.

వీర—(బొడ్డుకొంగునుంచి మూటతీసి) ఇయిగోనండి యిరవయి రూపాయలున్నయి ప్రస్తుతంవీటితో పనిజరిగించండి.

సూర్య—(రూపాయలు చేతిలోపుచ్చుకొని మరల కిందపెట్టి) యివి యేమూలకువస్తవి? యింకా నలభై రూపాయలు కావలెను. వకాల్తునామా అచ్చుఫీజు రూపాయి; వాలంటరీ అర్ధరూపాయి: వకాల్తునామా స్టాంపుఖరీదు అర్ధరూపాయి? కంప్లయింటుస్టాంపు ఖరీదు పాతికరూపాయలు: ఫయిలు చేసుకున్నందుకు హెడ్డు గుమాస్తాకు నాలుగురూపాయలు; చిల్లరఖర్చులు నాలుగు రూపాయలు; వెరశి నలభైరూపాయలు. నాఫీజుఅట్లావుండగా ఖర్చులకే యింకా పక్తుయిరవయిరూపాయలు కావలెను.

బాపి—ఖర్చులకు కావలసిన యిరవైరూపాయలూ ఇచ్చుకో. రేపుఖూరికివెళ్ళి తెచ్చి ఫీజుసొమ్ము దాఖలుచేసుకుందుగాని.

వీర—(తలగుడ్డచెంగు పైకితీసి మూటవిప్పి) నాదగ్గిర యీ ఫదిరూపాయలూ వున్నవి. స్టాంపు రెండురూపాయలు మానాలండి.

సూర్య—కంప్లయింటుస్టాంపులో తగ్గించడముకు వల్లకాదు. సర్కారురూల్సు అలా దాఖలుచెయ్యవలెను. తక్కినఫదిరూపాయలూ యివ్వకతప్పదు.

Acc No. 10467

NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P.R.I.
Acc. No.

బాపి—భత్యఖర్చుకు పెట్టుకొన్న రూపాయ లేనుమ్ము No. రెండే చెంగున వుంటవి. ఏదీ తలగుడ్డవిప్పు. ఫీజంటే నాలుగురోజు లాగుతాడు గాని స్టాంపుకూడా ప్లీడరుగారు పెడతారా? (అని తలగుడ్డ తీయబోవుచున్నాడు.)

వీర—ఉండండి—ఉండండి నేనుతీస్తాను. (అని రెండవ చెంగుతీసి మూటవిప్పి యేడురూపాయ లిచ్చుచున్నాడు.)

బాపి—తక్కిన మూడురూపాయలూ యివిగో నేనుయిస్తాను. మీఫీజురూపాయీలు రేపులేదు యెల్లుండి మధ్యాహ్నాముకు తీసుకుని వచ్చి దాఖలుచేసుకుంటాడు—వీరన్నా! వచ్చేటప్పుడు వకమణుగు పెండలమున్న ప్రశస్తమయిన వంగవరుగు బుట్టొకటిన్నీ ప్లీడరు గారికి తెచ్చి దాఖలుచేసుకో.

సూర్య—రామయ్యా! దస్తావేజుయేదీ చూడనియ్యి. (చేతిలో పట్టుకొని) యేమోయి వట్టికాగితముమీద వ్రాయించినావుచెల్లదే.

రామ—పినాల్టీ పెడితే చెల్లుతుందేమో!

సూర్య—పినాల్టీపెట్టినా చెల్లదు. దీనికి వేరేసదుపాయం వున్నది. చెపుతాను. వీరన్నా! యెందుకయినామంచిది నీవువచ్చే టప్పుడు మరిపదిరూపాయలు పట్టుకొనిమరీరా. ఈలోగా పాతస్టాంపు జాగ్రత్తపెట్టిస్తాను.

వీర—బాపిరాజుగారూ! యెల్దామండి.

బాపి—వెళుదాము. ప్లీడరుగారితో కొంచెం నాకుమాట్లాడ వలసిన పనివున్నది. నీవు బసదగ్గిరవుండు. వచ్చికలుసుకుంటాను. వీరన్నా! ఒక్కమాటు వీధిగుమ్మములోకిరా. (అని లేచినడుచు చున్నాడు.)

వీర—(లేచి) ప్లీడరుగారూ! దండాలండి. సెలవుపుచ్చు కుంటాను.

సూర్య—వీరన్నా! మీవూళ్ళో నెయ్యి మహామంచిది దొరుకుతుందట. వచ్చేటప్పుడు మరచిపోక రెండురూపాయల నెయ్యి కూడా పట్టుకొనివస్తావు కాదా?

వీర—చిత్తం. (అని వీధిగుమ్మములోకి వెళ్ళుచున్నాఁడు.)

బాపి—(మెల్లగా) వీరన్నా! ఇందాకా నేను ప్లీడరుగారి చెవిలో చెప్పిందేమో నీవు యెరుగుదువా? పదిమందిలోనూ నీవు బీదవాడవని చెపితే బాగుండదుగనుక, చెవిలోచెప్పి ఫీజు తక్కువ పుచ్చుకొని పనిచెయ్యమని కోరినాను. ఆ మనతో నాకు వేరేపనిలేదు. నీవు వెళ్ళినతరువాత సిఫారసుచేసి వ్యాజ్యంలో బాగాపనిచేసేటట్టు బందోబస్తుచేసి మరీవస్తాను.

వీర—అన్నిటికీ మిమ్మల్నేనమ్ముకున్నాను. ఇదివరకిచ్చిన ఫదిరూపాయలూగాక, మీకింకా ఫదిరూపాయలసొమ్ము ముట్టచెపుతాను. ఎంతసొమ్ము ఖర్చుపోయి అయినా వ్యాజ్యం మనపక్షం చేయించుకోవలెను.

బాపి—అదెంతసేపు? నీవీ ప్లీడరుగారికి వకాల్తునామా యెప్పుడిచ్చినావో వ్యాజ్యం అప్పుడేగెల్చినది. నీవింటికివెళ్ళు, ప్లీడరుగారితో మాట్లాడి నేను నీవెనుకనే వస్తాను.

వీర—యేగిరంరావలెను. (అని వెళ్ళుచున్నాఁడు.)

బాపి—(లోపలికివచ్చి) వీరన్నను పంపివేసివచ్చినాను. వీడు వట్టిమలభక్షకుఁడు. తండ్రి శ్రాద్ధమునాడయినా వక్కకొత్తడబ్బు ఖర్చుపెట్టడు. తాతతండ్రులనాటినుంచీ వీడింట్లో ధనముమూలుగుతూ వున్నది, సూర్యనారాయణగారూ! మీరు వీడివద్దనుంచి డబ్బు యేలాలాగుతారో చూతాము.

సూర్య—యిఖ డబ్బులాగడముకు నాతరువాతనే. దమ్మిడీ ఖర్చుపెట్టవలసివస్తే పడిచస్తాననే వానివద్ద యేమీలేనివానిలో

ఫదేసిరూపాయలు లాగినానే. వీడెవ్వత? వీడివద్ద యెలాడబ్బుతీస్తానో తమాషాచూస్తురుగాని.

బాపి—అన్ని కేజులకువలె ఇందులో నూటికి యిరవైరూపాయల కమీషన్ పనికి రాదుసుమండీ. ఈ కేజులోసఖంఫీజునాది. సుబ్బారాయుడుగారు సఖంకంటె యెక్కువయిస్తాను, తనకు వకాల్తునామా యిప్పించవలసినదని అడగుతూవుంటే, మొదటినుంచీమీకూ మాకూ ఖాతావున్నదని మీవద్దకే తీసుకొనివచ్చినాను.

సూర్య—దానికేమి? అలాగేపుచ్చుకొందురుగానిలెండి.

బాపి—మొన్న సిరంవారివ్యాజ్యం మీరు వేళరుకోర్టుకు వెళ్ళకపోవడంచేత నిష్కారణముగా పోయినది. ఫీజంతా మీరు ముందుగానే చేతులో వేయించుకొన్నారు. వాళ్ళు రేపువచ్చి అఘోరిస్తే యేమిచెపుతాము.

సూర్య—వాళ్ళురానియ్యండి. వాళ్ళతో చెప్పి పునర్విమర్శకు పిటీషను పెట్టింతాము.

[ఝూరీచెంబు చేతిలోబట్టుకొని, తలకొక అంగవస్త్రము చుట్టుకొని, ఒక బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నాడు.]

సూర్య — కామావధానులుగారూ! యెప్పుడువచ్చినారు? కూర్చుండండి మొన్న నేనుపంపిన ఉత్తరం అందిందా?

కామా—అందేవచ్చినాను. ఏమి? సూర్యనారాయణగారూ న్యాయమయినవ్యాజ్యం ఓవరం చేయించినారుగదా?

సూర్య—నేనేమి చెయ్యను. నాశాయశక్తులా పనిచేసినాను. మీసాక్షులు తిన్నగా పలికినారుకారు. అక్కడికీ నాహీరింగుచూసిన వారందరూ వ్యాజ్యం మనపక్షమవుతుందనే అనుకున్నారు. మునసబు అన్యాయంచేస్తే మనమేమిచెయ్యము?

కామ—నాసాక్షులు వున్నదివున్నట్టు చెపుతామంటే పడ నియ్యక మీరేమేమో లేనిసంగతులు బోధించడంచేత వాళ్ళుతొం దరపడి పోయినారు. అందుచేత మునసబు వాళ్ళసాక్ష్యం నమ్మినాడు కాదు. నాపనియింతేనా? ఇంకేమయినా ఆధారం వున్నదా?

సూర్య—ఇప్పుడేమయినది? ఇంకాపయిని రెండప్పీళ్ళున్నవి. చెన్నపట్నందాకా అయినా వెళ్ళి పనిచేయించవలెనుగాని వదిలిపెట్ట గూడదు. అప్పీలుచేస్తేనిముషంలో యీతీర్పుతిరిగిపోతుంది. సాయం కాలంరండి. సావకాశంగా మాట్లాడుదాము. మునసబుగారు కోర్టుకువచ్చేవేళ అయినది. భోజనమునకు వెళ్ళవలెను.

(అని లేవఁగా, అందఱును వెళ్ళిపోవుచున్నారు.)

---

౨. ప్రదేశము—ప్లీడరుగారిచావడి.

[ప్లీడరు, గుమస్తా, కూర్చుండియుండఁగా, వంగవరుగును పెండలమును కావిడి వేయించుకొని నేతిచెంబు ఉగ్గము వేసిపట్టుకొని వీరన్న బాపిరాజుతో ప్రవేశించుచున్నాఁడు.]

బాపి—ఓరీ! కావిడి లోపలపెట్టివచ్చి యీనేతిచెంబు ఆడం గులకు చెప్పి నప్పగించిరా.

సూర్య—బాపిరాజుగారూ! దయచెయ్యండి. వీరన్నా! యెప్పు డొచ్చినావోయి?

వీర—దండాలండి. యిదేరావడం. యీజ్యం కోరటుంగో డాకలయిందాండి?

సూర్య—యెలాదాఖలవుతుంది? మునుపటిదస్తావేజు చెల్లదు. కొత్తదస్తావేజు నిమిత్తం మఱిఫదిలూపాయలు తెమ్మన్నాను తెచ్చి నావా? తెస్తేముందర్తిగా ఫదిరూపాయ లీలాగియ్యి. స్టాంపు తెప్పిస్తాను.

వీర—ఇయిగో నండి. (అని మూటవిప్పి చేతిలో పెట్టుచున్నాఁడు.)

సూర్య—రామయ్యా! ఈరూపాయలుపట్టుకొని స్టాంపులెండరు గారి దగ్గరకువెళ్ళి నేనిమ్మన్నానని నాలుగయిదు సంవత్సరాలకిందటి పాతస్టాంపు అర్ధరూపాయి కిమ్మతు చేసేది తీసుకొనిరా.

(చిత్తము అని రామయ్యవెళ్ళుచున్నాఁడు.)

సూర్య—రామయ్యా! చెవిలోమాట (అని చెవిలోమెల్లగా) నీవు దొడ్డితోవనువెళ్ళి నేనుపడుకునే గదిలో బీరువాలో కింద అరలో పాతస్టాంపులు వుంటవి. యింట్లో తాళంచెవులుఅడిగిపుచ్చుకొని యీరూపాయ లందులో వేసి నాలుగుసంవత్సరాలక్రిందటి అర్ధరూపాయస్టాంపు వకటితీసి మళ్ళీపదిలముగా తాళము వేసి వచ్చేటప్పుడుకూడా దొడ్డిదారినే వీధులోనుంచి తిరిగిరా.

వీర—రామయ్యగారెంత శేపటికి మళ్ళీవత్తారండి.

సూర్య—యిప్పుడే వస్తాడు. బాపిరాజుగారూ! మీతో మొన్న చెప్పినప్రకారం యీలోపుగా ముసాయిదా తయారుచెయ్యండి. ఇదిగో కాగితంకలమూ.

బాపి—పంచాంగం వకసారి దయచేయిస్తారా? తెనుగు సంవత్సరమూ నెలా తిథీ వారముకూ సరిఐన యింగ్లీషుతారీఖు చూస్తాను.

(అని ముసాయిదా కుదిర్చి వ్రాయుచున్నాఁడు.)

[ఇంతలో స్టాంపుపట్టుకొని రామయ్యప్రవేశించుచున్నాఁడు.)

సూర్య—బాపిరాజుగారూ! ముసాయిదా వ్రాయడమయితే వీరన్నను తీసుకుని యిక్కడనే కోమటిభీమిసెట్టిగారిల్లున్నది. వారి సావిట్లో కూర్చుండి లోపలతలుపు వేసుకొని తెలుఁగుసిరాతో పాత స్టాంపుమీద జాగ్రత్తగా సాపువ్రాస్తూ వుండండి. నేనింతలో వేరే

వక చోటికివెళ్ళి మళ్ళీవస్తాను. రామయ్యా వీరికి యిల్లుచూపించి, సావిట్లోకూర్చోపెట్టిరా. (రామయ్యవెంటఅందఱునువెళ్ళుచున్నారు.

రామ—(వారిని కూరుచుండఁబెట్టివచ్చి పంతులుగారూ! వారిని భీమిసెట్టిగారి లోపల కూర్చోపెట్టివచ్చినాను. నేను చెయ్యవలసినపని మరియేమైనావున్నదా?

సూర్య—నీవువెళ్ళి బడేసాహేబును యిక్కడికి తక్షణం తీసుకొనిరా. అతనికి కూడాలాభంవచ్చే పనిఅనిచెప్పితే వెంటనేవస్తాడు.

[రామయ్యవెళ్ళి నిమిషములో బడేసాహేబును తీసుకొని వచ్చుచున్నాఁడు.]

బడే—మహారాజ్. సలాం. అయగగార్కి శెల్వాఅయిఁదీట. యేమ్ తాఖీద్.

సూర్య—దగ్గిరగారా మారామయ్య యిల్లుచూపిస్తాడుగాని, కోమటిభీమిసెట్టిగారి సావిట్లో కూర్చున్న మనుష్యులవద్దకు వెళ్ళి దొంగ దస్తావేజు వ్రాస్తున్నారని గందరగోళంచేసి వందరూపాయలు యిస్తేనేకాని వదలిపెట్టకు. అందులో నాలుగు రూపాయలు నీకుయిస్తాను.

బడే—శబాష్ ఖామందులూదయావుంటే సిటికీలో సేస్తామ్. (అని రామయ్యవెంట నడుచుచున్నాఁడు.)

రామ—అదుగో యిల్లుచూపించినాను. నేనువెళుదునా సాహేబూ!

బడే—సంచిదీ, మీకీవెళ్లండి. నేనుఖమాయుష్ సర్ఫరాచేసికొని ప్లీడరుగార్కి దర్శనంచేస్తామ్. (అని తలుపుగుద్దుచు) లోపల యెవరూవున్నార్. నాకీతలుపు తియ్యండి. (వీరన్నవచ్చి తలుపు తీయుచున్నాఁడు.)

వీర—(వడఁకుచు) సాయబుగారూ! పనిమీదొచ్చినారు.

బడే—అరే యిక్కడయెవరో దొంగదస్తావేజ్ బనాయిస్తూ వున్నారట. అముల్ దారుగార్కి ఖబురు తెలిసి మీకీ హాజర్ పెట్టు మని హుకుమ్ ఐంది. భాంచోత్ కచేరీకీ నడ్వండి.

బాపి—(భయముతో) సాహేబు. సాహేబు. నీ కేమయినా యిస్తామువదిలిపెట్టు.

బడే—అరేభాంచోత్. మాకీ లంచం యిస్తావునోయి కచేరీకీ చెల్.

వీర—బాబూ బాబూ! నీకు యాబయిరూపాయ లిచ్చుకుంటా ను. నన్నిడిసిపెట్టు. సాయిబయ్యా! నీకు సలాము.

[అప్పుడు రామయ్య ప్రవేశించుచున్నాడు.]

బాపి—రామయ్యగారూ! మీరొక్కసారి వెళ్ళి పంతులుగారిని పిలుచుకొని రావలెను. మాకు అసాధ్యంవచ్చినది.

రామ—యేమిటి? సాహెబూ! వారినెందుకు లాగుతున్నావు?

బడే—వీళ్ళూఇక్కడ ఝూటాదస్తావేజ్ బనాయిస్తూవున్నార్. కచేరీకి నడువుచుంటే భాంచోత్ రాకుండా వున్నార్.

రామ—ఒకనిమిషం నామాటవిని తొందరపడకు. మాపంతు లుగారిని తీసుకొని వస్తాను.

[కొంతసేపటికి ప్లీడరుగారును గుమాస్తా రామయ్యయు ప్రవేశించు చున్నారు.]

బడే—హాజరత్ సలాం.

వీర—(కాళ్ళమీఁదపడి) పీడరుగారూ! నన్నురక్షించవలెను. నూరురూపాయలైనా ఇచ్చుకుంటాను. నన్నుతీసుకునిపోయి ఖైదు చెయ్యకుండా చెయ్యవలెను.

సూర్య—సాహేబూ! మాట. నీకువచ్చేలాభం యెందుకు పోగొట్టుకుంటావు? నా మాటవిని యీ కాపు చెప్పిన సొమ్ముపుచ్చుకొని

వదిలిపెట్టు. ఒక వేళ నీవు హెడ్డుపోలీసువద్దకు తీసుకువెళ్ళినా, ఆయన లంచంపుచ్చుకొని యెలాగూ వదిలివేస్తాడు.

బడే—పెద్దమనుషులూ మీకీ సెలవిస్తున్నారుగనుక, ఆలాగే శేస్తాన్. రూపాయలూ తేండి.

సూర్య—వీరన్నా! నీవిప్పు డెన్నిరూపాయలయినా ఖర్చు పోయి మానుషం దక్కించుకోవలసిన సమయం. ఏవీ నూరురూపాయలూ నాచేతికియ్యి.

వీర—(ఏబదిరూపాయలు చేతికిచ్చి) మిగిలిన రూపాయలు బసలోకెళ్ళి తీసుకుని వచ్చి యిస్తాను. సొమ్ముకు మీరు పూచీపడవలెను.

సూర్య—సాహేబూ! సొమ్ముకు నేను జామీను వుంటాను. మధ్యాహ్నము మాయింటికిరా ఇచ్చివేస్తాను. వీరన్నా! వేగిరము వెళ్ళి రూపాయలు పట్టుకొనిరా. బాపిరాజుగారూ! దస్తావేజు వేగిరము పూర్తిచేసి మీదస్తూరీ వేసి రెండు నిశాసీలూ సాక్షిక్రాళ్లూపెట్టి నాచేతికివ్వండి. (అట్లు చేసిన తరువాత అందఱును పోవుచున్నారు)

---

3. స్థలము—మరియొక ప్లీడరుగారి చావడి.

[ప్లీడరుగుమాస్తా శేషాచార్యులు కూర్చుండియుండఁగా, బాపిరాజును, దొరయ్యయు ప్రవేశించుచున్నారు.]

శేషా—బాపిరాజుగారూ! కూర్చోండి.

బాపి—సీతాపతిరావుగారు లోపలవున్నారా? వకాల్తునామా యిప్పించడానికి వక కేజు తీసుకొనివచ్చినాను.

శేషా—యెనిమిదిగంటలు వేస్తేనేకాని ప్లీడరుగారు బయిటికి రారు. మొన్ననే శంఖచక్రాంకములు వేయించుకొని, వైష్ణవేష్టి చేసినారు. ప్రొద్దున్నే రామాయణపారాయణమయి పాశురములను చదివితేకాని, స్మార్తులను చూడరు.

బాపి—మునుపు ఆదివారం ఆదివారమూ స్వాములకందరికీ గంథసేవ జరిగేది. యిప్పుడు జరుగుతూవున్నదా?

శేషా—దివ్యంగా జరుగుతూవున్నది. స్వాములందరూ తిరుమణితిరుచూర్ణములు ధరించుకొని, మెడనిండా తులసిపూసల తావళములు వేసుకొని, ద్వాదశోర్ధ్వపుండ్రములతో శ్రీమహావిష్ణువలె కూర్చుండి వుండగా, ద్రావిడభాషతో దివ్య ప్రబంధములు చదువుతూ చందనసేవ చేసేసమయములో యీసావిడికలియుగ వైకుంఠములాగున వుంటుంది.

[ప్లీడరు సీతాపతిరావుగారు ప్రవేశించుచున్నారు.]

సీతా—శ్రీమతే రామానుజాయనమః. బాపిరాజుగారూ! మీరీమధ్య నాకు వక్కకేసు యిప్పించడం మానివేసినారు. యిలా దయతప్పడం న్యాయమేనా?

బాపి—మీరీలా అనిపోతారనే వకాల్తునామా యిప్పించముకు వకరిని తీసుకొని మరీ మీదర్శనానకు వచ్చినాను. ఈకుంభకోణపు పంచెలు యెప్పుడు తెప్పించినారు?

సీతా—మొన్ననే తెప్పించినాను. మీవయిపునయెక్కడయినా మంచితులసికర్రలువుంటే సంపాదించి పెడుదురూ, రామదాసుగారు తులసిపూసల తానళముచేసి పెడుతామన్నారు.

బాపి—ప్రయత్నంచేస్తాను.—వొరయ్యా! నీకువచ్చిన నోటీసు పంతులుగారికి చూపించు.

సీతా—యితనిమీద యెవరైనా వ్యాజ్యంవేసినారా?

బాపి—యితను స్వార్జితంమీద సంపాదించుకొన్న పందుంభూమి తనకు రావలెనని అక్రమంగా యితనితమ్ముడే యితనిమీద వ్యాజ్యం వేసినాడు. ఇప్పుడితనికినోటీసు వచ్చినది.

సీతా—వాదితరపు ప్లీడరుయెవరు?

బాపి—సూర్యనారాయణరావుగారు.

సీతా—సరిసరి! అతనివ్యాజ్యంబాగానేగెల్చింది. ఆయనముండ యింట్లోకూర్చుండి పార్టీకి సమయంయిచ్చి మాట్లాడుతాడా? కోర్టుకు తిన్నగావచ్చి హీరింగుచేస్తాడా? మొన్న బోగంవాళ్ళవిషయంలో ఆయనా మరివక ప్లీడరుగారూ పబ్లీకుకోర్టులో తిట్టుకున్నందుకు మునసబుగారు యిద్దరికీ చెరివకరూపాయజరిమానా వేసి ప్రొసీడింగ్సు చేసినారు. ముండయింట్లోకూర్చుండి వేళకు కోర్టుకురానందున, నిన్నగాక మొన్ననే ఆయనపట్టినవ్యాజ్యములు రెండు మునసబు గారు కొట్టివేసి, ప్యార్టీలను నష్టం ప్లీడరువల్ల రాబట్టుకొమ్మని సెలవిచ్చినారు.

బాపి—ఇది అక్రమమయిన వ్యాజ్యంగనుక యేలాగైనాపాడు చేయించ వలెనని నేనే ఆయనకు వకాల్తునామా యిప్పించినాను. ఆతనితో తగాదాపడలేకయితను యేదుంభూమి యిస్తానని రాజీ నామాపడబోతే యిప్పుడుకూడా వృధాగా భూమియెందుకు పోగొట్టుకుంటావు. రాజీపడవద్దని యితనికి సలహా యిచ్చినాను. ఇంకా అడిగిచూడండి—యేమోయి! దొరయ్యా! నీతో అలాగని చెప్పినానా? లేదా?

దొర—మీరు సెప్పినారండి. ఇప్పుడు యీజ్జంకూడా కొట్టి వేయించవలెను.

బాపి—అద్దే. దానికేమి? వక్కనిముషంలో కొట్టివేయిస్తాను. సీతపతిరావుగారికి వకాల్తునామా యివ్వడమూ మరివకతరహాను జరగడమూకూడానా? వీరన్నచేత ఈయనకు వకాల్తునామా యెందుకు యిప్పించినాను కానుకొన్నావు? ఈయన కేవలం విష్ణు మూర్తివంటివారు. ఈయనపట్టినవ్యాజ్యం హరిహరాదులట్టిట్టయినా వ్యతిరేకంగా యెప్పుడూ తీర్పుకాదు.

దొర—అన్నింటికీ మిమ్మల్నే నమ్ముకొన్నాను.

సీతా—బాపిరాజుగారూ! ఫీజుమాట యేమి చెపుతారు? చెయ్యవలసినపని చాలావున్నది.

బాపి—వాది పదిరూపాయ లిచ్చినాడు. ఇతనూ అదేప్రకారం యిస్తాడు.

సీతా—రామానుజ! రామానుజ! అంతతక్కువఫీజు నేను యెంతచిన్న కేజులోనైనా పుచ్చుకొంటానా? ఆలాగంటి తక్కువ ఫీజు సూర్యనారాయణరావుగారివంటివారే పుచ్చుకోవలెనుగాని నావంటివారు యిరువైరూపాయలకు తక్కువెందులోనూ పుచ్చుకోరు.

బాపి—దొరయ్యా! పంతులుగారు యిరవైరూపాయలకు తక్కువపుచ్చుకోరు. పదిరూపాయలిప్పుడియ్యి. తక్కినపదిరూపాయలూ హీరింగుకాలములో యిస్తువుగాని,

దొర—చిత్తం యేమయినాకొంచెము సదుపాయము చెయ్యవలెను. (అనిరూపాయలిచ్చుచున్నాడు.)

సీతా—నాఫీజు కొంతయిచ్చినావు. యిఖఖర్చులు మరి పదిరూపాయలు కావలెను. స్టేటుమెటు స్టాంపురూపాయ; వకాల్తునామాస్టాంపుఅర్ధరూపాయ. వాలంటరీ అర్ధరూపాయి; కంప్లయింటు నకలుకు నాలుగురూపాయలు; ప్రయివేటుఖర్చునాలుగురూపాయలు.

బాపి—కంప్లయింటు వకపేజీనిండాలేదే దానికంతఖర్చు యెందుకు?

సీతా—వాలంటరు బంతికి మూడేసి అక్షరముల చొప్పున వ్రాసిఆకాస్తాయిరవై పేజీలలో పట్టిస్తాడు; వేగిరం వ్రాసినందుకు అతని కేమయినా ఇయ్యవలెను. నకళ్ళపనిచూసే గుమస్తాకు కంపేరింగు ఫీజుకాక అర్ధరూపాయ అయినా చేతిలోపెడితేనేకాని నకలు వూడిపడదు. అక్కడికీ నేను చాలా తక్కువ చెప్పినాను.

బాపి—ఆఖర్చులుతప్పవు. ఆరూపాయలుకూడా యిచ్చివేసి వకాల్తునామామీఁద దస్కతుచెయ్యి. దొరయ్యా! నీవు హిరింగు నాటికి వచ్చేటప్పుడు పంతులుగారికి వకకావిడి వంగవరుగున్నూ పెండలమున్నూ పట్టుకొని మరీరా.

సీతా—దొరయ్యా! మీవూరుదగ్గిర అదేదోవూళ్ళో రాగి చెంబులు మహాబాగా చేస్తారట! నీవువచ్చేటప్పుడు మట్టులేని కుంభ కోణపు చెంబులవంటివి నాలుగుచేయించి తీసుకొనివస్తా.

బాపి—మీరు వైష్ణవేష్టి చేసినతరువాత బంధువులయిం డ్లలో భోజనములుచేస్తావున్నారా?

సీతా—బంధువులదాకాపోతారు. నాభార్య చక్రాంకితము కాలేదు; దానిచేత భోజనముచేస్తానా? ఎక్కడకువెళ్ళినా నాకు స్వహస్తపాకము కావలెను.

బాపి—ఆబ్దికములకు స్మార్తులకు పెడుతూవున్నారా? వైష్ణవు లకే పెడుతూవున్నారా?

సీతా—మాకు అదివక్కటే లోపముగావున్నది. వైష్ణవులు మనముచేసిన వంటలో భోజనముచేయరు. వారుచాటున వంటచేసి తిని, మిగిలిన అన్నముతో మనకుఅంటతప్పేలాలు యివతల పడ వేశినా వైష్ణవులకు పేడితేనేకాని మనపిత్రుదేవతలకు గతులుండవు. వైష్ణవుడైనవాఁడు దినానికివెయ్యితప్పులు చెయ్యనియండి దిట్టముగా నొసటను నామము ధరించుకొని తులసిపూసల తావళములు వేసి కొన్నంతమాత్రముచేత మరణకాలమందు కేవలమూ వైకుంఠము నకు పోతాడు. అటువంటి పరమభాగవతోత్తములైన వైష్ణవులసేవ యెంతో పూర్వజన్మపుణ్యము గలవారికిగాని లభించదు.

బాపి—దొరయ్య కనివెట్టుకొనివున్నాడు. ముందుగా అతని పని కానిచ్చి పంపివెయ్యండి. నేనుమీతో రహస్యముగా వేరేసంగతి మాట్లాడవలసివున్నది.

సీతా—దొరయ్యా! నీవువ కాల్తు రామామీఁద వ్రాలుచేసినావా? వ్యాజ్యం మనపక్షం కావడముకు వేరేరదుపాయంవున్నది. మున సబుగారికి యాభ యిరూపా—ఇప్పుడెందుకులే పదిరోజులలో సాక్షుల పేరస్తు దాఖలు చెయ్యడముకు వస్తావుగనుక అప్పుడు మాట్లాడు దాము. నీవిప్పుడు వెళ్ళిపో. రాగిచెంబులమాట మరచిపోకుమా. దొరికేటట్టయితే స్వాములనిమిత్తం వకవంద విసనకర్రలుకూడా పట్టించుకునిరా.

దొర—చిత్తము దణ్ణాలండి. చెలవుపుచ్చుకుంటాను. బాపి రాజుగారూ! బసలో వుంటాను యేగిర మొస్తారుకదా?

(అని వెళ్ళుచున్నాఁడు.)

బాపి—ఇందులో మీఫీజులో సఖంనాకు రావలెను. అంతకు తక్కువైతే వల్లపడను. కిందటిమాటు యిప్పించిన వ్యాజ్యములో నాకమీషనుపూర్తిగా యిచ్చినారేకాదు. అందుచేతనే యీమధ్య మీవద్దకు నేను కేజులు తీసుకురావడంలేదు.

సీతా—అప్పుడుసొమ్ము అవసరంవుండి వాడుకొన్నాను. ఆనాలుగు రూపాయలూ ఇవిగోపుచ్చుకోండి. (అనిచేతిలో వేయుచున్నాఁడు.)

బాపి—ఇందులో ఖర్చులుకూడా యెక్కువ పుచ్చుకొన్నారు. ఆఆరురూపాయలూకూడా యిలాఇయ్యండి. కిందటిమాటు బత్తుల వాళ్ళవ్యాజ్యం ఇప్పించినప్పుడు ఖర్చులకిచ్చిన సొమ్ముకూడా వాడు కొని వ్యాజ్యం కోర్టులో దాఖలు చేసినారేకాదు. ఈమాటుకూడా అలాగేచేస్తే మాటదక్కదుసుమండీ.

సీతా—ప్రతిదఫానూ అలాచేస్తానా? అప్పుడేమో సొమ్ముతో అవసరమొచ్చి వాడుకొన్నాను. అప్పుడైనా ఫిర్యాదు కాకా రానిచ్చి నానా? వాళ్ళకు తెలిసి ఫిర్యాదుచేస్తామనడంతోటే మాయింట్లో వాళ్ళ

వస్తువుతాకట్టుపెట్టి సొమ్ము తెప్పించి వెంటనే వాళ్ళముఖంమీద పార వేసినాను.

బాపి—అవును మీరు యెగబెట్టినారని కాదు. చేతిలో ఖర్చుకు లేక వాడుకుంటే తరువాత యిబ్బందిపడవలసివస్తుంది.

సీతా—అప్పుడు కేజులువిస్తారం లేవుగనక అట్లా చెయ్యవలసివచ్చినది. ఈవైష్ణవపక్షం అవలంబించిన తరువాత మునసబుగారు నాకు తరచుగా కేజులుయిప్పించి సహాయంచేస్తూవున్నారు. ఇప్పుడునాయం దందరికీ బహుగౌరవము.

బాపి—ఆఱురూపాయలుకూడా దయచేస్తారా? హీరింగుకాలములో యిచ్చేదానిలో మీఫీజుమీరు ఉండచూచుకొందురుగాని.

సీతా—ఇప్పుడు నాలుగురూపాయలు పుచ్చుకోండి. తక్కినవి యీదపాయిస్తాను. ఇప్పుడుకోర్టువేళ అయినది. నేను భోజనముకు లేతునా? వైశ్వదేవముకూడా కావలెను.

బాపి—చిత్తము. (అనిఅందరునూ లేచుచున్నారు.)

ద్వితీయాంకము.

౧ ప్రదేశము—కోర్టుహాలు.

[ప్లీడరుసీతాపతిరావును, దొరయ్యయు, సాక్షులును, ప్రవేశించుచున్నారు.]

సీతా—దొరయ్యా! మునసబుగారు వచ్చేలోగా సాక్షులకు కొన్నిసంగతులు బోధించవలసిఉన్నవి. సాక్షులుతీసుకొని నీవుయీ చెట్టుక్రిందకురా. మునసబుగారుఅడిగితే నీవు వీరన్ననాకు తమ్ముడు కాడని చెప్పవలెను.

దొర—మేమిద్దరము వక్కతల్లికేపుట్టినప్పుడు అన్నదమ్ములము కామని యేలాఅననండీ.

సీతా—నీకెందుకు? సాక్షులను నేనుచెప్పినలాగున పలుకనిస్తా. ప్లేటుమెంటులో మేముయిద్దరమూ సోదరులముకామని యింకారు చేసినాము. మనంయిప్పుడు అందుకువ్యతిరేకంగా వాదంచెయ్యగూడదు. వెనుకటి మునసబుగారు ఫస్టుహీరింగురోజున, వాదీప్రతివాదీ సోదరులగుదురా కారాఅని మొదటిసారంశము యేర్పర్చారు.

బొర—యిఖమీాసిత్తం. నేను సెప్పవలసింది సెప్పినాను.

సీతా—నీకేమీాఫర్వాలేదు. నీవ్యాజ్యం నీపక్షంచేయించే పూచినాది. సాక్షులు మీావూళ్లోవాళ్ళయితే బాగుండును.

దొర—మూవూళ్ళోవాళ్ళు లక్షవరాలిచ్చినా, మేమిద్దరమూ అన్నదమ్ములుకామని పలుకరు.

సీతా—చేబియ్యం వీరయ్యా! నీవు మొదటిసాక్షివి. యీాలారా వీరిద్దరూ అన్నదమ్ములుకారని చెప్పుతున్నావుగదా? ఆసంగతి నీకు యేలాగు తెలుసునంటే యేమిచెప్పుతావు.

వీర—తక్కిన రెండురూపాయలూ చేతిలోపడవేస్తేనేకాని సాక్ష్యంపలుకను. తీరా సాక్ష్యంయిచ్చినతరువాత సొమ్ముయెగపెట్టిన మహానుభావులను యెందర్నోచూచినాను.

సీతా—దొరయ్యా! ఆరెండురూపాయలూకూడా యిచ్చివెయ్యి—వీరయ్యా! ఇక నేనడిగినమాటకు జవాబుచెప్పు.

వీర—నేను చిన్నప్పటినుంచీ వాళ్ళవూరికి మాబంధువులను చూచేనిమిత్తం వెళుతూ వస్తూవుండడంచేత యెరుగుదునంటాను.

సీతా—అలాకాదు. పదిరంపత్సరుల క్రిందట వీరన్నతండ్రిపోయినప్పుడు నేను వాళ్ళవూళ్ళోనేవున్నాను. అప్పుడు వీరన్నవక్కడే కర్మచేసినాడు. దొరయ్య మయిలబొట్టుపెట్టుకోలేదు. అందుచేతయెరుగుదుననిచెప్పు. ఇదిజ్ఞాపకం వుంచుకుంటావా?

వీర—తెల్లవారిలేస్తే యాభై సాక్ష్యాలిస్తా వ్యాజ్యాలతో దేవుళ్ళాడేముండాకొడుకును యీ రెండుముక్కలూ జ్ఞాపకంవుంచుకో లేనా?

సీతా—ఓరీ! దూదివెంకయ్యా! నీవు రెండోసాక్షివి. నిన్న తాగడానికి కావలెనంటే నీసొమ్ము ముందర్తిగానే యిప్పించివేసి నానుగదా? నేను బంధువున్ని అనిచెప్పు. వీరయ్యగారితో చెప్పిన దాన్ని విన్నావుకదా? నీకు యెరువుయిప్పించిన జరీపాగా బంగారపు మురుగులూ జాగ్రత—అడుగో వాగ్మూలాలు వ్రాసే గుమస్తా కాళ్ళ రామయ్యగారు వస్తూవున్నారు.

రామ—యీ వేళ మీవ్యాజ్యం సాక్షులవిమర్శకు వస్తుంది. మునసబువారి సవారీ వీధిలోపెట్టినారు. రావడంతోనే ముందుగా మీవ్యాజ్యమే యెదట బెడతాను. యేమియిప్పిస్తారోసుమండీ! వాగ్మూలాలు వ్రాయడంలో చాలాసహాయం చేస్తాను.

సీతా—దొరయ్యా! నీవ్యాజ్యం అంతా వారుచేసేసహాయంలోవున్నది. సాక్షులవాగ్మూలములలో రెండు దిట్టమయిన ముక్కలువేస్తే అప్పీలుకు వెళ్ళినా తీర్పుతిరిగిపోను.

దొర—యీయన మునుపటి మునసబుగారు కారేమండి? ఆయన యెక్కడకు యెల్లారు?

సీతా—ఆయన సెలవుపుచ్చుకొని శ్రీరంగయాత్రకు వెళ్ళినారు. ఈయన బందరునుంచి అక్టింగుగావచ్చినారు. బహునెమ్మదయినవారు. ఈయనపేరు శ్రీరామమూర్తిగారు.

[మునసబుగారువచ్చి బెంచియెక్కుచున్నారు.]

మున—రామయ్యగారూ! యీ వేళ హీరింగువేసిన రెండు నెంబర్లు పయికితీసి ముందుగా యేకకాలమందు రెండుకేసుల

ప్లీడర్లనూ పిలిపించి విమర్శపెట్టండి. సారాంశము లియ్యవలసిన కేజులో రికార్డు నాచేతికిచ్చి, దానిలో ప్లీడర్లనుకూడా యిలా రమ్మనండి.

రామ—చిత్తము. యేమోయిబంట్రోతు ? మునసబుగారి శలవయిందని ప్లీడర్లనందరినీ యిలాపిలుచుకొనిరా.

[ప్లీడర్లు అయిదారుగురు వచ్చుచున్నారు.]

రామ—సూర్యనారాయణరావుగారూ ! మీసాక్షులు హాజరుగావున్నారా? ఒక్కమాటు మీరీలాగునరండి. (అని స్తంభము చాటునకు తీసికొనిపోయి) యిదీ భూసంబంధమైనవ్యాజ్యం. పార్టీతో చెప్పి యేలాయిప్పిస్తారోసుమండీ. వాగ్మూలాలు వ్రాయడంలో కావలసినంత సహాయంచేస్తాను.

సూర్య—నే నాపార్టీతో యిదివరకేచెప్పినాను. ఇందులో మునసబుగా రేమయినా రెండోపార్టీవద్దనుంచి పుచ్చుకొన్నారా? ఇంకాబేరం ఫరిష్కారం కాలేదని విన్నాను. నేనున్నవరదరాజుగారి ద్వారా బేరంపెట్టినాను.

మున—ఏమయ్యా ! రామయ్యగారూ ! సాక్షులువచ్చినారు ప్రమాణంచేయించండి.

రామ—చిత్తం. సీతాపతిరావుగారూ! మీసాక్షులుకూడా వచ్చి హాజరుగావున్నారుగదా?—నేనీకేజులో వాగ్మూలాలు పుచ్చుకొంటాను. రెండవకేజులో తమరు స్వయంగా వ్రాస్తారుకాదాండి?

మున—అవును. సాక్షివాగ్మూలములు మేము యీకేజులో స్వయంగాపుచ్చుకొంటాము. మీరు మీకేజు కానియ్యండి. సుబ్బారావుగారూ ! లింగరాజుగారూ ! మనము మనకేజు చూచుకొందాముర్రండి.

సూర్య—పుల్లయ్యా! నీవు వాదినిన్నీ ప్రతివాదినిన్నీ యెరుగుదువుగాదా?

సీతా—అట్టె! అట్టె! అట్టె! ఇది లీడింగుక్వశ్చను. రామయ్య గారూ! ఇది అడగనియ్య కూడదు.

రామ—ఈప్రశ్న కేమీ అభ్యంతరం లేదు. అడగనియ్యవచ్చు-

సీతా—కాదు కాదు. కోర్టువారితో మనవిచేసిమరీ వ్రాయండి.

మున—ఏమిటయ్యా? యిల్లెగిరిపోయేటట్టుగా కేకలు వేస్తూ వున్నారు?

రామ—మీరు వేరేవాగ్వాదాలం వ్రాసుకుంటూ వినడంలేదు. సీతాపతిరావుగారు లీడింగుక్వశ్చను—

మున—లీడింగు లేదు గీడింగు లేదు. తీర్పు చెప్పేవారం మేము వున్నాము. అడిగినప్రశ్న అల్లా వ్రాసుకోండి.

సూర్య—ఏమండోయి రామయ్యగారూ! మీరు రెండోవ్యాజ్యంలో సాక్షి చెప్పినమాట వ్రాస్తూవున్నారు? అది మాసాక్షి చెప్పినమాట కాదు—పుల్లయ్యా! దొరయ్యా వీరన్నా యిద్దరూ అన్నదమ్ములేకదా?

రామ—ఆప్రశ్న మీరడగకూడదు. వారిద్దరూ యేమవుతారని అడగండి.

సీతా—దొరయ్యా! చూచినావా? గుమాస్తాగారు మనకు యేలా సహాయం చేస్తూవున్నారో.

పుల్ల—వీరన్నా దొరయ్యను యిద్దరూఅన్నదమ్ములవుతారండీ.

రామ—"వీరన్ననూ దొరయ్యనూ సేనుయెరుగుదును. వారిద్దరూ అన్నదమ్ములవుతారని విన్నాను" ఇంతేకదూ?

సూర్య—"విన్నాన" న్నమాట సాక్షి చెప్పలేదు. మీరా మాటతీసివెయ్యవలెను.

రామ—వినకపోతే అతనేమి పుడుతూవుండగా దగ్గిరనుండి చూచినాడా యేమిటి? అదంతావకటే. సూర్యనారాయణరావు

గారూ! మీరు ప్రతిస్వల్పహాంశంలోను యిటువంటి అభ్యంతరాలు చెప్పకండి. కోర్టువారువింటే కోపపడుతారు.

సూర్య—ఇప్పుడు తగాదాపడుతూవున్న పందుంభూమి యెవరి హక్కు.

పుల్ల—పందుంభూమినాండి? దొరయ్యది—

రామ—"తగాదాభూమి పందుమున్నూ దొరయ్యదికాదు. వీరన్న హక్కు" అంతేనా నీయభిప్రాయము?— సీతాపతిరావు గారూ! మీరు క్రాసుయెగ్జామినేషన్ చేస్తారేమో చెయ్యండి.

సీతా—నీవుయెప్పుడయినా దొంగతనము చేసినావా? మఱి యేమయినా—

సూర్య—ఇదివూరికే సాక్షిని అవమానపర్చడానికి అడుగుతూ వున్నారు. పబ్లీకునిదర్శనంలేనిదీయిటువంటిప్రశ్న అడగనియ్యకూడదు.

సీతా—పోనియ్యండి—పుల్లయ్యా! నిన్నీలాగు తప్పుసాక్ష్యం చెప్పమనినీప్లీడరుగారు చెప్పినారుకదా?

సూర్య—పైకిబిళ్ళగోచీ పంగనామాలూ పెట్టుకొని పార్టీల సొమ్ము హరిస్తూ నీకుమల్లే నేను డబ్బుపుచ్చుకొని పార్టీలో తిరిగి పోతా ననుకొన్నావా?

సీతా—నీమర్యాదా నామర్యాద అందరికీ తెలుసును. నీలాగు నేనేమీ బోగందాన్ని వుంచుకోలేదు!

సూర్య—బోగందాని పేరెత్తబోకు. ఇంకా యేమయినా నన్నంటే పడతాను గాని ఆడవాళ్ళసంగతితెస్తే బాగాజరగదు. నీకుమల్లే నేనేమి గోడలు దూకడంలేదు.

మున—ఏమయ్యా! మీరిద్దరూ అలాపోట్లాడుతూ వున్నారు. కోర్టువారికి కోపంవస్తే కంటెంప్టు ఆఫ్ కోర్టుకిందపెట్టి శిక్షించి పోతారు సుమండీ. మెల్లిగామాట్లాడండి.

రామ—సీతాపతిరావుగారూ! ఇఖ మీ సాక్షి నిపిలవండి.

సీతా—కోర్టువారు చిత్తగించవలెను. మా సాక్షి బహు ఘరానామనిషి. కూర్చో వడముకు సెలవిప్పించవలెను.

సూర్య-వీడు యేపెంటమీదపడితే ఆపెంటమీద తిరుగుతూ, జూదాలపాకలకాడ తాగిపడివుంటాడండి. బట్టలు పడిదెకు తెచ్చుకొని మురుగులెక్కడివో యెరువు తెచ్చుకొని పెట్టుకొన్నాడు. వీణ్ని కూర్చో పెట్టకూడదు.

వెంక—మీరు కల్లుపాకకాడికి రాత్రిళ్ళు త్రాగడానికి వచ్చినప్పుడు, మమ్మల్ని మీరక్కడ చూచి—

సూర్య—ఛీఛీ. నోరుముయ్యి. నేను కోర్టువాతో మనవి చేస్తూవుంటే, మధ్య నీవుమాట్లాడుతావు! కోర్టువారుచిత్తగించి నారా? సాక్షి యేలాగు మిగలమాటలు రానిస్తున్నాడో?

మున-సాక్షినికూర్చో పెట్టివాగ్మూలముపుచ్చుకోండి. రామయ్య గారూ! ఇఖ యిలాగంటి వేమీ కోర్టువారి నోటీసులోకి రానివ్వకండి.

సీతా—మీరు దొరయ్యను వీరన్నను యెరుగుదువా? పొర పడి అన్నాను. యెరుగుదురా?

వెంక — యెరుగుదును. వాళ్ళిద్దరూ అన్నదమ్ములుకారు. దొరయ్య తండ్రిపోయి నప్పుడు వీరన్న మయలబొట్టు పెట్టుకో లేదు—ప్లీడరుగారూ! మరచిపోయినాను— అతని తండ్రిపోయి యెన్నాళ్లయినదండీ?

సీతా—ఫదిసంవత్సరములకింద వీరన్నతండ్రి పోయినప్పుడు దొరయ్యమైలబొట్టు పెట్టుకోలేదు. కర్మ వీరన్న వక్కడుమాత్రమే చేసినాడు—రామయ్యగారూ! వ్రాయండి.

సూర్య—సాక్షి చెప్పేదిఒకటీ ప్లీడరుగారుచెప్పేది వకటీనా? రామయ్యగారూ! మీరు సాక్షిచెప్పినట్టు వ్రాయండి.

రామ—సాక్షి ఆయన చెప్పినట్టే చెప్పినాడు. నాకు యేమీ భేదం కనిపించ లేదు. కావలిస్తే మళ్ళీ చెప్పమందాము.

సీతా—నీవు—ఓస్! నీవనివస్తోవస్తుంది. మీరు తవ్వల పీరన్నకు ముఖ్యస్నేహితులు కారా?

రామ—అదిఇప్రిలివెంటు ప్రశ్న. మఱివక ప్రశ్న వెయ్యండి. నేనీ ప్రశ్న వ్రాయను.

సీతా—కోర్టువారు యీసంగతి నోటు చెయ్యవలెను. నేనీప్రశ్న అడిగితే గుమాస్తాగారు వల్లపడదంటారు.

మున—స్థలవ్యాజ్యముకు బంధువులయితే నేమి కాకపోతే నేమి? మీవ్యాజ్యముకుసంబంధించిన ప్రశ్న అడగండి.

సీతా—మావ్యాజ్యానికంతా ఇదే ముఖ్యమయినప్రశ్న. అడగనియ్యకపోతే కోర్టువారు రికార్డులో నోటు చెయ్యవలెను. కోర్టువారీలాగున ముఖ్యమయినప్రశ్న అడగనీయ్యకపోతే ఇఖ నేనీసాక్షిని విమర్శే చేయించుకోను.

రామ—సూర్యనారాయణరావు పంతులుగారూ! మీరు క్రాసు సవాళ్ళు వేస్తారా?

సూర్య—వెంకయ్యా! నీవు దొంగసాక్ష్యమిచ్చినందుకు సబు మేజస్ట్రేటుగారు నెల్లాళ్లు వరకంవేసినారా? లేదా?

వెంక—నాకొక్కడికేయేమి? మహామహావాళ్ళకు వేసినారు. కాలంవస్తే యెవరికితప్పుతుంది? వెనుకటి మునుసబుగారు మీకు జునుమానా వెయ్యలేదా?

సూర్య—అడుగో! అడుగో! ప్రతివాది తాలూకు మొదటిసాక్షి చేబియ్యం వీరయ్య యీసాక్షి చెప్పేది వింటూవున్నాడు. కోర్టువారు అవతలికి పంపించవలెను.

మున—ఇవాళ ఒక కేజూ మర్తబైనదికాదు. మీ కేజు రేపు క్లోజుచేస్తాము. యీపాటిచాలించండి. [అని లేచుచున్నారు.]

---

౨ ప్రదేశము—కోర్టుహాలు.

[మఱికొందరుప్లీడర్లు కూర్చుండియుండఁగా సీతాపతిరావుగారు పార్టీలు మొదలయినవారితో ప్రవేశించుచున్నారు]

సీతా— సోమయాజులుగారూ! మీరింత కాలమునుంచి ప్లీడరీ చేస్తూవున్నారుగదా? యింతలంచాలుపుచ్చుకునే మునసబును మీ రెక్కడయినా చూచినారా?

సోమ—యిదియేమిలంచము? ఆజిల్లాలో జగన్నాథ—పంతులు గారున్నారు. ఆయన ఫర్తుమునసఫీలో నాలుగులక్షలరూపాయలు సంపాదించి, పశువులు కడుగుతాగడానికికూడా వెండిగోలెములు చేయించినారు. వారింట్లో మొన్నపెండ్లిలో పార్టీలవల్ల యాభై వేల రూపాయల కట్నాలువచ్చినవి.

సీతా—ఆజిల్లాలో యేలావున్నదో కాని యిక్కడప్రజలు బహు క్షోభపడుతూ వున్నారు. మొన్న కొత్తూరువారి న్యాయమయిన వ్యాజ్యంలో లంచంయివ్వడానికి సొమ్ములేకపోతే మాన్యంఅమ్మించి నాలుగువందలరూపాయలు పుచ్చుకొన్నాడు. నాలుగురోజులక్రిందట బాపన్న కేజులో సాక్షులను కమ్మిట్టుచేస్తానని కోర్టులోపెట్టి బెదిరించి రెండువందలరూపాయలు పుచ్చుకొనివదిలిపెట్టినాడు. ఈవ్యవహారం చూస్తే పచ్చిఘోరకలిగావున్నది.

సోమ—వాటికన్నిటికీ యేమిగాని మీ వ్యాజ్యం ఖరూయిషు యేమయినది?

సీతా—వరదరాజుగారి ద్వారా వాది వీరన్నదగ్గిర నూట యాభై రూపాయలు పుచ్చుకొని అన్యాయంగా భూమి అతనిపక్షం చెయ్యడానికి సిద్ధమయినాడు. ఇప్పుడుకోర్టుకు రావడంతోనే తీర్పు చెబుతాడు. మేముకూడా నూరురూపాయలవరకూ యిస్తామని బేరం పెట్టినాము. అసలుభూమే రెండువందల రూపాయలకంటె యెక్కువ చెయ్యదు.

సోమ—మొన్న నేను ప్లీడరుగావున్న బత్తులవారి వ్యాజ్యంలో ఉభయపార్టీలవద్దనుంచీ సొమ్ము పుచ్చుకొని సహంభూమికి మాత్రమే తీర్పుయిచ్చి తక్కినసగముకు దావాకొట్టివేసినాడు. ఇంకానయం మీవ్యాజ్యంలో ఇద్దరిదగ్గిరా పుచ్చుకోలేదు.

సీతా—పాతికరూపాయలిస్తే ఖర్చులు లేకుండాచేస్తామని మాకు రాయభారం పెట్టినారు. పందుంభూమిపోగా యాభై రూపాయల ఖర్చులదగ్గిరనా? ఇవ్వవద్దని పార్టీతోనే నేచెప్పిరూపాయించినాను.

సోమ—అదుగో మునసబుగారి సవారీ వస్తూవున్నది. సిద్ధముగా వుండండి.

[మునసబుగారు ప్రవేశించుచున్నారు.]

మున—ఏమయ్యా! సీతాపతిరావుగారూ! మీమొదటి సాక్షిని విమర్శ చెయ్యడం జరూరా? అతనివల్ల యేసంగతి రుజువుపడుతుంది?

సీతా—అతనిసాక్ష్యం ముఖ్యంగా కావలెనండి. అతనివల్ల వాదిన్నీ ప్రతివాదిన్నీ వక్కతండ్రి బిడ్డలుకారనిన్నీ పృథగ్భాండాశనమూచేస్తూ వేరేవేరే వున్నారనిన్నీ రుజువవుతుంది.

మున—ఇంతేనా? మరియేమైనావున్నదా? మేమూసాక్ష్యం నమ్ముము. మీరు ప్లీడరులైవుండి ప్రతివాదికియిచ్చే సలహా సోదరునికి భాగంయివ్వకుండా హరించునునా?

సీతా—చిత్తము. ఇది కేవలము అక్రమమయిన వ్యాజ్యం. కోర్టువారు బాగాపరిశీలించి న్యాయం దయచేయించవలెను.

మున—రెండువందల రూపాయలు జీతంపుచ్చుకుంటూ మేము కోర్టుమీద కూర్చోవడం న్యాయం దయచేయడానికేనా మరియెందుకైనానా? మీరనేమాటలుచూస్తే కోర్టువారన్యాయంచేస్తారనే టట్టు భావం తేలుతూవున్నది. కంటెంప్టు ఆఫ్‌కోర్టుకింద శిక్షిస్తాము సుమండీ.

సీతా—నేనుఅలాఅనలేదండి. న్యాయందయచేయించమన్నాను.

మున—అదుగో మళ్ళీ ఆమాటేఅంటారు? రామయ్యగారూ! ఈయనవద్ద కయిఫియ్యతు పుచ్చుకోండి.

సీతా—చిత్తము. కోర్టువారుఆగ్రహంమాని క్షమించవలెను.

మున—క్షమించడంలేదు గిమించడంలేదు— వ్రాయవయ్యా. డిస్ట్రిక్టుకోర్టువారికి ఈప్లీడరునుబరతరపుచెయ్యడానికి అర్జీవ్రాయండి.

సీతా—చిత్తము. చిత్తము.—

సోమ—ఫూరుకోవయ్యా. కోర్టువారికి కోపంవస్తూవుంటే మళ్ళీ మాటాడుతారు.

మున—సోమయాజులుగారూ! మీరు నేనుచెప్పమన్నానని హెడ్డుగుమాస్తాతో చెప్పి జప్తువారంటు వ్రాయించి తెచ్చుకోండి. కంప్లయింటు తయారైన మీదట నిన్నటితారీఖుపెట్టి ఫయిలు వేయింతాము. దాఖలుకాగితాలబుక్కులో స్థలంవదిలిపెట్టుకొని నాలుగోగుమాస్తాతో చెప్పండి.

సోమ—చిత్తము. ముందుగా వారంటుపుచ్చుకొని ఆస్తిజప్తు చేస్తే తరువాత కంప్లయింటు మెల్లగా ఆలోచించివ్రాయవచ్చును.

మున—అలాకాదయ్యా! ఇక్కడంతాఫితూరీకోరులువున్నారు. కంప్లయింటుకూడా నిన్నటితారీఖుపెట్టి రేపుకోర్టువేళకు సిద్ధము

చేయించండి.—సూర్యనారాయణ రావుగారూ! నిన్నటిమీ కేసులో హీరింగుచేయండి.

సూర్య—కోర్టువారికి విశదమయివున్న దానికంటె నేను హీరింగులో చెప్పేది యేమున్నదండి? ఐనా హీరింగుచెయ్యడం ఆచారంగనుక రెండుముక్కలు చెపుతాను. (హీరింగు)

"మావాదం ఘరానాసాక్షులవల్ల పూరాగారుజువయినది. వాదివీరన్న బహుపెద్దమనిషి. కొటివరహాలిచ్చినా యెప్పుడూఅబద్ధం ఆడేవాడుకాడు. యీ వెధవ పందుంభూమికోసం అబద్ధపువ్యాజ్యం వేస్తాడాండి? అతనిమొఖం వక్కసారిచిత్తగిస్తే కోర్టువారే వ్యాజ్యం అతనిపక్షంచేస్తారు. ప్రతివాది వాదిహక్కు హరించవలెనని చూస్తూ వున్నాడు. అతని ముఖంచూస్తేనే అతనివాదం అక్రమమయినట్టు కోర్టువారికి విశదమవుతుంది. అతనిసాక్షులందరూ పోర్జరీకోరులు; డబ్బుపుచ్చుకొని కూటసాక్ష్యం చెప్పినారుగాని వారి మాటలలో వాస్తవం యెంతమాత్రమూ లేదు. ప్రతివాదియిచ్చిన స్టేటుమెంటు కున్నూ సాక్షులు చెప్పిన సాక్ష్యముకున్నూ చాలాభేదంగావున్నది. ఈప్లీడరుగారుకూడా యిటువంటి అక్రమపుదావాలలో దిగేవారే. కాబట్టి పయిని చెప్పిన హేతువులన్నీ చిత్తగించి కోర్టువారు వాది పక్షంగా తీర్పు చెప్పవలెనని ప్రార్థిస్తున్నాను."

మున—ఏమయ్యా! వాదిప్లీడరుగారు చెప్పినదానికి వప్పుకుం టారా? లేక యేమైనా మీరుకూడా హీరింగుచేస్తారా? ప్రతివాది తరపున మీరుచేసేవాదం యేమున్నది? వూరుకోరాదా?

సీతా—నాహీరింగుచిత్తగిస్తే యావత్తునిజంకోర్టువారికివిశద—

మున—కోర్టువారికి యిదివరకే విశదమయివున్నది.

సీతా—(తనలో) వాదిదగ్గిర నూటయాభైరూపాయలూ పుచ్చుకొన్నప్పుడే విశదమయినది. (పయికి) అయినా నాహీరింగు

చిత్తగించవలెను. నాహీరింగు సాంతముగా విన్నమీదట కోర్టువారి కేమితోచునో!

మున—తోచవలసిన దేమిటో యిదివర కేతోచినది. వృధా కాలయాపనం. అయితా కానియ్యండి.

సీతా—కోర్టువారు వుత్తరంవ్రాయడం మానివేసి శ్రద్ధగా వినవలెను. (హీరింగు) "వాదిన్నీ పతివాదిన్నీ వక్కతండ్రిబిడ్డలు కారు. పింతండ్రి పెత్తండ్రిబిడ్డలు. వారితండ్రులే పంచుకొని విభాగాలైనారు. అంతేకాకుండా యీభూమి దొరయ్య స్వార్జితము; ఆ భూమికొన్న యిరవైసంవత్సరములనుంచీ ప్రతివాది భుక్తంలోనే వుంటూవున్నది. ఆరంగతి సాక్ష్యంవల్ల పూర్తిగా రుజువైనది. వాదికి దానిలో హక్కు కలిగివుంటే చాలాకాలంకిందటనే వ్యాజ్యం తీసుకొని రావలసివున్నది. కాలనిబంధన చట్టప్రకారం పన్నెండేళ్ళలోగా వ్యాజ్యం తెచ్చుకోలేదు గనుక దీనికి కాలదోషం పట్టింది. అంతేకాకుండా వాది కంప్లయింటులో యీభూమి పెద్దలు సంపాదించిన దంటాడు. సాక్షి చెప్పటంలో ప్రతివాది కొన్నాడని—

మున—ఏమిహీరింగు? ఎంతసేపు చెప్పినా వక్కముక్కఅయినా వ్యాజ్యానికి సంబంధించినది చెప్పడంలేదు. ఈపాటి చాలించండి.

సీతా—ఇంకా ముఖ్యమయిన రెండుహంశములున్నవి—

మున—కోర్టువారికి విశేషతోందరయిస్తే జరుమానా వేస్తారు. (పెట్టెలో చెయ్యిపెట్టి వెదకుచు) రామయ్యగారూ! వుదయమున యీవ్యాజ్యంలో వ్రాసినతీర్పుచీటీ చూస్తూవుండగానే కాడా యీ పెట్టెలో పెట్టినాను. కనబడలేదేమండీ?

రామ—వరదరాజుగారిదస్తూరితోవున్న చిత్తునుచూచి సాపు వ్రాయడంలో మీరొకవేళ పెట్టెలో వేయడం మరిచిపోయినారేమో ?

మున—లేదు లేదు. చిత్తు కాగితము చింపి వేసి తరువాత సాపు తీర్పు జాగ్రతగా యీ పెట్టెలో పెట్టినాను. ఇదుగో దొరికినది. మరి వక కాగితపు మడతలో దూరినది — సీతాపతిరావుగారూ! ఖర్చుల విషయమై మీరేమీ యింకా ఆలోచించుకోలేదుగదా?

సీతా—చిత్తము. పార్టీతో చెప్పినాను. అతను వప్పకుండా వున్నాడు.

మున—అతని క్షేమముకొరకే చెప్పినాము. అపైని మీ యిష్టము. తీర్పుయిస్తాము వినండి. (అని చదువుచున్నాడు.)

"వాదిదాఖలుచేసిన కంప్లయింటున్నూ ప్రతివాదితాలూకు స్టేటుమెంటున్ను ఉభయవాదులూ దాఖలుచేసినదస్తావేజులున్నూ సాక్షివాగ్మూలములున్నూ హీరింగుకాలమందు ఉభయప్లీడర్లూ చెప్పిన సంగతులున్నూ చిత్తగించడమయినది. ప్రతివాది తరపున వచ్చిన సాక్ష్యంకోర్టువారెంతమాత్రమూ విశ్వసింపజాలరు. సాక్ష్యమిచ్చేటప్పుడు ఆసాక్షులవైఖరి చూడగా వాళ్ళు కూటసాక్షులయినట్లు స్పష్టమయినది. అంతేకాకుండా కేవలం సాక్ష్యమునేనమ్మి తీర్పుచెప్పేపక్షమున పార్టీలకుఅన్యాయం జరుగుతుంది. ఇక్కటికూడా ఆలోచించవలెను. వాది కంప్లయింటులో వ్రాసుకొన్న దానికంటే సాక్షి విరుద్ధంగాచెప్పినా, సాక్షిమోస్తరుచూస్తే అబద్ధంచెప్పేవాడుగాతోచలేదు. నేర్చుకొనివచ్చిన సాక్ష్యంఅయితే తేడాలులేకుండా వుంటవిగాని నిజమయినదాసలో వుండడం తటస్థించదు. వాదియాభై యేళ్ళు చెల్లినవాడు. ఇంతవయస్సు చెల్లినతరువాత అన్నగారి విషయంలో అన్యాయానికివడిగడుతాడని వూహించడానికి అవకాశం లేదు. కాబట్టి పయి బలమయిన హేతువులనుబట్టి వాది వావా ప్రకారం పంచుంభూమిన్ను ప్రతివాది స్వాధీనంతప్పించి వాది అధీనం

ఆధీనం చెయ్యడముకు తీర్పుచెయ్యడమైనది. ఖర్చులు''—ఇకమీరు వెళ్ళిపోవచ్చును.

సూర్య—ఖర్చులుమాట తీర్పులో వ్రాయించినారుకారు. మున—ఈరోజున యింటికాడ ఆలోచించి మీకిప్పించడం న్యాయమనితోస్తే మీపక్షంగాను, న్యాయంకాదనితోస్తే ప్రతివాది పక్షంగాను, రేపు కోర్టులో వ్రాసుకొనివచ్చి చెపుతాము—సీతాపతి రావుగారూ! నేనిందాకా చెప్పినసంగతి ఆలోచించుకోండి.

సీతా—చిత్తము. రేపువుదయాన్న యేసంగతీ బసలో మనవి చేస్తాను.

[అందఱు వెళ్ళుచున్నారు.]

తృతీయాంకము.

౧. ప్రదేశము—డిస్ట్రిక్టుకోర్టు ప్లీడరుగారి యిల్లు.

[తనపార్టీ దొరయ్యను వెంటఁబెట్టుకొని సీతాపతిరావుగారు ప్రవేశించుచున్నారు.]

సీతా—భాస్కరరావుగారూ! చలపతిరావుగారు వున్నారా? ఆయనకు వకఅప్పీలుకేజులో వకాల్తునామా యిప్పించడానికి పార్టీని తీసుకుని వచ్చినాను.

భాస్క—ఇప్పుడేవస్తారుకూర్చోండి. వక కేజులో నకళ్ళదరఖాస్తుచేస్తే, రికార్డుకీపరుగారు యెదటిపార్టీతరపున పదిరూపాయలు పుచ్చుకొని రికార్డులో దస్తావేజు లేదంటూవున్నారు. అది జరూరుగా కావలసివచ్చినది. మరి పదిరూపాయలుపారవేసిఅయినా ఆదస్తావేజు తీసుకురావలెనని చలపతిరావుగారు వారియింటికి వెళ్ళినారు.

సీతా—మీకోర్టు రికార్డుకీపరుగారిసంగతి బొత్తిగా అన్యాయంగా వున్నది. యేమయినా చేతిలోకి బడితేనేగాని కాగితం వూడిపడదు.

భాస్క—ఆయన తమలపాకులకట్ట కాడినుంచి లంచముపుచ్చుకుంటాడు. యెంతబీదవానినైనా పీడించి తుదకు రెండుడబ్బులైనా పుచ్చుకొని మరీకాగితం బైటపెడుతాడుగాని వూరికే పెట్టడు. ఇంత యెందుకు? కోర్టులో తనతో సరిగా వుద్యోగంచేసేవారివద్దనూ బంధువులవద్దనూకూడాపనివచ్చినప్పుడు సొమ్ముపుచ్చుకోనిదీపని చెయ్యడు. జమీన్ దారీవ్యాజ్యాలలో వందారెండువందలూపుచ్చుకొనిదస్తావేజులు చింపివేస్తాడు. మొన్న నేనువకకేజులో యాభయిరూపాయలిచ్చి ముఖ్యమయినదస్తావేజు చింపివేయించినాను. అందుచేత మాపార్టికి ఫదివేలరూపాయలు లాభంవచ్చినది. యెంతలేదన్నా రోజుకు ఫదిరూపాయలు కళ్ళచూడనిదీ ఆయనలేవడు. లంచంపుచ్చుకోని కటికముండావాడు వుండడంకన్న సొమ్ముపుచ్చుకొన్నా యీలాగు పనిచేసేవాడు వుండడంలాభమే కాని వొక్కొక్కప్పుడు నష్టంకూడాకలుగుతుంది.

సీతా—మీరొక్కపర్యాయం శ్రమపుచ్చుకొనివెళ్ళి నేనువచ్చినానని చెప్పి చలపతి రావుగారిని పిలుచుకునివస్తారా? మేమువచ్చి చాలాసేపయినది.

భాస్క—మీరిక్కడకూర్చోండి. నేనువెళ్ళి యిప్పుడే తీసుకుని వస్తాను.

(అని వెళ్ళుచున్నాడు.)

సీతా—దొరయ్యా! యీయన ప్లీడరుగారిగుమాస్తా. అతివాగుతాడు. వకమాట అడిగితే పదిమాటలు జవాబుచెపుతాడు.

దొర—యీప్లీడరుగారికి యింగిలీసువచ్చునాండి?

సీతా—ఇంగ్లీషురాకపోతేయేమి? పనిమహాబాగా చేస్తారు. జమీందారీకేజులు చాలామట్టుకు యీయనకేవస్తవి. నీకెందుకు? నీవ్యాజ్యంలో పనిఅంతా నేనుచేస్తానుకాదా?

దొర—మునసబు ఖర్చులైనా మనపక్షం చేసినాడుకాడయ్యా! అడిగినసొమ్ము—

సీతా—తాళు యెవరో వస్తూవున్నారు.

[చలపతిరావుగారు గుమాస్తాతోఁగలిసి ప్రవేశించుచున్నారు.]

భాస్క—నేను వెళుతూవుండగా పంతులవారు దోవలోనే యెదురుపడ్డారు. మీరువచ్చి కసపెట్టుకొని వున్నారనిచెప్పి శీఘ్రంగా తీసుకునివచ్చినాను.

చల—(కూర్చుండి) సీతాపతిరావుగారూ! తమరు విజయంచేసి యెంతసేపయినది? కొంచెం మాట్లాడవలసిన పనివుండగా రికార్డు కీపరుగారియింటికివెళ్ళి కార్యం బందోబస్తుచేసి వచ్చినాను.

సీతా—ఇతనితమ్ముడు యితనిమీద యీ మునసబుకోర్టులో వ్యాజ్యం వేసినాఁడు. మునసబు లంచంపుచ్చుకొని అక్రమంగా వాది పక్షం తీర్పుచేసినాఁడు. యీతేదీతో అప్పీలువాయిదా వెళ్ళిపోతుంది. మీరింటిలో వకాల్తునామా పుచ్చుకొని అప్పీలు దాఖలు చెయ్యవలెను. ఫీజుసంగతి నేను మామూలుప్రకారంగా పరిష్కారముచేస్తాను.

చల—భాస్కరం! వకాల్తునామా వ్రాయవయ్యా.

సీతా—అక్కరలేదు. నేనువ్రాయించితెచ్చినాను. దీనిమీద అంగీకరించినట్టువ్రాసి అప్పీలుముసాయిదా తయారుచేయండి.

చల—భాస్కరం! ముందుగా మామూలుమతలబు వ్రాయవయ్యా. తరువాత అప్పీలుహేతువులు చెపుతాను.

సీతా—రికార్డువక్కసాగిచిత్తగిస్తారా? ఇదిస్థలసంబంధమైనవ్యాజ్యం. పంచుంభూమిరావలెనని యితనిమీద తమ్ముడు వ్యాజ్యం వేసినాడు.

చల—రికార్డు వేరేచూడనక్కరలేదు. ఇదివరకు లక్ష వ్యాజ్యాలలో పనిచేసినాను. రికార్డుచూడకుండా అప్పీలు హేతువులు వ్రాయలేనా?

సీతా—పోనీ జడ్జిమెంటైనా వక్కసారి చదువుతానువినండి.

చల—అదీఅక్కరలేదు. సంగతులు మీరుచెప్పినారుచాలదా? వెనుక హీరింగు చేసేటప్పుడు చూస్తాను. జడ్జిమెంటైనాచూడకుండా మొన్నవక కేజులో హీరింగుచేసినాను. వ్యాజ్యం నిముషములో నా పక్షమయినది.

సీతా—అందులో మీరు రెస్పాండెంటుతరపున వకాల్తునామా పుచ్చుకొన్నారా?

చల—ఔను.—భాస్కరం! అప్పీలుహేతువులు చెపుతాను వ్రాయి. ౧. కిందికోర్టుతీర్పు కేవలం వూహాలమీద మొకద్దమా ఐవున్నది. ౨. కింగికోర్టులాకున్ను యిక్విటీకిన్నీ విరుద్ధముగావున్నది. 3. వాదితరపున సాక్ష్యం యెంతమాత్రమూ రుజువుకాలేదు. ౪. నాతరపున ఘరానాసాక్షులవల్ల పూర్తిగా రుజువైనది. ౫. యీ వ్యాజ్యంలో మునసపుగారు కేవలం పొరబడ్డారు. కాబట్టి యీపయి హేతువులను చిత్తగించి కిందికోర్టుతీర్పు తిప్పివేసి వ్యాజ్యంఖర్చులతో అప్పీల్లెంటుపక్షం చేయించవలెనని ప్రార్థిస్తూవున్నాను.

సీతా—అప్పీలు ముసాయిదా ఐనదిగనక ఇకమేము సెలవు పుచ్చుకొందుమా?

చల—ఇఖమీరు వెళ్ళవచ్చును. హీరింగులో మీమనసు వచ్చినపని చేస్తాను.

దొర—(రహస్యముగా) సీతాపతిగారుగారూ! యీ పీడరుగారు మహాఘట్టివారులారు వున్నారు. వక్కకాగితమయినాసూడకుండా సిటికలో అప్పీలుతయారు సేసినారు.

సీతా—ఈయన బహుఘట్టివారు. ఇంగ్లీషుప్లీడర్లనడమేకాని వారుయింటికివెళితే తిన్నగా మాటాడనేమాటాడరు. పనిఐనా వారికంటే వీరేబాగా పనిచేస్తారు. యెటువచ్చీ వారు ఇంగ్లీషుననాలుగు ముక్కలు వాగుతారు. అయినాగానీ జడ్జీ వారిమాటలు వినడం వున్నదా? హీరింగుచేసినంతసేపూ చాకుతో గోళ్ళుతీసుకుంటూ కూర్చుండి చివరకు కిందికోర్టుతీర్పు ఖాయం చేసినామంటాడు.

చల—సీతాపతిరావుగారూ! మీతోవకసంగతి చెప్పడంమరిచిపోయాను. శిరస్తాదారుగారికి యిందులోయేమయినా ఫదిరూపాయలసొమ్ము యిస్తేనేకాని మనకార్యంకాదు.

సీతా—అలాగేజాగ్రత పెట్టిస్తాను. మధ్యాహ్నం కోర్టువద్ద మాటాడుతాను. సెలవుపుచ్చుకొందుమా?

(అని వెళ్ళుచున్నారు.)

---

౨. ప్రదేశము—డిస్ట్రిక్టుకోర్టు.

—:o:—

[వీరన్నయు అతనిప్లీడరు కామరాజుగారును ప్రవేశించుచున్నారు]

కామ—వీరన్నా! నీవ్యాజ్యం జడ్జీగారు రావడంతోనే నీ పక్షంచేస్తాను. సందేహములేదు. శిరస్తాదారుగారికి యిస్తామనివప్పుకున్నరూపాయలలో యిదివరకు యిచ్చిన యాభైరూపాయలూ పట్టుకునివచ్చినావా? దొరగారివద్దరికార్డుచదివేగుమాస్తాకువప్పుకున్న పదిరూపాయలూ నీవుయిచ్చిన సొమ్ములోనుండి యిచ్చివేసినాను.

వీర—నేనంతసొమ్మిచ్చుకోలేనండి పాతికరూపాయలు డాఖలు చేసుకుంటాను.

కామ—పెద్దమనుష్యులకు మాటయిచ్చినతరువాత మరివక లాగు చెయ్యడం క్రమంకాదు. వెధవసొమ్ము నీవు పాతికరూపాయల కోసం వెనుకతీస్తే, నిష్కారణంగా నీవ్యాజ్యం పాడవుతుంది. ముందుకూడా మనకు ఆయనవల్ల కావలసినకార్యం చాలావున్నది.

వీర—తమసిత్తం. ఇయిగోరూపాయలు.(అనియిచ్చుచున్నాడు)

కామ—మీఅన్న యిల్లేమో కాలిపోయిందనివిని మీవూరు వెళ్ళిపోయినాడని అతని ప్లీడరు చలపతిరావుగారు చెప్పినారు నిజమేనా?

వీర—మావూరినుంచి మనిషివచ్చినాడు. ఇల్లు కాలిపోయిన మాట నిజమే.

కామ—అరుగో దొరగారు వస్తూవున్నారు. ముందుగా మన వ్యాజ్యమే వస్తుంది. గుమ్మములో నిలుచుండి సలాంచెయ్యి.

[జడ్జీగారు ప్రవేశించి, బెంచిమీద కూర్చున్నారు.]

డభేదారు—మాటాడకండి. దొరగారు జుల్మానాయేస్తారు. యెవరోయిబంట్రోతు పంఖాలాగు.

[కోర్టుగుమాస్తా ఆనందరావు కొన్ని రికార్డులుపట్టుకొని] ప్రవేశించుచున్నాడు.]

అనంద—బంట్రోత్. చలపతిరావుగారినీ, కామరాజుగారినీ పిలువు. రా—డిస్ట్రిక్టు మునసబుకోర్టుఫయలు అసలు నెం ౫౬౭౭రు, యీ కోర్టుఫయలు అప్పీలు నెం 32౫౫రు ప్రతివాది అప్పీల్లెంటు తప్పల దొరయ్యతరపు ప్లీడరు చలపతిరావుగారు, వాది రెస్పాం డెంటు తరపు ప్లీడరు. కామరాజుగారు—హాజరువున్నారా?

కామ—చిత్తము. హాజరువున్నాము.

చల—(దగ్గరనున్న మరియొక ప్లీడరునుజూచి) నాయుడు గారూ! కామరాజుగారు దొరగారితో యింగ్లీషున చెపుతూవున్నది యీ కేజునుగురించేనా?

న్యాయ—అవును. మీ కేజులోనే హీరింగు చేస్తూవున్నారు.

చల—కోర్టువారితో నాది వొక్క మనవివున్నదండి. యీ కేజులో కామరాజుగారు చెప్పుతూవున్నది కేవలం అబద్ధమండి. కోర్టువారిని పొరబెడుతూ—

ఆనంద—ఊరుకోవయ్యా. యెదటిప్లీడరు హీరింగు చేస్తూవుంటే మధ్య మాట్లాడుతావు! దొరగారికి తెలుగు తెలియదు వూరుకోండి.

చల—యీ వ్యాజ్యం వట్టి దొంగవ్యాజ్యమండి. కేవలం విరోధంచేత వచ్చినది. కిందికోర్టులో మునసబుగారు బహు అన్యాయం చేసినారు. యేలినవారు న్యాయం—

ఆనంద—ఈపాటి హీరింగుచాలించి వూరుకోండి. దొరగారు తీర్పు వినిపించబోతూన్నారు.

చల—దొరగారేమిటో ఇంగ్లీషున సెలవిస్తూవున్నారు.

ఆనంద—కిందకోర్టువారితీర్పునుతిప్పివేయడానికియేమీసబబులు కనుపడడం లేదు గనుక కిందికోర్టుతీర్పు ఖాయంచేసి ఉభయకోర్టుల లోనూ ఉభయవాదులకూ అయినఖర్చులు అప్పిల్లెంటు యిచ్చుకో గలందులకు తీర్పు చేసినామని సెలవిస్తూవున్నారు.

కామ—(వెలపలకువచ్చి చెట్టుకింద నెవరితోనో మాటాడు చున్న వీరన్నను జూచి) వీరన్నా! దొరగారు వ్యాజ్యం మనపక్షం చేసినారు. నిర్ణయించుకొన్నఫీజు యిదివరకే యిచ్చివేసినావుగదా? యిక నాబహుమతి రావలెను. ఆమనిషి యెవరు? యేమి? వ్యాజ్యం గెలిచినదన్న సంతోషం లేకుండా అలాగు విచారంగా కనపడుతూ వున్నావు?

వీర—నిన్నరాత్రి మాయింట్లో దొంగలుపడి, వేరే మొగ దిక్కు లేకపోవడంచేత సర్వస్వాపహారం దోచుకొనిపోయినారని

వర్తమానం తెచ్చినాడు. నాకేమీ తోచకుండావున్నది. ఇప్పుడీ మనిషితో వెళ్ళివచ్చి దర్శనంచేసుకొంటాను.

(అని వెళ్ళుచున్నాడు.)

---

3. ప్రదేశము—కేసవరగ్రామము.

[యునసబుకోర్టు బేటామీనుదానయ్య వాదివీరన్నను వెంటబెట్టుకొని]
(ప్రవేశించుచున్నాడు.)

దాన—పాతికరూపాయలకు చిల్లిగవ్వ తక్కువయితే నేను పుచ్చుకోను. వెధవది స్థిరాస్థిజప్తులలో పుచ్చుకొంటాను యాభయి రూపాయలు.

వీర—దయచేసి యీపదిరూపాయలూపుచ్చుకొని కార్యం సరపరాకీ సెయ్యండి. బాబూ! బాబూ! యింకోతూరి మిమ్మల్ని సమాధానం చేసుకుంటాను.

దాన—ఈమాటలేమీ నాదగ్గిర పనికిరావు. నీవుయిస్తానన్న పదిరూపాయలూ హేడ్డుగుమాస్తాకేపోతవి. నేను చెప్పినప్రకారం ఇచ్చుకోనిపక్షమున, రెండురుబ్బురోళ్ళమన్ను రెండుబక్కగొడ్లనూ జప్తుచేసుకొని వెళుతాను. రుబ్బురోళ్లు అమ్మితే కోర్టుకు పట్టించుకు వెళ్ళడానికి ఐనకూలిలో నాలుగోనంతైనా రాదు. మేతఖర్చూ కూలివాడిజీతమూగాక ఈ బక్కగొడ్లు కాపలాక్రిందరోజువక్కంటికి ఆరణాల చొప్పున యాభయిరూపాయాలైతే, అప్పుడు చచ్చినట్టు యిచ్చుకుంటావు.

వీర—బాబూ! బాబూ! మీరన్నట్టు డాకలుచేసుకుంటాను ఆలాసెలవియ్యకండి.

(అని సొమ్మిచ్చుచున్నాడు.)

దాన—నేను భోజనంచేసి ఫదిగంట లయినతరువాత జప్తుకు వస్తాను. బ్రాహ్మణయింట్లో రెండుకూరలతో వంటబాగా చెయ్యమని చెప్పి వచ్చినావా? మంచివి చిక్కనివి రెండు శేర్లు ఆవుపాలున్ను అర్ధసేరు కమ్మని నెయ్యిన్నీ కూడా వేగిరం నీవు యింటికివెళ్ళి పంపించు. నాకు పెందరాడే భోజనంచెయ్యడం అలవాటు; ఈలోగా కాళ్ళు గుద్దడానికి వకమంగలవాణ్ణి ముందుగా పంపించు.

వీర—ఇప్పుడు ముందుగా జప్తుకు వెళ్ళకపోతే ఆస్తి చెపాయిస్తారు. నేనన్నీ జాగర్త పెట్టిస్తాను. మనం వకతూరి యిప్పుడే యెళ్ళి కొన్ని వస్తువులు జప్తుచేసుకొని వత్తాం.

దాన—కోర్టురూల్సుకు వ్యతిరేకం చెయ్యకూడదు. ఫదిఘంటలయితేనేకాని జప్తుచెయ్యడానికి వల్లపడదు. నీవు బసకు వెళ్ళి నేను చెప్పినట్టు జాగ్రత్తపెట్టించు.

వీర—సిత్తం (అని వెళ్ళిపోయినాఁడు.)

---

౪. ప్రదేశము—ఆగ్రామములోనే ప్రతివాది దొరయ్యయిల్లు.

[ఉదయము ఎనిమిదిగంటల వేళ అమీనా దానయ్య ప్రవేశించుచున్నాడు.

వీర—యెవరండి మీరు మాయింటికివచ్చినారు?

దాన—(కోర్టు మొహరుతోవున్న కాగితము నొకదానిని పయికితీసి) యిదుగో వీరన్నకూ నీకూ జరిగిన వ్యాజ్యంలో వాదికయిన ఖర్చులనిమిత్తం నీఆస్తిజప్తు చెయ్యమని వారంటయినది.

దొర—అయితే ఇప్పుడేంసేస్తారండి?

దాన—ఆడవాళ్ళ మెళ్ళల్లోవున్న పుస్తెలకాడనుంచీ జప్తుచేసి కోర్టుకు పట్టించుకొని వెళుతాను.

దొర—ఖరుసులమొత్తం సెపితే రొక్కం యిచ్చుకుంటాను. బాబూ! బాబూ! నాయింటిగుట్టు బైటపడెయ్యవద్దు.

దాన—ఆసొమ్ము పుచ్చుకోవడానికి కోర్టువారి హుకుం లేదు. నీ వ్యవసాయానికికూడా భంగ వచ్చేటట్టు కాళ్ళూ మోళాలూ పశువులుకూడా జప్తు చేసి తీసుకుపోతాను.

దొర—బాబూ! బాబూ! మీకేమయినా యిచ్చుకుంటాను. వాటినిమాత్రం వదిలి వెయ్యండి.

దాన—అలాగయితే తక్షణం పాతికె రూపాయలు తెచ్చుకో.

దొర—పాతికె రూపాయలు తెచ్చుకోలేను. పదిరూపా—

దాన—నాతో వేరే మాటాడవద్దు. నీయింట్లో కనపడ్డ ఆస్తి అంతా యిప్పుడు జప్తు చేస్తాను.

దొర—సిత్తం. సిత్తం. తమసెలవుప్రకారం డాఖలుచేసుకుంటాను. జప్తు సెయ్యకండి. (అని లోపలికివెళ్ళి సొమ్ము తెచ్చి యిచ్చుచున్నాడు.)

దాన—నీయింట్లోవున్న నగలూగిగలూ యిప్పుడే వేరేదాచుకో

[ఒగర్చుచు వీరన్న ప్రవేశించుచున్నాడు.]

వీర—బాబూ! మంగలాణ్ణి తీసుకొని బసలోకి యెళ్ళేటప్పటికి మీరు యిక్కడికి వెళ్ళిరారని తెల్చి, గుండెలుకవుక పరుగెత్తుకొని వచ్చాను.

దాన—మంచిపని చేసినావు. ఇలారా. (అని చాటుకు పిలిచి రహస్యముగా) నీవు వెళ్ళినతరువాత దొరయ్యయేమో ఆస్తి చపాయించడానికి ప్రయత్నంచేస్తూన్నాడని తెలిసి, నీవులేకపోయినా వెంటనేవచ్చి పూరిపుడకయినా అవతలికి తర్లకుండా జాగ్రత పెడుతూవున్నాను. అనుకొన్న ప్రకారం యిచ్చినతరువాత నేను స్వామిద్రోహం చేస్తాననుకొన్నావా?

దొర—గొప్పవారు మీరాలాగున యెందుకు సేస్తారు?

దాన—మాట అనుకొన్నతనువాత యెదటి వాణ్ణి మంచి లక్ష వచ్చినాయెప్పుడూ తిరగిపోను. ఛీ! వెధవధనం గుకిసేటిముండగడి

స్తుంది. మాటప్రధానం. నీకార్యం అయినతరువాత నాకష్టంచూచి మరిఫదిరూపాయలు నిన్నే అడిగితే యిస్తావు. నీవు వెళ్ళి మధ్యవర్తిగా వుండడమునకు కరణాన్ని పిలుచుకొనిరా.

వీర—సిత్తం. (అని వెళ్ళుచున్నాఁడు.)

దాన—దొరయ్యా! వేఱేపని చెప్పి వీరన్నను పంపివేసినాను. అతను వచ్చేలోగా మంచివస్తువులన్నిటిని అవతలికి జేరవెయ్యి.

దొర—నగలపెట్టెను తీసికొనివెళ్ళి సత్తెప్పగారియింట్లో పెట్టివస్తానండి. (అని పెట్టెను తీసుకొని వెళ్ళిపోవుచున్నాఁడు.)

[ఇంతలో మరల వీరన్నప్రవేశించుచున్నాఁడు.]

దాన—ఏమోయి వీరన్నా! వక్కడికే వచ్చినావు?

వీర—కరణం వకపట్టాన వచ్చినాడు కాడండి. చివరకు రెండు రూపాయలువప్పుకొని బతిమాలి బయలుదేరతీసుకొచ్చినాను. దోవలో యెవరితోనో మాట్లాడుతూవస్తాము పదమంటే నేను ముందుగావచ్చినాను.

దాన—మునసబుగారికి పట్టించుకొని వెళ్ళవలెను. మధ్యాహ్నానికి మంచి కర్పూరమువంటి ఆవునెయ్యిరెండుసేర్లు జాగ్రత్తచేయించగలవా?

వీర—మాయింట్లో లేదు. వూళ్లో కనుక్కుంటానండి.

[కరణము వెంకటరత్నము ప్రవేశించుచున్నాఁడు.]

దాన—కరణముగారూ! రండి. మీకోసమే చాలాసేపటినుంచి కనిపెట్టుకొనివున్నాము. మీరు మధ్యవర్తులుగావుండి జాబితా తయారుచేయించవలెను.

వెంక—వట్టి వెట్టిపని. నాకు దొరికేదీ పెట్టేదీ లేదు. ఘడియకొక్కమాటు కోర్టుఆవిమానువచ్చి 'జవు జవ్వు' రమ్మంటోవస్తాడు. నాకు యిప్పుడు తీరుబడిలేదు.

దాన—మీరు ఆలాగనడానికి కోర్టువారిపనా? లేక నాస్వంత పనా? మీరు తిరగబాటు చేసినారని రిపోర్టువ్రాస్తే, మాటవస్తుంది సుమండీ.

వెంక—నాకిప్పుడు రివిన్యూవ్యవహారంవున్నది వుండడానికి వల్ల కాదు. మీమనసువచ్చినట్లు రిపోర్టువ్రాసుకోండి. మీరువచ్చి సర్కారురివిన్యూపని ఆటంక పెట్టినారని బకీరు వ్రాస్తాను.

దాన—వీరన్నా సామానుయేమీ అవతలకు వెళ్ళకుండా నీవు జాగ్రతగాచూస్తూవుండు. నేనూకరణంగారూ వాకిట్లోకివెళ్ళిమాట్లాడి వస్తాము—కరణంగారూ! నక్కసారి వీధిలోకి దయచెయ్యండి. (అని వెళ్ళుచున్నారు.)

వెంక—ఇందులో మా కేయినా యిప్పించడంవున్నదా? అంతా మీరే పుచ్చుకోవడమా?

దాన—నోరయ్యా ఆ స్తి జపు అక్కరలేకుండా నగదుసొమ్ము చెల్లిస్తానన్నాడు. నేను వల్లపడదని బెట్టుచేసినాను. మీసిఫారసు మీద రొక్కం పుచ్చుకోవడానికి నేనంగీకరించినట్లు నటిస్తాను. మీ రందులో నాలుగురూపాయలు రాబట్టుకోండి.

వెంక—కొత్తగా వూరినుంచి దిగివచ్చినవారు నిముషములో మీరే వందలూ యాబైలూ కొట్టుకపోతూంటే చిన్నప్పటినుంచీ గ్రామం కనిపెట్టుకునివున్న కరణంవాడికి నాకు వక్కనాలుగురూపాయలా? ముష్టి నాలుగురూపాయలు.

దాన—నేను హంశాయీల ఆస్తికూడా జపుచేయిస్తానని బెదిరిస్తాను. మీరు సాధ్యమయినంత సొమ్ము రాబట్టడి చెరిసగ మూ పుచ్చుకొందాము.

వెంక—ఈయాలోచన బాగావున్నది. రండి లోపలికి వెళ్ళు దాము. (అని వెళ్ళుచున్నారు.)

దాన—దొరయ్యా! వేగిరం నీసామానుచూపించు. కరణం గారు జాబితా వ్రాస్తారు.

దొర—కరణముగారూ!ఎలాగయినాజప్తు లేకుండా చెయ్యలేరా?

వెంక—దొరయ్యా! ఇలా దగ్గిరగారా. (అని పిలిచి చెవిలో) ఫదిరూపాయలసొమ్ము అమీనావాడి చేతిలో పారవేసి వారంటు మొత్తం రొక్కం ధాఖలుచేస్తా. నీకు నామూషీరాకుండా నేను వాణ్ని పంపివేస్తాను.

దొర—నేను మొదట యియ్యబోతే రూల్సులేదని పుచ్చుకున్నాడుకాడు.

వెంక—నీకెందుకు సొమ్ముతీసికోనిరా. నేను సమాధాన పరుస్తాను.

దొర—ఇప్పుడు తీసుకునివస్తాను. (అనిలోపలికివెళ్లుచున్నాడు)

దాన—ప్రతివాదిసొమ్ము యీచుట్టుపట్ల యిళ్ళల్లో దాచినట్టు అనుమానంగా వున్నది. వెళ్ళి కనుక్కుందాము వక్కసారి వీధిలోకి రండి.

[అని యిద్దఱును బయలుదేఱి వెళ్ళుచున్నారు]

వెంక—ఏమోలు మద్దిపట్ల సత్తెప్పా! నీకోసం అమీనాగారు వచ్చినారు. వక్కపర్యాయం వీధిలోకిరా.

సత్తె—(లోపలినుండివచ్చి దండములుపెట్టి) యేమండిబాబూ!

వెంక—మీరేమో దొరయ్యతాలూకు ఆస్తి కమ్మాపఱిచి దాచినారని అమీనాగారికి తెలిసి, మీఅందఱి యిళ్ళూ సోదాచేసి జప్తుచేస్తామంటూవున్నారు. ఈచుట్టుపట్ల పెద్దకాపులందఱినీ పిలుచుకొనిరా.

సత్తె—సిత్తము. (అని నలుగురుకాపులను తీసికొనివచ్చుచున్నాడు.)

వెంక—ఏమోయి పెద్దకాపులు? దొరయ్య తనవస్తువులేమో మీయిళ్ళల్లో దాచినాడని, అమీనాగారు మీఆస్తి జప్తుచెయ్యక మానమంటూవున్నారు. మీరేమి చెపుతారు?

కాపులు—మేమేమీ యెరగము, మమ్మల్ని రక్షించవలెను.

వెంక—మీపొడిమాటలు పనికిరావు. తలావక ఫదిరూపాయలూ యిచ్చుకుంటే వదిలిపెడతారు.

దాన—దొంగలు. వీళ్ళను వొక్కక్కణ్ని పదిరూపాయలతో వదిలిపెట్టగూడదు. మనిషివక్కంటికి యిరవయి రూపాయలకు తక్కువవల్లపడదు.

వెంక—నామనవివిని నేనుచెప్పినట్టు అంగీకరించవలెను— ఓరీ! మీరు మారుమాటాడక రూపాయలు వేగిరం తెచ్చుకోండి.

కాపులు—సిత్తము. (అనివెళ్ళి సొమ్ము తెచ్చియిచ్చుచున్నారు

దాన—కరణంగారూ! లోపలికివెళుదాముర౦డి.

(అని ఇద్దఱును దొరయ్యఇంటిలోనికి వెళ్ళుచున్నారు.

దొర—(సొమ్ము తెచ్చి కరణముచేతిలో పెట్టి) మీరేలాగైనా అనుగ్రహించవలెను,

వెంక—అమీనాగారూ! నాప్రార్థనవిని యీసొమ్ముపుచ్చుకొని మీరెలాగైనా దొరయ్యను తేల్చండి.

దాన—కరణంగారు సిఫారసుచేస్తూవున్నారు గనుక, పైని నాకు మాటరావడానికై నా వప్పుకుని వారంటుమొత్తం పుచ్చుకొని రసీదుయిస్తున్నాను. దొరయ్యా! నీవు కరణంగారిమాట మరచిపోకు.

వెంక—వూళ్ళోవాళ్ళము తెల్లవారిలేస్తే మాకు వెయిపనులు వుంటవి. దొరయ్య ఇందులోగాకపోతే యెందులోనైనా నాకు నాలుగువరాలసొమ్ము ముట్టచెపుతాడు.

(కరణమును, అమీనాయును వెళ్ళుచున్నారు.)

చతుర్థాంకము.

౧. ప్రదేశము—కేసవరగ్రామము; దొరయ్యసావిడి.

[హేడ్డుకనిష్టేబిలును, మఱియొక కనిష్టేబిలును, దొరయ్యయు ప్రవేశించుచున్నారు.]

హేడ్డుక—ఏమోయి దొంయ్యా! మీయిల్లు కాలిపోయి యెన్నాళ్ళయినది?

దొర—బాబూ! పదిదినా లవుతుందండి.

హేడ్డు—యేమీ? మీవూరికి నాలుగుకోసులలో పోలీసు ష్టేషనువుంటూ వుండగా మాకు వర్తమానం చెయ్యకుండా యింత కాలము యెందుకువుపేక్షచేసి వూరుకున్నావు? నేరంకమ్మా చేసినందుకు యిప్పుడు నీమీద చార్జి షీటుచేస్తాం జాగ్రత.

దొర—(గడగడ వణకుచు) బాబూ! బాబూ! నేనప్పుడు వూళ్లో లేనండి. యేజ్యానికి కెళ్లినాను క్షమించాలండి. (అని కాళ్ళ మీద పడుచున్నాడు.)

హేడ్డు—(కన్నులెఱ్ఱచేసి కాలుతీసుకొని) వూళ్లో లేకపోవడం వుండడం మాకు జరూరు లేదు. ఇదిసర్కారుహుకుమా మరివకటా? —ఏమోయ్ కనిష్టేబిల్! ఇతణ్ని ష్టేషనుకు తీసుకునివెళ్ళి కొట్లో పెట్టు. నేను రెండో కేజు దర్యాప్తు చేసుకొని సాయంత్రానికివస్తాను.

దొర—బాబూ! నన్ను వదిలివెయ్యండి. తమ కేమయినా డాఖలు సేసుకుంటాను.

హేడ్డు—యేడిసినావు. మావుద్యోగం తాహతుకు నీవేమి యియ్యగలవు? మహాయిస్తే ఫదిరూపాయలిచ్చేవు ఇరవైరూపాయ లిచ్చేవు. ఇంతేనా మఱియేమైనావున్నదా?

దొర—చంద్రుడికొక్క మూలుపోగన్నాడండి. నామనవి సిత్తగించవలెను. పాతికరూపాయలు రొక్కం యిచ్చుకుంటాను. యేలాగైనా తమరు అనుగ్రించి నాపరువు పతిష్టలు నిలవబెట్టక తప్పదు.

హేడ్డు—వూరికే అఘోరిస్తూ వున్నావుగనుక వెల్లి వేగిరం రూపాయలు తెచ్చుకో. మీచచ్చిపోయిన అన్నగారికీ నాకూవుండే విహితాన్నిపట్టి నిన్ను వదిలివేస్తూ వున్నానుగాని ముష్టిరూపాయలు చూచికాదుసుమా?

దొర—అవునండి నేనెరగనా? బాబూ? యీ వేళయేలినవారు నాపరువు పోకుండా కాపాడినారు. (అని లోపలికివెళ్ళి రూపాయలు తెచ్చిచేతిలోబెట్టుచున్నాడు.)

హేడ్డు—దొరయ్యా! యిఖనీపువెళ్ళి హేడ్డుకనిష్టేబిలుగారి సెలవైందని మీవూరి కరణాన్ని తీసుకునిరా. ఈలోగా నేను నీకేజు దస్తావేజు చేసి కొట్టివేస్తాను. బొత్తిగా విమర్శచెయ్యకపోతే బాగా వుండదు.

దొర—సిత్తం. (అని వెళ్ళుచున్నాడు.)

హేడ్డు—ఓయీ! వెంకటస్వామీ! నీవంతురూపాయీపుచ్చుకొని వేగిరం దొరయ్య హంశాయీలనందరినీ లాక్కొనిరా. వాళ్ళ వద్దకూడా యేమయినా తంటాలు పడుదాము.

[కనిష్టేబిలు యిద్దఱుముగ్గురు కాపులతో మరల ప్రవేశించుచున్నాడు.]

కని—అయ్యా! ఇద్దరు పెద్దకాపులు విధిలోకూర్చున్నవారే దూరాన్నుంచి నాకోటూ యెర్రితలగుడ్డాచూచి పారిపోయి లోపల దాక్కొని యెన్నిపిలిచినా బయటికి వచ్చినారుకారండి. ఆడవాళ్ళు యింట్లోలేరంటారు.

హెడ్డు—పోనీ. వాళ్ళనువారంటుచేసి పట్టితెప్పించి కొట్లో పెట్టి మెత్తగా దంచితేనేకాని వాళ్ళరోగం కుదరదు — ఏమోయి కాపులు. మీరుదొరయ్యకు హంశాయీలుకాదా? ఆతనియిల్లు యేలాగు కాలిందో కారణం మీకు తెలుసునా?

కాపు—బాబూ! మాకేమీ తెల్దండి.

హెడ్డు—ఛీఛీ! మీరు తెలియదంటే పోతుందనుకొన్నారేమి? అతనువూళ్లో లేనప్పుడు మీరందరున్నూచేరి విరోధంచేత యింటికి నిప్పుపెట్టి యేమీయెరుగనివాళ్ళవలె గప్పుచిప్పుమనకుండా వూరుకున్నారు. నిజమంతా మాకు తెలిసిందిలే.

కాపు—మాకుగిట్టనివాళ్ళు తమతో యేమి సెప్పినారోగాని మేము యేదోషమూ యెరుగమండి.

హెడ్డు—మీరు యీలాగు నిజంచెప్పరు. సాక్ష్యంరుజువుపడి జయలులోకి వెళ్లేటప్పుడు చెప్పుతారు.

కాపు—మీపాదాలతోడు మాకేమీ తెల్దండి.

కని—ఆయనకేమయినాయిచ్చి కాళ్లూకడుపూపట్టుకుని సమాధానంచేసుకుంటే కుదురుతుందిగాని అదేపనిగా లేదు లేదంటే పోతుందిటోయి.

హెడ్డు—(జేబులోని నోటుబుక్కును పయికితీసి) మీపేర్లూ యింటిపేర్లూ చెప్పండి.

కాపు—మేమందరమూకలిసి ఫదిరూపాయ లిచ్చుకుంటాము మామీదికేమీరాకుండా తేల్చివెయ్యాలనండి.

హెడ్డు—మీరింతమందిచేరి ఫదిరూపాయలా యిచ్చుకుంటారు? మనిషివక్కంటికి ఫదేసిరూపాయ లిచ్చుకోండి.

కాపు—బాబూ! మేమంతమట్టుకు తెచ్చుకోలేమండి. మొన్న నిష్కారణముగా కోర్టు అమీనావాడు బోలెడురూపాయలు దోచు

కోనిపోయినాడు. రేపటి జమాబంది ఖర్చుకింద కరణంగారు సొమ్ము తెమ్మంటూవున్నారు. ఈయేడు పంటలేమీ బాగా పండలేదండి.

హేడ్డు—మాకవేమీ తెలియవు. నేనేమో మొట్టమొదట పేరుపెట్టినాను. నేను అన్నతరువాత మరోలాగు పుచ్చుకోను.

కని—నామనవి చిత్తగించి తలాపక అయిదురూపాయలూ యిచ్చుకుంటారు. ఆప్రకారం తమరనుగ్రహించాలెను.— ఏమోయి కాపులు? మీరు వెళ్ళి సొమ్ము తెండి.

హేడ్డు—ఆలాగు పనికిరాదు.

కని—(రహస్యముగా) మీకెందుకు? మీరు సొమ్ము తెచ్చి నాచేతిలో పడవేస్తురూ. నేను మీమీదకేమీ రాకుండాచేస్తాను. (అని కాపులనుతీసికొని వెళ్ళుచున్నాడు)

---

౨. ప్రదేశము—వీరన్నయిల్లు.

[హేడ్డుకనిస్టేబిలును, కనిస్టేబిలును, వీరన్నయుప్రవేశించుచున్నారు]

హేడ్డు—వీరన్నా! మీయింట్లో జరిగినచోరీ మీఅన్న దొరయ్య సలహామీద జరిగినట్టుతోస్తుంది. నీకూ అతనికీ విరోధంకాదా?

వీర—మాయింట్లో చోరీపోయినప్పుడు దొరయ్య వూళ్ళో కూడాలేడండి. వున్నా అతను అలాగంటిపని జరిగించేవాడుకాడు. వెనుక బాపిరాజుగారి కుట్రచేత మాయిద్దరికీ వివాదలు వచ్చినవి గాని యిప్పుడేమీ విరోధంలేదండి.

హేడ్డు—అయినా నీవు వ్యాజ్యం గెల్చుకొన్నావన్న యీర్ష్య చేత మీయింటి కతనే కన్నంవేయించి వుంటాడు.

వీర—నేను యాజ్యం యేమిగెలవడమండి? భూమిఖరీదుకంటే నాకు ఫదిరెట్లుసొమ్ము ఖర్చయినది. మాఅన్నా చాలాసొమ్ము ఖర్చు పోయినాడు. నిష్కారణంగాయిద్దరంకూడా పాడయిపోయినామండి.

హేడ్డు—ఆమాటలకేమి నేనడిగినదానికి జవాబుచెప్పు. మీ అన్నసలహా లేకపోతే మీయింట్లోనే దొంగలుపడడానికి కారణమేమి వుంటుంది!

వీర—మా యిరోదుల కుట్రచేత యీవూళ్లోవాళ్ళే యీపని చేసినారుగాని మరోవూరునుంచి దొంగలు రాలేదండి.

హేడ్డు—నీకెవనిమీదనైతే అనుమానంవున్నదో వాళ్ళపేర్లన్నీ చెప్పు.

వీర—సిత్తం. (అని తనకు విరోధులుగాన్న వారియొక్కయు, అనుమానమున్న వారియొక్కయు పెద్దజాబితాను వ్రాయించినాడు)

హేడ్డు—సుందర మీయింట్లోపోయిన వస్తువులజాబితా వ్రాయించు.

వీర—ఇత్తడిచెంబు, కంచము, వెండిమొలతాడు—

హేడ్డు—ఉండు వ్రాసుకోనీ. (అనినోటుబుక్కుతీసి పెన్‌సిలుతో వ్రాయుచున్నాడు.) యిత్తడిచెంబు, కంచుకంచము, వెండిమొలతాడు, వెండికడియాలజత—

వీర—కడియాలజత లేదండి.

హేడ్డు—నీపెళ్ళానికి చేతికి కడియాలున్నవా? లేవా?

వీర—ఉన్నవికానండి, అవి అప్పుడు నాపెళ్ళాము చేతులను పెట్టుకొని పరున్నందున పోలేదండి.

హేడ్డు—పోకపోతేయేమి? పోయినట్టు వ్రాయించి అవినాచేతికియ్యి. దొంగవస్తువులు పట్టుకోవడములో వీటితో చాలాపని వుంటుంది.

వీర—సిత్తము.

హేడ్డు—ఎవరియిల్లయినా సోదాచేసేటప్పుడు యీవస్తువులు నీవేనాయని యడిగితే అవి నీవయినా కాకపోయినా నీవే అనిచెప్పు.

వీర—సిత్తము.

హేడ్డు—నీయింట్లోవున్న జేబులో యిమిడే రెండువస్తువులు నాచేతికిచ్చి జాబితాలో వ్రాయించు. సంశయిస్తూవున్నావు నేను పుచ్చుకోనులే. వాటిపని అయినతరువాత నీవస్తువులు నీకేవస్తవి.

వీర—సిత్తము. (అని లోపలికివెళ్ళి రెండుమూడు చిన్నవస్తువులను తెచ్చియిచ్చు చున్నాడు.)

హేడ్డు—ఓయీకనిస్టేబిలు! ఈబంగారపు బొగడలజత నీవద్ద వుంచుకొని మేము సోదాచేస్తూవున్నప్పుడు యెవరూ చూడకుండా యేపెట్టెలోనో బుట్టలోనో పడవెయ్యి.

కని—అలాపడవేసి మనము యేమీదొరకలేదని వెళ్ళిపోయేటప్పుడు పలానిస్థలము సోదాచెయ్యలేదని నేనంటాను. మీరప్పుడందరినీ యెదుటవుంచుకొని మరి వకరిచేత ఆస్థలం సోదాచేయిస్తే వస్తువుదొరుకుతుంది.

హేడ్డు—వీరన్నా! మీయింట్లో పోయిన వస్తువుల కిమ్మత్తు యేమాత్రంవుంటుంది?

వీర—సుమారు రెండువందలరూపాయలు ఖరీదుచేస్తవండి.

హేడ్డు—సొమ్మంతా తెప్పించి నీకిస్తే అందులో మాకేమియిస్తావు?

వీర—ఫదిరూపాయల సొమ్మిచ్చుకుంటానండి.

హేడ్డు—వొరకినదానిలో సగంసొమ్ము యిచ్చుకొని పక్షమున నీకుపోయిన వస్తువులలో వొక్కటీదొరకదు.

వీర—సిత్తము. మీయిష్టప్రకారంచెయ్యండి.

[కరణము ప్రవేశించుచున్నాడు.]

హేడ్డు—ఏమండీ కరణంగారూ! యీవోరీని గురించి మీరు తహశీల్దారుగారికినీ ఇనస్పెక్టరుగారికినీ వ్రాసినబక్కీర్లు మాకు

రిఫరుచేస్తే నేను తనిఖీనిమిత్తం వచ్చినాను. మా కనిస్టేబిలు ప్రతి రోజూ మీగ్రామంవస్తూవున్నాడా?

కర—ఏమో పదిహేనురోజులకు వకపర్యాయంవచ్చి కోడి పిల్లలు మొదలయిన మామూళ్ళు వసూలుచేసుకొని ప్రతిరోజూ వస్తూవున్నట్టు వక్కసారే బుక్కుమీద దస్కతుచేయించుకొని పోతాడండి.

హేడ్డు—దానికేమిగాని మనము సోదాకు వెళుదాము. మరి యిద్దరిని మధ్యవర్తులనుకూడా తీసుకొనిరండి.

(అని అందఱును వెళ్ళుచున్నారు.)

---

3. ప్రదేశము—ఒక కాపువానియిల్లు.

—:o:—

[హేడ్డుకనిస్టేబిలు, కనిస్టేబిలు వీరన్న, కరణము, మఱియిద్దఱు మధ్యవర్తులును ప్రవేశించుచున్నారు.]

హేడ్డు—(రహస్యముగా) ఇందాకా మనముసోదాచేసినవాళ్లే నిజమయిన దొంగలు. వకఁడు నన్ను చాటుకుపిలిచి తమర్ని వదిలి పెడితే నూరురూపాయలు ఇచ్చుకుంటానని చెప్పినాడు. అందుమీద నేనువాణ్ని మెల్లిగా మంచిమాటలతో బుజ్జగించి ఆస్తియెక్కడ దాచినారో అడిగినాను. వాడికేమీ భయములేకుండా వదిలివేస్తా నని చెప్పినమీదట నాచేత ప్రమాణంచేయించుకొని దొడ్లో చింత చెట్టుక్రింద కొంతసొమ్ము పాతిపెట్టినట్టు చెప్పినాడు. వాడివద్దనుంచి నూరురూపాయలూ రాబట్టుకొని తరువాత దొడ్డితవ్వించి సొమ్ము పట్టుకొని వాణ్ని స్టేషనుకు తీసుకునివెళదాము. నీకు మామూలు ప్రకారం నూటికి నాలుగువంతున సొమ్ము వచ్చినతరువాత యిస్తానులే.

కని—ఇక్కడి కాపుమాట యేమిచేతాము?

హెడ్డు—నీదగ్గరవున్న వస్తువులను నీవు బహుజాగ్రతగా యెవరూ చూడకుండా యేపెట్టెలోనైనా వెయ్యవలెనుమా. వీడు చాలాభాగ్యవంతుడట. వీడి యింట్లో చోరీఆస్తి దొరికినట్టు నేరం మోపిదిట్టంగా పుచ్చుకుందాము. మనమనసుపచ్చినట్టు సాక్ష్యం పలికేలాగు యీవూళ్లోవాళ్ళను నీవు నలుగుర్నికుదుర్చు. వాళ్ళకే మయినా నాలగుడబ్బులసొమ్ము ముట్టేటట్టు చేస్తామని ఆశపెట్టు. వాళ్ళందుకు వప్పుకోకపోతే వాళ్ళనుకూడా యీ కేజులో దూరుస్తామనిబెదిరించు. వాళ్ళేవప్పుకుంటారు.

కని—మనం అడిగినంతసొమ్ముయిస్తే వీళ్ళల్లో యెవళ్ళమీదనైనా తేల్చివేతామా?

హెడ్డు—ఆమాట తరువాత చూచుకుందాము. నేరంపట్టుకోకపోతే మనకు క్యారక్టరురాదు. డబ్బుపుచ్చుకొనికూడా "నీవువప్పుకుంటే తేలిపోతుంది. మేము సహాయంచేస్తామని చెప్పి మేజస్ట్రీటుదగ్గిర వప్పించి ఖయిదుచేయింతాము. లేకపోతే వీళ్ళను వదిలివేసి వుప్పర వాళ్ళనయినా యెవరినయినా పట్టుకుని వాళ్ళమీద సాక్ష్యంపలికించి జయిలులోకి తోయింతాము.

కని—వీళ్ళు మనంఅడిగినంత సొమ్ముయిస్తే మీరు తరువాత సెలవిచ్చినట్టుచేస్తే బాగావుంటుంది.

హె—యేలాగయినా చేతాము. మొన్న జేగురుపాడు గ్రామంలో జరిగిన చోరీకేజులో సొమ్ముపట్టుపడ్డవాణ్ని వదిలివేసి, ఆవూళ్లోకరణానికి విరోధంగావున్న వకకాపువానిమీద కేజుదిట్టంగా రుజువుపలికించి సంవత్సరం శిక్ష వేయించినాను. మనవూళ్లోనే మరి వక కేజులో వెనుకటి హెడ్డు కనిస్టేబిలు నేరం పట్టుకోలేక పోతే నేనువచ్చి పూర్వంనామీద ఫిర్యాదుచేసినవాడు వకడు వూళ్లో

వుండగా వాణ్ణిపట్టుకొని కొట్టులోపెట్టి మనసువచ్చినట్టూకొట్టి మేజ స్ట్రీటుయెదుట నేరంవప్పించి నలుగురు దొంగసాక్షులను కుదిర్చి ఖయిదీకి మూడునెలలు శిక్షవేయించినాను. ఆ కేజు పట్టుకొన్నందుకే నాకు ఫస్టుక్లాసుకు ప్రమోషన్ అయినది.

కని—మీరు బహుఘట్టివారుగనుక ఆలాపనిచేసి సుపీరియర్ల క్యారక్టరు సంపాదించినారు. వెనుకటి హేడ్డు కనిస్టేబులు తెలివి తక్కువవద్దన్న. అతనికి లంచంపుచ్చుకోవడమే చాతకాదు. మేము యెవరినయినా కొట్టులోపెట్టి కొడుతూవుంటే వద్దువద్దని మొత్తుకునే వాఁడు. అందుకోసమే అతనికి డీగ్రేడేషన్ అయినది.

కరణము—(అవతలినుండివచ్చి) హేడ్డుకనిస్టేబిలుగారూ! మీరేమో రహస్యంమాట్లాడుతూ వున్నట్టున్నారు. మేమురావచ్చునా?

హేడ్డు—మాకు రహస్యం యేంవున్నది రండి. ఈయింటికాపు వచ్చినాడా? అతణ్ని యెదుటవుంచుకొని మరీ యిల్లు సోదా చెయ్యవలెను.

కర—వీధిలోనుంచి చూచినాను. అతను పరుగెత్తుకొని వస్తూ వున్నాఁడు.

[కాపు ప్రవేశించుచున్నాఁడు]

కాపు—(ఏడ్చుచు) బాబూ! నేను యేకర్మం యెరగను. మా యింటికి కనిస్టేబులు వచ్చారంటే గుండెలుపగిలి పరుగెత్తుకొని వచ్చినాను.

హేడ్డు—తొందరపడకు. నీకు వచ్చిన భయంలేదు. వ్యవహార ధర్మంగనుక వూరికే సోదాచెయ్యడానికి వచ్చినాము. నీవు దొంగతనంచేస్తే భయపడవలెనుగాని లేకపోతే నీకు వచ్చినభయమేమి?

కాపు—నేనేమీ యెరగనుబాబూ! కావలిస్తే నాబోషాణం సూసుకోండి. (అని తాళముచెవి మీదపారవేయుచున్నాఁడు)

హే—మధ్యవర్తులు మీరుదగ్గిరవుండిచూడండి. (అవితాళము తీసి) ఓయీకాపూ! (నీవుకూడా చూస్తూవుండు.)

కాపు—అక్కర లేదు. తమరుతియ్యండి. మీరునన్ను అన్యాయంశేస్తారా యేమిటండి!

హే—ఓయివెర్రిబాడా! మేము సర్కారు జీతంపుచ్చుకుంటూ నిన్ను అన్యాయం చేస్తాముటోయి. చూడు (అని యెరనల్లంచుచీరె పైకితీసి) ఏమోయిచీరన్న! యీచీరె మీదేయేమో చూచుకో.

వీర—(అనుమానించి) యీచీరాండి?

హే—అనుమానిస్తావేమి? నేను యింటికాడ సందేహించవద్దని చెప్పలేదూ? ఇదిగో నీవు జాబితాలో వ్రాయించినావు—యెర్రంచుచీరెవకటి.

వీర—(ఇది వల్లంచుచీరండి)

హే—అంచుయేదైతేనేమోయి? ఇదిఆడవాళ్ళు కట్టుకునేది గనుక నీకు బాగా ఆనవాలు తెలియదు. నీభార్యకు చూపింతాము. అదివేరే మధ్యవర్తులపరంగా వుంపించు.

కాపు—అయ్యా! యిది నాపెళ్ళానికి మాఅత్తవారు మొన్న పెళ్ళిశేసుకొన్నప్పుడు పెట్టినారండి. కావలిస్తే వారిచేత యిప్పుడు రుజువిప్పిస్తానండి,

హే—నీకువచ్చినఫర్వాలేదు. అదివేరేవుండనీ. నీదైతే తరువాత నీచీర నీకేయిప్పిస్తాము. తొందరపడకు.

వీర—ఇఖ యీవస్తువులలో నాదేదీ లేదండి. పెట్టె వేసివెయ్యవచ్చును.

హే—(కోటుజేబులో కుడిచెయ్యిపెట్టి) భాగాచూచుకో. పెట్టెలో బట్టల అడుగున ఆమూల తెల్లగా కనపడుతూవున్నది. అది యేమిటో చూచినావా?

వీర—నా కేమీ కనపడడంలేదండి.

హే—ఓయి వెర్రిబాగులవాడా! నీవవతలవుండు. నేను చూపిస్తాను. (అని పెట్టెలో చేయిపెట్టి బట్టలలోనుండి యనుగునకుపోనిచ్చి కోటుచేతులలోనుండి కడియములజత జాటిచి) అదుగో చూచినావా? బట్టమడతలలోనుండి అడుక్కుపడేటప్పుడు యేలాచప్పుడయిందో. (అని తనచెయ్యిపయికితీసి) నీవీలాగువచ్చి మధ్యవర్తులను తియ్యనియ్యి.

మధ్య—(చెయిపెట్టి వస్తువుపయికితీసి) యిది వెండికడియాల జతండి.

కాపు—(రొమ్ముకొట్టుకొనుచు) ఇదినా పెట్టెలోకి యేలావచ్చిందో నాకు తెలియదండి.

హే—నీవు యెరగకపోతే నీతాళంవేసివున్న పెట్టెలోకి యీ వస్తువు పరాయివాళ్ళు తెచ్చి వేస్తారాయేమిటి? నీవు వెయ్యకపోతే నీభార్య వేసివుండవలెను.

కాపు—యీ పెట్టెతాళం శెవి యెప్పుడూ నాపెళ్ళాంశేతికి యివ్వనండి. నా మొల్లోనే కట్టుకుంటాను.

హే—వీరన్నా! యీవస్తువు నీదేమోచూచుకో.

వీర—నాదేనండి. నిన్నమీరడిగితే—

హే—తెలిసిందివూరుకో. నిన్న నేనడిగితేచెప్పి యీవస్తువు జాబితాలో వ్రాయించినావు. మనకనిష్టేబిలవతలికి వెళ్ళినాడా యేమిటి?

వీర—కామల్సునండి.

హే—వస్తువొక్కటి పట్టుపడ్డదిగనుక యిఖ మనమువాగిట్లోకి వెళ్ళి మాట్లాడుదామురండి. (అని నడుచుచున్నారు.)

కని.— (వీధిలోనుండివచ్చి) యీపత్తివిత్తులబుట్ట సోదా చేసినారా ?

కర—అందులో యేమీవుండ దక్కర లేదు.

హే—అయినాకానీ చూడనియ్యండి.

కాపు—కావలిస్తే నేను గుమ్మరించి చూపిస్తానండి.

హే—ఏదీ గుమ్మరించు చూతాము.

కాపు—(క్రిందగుమ్మరించి) యీబొమ్మసామును నాకు గిట్టనివాళ్లెవళ్ళో నాకొంపతియ్యవలెనని యిందులో వేసినారు కాని నేనేమీ యెరగనండి.

హే—నీవెరగకపోతే మాయమంత్రంచేత యిందులోకి వచ్చినవనుకొన్నావాయేమి?—వీరన్నా! యీవస్తువులు నీవేనా?

వీర—మా వేనండి.

హే—ఓయి కనిష్టేబిల్ నీవీలాగురా. చెవిలోమాట. (అని రహస్యముగా) నేను యితణ్ని నీపరంగా వప్పగిస్తాను కాని వెనకవుండి దోవలో లంచంమాట్లాడిఫరిష్కరించు. (బిగ్గరగా) యీవస్తువులితనియింట్లో పట్టుపడ్డవి గనుక ఇతణ్ని పట్టుకోకతప్పదు. నీవితణ్ని మనపూరుస్టేషనుకు తీసుకొనిపో.

[అందఱును వెళ్లుచున్నారు.]

---

౪. ప్రదేశము—తహశీలుదారుకచేరి.

ఖయిదీలను తీసికొని యిద్దఱుకనిష్టేబిలులును, హేడ్డు కనిష్టేబిలును ప్రవేశించుచున్నారు.]

హే—ఓయి కనిష్టేబిలు! నీవు తహశీలుదారుగారు వచ్చేవరకున్ను ఖయిదీలను దూరముగా చెట్టుకిందపెట్టకొనికూర్చో. మాటాడనియ్యకు.

కని—మంచిది. సలాం. (అని ఖయిదీలతో వెళ్ళుచున్నాఁడు.)

హేడ్డు—(రెండవ కనిష్టేబిలుతో) ఖయిదీలు మనం చెప్ప మన్నట్లు చెప్పేటట్టుగా బందోబస్తు చేసినావా?

కని—మీచిత్తంవచ్చినట్టు బందోబస్తు చేసినాను. మొన్న రాత్రి మనం వాళ్ళనుకొట్లోపెట్టి కొట్టినదెబ్బలు తలచుకుంటే వెయి వరహాలిచ్చినా మఱివకలాగున చెప్పరు. మనముచెప్పినట్టు రుజువు పడితే నిజంచెప్పినారని మేజస్ట్రీటుగారితో సిఫారసుచేస్తానని నమ్మ కంపుట్టేలాగున చెప్పినాను.

హేడ్డు—పల్లెటూరివాళ్లు యేలాపలుకమంటే అలాగే పలుకు తారుగాని, దొంగముండాకొడుకులు మనవూళ్లోవాళ్ళే మనకను కూలంగా పలుకుతామనినమ్మించి తీరా సబుమేజస్ట్రీటుగారి దగ్గిరకు వచ్చి మరివక విధంగాచెప్పి నిన్నతప్పించుకొని పారిపోయినారు; మీదిమిక్కిలి హేడ్డుకనిష్టేబిలు కొట్టినాడనికూడా చెప్పినారు.

కని—ఈ కేజులో యిదివరకే సబుమేజస్ట్రీటుగారివద్ద వప్పించి నాముగనుక యిఖ ఫర్వాలేదు.

హేడ్డు—యీకాపును పట్టుకొన్నందుకు డబ్బుగలవాఁడుగనుక యాభైరూపాయలు దొరికినవి. ఆవూళ్లో బాగాపాటుపడివున్న యిద్దరుకాపులనూకూడా పట్టుకుంటే మనకు చెరివక యాభయి రూపాయల సొమ్మాయిచ్చేదే. కరణంవాఁడు వాళ్ళవద్ద యేమో పుచ్చుకొని పడనిచ్చినాడుకాడు.

కని—మనంపట్టుకొన్న యీయెరకలవాడికి శిక్షఅవుతుంది గాని యీ కాపు వకీలును కుదుర్చుకొన్నాఁడు. ఇతనిమాటనాకు సందేహంగావున్నది.

హే—నాకుఅలాగేవున్నది. ఆవకీలు మహాచెడ్డవాఁడు. ఈవేళ ప్రొద్దున్నవచ్చి ఖైదీతో మాటాఁడవలెనని యేమో చెవులోచెప్పి

పోయినాడు. వుత్తరసాక్ష్యం కోరుకుంటాడట. లంచంయిచ్చి మేజస్ట్రీటు గుమాస్తానూ సబుమేజస్ట్రీటునూకూడా కడతాడు. మనము సాక్షులను తిప్పివెయ్యకుండామాత్రం చూడవలెను.

కని—సాక్షులు ప్రొద్దుటిమంచీ మళ్ళీ కనపడడంలేదు. తెల్లవారుగట్ట యిదుగోవస్తామని వెళ్ళినారు.

హే—పిల్లలుగలవాఁడు యీయెరకలవాణ్ని పట్టుకోవడం కంటే మొన్నకొత్తగావచ్చి వూళ్లోదిగివున్న దొమ్మరివాళ్ళల్లో వకణ్ని పట్టుకుంటే బాగావుండిపోను. వూళ్లోవాఁడుకాడుగనుక వాడి మీద సాక్ష్యంకూడా బాగావచ్చును. పాపం యీయెరకలవాడి పెళ్ళాంబిడ్డలు మహాయేడుస్తూవున్నారు.

కని—వీణ్ని పట్టుకోవడమే బాగావున్నది. చోరీపోయినరోజున దొమ్మరవాళ్ళు ఆవూళ్ళోనేలేరు. ఆరోజునే మనవూళ్ళో వాళ్ళు పంతులుగారియింట్లో ఆడినారు.

[డభేదారు ప్రవేశించుచున్నాఁడు.]

హే—డభేదారుగారూ! సలామండి.

డభే—సలామండి. మీరేమయినా కేజుతీసుకొని వచ్చినారా యేమి? పిడదలయితే మామూలు యిప్పించాలనుమండీ?

హే—దానికేమి? తహశీల్దారుగారు యింకా యెంత సేపటికి వస్తారు?

డభే—వచ్చేవేళ అయింది. యిప్పుడేవస్తారు. ఇన్నాళ్ళూ యీపాటికే వచ్చేవారు. జమాబందీలో వుండడంచేత కొంచెం ఆలస్యంగా వస్తారు.

హే—ఈ కొత్తతహశీల్దారుగారు మంచివారేనా?

డభే—మహారాజు మహామంచివారండి. వెనుక తహశీలుదారు వచ్చినాఁడు వాఁడువట్టి కరోటకుడండీ. వాఁడువున్న నాలుగు

నెలలలోనూ నాకు జీతంరాళ్ళుకాక పైని వక్కదమ్మిడీ అయినా దొరికిదికాడండి. ఆదుర్మార్గుడు గుమాస్తాలకుకూడా వక్క పావలా దొరకనిచ్చినాడుకాడు. ఆ నాలుగునెలలూ మేజస్ట్రీటు గుమాస్తా లబ్బున మొత్తుకున్నాడు. లంచం అడిగినాడని అతణ్ని రెండుమాస ములు సస్పెండుకూడా చేయించినాడు. వెళ్ళిపోతూవెళ్ళిపోతూ నాకు కూడా నాలుగణాలు జరిమానా వేసి మరీపోయినాడు.

హే—ఆతహశీల్దారుణ్ని ఇక్కడనుంచి యెందుకు బదలా యించినారు? ఒక మద్దాయీని కొట్టినానని నామీఁదకూడా కేజు చెయ్యడానికి సిద్ధమయినాడు. సాక్ష్యం దొరక్కపోవడంచేత తప్పి పోయింది.

డభే—హుజూరువాళ్ళకు యేమీ యివ్వకపోవడంచేత వాళ్ల కతనిమీఁద మహా కోపంగావుండేది. తాను లంచంపుచ్చుకోక హుజూరుగుమాస్తాలకు తాలూకాలో యేమీ యిప్పించకపోవడమే కాకుండా సప్లయిఅయినా తిన్నగా చేయించేవాఁడుకాడు. కావలిస్తే డబ్బిచ్చి కావలసినవస్తువులు కొనుక్కోమనేవాడు. పదిహేను రూపాయలు జీతంపుచ్చుకొనే వొక్కగుమాస్తా పెళ్ళున పన్నెండు బోయీల సవారీమీఁదవచ్చి నెలకు నూరేసిరూపాయలు ఖర్చుచేసు కుంటూ జమాబందీ అయి యింటికి వెళ్ళేటప్పుడు వెయ్యేసిరూపా యలు పట్టుకువెళుతాడు. ఏలాగూ సంపాదించకపోతే డబ్బుయేలాగు వస్తుంది? ఇప్పుడసలే సర్కారువారు నవుకరీవఖరు చచ్చిపోయింది. నాచిన్నతనంలో కరణాలిని చింతచెట్లకు విరిచి కట్టికొడితే దిక్కూ దివాణం లేదు. నేనప్పుడు నాలుగురూపాయల బంటోతుపనిలో వున్నాను. నాకు మాతాలూకావూళ్ళల్లో గ్రామం వక్కంటికి సాలుకు పదేసిరూపాయలు మామూలుండేది. ఇప్పుడు మాతో పని

వుంటే యిస్తారుగాని లేకపోతే కరణాలవాళ్ళు మాట్లాడనయినా మాట్లాడరు.

హె—వెనుకటి తహశీల్దారు బదిలీమాట చెప్పినావేకావు.

డభే—అవును మరిచిపోయినాను. ఆలాగు అతనిమీద హుజూరు వుద్యోగస్తుల కందరకూ విరోధంవుండటంచేత మా తాలూకా గుమాస్తాలు నిత్యమూ ఆయనమీంద ఆకాశరామన్న అర్జీలు కలక్టరుగారికి పంపిస్తూవుండేవారు. అందుమీద శిరస్తాదారు గారు దొరగారితో మాటాడి ఆయనను మన్యంలోకి పారవేయించి నారు.

హే—ఇప్పటి తహశీల్దారుగారు మంచివారేనా?

డభే—బహుమంచివారు. ఈయనవచ్చినతరువాత మేజస్ట్రీటు గుమాస్తా యీ నాలుగు నెలలలోనూ వెయ్యిరూపాయలు సంపాదించి యిప్పుడు మంచి పెంకుటియిల్లు కట్టిస్తూవున్నాడు. ఈయన తానూ దిట్టంగా పుచ్చుకుంటాడు; ఇతరులకూ దొరికేటట్టుచేస్తాడు. నా మామూలు పావలా ముందుగా పెడితేనేకాని మనివర్జీలిచ్చుకొనే వార్ని యెవర్నీ తహశీల్దారువద్దకు పోనియ్యను. గుమాస్తాలకు మామూలు యిచ్చుకోకపోతే సముజాయిషీకావలెనని సూకుం వ్రాసి పిలిపించి కరణాల్ని సొమ్ము యిచ్చేదాకా యీ వూళ్ళో పదిహేనేసిరోజులు పడవేసిపెడతారు. తహశీల్దారుగారి దగ్గిరకు చెప్పుకోడానికి వెళితే ఆయన బూతులుతిడతాడు.

[బంటోర్తు ప్రవేశించుచున్నాడు.]

బంటోర్తు—యీ వేళతహశీల్దారుగారుకచేరీకిరారట. యేమైనా కేజులు వుంటే రేపు హాజరుపెట్టుమన్నారు.

[అందరును వెళ్ళుచున్నారు.]

పంచమాంకము.

౧. ప్రదేశము—తహశీల్దారుకచ్చేరి.

[తహశీల్దారును, మేజస్ట్రీటుగుమాస్తాయును, మరికొందఱును ప్రవేశించుచున్నారు.]

తహ—జేగురుపాడుకరణం శిరస్తాదారుగారి యింటికి పెరుగు కడవపంపించినాడేమో మీరు కనుక్కున్నారా?

గుర్రాజు—మనతాలూకాలో కరణాలు మహా పొగరెక్కి వున్నారు. వాళ్ళకు మన మాటఅంటే లక్ష్యమేలేదు. అందులోనూ జేగురుపాడుకరణం కేవలం దగాఖోరండి. అతను యేమిఅడిగితే అదెల్లా పంపిస్తానని మనవద్దచెప్పి పోవడమేకాని తిన్నగా పంపించడండి.

తహ—మొన్న మాయింట్లోజరిగిన సంతర్పణకు అతను సప్లయి మహాబాగా చేసినాడే పదికావిళ్ళు గట్టిపెరుగు పంపినాడు.

గుర్రా—తమకేమి పంపినాడో కానండి, అతను మొన్న వచ్చినప్పుడు పుల్లలకిబ్బందిగావుండి తుమ్మచెట్టుకొట్టించి బండెడుపుడకలు పంపించమని మరీమరీ చెప్పినాను. ఇదుగో రేపుపుదయానికి పంపిస్తానని పోయినాడు. నేటివరకూటికాణాలేదు.

తహ—అలాగైతే అతనికి హుకుంవ్రాసి పిలిపించండి. పదిహేనురోజులు యీవూళ్లో పడవేసిపెడదాము—ఎవరయ్యా? వాకిట్లో కేకలువేస్తున్నారు.

గుర్రా—ఎవరో కచేరీలో ఫిర్యాదు దాఖలుచేసుకోవడానికి వచ్చినాడు. డఫేదారు మామూలు యివ్వకపోతే వడిగ్గా కేకలువేసి అడుగుతూవున్నాడు. మరేమీలేదండి.

తహ—తిట్లూ కేకలూ మానోటీసులోకి రాకుండా దూరంగా తీసుకొనిపోయి వచ్చేమామూలేమో నెమ్మదిగా రాబట్టుకోమనండి.

గుర్రా—ఇప్పుడందరూ బొత్తిగా తెలుగుమీరిపోయినారు. బాగావత్తుడు పెడితేనేకాని యెవరూ యిచ్చేమామూలు తిన్నగా యివ్వరండి.

[ఒక కోమటి ప్రవేశించుచున్నాఁడు]

కోమ—మహాప్రభూ ! నేను దుకాణంమూసుకొని ఫదిరోజుల బట్టీ తిరుగుతూవున్నానండి. నాసంగతి—

తహ—(తలయెత్తిచూచి) యెవఁడువీఁడు?

గుర్రా—మొన్నతమతో మనవిచేసి వీధిలో పెంటవున్నదని సమనుచేసినది వీడికేనండి.

తహ—యీవూళ్లో కోమటివాళ్ళు మహావళ్ళువాచి దేవుళ్లాడు తూవున్నారు. కొద్దికాలంలోనే రోగం కుదురుతుందివుండండి. గాడిద కొడుకా ! గుమస్తాగారివాకిట్లో భాగవతంఆడిస్తే రెండురూపాయలు పనూలిచ్చుకోలేక పోయినావురా?

గుర్రా—నేను తహశీల్‌దారుగారి వుత్తరువుప్రకారం ఆడిస్తూ వున్నామనికూడా అందరితోనూ చెప్పినానండి.

కోమ—యేలినవారు కోపంచెయ్యవద్దండి. నేను రూపాయలు యిచ్చుకోబడుతుందని రాకపోలేదండి. నాకొడుకుకి వంట్లోజబ్బుగా వుండి—

తహ—ఛీఛీ నోరుముయ్యి. చెప్పుపుచ్చుకొని తన్నేవాడులేక పోతేను మీయింట్లో ఖాయిలాలు గీయిలాలు మహావస్తూవున్నవి. వెనుకటి తహశీలుదారుదారుగారు దర్పం యెరగక మిమ్మల్నంద రినీ చెరిపివేసినాడు.

కోమ—నేను రూపాయలు దాఖలుచేసుకుంటానని తరువాత గుర్రాజుగారితో మనవిచేసినానండి.

గుర్రా—రమనుచేసి పట్టియీడిచి తెప్పించినతరువాత యిఖనన్ని రూపాయలుకూడా యిచ్చుకుంటానంటావు. మీకల్లా వుంగరాల వేళ్ళతో నత్తిమీఁద మొట్టేవాడు వుండవలెను.

తహ—గుర్రాజుగారూ ! శివాలయములో రధానికి ఫది రూపాయలిచ్చుకుంటాడుగాని వీడికేజుతీయించి కొట్టివేయించండి.

కోమ—ఫదిరూపాయ లిచ్చుకోలేనండి.

తహ—ఎవరోయిబంట్రోత్! ఈగాడిదికొడుకునితన్ని అవతలికి యీడ్చుకొనివెళ్లు.

గుర్రా—మేజస్ట్రేటుకేజు వకటివున్నది హాజరు పెట్టింతునాండి?

తహ—ఆచోరీకేజా ? పిలువుమనండి.

గుర్రా—బంట్రోత్ ! నిన్నటి హేడ్డుకనిష్టేబిలును కేజు హాజరుపెట్టుమను.

[హేడ్డుకనిష్టేబిలును, ఇద్దరు ముద్దాయీలును, సాక్షులును ప్రవేశించుచున్నారు.]

హే—దణ్ణాలండి. యితను వీరన్న మొదటిసాక్షి. వస్తువులు పోయింది యితని యింట్లోనేనండి.

తహ—వీణ్ని యిక్కడవుంచి తక్కినసాక్షులను అవతలికి పంపించివెయ్యండి.

హే—చిత్తం. (తక్కినసాక్షులను పంపివేయుచున్నాఁడు.)

గుర్రా—ఓయిసాక్షి ! ప్రమాణవచనము చెపుతాను మళ్ళీ అను. (అని ప్రమాణము చేయించుచున్నాఁడు.)

హే—నీవు ముద్దాయీని యెరుగుదువా?

వీర—ఎరుగుదునండి.

హే—ఇతనియిల్లు సోదాచేసినప్పుడు మీతాలూకు చీరెవకటి పట్టుపడ్డదికాదా?

వీర—ఆచీరె మాదికాదండి.

హే—అతనిపెట్టెలో కడియాలజత దొరికింది కాదా?

వీర—ఆకడియాలజత నేను చూచినప్పుడు పెట్టెలో లేదండి. తరువాత హేడ్డుకనిష్టేబుగారు పెట్టెలోచెయిపెట్టి వున్నదన్నారండి. ఈకడియాలజత హేడ్డుకనిష్టేబుగారు నన్నడిగి—

హే—చాలవూరుకో. అయ్యా! తహశీల్ దారుగారూ! ఈ సాక్షి తిరిగిపోయినాడండి.

తహ—అవును మాకు తెలియును. యీవకీలుగారేదోయంత్రం వేసి తిప్పివేసినాడు. వకటోముద్దాయీ నేరస్థుడయినసంగతి మాకు రూఢిగా తెలియును. తప్పుసాక్ష్యం చెప్పినందుకు యితనికిశిక్ష వేస్తాము—హేడ్డుకనిష్టేబిలుగారూ! ఇప్పుడు ఇతణ్ని యేమయినా ప్రశ్నలువుంటే వెయ్యండి.

హే—ఈముద్దాయీ నీకేయినా బంధువుడా?

వీర—మేమంతా కావలసినవాళ్ళమేనండి.

హే—అందుచేత నేనా నీవతనికి అనుకూలంగా చెప్పినావు?

వీర—నేను యిందులో యెరిగినసంగతేమో మనవిచేసినాను. అబద్ధమాడినదాకా నాకేమండీ?

హే—యిఖరెండవసాక్షిని పిలుతునాండి?

తహ—ఏమయ్యా? వకీలుగారూ! మీరేమయినా సాక్షిని క్రాసుసవాళ్ళు వేస్తారా?

వకీ—ఈసాక్షిని నేనడిగేదేమీలేదండి. రెండవసాక్షిని పిలిపించవచ్చును.

[ఒక కనిష్టేబిలు మొదటిసాక్షిని పంపివేసి రెండవసాక్షిని పిలుచుకొనివచ్చినమీందట వాడుకప్రకారము గుమాస్తా ప్రమాణము చేయించుచున్నాడు]

హే—మేము వకటోముద్దాయీ యిల్లు సోదాచేసినప్పుడు పెట్టెలో వీరన్న తాలూకు చీరదొరకడం చూచినావా?

సాక్షి—చూచినాను. ఆపెట్టెలోనే బట్టలఅడుగున కడియాల జతకూడా దొరకింది.

హే—మనము వెళ్ళిపోయేటప్పుడు యేమిజరిగింది?

సాక్షి—పత్తివిత్తులగంప సోదాచేస్తే అందులో వీరన్న తాలూకు పోయిన యిత్తడిబొమ్మ సామానులుకూడా దొరికినవి.

తహ—గుర్రాజుగారూ! యీసాక్షి నిజంచెపుతూవున్నాడు. ఆప్రకారముగా వ్రాయండి—వకీలుగారూ! క్రాసుయగ్జామినేషన్ చేసేటట్టుంటే చెయ్యండి.

వకీ—ఆదొరికిన వస్తువులు వీరన్నవని నీకెట్లా తెలుసును?

తహ—ఉస్సి, అతను యెరుగుదునని చెపుతూవుంటే ఆలా గంటి బేజరూరు ప్రశ్నలు వెయ్యకయ్యా.

సాక్షి—వీరన్న నాకు బంధువుడుగనుక వారియింట్లోవుండే వస్తువులన్నీ నాకు తెలుసును.

వకీ—అతనియిల్లు సోదాచేసేటప్పుడు ముందుగా యీకనిష్టేబిలులు తమవద్ద యేమీ వస్తువులులేకుండా యెవరికైనా సోదా చూపించి మరీ లోపలికి వెళ్ళినారా?

సాక్షి—నేను మొదటినుంచీ హాజరువుండి చూస్తూవున్నాను. కనిష్టేబిలులవద్ద వక్క వస్తువూలేదు. పెట్టెతాళం తీసీతియ్యడంలో ఆవస్తువులు నేను కళ్ళారా చూచినాను.

తహ—ఏమయ్యా! అన్నీ యీలాగంటిప్రశ్నలే వేస్తూవున్నావు?

వకీ—ఆవూళ్ళో సోదాచేసినారన్న నాటికి క్రిందటిదినం రాత్రి యెనిమిది గంటలదాకా యిక్కడవుండి వకక్రిమినల్ కేసులోసాక్ష్యం

యిస్తూవున్నావే. తెల్లవారేసరికి ఆరుక్రోసులదూరమున్న ఆవూళ్లోకి యెట్లా వెళ్ళినావు?

తహ—రాత్రిభోంచేసి చల్లగా చీకటిలో నడిచివెళ్ళినాడు.—గుమాస్తాగారూ! ఆప్రశ్న వ్రాయకండి.

వకీ—నీవు పోలీసువారితరపున యెన్నిక్రిమినల్ కేజులలో సాక్ష్యం పలికినావు? అన్నికేజులలోనూ నీవేహాజరువుండడానికి కారణమేమి?

తహ—అతను యాభయి కేజులలో సాక్ష్యమిచ్చినాడు. మేమే యెరుగుదుము. అతను హాజరువుండి చూచినాడుగనుక యెరిగిన సంగతి సాక్ష్యం యిస్తూవచ్చినాడు. తంటాయేమివున్నది?

వకీ—తమకు ఫలహారంవచ్చినది. వక్కసారి ప్రయివేటు రూములోకి విజయం చెయ్యవలెను.

తహ—మీరుకూడా రెండు అరిటిపళ్ళు పుచ్చుకొందురుగాని రండి.

(అని తహశీల్‌దారును వకీలును వెళ్ళుచున్నారు)

గుర్రా—ఫలహారమూ లేదు, వాడిశ్రాద్ధమూ లేదు. ప్రొద్దున్న యీవకీలు నూరురూపాయలు యిస్తామని బేరంపెట్టినాడు. తహశీల్‌దారు రెండువందల రూపాయలు తెమ్మన్నాడు. బేరంకుదిరినదికాదు. ఇప్పుడేదో ఫరిష్కారం చేసుకుని వస్తాడు.

హేడ్డు—సాక్ష్యం అయిపోయింది. ముద్దాయీ మేజస్ట్రేటువద్ద యిదివరకే యుకరారుపడ్డాడు. ఇఖ యిందులో యేమిచేస్తాడు?

గుర్రా—యేమిచేస్తాడో మీరేచూస్తారు. యజమానే రూపాయీ అర్థాలంచంపుచ్చుకుంటూవుంటే యిఖ క్రిందివాళ్ళకు యేమి దొరుకుతుంది?

హే—వెనుకటి తహశీల్‌దారుగారు లంచంపుచ్చుకునేవాడు కాడుకదా? మీపని అప్పుడే బాగుండేదా?

గుర్రా—వాడు మరీచండాలపు ముండాకొడుకు. ఇక్కడవున్న నాలుగునెలలూ మమ్ము వేపుకొనితిన్నాడు. తానూ లంచం తినే వాఁడుకాడు; తాబేదారులు తిన్నా సహించేవాఁడుకాఁడు.

హే—తహశీల్‌దారుగారు వస్తూవున్నారు పూరుకోండి.

తహ—(ప్రవేశించి) మీరింకాసాక్షినేమైనా అడ్డుసవాళ్ళు వేస్తారేమో వెయ్యండి.

వకీ—నీవిందాకా సాక్ష్యం చెప్పినప్పుడు తాగినట్టున్నావే.

సాక్షి—నేను తాగివుండలేదు.

తహ—అనుగో అబద్ధం చెపుతూవున్నావు. మేజస్ట్రేటుబారు స్వయంగా చిత్తగిస్తూ వుంటేనే అబద్ధమాడుతూవున్నావు.—తియ్యవయ్యా పినాల్కొడ్డు సెక్షన్ తియ్యండి. తాగి వళ్ళు తెలియకుండా వున్నందుకు శిక్ష వేస్తాము.

సాక్షి—లేదండి. లేదండి.

తహ—నిజంవప్పుకో క్షమిస్తాము. నీవు తాగివున్నావా లేదా?

సాక్షి—చిత్తం. తాగివున్నానండి.

తహ—గుమాస్తాగారూ వ్రాయండి. సాక్షి చెప్పినసంగతి,—వకటోముద్దాయీ యింట్లో వస్తువులుపట్టుపడడం నీవుచూడలేదు కాదా?

సాక్షి—చూడలేదండి.

తహ—స్మారకం తప్పివుండడంచేత ఆలాగున చెప్పినానేకాని నేనుచూడలేదనివ్రాయండి.— రెండోముద్దాయీ యింట్లోనా వస్తువులు పట్టుపడ్డవి?

సాక్షి—అవునండి.

తహ—ఇఖ సాక్ష్యం అక్కరలేదు. ఒకటో ముద్దాయీమీద ఋజువుకాలేదుగనుక అతణ్ని విడుదలచేసి రెండో ముద్దాయీని జనరల్ డిప్టీకలెక్టగారివద్ద కమ్మిట్టుచేసినాము.

హేడ్డు—ముద్దాయీ తమవద్ద నేరంవప్పుకున్నాడండి.

తహ—అతను బుద్ధిపూర్వకంగా వప్పుకోలేదు. ఏమోయి వెంకన్నా! నీవు మొన్న మావద్ద నీస్వబుద్ధిచేతనే నేరంవప్పుకున్నావా?

వెంక—లేదండి. నేనేమీ నేరంచెయ్యలేదండి. నేరంచేసినట్లు వప్పుకుంటే తుమించి వదిలిపెడుతారని కనిష్టేబుగారు చెపితే వాళ్ళనమన్నమాట లన్నానేకాని నే నింతులో యేమీయెరగను.

తహ—సరేబాగానేవున్నది. నిన్ను విడుదలచేసినాముపో. మేమిరోజుకు కోర్టు మర్తబుచేస్తాము. [అందఱును వెళ్ళుచున్నారు.]

---

౨. ప్రదేశము—డిప్యూటీకలెక్టరు కచేరీ.

[హేడ్డుకనిష్టేబిలు, ముద్దాయీలు, సాక్షులు, మఱి యిద్దఱుకనిష్టేబిలులు, ప్రవేశించుచున్నారు.]

హే—డిప్టీకలెక్టరుగారు యీవూళ్ళోనయినా మనకేజు విచారిస్తారో మళ్ళియేవూరయినా రమ్మంటారో.

వీర—యేమి కేజోకాని తిరగలేకచచ్చిపోతున్నామండి. నేటికి పదిహేనురోజులనుంచి యీవూరునుంచిఆవూరూ ఆవూరునుంచియీవూరుతిప్పుతూవున్నారు. పోయిన సొమ్ము రాకపోయినామా బాగుగాని యింతటితో వదిలిపెడితే వెళ్ళిపోదామని వున్నదండి. ఇంటికాడ పొలాలకు నీళ్ళులేక యెండిపోతూ వుంటవి. నేనువెళ్ళి డెల్టామాప రెండెంటుగారికి మామూలు యిచ్చుకుంటేనేకాని నీళ్ళుయివ్వరండి.

హే—ఆయనకు మీ వూళ్ళోరహితులందరూ ప్రతిసంవత్సరమూ మామూలుయిస్తారా?

వీర—అది యివ్వకతప్పదండి. వకరుయివ్వకపోయినా నీరు వదలిపెట్టరండి. మేము అర్జీలుయిచ్చుకుంటే యెప్పుడో వకప్పుడు అధాత్తుగా నీరువదిలిపెట్టి మేము కాలవచేసుకొని నీరు పెట్టుకోవడానికి సిద్ధమయ్యేటప్పటికల్లా కాలవకట్టిపెడతారండి. కిందటి సంవత్సరం డెల్టాసూపరెండెంటు విస్తారంసొమ్ము యిమ్మని మరీ యిబ్బందిపెట్టినాడు. పడలేక అందరమూచేరి ఫదిరూపాయలసొమ్ము లాకు కళాసువాడిచేతిలోపెట్టినాము. వాడు రాత్రివేళ పంటకాలువ గట్టుకుబొక్కపెట్టి కాలవతెగిపోయిందని మరునాడురిపోర్టుచేసినాడు. కాలువగట్టువేసేలోపుగా మూణ్నాళ్ళూ మావూళ్ళోవాళ్ళందరూ మనసువచ్చినట్టు నీళ్ళు పెట్టుకున్నారు.

[ఒక వకీలు ప్రవేశించుచున్నాడు.]

హే—ఏమండీ! మీరేదైనా కేజులో వకాల్తునామా పుచ్చుకొన్నారా?

వకీ—అవునండి. వకచిన్నఫిర్యాదు చెయ్యడానికి నాలుగు మకాములనుండి తిరుగుతూవున్నాను. వకాల్తునామా పుచ్చుకొని ఫిర్యాదు దాఖలుచేసుకోకుండావున్నారు. డిప్టీకలెక్టరుగారి బంధువుడొక వకీలున్నాడు. ఆయన దాఖలుచేస్తేనేకాని ఫిర్యాదు ఒక పట్టానపట్టరు.

హే—ఈయన లంచంపుచ్చుకుంటారా?

వకీ—లంచం పట్టరుకానండి రహితులవద్దపుట్టిపదిహేనురూపాయలు అమ్ముతూవుంటే ఫదిరూపాయలకాడికి ధాన్యం జట్టీపుచ్చుకుంటారు. కూరలూకాయలూమాత్రం యిస్తేపుచ్చుకుంటారు.

ఈయనకు వ్యభిచారం మహావిస్తారం. అందుచేత కొన్ని కేజులలో కేవలం అన్యాయంచేస్తారు.

హే—మీరు తహశ్శీల్ దారుకచేరీలో ప్రయివేటు వకాల్తీపని చేస్తారుకాదా?

వకీ—అక్కడా యీలాగేదేవుళ్ళాడుతూవున్నది. మీ కేజులో ముద్దాయీతరపున పనిచేసిన వకీలుయందు తహశ్శీల్ దారుగారి కిష్టము. అతనే అయనకు లంచాలూ పంచాలూ మాట్లాడుతాడు. అంతేకాకుండా అతను తెనుగుఆక్టులు రెండుముక్కలు చదువుకున్నాడు. ఆకచేరిలో యిద్దరు వాలంటర్లువున్నారు. వాళ్ళదస్తూరీని వుంటేనేకాని తహశ్శీల్ దారుగారు మేజస్ట్రీటు అర్జీగాని రివిన్యూ అర్జీగానిపట్టడు. వాళ్ళు యెంతచిన్న అర్జీఅయినా రూపాయికు తక్కువైతేపుచ్చుకోరు. వాళ్ళు కచేరీగుమాస్తాలపనిఅంతావూరికేచేసి పెడతారు.

హే—అరుగో డిప్టీకలెక్టరుగారువీధిలోకివచ్చినారు. వీరన్నా! నీసంగతివెళ్ళి మనవిచేసుకో.

వీర—అదుగోబంట్రోతు యీలాగే వస్తూవున్నాడు. డిప్టీకలెక్టరుగారేమో చెప్పమన్నట్టున్నారు.

[బంట్రోతు ప్రవేశించుచున్నాడు]

బంట్రో—డిప్టీకలెక్టరుగారు యెల్లుండి పెరవలిమకాములో మీ కేజు విమర్శిస్తామని సెలవు దయచేసినారు. సోమవారం ఫదిఘంటలకు మిమ్మల్నందర్నీ అక్కడహాజరు వుండుమన్నారు. అక్కడ పాకలువేయించవలసినదని యిదివరకే గ్రామమునసబుపేర హుకుం వ్రాయించినారట. పొండి. (అందఱును వెళ్ళుచున్నారు)

---

3. ప్రదేశము—పొలములోనిపాక.

[డిప్యూటీకలెక్టరుగారును, గుమాస్తాలు మొదలగువారును ప్రవేశించుచున్నారు]

కలె—ఎవరయ్యా! అక్కడ అలా అరుస్తూవున్నారూ?

గుమా—మనవాళ్లేమో పొలములోనుంచి దోవపెట్టి పయిరు వలగత్రొక్కి వేస్తూవున్నారని కాపులు యేడుస్తూవున్నారండి.

కలె—బంట్రోతునుపిలిచి గాడిదకొడుకులను చితగకొట్టుమను.

గుమా—చిత్తము.—ఎవరోయి బంట్రోత్! వాళ్ళను దూరముగా సాగనంపిరా.

కలె—వీడెవడు యీమూలనిల్చుని కేకలువేస్తున్నాడు?

గుమా—వీడుబోయీలమేస్త్రిఅండి. తమరు పడవకాడినుంచి సవారీలోవచ్చినందుకు భత్యఖర్చు కావలెనంటూవున్నాడండి.

కలె—జమాదార్! యీలాటివాళ్ళనందర్నీ లోపలికిరానిస్తూవున్నావు; వాణ్ని తక్షణం గెంటివెయ్యి. ఇంకొకపర్యాయం నీవు యిలాగంటివాళ్ళను లోపలికి రానిచ్చిన యెడల జరిమానా వేస్తాము సుమా?

జమా—చిత్తం మహారాజ్!— అరేభాంచోత్ అవతలికి పో.

కలె—మనము పడవమీదవచ్చినప్పటికీ, ఆచార్జివెయ్యక క్రమప్రకారం మయిలేజిన్ని భత్యమున్నవేసి బిల్లుతయారుచేసి సొమ్ము వేగిరం డ్రాచెయ్యవయ్యా.

గుమా—చిత్తము. మనము యెక్కివచ్చినందుకు పడవవాళ్ళకేమైనా యివ్వవలెనాండి?

కలె—యేమీ అక్కరలేదు. మేము పడవయజమానితో మాట్లాడినాము, పడవ గుమాస్తాతో మనము వూరికేవచ్చినట్లు

రిమార్కు వ్రాయవద్దని చెప్పు. అసలు మనము పడవమీద యెక్కినట్లే చిత్రాలో వ్రాయవద్దను.—జమాదార్! మేజస్ట్రేటు జవాబుని వీసుగారిని పిలువు.

జవా—అయ్యా! వస్తున్నాన డి. (అని వచ్చుచున్నాఁడు)

కలె—మొన్నటి కేసవరంగ్రామంతాలూకు చోరీకేసులో సాక్షులు మొదలయినవాళ్ళు హాజరువున్నారేమో కేక వేయించండి.

జవా—జమాదార్! వెళ్ళి కేక వెయ్యి.

జమా—అరుగో పరుగెత్తుకొని వస్తూవున్నారండి.

[హెడ్డు కనిష్టేబిలు మొదలగువారు ప్రవేశించుచున్నారు]

కలె—ఏమోయి సాక్షులు! మీరింత ఆలస్యంగా వచ్చినారు. కోర్టుయెదుట హాజరువుండనక్కరలేదూ? మీకు బొత్తిగా భయం లేకుండావున్నది. మీకు మనిషి వక్కంటికి రెండేసిరూపాయలు జరిమానా వేసినాము.

సాక్షు—మీరెక్కిన పడవతోనే మాపడవా బయలుదేరిందండి. మొదట సప్లయిగుమాస్తా మనిషివక్కంటికి పావలాచొప్పున రేటునిర్ణయించి మమ్మలిని పడవలో యెక్కించినాడండి. కొంత దూరం పడవ గోదావరిలోకి వచ్చినతరువాత పడవ గుమాస్తావచ్చి అర్ధరూపాయచొప్పున వసూలుచేసినాడు. తీరాలాకుదగ్గిరకు వచ్చేటప్పటికి అన్ని పడవలు వస్తేనేకాని తలుపులుతియ్యనందున అక్కడ కొంత ఆలస్యమయినదండి. తరువాత మకాములలో తాడులాగే కళాసులు వేళకు హాజరులేక కొంత ఆలస్యమయినదండి. ఇక లాకు మయిలుదూరములో వుండగానే సగముమందిమనుష్యులను పడవలో నుంచిదింపి యెవరైనా అడిగితే మేము పడవలోరాలేదని చెప్పమని గుమాస్తా సరంగూ మాఅందరితోనూ చెప్పిపెట్టినాడు. ఆలాగు కళాసుతాలూకు బంధువుడికి యెప్పుడో వూరికే గదియిచ్చినారు

కారని, ఆకోపంచేత వేగిరం లాకుతలుపులు తియ్యక పడవ తనిఖీ చేస్తామని కొంతసేపు నిలిపి చివరకు వదిలిపెట్టినాడు. లాకు దాటిన తోడనే దిగిన మనుష్యుల నందఱినీ మళ్ళీ పడవలో యెక్కించు కొన్నారు. అప్పుడు వక గుడిసేటిచి పడవ యెక్కడానికి వచ్చినం దున మాపడవవాళ్ళూ మా వెనుకవచ్చిన పడవవాళ్లూ తమపడవలో యెక్కమంటే తమ పడవలో యెక్కమని పోటీలకువచ్చి చివరకు కేవులేకుండా మేముయెక్కిన పడవలోనే గుమాస్తాగదిలోకూర్చుండ బెట్టుకొన్నారు. పడవలో గుడిసేటిది యెక్కడంచేత ఖులాసాపుట్టి తాడులాగేవాళ్లు బూతు 'అంబా' పాడుతూ లోపల చాలామంది సంసారస్త్రీలువున్నా లక్ష్యముచేయక పడవను కొంచెము వడిగా లాగినారు. చీకటిపడ్డతరువాత గుడిసేటిదానికి యివ్వడానికి మధ్య మకాములలో యెక్కినవారి తాలూకు చిఠాలో జమకట్టకుండా వున్నసొమ్ము పంచుకోవడములో గుమాస్తా సరంగూ పోట్లాడి పడవ రెండుగడియలు కట్టిపెట్టినారు. అది అంతాఅయి పడవసాగించి గుమాస్తానూ సరంగునూ వకరువిడిచి వకరు గదిలోచేరి తంటా లు పడుతూవుండగా లాకుస్యూపరింటెండెంటు తాలూకు నలుగురు బంధువులకు గదిలో స్థలంయివ్వవలసినదని కళాసువకడు తీసుకుని వచ్చినాడు. ఆగుడిసేటిదాని కెక్కడా ప్రత్యేకంగా గదిదొరకక హాలులో మనుష్యులను లేవదీసి టాపుమీదికి పంపి దాన్నక్కడ కూర్చుండబెట్టి లాకుస్యూపరింటెండెంటు బంధువులకు తమగది యిచ్చినారు. అలాయివ్వకపోతే అతడులాకుకు పడవ తగిలిందని రేంజి ఆఫీసరుకు రిపోర్టువ్రాసి పడవతిరగకుండా యిరవై రోజులు కట్టివేయిస్తాడట. ఈఅన్నికారణములచేతనూ మాపడవ యిప్పుడే వచ్చినదండి. దిగుతూనే భోజనముసహితం చెయ్యకుండా పరుగెత్తు కొని వచ్చినామండి. హెడ్డు కనిష్టేబిలుగారుకూడా యిప్పుడేభోజనం

చేసి ఖయిదీలను తీసుకని వస్తూవుండగా దోవలో కలుసుకున్నామండి. ఈసారికి జరిమానా మాపు చెయ్యవలెనండి.

కలె—మేము మాపు చేసేదిలేదు. మీరు యిందులో బుద్ధిపూర్వకంగా ఆలస్యం చేసిరారు. మీకు యింకా జరిమానా యెక్కువ వెయ్యవలసినదే.

సాక్షు—లేదండి క్షమించవలెను. మొన్నమీరు-మకాములో యెల్లుండికి పెరవలి మకాములో హాజరుకావలసినదని సెలవిచ్చినారు. వెంటనే పడవయెక్కి నిన్న పన్నెండు ఘంటలకు రాజమహేంద్రవరములో దిగి వంటకూటియింట్లో తిన్నగా మెతుకులైనా నోట్లో వేసుకోకుండా మళ్ళీ పడవ యెక్కి దిగుతూనే కచేరీకి హాజరైనామండి. ఇందులో మా ఆలస్యం యేమీ లేదు.

కలె—అదుగో మేముఘట్టిగా మీలోపంవున్నదంటే లేదంటూవున్నారు. మీకు నాలుగేసిరూపాయలు జరిమానా వేసినాము.

సాక్షు—చిత్తము మహాప్రభో. మా దేతప్పితం క్షమించవలెను.

కలె—జవాబునివీసుగారూ! సాక్షులను ప్రమాణంచేయించి వాంగ్మూలాలు పుచ్చుకోండి. సబుమేజస్ట్రీకు ముద్దాయిని మళ్ళీ పట్టుకుని పంపించుమని వుత్తరవుచేసినాము. ఆముద్దాయి హాజరుగావున్నాడుకాడండీ!

జవా—అయ్యా! ఇప్పుడు హాజరుగావున్నాడండి. వెనుక అందుచేతనే యీ కేజు నాలుగుమార్లు పోస్టుపోనులు చేసినామండి.

కలె—మాకు మళ్ళీ వేగిరం ఇంటికి వెళ్ళవలసివున్నది. సాక్షి వక్కంటికి లెఖ్ఖ రేండేసి ప్రశ్నలు వేసి అతిశీఘ్రముగా కేజు క్లోజుచెయ్యండి.

జవా—చిత్తము—ఓయికనిస్టేబిల్! మొదటిసాక్షిని యిక్కడ వుంచి తక్కినసాక్షులను అవతలికి పంపు.

(కనిస్టేబిలాప్రకారముగా చేయుచున్నాఁడు.)

జవా—(సాక్షిని ప్రమాణము చేయించుచున్నాఁడు.)

హే—వీరన్నా! ఈకాపుయిల్లు మనము సోదాచేసినప్పుడు అతని పెట్టెలో మీ తాలూకు సొత్తేమయిగా దొరికినదా?

వీర—దొరికినది. వకచీర దొరికినది.

హే—ఇంకా యేమైనా దొరికిందా?

వీ—వెండికడియాలజత దొరికింది.

హే—తరువాత వెళ్ళబోయేటప్పుడు—

వీర—పత్తివిత్తుల గంపలో బొమ్మసామానులు దొరికినవి.

వకీ—నేను క్రాసు యగ్జామిను చేస్తానండి.

కలె—నీకేమీ లా తెలియదువూరుకోవయ్యా.

వకీ—సబుమేజస్ట్రీటుగారివద్ద ఇచ్చినవాంగ్మూలం చిత్తగిస్తే యీ సాక్షియొక్క నిజం బయలపడుతుందండి.

కలె—చిత్తగిస్తాము—జవాబునివీసుగారూ! యీసాక్షి కమిట్టింగు మేజస్ట్రీటు వద్ద యిచ్చిన వాంగ్మూలం చదవండి.

జవా—(చదువుచున్నాఁడు.)

కలె—నీవక్కడ చీరె మీదికాదని చెప్పినావు. ఇక్కడమీ దే అని చెపుతూ వున్నావు. ఇందులో యేదినిజము?

వీర—తరువాత నాపెళ్ళాన్ని కనుక్కున్నాను చీర మాదే నండి.

కలె చాలును. రెండువిధాలుగా సాక్ష్యం చెపుతూవున్నాడు. యీ సాక్షిని పహరాలోవుంచి రెండోసాక్షిని పిలువు.

[కనిస్టేబిలు రెండవసాక్షిని తీసికొనివచ్చుచున్నాఁడు.]

జవా—ఓయిసాక్షీ! ప్రమాణవచనములను చెపుతాను మళ్ళీ చెప్పు.

సాక్షి—చిత్తము. (అని ప్రమాణముమీద నెంతమాత్రము హెచ్చుతగ్గు లేకుండ కిందికోర్టులో చెప్పినట్టే సాక్ష్యము చెప్పుచున్నాఁడు)

కలె—మేము సాక్ష్యమంతా చిత్తగించగా, యీసాక్ష్యం యెంతమాత్రమూ నమ్మనర్హమైనదిగా కనంపడడంలేదు. మొదటి సాక్షి రెండుచోట్లను రెండువిధాలుగా చెప్పినాడు. రెండవసాక్షి వట్టిత్రాగుబోతు. గనుక ఖయిదీలనిద్దఱినీ విడుదల చేసినాము. తప్పుసాక్ష్యం యిచ్చినందుకు వకటోసాక్షికి మూడుమాసములు కఠినమైన ఖయిదుశిక్షను విధించినాము.

[అని తీర్పుప్రాసివినిపించి కోర్టు మర్తబుచేయుచున్నారు.]

---

౮. ప్రదేశము—కలెక్టరుకచేరీపాక.

[హేడ్డుకనిష్టేబిలు, వీరన్న, ఎఱుకలవాఁడు మొదలయినవారు కూరుచున్నారు.]

హే—కలెక్టరుగారు బసకువెళ్ళినారు. పాపం నీకుగొప్పఆపద వచ్చింది.

వీర—(ఏడ్చుచు) యిదంతా మీమూలంగా వచ్చిందండి. నేను సబుమేజస్ట్రేటు గారివద్ద చెప్పినట్టే సాక్ష్యంపలుకుతానంటే ఆఁగాకాదని నామెడలువిఱిచి యిలా పలికించినారు. పోలీసువారితో వొకలాగుచెప్పి ముద్దాయివద్ద యేమోపుచ్చుకొని యిప్పుడు మరివకవిధముగా తిరిగిపోయి చెపుతూవున్నాడని డిప్టీకలెక్టరుగారితో చెప్పి శిక్షవేయిస్తానని మీరు నన్ను బెదరించకపోయినట్టయితే నేనీలా

గున పలుకకపోదును. మీరు బుక్కులో వ్రాసినది గదివేటప్పటికి నాకు భయంవేసి మీరు పలుకమన్నట్లల్లా పలికినాను.

హే—నీకుయిప్పుడు వచ్చినఫర్యాలేదు. శెషన్ కోర్టులో అప్పీలు చేయించి వారంరోజులలో విడుదలచేస్తాను లే .

వీర—యేమి విడుదల చేస్తారోగాని యిప్పుడు జయిలులోకి వెళ్ళడం తప్పదుగదా అండి.

సాక్షి—జయిలులోకి వెళ్ళడంతోనే సరిపోతుందనుకున్నావా? నీవు డబ్బుగలవాడవు. నీవుపడేపాట్లు ముందుచూడవలెను. నీవు పల్లెటూరివాడవుగనుక తెలియక హేడ్డుగారు పలుకమన్నట్లల్లా పలికినావుగాని నేను కిందికోర్టులో పలికినదానికంటె యిక్కడ వక్కక్షరం హెచ్చుతగ్గుగా పలికినానేమోచూడు. యిదివరకు లక్ష సాక్ష్యాలు పలికినాను. నేను సాధారణంగా మోసపోతానా? యింటికాడ హేడ్డుగారితో అనుకూలంగా పలుకుతాననే చెప్పినాను. తీరా కోర్టుకు వచ్చియేలాగు పలుకవలెనో అలాగేపలికినాను.

వీర—బాబూ! నన్ను జయిలులో యేమిచేస్తారండి.

ఎఱు—నేను వక పర్యాయం జయిలులోపడి వచ్చినాను. చెప్పతానువిను.

హేడ్డు—ఆరి గాడిద కొడుకా! నీవు జయిలులో పడ్డమాట మాకు తెలిసిందేకాదు. తెలిసివుంటే ఓల్డు అఫెండరు, అని చెప్పితే డిప్టీకలెక్టరుగారు నీకుతప్పకుండా శిక్షవేస్తారు.

ఎఱు—పదిహేనేళ్ళకింద నిష్కారణంగా యిప్పుడున్న కరణం తండ్రి నాకు యీతబెత్తాల పొణక వేగిరంఅల్లి పెట్టినానుకానని కోపంవచ్చి, అప్పుడువూళ్ళోయేదో దొంగతనం జరిగితే నామీద పెట్టి రెండేళ్ళు వరకం వేయించినాడండి.

వీర—(క్రిందుచూచుచు విచారముతో) అప్పుడు నీవేమి చూచినావో చెప్పు.

ఎఱు—నేను జయిలులోవున్న కాలంలో ఫోర్జరీచేసినందుకు వక కరణం ఖయిదులో పడ్డాడు. వార్డరులాబ్రాహ్మణ్ని వేవుకుని తిన్నారు. ప్రతివార్డరవాడికీ నెలకు రెండేసి రూపాయలుమామూలు చేసినాడు. అదికాకుండా మధ్యమధ్య వాళ్ళడిగి నప్పుడల్లా యేమైనా యివ్వకపోతే పొగచుట్ట వుందనీ నల్లమందువుందనీచెప్పి జయిలరు వద్దకు తీసుకునివెళ్ళి ముక్కోణంకర్రకు కట్టించి రెండేసిడజనులూ మూడేసిడజనులూ కొట్టించేవారు. అప్పుడున్న జయిలరుకుకూడాజీతం కొంచెమ. అతనికేమైన యిస్తే వార్డరులను కూకలువేసి వూరు కుండేవాడు. లేకపోతే యెవరినిపడితే వారిని డజన్ బాజీ చేయించేవాడు. అదికాక ఆబ్రాహ్మడివద్ద నెలకు జయిలరు ఫదిరూ పాయలు ప్రత్యేకంగా పుచ్చుకునేవాడు.

వీర—డబ్బుపుచ్చుకుంటే పుచ్చుకునేవారుగాని, ఆబ్రాహ్మడి కేమైనా సదుపాయంచేసేవారా?

ఎఱు—వాళ్ళడిగినట్టల్లా డబ్బిస్తే కావలసినంత సదుపాయం చేస్తారు. చుట్టత్రాగనిస్తారు; నల్లమందు రహస్యంగా తెచ్చి యిస్తారు; కఠినపని లేకుండా చులకనిపనిలో పెట్టి ధొరవచ్చినప్పుడు మాత్రము పనిచేయిస్తూవుంటారు. డబ్బుయేమీ యివ్వకపోతే మట్టి తట్టలుమోయించడం మొదలైన కఠినమైన పనులలో పెట్టి తిన్నగా పని చెయ్యడంలేదని కొట్టిస్తారు.

వీర—పనిబొత్తిగా చెయ్యకుండావుండే సదుపాయంలేదా?

ఎఱు—విస్తారండబ్బుయిచ్చి డ్రెస్సరును కట్టుకుంటేఖాయిలా అని ఆసుపత్రిలో పెట్టి బొత్తిగా పనిలేకుండాచేస్తారు.

వీర—ఇప్పుడు జయిలులోకి వెళ్ళడంతోనే మొట్టమొదట యేమిచేస్తారు?

ఎఱు—వెళ్ళడంతోటే కొంచెం జుట్టువుంచి తల సాపుసీదాగా గొరిగివేస్తారు. తరువాత నీబట్టలు మొదలయినవి తీసివేసి చహారా వేసి వాళ్ళబట్టలుయిచ్చి కాళ్ళకు సంకెళ్ళిజోడు తగిలిస్తారు.

వీర—అన్నం యెవరువండి వెడతారు?

ఎఱు—యెవరో ఖైదీచేతనే వండించి పెడతారు. కొత్తగా వెళ్ళినవాళ్ళకు వెనుకటివాళ్ళుతిని వెళ్ళిపోయిన మూకడుఇస్తారు. రోజూ ఆమూకట్లోనే అన్నముతినవలెను.

వీర—ఇఖనలాగైతే కులంపోతుంది—హేడ్డుగారూ! నన్నేలాగైనా విడుదలచేయించే సదుపాయంచేస్తురూ.

హే—నీకేమీ ఫర్వాలేదు. మీవాళ్ళకు వుత్తరంవ్రాసి యేమైనా వందరూపాయలు తెప్పించు. మేమే వకీలునుకుదిర్చి శెష్షన్‌కోర్టులో అప్పీలుచేయించి వక్కడెబ్బలో విడుదలచేయిస్తాము.

వీర—అస్సెస్సరులచేతులలో యేమైనాపెట్టి విడుదలఅయ్యే యెత్తు చెయ్యగలరా? మా అన్నగారు అసెస్సర్‌గావుండి రెండు కేజులలో రెండుఫదులు సంపాదించినాడు. సొమ్ముయిస్తే ఖైదీ నేరస్తుడు కాడనేవాడట. సొమ్మివ్వకపోతే ఖయిదీ తప్పకుండా నేరంచేశాడు శిక్ష వెయ్యమనేవాడట. జడ్జీ విమర్శచేసేటంతసేపూ బల్లమీద కూర్చుండి కునికిపాట్లుపడేవాడట.

హే—మీఅన్నకు అస్సెస్సరుపని వున్నదా?

వీర—మాఅన్నకు వక్కడికేకాదండి. మాగ్రామమునకు చుట్టుపట్లవున్న పల్లెటూళ్ళల్లో చదువురాని కాపులు ఇరవైమంది అస్సెస్సరులుగావున్నారు. వాళ్ళందరూ యేటా పాతికరూపాయలకు తక్కువలేకుండా సంపాదిస్తారు.

హే—అసలు కేజులలోనేకాని అప్పీలు కేసులలో అస్సెస్సర్లుండరు. అస్సెస్సర్లు వూరికే కూర్చోవడమేకాని వాళ్ళకు యేమీ తెలియదు. అందుచేత జడ్జీవాళ్ళమాటవినడు. ఐతే జూరీకేజులలో మాత్రము వినకతప్పదు. అలాగంటప్పుడు మీకాపులు జూరీలుగా పడితే వాళ్ళనుబెదరించి మేము ఖయిదీనేరస్థుడని చెప్పించి పట్టుదల కేజులలో శిక్ష వేయిస్తాము.

వీర—ఐతే నామాట యేమిసెలవిచ్చినారు?

హే—అస్సెస్సరులకు లంచం అక్కరలేకుండానే మేము నీకార్యం సరఫరాచేస్తాము. ఆఅస్సెస్సర్ల కిచ్చేసొమ్ము నాచేతిలో

పెడుదూ. కార్యంఅంతా నేను జాగ్రతపెట్టి నిన్ను వాగముకోజు లలో పిడుదలచేయిస్తాను. కాలవతెగిపోయి పడవలు కట్టివేసినారు. మనమిప్పుడే బయలుదేరి రాజమహేంద్రవరం వెళ్ళవలెను.

వీర—ఇప్పుడేనాండి ప్రయాణము ?

హే—ఇప్పుడేప్రయాణము—ఓయుకనిష్టేబిల్ ! ఖయిదీకి అర దండాలువేసి జాగ్రతగా తీసుకుపోండి. మేజస్ట్రీటు జవాబునీసుగారి వద్ద వారంటుతీసుకొని నేనున్నూ మీ వెనుకనే వస్తాను.

వీర—బాబూ! నాకరదండాలు వెయ్యకుండా తీసుకువెళ్ళండి. మీకుదణ్ణంపెడతాను.

హే—అరదండాలు వెయ్యడం సర్కారురూల్సు. వెయ్య కుండా తీసుకువెళ్ళడముకు వీలుపడదు.

వీర—అలాగైతే వూరుదాటేవరకైనా యీలాగు తీసుకు వెళ్ళండి. తరువాత అరదండాలు వేసుకుంటాను.

హే—సర్కారురూల్సుకు పబ్లికు వుద్యోగస్తుడనైవుండీ వ్యతి రేకం చెయ్యడం గొప్ప తప్పితం. అలావల్లపడదు.

వీర—నావద్ద భత్యఖర్చుకు తెచ్చుకున్న తాలూకు రెండు రూపాయలున్నవి. అవి యిచ్చుకుంటాను. వూరికే తీసికొనివెళ్ళండి. యీ వూళ్లో మా చుట్టాలువున్నారు. వాళ్ళుచూస్తే నాకు మహా పరువుతక్కువగా వుంటుంది.

హే—నీచెవుల బంగారుపోగులుకూడా యిస్తే ఇప్పుడు నీ మానుషం దక్కించి వూరు దాటిందాకా అరదండాలు లేకుండా తీసుకువెళుతాము.

వీర—ఆలాగే పుచ్చుకోండి. నా ఆబూరీమాత్ర దక్కించ వలెను.

హే—ఓయికనిస్టేబిల్ వూరబైటదాకా ఇతణ్ని ఇలాగే తీసుకునివెళ్ళి అక్కడ పోగులజత జాగ్రత్తగా వూడదీసి నేను వచ్చేదాకా నీవద్దవుంచి అరదండాలు తగిలించి కాలవగట్టుమీద నేరేడు చెట్టుక్రింద పెట్టుకుని కూర్చో. నేనింతలోవచ్చి కలుసుకుంటాను.

[అందఱును వెళ్ళుచున్నారు.]

సంపూర్ణము.

తిర్యగ్విద్వన్మహాసభ.

&

మూషకాసురవిజయము.

ఈనాటకమునందువచ్చు పాత్రములు.

——: ○ :——

కామధేనువు—మృతినొందినగోవు.
వత్సము—కామధేనువుబిడ్డ.
అశ్వపతి—కామధేనువు మిత్రుఁడు.
గోదేవి—కామధేనువు చుట్టము.
వృషభేంద్రరావు—కామధేనువు బంధువు.
మేషేశ్వరుఁడు—కామధేనువు మిత్రుఁడు.
భైరవమూర్తి—కామధేనువు భృత్యుఁడు.
కొంక నక్కదీక్షితులు—ఒకసభాపతి.
రామబంధూశాస్త్రి—ఒక సభాపతి.
మార్జాలపంతులు—కామధేనువు భృత్యుఁడు.
గార్ధభేంద్రశాస్త్రి—కామధేనువు బంధువుఁడైన విద్వాంసుఁడు.
ఒక సోమయాజులు—ఒక సభాపతి.
వ్యాఘ్రావధానులు—ఒక సభాపతి.
వరాహభట్టు—ఒక సభాపతి.
ఆంజనేయశర్మ—ఒక సభికుఁడు.
మర్కటజోస్యులు—ఒక సభికుఁడు.
తిమ్మన్నచయనులు—ఒక సభికుడు.
మల్లుభట్లు—ఒక సభికుఁడు.

మూషకాసుర విజయము.

మూషకభట్టరు—ఒక పందికొక్కు.
శశకపతిరావు—ఒక కుందేలు.
మూషికాంబ—మూషకభట్టరు భార్య.

తిర్యగ్విద్వన్మహాసభ



కామధేనువును, వత్సమును.

రంగము — మహారణ్యపురము

[వృషభేంద్రరావుగారును, గోదేవిగారును, అశ్వపతిగారును, మేషేశ్వరుడుగారును, ప్రవేశించుచున్నారు.]

అశ్వపతిగారు

గోదేవిగారు

అశ్వ—వృషభేంద్రరావుగారూ! మీరు అదేపనిగా దుఃఖపడి యేమి చెయ్యగలరు? వెయ్యేళ్ళు యేడ్చినా పోయిన కామధేనువు మళ్ళీ లేచిరాదు. మనమందరమూ దురదృష్టవంతులముగనుక కామధేనువునకు కాలమరణము సంభవించినది. ఆసాధుత్వమూ, ఆధైర్యము ఆదానశీలత యేఆవుదగ్గిరనైనా వున్నవా? కామధేనువుపాలు త్రాగి యెందరు బ్రతికేరారు! మనభైరవమూర్తి నేటివరకూ ఆవుపాలతోనే బ్రతికినాడుగదా? మార్జాలపంతులు ఆవుపాలతోనే బ్రతుకలేదా? యింకాయెందరు పాలుత్రాగేవారు? యెందరు పెరుగుత్రాగేవారు?

యెందరు మజ్జిగ పోసుకనేవారు? యెందరు వెన్నతినేవారు? యెందరు నెయ్యితాగేవారు? యెందరు జున్నుతినేవారు? ఇదంతా మనకప్పు స్వప్నమయిపోయింది. దుఃఖంమానియిఖమనంబ్రతికియున్నవారిసంగతి చూడవలెను. పాపము! పోయినతల్లివద్దనుండిలేగదూడ యేప్రకారం యేడుస్తూవున్నదో చూడండి, మీరున్ను గోదేవిగారున్ను దాన్ని వోదార్చి ఆదరించవలెను. యిప్పుడు బంధువులయిన మీకెంత దుఃఖముగావున్నదో స్నేహితులమైన మాకున్ను అంతకంటె యెక్కువ దుఃఖముగానే యున్నది.

గోదేవి—అయ్యా! దీనులకోరికలను కొనసాగించే కామధేనువు పోయినతరువాత మీముయెట్లా యేడవకుండా వుండగలము? యిఖ మమ్మలిని పోషించే దిక్కెవ్వరున్నారు? ఓకామధేనువా! నీగుణాలు తలుచుకుంటే దుఃఖం పొర్లిపొర్లివస్తూవున్నది.

వృషభేంద్రరావుగారు.

వృష—ఓకామధేనువా! లోకములోమమ్ము వంటరిగాళ్ళను చేసి పోయినావా! ఇదివరదాకా నీప్రాపుమాకు వుండడంచేత పెద్ద పులులయినా మావంక తేరిచూడడానికి భయపడుతూవుండేవి. నీవు లేకపోవడంచేత నక్కపోతులుకూడా మమ్ములోకువచేస్తవిగదా!

మేపే—అశ్వపతిగారూ! నక్కలంటే జ్ఞాపకమువచ్చినది. బ్రతికి

వున్నంతకాలమూ లో
కోపకారముగా పెరి
గిన యీశరీరమును
నక్కలపాలూ రామ
బందులపాలూ కాని
య్యగూడదు సుమండీ
మన మిత్రుడయిన నా
ధేనువు మనతో యె
ప్పుడూ యీసంగతే
ముచ్చటిస్తూ వుండడం
మీరెరుగుదురుగదా?

అశ్వ—అవును మనలో యిదిచెడ్డదురాచారంగా వున్నది. మనంగౌరవించేశరీరమును మనకళ్ళయెదుట నక్కలూ రాబందులూ పీక్కుతింటూవుంటే యెట్లాసహించగలము? ఈకళేబరమును తప్పకుండా దహనమేచేయింతాము.

వృష—అవశ్యంగా దహనమేచేయింతాము?

గోదే—"గోబ్రాహ్మణేభ్యః" అన్నాడుగనుక, వెనుకచెప్పిన బ్రాహ్మలకే అగ్నిసంస్కారం జరుగుతూవుండగా ముందుగాచెప్పిన గోవుల కెందుకుజరగగూడదు?

వృష—మనభైరవమూర్తిన్నీ మార్జాలపంతులున్ను సభాపతులను తీసుకుని వస్తూవున్నారు. వారితోఆలోచింతాము.

భైరవమూర్తిగారు

[భైరవమూర్తియు, మార్జాలపంతులును, కొంకనక్కదీక్షితుల తోను రామబంధుశాస్త్రితోను, ప్రవేశించుచున్నారు]

కొంక—ఏమయ్యా! వృషభేంద్రరావుగారూ! రాత్రిపడుతూ వున్నాయింకా శవాన్ని అట్టేపెట్టుకుని కూర్చున్నారు? వెంటనేసమాధి ప్రయత్నం చెయ్యండి.

వృష—మావాళ్ళు దహనంచెయ్యవలెనని ప్రయత్నంచేస్తూ వున్నారు. సభాపతులకేమీ ఆక్షేపణలేదుకదా?

కొంక—మాకు కావలసినంత ఆక్షేపణవున్నది. పూర్వాచార విరుద్ధమైన కార్యంచెయ్యకూడదు.

కొంకనక్కదీక్షితులుగారు.

రామ— దహనంచెయ్యడమంత ఆక్షేపణార్హమైనపని మరి వకటిలేదు. ఎక్కడనైనా మనుష్యులకు దహనంవున్నదిగాని గో జాతికి దహనంవున్నదా?

రామబంధుశాస్త్రిగారు.



మార్జాలపంతులుగారు.

అశ్వ—అయినా యీసంగతి సభాపతులందరూ వచ్చినతరువాత ఆలోచించి యేమిచెయ్యడానికీ నిశ్చయంచేతాము.

కొంక—ఇది ఆసభాపతులతో ఆలోచించనక్కరలేదు. ఇందులో మేమే ప్రధానులము. వ్యాఘ్రూవుధానులు యేమయినా సరే అంటాడు. మాలోకలిసిరాడు. వరాహభట్లున్ను బకసోమయాజులున్ను యీవిషయంలో ధర్మనిర్ణయం చెయ్యడానికి అర్హులుకారు.

రామ—ధర్మశాస్త్రాలు చూచిననేను సిద్ధాంతంగా చెపుచూవున్నాను. ఈవిషయంలో దహనకర్మ యెంతమాత్రమూ వల్లపడదు.

కొంక-రామబంధుశాస్త్రి అలాగుదృఢంగాచెపుచూవున్నాడు గనుక ఖననకర్మకు శవాన్ని ప్రేతభూమికి తీసుకొనివెళ్ళే ప్రయత్నం చెయ్యండి.

రామ—యీరాత్రియేకర్మా చెయ్యగూడదు. ధర్మశాస్త్రం చూడవలెను. తక్కిన సభాపతులంతా వచ్చినతరువాత రేపువుద

యాన్న అందరితోనూ ఆలోచించి మరీచేతాను. పెద్దలంతావుండగా స్వతంత్రించి యేపనిచెయ్యడమూ భావ్యంకాదు. శవాన్ని తెల్ల వారిందాకా అట్టే వుండనియ్యండి.

కొంక—తెల్లవారిందాకా పీనుగుతో జాగారంచెయ్యడం కష్టం. పాపంవాళ్ళను చిక్కులుపెట్టక యిప్పుడే కార్యంకానియ్యండి. వృషభేంద్రరావుగారూ! వాహకులను సిద్ధంచేయించండి.

రామ—వృషభేంద్రరావుగారూ! మీరతనిమాటవిని తొందర పడకండి. నేను యిప్పుడే చెప్పుచూవున్నాను. మీరుతొందరపడి సభవారి ఆలోచనలేకుండా చేస్తే తరవాత చాలాచిక్కులలో పడి పోచారు. శాస్త్రంచూడవలెను. అతను యీమాటలు స్వలాభం కోసం చెప్పుచూవున్నాడుగాని పరమార్థంచూచి చెప్పడంలేదు.

కొంక—నీవునీలాభంకోసమే చెప్పుచూవున్నావుగాని పర మార్థచింతతో చెపుచూవున్నావా? పీనుగుయింట్లోవుండగా వాళ్ళ దుఃఖంచూచి భరించడం మహాకష్టం. వృషభేంద్రరావుగారూ! అతని తెలివితక్కువ మాటలువిని మీరు మోసపోకండి. అతను యెంతసేపైనా వూరికే వాగుతూనే వుంటాడు. తెల్లవారిందాకా అట్టేవుంచితే యితనూ యితనిచుట్టూవుండే కోతులచట్రమూ మిమ్మలిని వేపుకునితింటారు. నిండినయింట్లో శవంవుండగూడదు. సరంజాం చేయించండి.

రామ—చేయించకండి. వొరేదీక్షితులూ! మోటతనం చెయ్యకు, అవతలశాస్త్రమూ మరివకటా! నీకొంకనక్క చేష్టలుమాని పెద్దలువచ్చిందాకా వోపికపెట్టు. ధూర్తతనమేకాని నీకు శాస్త్రం యేమీ తెలియదు.

కొంక—ఓరిపక్షికుంకా! వూరికే యెగిరపడడమేకాని నీకు మాత్రం మహాశాస్త్రం తెలిసియేడిసిందిలే. నీవు పీనుగులను పీక్క తినే పక్షిముండాకొడుకవు. నామాటకడ్డంరాకు.

రామ—నీనక్కజిత్తులు నాకు తెలుసును. మా కేమీ లేకుండా అంతానీనోట్లోనే పడవేసుకోవలెనని చూస్తూవున్నావు. నీవెన్ని కూతలుకూసినా పెద్దలంతా వుంటూవుండగా నీగంతులుసాగవు. నీవుమాత్రం పీనుగులను పీక్కుతినే ముండాకొడుకవుకావా?

కొంక—నక్కనోటగడ్డకొట్టి అంతానీవేమింగవలెనని నీవు చూస్తూవున్నావు. నాదేహంలో ప్రాణంవుండగా నాకులేకుండా నీకుదక్కనిస్తానా? నేను పీనుగులను పీక్కుతినే ముండాకొడుకునా?

వృష—మీరుయిద్దరూ పీనుగులను పీక్కుతినేవారే. ఆ మాటలు యిప్పుడెందుకు వూరుకోండి. అవతలకుపోయి పోట్లాడుదురుగాని యిప్పుడుశవం బయటకువెళ్ళే సాధనంచూడండి. యెవరి లాభంనిమిత్తం వారు చూచుకోక వుభయులూకూడా న్యాయం విచారించండి.

కొంక—మీరు సెలవిచ్చినమాట బాగావున్నది. వృషభేంద్ర రావుగారూ! చెవులోమాట. (రహస్యముగా) శవాన్ని తెల్లవారిందాకా అట్టేపెడితే రేపుతానూ తనబంధువులూవచ్చి తినవలెనని ఆపక్షిముండాకొడుకు ప్రయత్నం. శవాన్ని రాంబందులు పీక్కుతినని స్తే బహుపాపము. బ్రతికినన్నాళ్ళూ గొప్పగా బ్రతికిన కామధేనువును, చచ్చినతరువాత పక్షులనోట్లో పడనియ్యకండి. నేనూ మీచతుష్పాదకోటిలోవాణ్ణి గనుక, నాకడుపునిండితే యిహానికీ పరానికీకూడా లోపంలేదు. అంతేకాకుండా బంధుపోషణఫలం లభిస్తుంది. ఈకామధేనువు శరీరం బ్రతికినప్పుడూ చచ్చినతరువాతనూ కూడా బంధుపోషణమునకే వుపయోగపడుతుంది. (ప్రకాశముగా) మీలో వాహకులుగా వుండేవారెవరో లెండి.

వృష— (తనలో) ఓనిశాచరుడా! నీమనసులో యెంతపాపపు వూహ వున్నదిరా!

రామ—మీ రాపనిమాత్రం చేయించకండి. ఆముండాకొడుకు మీ వద్ద నక్కవినయాలు కనపరచి తుదకునమ్మించి మోసంచేస్తాడు. వీడికివంచకమన్నపేరు స్వభావంగానే వున్నదిగదా? వృషభేంద్రరావు గారూ! వక్కరహస్యము. (అని చెవిలో) యీరాత్రిమీరు పాతి పెడితే తనబంధువులైన నక్కలను వాలిగింటినీ తీసుకునివచ్చి పెల్ల వించుకొని తినవలెనని వీడిప్రయత్నం. వీడిమాట సాగనియ్యకండి. ఆపవిత్ర శరీరం నక్కలనోట్లో పడడంకంటె మావంటి మహాద్విజుల గర్భంలో పడితే పుణ్యమూ పురుషార్థమూవున్నది.

కొంక—నీవు కూసేదేమిటో బిగ్గిరగాకుయ్యి. నీశాస్త్రాలూ గీస్త్రాలూ తీసుకొనిపోయి తుంగలో పూరదొక్క. నామాటకు అడ్డంవచ్చి అట్టే యెగిరిపడుతూ వున్నావంటే గొంతుక కాయ కొరికివేస్తాను.

రామ—నేనుశాస్త్రం వున్నదంటూవుంటే, పిడివాదంతో మోటతనంచెయ్యడం నీకుధర్మంకాదు. అరుగో గార్ధభేంద్రశాస్త్రి గారు పరామర్శ నిమిత్తంకాబోలును వస్తూవున్నారు. ఆయనబహు పెద్దలు. శాస్త్రవిషయం వారిని అడుగుదాము. ఆవీభూతిధారణ యేమి? ఆశాంతముఖంయేమి? ఆయన కేవల శివస్వరూపులు.

కొంక—నేనుగానా శివస్వరూపుణ్ని.

వృష—ఆశాస్త్రుల్లుగారు మావారే. దహనవిషయంకూడా వారినే అడుగుదాము.

[గార్ధభేంద్రశాస్త్రులవారు ప్రవేశించుచున్నారు.]

రామ—శ్లో. శుక్లాంబరధరంవిష్ణుంశశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనంధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే.

వృష—ఏమయ్యా! యీశ్లోకం చదివినావు.

రామ—నేను మహనుభావులయిన గార్ధభేంద్రశాస్త్రులు వారిని శ్లోకరూపముగా స్తుతిచేసినాను.

వృష—ఇది ఆయనస్తుతి యేసాగైనది?

రామ—ఏలాగైందో చెపుతాను. నాపాండిత్యప్రభావం చిత్తగించండి—శుక్లాంబరధరం=తెల్లనైనబట్టలు ధరించినటువంటిన్నీ,—



గార్ధభేంద్ర శాస్త్రులవారు

గాడిదెలు చాకలివాళ్ళ వుతికిన తెల్లబట్టల మూటలు మోయ్యడం అందరికీ తెలిసిన హంశమే గదా—విష్ణుమ్—సత్వత్ర వ్యాపించివుండే టటువంటిన్నీ— గాడిద యేపెంటమీదపడితే ఆపెంట మీద కనపడుతూ వుండడం ప్రతి వారున్నూ యెరుగుదురు—శశివర్ణం = చంద్రునివంటి రంగుకలిగినటువంటిన్నీ—గాడిద చంద్రునివలె తెల్లగావుండడము ప్రత్యక్షమే—చతుర్భుజం=నాలుగు చేతులు గలిగినటువంటిన్నీ—అవిగో వెనుకటివి రెండూ ముందువి రెండూ కలిసి నాలుగు భుజములు—ప్రసన్నవదనం=కలకతేరిన ముఖం కలిగినటువంటిన్నీ — ఆముఖంచూస్తేనే గాడిదెముఖం శాంతమైనదైనట్టు స్పష్టమవుతూవున్నది—(గాడిదెను) సర్వవిఘ్నోపశాంతయే = సమస్తవిఘ్నములున్నూ శాంతించడం కొరకు—గాడిదె యెదురుగారాకుండా వుండడమూ ఆసమయంలో వికారపు కూతలు కుయ్యకుండా వుండడమూ నే విఘ్నశాంతికరము—ధ్యాయేత్=ధ్యానిస్తూవున్నాను.

వృష—అంతా బాగానే చెప్పినారు కాని చివర క్రియలోమాత్రం చెడకొట్టినారు. ధ్యాయేత్తంటే ధ్యానిస్తూవున్నానని అర్థముగాదు, అదియేకాలమో యేపురుషమో సెలవియ్యండి.

కొంక—వాడికి క్రియలూ గ్రియలూకూడా తెలిసియేడిసిన వా? యేవో తొట్టిమొట్టికూతలు నాలుగు కూసినాడు పోనియ్యండి.

రామ—"వో" అంటే "నా" రాని పశువువు నీవుకూడా ఆక్షేపించవలెనా? నోరు మూసుకొని వూరుకో. అర్థసారస్యము వట్టి చతుష్పాదజంతువు నీకేమి తెలుస్తుంది? తప్పుచెప్పినా వొప్పుచెప్పినా శాస్త్రార్థం ద్విజాగ్రగణ్యులమైన మేము చెప్పవలెను.

కొంక—అర్థసారస్యంకాదు బ్రాహ్మణార్థసారస్యం నీకు తెలుసును. నేను చతుష్పాద జంతువునయితే నీవు ద్విపాదపశువువు. అందుచేతనూ నీవు నాలోసగమేకాని నాకంటె యెక్కువవాడవు కావు.

రామ—నేను కులంగలవాణ్ని మావంశకర్తయిన జటాయువు శ్రీరాములవారికి మహోపకారం చెయ్యడంచేత మాకులం వారికందరికీ రామబంధువులని పేరువచ్చినది.

కొంక—నేనునీకంటెనూ కులంగలవాణ్ని. మాపెద్దలు మృగరాజయిన సింహంవద్ద ప్రధానులుగా వుండేవారు. మాపూర్వులలో వకడు నీలికడవలోపడి మృగరాజ్యాధిపత్యం చేసినాడు. మీవాళ్ళు బిచ్చగాళ్ళు; మేము మహారాజులము.

రామ—నీమాటలకేమి ప్రమాణము?

కొంక—నీమాటలకేమి ప్రమాణము?

రామ—నామాటలకు రామాయణం ప్రమాణం.

కొంక—నామాటలకు పంచతంత్రం ప్రమాణం.

రామ—పంచతంత్రం ప్రమాణగ్రంథంకాదు.

కొంక—రామాయణ మంతకముందేకాదు.

రామ—శాస్త్రుల్లగారూ! ఆరెండింట్లో యేదిప్రమాణగ్రంథమో పండితులుమీరు సెలవియ్యండి.

గార్ధ—నేను సత్యం చెపుతాను. మీరు యీవిషయంలో పోట్లాడకండి. మనుష్యకృతమైన పంచతంత్రంకంటె ఋషిప్రోక్తమైన రామాయణ మెక్కువ ప్రమాణము కాదష్టా?

కొంక—ఈయన చతుష్పాదజంతువుగనుక మాబంధుకోటిలో వాడనుకుంటే ప్రతిపక్షులలోచేరి పక్షపాతం చేసినాడు. ఎంతచదువు కున్నా గాడిదెకు బుద్ధివుండదు. మాకు మావచనమే ప్రమాణంకాని యీగాడిదకూతలు ప్రమాణంకావు. నీతిశాస్త్రమైన పంచతంత్రం కంటె కేవల కావ్యమైన రామాయణం యెక్కువ ప్రమాణమనే యీగాడిదె యిప్పుడు నమస్కారార్హమైనది యేలాగయినది?

రామ—మనకు నమస్కారార్హమైనందుకు ఆశ్చర్యమేమున్నది? పూర్వం శ్రీకృష్ణమూర్తివారి తండ్రిఅయిన వసుదేవుని వంటి వాడుకూడా కుయ్యకుండా వుండడానికి కాళ్లుపట్టుకుని గాడిదెకు నమస్కారం చేసినాడు.

గార్ధ—సరే యీసరసం బాగానేవున్నది. అశ్వపతిగారూ! ముందు కార్యంమాటయేమి ఆలోచించినారు?

అశ్వ—మనవారి కందరికీ యీ కళేబరము దహనముచేయించ వలెనని అభిలాషవున్నది.

గార్ధ—ఆలాగే కానియ్యవచ్చును. ఇది సర్వోత్కృష్టంగా వున్నది.

రామ—గోవును దహనంచెయ్యడం లోకంలో యెక్కడనైనా వృద్ధాచారము వున్నదష్యా? పెద్దలుమీరే యీలాగు ఆచార విరుద్ధమైనమాట సెలవిస్తారేమీ?

గార్ధ—ఆచారమా? ఆమాట మరిచిపోయినాను. ఆచారవిరుద్ధ మైనకార్యం చెయ్యగూడదు, ఇప్పుడు ఖననమే కావలెనుగాని దహనంకూడదు.

కొంక—ఈవిషయంలో నిష్పక్షపాతముగా చెప్పినారు.

రామ—మాకు మరివక ధర్మశాస్త్ర సందేహంవచ్చింది. శవాన్ని యీరాత్రే పాతిపెట్టవలెనో రేపటిదాకా వుంచవలెనో సెలవియ్యండి. నేను రేపటిదాకా వుంచవలెనంటూవున్నాను.

కొంక—నేను యిప్పుడే ఖననం కావలెనంటూవున్నాను. మీరు యిందులో నిష్పక్షపాతంగా చెప్పవలెను. వాడు పక్షిగనుక, వాడికి పక్షపాతము సహజము.

గార్ధ—నాకు పక్షపాతం యెందుకు? న్యాయం చెపుతాను. ఎప్పుడుచేసినా చెయ్యవచ్చును. ఇంట్లోవాళ్ళకు కష్టంగాతోస్తుందంటే, ఆపనియీరాత్రే చెయ్యవచ్చును. పెద్దలతో ఆలోచించవలెనంటే రేపటిదాకా వుంచనూవచ్చును. ఎలాగుచేసినా ఆక్షేపణ లేదు.

రామ—మీరు యీసంగతి శాస్త్రంచూచి చెప్పినారా! చూడకుండానే చెపుచూవున్నారా? కర్మతోచేరిన పనిగనుక మీరు బాగా ఆలోచించి మరీచెప్పవలెను. ఎక్కడనైనా సూర్యాస్తమానమయినతరువాత కర్మపుడుచుందండీ? ఒకవేళ కామధేనువుకుప్రాణం కడపట్టిందేమో! తెల్లవారిందాకాకూడాచూస్తే యీలోగా ప్రాణం వచ్చేదీ లేనిదికూడా స్పష్టంగా తెలుస్తుంది.

గార్ధ—మీరు చెప్పింది బాగానేవున్నది. ధర్మశాస్త్రం చూడవలెను. సూర్యుడు లేకపోతే కర్మపుట్టదు.

కొంక—మీధర్మశాస్త్రజ్ఞానం మొత్తుకున్నట్టేవున్నది. కర్మాపుడుతుంది అన్నీ పుడుతవి. శిష్టాచారంకంటె ధర్మశాస్త్రం మహా యెక్కువడాఏమిటి? మేము అన్నిచోట్లా రాత్రిళ్ళే చేయిస్తూవున్నాము. సూర్యుడు రాత్రిళ్ళు అగ్నిహోత్రంలో ప్రవేశిస్తాడు గనుక అగ్నిహోత్రంవుంటే రాత్రికర్మకు నేమీఅడ్డంలేదు. శాస్త్రుల్లగారూ!

మీరుయీలాగంటి తెలిసీ తెలియనిమాటలు చెప్పకండి. చచ్చిన వాళ్ళు యేమిటి? మళ్ళీబ్రతకడం యేమిటి? యీమాటయెవళ్ళయినా వింటేనవ్వుతారు. శవం నిండినయింట్లో వుండగూడదు. వేగిరం సన్నాహం చేయించండి.

గార్ధ—ఇప్పుడు దీక్షితులుగారు చెప్పినదీ నాకు సబబుగానే తోచుచున్నది. నేను యేదీ నిశ్చయంగా చెప్పలేను. శాస్త్రం యెలా గువప్పితే ఆలాగుచెయ్యండి. అదుగో సభాపతులు వ్యాఘ్రావధానులు గారూ, వరాహభట్లుగారూ, బకసోమయాజులుగారూ వస్తూవున్నా రు. ఆలోచించి సభాపతులునలుగురూ యేలాగుచెప్పితే ఆలాగు చేతాము.

[వ్యాఘ్రావధానులుగారును, వరాహభట్లుగారును, బకసోమ యాజులుగారును ప్రవేశించుచున్నారు]

బకసోమయాజులు గారు.

వ్యాఘ్రావధానులు గారు.

అశ్వ—సభవారేదయ్యా? సభాపతులు మీరుమాత్రమే వచ్చినారు?

వ్యాఘ్ర— వెనుకనుంచి వారూవస్తూవున్నారు. మర్కట జోస్యులుగారు పంచాంగం నిమిత్తం వెళ్ళినారు. తక్కినవారూ వారితో నేవస్తారు.

రామ—ఈధర్మసందేహము బకసోమయాజులుగారి నడుగు దామా? ఆయన బహుతపశ్శాలి; అనేక యజ్ఞాలుచేసినారు; ఆయనతో సమానమైన ధ్యానము మరివకరికిలేదు, ఆయన మహాద్విజశ్రేష్ఠుడు; కవిచక్రవర్తి.

కొంక—మీవాడుగనుక వూరికే పొగతూవున్నావు. ఆయనాద్విజశ్రేష్ఠుడే; నీవూ ద్విజశ్రేష్ఠుడవే; ఆయన నీకంటెనూ ఘనుడు. నీవు చచ్చినవాటిని పీక్కుతింటావుగాని ఆయన బ్రతికివున్నవాటినే గుటుక్కున మింగివేస్తాడు. యజ్ఞాలకేమీ లోపంలేదు. ఆయన తెల్లవారి లేచిందిమొదలుకొని నిత్యమూ మీనమేధాలు చేస్తూవుంటాడు, ఆయన ధ్యానమంతా చేపలను యేలాగుపట్టుకుందామా అనేకాని మరివకటికాదు. పక్షిగనుక ఆయనకూ నీవలెనే పక్షపాతం సహజమే.

రామ—వారిద్దరికీ విరోధం. సభవారు కొంకనక్క దీక్షితుల మాటలు విశ్వసించకండి.

కొంక—వారిద్దరూ మిత్రులు. సభవారు రామబంధుశాస్త్రి మాట విశ్వసించకూడదు.

వరా—మీరిద్దరూ వూరికే యెందుకు కంఠశోషపడుతారు? సభవారు వస్తూవున్నారు వూరుకోండి.

రామ—కలం తక్కువవాడవు నీవా మమ్మలిని మందలించేవాడవు? వోపందీ! అట్టేరుమ్యుక వూరుకో.



వరాహభట్టుగారు

వరా—కావలిస్తే నీవు కులంతక్కువవాడవు. నేను కేవలమూ ఆదివరాహ స్వరూపుడయిన విష్ణుమూర్తి సంతతివాణ్ని. ఓపక్షీ కానా! ఎగిరిపడబోకు.

కొంక—అలాబుద్ధిచెప్పు.

రామ—నీ నక్కజిత్తులు చాలించు.

[అప్పు డాంజనేయశర్మయు, మర్కటజోస్యులును, మల్లుభట్లును, తిమ్మన్న చయునులును, ప్రవేశించుచున్నారు,]



ఆంజనేయశర్మగారు.



మల్లుభట్లుగారు.

అంజ—ఏమిషయ్యా! మీలోమీరే కేకలు వేస్తూవున్నారు? సభవారితో యేమయినా ఆలోచించడమూ పెట్టడమూ వున్నదా లేదా?

రామ—ఆంజనేయశర్మగారు యేళ్ళుగడిచినవారు ధర్మశాస్త్రవేత్తలు తోక పక్కటిలేదుకాని నాడు శ్రీరాములవారి నిమిత్తం లంకకాల్చివచ్చిన ఆంజనేయులవారి అపరావతారులు. "అయ్యా! ఆంజనేయశర్మగారూ! కామధేనువు చచ్చిపోయినది గదా? యీరాత్రి కర్మచేయించి శవాన్ని తీసుకుపోవచ్చునా?"

అంజ—(తనలో) యేలాగయినా మనకు లాభముదొరికే మార్గం చూడవలెను. (బిగ్గరగా) తీసుకుపోకూడదు.

కొంక—నావద్ద కోతిచేష్టలు చెయ్యక యిప్పుడు యెందుకు తీసుకు పోకూడదో చెప్పు?

అంజ—ఇప్పుడు తీసుకువెళ్ళినా రేపుతీసుకొనివెళ్ళినా ముందుగా ప్రాయశ్చిత్తం కావలెను.

మేపే—ఇదేమిటయ్యా! నీవువచ్చి కొత్తగొడవ తెచ్చిపెట్టినావు. లోకమంతా మెచ్చుకొనే కామధేనువుకు ప్రాయశ్చిత్తం యెందుకయ్యా.

అంజ—ఎందుకో నీకేమి తెలుస్తుంది? చిన్నప్పటినుంచీ ధర్మశాస్త్రాలలో పుట్టిపెరిగిన మావంటివారికి తెలుస్తుందికాని కామధేనువు బ్రతికివున్న కాలంలో మహాపాతకంచేసింది కాబట్టి ప్రాయశ్చిత్తం కాకతీరదు.

వృష—ప్రాయశ్చిత్తంమాట. చూచుకుండాముగాని చేసిన పాపమేమిటో చెప్పు?

అంజ—కావలసినన్ని పాపాలున్నవి. కృతఘ్నులయిన మనుష్యులకు పాలు మొదలయినవి యివ్వడం మొదటిపాపం. ముట్టుకో

వడానికైనా అర్హాంకాని కుక్కకు పాలివ్వడం రెండోపాపం. విశ్వాస మన్నమాట యెరుగనిపిల్లికి పాలివ్వడం మూడోపాపం. ఈపాపా లన్నీ క్షమించినా ధర్మశాస్త్రానికి ప్రత్యక్షవిరుద్ధమయిన పశుగమన పాపం యేలాక్షమించడానికి వీలవుతుంది? ఆపాపం యెవరూ చెయ్య లేదన లేరుకదా? ఆపాపం చేసినందుకు యిప్పుడు దగ్గిరకూర్చుండి యేడుస్తూవున్న యీవత్సమే దృష్టాంతము. పశుగమనమే లేకపోతే యీదూడ యేలాగుపుట్టినది? కలియుగానికి ముఖ్యప్రమాణమయిన పరాశరస్మృతియొక్క దశమాధ్యాయములో

శ్లో. పశువేశ్యాదిగమనే మహిష్యుష్ట్రీ కపీం తథా
ఖరీంచ సూకరీం గత్వాప్రాజాపత్యం సమాచరేత్.

అని వున్నది. కాబట్టి పశుగమన ప్రాయశ్చిత్తం ముందుగా జరగ వలెను.

వృష—వోరినీనోట్లో పుండుపుట్టా! ఎన్నికారుకూతలు కూసి నావురా నాలుగుపోట్లు పొడిచి నీజొక్క బద్దలుచేస్తునా?

అశ్వ—వోరీ నీధర్మశాస్త్రం కాలిపోనూ! యీకారుకూతలు పేలినందుకు నత్తిపెంకు యెగిరేటట్టుగా తన్నుదునా?

మార్జా—(తనలో) నాకువిశ్వాసం లేదంటూవున్నాడు. యిందులో నేనువిశ్వాసం కలిగివుంటాను. (ప్రకాశముగా) ఓరి పుర్కటాధమా! కావలిస్తే నీకు నేను ప్రాయశ్చిత్తంచేయిస్తాను.

భైర—వోరికోతిముండాకొడకా! నన్ను ముట్టుకోవడానికీ అర్హాంకాదుటా? వీధిలోకిరా, నీకండలువూడదీసి నేనుముట్టుకోవ డానికి తగినవాణ్ని అవుదునో కానో చూపిస్తాను.

అంజ—శాస్త్రుల్లగారూ! ఆదౌర్జన్యం చిత్తగిస్తూవున్నారా? వృషభేంద్రరావుగారున్ను, అశ్వపతిగారున్ను, గడ్డితినేమాటలంటూ వుంటే వూరుకోవడం సభవారికి న్యాయమేనా?

గార్ధ—అశ్వపతిగారూ! వృషభేంద్రరావుగారూ! వూరుకోండి. మనం కార్యవాదులం తొందరపడకూడదు. వారుధర్మశాస్త్రం చూపిస్తూవుండగా మరివకలాగుఅనడం భావ్యంకాదు. మనమందరమూ ధర్మశాస్త్రానికి బద్ధులమై యుండవలెను.

రామ—ఆ పాపానికి ప్రాయశ్చిత్తమేమిటో సెలవిస్తారా?

ఆంజ—శ్లో. గోగామీచతిరాత్రేణా గామేకాం బ్రాహ్మణో దదత్.— అని దానికిందశ్లోకములోనే వున్నది.

రామ—అలాగయితే నేను మహాద్విజుణ్ని. యీకామధేనువును సూర్యోదయం కాగానే నాకు దానంయిప్పించండి. అన్ని పాపాలూ పరిహారమైపోచవి.

మల్లు—దానంచెయ్యడం చచ్చినగోవునా బ్రతికినగోవునా?

రామ—ధర్మశాస్త్రవిషయం నీకేమీ తెలియదుగాని నీకొండ ముచ్చు చేష్టలుమాని నోరుమూసుకువూరుకో.

వ్యాఘ్ర—బ్రతికివున్నగోవునైతే దానంనాకివ్వవలెను. నేను పెద్దసభాపతిని.

రామ—నీకు సభాపతిత్వం యివరిచ్చినారు?

వ్యాఘ్ర—నాచేతులు యిచ్చినవి; నానోరు యిచ్చినది. అనాథలైన మీకువలె సభాపత్యం నాకు పూర్వులనుంచి రావలసిన పనిలేదు. మీవలెనేను శవాలిపీక్కతినేవాణ్ని గాను. మహారాజులాగు బ్రతికి వున్నవాళ్ళనే పీక్కతింటాను. పూర్వులపేర్లుచెప్పి సభాపతులమని పోట్లాడడమేకాని పొట్టకోసినా మీలోవక్కడికీ చిన్నమెత్తు తెలివిలేదు. నేనునాస్వశక్తిచేతనే సభాపతిత్వం తెచ్చుకున్నాను. మీలోయెవరు నేనుసభాపతిని కానంటారోరండి వక్కసారిగా అందరిగొంతుకలూ కొరికివేస్తాను. (అని లేచుచున్నాడు.)

రామ—(తనలో) ఇతను బలవంతుడు. ఇతనితోపోట్లాడితే కార్యంలేదు. (ప్రకాశముగా) అపరాధంవచ్చింది క్షమించండి.

వరా—మనలోమనకు తగవులుకూడదు. మీరే అగ్రసభాపతులు. మేమందరమూ వప్పుకున్నాము. శాంతించి కూర్చోండి.

వ్యాఘ్రి—ఆలాగయితేసరే.

అశ్వ—మీరు యిందాకా చెప్పిన ధర్మశాస్త్రం మనుష్యుల విషయమా? తిర్యగ్జాతులవిషయమా?

అంజ—అందరివిషయమూను. లోకంలో మనుష్యులకు వక్క ధర్మశాస్త్రమూ పశువులకు వక్కధర్మశాస్త్రమూ వుంటుందా? అందరికీ ఒక్కటే ధర్మశాస్త్రం.

మేషే—మీధర్మశాస్త్రం చచ్చినవాళ్ళవిషయంలోనా? బ్రతికి వున్నవాళ్ళవిషయంలోనా?

అంజ—ఓహోహో! మీరుకుశ్శంకలు మహాచేస్తూవున్నారే! ఇది అందరివిషయంలోనూ. బ్రతికివున్నవాళ్ళు ప్రాయశ్చిత్తం చేసుకొన్నంటే చేసుకోరుగనుక ముఖ్యంగా చచ్చినవాళ్ళవిషయంలోనే.

మేషే—ఆలాగయితే చచ్చినవాళ్ళచేత ప్రాజాపత్యవ్రతం యెట్లాచేయిస్తారు?

వర్కట దోస్యలుగారు.

తిమ్మన్నచవసులుగారు.

తిమ్మ—సభవారి యిష్టంవచ్చినట్లు చేయిస్తారు. అదంతా మీకెందుకు? సభవారు యేమిసెలవిస్తే అదేమాకు ధర్మశాస్త్రం.

అశ్వ—సింహ శరభ గండభేరుండాదులైన వుత్తములు వుపేక్షచేసి వూరుకోవడంచేత కోతులయొక్క కొండముచ్చుల యొక్క ఆటలుసాగుతూవున్నవి. మీమనసు వచ్చినట్లల్లా చేయించడానికి యిదినోరువచ్చిన చెవులపిల్లుల యిల్లనుకున్నారా? మేము యిద్దరమూ తలచుకుంటే యీదౌర్జన్యంచేసేవారిని డొక్కలు బద్దలయ్యేటట్టుగా తన్ని పడపొడిచి పనిలిపెడుతాము.

వృష—తొందరపడకండి ఆంజనేయ శర్మగారూ! మీరు చెప్పిన ధర్మశాస్త్రంలో 'కపీం' అని వున్నది గనుక యిప్పుడీసభ వారి కందరికి ప్రాయశ్చిత్తమక్కరలేదా? 'ఖరీచ' అని వున్నది గనుక, గార్ధభేంద్రశాస్త్రిగారికికూడా ప్రాయశ్చిత్తంకావలెను.' 'సూకరీం' అనికూడా వున్నందున, సభాపతులైన వరాహభట్లుగారికీప్రాయశ్చిత్తం జరగవలసినదే.

ఆంజ—(తనలో) వీళ్ళకు సంస్కృతం తెలియడం చాలా తటాగావున్నదే. (ప్రకాశముగా) బ్రతికివుండగా మనకాసంగతి ఆలోచించవలసిన పనిలేదు. చచ్చిపోయిన తరువాత ధర్మశాస్త్రాలు తీసి, అందరినీ యిలాగేచేస్తాము. మగవాళ్ళుకానడంచేత తమకడుపులోనుండి పిల్లలు పుట్టరుగనుక వీరు మేమూపాపం చెయ్యనే లేదంటారు. వక్క అబద్ధమాడితే అన్నీమాసి పోతవి. రహస్యంలో జరిగేదానికి మనం యేమీ యిలాకా పుచ్చుకోకూడదు.

వృష—ఇదివరదాకా వ్యర్థమైన ప్రయాసపడ్డారు. మేము మొట్టమొదట దహనవిషయంలో వేసిన ప్రశ్నకు సభవారివద్దనుంచి యేమీసమాధానం రాలేదు.

వ్యాఘ్రి—తగినన్ని దానాలుచేస్తే దహనం చెయ్యవచ్చును. మొదట వృత్రాంతి గోదానం చెయ్యవలెను. తరువాత వైతరిణీ గోదానం చెయ్యవలెను. సంచయనంనాడు వకగోదానం చెయ్యవలెను. దశాహంనాడు వకగోదానం చెయ్యవలెను. మాసికం నాడువకటిచెయ్యవలెను. ఈగోదానాలన్నీ నాకుయిప్పిస్తే యేప్రాయశ్చిత్తమూ అక్కరలేకుండా నేను దహనం చేయిస్తాను. ఏమయ్యా సభాపతులు మీఅభిప్రాయం చెప్పండి.

వరా—మాకుతగిన దానాలుయిప్పిస్తే మేమూవప్పుకంటాము.

బక—వరాహభట్లుగారితో నేనూ యేకీభవిస్తాను.

రామ—(రహస్యముగా) దీక్షితులూ! కొంపమునుగుతూవున్నది. మనం యిందులో వప్పుకోకూడదు. యేమైనాఅంటే వ్యాఘ్రివధానులు చంపివేస్తాడు.

కొంక— (రహస్యముగా) నాకూఅదేభయంగా వున్నది. అతనువక్కడు మనపక్షంలో చేరితే యెంతపనిఅయినా చేతుము. మేనమామ మాజ్జాలపంతులు అందులో వుండడంచేత వ్యాఘ్రివధానులు వాళ్ళలోచేరినాడు. ఇప్పుడాపక్షంలో చేరినా యితను ఇదివరకు అనేకగోమేధాలూ అశ్వమేధాలూ చేసినవాడే. మనమేదైనా మాయోపాయంపన్ని యీకార్యంచెడగొడుదాము.

వ్యాఘ్రి—సభవారూరుకున్నారేమి?

మల్లు—మాకుతగిన ఫలప్రదానాలు యిప్పిస్తే మేమువప్పుకుంటాము.

రామ—(రహస్యముగా) మించిపోయావుంది. యేమైనా వుపాయం ఆలోచించినావా?

కొంక—మర్కటజోస్యులూ! మాట. (రహస్యముగా) ఇప్పుడు నక్షత్రం మంచిదికాదని నీవు ఆటంక పెడుతూ. తెల్లవారిన తరువాత మరివక వుపాయం ఆలోచింతాము.

వాఘ్రి—ఏమిటి మీముగ్గురూ మహా గుసగుసలాడుతూ వున్నారు?

కొంక—ఏమీ లేదు. కర్మకు ఇప్పుడు మంచిముహూర్తమధునా కాదా అని ఆలోచిస్తూయున్నాము.

వాఘ్రి—మీఆలోచన తెగిందా యింకా తెగనేలేదా?

మర్క—తెగింది. యీరాత్రి నక్షత్రం బాగావున్నదికాదు.

వృష—దహనానికి మంచినక్షత్రంయేమిటి? సభవారందరూ వప్పుకున్నపని వేగిరం కానియ్యండి.

రామ—నక్షత్రం మంచిదికానప్పుడు చేయించడానికి మేము వప్పుకోము.

కొంక—నేనూ వప్పుకోను.

వృష—మీరు యిద్దరు వప్పుకోకపోతే యేమిలెండి.

గార్ధ—వృషభేంద్రరావుగారూ! మీరు సభవారితో వివాద పడబోకండి. వివాదపడితే అందరూవప్పుకున్న కార్యం నిష్కారణంగా చెడిపోతుంది. (రహస్యముగా) యింతలో మానిగిపోయిం దేమిటి? ఈరాత్రి నాలుగు జాములు వోపిక చేస్తూరూ. తెల్లవారిన తరువాత మేమంతావచ్చి కార్యంజరిగిస్తాము. (ప్రకాశముగా) అయ్యా సభవారికి నమస్కారము. యీరాత్రి పొద్దుపోయిందిగనుక సభవారనుగ్రహించి వుదయాన్నే దయచేసి యీకార్యంయేలాగైనా సానుకూలం చెయ్యండి.

అంజ—అలాగైతే మేమింటికినడిచి రేపువుదయాన్నే వస్తాము. (అని బంధువులతో వెళ్ళుచున్నాడు.)

గార్ధ—రామబంధుశాస్త్రిగారూ! యీలాగురండి. (చెవిలో) మీరుప్రాయశ్చిత్తం చేయించకుండా వదలిపెట్టవద్దు. (ప్రకాశంగా) రేపువుదయాన్న పెందరాళే దయచెయ్యండి.

రామ—(రహస్యముగా) ఇందులో ప్రాయశ్చిత్తం యెవరికి కావలెను? మాకు దొంకేకూడు పడిపోతూవున్నది.

గార్ధ—(రహస్యముగా) కొంకసక్క దీక్షితులూ! మీరూ తెల్లవారిందాకా ఆలోచించి రేపు దహనం అడ్డుపడే వుపాయం యోచించండి.

రా—దీక్షితులూ! ఇలాగురా! (రహస్యముగా) నీవు వుపాయశాలివి గనుక దహనం వగా నీవుపాయం యీరాత్రి నిద్రపోకుండా ఆలోచించి శవాన్ని పగలు రుద్రభూమిలో వేసినా, రాత్రికి సగం శవంనీకు అట్టేపెడతాను.

కొంక—ఆలా చేతులో చెయ్యివేసి ప్రమాణంచెయ్యి. నేను తెల్లవారేటప్పటికి మూడులోకాలకు వెళ్ళి నాతిరుగులేని వుపాయం ఆలోచించుకువస్తాను.

రామ—చేతిలో చెయ్యివేసి (రహస్యముగా) మాటతప్పిపోతే, నేను మనిషికి పుట్టలేను. నేనన్న తరువాత మాట తిరుగుతానటా? ఇందులో దహనపుపెంట పెట్టినవారెవరురా?

కొంక—మరియెవరున్నారు? మేషేశ్వరుడున్ను, అశ్వపతిన్నీ, వాళ్ళతో వృషభేశ్వరుడుకూడా యేకీభవించినాడు. మనయత్నం ఒకవేళ కొనసాగకపోయిరా యేదో వంకపెట్టి యీముగ్గురినీ తప్పకుండా వెలివేయుంతారు. (తనలో) ఈపక్షిముండాకొడుకును నమ్మరాదు. నేను కష్టపడి తీరావుపాయం ఆలోచిస్తూ యిన్ని మాటలూ చెప్పి నాకు లేకుండా అంతా పగలు తానే కడితేరుస్తాడేమో! అసలు పట్టుపెట్టుకోవడంలోనే వీడు మాటతప్పితే తాను మనిషికి పుట్టలేదంటూ వున్నాడు. వీడు అసలు మనిషికి పుట్టియేడిసరాడా?

రామ—(రహస్యముగా) మనప్రయత్నం తప్పిపోవడమని వకటి తెచ్చిపెట్టకు. నీవుధైర్యం చెప్పకపోతే యీరాత్రి నాకు నిద్ర పట్టదు.

లొంక—మనప్రయత్నం విఫలంగాదు. కావలసినంత నిద్రపో.

రామ—నీకడుపుచల్లగా! అలా కావలెనుగాదూ? శవాన్ని ముట్టుకున్నందుకు వీళ్ళను వెలివెయ్యవలెనని నేను రేపు కావలసినన్ని కారికలు తీసుకువస్తాను.

వ్యాఘ్ర—అందరమూ చేరివున్నాముగనుక రేపువుదయం మళ్ళీరావడంకంటె యీరాత్రే కర్మచేయించవచ్చును.

గార్ధ—సభవారంతా వెళ్ళిపోయినారు. రేపువుదయాన్నే చేయింతాము. సభవారు విజయంచేస్తూవున్నారు. రేపువుదయాన్నే యెదిరియెక్కకుండా దయచేసి, ఆపత్సముద్రంలో మునిగివున్న వీరిని యెలాగైనా గట్టెక్కించండి. (అందఱు నిష్క్రమించుచున్నారు)

మూషకాసురవిజయము

రంగము—ఉల్లితోట.

[మూషకభట్టరుగారు ప్రవేశించుచున్నారు]



మూషకభట్టరుగారు.

మూష—(అంతట కలయజూచి) ఓహో! యీతోట యెంత రమ్యంగా వున్నది! గట్లపొడుగునా ముల్లంగిచెట్లు వెయ్యబడివున్నవి. వుల్లిమళ్ళలో మధ్యమధ్య పెరుగుతోటకూర మొక్కలు కోమలంగా పెరిగి నవనవలాడుతూ వున్నవి. కంచెలమీద బీరపాదులుపాకి వింతగా కాస్తూవున్నవి. పేరుకు యీపొలం కాపువాడిదంటారేకాని సమీపంలో కాపురంవుండడంచేత నిజానికి నాదేకాని వాడిదియెంత మాత్రమున్నుకాదు. యీబీరకాయలూ ముల్లంగిదుంపలూ మొదలయినవాటి నన్నిటినీ వాడికంటె నేనే యెక్కువగా అనుభవిస్తాను. కష్టంవాడిదీ ఫలంనాదీగనుక వాడు నాకోసం కష్టపడే నవుకరుకాని యజమానుడుకాడు. నాకోసం మళ్ళీకూరలు మొదలయినవి వెయ్యడానికి వాడవతలిపొలం యేలాగు దున్నివుంచినాడో! ఈపొలం యెండిపోయేటప్పటికి మళ్ళీ ఆపొలం సిద్ధం అవుతుంది. ఆదుర్మార్గుడు మాత్రం నేనుచేసేది దొంగపనిఅని తిడుతూవుంటాడు. తిట్టుకుతిట్టుకుని నోరునొప్పియెత్తి వాడేనశిస్తాడు. నూరుతిట్లయినా బొక్కిడు

కొఱ్ఱలు కావు. ఎక్కడనయినా తిట్లవల్ల చావడమూ దీవనలవల్ల బ్రతకడమూ వుంటుందా? వాడు రాకమునుపే ఒక్కసారి నాలుగు మూలలూ తిరిగి నాపొలంఅంతా చూసుకొనివస్తాను. (అని నాలుగు అడుగులు నడిచి) యీవంకను యెవరో వస్తూవున్నారు. ఇక్కడ నిలువబడుతాను.

[అప్పుడు శశకపతి రావుగారు ప్రవేశించుచున్నారు.]

శశకపతిరావుగారు.

శశ (తనలో) నేను నాపొలం చూచుకోవడానికి వచ్చినాను. యీతోటకూర మొక్కలు మహాయేపుగా పెరిగినవి. రేపటిదినం తెల్లవారేటప్పటికి నాబంధువులనందరినీ తీసుకువచ్చి వారికి యీ తోటకూర కాడలతో విందుచేసి ద్వాదశీ పారణా వనసంతర్పణా కూడాచేస్తాను. తోటమాలి వచ్చేవేళఅయింది, పొలమంతా చూచుకుని వేగిరం వెళ్ళిపోవలయును. (అని నిలుచున్నాడు.)

మూష— (సమీపమునకువచ్చి) అయ్యా! నమస్కారము.

శశ—(తేరిపారచూచి తనలో) కాళ్ళు యీడ్చుకుంటూ వచ్చి యీపందికొక్కుగాడు నాకు నమస్కారం చేస్తూవున్నాడు. వీడినమస్కారం పుచ్చుకోకుండా గంభీరంగావుండి వీడి ముందర నాగొప్పతనం అంతాకనపరచవలెను. (అని గర్వముతో బిగ్గరగా) నీవు యెవడవు? యీపొలంలోకి యెందుకు వచ్చినావు?

మూష—(తనలో) నేను పెట్టిన నమస్కారమయినా పుచ్చుకోకుండా యీచెవులపోతుకు యెంతగర్వంవచ్చిందీ? సాధ్యమయితే నేను యిప్పుడు వీడిగర్వ ప్రాయశ్చిత్తంచేసి వీణ్ణిమరీ యింటికి పంపుతాను. (బిగ్గరగా) నేను వుదయాన్నే షికారువచ్చినాను. నాపేరు మూషకభట్టరంటారు.

శశ—వంకర కాళ్ళూనీవు నీకుషికారుకూడానా? నీకాళ్ళు మరి వకవిధంగా వుపయోగించుకోరాదా?

మూష—(తనలో) వీడుముందుగా నాకాళ్ళమాటే యెత్తుకున్నాడు. లోకంలో యెవరికిన్ని లేనిలోపాలు యెన్ని యెంచినా కోపంరాదుకాని వున్నలోపం యెంచితే తప్పకుండా వళ్ళుమండుకు వస్తుంది. వున్నమాటంటే వులుకువస్తుందన్న సామెత అందరూ యెరిగిందే. నావంకర కాళ్ళ మాటతలపెట్టినాడుగనుక యేలాగయినా వీడికి గర్వభంగంచేసి మరీపంపవలెను. (బిగ్గరగా) నావివంకర కాళ్ళు కావడానికి కంచెలు దూకితే నాకాళ్ళు యెవరూ విరగగొట్టలేదు. నాకాళ్ళు వేరేవిధంగా వుపయోగించు కోవలసిన అవసరంలేదు. యెంతగెడకర్రలలాగువున్నా నీకాళ్ళకంటె నాకాళ్ళే యెక్కువవుపయోగంగాను అందంగాను వున్నవి. నీవునన్ను ఆక్షేపించనక్కరలేదు.

శశ—నీవు కంచెలు దాటకపోతే రాత్రిళ్ళు కన్నాలలోనుంచి యిళ్ళల్లో దూరడంచాత నీకాళ్ళు వంకరపోయినవి. యెవరికాళ్ళు యెక్కువ వుపయోగం అయిందీ నాలుగు అడుగులు పరుగెత్తితే తెలుస్తుంది.

మూష—అలాగే పరుగెత్తుదాం పందెంవెయ్యి. యేమేమి పందెము?

శశ—ఇప్పుడు బాగావున్నది. నేను నీమనసువచ్చింది పందెం వేస్తాను. ఇప్పుడే పరుగెత్తుదామురా. అన్నమాటకు నీవు తిరిగిపో కూడదు.

మూష—తిరిగిపోతే పరుగెత్తలేక నీవు తిరిగిపోతావుగాని నేను యెన్నటికీ తిరిగిపోను. ఇప్పుడు వరహావరహా పందెం. నేను తిరిగిపోతే రేపటినుంచి నన్నీ పేరుతోపిలువవద్దు. చిన్నప్పటినుంచీ కందమూలఫలాలు భక్షిస్తూ తపస్సుచేసి యీ పొలంలోవున్న పందికొక్కులన్నిటికీ గురువునయి సంపాదించుకొన్నభట్టర్ బిరుదు నేటితోతీసి పారవేస్తాను.

శశ—నీవు వేసిన పందానకు నప్పుకున్నాను. గాదెకింది పంది కొక్కులాగు నీవు యెంతసంపాదించినా నీదగ్గర డబ్బువుండదుగనుక నీవు వక్కవరహా మాత్రమే పందెము వేసినావుగాని నేను వోడి పోతే నీకు పదివరహాలుయిస్తాను. యెక్కడనుంచి యెక్కడదాకా పరుగెత్తు దామో చెప్పు.

మూష—పొలంపాడు వచ్చేసమయం అయిందిగనుక పరు గెత్తడానికి యిదిమంచిస్థలంకాదు. అదుగో ఆదున్నినపొలంలో ఆకంచెకాడనుంచి యీకంచెదాకా పరుగెత్తుదాము.

శశ—అలాగయితే పరుగెత్తుదాము బయలుదేరు.

మూష — తొందరపడక కొంచెము సేపు తాళు. నేనునిన్న యేకాదశి నిరహారం చేసినాను. ఇంటికి వెళ్ళి ద్వాదశిపారణ చేసి వస్తాను. మాయిల్లు ఇవతలికంచెలోవున్నది. నీవు అవతలకంచెదగ్గర వుండు. నేను భోజనంచేసివచ్చి నిన్ను యిప్పుడే కలుసుకుంటాను. పందెం అక్కడనుంచే ఆరంభింతాము.

శశ — ఈవంకపెట్టి మళ్ళీరాకుండా మాయ మయ్యేవుసుమీ. ఈలోగా నేనుకూడా ఫలహారంచేసివచ్చి నీకోసం ఆకంచెకాడ కనిపెట్టుకుని వుంటాను.

మూష — చాలలేక నీవుపారిపోతా వేమో కాని నేనుపారిపోను. అటువంటి చేష్టలు నావద్ద లేవు.

శశ — నీపందికొక్కు చేష్టలుమాని వేగిరంవెళ్ళిరా. మళ్ళీ వచ్చిన తరువాత కావలసినన్ని జంభాలువరకవచ్చును.

మూష — జంభాలు నావయిందీ నీవయిందీ తరువాత క్రియలో తెలుస్తుంది. వట్టిమాటలతో యేమిప్రయోజనము? మళ్ళీవచ్చి నీచేతనేనాతో పరుగెత్త లేననిపిస్తాను. చూడు.

శశ — అట్టేవాగకపో. తాటాకుల చప్పళ్ళకు కుందేళ్ళు జడుస్తవా?

మూష — తినబోతూ రుచులెందుకు? అదీ తెలుస్తుంది. (అని తనయింటివంక నడుచుచున్నాడు.

శశ — ఇదుగో నేను ఫలహారానికి వెళుతూవున్నాను. నీవు వేగిరంరా. (అని వెళ్ళుచున్నాడు.)

మూష — (కొంచెమునడిచి యిల్లుచేరి) ఓసీ! ఓసీ! వేగిరం యెదురుగుండారా. ఈకలికాలంలో భార్యలు భర్తలకు యెదురు గుండారావడమూ శిశ్రూష చెయ్యడమూ అంతాపోయింది. ఈ కాలంలో పురాణాలలో చెప్పేమోస్తరు పతివ్రతలేలేరు.



మూషికాంబగారు.

భార్య—(కన్నములోనుండి పయికివచ్చి) నేనుమహాపతివ్రతను కానా ? యీలోకంలోనాకంటె భర్తఆజ్ఞలో మెలిగేవారెవ్వరున్నారు? మీరుఅక్కడాఅక్కడా తిరిగివచ్చేటప్పటికి నేను సిద్ధంగా వుండి మీకు సమస్తోపచారాలూ చెయ్యడంలేదా?

మూష—నేనులోకంలోవాళ్ళమాట చెప్పినానుగాని నీమాట కాదు. నీవుతప్పకుండాపతివ్రతవే మొగుడుచెప్పినట్టల్లాచేసే నీవంటి యిల్లాళ్ళుకొందరు వుండబట్టే యీకలియుగం నిలిచివున్నది. నేను వక్కపని చేసుకు వచ్చినాను.అందులో నాకు నీసహాయం కావలెను.

భార్య—ఏమి చేసుకునివచ్చినారో చెప్పండి. నాచేతనయినపని నేనుచేస్తాను.

మూష—అదిమరేమీ గొప్పపనికాదు. నేను వకచెవుల పిల్లితోకూడా పరుగెత్తడానికి పందెంవేసివచ్చినాను. పందెం మనం గెలిస్తే మనకు పదివరహాలు వస్తవి. ఆచెవులపోతుకు తానేమో నాకంటే మహావేగంగా పరుగెత్తగలనని యెంతోగర్వము. ఇలా గర్వపడేవాళ్ళు బుద్ధిహీనులుగాని తెలివిగలవాళ్ళుకారు. మనంవక మహేంద్రజాలంచేసి దాన్నియేలాగయినా గెలువవలెను.

భార్య—మీకు యేమి మతిపోయిందా యేమిటి? పొట్టయీడ్చుకుంటూ కదలలేని పుట్టపందికొక్కు యెక్కడ? మేఘాలమీద యెగసిపోయే కుందేలుతో పరుగెత్తడం యెక్కడ? యీరోజునమీకు యేమీ పిచ్చియెత్తలేదుగదా?

మూష—నోరుమూసుకో. భార్యభర్తమాటకు యెదురాడకూడదు. నోరెత్తక నేనుచెప్పినట్టుచెయ్యి. పురుషులుచెప్పినట్టల్లా చెయ్యడం కులస్త్రీలకు ధర్మంగాని లేనిపోనిప్రశ్నలు వెయ్యకూడదు. పురుషులస్వనహారాలూ రాచకార్యాలూ ఆడవాళ్ళకుమీకు యేమి తెలుస్తవి?

భార్యమీరన్నట్లు మాకేమీ తెలియవుగాని—

మూష—నోరుముయ్యి. నాయెదుట భయంలేకుండా మళ్ళీ మాటాడుతావు! నేనుయిప్పుడు చెప్పినట్లు నీవుచేస్తావా! చెయ్యవా! నాఆజ్ఞ వినకపోతే యీకరచ్చుప్పుడు నీవీపుమీద విరుగుతుంది.

భార్య—మీఆజ్ఞ వినకుండావుండడానికి గుండెలున్నవా? ఏమిఆజ్ఞాపిస్తారో ఆజ్ఞాపించండి. మీఆజ్ఞకు బద్ధురాలనయి చేతులు కట్టుకొని చేస్తాను. మొగుడు భార్యను గోదావరిలో దూకుమంటే దూకవలెను.

మూష— ఓప్రియురాలా! ఈనాగటి చాళ్ళలోపడి యీ కంచెదగ్గిరనుంచి ఆకంచెదాకా మేము పందెంవేసి పరుగెత్తుతాము. నీవుచుక్కడదాగివుండి ఆకుందేలు పరుగెత్తుకుని రావడంతోటే చటుక్కున పయికివచ్చి నేనేముందువచ్చినానని అంటూవుండు. అతను మళ్ళీ పరుగెత్తుమంటే మంచిదని నాలుగడుగులుపరుగెత్తి కుందేలుదాటిపోయినతరువాత వెనుకనిలువబడు. రూపంచూస్తే నాకూనీకూభేదం తెలియదుగనుక ఆకుందేలుగాడు నీవేనేనను కుంటాడు. అప్పుడు పందె మనంగెలుస్తాము. అదుగో కుందేలా కంచెవద్దకుపోతూవున్నది. నీవు కనపడకుండా దాక్కునివుండు. ఈ

లోగా నీకూనాకూ భేదం తెలియకుండా వుండడానికి నా మొగాన్ని పున్నట్టేనీవుకూడా మొగాన్ని నామాలుపెట్టుకొని శ్రీవైష్ణవునివలెవుండు.

భార్య—అలాగేవుంటాను. (అని వకనాగటిచాలులో దాగుకొనుచున్నది)

మూష—ఓప్రియురాలా! సరిగ నేను చెప్పినట్టు చెయ్యవలెను సుమా. నేనా కుండేలువద్దకు వెళుతూవున్నాను. (అని నడచుచున్నాఁడు)

[అప్పుడు శశకపతిరావు మరల ప్రవేశించుచున్నాఁడు]

శశ—ఓమూషకభట్టాచార్యా! ఈ కాస్తదూరము నీవెంత సేపు నడిచినావు. నీవు పందెంగెలిచే లక్షణం ఆరంభములోనే కనపడ్డది. నీకోసం నేనుయెంతోసేపటినుంచి యెదురుచూస్తూవున్నాను.

మూష—నేను పరుగెత్తలేక మెల్లిగానడిచినా ననుకున్నావా యేమిటి? తల్చుకుంటే నీకంటె ఫదిరెట్లు వేగంగా పరుగెత్తగలను. నేను చదువుకున్నవాణ్ణిగనుక భోజనంచెయ్యడంతోటే పరుగెత్తడం దేహారోగ్యానికి మంచిదికాదని మెల్లిగా పెళ్ళినడకనడిచివచ్చినాను. నీవు ఆమాత్రం గ్రహించలేకపోయినావు.

శశ—నీపాండిత్యానికేమిగాని మనం వేసుకున్న పందెముప్రకారము పరుగెత్తుదాము వస్తావా?

మూష—తప్పకుండా వస్తాను. పరుగెత్తవలసిన స్థలంయేదో నీకు తెలుసునా? సరిగా ఆకంచెమీదవున్న బీరపాదువద్దకు పరుగెత్తవలెను.

శశ—మంచిది. సరేనా? పరుగెత్తవచ్చునా? ఆరంభించు. (అని వాయువేగ మనోవేగమున పరుగెత్తుచున్నాఁడు)

మూష—ఇదిగో ఆరంభించినాను. (అని నాలుగడుగులువేసి నాగటిచాలులో నడఁగి స్వస్థముగా కూరుచుండి) అదగో! అప్పుడే

కుంచేలుగాడు బీరపాదుదగ్గిరకు వెళ్ళినాడు? నా పెళ్ళామక్కడ సిద్ధంగా వుండి నేను చెప్పినట్లు చెయ్యవచ్చును. వీడు నామాయలో పడిపోతాడు.

శశ—ఇదిగో నేను పరుగెత్తుకొని వచ్చినాను.

భార్య (మూషకాంబ)-నీకంటెముందుగా నే నేను వచ్చినాను.

శశ—(ఆశ్చర్యపడి తనలో) ఇదియేమి? ఇంద్రజాల మహేంద్రజాలముగా వున్నది? (బిగ్గరగా) ఓమూషకభట్టరా? మళ్ళీపరుగెత్తుదాము రా. వక్కమాటుతో నాకు నమ్మకంలేకుండావున్నది.

భార్య—మంచిది. అలాగే పరుగెత్తుదాము.

శశ—ఇదిగో బయలుదేరుతూవున్నాను. (అని మునుపటికంటెను వేగముగా పరుగెత్తుచున్నాడు)

మూష—అడుగో శశకపతిగాడుమళ్ళీ యిటుకేసి పరుగెత్తుకొని వస్తూవున్నాడు. నాభార్య వాణ్ని మోసంచేసింది. అది పతివ్రత అయినందుకు సందేహములేదు.

శశ—ఈవైపుకు నేను ముందుగావచ్చినాను.

మూష—(పైకిలేచి) లేదు. ఇక్కడికీ నేనేముందుగా వచ్చినాను.

శశ—(తనలో) వీడివద్ద దెయ్యాలమంత్రం వున్నదాయేమిటి? ఇది పెద్దమోసంగా కనుపడుతూవున్నది (బిగ్గరగా) ముఖ్యంగా మూడుసార్లు పరీక్ష చెయ్యవలెను. ఇంకొకమాటుకూడా పరుగెత్తుదాము రా.

మూష—నీవెన్ని సారులు పరుగెత్తుదామంటే అన్నిసారులే పరుగెత్తుదాము. లక్షసారులు పరుగెత్తినా నాకువచ్చినభయంలేదు.

శశ—అలాగైతేరా. (అని పరుగెత్తి) ఈసారైనా నేను ముందుగా వచ్చినానాలేదా?

భార్య—(పయికిలేచి) లేదు. నాకంటె నీవు వేయిరెట్లువెనుక వచ్చినావు.

శశ—ఈవొక్కసారీకూడా పరుగెత్తు. మొదట బయలుదేరిన సలానికి మళ్ళీ వెళుదాము. ఈమాటుకూడా నేను వోడిపోతే నీవు గెలిచినట్లు వప్పుకుని ఫదివరహాలూ యిచ్చి వెళ్ళిపోతాను. (అని పరుగెత్తి) ఇప్పుడు నీవుముందా నేను ముందా?

మూష—నేనేముందు. నాఫదివరహాలూ నాచేతిలో వేసి యింటికి యేడుస్తూవెళ్ళు. ఇప్పటికైనా నన్నాక్షేపించినందుకు నీకు గర్వభంగం అయిందా? ఇఖముందెప్పుడూ యెవరినీ ఆక్షేపించక యీపరాభవంతో బుద్ధితెచ్చుకో.

శశ—ఇవుగో వరహాలు వుచ్చుకో. (అని యిచ్చి వెళ్ళిపోవు చున్నాఁడు)

మూష—(భార్యావద్దకు మెల్లగా నడిచివచ్చి) ఓప్రియురాలా! నన్ను నీవు గెలిపించినావు. ఇదినాకు ప్రథమవిజయం. ఈపదివరహాల తోనూ నీవు నగలు చేయించుకో. భార్యాభర్తలు ఐకమత్యంగా వుంటే యెప్పుడూ యిటువంటి లాభాలువస్తవి.

భార్య—నాకు నగలక్కరలేదు. ఈవరహాలతో మీఅప్పులు తీర్చుకొండి. ప్రొద్దెక్కినది. యింట్లోకి వెళుదాముర౦డి.

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు)

సంపూర్ణము.

191

మహారణ్య పురాధిపత్యము

ఈ నాటకమునందు వచ్చు పాత్రములు.

సృగాలమహారాజు — నీలిగూనలోఁబడి యరణ్యరాజ్యము సంపాదించిననక్క.

జంబుకేశ్వరశాస్త్రి — సృగాలమహారాజున కాంతరంగికమంత్రి.

కుక్కుర సోమయాజులు — ఆంతరంగిక సేనాపతి.

శునకాచార్యులు,
సారమేయశ్రేష్ఠి,
భషకచయనులు
గ్రామసింహదాసు } ఆంతరంగిక సభికులు.

వృకేశ్వరరావు పంతులు — ఆంతరంగిక న్యాయాధిపతి.

సింహ సార్వభౌముఁడు — ప్రధానమంత్రి.

వ్యాఘ్రేశ్వరరావు — సేనాధిపతి.

భల్లూకేంద్రుఁడు,
హరిణావధానులు,
శశకశాస్త్రి
మహిషేశ్వరుఁడు. } ప్రకృతివర్గము.

మహారణ్యాపురాధిపత్యము.

రంగము:-మహారణ్యాపురము.

[సృగాలమహారాజుగారు ప్రవేశించుచున్నారు.]



సృగాలమహారాజుగారు

సృగా— (తనలో) అందరూ పడుకున్నారుగదా అనికోళ్ళ గుడిసెలో యిట్టేదూరేటప్పటికి యీడిగెదానిమొగుడు నాకోసం మేలుకొని కాచివుండి కాలయముడి లామీదపడి కఱ్ఱతో చాన కొట్టినాడు. నావంటిమీద రెండుదెబ్బలుపడడంతోటే నావెంటనచ్చి వాకిట్లో నిలిచివున్న జంబుకేశ్వరశాస్త్రి ప్రాణాలు దక్కించుకొని వెనుకవాడు వెనుకనేపాఱిపోయినాడు. ఆయీడిగె గాడిదకొడుకు కొట్టిన దెబ్బలచేత వొళ్ళంతా తేలుకుట్టినట్టు మండుతూవున్నది. వెనుకనుంచి వాడుతరుముకుని వస్తూవున్నాడనే భయంచేత పారి పోతూముందుచూడక నీలిగూనలోపడ్డాను. తెల్లవారిలేచినతరువాత యిదిరెండోగండము. ఇదంతాచీకటితప్పు చేసినందువల్ల వచ్చిన ఫలము. అయినా నేడుమహాసుదినం. నాభార్యయొక్క మంగళ

సూత్రిబలంచేతనూ నాతల్లికడుపు చలువచేతనూ నేడు రెండుగం డాలూ గడచి సుఖంగా బయటపడ్డాను. నీళ్ళగూనలో పడకుండా నీలిగూనలో పడడంచేత నావంటికి విచిత్రమయిన రంగువకటికూడా పట్టకున్నది. ఈరంగువచ్చిన మహత్త్వంచేత యేదోవకపుపాయం ఆలోచించి గ్రామాధిపత్యమో మహారణ్యాధిపత్యమో సంపాదించ డానికి ప్రయత్నం చేయవలయును గాని వెనుక జరిగినదానికి విచా రించకూడదు. నాపుణ్యంవల్లనూ నాబుద్ధిబలము వల్లనూ నాకీఅరణ్యా రాజ్యము సంపాదన అయ్యేపక్షానికి నేను కేవలం సింహాన్నే అవు తాను. అదుగో మనజంబుకేశ్వరశాస్త్రి వస్తున్నాడు. అతనితో కూడా ఆలోచింతాము.

[అప్పుడు జంబుకేశ్వరశాస్త్రి ప్రవేశించుచున్నాడు]



జంబుకేశ్వరశాస్త్రి

జంబు—(తనలో) నాస్నేహితుడు రాత్రిచచ్చినాడే అను కున్నాను. ఇదుగో మళ్ళీ బ్రతికివచ్చినాడు. ఇఖముండయినా రాత్రిళ్ళుబయలుదేరి యెవళ్ళగుడిసెలలోనూ దూరకుండా బుద్ధి వచ్చేటట్టుగా యీడిగవాడు దుడ్డుకఱ్ఱపుచ్చికుని వెనుకలు విరుగ

కొట్టినాడు. (బిగ్గరగా) ఓహోహో! సృగాలమహారాజులంగారికి నమస్కారము. తెల్లవారినదాకా యెక్కడా కనపడకపోతే స్వర్గానికి విజయంచేసినా రనుకొన్నాను. మళ్ళీ బ్రతికివచ్చినారా?

సృగాల—(తనలో) వీడుస్వర్గానికి వెళ్ళమంటూవున్నాడు. మనవుపాయంలో స్వర్గానికి వెళ్ళడమనేదికూడా యేదయినా పెట్టవలెను. (ప్రకాశముగా) నీవన్నట్టు నేనీరాత్రి స్వర్గానికి వెళ్ళవలసినవాణ్ణేకాని నేను యీలోకంలో చెయ్యవలసినగొప్పకార్యం యేదో వుండి, నీఆశీర్వచనబలంచేత బ్రతికి తల్లికడుపున మళ్ళీపునర్జన్మం యెత్తినాను.

జంబు—నిస్సందేహముగా పునర్జన్మమే యెత్తినావు. వాడు రాత్రిచీకట్లో కటికకర్ర పుచ్చుకుని గొడ్డునుబాదినట్టు బాదినప్పుడు చాకిబండమీద బట్టలువుతికినట్టు దబుకూదబుకూ దెబ్బలువినబడేటప్పటికి నావళ్ళంతా రణకంపరమెత్తి మీదిప్రాణాలు మీదపోయినవి. అప్పుడు నేను యేలా పారిపోయినానో యెలాప్రాణాలు దక్కించుకొన్నానో నాకేహాశ్చర్యముగా వున్నది. చేరువను నిలుచుండి విన్నవాడికి నాకేయిలాగువుంటే వొళ్ళారాదెబ్బలు తిన్నవాడికి నీకు యేలాగువుండిందో. ఆదెబ్బలచేత నేకాబోలును నీవొళ్ళంతా కమిలి యీలానల్ల పడిపోయింది.

సృగా—నీవు వట్టి పిరికివాడవు. నాకాదెబ్బలువకలక్ష్యమా? ఇదివరకు లక్షసారులు వీటికాతదెబ్బలు తిన్నాను. అలవాటుచేత నావొళ్ళు గట్టిపడిపోయింది. ఈ అనుభవంచేత యీసారి రాత్రిళ్ళు చేసేపనిలో బహుజాగ్రతగా వుంటాను, వోర్వలేనివాళ్ళు యిదిపాపకార్యమంటారుగాని సుఖం బ్రతికివుండగానే అనుభవించక పోతే యిఖ చచ్చినతరువాతనా అనుభవించడం? మనసుఖంచూచి వోర్వలేక గిట్టనివాళ్ళు యేడుస్తూవుంటే మనం సుఖంపొంది సంతోషిస్తూ

వుందాము. నావొళ్ళు నల్లపడడం దెబ్బలచేతనేనా నీవనుకున్నావు? కాదుకాదు. దైవం అనుగ్రహించి నామేలుకోసరమే నేను కోరకుండానే యీనీలవర్ణం నాకనుగ్రహించినాడు. నేను దీనితోమహారాజును కావలెను. నాకు లక్ష్మియెత్తుకోవలెను.

జంబు—నిన్ను మొట్టమొదటనే లక్ష్మియెత్తుకున్నది యిఖనీ సహవాసం నాకక్కరలేదు. నీతోకూడా తిరుగుతూవుంటే నీదెబ్బల లక్ష్మి నాకుకూడా యెత్తుకుంటుందేమో! నీకుదైవం అనుగ్రహించిన నల్లరంగును గురించి నాకుకాస్త చెపుతావా వెళ్ళిపోతాను.

సృగా—తొందరపడబోకు. ఈవేషంచేత నాకు అరణ్యరాజ్యంవస్తే నిన్ను మంత్రిని చేస్తాను. ఈరంగువల్ల నాకుమాత్రమే కాకుండా నీకుకూడా లాభంవున్నది. ఇందులో నాకు నీసహాయం అవశ్యంగా కావలసివున్నది.

జంబు—నాసహాయంమాట తరువాత చూచుకుందాముగాని ముందుగా నీరంగుమాట చెపుదూ.

సృగా—రాత్రిచీకట్లో దెబ్బలుతిని పరుగెత్తుతూ తొందరలో కళ్ళుకనపడక ఫ్యాక్టోరీవారి నీలిగూనలో తల్లకిందుగాపడి మునిగిపోయినాను. అయితే నాఅదృష్టంచేత గూనలో నీలిరసమునిండాలేక అడుగునమాత్రమే ఉండడంచేత వొళ్ళంతాతడిసినా వెంటనేలేచి పయికిరావడానికి ప్రయత్నంచేసినానుగాని ఆగూన నుయ్యిలాగు లోతుగా వుండడంచేత పయికిరాలేక తెల్లవారినదాకా దానిలోనే జాగారంచేసినాను. నిన్నటిరాత్రి యేకాదశిగనుక యేకాదశినాడు జాగారంచేసినఫలం వూరికేపోదు.

జంబు—అవును వూరికేపోదు. రాత్రియేకాదశి గనుకనే యీడిగవాడుకూడా రామభజన చేసుకుంటూ మేలుకుని వున్నాడు. అక్కడ యేకాదశిఫలం నీప్రతిఅవయవానికిన్నీ కలిగిందికదా!

ఇక్కడకూడా నీలిగూనలకు కావలివుండేగుడిసెలో వెనుక నీవుదూరి పోయిన పగ మనస్సులో పెట్టుకొని జాగారఫలంచావకొట్టలేదుగదా?

సృగా—ఆమాత్రం తప్పించుకోవడానికి నాదగ్గరవుపాయం లేదనుకున్నావా యేమిటి? నేనుచేసే దౌర్జన్యాలకు నావుపాయాల చేతనే తప్పించుకుని వస్తూ కులంవారిలో పెద్దగా వేషంవేసుకుని తిరుగుతూవున్నాను. నీవుచూచినంతవరకు నాకుమల్లె వేషాలు వేసే వాడున్ను మాయలు చేసేవాడున్ను వుపాయాలు పన్నేవాడున్ను మరియెవరయినా నీకంటికి కనపడ్డారేమో చెప్పు.

జంబు—మీరు చెప్పినమాట సత్యమే కాని రాత్రి నీలిగూనలో నుంచి యెట్లా తప్పించుకున్నారో సెలవియ్యండి.

సృగా—వెనుకచేసిన ద్రోహానికి కావలివాడువస్తే చంపి వేస్తాడని తెలుసుకుని నేనుముందుగా వాడువచ్చేటప్పటికి వూపిరి బిగపట్టి కాళ్ళువిగడదన్ని చచ్చినట్టుగా కుండలో అడ్డముగా బడి వున్నాను. అప్పుడు వాడువచ్చిచూచి యీపాడుగక్క తనంతటనే చచ్చిందనుకుని సంతోషించి, అక్కడికీ కోపంతీరిక నన్నుపయికిలాగి వెనుక కాళ్ళురెండూ చేతపట్టుకుని గిరగిరతిప్పి చావుచుని కంచెఅవ తల గిరవాటు వేసినాడు. నేను ఆదెబ్బతో మూర్ఛపోయి తెలివి రావడంతోనే మళ్ళీ వెనుకతిరిగి చూడకుండా పారిపోయివచ్చినాను.

జంబు—నీవు మహా అదృష్టమంతుడవు.

సృగా—నాఅదృష్టం యిప్పుడు బ్రతకడంలోలేదు: ముందు రాజ్యాధిపత్యం సంపాదించుకోవడంలో వున్నది. దీనిలో నీసహాయం తప్పకుండా కావలెను. నాకురాజ్యం రావడంతోనే నిన్నుతప్పకుండా నామంత్రిని చేసుకుంటాను. నన్నురాత్రి దేవతలు స్వర్గలోకానికి తీసుకునివెళ్ళి సకుస్త మృగరాజ్యానికీ నన్ను అభిషేకంచేసి ఈ నీల

వర్ణం అనుగ్రహించినారని నీవు మృగాలన్నిటితోనూ చెప్పి నమ్మించి వాటిని నన్ను కొలిచేటట్టు చెయ్యవలెను.

జంబు—ఈమాట నేను చెప్పగానే సింహాలూ మొదలయిన వారందరూ నమ్ముతారా? నక్కయెక్కడ! దేవలోకం యెక్కడ! అని నన్నాక్షేపించరా?

మృగా—అదంతా నీకెందుకు? నేను చెప్పినట్టుచేస్తూ, నీవు యీమాట వాటిచెవులోవేస్తే తరువాత పనిఅంతా నేనేచేస్తాను. ఇప్పుడు నేనే స్వయంగావెళ్ళియీపనిఅంతానేనేచేస్తానుగాని నాగారవానికి లోపంవస్తుందని వకటీ వొళ్ళంతా నొప్పులుగా వుండడంచేత వకటీ సంశయిస్తూవున్నాను.

జంబు—ఈమాటలుచెపితే సింహాదులు నన్ను చంపివేస్తవేమోనని నాకుభయంగా వున్నది.

మృగా—నీకువచ్చినభయం యేమీలేదు. నీకంతభయంగా వుంటే నీవు ముందుగా మనకు బంధువులయిన కుక్కలవద్దకిన్ని తోడేళ్ళవద్దకిన్ని పోయి నేనుచెప్పిన స్వర్గలోక వృత్తాంతం వాటితో చెప్పి నమ్మించి వాటిని నావద్దకు తీసుకునిరా. అదంతా నేనేచేస్తాను. నీవునిజంమాత్రం యెవరితోనూ చెప్పకూడదుసుమా. చెపితే నీ మంత్రిత్వం పోతుంది జాగ్రత.

జంబు—నేను అలాగుచేస్తాను.

[అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు]

---

౨. రంగము—మహారణ్యపురము

[జంబుకేశ్వరశాస్త్రి గారును, కుక్కుర సోమయాజులు గారును, శునకాచార్యుల వారును, సారమేయశ్రేష్ఠి గారును, భషక చయనులుగారును, గ్రామసింహ దాసుగారును, వృకేశ్వర రావు పంతులుగారును ప్రవేశించుచున్నారు]

జంబు—ఓమృగకుల సార్వభౌములారా! నిన్నటిరాత్రి వక వింత జరిగినది విన్నారు కారుగదా?

కుక్క—ఏమివింత? నీఘనీయజమానులయిన నృగాల మహారాజుగారూవున్నచోట అన్నీవింతలే. నీవూ నీయజమానుడూ మళ్ళీ యేకోళ్లగుడిసెలోనైనా దూరి రాత్రి దెబ్బలుతినలేదుగదా? యివే రాత్రిజరిగేవింతలు. నీయజమానుడు మొన్న పట్టపగలు పల్లెవాళ్ల యింట్లోదూరి మొగవాళ్ళంతా కొట్టవచ్చేటప్పటికి ప్రాణాలు దక్కించుకుని పారిపోయినాడట.

జంబు—రాత్రి జరిగింది యీమోస్తరు వింతకాదు. రాత్రి మనసృగాల మహారాజుగారిని దేవతలు స్వర్గానికి తీసుకునివెళ్లినారు.

శున—అలాగయితే నేటితో పీడ విరుగడ అయింది. యింటింటికీ తిరిగి తిండ్లు తినడమూ, దెబ్బలు పడడమూ, మాయలు పన్ని తప్పించుకుంటూ వుండడమూ, అందరినీ మోసంచేస్తూ వుండడమూ, అన్నీ నేటితో మూలపడ్డవి. పాపం! అతను అకాలంగా చావడంమాత్రే యెవళ్ళయినా చితక పొడవడంచేత చచ్చినాడనుకుంటాను. చీకటి తప్పుచేసేవాళ్ల కందరికీ సాధారణంగా యిటువంటి దుర్మరణమే సంభవిస్తుంది.

జంబు—మీరంతా భ్రమపడుతూవున్నారు. నాయజమాను డు చావలేదు. అతడు నిన్నరాత్రి నిజంగానే బొండెతో స్వర్గానికి వెళ్ళి తిరిగివచ్చినాడు—అతన్నీ—



శుకాచార్యులవారు

శుక—చాలు! ఈపాటి నీమాటలుచాలించు ఇవన్నీ నక్క టక్కులు. నక్క యెక్కడ! స్వర్గలోకం యెక్కడ! స్వర్గానికివెళ్ళిన వారు మళ్లీవచ్చినారంటే యెవరు నమ్ముతారు? నీమాటలకర్థము నీయజమాను డెక్కడనో చావదెబ్బలుతిని చచ్చినవాడే మళ్ళీబ్రతికి వచ్చినాడని కాబోలును!

జంబు—కాదు కాదు. స్వర్గాన్నుంచి వచ్చినతరువాత నా యజమానుణ్ని నేను ప్రత్యక్షంగా చూచి మాట్లాడినచ్చినాను. అతనికి దేవతలు విచిత్రమయినవర్ణం దయచేసినారు. నేనుకళ్ళారా చూచిన తరువాత యెలా నమ్మకుండావుంటాను?

శున—ఇదంతా యెవరినో మోసంచెయ్యడానికి వేసినవేషం, నీ యజమానుడు తలలుమార్చేవాడు. నీయజమానుడితో నేను మాట్లాడినప్పుడల్లా యింటికి వెళ్ళిన తరువాత నాయెప్పటితలే నాకువున్నదో కొత్తదియేమైనా మార్చినాడో అని మాగుంటలోవున్న నీళ్ళల్లో నీడచూచుకుంటాను. స్వగాలమహారాజు కథలలో చెప్పుకునే మాయలమారి మల్లయ్య వంటివాడు.

కుర్కు—అన్నా! ఆకథయేదీ మేమందరమూ వింటాము చెప్పండి.

జంబు—ఆకథ తరువాత విందురుగాని ముందుగానాకథంతా విని నన్ను పంపి వేస్తురూ.

కుర్కు—నీకథలు మాకుయెప్పుడూ వున్నవే. కాస్తసేపు తాళవన్నును. ఆచార్లుగారూ! మీరు చెప్పవలసినకథ సెలవియ్యండి అందరమూ వినడానికి వేడుకపడుతూవున్నాము.

శునక—ఆలాగయితే మిక్కిలీ క్లుప్తంగా చెపుతానువినండి, ఒకవూళ్ళోమంచి కండపుష్టిగలవాడున్ను సోమరిపోతున్ను అయిన మాయలమారి మల్లయ్య అనే గొల్లవాడు వకడు వుండేవాడు. అతను సుఖంగాతిని యింట్లోకూర్చోక ప్రతివారినీ మోసంచేసి జట్టీలు తెస్తూవుండడంచేత యింట్లోవాళ్ళు వక్కరోజు తిండికి సేరు బియ్యమూ వండుకోవడానికి వక్కకుండా మాత్రంయిచ్చి యింట్లో నుంచి వాణ్ని వెళ్ళగొట్టినారు.

సారమేయ శ్రేష్ఠిగారు.

సార—వాడు యెక్కడికి పోయినాడు?

శున—వూళ్లోవుంటే అవమానంగా వుంటుందని యెండను పడి నడిచిపోయి రెండుఝాములకు వకవూరు చేరి, ఆవూళ్లో మొదటి వీధిలోవున్న వకయింట్లో ప్రవేశించి, ఆయింటిముసలావిడను తాను తెచ్చినబియ్యం మూకుండలోవేసి అత్తీసరుపెట్టుమని బతిమాలుకొన్నాడు. ఆవిడ బియ్యం యెక్కువగావున్నవని వాటిలో పావుసేరు బియ్యంతీసి తక్కినవి కుండతో అన్నంవండి తెచ్చి వడ్డించబోయే టప్పటికి వాడుసంగతి కనిపెట్టి "ఆగుఆగు" అని కేకలువేసినాడు.

కుక్క—తరువాత యేమిజరిగింది?

శున—ఆ కేకలువిని ఆవిడ వడ్డించక మానివేసి నిలుచుండగా, ఆవిడను చూచి "అమ్మా! వడ్డించండి. నేను ఆగుమన్నది మిమ్మల్నిగాదు, మీరేమో యిందులో కొంచెం బియ్యతీసుకున్నారని కుండచెప్పవచ్చేటప్పటికి, ఆమాత్రపు భాగ్యానికి నాతో చెప్పవలెనా అని కుండను ఆగుమన్నాను. ఈకుండకు దివ్యజ్ఞానం వున్నది. అని చెప్పెను.

జంబు—వాడు పుపద్రుడుగావున్నాడే.

శున—ఆమాటలు వినగానే తనకోడలు యింట్లో బియ్యం దొంగిలించి పళ్ళూ మొదలయినవి కొనుక్కోవడం చెపుతూవుంటుందని ఆకుండ యెలాగైనా సంపాదించ వలెనని బుద్ధిపుట్టి ముసలిదితన వద్దవున్న నాలుగురూపాయలూ యిస్తాననిన్ని కుండను తనకు యివ్వవలసినదనిన్ని బతిమాలుకోవడాని కారంభించెను. దివ్యజ్ఞానంగల కుండను వదిలిపెట్టడానికి తనకు యిష్టంలేకపోయినా ఆవిడయందుకలిగిన అనుగ్రహంచేత కుండనుయివ్వడానికి వప్పుకున్నట్టునటించి, ఆవిడ వద్దనున్న నాలుగురూపాయలు పుచ్చుకుని కుండ నావిడకంటగట్టి తనమోసం వెంటనే తెలియకుండా వుండడానికి మాఘపాదివారం నాడు కుండను పూజచేసికర్పుపుచ్చుకుని చెప్పుమనికొట్టవలసినదనిన్నీ, కుండచెపుతానని చెప్పిఇప్పటినుంచీయిట్లో జరిగేసంగతులన్నీ చెపుతూ వుంటుందనిన్ని, చెప్పి నమ్మించి వాడు తనదారినిపోయెను.

జంబు—తరువాత కుండసంగతి యేమయింది?

శున—ఏమవుతుంది? మాఘపాదివారం వచ్చేవరకూ కని పెట్టుకునివుండి పూజచేసి చెప్పుచెప్పుమని కుండను కొట్టేటప్పటికి కుండపగిలిపోయింది. అప్పుడామె యేడుస్తూ జరిగినమోసం కొడుకుతో చెప్పుకొని అఘోరిస్తే వాడు మోసగాణ్ని వెతికిపట్టుకోవడానికి బయలుదేరినాడు.

జంబు—మాయలమారిమల్లయ్య యీలోపుగా యెవరినైనా మోసంచేసినాడా?

శున — కావలసినంతమందిని మోసంచేసినాడు. వాడికి మోసంచెయ్యడమే జీవనము. ఆముసలిదాన్ని మోసంచేసి నాలుగు రూపాయలూ కాజేసి వాటితో వకగొర్రె పొట్టేలునుకొని పొరుగూరికి వెళ్ళేటప్పటికి పెద్దవర్షమువచ్చి తడిసి యేమిచెయ్యడానికి

తోచక వీధిలో వకకోమటిదుకాణంవద్ద మోడులాగున, తడుస్తూ గొర్రెపోతుతో కూడ నిలువబడెను. అదిచూచి కోమటి లోపలికి రాకుండా వానలోనిలువబడ్డావు నీకుచలిలేదా అనిఅడుగగా వాడు నెమరువేస్తూవున్న గొర్రెపోతును చూపించి యిది యిట్లాచలి అంతా నమలివేస్తూవుండగా నాకు చలియెక్కడవుంటుందని చెప్పి లోపలికి పోకుండా అక్కడనే నిలవబడ్డాడు.

జంబు—ఈయంత్రకూడా మోసంచెయ్యడానికికాబోలును!

శున—అందుకు సందేహం యేమివున్నది? ఆమాటలువిని కోమటిసెట్టికూడా భ్రమపడి విశేషం పెద్దకుటుంబంగలవాడు కావడంచేతనూ, శీతకాలంలో ప్రతియేటా ముప్పయి నలభయిరూపాయల బట్టలు కావలసివస్తూ వుండడంచేతనూ తాను యెలాగయినా ఆగొర్రెపోతును సంపాదించవలెనని వాణ్ని బతిమాలుకొని లోపలికి తీసుకొనివచ్చి మంచిమాటలుచెప్పి తుదకు పదివరహాలిచ్చి గొర్రెపోతునుకొని తానే ఘట్టివాణ్ణని సంతోషించెను. మల్లయ్య పెనుకటిలాగుననే మోసం వెంటనే బయలుపడకుండా వుండడానికి వకతంత్రంపన్ని మాఘపౌర్ణమినాడు గొర్రెను పూజచేసి చలిని మింగుమని అడిగితే తరువాత మింగుతూవుంటుందని వాడికాపూజావిధానం వుపదేశంచేసి సొమ్ముపుచ్చుకుని, రాత్రి ఆకోమటియింట్లోనే విందారగించి మరునాడు మరివక వూరికి నడిచినాడు. తరువాత కోమటి కూడా మోసంతెలిసికొని వాణ్ని వెతకడానికీ బయలుదేరినాడు.

జంబు—మల్లయ్య యీలోపుగా యెవరినైనా మోసంచేసినాడా?

శున—లక్షమందిని మోసంచేసినాడు. పదివరహాలూ బట్టకొంగున కట్టుకొని బొడ్డులో దోపుకొని అడివిమార్గాన్ని మరివక వూరికి వెళుతూవుండగా దోవలో వక వెలుగుబంటివచ్చింది. దాన్ని

చూచి భయపడి వాడు వకతాటిచెట్టు చాటుకు వెళ్ళేటప్పటికి వెలుగు బంటికూడా రెండోవైపునుంచివచ్చి తాటిచెట్టును కౌగిలించుకొన్నది. వాడు వుపాయశాలిగనుక వెలుగుబంటియొక్క రెండుచేతులూ తన రెండుచేతులతోను గట్టిగా భల్లూకపు పట్టుపట్టి వదలక, అది వకవైపుకువస్తే తానువకవైపుకు వెళుతూ యిద్దరూ చెట్టుచుట్టూ తిరుగుతూ వున్నారు. ఈలోగా వకసాహేబు నాలుగువందల వరహాల దస్తుపట్టుకుని గుర్రంమీదయెక్కి ఆదారిని వెళుతూ ఆతమాషాచూచి నిలువబడి అది యేమిటని అడిగినాడు. మటుమాయల మారి అయిన మల్లయ్య తడుపుకోకుండా వుపాయం ఆలోచించి, అది జాంబవంతుని సంతతి అయిన వెలుగుబంటి అనిన్నీ, అది ప్రతి దినమూ తాళప్రదక్షిణాలవల్ల నూరువరహాలు పెడుతూ వుంటుం దనిన్నీ, యిప్పటికి పదివరహాలు పెట్టిందనిన్నీ, తక్కిన తొంభయి వరహాలున్ను యిఖ ఘటసేపటిలో పెడుతుందనిన్నీ, యీ భల్లూకాన్ని తానుతపస్సుచేసి సంపాదించినాననిన్నీ, చెప్పినాడు. సాహేబు వచ్చి చూచేటప్పటికి తిరిగిన బడలికచేత వెలుగుబంటికి విరోచనం కావడమున్ను మల్లయ్యబట్ట విడిపోయి పదివరహాలున్ను దానిలో పడివుండడమున్ను జరిగివుండడంచేత వాడిమాటలు సాహేబుకు బహునిదర్శనంగాను నమ్మకంగాను కనబడ్డవి.

జంబు—అప్పుడేమిజరిగింది?

శున—ఏమిజరుగుతుంది? మరివకమోసం జరిగింది. అటు వంటి వెలుగుబంటిని బలవంతంగానైనా పుచ్చుకోవలెనని సాహేబు దాన్ని తనకిమ్మని అడగగానే సాహేబు వద్దనున్న నాలుగువరహా లనూ కిందపడ్డవరహాలనూ గుఱ్ఱమునూ పుచ్చుకొని వెలుగుబంటి చేతులు రెండూ గట్టిగా పట్టుకొమ్మని సాహేబుకు వప్పగించి తానా గుఱ్ఱమెక్కి బ్రతికిపోయినానని వాడు వాయువేగంగా కంటికి కన

పడకుండా వారిపోయినాడు. పాతవాడుపోయి కొత్తసాహేబువచ్చి తగులుకుని తిప్పడానికి ఆరంభించేటప్పటికి వెలుగుబంటి రొమ్మంతా కొట్టుకునిపోయి తక్కినవరహాలు పెట్టకుండానే చచ్చిపోయింది. అప్పుడు సాహేబు మోసపోయినానుగదా అని తెలుసుకొని మోసగాణ్ని వెతుకుతూ కాలినడకను బయలుదేరినాడు.

జంబు—కథ బహుతమాషాగా వున్నది.

శున—తరువాత కథవింటే యింకాతమాషాగా వుంటుంది. మల్లయ్య అక్కడనుంచి పోయి కొన్ని వరహాలు మార్చి మంచి బట్టలు మొదలయినవి కొనుక్కుని తాను రాచకుమారుణ్ని వేషం వేసి వకబోగందాని యింటికివెళ్ళి రాత్రి దానితో సుఖించి, అది నిద్రపోయిన తరువాత తానులేచి దొడ్లో కట్టిపెట్టివున్న తనగుర్రి మువద్దకి వెళ్ళి దానిలద్దెలో తనవద్దనున్న వరహాలన్నిటినీ పొదిగి వచ్చి తెల్లవారజామునసే బోగందాన్ని లేపి దాన్ని గుఱ్ఱపుతబేలాలోనికి రహస్యంగా తీసుకునివెళ్ళి లద్దె కడిగించి దానిలోవున్న వరహాలను చూపించి దానికి తనగుర్రియొక్క మహిమనువర్ణించి చెప్పి ప్రతిదినమూ యీప్రకారంగా గుర్రము వరహాలలద్దె వేస్తుందని దానికి నమ్మకంపుట్టించి తనగుర్రాన్ని దానికి రెండువేలవరహాల కంటగట్టి లేచిపోయినాడు.

జంబు—ఈప్రకారంగా ప్రతిదినమూ మోసంచేస్తూవుంటే మోసపోయినవాళ్ళు యెవళ్లూ అతణ్ని పట్టుకోలేకపోయినారా?

శున—ఆకథ చెపుతానువిను. ఈవలుగురి తాలూకు మనుష్యులూ వెతుకుతూపోయి అందరూ వకచోటచేరి ఆనవాళ్ళు చెప్పుకుని తమరినందరినీ మోసముచేసినవాడు వక్కడే నని తెలుసుకుని వాణ్ని పట్టుకోవడానికి దేశసంచారంచేస్తూ వకపట్నంలో అతాత్తుగా వాణ్ని నడివీధిలో పట్టుకున్నారు. వాళ్ళను మూరంగామాడ

గనే మల్లయ్య యిఖ వాళ్ళు తన్ను వదిలిపెట్టరని కనుక్కొని తక్షణం వుపాయంఆలోచించినవ్వుతూయెదురుగుండాపోయివాళ్ళనుకౌగలించుకొని స్నేహితులారా! మిమ్మల్నియెన్నాళ్ళకుచూస్తిననియింటికిరమ్మని వారిని పిలుచుకొని పోయినాడు. వాడుమోసంచేసి సంపాదించిన సొమ్ముతో ఆవూళ్లో వక మంచియిల్లుకొని మరివకవూరినుంచి తన భార్య అని వకగుడిసేటిదాన్ని తెచ్చి దానితో ఆయింట్లో కాపురం వున్నాడు. ఇప్పుడీస్నేహితుల నందరినీ దీసుకొనిపోయినది దాని యింటి కే.

జంబు—మల్లయ్య యిప్పుడుకూడా వీళ్ళనుమళ్ళీ మోసం చేస్తాడా?

శున—యేమిచేస్తాడో చూడు. వారినందరినీ యింటికి తీసుకుని వెళ్ళి వాకిట్లో కూర్చుండబెట్టి లోపలికిపోయి భార్య కేదో ఉపదేశంచేసి వక దుడ్డుకఱ్ఱ చేత బట్టుకొని వెలుపలికివచ్చి నలుగురి స్నేహితులనూ లోపలికి పిలుచుకొనిపోయి భార్యతో మనవారికి పిండివంటలతో విందు చెయ్యవలెనని చెప్పెను. పిండివంటలు చెయ్యడానికి డబ్బు యెక్కడవున్నదని భార్య విసుకుకొనెను. వారందరూ చూస్తూవుండగా వాడు కర్ర పుచ్చుకొని భార్యను పొడిచెను. పొడవగానే అది కిందపడి మూర్ఛపోయెను. అప్పుడు వాడు వారందరూ వద్దువద్దంటూవుండగా కర్రయొక్క రెండో చివరతో భార్యను మళ్ళీ పొడిచెను. ఆపోటు పొడవగానే భార్య చివాలున లేచి వొళ్లోనుంచి వెయ్యివరాల మూటతీసి మొగిడిచేతిలో పెట్టి బజారులోకి వెళ్ళి పిండివంటకు సామాగ్రి తెమ్మని ప్రార్థించింది. ఆ అద్భుతం చూచి వాళ్ళంతా విస్మయపడ్డారు.

జంబు—నాకూ యిది వింతగానే వున్నది.

శున—వింతగానే వుంటుంది. ఇదంతా వాడు లోపలికి

వెళ్ళినప్పుడు భార్యతో ఆలోచించి దానివొళ్లో వెయ్యివరాలమూట పెట్టి యివతలికి వచ్చినాడు. అమాయికులయి వీళ్లాసంగతి కనిపెట్ట లేక వాడేమో గొప్ప మహానుభావుడనిన్నీ తమ లోపంచేతనే తమ కార్యం ఫలించిందికాదనిన్నీ నిశ్చయించి తామేలాగయినా యా కర్రను సంపాదించవలెనని అందరూ వాడి కాళ్ళమీదపడి కర్రను తమకు కొన్నిమాసములు యెరువు యివ్వవలసినదని ప్రార్థింపగా వాడెంతో కష్టముమీద వొక్కొక్కరికి నెలరోజులు కర్ర యిరువు యివ్వడానికి నప్పుకుని మొదటివైపుతో పొడిస్తే మూర్ఛపోతుం దనిన్నీ రెండోవైపుతో పొడిస్తే వరహాలమూటతో లేచి వస్తుం దనిన్నీ వారికారహస్యమంతా వుపదేశంచేసి పంపివేసినాడు.

జంబు—తరువాత వాళ్ళ యింటికాడ యేమి జరిగింది?

శున—వాళ్లు యిళ్ళకువెళ్ళి కర్రతో భార్యలను పొడవడాని కారంభించగానే మూర్ఛపోవడానికీ వరహాలమూటతో లేచి రావ డానికి బదులుగా మొగుళ్ళను తిట్టి పొరుగువాళ్ళతో చెప్పి అల్లరి చెయ్యడాని కారంభించినారు. అప్పుడు వాళ్ళందరూ తెలివితెచ్చు కుని యిదంతాకూడా పెద్ద మోసమని నిశ్చయించుకున్నారు.

జంబు—ఈ మోసం తెలిసినతరువాత వాళ్ళు యేమిచేసి నారు?

శున—యేమిచేస్తారు. తమ తెలివితక్కువకు సంతోషించి, అందరూకలిసి కూడాపలుక్కుని, యిఖ వాడితో మాట్లాడకూడ దనిన్నీ మాట్లాడితే మళ్ళీ మోసం చేస్తాడనిన్నీ యేర్పరచుకొని, వకరి యింట్లోవున్న భోషాణము నలుగురూ నెత్తిమీద పెట్టుకొని పోయి వాడియింటికి వెళ్ళి వాణ్ని భోషాణంలో పెట్టి తాళంవేసి సముద్రంలో పడవెయ్యవలెనని నిశ్చయించుకున్నారు.

జంబు—అలా చేసినారా?

శున—కొంతవరకు చేసినారు. వారందరూ భోషాణం పట్టుకుని పోయి వారి గుమ్మంముందర దింపి లోపలికి పోయేటప్పటికి మల్లయ్య వాళ్ళను చూచి 'అన్నలారా' అని కాగలించుకో వచ్చినాడు. వాళ్ళు మాట్లాడకుండా వాణ్ని పట్టుకొని బలవంతంగా భోషాణంలో పడవేసి తాళంవేసి నెత్తిమీద పెట్టుకుని మహా వేగంగా సముద్రంకేసి పరుగెత్తుకొని పోయినారు. వాడు లోపల కూర్చుండి 'వద్దువద్దు' అని కేకలు వెయ్యడానికి మొదలుపెట్టినాడు.

జంబు—వాళ్ళు వాడిమాటలు విన్నారా?

శున—మోసపోయివున్న వాళ్ళు యెందుకు వింటారు? వాళ్లు వాడి అరుపులు లక్ష్యపెట్టకుండా వూరి వెలుపలదాకా పెట్టె మోసుకొనిపోయి, అలసటవచ్చి పెట్టెను కింద దింపి దాహం నిమిత్తం సమీపంలోవున్న యింటికి వెళ్ళినారు. వాళ్ళు వెళ్ళగానే గొర్రెలమందను తోలుకుని ఆదారిని పోతూ వద్దువద్దనే కేకలు విని వక గొల్లవాడు పెట్టెవద్ద నిలువబడి యేమిటని అడిగెను. పెట్టెలోనుంచి వాడు మంచి చక్కని పదహారేళ్ళ పిల్లను తనకిచ్చి బలవంతముగా వివాహం చేస్తామంటే తాను వద్దంటూవున్నా ననిన్నీ యీ పెట్టెలో యెవరుకూర్చుంటే వారికే ఆ పిల్లనిస్తా రనిన్నీ చెప్పెను. అప్పుడు వాడు తనకు పదహారేళ్ళ భార్య దొరుకు తుందని ఆశపడి తన గొర్రెలమందను వాడికిచ్చివేసి తానందులో కూర్చుండడానికి నప్పుకుని, వాళ్ళు తాళంచెవి పెట్టెనేవుంచి వెళ్ళి నందున పెట్టె తాళంతీసి మల్లయ్యను వదిలివేసి తానందులో కూర్చుండి వద్దువద్దని యథాప్రకారంగా కేకలువేస్తూవుండెను. మల్లయ్య వాణ్ని లోపలపెట్టి మళ్ళీ పెట్టెవేసి గొర్రెలమందను తోలుకుని యింటివంక నడిచెను. ఇంతలో దాహానికి వెళ్ళినవాళ్ళు తిరిగి వచ్చి పెట్టె మోసుకునిపోయి సముద్రములో లోతుగా పార్థ వేసినారు.

జంబు—ఇక్కడితో కథ సరిపోయిందనుకుంటాను.

శున—లేదు. యింకా కొంచెం వున్నది. ఆ గొల్లవాణ్ని సముద్రంలో పారవేసి ఆ నలుగురూ మళ్ళీ వూళ్లోకి వస్తూవుండగా మల్లయ్య మెల్లిగా గొర్రెలమందను తోలుకుని వెళుతూ కనబడేటప్పటికి వాళ్ళ కత్యద్భుతంగా వుండి సముద్రంలోనుంచి మళ్ళీ యెలాగు బ్రతికివచ్చినావని వాణ్ని అడిగినారు. తాను సముద్రంలోనుంచి పితృలోకానికి వెళ్ళేటప్పటికి తన పూర్వులంతా అక్కడ వుండి తన్ను యెలాగుజీవనంచేస్తున్నావనిఅడిగినారనిన్నీ తన బీదదశ చెప్పుకోగా విచారపడి వాళ్లు బీదవాళ్ళగుటచేత తనకు జీవనం నిమిత్తం యీ గొర్రెలమందను తోలుకునిపొమ్మని యిచ్చినారనిన్నీ, అక్కడ తాను వారి పూర్వులనుకూడా చూచినాననిన్నీ, వారు కోటీశ్వరులుగావుండి తమవారి సంగతి అడిగి అక్కడికి వస్తే ధన మిస్తారనిన్నీ, వమ్మకం పుట్టేటట్టుగా చెప్పి ప్రమాణాలుచేసి వప్పించి వారినందరినీ పెట్టెలోపెట్టి మోయించుకొనిబోయి నిజముగానే పితృలోకానికి పంపి శత్రుబాధ లేకుండా నాటినుంచి హాయిగా కొత్త పెళ్ళాముతో కాపురం చేస్తూవున్నాడు.

జంబు—మీకథ అయిపోయినది గనుక యిక నాకథసావకాశంగా చిత్తగించవలెను. నేను చెప్పబోయేది నేను కళ్లారా ప్రత్యక్షంగా చూచినవిషయంగాని పుక్కిటిపురాణంకాదు మీక్షేమ లాభాలకోసమే దీనిని మీకు చెపుతూవున్నాను.

సార—మాక్షేమంకోసం అంటూవున్నావుగనుక యేమిటో చెప్పు వింటాము.

జంబు—నిన్నటిరాత్రి నృగాల మహారాజుగారిని దేవతలు నిజంగానే స్వర్గలోకానికి తీసుకునివెళ్ళి అతణ్ని యీమహారణ్య రాజ్యానికంతా ప్రభువునుగాను పట్టాభిషేకంచేసి తెల్లవారకముందే

తిరిగీ భూలోకానికి పంపివేసినారు. దేవతా వర ప్రభావంచేత అతని వంటికి దివ్యమైన తేజస్సువచ్చింది. మీతోడు, నేను అబద్ధంఆడితే నరమాంసం తినే నిశాచరుణ్ని అయినట్టే.



కుక్కరసోమయాజులగారు.

కుక్క—వూరికే పట్టుపెట్టుకోకు. లోకంలో వొట్టూ సత్యాలూచేసేవాళ్ల మాటలు మంచివాళ్ళుయెవరూ నమ్మరు.

జంబు— నావొట్లూ మాటలూ అటువంటివికావు, నేను ప్రమాణపూర్వకంగా చెపుతాను. నేనుచెప్పేదంతా సత్యం. సత్యం కానిది యేమీచెప్పను. అబద్ధమాడితే శిశుహత్యచేసినట్టే. నృగాల మహారాజు నిజంగా మనకందరికీ రాజయినాడు.

భషక—అలాగయితే మనము సింహాలసేవ వదిలివేసి యిఖ నక్కపోతుగొలువు చెయ్యవలెనుగాబోలును?

జంబు—భషకచయనులుగారూ ? నక్కపోతని యెక్కడనో వెనుకటిమాట సెలవిస్తారేమి? అతడు మృగరాజ్యానికి రావడంచేత

యిప్పుడు సింహమే అయినాడు. ఏమండీ గ్రామసింహదాసుగారూ ? మీరు వూరుకుంటారేమి? యిందులో న్యాయం సెలవియ్యండి.

గ్రామ—సింహానికిగల పైడితేజస్సూ గుణగౌరవమూ నక్కపోతుకు వెయ్యిరంగులు వేసుకున్నా వెయ్యిరాజ్యాలు వచ్చినా రావు. లోకంలో సహజగుణం యెవరికైనా విడుస్తుందా? ఎంత రాజ్యమువచ్చినా సింహము సింహమే నక్కపోతు నక్కపోతే. స్మృగాలమహారాజు వెనుకటిగుణాలు మానడనుకుంటాను.

జంబు—ఈవిషయంలో మీరుయెవ్వరూ తిన్నగా ఆలోచించడంలేదు. యెవరికైనా చిన్నతనంలోవుండే అల్లరిచేష్టలు పెద్ద పెరిగిన తరువాతకూడ వుంటవండీ? రాజ్యం రావడంతోటే ఆరాజచిహ్నాలూ, ఆగుణగౌరవమూ, ఆకీర్తిప్రతాపములూ, అన్నీ సహజంగావస్తవి. కేవలం విష్ణుఅంశ వుంటేనేకాని రాజుకాడు. 'నావిష్ణుః పృథివీపతి' అన్నవాక్యం మీరువిన్నదికాదా? విష్ణుఅంశాసంభూతుడు గనుకనే మన స్మృగాల మహారాజుగారివద్ద కృష్ణలీలలు అనేకం వుండడం తటస్థించింది. అతడు విష్ణువు యొక్కహంశ అయినందుకు యీవొక్క నిదర్శనమూ చాలదా ?

భషక—విష్ణువిహంశ అయినా శివునిహంశ అయినా మరి యెవరి హంశఅయినా లోకంలో దుర్మార్గుడికి అధికారం రావడంతోనే ప్రజలకు చాలా యిబ్బంది కలుగుతుంది. అందరూతనచుట్టూ తిరుగుతూవుంటే దుష్టుడికి తానే గొప్పవాణ్ణని గర్వంపట్టుకుని కళ్ళుమీదికివస్తవి.

జంబు—రామరామ? మన స్మృగాలమహారాజు విషయంలో అటువంటి పాపపు మాటలు అనుకోరాదు. అతడి వినయమూ నవ్వుమొఖమూ తేనెమాటలూ మీరుయెరుగరా?



భషక దక్షుంగారు

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

భషక—అవన్నీ నక్క విన యాలుగాని నిజమయినవి కావు. ఆ మాయలన్నీ మాకు తెలుసును. అతనినోరు మాట్లాడుతూవుంటే నొసలు వెక్కిరిస్తూవుంటుంది. నాలిక బెల్లంలాగు వుంటుందిగాని హృదయంమాత్రం కత్తెరవంటిది. అతని తేనెమాటలునమ్మి యిది వరకు యెందరు మోసపోయినారు. కారు?

జంబు—ఆయన విరోధులు వూరికేఅలాగు అంటారుగాని మీరుప్రత్యక్షంగా చూడనిదీ చెప్పుడుమాటలు విశ్వసించరాదు. అతడు బహు దొడ్డవాడు, చిన్నప్పటినుంచీ సహవాసంచేస్తూవున్న మాకు తెలుస్తుందిగాని ఆయనసంగతి యితరులకు యేమి తెలుస్తుంది? కావలిస్తేనన్ను అడగండి - ఆయన గుణవర్ణన చేస్తాను. ఆయన శక్తిసామర్థ్యాదుల చేతనూ, గుణమహిమచేతనూ యీ అరణ్యరాజ్యానికి కాదుగదా త్రిలోకాధిపత్యానికయినా తగిన

వాడు. కావలిస్తే యీసంగతి నేను యేసభకురమ్మంటే ఆసభకు వచ్చి ప్రమాణంచేసి చెపుతాను.

గ్రామ—సభలలోకివెళ్ళి ప్రమాణాలు చేసేవాళ్ళమాటలు నమ్మరాదు. నీవు వెయ్యిచెప్పినా నృగాలమహారాజు మంచివాడవు తాడంటే నేనునమ్మను. పుర్రెనుబుట్టినబుద్ధి పుడకలతోగాని పోదు.

జంబు—తినబోతూ రుచులెందుకు? ఆయన యిప్పుడు మన కందరకూ రాజవుతూ వున్నాడు గనుక, ఆయన గుణసంపత్తి యిఖ మీరందరూ స్వానుభవంచేతనే తెలుసుకుంటారు. వృకేశ్వరరావు పంతులుగారూ! మీరు యిటుఅటు చెప్పకుండా మౌనంవహించి వూరుకున్నారేమి? నృగాల మహారాజుగారి విషయంలో మీఅభి ప్రాయంయేమిటి?

వృకేశ్వరరావు పంతులుగారు

వృకే—ఆయనకు మృగరాజ్యాధిపత్యం వచ్చేమాట నిశ్చయమేనా?

జంబు-అవును నిశ్చయమే. దేవతలు వరంయిచ్చిన తరువాత మారినమాట తప్పిపోవడంకూడా వుంటుందా? సింహం మృగరాజు కావ

డంకంటె మన బంధువుడయిన నక్క మృగరాజయితే మనకు చాలా లాభాలువుంటవి.

శున—బంధువుడు అంటూవున్నావు. మనబంధుత్వం పూర్వోత్తరమేమిటో కాస్త చెపుతావా?

జంబు—అన్నీ యెరిగివుండీ సమస్తమూ తెలిసినవారు మీరే యేమీ యెరగనట్లు యిలాగు సెలవిస్తారేమి? జంతుశాస్త్రంలో కుక్కలున్ను నక్కలున్ను తోడేళ్ళున్ను నక్కజాతిలో పన్నమాట మీరు చదువలేదా? మనజాతిలోవాడు వక్కడు గొప్పగావున్నా మనకందరికీ మహాగౌరవము. కాబట్టి మీరందరూ కృషిచేసి దేవతలిచ్చిన రాజ్యపదం మీరు నిలుపవలెను.

వృకే—సృగాలమహారాజు రాజ్యంవల్ల మనకు యేవో లాభాలు వున్నవన్నవే, అవియేమిటి?

జంబు—సింహం రాజ్యచేస్తూవుంటే మనంయెక్కడా వూరు పేరూ లేకుండా అడగివున్నాము. మనబంధువుడైననక్క రాజ్యానికి రావడంతోటే మననామరూపాలు బయలుపడతవి. మనం ప్రముఖుల మవుతాము. అతనివద్దమనమంతాకుంగం చేస్తూవుంటే గొప్ప గొప్పవాళ్ళుసమేతూ మనను ఆశ్రయించి చుట్టూ తిరుగుతూ వుంటారు. మనకార్యాలు అనేకాలు మనం సులంభంగా నెరవేర్చుకోవచ్చును.

శున— సృగాలమహారాజు రాజయితే మనంమంత్రులం కావడం నిశ్చయమేనా?

జంబు— ఎంతమాత్రమున్ను సందేహంలేదు. దానికి నేను వూచీపడుతాను. శునకాచార్యులుగారు మనకందరికీ గురుపీఠం

గమక, ఆయనకు సేనాధిపత్యం వస్తుంది. మనకందరికీకూడా మన మన సామర్థ్యాలకు తగినట్టుగా గొప్పవుద్యోగాలువస్తవి.

సార—గొప్ప వుద్యోగాలన్నీ మనకేవస్తే సింహ శార్దూలా దులపని యేమవుతుంది?

జంబు—వాళ్ళకు దూర దేశాలలో యేవైనా అధికారా లిప్పించి వాళ్ళపోరు చల్లార్చుదాము. మనంమాత్రం సన్నిధానవర్తుల మయి అంతరంగిక సభికులమై మంత్రిత్వంచేస్తూ వుందాము. అప్పుడు సింహశార్దూలాదులు కూడా మనఅనుగ్రహం కోరి యెప్పుడూ సముఖంలో వుండేవాళ్ళం మనంయేమిచేసిపోతామోఅని మనకు లంచాలు పంపుతూ వుంటారు.

సార—వాళ్ళుమనకుపంపే లంచాలు యేమివుంటవి?

జంబు—అలాఅనవద్దు. లక్షవుంటవి. మనంఇఖముందు భోజ నంనిమిత్తంకూడా కష్టపడనక్కర లేదు. సింహాలూ పులులూ తాము చంపిన మృగాలలో కొన్నిటిని మనకు నజర పంపిస్తూవుంటే మనం ప్రత్యేకంగా వేటాడడం అక్కర లేకుండా కాలిమీద కాలువేసుకొని సుఖజీవనం చెయ్యవచ్చును.

గ్రామ—ఇదంతా బహుబాగావున్నది. మనం అవశ్యంగా సహాయంచేసి నృగాల మహారాజుకు రాజ్యం స్థిరపరచవలెను. అప్పుడు యిదివరదాకా మనచేతనే సేవచేయించుకుంటూవున్న సింహాలూ మొదలైనవి మనకేసేవచేసే స్థితిలోకివస్తవి. యిలాగు యెల్లకాలమూ శ్వవృత్తిలోపడియేడుస్తూ వుండడంకంటె మహారాజ భోగం వక్కరోజు అనుభవిస్తే చాలదా? నిజమయిన సింహంవచ్చి గ్రామసింహాన్ని అనుసరిస్తూవుంటే యెంతగౌరవంగా వుంటుంది?

జంబు—బుద్ధిమంతులుగనుక గ్రామసింహదాసుగారు నిము షంలో నిజంకనిపెట్టి కార్యనిశ్చయం చేసినారు. వారిమాటకు మనం

యెవ్వరమూ అడ్డము చెప్పకుండా అందరమూ యెవరిచేతనయినపని వారు చెయ్యడానికి పూనుకోవలెను.

శున— ఇందులో మనం చెయ్యవలసిన పనియేమిటి?

జంబు—మనమందరమూ ప్రతిఅడివికీ వెళ్ళి చూచినమృగాలతోనల్లా స్రృగాలమహారాజును రాత్రిదేవతలు స్వర్గలోకానికి తీసుకునివెళ్ళి మృగరాజ్యాని కభిషేకంచేసి అనేకవరాలు యిచ్చినారనిన్నీ, దేహానికి నీలమేఘచ్ఛాయ ప్రసాదించినారనిన్నీ, యీదినం మొదలుకుని మీరందరూ స్రృగాలమహారాజును రాజుగా అంగీకరించి అతని ఆజ్ఞానువర్తులయి సంచరిస్తూవుండవలెననిన్నీ, చాటిరావలెను.

శున—ఇదెంతపని? ఈపనివక్కనిముషంలో చెయ్యవచ్చును.

కుర్కు—తొందరపడగూడదు. మనంయేసంగతీ బాగాఆలోచించుకుని సాధక బాధకాలు విచారించుకుని మరీచెయ్యవలెను. తొందరపడితే కార్యంకాదు.

జంబు—కుర్కురసోమయాజులూ! యిందులో నీకుక్కబుద్ధి పోనిచ్చుకున్నావుకావు. తీరాఅందరూ వప్పుకున్న కార్యానికివెంటనే కాకుండా నీవుమధ్యవిఘాతాలు తెచ్చి పెడుతూవున్నావు.

కుర్కు— నీనక్కబుద్ధి నీవుపోనిచ్చుకున్నావుకావు. బాగా ఆలోచించుకోకుండా నీనక్క వినయాలూ మాయమాటలూనమ్మి అందరూ మోసపోయి గోతిలో పడుతా రనుకున్నావా? గోతులు తవ్వడం నక్కలకు సహజం.

జంబు—ఛీఛీ! అట్టే మొరగకు. మేముగోతులలో పడ్డవాళ్ళను పయికితీసే వాళ్ళముకాని గోతులలో పడదోసేవాళ్ళము కాము.

కుర్కు—ఛీఛీ! పిచ్చిమాతలుకుయ్యకు. మళ్ళీమాట్లాడితే గొంతుక కొరికివేస్తానుచూడు.

జంబు— రాజుగారితో చెప్పి నిన్నేమిచేస్తానో చూడు. పక్కనుచూచిన వాడల్లా వేటకాడే అవుతూవున్నాడు!

శున— మీరువూరికే పొట్లాడకండి. బాగా ఆలోచించుకునే కార్యంచేతాము. మనం నృగాలమహారాజువద్దకువెళ్ళి, దేవతలు ఆయనకిచ్చినవరాలు మొదలయినవన్నీ కనుక్కొని తరువాత యేమిచెయ్యవలెనో సిద్ధాంతంచేసుకుందాముర౦డి.

కుక్క—అదిబాగావున్నది.అలాచేతాముర౦డి.

(అందరూనిష్క్రమించుచున్నారు)

---

3. రంగము—నృగాలమహారాజు గృహము.

(నృగాలమహారాజును, జంబుకేశ్వరశాస్త్రియు ప్రవేశించుచున్నారు)

నృగా—జంబుకేశ్వరశాస్త్రీ! నీమాటలవల్ల మనవారికందరికీ నిశ్చయముగా నమ్మకముకలిగినదా?

జంబు—నిస్సందేహంగాకలిగింది. వారందరూ మిమ్మల్నిమృగరాజునుగా అంగీకరించి యీ శుభవార్తను సింహాది సమస్త మృగములకూ వెల్లడించి రావడానికికూడా వప్పుకున్నారు. ఆ పని నిమిత్తమే వారు బయలుదేరబోతూవుండగా మధ్య కుక్కురసోమయాజులు అడ్డంవచ్చి వాళ్ళు వెళ్ళకుండా చెడకొట్టినాడు. అందరూ వప్పుకున్న కార్యానికి విఘాతం కలుగచెయ్యడం నాకు ధర్మం కాదని నేను యేమో చెప్పబోయేటప్పటికి కస్సుమని నా మీద బడి కాట్లకుక్కలాగు కరవవచ్చినాడు.

నృగా—ఆ కుక్కలకొడుకు యెప్పుడూ మనకార్యానికి అడ్డం వస్తూనే వుంటాడు. నా రాజ్యకాలంలో వాణ్ని యేమిచేయిస్తానో చూడు. పదిమందిలో నా మంత్రివైన నిన్ను అవమానం చేసిన

వాణ్ని పూరికే పోనిస్తానను కొన్నావా? నీవు మంత్రివన్న మాట వాళ్ళతో చెప్పినావా?

జంబు—చెప్పలేదు. చెపితే వాళ్ళకందరికీ వోర్వలేనితనం హెచ్చవుతుంది. అందులోనూ కుక్కురసోమయాజులు నాకు మంత్రిత్వం వచ్చిందంటే మరీ కళ్ళల్లో నిప్పులుపోసుకుంటాడు. వాడివి మిక్కిలి పాపిష్టికళ్లు. మీకందరికీ గొప్ప వుద్యోగాలవుతవనీ, రాజాస్థానంలో ఆంతరంగిక సభికులవుతారనీ, మాత్రం చెప్పి వాళ్ళకు ప్రోత్సాహం కలిగించినాను.

సృగా—మంచిపనిచేసినావు. నీ విషయంలో నీవు చెప్పుకోక పోవడమే మంచిది. నాలుగురోజులు వోపికపట్టు కుక్కుర సోమయాజులను యేమిచేయిస్తానో నీవేచూస్తావు. పూర్వం అక్కడా యిక్కడా తెగమొరిగి రాత్రిళ్ళు నాకార్యం చెడగొడుతూ వచ్చిన వాడూ, యింటివాళ్ళను లేపి నాకు రెండు మూడుస్థలాలలో దెబ్బలు తగిలించినవాడూ, వీడే. మన రాజ్యకాలంలో శిక్షలుపొందే వాళ్ళల్లో కుక్కురసోమయాజలే మొదటివాడవుతాడు. మన శత్రువుల నందరినీ సాధించడానికి యిప్పుడు మంచి సమయం వచ్చింది. చిట్టచివరకు మనవాళ్ళందరూ యేమినిశ్చయం చేసినారు?

జంబు—తామందరూ స్వయంగా మీదగ్గరకు వచ్చి మీతో మాట్లాడడానికి నిశ్చయించుకున్నారు. అదుగో మారాన్నుంచి వాళ్ళందరూ వస్తూవున్నట్టన్నారు.

సృగా—అవును వస్తూయున్నారు. నీవు వాళ్ళకు కనపడకుండా వెనుక గోతిలో దాక్కో. వాళ్ళందరిచేతా వప్పించే నీకు మంత్రిత్వం యిప్పిస్తాను. వాళ్ళముందర వకవేళ నిన్ను నేను దూషించినా నిజమనుకోకుమా. ఏదుటివాళ్ళను వశపరుచుకోవడానికి కార్యసాధకుడు యెన్నయినా మాయలు పన్నవలెను. నీవు

నాకు ఆప్తకోటిలోవాడవు. నీవు యెరుగవుగాని నా మనస్సులో నిన్ను ప్రాణంకంటె యెక్కువగా చూసుకుంటాను. ఇఖ నీవు వెళ్ళు.

జంబు—ప్రధాన మంత్రిత్వంమాత్రం నాకు తప్ప మరి యెవ్వరికీ యివ్వకూడదు సుమండీ. మీరు వాళ్ళముందర నన్ను యెన్నిమాటలన్నా నేను మీమీద మనసులో కోపించుకోను.

(అని వెళ్ళుచున్నాడు.)

స్వగా—ఇప్పుడేలాగయినా మాయలుపన్ని వాళ్ళనందరినీ మన వలలో పడవెయ్యవలెను. కుక్కురసోమయాజులు పక్కడూ మాత్రం సాధారణంగా మాయలలో పడేవాడుకాడు. అయినా వాణ్ణికూడా నా బుద్ధిబలంచేత లోపరుచుకొంటాను. నా శరీరం యొక్క విచిత్రమయిన యీవర్ణం చూచినతరువాతకూడా వాళ్ళు నేను రాజును కాలేడంటారా?

[అప్పుడు కుక్కురసోమయాజులును, శునకాచార్యులును
సారమేయ శ్రేష్ఠిగారును, భషకచయనులు
గారును, గ్రామసింహ దాసుగారును,
వృకేశ్వరరావుపంతులుగారును,
ప్రవేశించుచున్నారు.]

శు—అదుగో—స్వగాలమహారాజు వక్కడూ కూర్చుని వున్నాడు. అతనికి దేవతలు ప్రసాదించిన యీ కొత్తవర్ణం బహు విచిత్రంగా వున్నది. ఇతడు మృగరాజయినందుకు సందేహములేదు.

కుక్క—మనం పయిరంగులుచూచి భ్రమపడకూడదు. అతనితో మాట్లాడితే యిప్పుడు అన్నీ తేలుతవి.

స్వగా—(లేచి యెదురుగావెళ్ళి) రాజబంధువులందరూ వస్తూయున్నారు దయచెయ్యండి. కుక్కురసోమయాజులుగారూ! మీరు

దము చెయ్యడంచేత యీ రోజున నా గృహం పావనమయింది. ఇదివరదాకా యెవ్వరూ ఆదరించేవారులేక నిగురుగవిసిన నిప్పులాగు అణిగివున్నారుగాని మీరందరూ మంత్రిపదానికి అర్హులైనవారు. మీకు యిప్పుడు దైవానుగ్రహంవల్ల మంచిదినాలు వచ్చినవి. ఇఖ మీశక్తి సామర్థ్యాలు లోకానికి వెల్లడిఅవుతవి. మీవంటి నిజమయిన సామర్థ్యంగలవారు యెప్పుడోవకప్పుడు గొప్పస్థితికి వచ్చి ప్రసిద్ధికెక్కుతారుగాని, అశక్తులలాగు యెల్లకాలమూ అణిగివుండరు.

కుర్కు—(తనలో) ఈవంచకుడు నక్కవినయాలు కనపర్చి ముఖస్తుతులు మహాచేస్తూవున్నాడు. వీడిమాటలు యెంతతియ్యగా వున్నా వీడి కడుపులో పుట్టెడువిషం వున్నది. (బిగ్గరగా) మీకు మృగరాజ్యం వచ్చినందుకు మేమందరమూ బహు సంతోషిస్తూవున్నాము.

సృగా—మీకంటారేమి మనకనండి. ఈరాజ్యం మీదే కాని నాది కాదు. నాకిప్పుడు ఈ ప్రపంచసుఖాలమీద విరక్తిపుట్టిపోయింది. వెనుకటి నడతంతా మానివేసి ముముక్షుడనయి యోగివలె వుండవలెనని నేను యిప్పుడు యోగాభ్యాసం చేస్తూవున్నాను. నిన్నరాత్రి దేవతలు నన్ను స్వర్గానికి తీసుకునివెళ్ళి బలవంతంగా మృగరాజ్యాధిపత్యానికి అభిషేకంచేసినప్పుడు లోపలనాకు యెంత యిష్టం లేకపోయినా మీ నిమిత్తంఅంగీకరించినాను. [illegible] పేరుకు నేను రాజునయినా రాజ్యంచేసేవారంతా మీరే. [illegible] జ్యం మీదేకాని నాదికాదు. మీరు అగ్నిహోత్రం [illegible] గంధంలో ఒకకాలూ పెట్టి సర్వజన క్షేమ[illegible] వలెను. నాకు లభించిన రాజ్యం మీ స[illegible]

శున—మాకు అధికారంవస్తే పూర్వపు మహానుభావులను మరిపించి న్యాయంగా పరిపాలన చేస్తాము మీకీర్తి—

సృగా—వస్తేగిస్తే అని సందేహం పెట్టకండి. ఇదుగో నా రాజ్యమంతా మీకేవదిలి వేస్తూవున్నాను. యెవరు యేవుద్యోగాలలో వుంటారో మీలోమీరే నిర్ణయం చేసుకుని ప్రజలనుబిడ్డలలాగు పరిపాలన చెయ్యవలెను.

శున—మీకీర్తి మూడులోకాలలోనూ వ్యాపించేటట్టుగా పరిపాలనం చేస్తాము. ప్రజాసౌఖ్యంమాట మీరు మాతో పదేపదే చెప్పవలసిన పనిలేదు. మీ యేలుబడికాలంలో ధర్మం నాలుగు పాదాలు నడుస్తూవుంటే చూచి సుఖిస్తూవుండే ప్రజలు యీ కలియుగంలో కృతయుగం వచ్చినదని సంతోషిస్తారో లేదో త్వరలో మీరే చిత్తగిస్తారు. కేవలశివావతారమయిన కాలభైరవుడి సంతతి వారము మేము స్వప్నావస్థలోనైనా అక్రమానికి లోబడుతామా?

సృగా—నాకానమ్మకంవున్నది. మీరుయెప్పుడూ యీగకాలంత అక్రమానికి లోబడరు. అందుచేతనే నేను యీరాజ్యమంతా మీస్వాధీనం చేస్తూవున్నాను. మీరు అక్రమంగా నడిస్తే మాత్రం నాకు యీ విచిత్రవర్ణం దయచేసిన మహానుభావులు దేవతలు చూచి సహిస్తారా? మీకుమాత్రం ఆసంగతి తెలియదా?

కుర్కు—(తనలో) తనకు దేవతలబలంవున్నదనీ తనకు వ్యతిరిక్తంగా నడిస్తే నష్టంవస్తుందనీ వీడు సూచనగా తెలియచేస్తూవున్నాడు. వీడికి అకస్మాత్తుగా యీరంగురావడంచూస్తే దేవతలు వకవేళ [illegible]మరనే తోస్తుంది. వీడు యీమధ్య అభ్యాసం చే[illegible]హిమచేత దేవతలకు వీడిమీద అనుగ్రహం [illegible]) మీరు యేమిపుణ్యం చేసుకున్నారో కాని ఋషులకుసమేతూ ప్రత్యక్షంగాని దేవ[illegible]త్యక్షమయినారు.

సృగా—వారు ప్రత్యక్షంకావడం వారికి నామీద కలిగిన నిర్హేతుక జాయమాన కటాక్షంచేత నేకాని నాయొక్క శక్తిసామర్థ్యాదుల చేత కాదు. వారు కొంతకాలమైన తరువాతవచ్చి మీకందరికీ కూడా దర్శనంయిస్తామని సెలవిచ్చినారు. ఈసారి వారు భూమిమీదికి విజయం చేసినప్పుడు మంత్రిశిఖామణులయిన మీకందరికీ వారి దర్శనం చేయిస్తాను. మీరు యెవ్వరెవ్వ రేయేవుద్యోగాల్లు కోరుకుంటారో నిర్ణయం చేసుకోండి. లేకపోతే సింహాసనమువచ్చి తరువాత నాకు తొందరయిస్తారు.

సార—శుక్రాచార్యులవారు మనకందరికీ గురుపీఠము. ఆయనను ప్రధాన మంత్రిగా చేస్తే బాగావుంటుందనుకుంటాను.

వృకే—ఆయన వైదిక విషయంలో అసామాన్య ప్రజ్ఞగలవారయినప్పటికీ లౌక్యవిషయంలో విస్తారం అనుభవం గలవారు కారు. కాబట్టి ప్రధానితనం మరివకరికి యిస్తే బాగావుంటుందని తోస్తుంది.

సృగా—కుక్కుర సోమయాజులుగారికి యిస్తేబాగావుంటుందేమోనని నేననుకుంటాను. ఆయన ధైర్యస్థయిర్యములు గలవాడు, న్యాయప్రవర్తన గలవాడు, లౌక్యానుభవంకూడా విస్తారంకలవాడు అయినా కానీ నేను చెప్పినానని మొఖమాటంపడకమీయిష్టంవచ్చిన వారికే యివ్వవచ్చును. కుక్కుర సోమయాజులుగారు నిష్కారణంగా నాకేమో తనమీద మనస్సులో ద్వేషంవున్నదని భ్రమపడుతారుగాని నాకాయన మీదవుండే గౌరవమూ ప్రేమూ మరియెవరి మీదనూ లేకుండుండి. నేను యింతమందిలో ప్రమాణంచేసి దైవసాక్షిగా చెపుతాను. నామాటనమ్మండి.

కుక్కు—అవును మీకు నామీద పరిపూర్ణానుగ్రహం వున్నది. [illegible] వున్నది కనపరచడానికి యిదివరదాకా

సమయంలాక వూరుకున్నారు. ఇప్పుడు కనపర్చడానికి ఆరంభించి నారు. అయినా కానీ మంత్రిస్థానానికి నేను తగినవాణ్నిగాను. నా సామర్థ్యం నాకు తెలియుటుగనుక నా? మీరందరూ ఆలోచించి ఆ పని మరివకరికి యివ్వవలెను.

వృకే—మరియెవరికిస్తే బాగావుంటుంది? జంబుకేశ్వర శాస్త్రిగారికి యివ్వవచ్చునా? లోకంలోవున్నవక్కజిత్తులన్నీ ఆయన వద్దనే వున్నవి. ఆయన రాజ్యతంత్రం నడపడానికి బహుసమర్థుడు.

శృగా—అతనిమాట తరువాత ఆలోచింతాముగాని దక్కిన వుద్యోగాలుముందుగా కానియ్యండి. మంత్రిత్వం వద్దంటూవున్నారు గనుక సేనాధిపత్యంముందుగా కుర్కుర సోమయాజులుగారికిత్తాము. ఆయన్ను అడిగితే యేదీ వద్దంటూనే వుంటాడు. అటువంటి శక్తి మంతుణ్ని మనం సంస్థానంలో గొప్పవుద్యోగములో వుంచకుండా వుండకూడదు. ఆయనను అవశ్యంగా ఆపనికి నియమింతాము.

సార—శృగాల మహారాజుగారు చెప్పినది సర్వోత్తమంగా వున్నది. ధైర్యశౌర్యాదులలో కుర్కుర సోమయాజులుగారిని మించినవారు లేరుగనుక సేనాధిపత్యం వహించడానికి యింతకంటె సమర్థులు మరియెవ్వరూ వుండరు. మేమందరమూ ఇందు కంగీకరించినాము.

శృగా—తథాస్తు (తనలో) ఇప్పటికి నోరుకలవాణ్ని వకణ్ని కట్టుకున్నాము.

ఇకవీడు మనకు వ్యతిరేకంగా యేమీపనిచెయ్యడు. మన ప్రభుత్వం స్థిరపడ్డ తరువాత వీణ్ని నిముషంలో యేదోమిషమీద శిరశ్ఛేదంచేయించి పీడ వదల్చుకోవచ్చును.

భప—న్యాయాధిపత్యం యెవరికి యి

మృగా—వృకేశ్వరరావు పంతులుగా రావనికి తగినవాడు. అయినా వుద్యోగాలు యిచ్చేవారు సభవారుకాని నేనుకాను సుమండీ. సభికలు మీరు మీమనసు వచ్చిన వారికి యివ్వవచ్చును.

గ్రామసింహ దాసుగారు.

గ్రామ—న్యాయాధిపత్యం వృకేశ్వర రావుగారికి యివ్వవచ్చును. మేమంతా అంగీకరించినాము.

మృగా— ఆలోచనచెప్పి రాజ్యకార్యం నిర్వహించడానికి ఆలోచన సభికులెవరు? ఆలోచన సభికులన్న పేరేకాని నిజంగా పరిపాలకులే వారు. దేవతల మాటలు తీసివెయ్యి రాదుగనుక నేను పేరుకుమాత్రం రాజుగావుండి సమస్తమూ అంతరంగ సభికులకే వదలివేసి వూరికేసాక్షిగా చూస్తూవుంటాను.

గ్రామ—ఇదివరకే మమ్మలినందరినీ సభికులని పిలుస్తూమళ్ళీ సభికు లెవరంటా రేమి?

సృగా—తథాస్తు. మిమ్మలినందరినీ సభికులుగా గ్రహించి రాజ్యమంతా మీస్వాధీనం చేసివేసినాను. ఇక పరిపాలనాభారము నామీద తప్పిపోయింది. ఇంకా మంత్రిపదంమాత్రం యెవరికీ యివ్వనేలేదు.

భష—అందరి పను లయిపోయినవి. ఇకపక్క జంబుకేశ్వరశాస్త్రి మాత్రమే మిగిలివున్నాడు.

సృగా—అతడికి యివ్వడమయితే నాకు యిష్టంలేదు కాని ప్రస్తుతం మరివకరు యెవరూ లేకపోవడంచేత కొన్నాళ్ళతన్ని మంత్రినిగాచేసి చూతము. ఇప్పుడు మరియెవ్వరినైనా పెడదామంటే వకసింహానికయినా వ్యాఘ్రానికయినా యివ్వవలెను. అటువంటివాళ్ళు మంత్రిత్వానికివస్తే మీమీదకూడా అధికారం చెయ్యడానికి ప్రయత్నంచేస్తారు. వకసారి అధికారంయిచ్చిన తరువాత తీసివెయ్యడం బహుకష్టం. మీకులోకువయినవాడున్ను మీరు చెప్పినట్లు వినేవాడున్ను జంబుకేశ్వర శాస్త్రికేయిత్తామా మరియెవ్వరికయినా యిత్తామా? మీక్షేమం నిమిత్తమే నేను మిమ్మలిని అడుగుతూ వున్నాను. మీయిష్టంవచ్చినట్లుచేస్తాను. నేను చెయ్యడం యేమిటి! కావలసినట్లు మీరేచేసుకోండి.

గ్రామ—లోకువయినవాడు జంబుకేశ్వరశాస్త్రినే మంత్రినిగా చెయ్యడానికి మేమందరమూ వప్పుకున్నాము. యిఖముంచు జరగవలసిన పనియేమిటి?

సృగా—పనియేమున్నది? మీరందరూ కదిలి సింహములూ పెద్దపులులూ మొదలయిన సమస్తమృగాలవద్దకూ వెళ్ళి దేవతలు నావిషయంలో జరిగించిన అనుగ్రహాన్ని చెప్పి మీరాజ్యం మీరు స్థిరపరచుకొని నేటినుంచీ సింహాలుమొదలయిన వాటిమీదఅధికారం దక్కేటట్లు చేసుకోవలెను. అది మీకార్యంగనుక మీరు

శ్రద్ధవహించి చేసుకో వలసిందే కాని యిందులో నా కార్యం ఆవగింజంతయినా లేదు.

గ్రామ—అవును మేమిప్పుడేపోయి దేవతలు అరణ్యరాజ్యానికి మిమ్మలిని చక్రవర్తినిగా చేసినసంగతి సమస్తాటవులలోనూ చాటివస్తాము. కుక్కురసోమయాజులుగారూ! లెండి. శునకాచార్యులుగారూ! దయచెయ్యండి. సారమేయ శ్రేష్ఠిగారూ! రండి. భషకచయనులుగారూ! లేవరేమి? వృకేశ్వరరావు పంతులుగారూ! సెలవుపుచ్చుకోండి. (అని వారందఱును నిష్క్రమించుచున్నారు.)

సృగా— (తనలో) దొంగవుద్యోగాలిచ్చి వీరినందరినీ మాయలోపడవేసినాను. రాజ్యం కాస్తస్థిరపడగానే నా ప్రభావం చూపుతాను. అందాకా కొంచెమోపికపట్టి వొదిగివుండవలెను.

(అని నిష్క్రమించుచున్నాడు.)

---

౪. రంగము:—సృగాలమహారాజు సభామందిరము.

[సృగాలమహారాజును, జంబుకేశ్వరశాస్త్రియు ప్రవేశించుచున్నారు.

సృగా—ఓయీ! జంబుకేశ్వరశాస్త్రి! నా నేర్పుచేత యెట్లా వాళ్ళంతటవాళ్ళే నిన్ను మంత్రినిగా కోరుకొనేటట్టు చేసినానో చూచినావా? ఇప్పుడు నీకు సంతోషముగావున్నదా?

జంబు—దేవరవారి దయవుంటే నాకు సంతోషానికి యేమి తక్కువ? కావలసినంత సంతోషముగావున్నాను. కుక్కురసోమయాజులు మొదలయిన వాళ్ళంతా యెక్కడకు వెళ్ళినారు?

సృగా—మనపట్టాభిషేక మహోత్సవం సమస్తారణ్యాలలోనూ చాటించి సింహాలు మొదలయిన మృగాలన్నిటినీ మనసేవకువప్పించి తీసుకురావడానికి వెళ్ళినారు. వాళ్ళుతప్పకుండా సింహాలు మొద

లయినవాటిని మన పాదసేవకులనుగా చేస్తారు. ఇక మనకు మృగ రాజ్యం స్థిరపడ్డట్టే నేను మృగరాజు నయినాను.

జంబు—మీకు మృగరాజ్యం స్థిరపడగానే నాకు మంత్రిత్వం కూడా స్థిరపడ్డట్టే. రాజుకు తగినమంత్రిని దొరికినాను.

మృగా—అవునుగాని నీకు మంత్రిత్వం దొరికిందని గర్వంతో నిక్కి విర్రవీగక మహావినయం కలిగివుండవలెను. కొంతకాలం వరకూ నీమీద నాకు మహాప్రేమ వున్నట్టు తెలియకుండా, అందరికీ లోబడి నీవు అణగిమణగివుండవలెను. కొన్నాళ్ళు అందరికీ భృత్యుడవై తలలో నాలికలాగువుంటే మనరాజ్యం స్థిరపడ్డతరువాత కావలసినంత అధికారం చెయ్యవచ్చును.

జంబు— అలాగే చేస్తాను. తరువాత నాకక్కిబూరేచూస్తారు.

మృగా—రాజ్యంలేనప్పుడు నీవు యిదివరదాకా మంత్రిత్వం చెయ్యడం చెయ్యడంకాదు. నీమంత్రిత్వ సామర్థ్యం యిఖ కనపడవలెను. ఇంతకాలానికి నేను మృగరాజునయినాను. అంటే నేను యిప్పుడు సింహాన్నయినానన్నమాట. సింహాన్నయినప్పుడు నాగౌరవానికి తగినట్టుగా నారాణీకూడా సింహమే కావలెనన్నమాట నీకు తెలిసినదే కదా? కాబట్టి యిదినీవు మనస్సులో వుంచుకోవలెను. మనలోమాటయిది. అప్పుడేయెవ్వరితోనూ వెల్లడిచెయ్యకుమా. పూర్వం నహుషమహారాజు యింద్రత్వానికి వచ్చినప్పుడుకూడా యిలాగంటి కోరికేకోరినట్లు పురాణాలలో విన్నట్టు జ్ఞాపకం. ఇందులో యేమీతప్పితంలేదు. ఈకోరిక మీరాజుకు తగినరాజ చిహ్నాలువుంటే మీకూ గౌరవంగా వుంటుందన్న వుద్దేశ్యంతో కోరినదేకాని కామంచేత కోరిందికాదుసుమా.

జంబు—అవును మీరుయెప్పుడూ మాగౌరవము కోసమే చూస్తూవుంటారు. ప్రజల మేలువోర్చి వారిగౌరవంకోసం చూచే

రాజు కొరకడం బహుదుర్లభం. మీరు ప్రజలు చేసుకొన్న భాగ్యం చేత పరశ్రేయస్సహనంగల రాజులు లభించినారు.

సృగా—ఇక యీప్రసంగం చాలించు. అరుగో కుక్కుర సోమయాజులూ మొదలయినవారు వస్తూవున్నారు. వారు వెళ్ళిన కార్యం కాయయిందో పండయిందో కనుక్కోవలెను.

జంబు—పండే అవుతుంది. నేను మంత్రినయివుండగా కార్యం విఫలం కావడంకూడానా?

[అప్పుడు కుక్కురసోమయాజులును, శునకాచార్యులును, సారమేయ శ్రేష్ఠియు, గ్రామసింహదాసును ప్రవేశించుచున్నారు.)

సృగా...(లేచి యెదురుగా వెళ్ళి) ఓమంత్రివరులారా! సభా సదులారా! దయచెయ్యండి.

కుక్కు—మృగరాజులు మీరు మాకింత గౌరవం చెయ్య వలసినపని లేదు. మృగరాజయిన సింహముకు మేము యిదివరదాకా యేగౌరవం చేస్తూవున్నామో యింతటినుంచి మేము మీకాగౌరవం చేస్తూవుండవలెను.

సృగా—నేను రాజు నేమిటి? నిజానికి మీరేరాజులూ నేనే సేవకుణ్ణిని. మీరుమాత్రం గ్రామసింహాలుకారా? అయినాకానీ మీరందరూ ప్రార్థిస్తూవున్నారు గనుక సింహాలు మొదలయిన వుత్తమ మృగాలవల్ల మంత్రులున్ను సభికులున్ను అయిన మీకు గౌరవం కలిగేనిమిత్తం వాళ్ళయెదుట నేను వూరికే రాజచిహ్నాలు ధరిస్తాను. మీరు వెళ్ళినకార్యం యేమిచేసుకొనివచ్చినారు?

గ్రామ— పండించుకొని వచ్చినాము. దేవతలప్రసాదం యెప్పుడయినా విఫలం అవుతుందా? సింహశార్దూలాదులు దేవర వారి సందర్శనం నిమిత్తం మేము యిప్పుడేవస్తాము, మీరుముందు గాబోయి వర్తమానంచెయ్యమంటే మేమువచ్చినాము. వారు యీపాటికి బయలుదేరివుంటారు.

సృగా—ఈ గౌరవమంతా మీ దేకాని నాదికాదు. ఆహా! యేమి నా భాగ్యము! నాబంధువులు సింహాదులచేత కొలువుచేయించుకుంటూవుండగా చూచేపుణ్యం నాకు లభించింది! నేనిప్పుడు కృతార్థుణ్ణయినాను. ఈకుర్కురసోమ యూజులుగారు వద్దన్నారుకాని ఈయన ప్రధానమంత్రి అయి యీ యింద్రవైభవమంతా అనుభవించదగినవారు ఇప్పుడు మనమంత్రిఅయిన జంబుకేశ్వరశాస్త్రి మీకందరికీ పరమభృత్యుడయి నడుచుకునేవాడే గనుక యిప్పుడూ మీ కేమీలోపంలేదు.

కుర్కు—మీరుచేసిన గౌరవానికి నేనర్హుణ్ణికాను. నేను వకరిచాటున వొదిగివుండి జీవనం చెయ్యవలసినవాణ్ణే కాని స్వతంత్రించి అధికారం చెయ్యవలసినవాణ్ణికాను. మీమాట మీరరాదని అంగీకరించినాను గాని యీ సేనాధిపత్యానికయినా నేను తగినవాణ్ణికాను.

సృగా—ఆత్మోత్కర్ష చెప్పుకోవడానికి యిష్టంలేక మీరు యిలాగంటూ వున్నారేకాని చిన్నప్పటినుంచీ మీతో కలిసి మెలసి వున్నవాణ్ణి మీశక్తి సామర్థ్యాలు నాకు తెలియవా? అయినా యిప్పుడు వక్కటిమాత్రం ఆలోచించ వలసివున్నది. సింహశార్దూలాదులు చిరకాలంనుంచి స్వతంత్రం వహించి యితర జంతువుల మీద అధికారం చెస్తూవుండడానికి అలవాటుపడ్డవి. వాటికి వక్కమాటుగా యితరులకు లోబడడం అంటే బహుకష్టంగా వుంటుంది. అందులోనూ నాబంధులయిన మీరు మంత్రులుగానూ సభికులుగానూవుంటే వాటికి కళ్ళమంటగావుంటుంది. కాబట్టి కొంతకాలం మీరు తటస్థంగా వాటికళ్ళ పడకుండా, మీఅధికారానికి క్రమక్రమంగా అలవాటుపడ్డదాకా ఆవివచ్చినప్పుడు మీరుకొంచెం తొలగి వుంటూవుండవలెను. ఇది మీక్షేమంకోసమే చెపుతూవున్నాను.

సుమండీ. అవి క్రూరజంతువులు. కార్యం మించినతరువాత మనం యేమనుకున్నా కూడిరాదు. వాటియందు మీరు భయభక్తులు కనపఱిచి నాకు పరమవిధేయులయి చేతులు కట్టుకొని నిలువబడవలెను. అవి వెళ్ళగానే తరువాత మిమ్మలిని నేను నెత్తిమీద పెట్టుకుంటాను. ఇలాగన్నానని మీరు మనస్సులో మరివకవిధంగా అనుకోవద్దు. ఇదంతా మీక్షేమంకోసమే చేస్తూవున్నానని ముందుగానే నేను ముమ్మాటికీ చెప్పుతూవున్నాను. వాటిముందర మీమంత్రిత్వంమాటా, యితర వుద్యోగాలమాట మీరు యేమీ తలపెట్టగూడదు.

జంబు—మేమందరమూ యేలినవారి సెలవుకు బద్ధులమయి మీ ఆజ్ఞ శిరసావహించి నడుచుకుంటాము. అదుగో సింహేంద్రుడులు వస్తూవున్నారు.

[అప్పుడు సింహసార్వభౌముడును, వ్యాఘ్రేశ్వరరావును, భల్లూకేంద్రుడును, హరిణావధానులును, శశకశాస్త్రియు, ప్రవేశించుచున్నారు.

మృగా—(తనలో) నేనిప్పు డేలాగయినా వీటిని వలలో పడవేసి స్వాధీనం చేసుకోవలెను. ఇవి లోపడితే నాకు రాజ్యమంతా దక్కినట్లే. (అనిచేతులు జోడించుకొని యెదురుగా వెళ్ళి) ఓమృగసార్వభౌములారా! మీకు నమస్కారము.



సింహ సార్వభౌముఁడు.

సింహ—మీరిప్పుడు మాకు రాజులయినారు. మీకు మేమే నమస్కారము చెయ్యవలెను. మీకు దేవతలు మృగరాజ్యం యిచ్చిన మాట కుక్కుర సోమయాజులు మాకు చెప్పినారు. అతడు యెప్పుడూ అసత్యంపలికేవాడు కాడుగనుక, అతనిమాట విశ్వసించి మేమందరమూ మీదర్శనానికి వచ్చినాము. మీశరీరం రంగుచూడడంతోటే అతనిమాటలసత్యం మరింత స్పష్టమయింది.

మృగా—నాపురాకృతపుణ్యంచేత నాయందు దేవతలకూ మీకూ కూడా అనుగ్రహంవచ్చింది. ఈకుక్కురసోమయాజులు మీరుచేసిన శ్లాఘనకంతకూ తగినవాడు. యెంత నిదర్శనమూ కనపడకపోతే అతడు వకరు చెప్పినమాట నమ్మేవాడుకాడు. ఓసింహసార్వభౌమా! పీఠమును స్వీకరించండి. ఓ వ్యాఘ్రేశ్వరా! ఈవున్నతాసనంమీద కూర్చుండండి. ఓభల్లూకేంద్రా! దయచెయ్యండి.

సింహ—రాజులుమీరు సింహాసనముమీద కూర్చున్నతరువాత మేము కూర్చుంటాము. ముందుగా మీరు కూర్చుండవలెను.

మృగా—నేను రాజునేమిటి? దేవతలమాట తీసివెయ్యరాదని నేను వూరికే రాజనామం ధరిస్తారుగాని— (తనలో) ఏదోమిష

చెప్పి యిప్పుడు వీళ్ళందరినీ పంపి వెయ్యవలెను. (ప్రకాశముగా) జంబుకేశ్వరశాస్త్రి! కుక్కురసోమమయాజులుగారూ! మీరు వుభయులూ వెళ్ళి శరభేంద్రరావుగారిని వక్కసారిదర్శనంయిమ్మన్నానని మనవిచేసిరండి. ఓశువకాచార్యులుగారూ! మీరు తక్కిన యిద్దరినీ వెంటబెట్టుకొని వెళ్ళి సింహసార్వభౌములు మొదలయినవారు విజయంచేసి మీకోసం యెదురుచూస్తూవున్నారని గజేంద్రాదులను వెంటబెట్టుకునిరండి. శీఘ్రముగా బొండి.

జంబుకేశ్వరాదులు—చిత్తము. (అని వెళ్ళుచున్నారు)

మృగా—ఓసింహసార్వభౌమా! వ్యాఘ్రేశ్వరా! మీరుదయచేస్తేనేకాని నేను కూర్చోను. వూరికేనేను పేరుకు రాజునేకాని యీ రాజ్యమంతా యిఖముందున్ను మీదే. యిదివరకు రాజ్యంచేస్తూవున్నట్టే యిఖముందుకూడా యీసింహసార్వభౌములే రాజ్యం చెయ్యడం నా అభీష్టం. దేవతలమాట తీసివెయ్యకుండా మీకందరికీ యిష్టంవుండి కూర్చోమంటే నేను వూరికే సింహాసనంమీద కూర్చుంటాను.

సింహ—దేవతలఆజ్ఞను మీరస్యధాకరించరాదు. వారి ఆజ్ఞను చెల్లించడం మాకందరికీకూడా ముఖ్యకర్తవ్యం. మీరీ అరణ్యరాజ్యభారం వహిస్తే మీతరఫున మేము సమస్తకార్యాలూ నిర్వహిస్తాము.



వ్యాఘ్రేశ్వరరావు

వ్యాఘ్రే—మీరవశ్యంగా సింహసార్వభౌములు చెప్పినట్లు చెయ్యవలెను. ఈయనమాట మనం యెవ్వరమూ దాటకూడదు.

మృగా—మీ వుభయుల ఆజ్ఞా మీరడానికి భయపడతాను గనుక మీయిష్టానుసారం చెయ్యడానికి వప్పుకున్నాను. ఆలాగయితే యీసింహ సార్వభౌములు ప్రధానమంత్రిపదం వహించి సమస్త రాచకార్యాలూ స్వతంత్రంగా నిర్వహిస్తూ వుండవలెను. శ్రీకృష్ణుల వారు పేరుకు వుగ్రసేనుణ్ని సింహాసనంమీద కూర్చోపెట్టి రాజ్య భారమంతా తామెలా వహించినారో మీరూ ఆలాగే వహించ వలెను.

భల్లూకేంద్రుడు

భల్లు—వారు ప్రధానమంత్రిత్వం అంగీకరించి మీఅభీష్ట ప్రకారమే జరిగిస్తారు. వారువుండగా అటువంటి గొప్పగౌరవానికి యితరు లెవరయినా అర్హులవుతారా? ఇక సేనాధిపత్యం యీ వ్యాఘ్రేశ్వరరావుగారికి యివ్వవలెను. ఆయన అరణ్యంమీదదండు యెత్తినారంటే వైరులందరూ తల్లడిల్లుతూవుంటారు. ఆయన ధాటీకి ఆగేవారు లోకంలో యెవరూలేరు.

సృగా—(తనలో) ఈసమయంలో యెలాగయినా కుక్కుర సోమయాజులమీద వీళ్ళకు అయిష్టంపుట్టేటట్టుచేసి వాణ్ని యెలాగయినా శీఘ్రంగా వదల్చుకోవలెను. వాడున్నంతవరకూ మన రాజ్యం స్థిరమని నమ్మివుండరాదు. నీలిగూఢసంగతి వాడికి యేమాత్రం తెలిసినా నిజం బయలుపెట్టి మనకొంప దీస్తాడు. (బిగ్గరగా) అవశ్యంగా వ్యాఘ్రేశ్వరరావుగారే సేనాధిపత్యం వహించడం నా కోరిక. సేనాధిపతిగా వుండడానికి ఆయనకంటె అర్హులు లోకంలో యెవరూవుండరు. కాని—ఆయనే మనకు సేనాధిపతి.

వ్యాఘ్రి—ఏమో చెప్పవచ్చి "కాని" అని వూరుకున్నారు. అదేమో చెప్పండి. నేను సేనాధిపతిగా వుండడానికి మీకేమయినా అభ్యంతరం వున్నదా?

సృగా—దైవసాక్షిగా చెపుతాను. నాకేమి అభ్యంతరం లేదు. వక్కసంగతి చెప్పవచ్చి యెందుకని మానివేసినాను. పోనియ్యండి, ఆసంగతి యిప్పుడు తలపెట్టకూడదు. అతడూ మన కాప్త కోటిలోవాడే.

వ్యాఘ్రి—ఆసంగతి యేమిటో, అతడేమిటో, అవశ్యంగా చెప్పవలెను. మీరిప్పుడు చెప్పకతీరదు.

సృగా—మీరింత నిర్బంధపెడుతూ వున్నారుగనుక విధిలేక చెప్పవలసి వస్తూవున్నది. కుక్కుర సోమయాజులు నాకుపరమాప్తుడు. అతనివంటి సత్యసంధుడూ, ఉత్తమశ్లోకుడూ లోకంలో మఱియెవడూలేడు. సేనాధిపత్యం చెయ్యడానికి తనకు కొంచెం అపేక్షవున్నట్టు నాముందట అతను సూచనగా కనపరచినాడు. అంతేకాని మఱి యేమీలేదు. మీకు సేనాధిపత్యం యిస్తామంటే అతనూ సంతోషిస్తూవప్పుకుంటాడు. ఈమాట మళ్ళీ అతనికి తెలియనిచ్చేరు సుమండీ. అతడు బహుదొడ్డవాడు.

వ్యాఘ్రి—(తనలో) మనమీదికి పోటీకి వచ్చినాడుగనుక కుక్కుర సోమయాజులపని పట్టించవలెను. (బిగ్గరగా) ఎంతమాత్రమూ తెలియనియ్యను. మీకుయిష్టంవుంటే కుక్కుర సోమయాజులనే సేనాధిపతినిగా చెయ్యవచ్చును.

సృగా—మిమ్మలినప్పుడే సేనాధిపతినిగా చేసినాను. అతనితోటి మీకేమిటి? మీకీయధికారంవచ్చిందంటేఅతనికిమాత్రం మరి వకవిధంగా వుంటుందనుకున్నారా? మీరుమనసులో యేమీపెట్టుకోవద్దు.



హరిణావధానులు

హరి—కుక్కుర సోమయాజులు బహుదొడ్డవారు. మీరు వున్నారంటే ఆయన ఆకోరిక కోరివుండరు.

వ్యాఘ్రి—అవును. అతడు మంచివాడని నేనూ యెఱుగుదును. అతనువున్నా నాకూయిష్టమే.

శశకము (పి)

శశ—మీకు సేనాధిపత్యం వచ్చినదంటే కుక్కుర సోమ యాజులుగారు బహుసంతోషించి తనకు మీరంతా బలవంతపెట్టి యిస్తామన్నా పుచ్చుకోరు.

మృగా—అందుకు సందేహంలేదు. ఈభల్లూకేంద్రుడిగారిని ధర్మాధికారినిగా నియమింతామా?

వ్యాఘ్రి—అవశ్యంగా నియమించవచ్చును. ఇప్పుడు పుద్యోగ నియామకాలయినవిగనుక రేపుమళ్ళీ సభచేరుదాము.

[అందఱు నిష్క్రమించుచున్నారు]

---

౫. రంగము—మహారణ్యపుర బాహ్యప్రదేశము

[శునకాచార్యులును, గ్రామసింహదాసును, సారమేయశ్రేష్ఠియు, జంబుకేశ్వరశాస్త్రియు ప్రవేశించుచున్నారు]

శున—మనరాజుగారిస్థితి యేమీబాగావున్నదికాదు. అడవులన్నీతిరిగి, మృగాలన్నిటితోనూచెప్పి, తనరాజ్యం నిలపడానికి

మనమే ముఖ్యకారకులమయినప్పటికీ యే కార్యంలోనూ మనఆలోచన కొంచెమయినా లేకుండా కృతఘ్నుడయి మననందరినీ నీచసేవకులను చూచినట్టు మిక్కిలి నీచంగా చూస్తూవున్నాడు.

గ్రామ—నీవేమో ఆలోచనా పాలోచనా అని మాటలు చెపుతూ వున్నావు. ముందుగా మనప్రాణాలమాట ఆలోచించు. ఏ నిమిషములో యే దుష్టుడితో చెప్పి రహస్యంగా యెవరితల తియ్యమంటాడో యెవరికి తెలుసును? ఆయన పయికి కనపరిచే నక్కవినయాలనూ దొంగప్రేమనూపట్టి చూస్తే కుక్కురసోమయాజులుగారిని యిలాగు చంపిస్తాడని యెవరయినా కలలోనైనా అనుకున్నారా? రేపు మనగతీ అంతేఅవుతుంది. మనరాజుకు అంగిట బెల్లమూ ఆత్మలోవిషమూ అని అందరూ యెరుగుదురు.

సార—దీనివిషయంలో తప్పకుండా మనం యేమయినా వుపాయం ఆలోచించవలెను. ఈ దుర్నయంచూస్తూ వూరుకుంటే మనప్రాణాలుదక్కవు. నేను కుక్కురసోమయాజుకు వచ్చింది రేపు మన ప్రాణంమీదికే వస్తుంది. నక్క కుక్కురసోమయాజులనే కాదు, మహిషేశ్వరుణ్నికూడా రాత్రి యెవ్వరో చంపివేసినారు. వాళ్ళతలలు యిక్కడనే పడివున్నవి. ఈవిషయంలో ప్రధానమంత్రిగారు జంబుకేశ్వరశాస్త్రిగారు మీరేమంటారు?

జంబు—నా ప్రధానమంత్రిత్వం యేడిసినట్టేవున్నది. సింహసార్వభౌముడు వచ్చినప్పుడాయనతో నీవే ప్రధానమంత్రినని చెప్పి నాచేత ఆయనకు అన్ని పనులూ చేయిస్తాడు. ఆయన వెళ్ళిన తరువాత నేను యిదేమిటయ్యా అని అడిగితే, "నిజమయిన ప్రధానమంత్రివి నీవే. నాయనరోజులు ఓపికపెట్టి పనిచేస్తూవుండు తరువాత నీకు బహిరంగంగానే మంత్రిత్వంయిస్తాను" అని సర్దిచెప్పుతాడు.

నా మంత్రిత్వం వక్కదానిలోమాత్రం కనబడుతూవున్నది. ఎవ్వరూ లేకుండా చూచి నన్ను రహస్యంగా పిలిచి "నీకు ప్రధానమంత్రిత్వం యిచ్చినానుగదా! మృగరాజయిన నాకు తగిన రాణీని తీసుకుని రావా?"అని తనకు ఆడసింహాన్ని తీసుకురమ్మంటాడు, ఇవన్నీ చెప్పకుంటే సిగ్గులచేటు. మీతోగనుక చెపుతూవున్నాను. ఇప్పుడు రాజుగారివద్ద మీ అందరి సభికత్వమూ యేలాగున్నదో నా మంత్రిత్వమూ అలాగేవున్నది.

సార—చచ్చినాకానీ కుక్కురసోపయాజుల తల జీవకళ పుట్టిపడ వీరరసం యెలా వొలుకుతూవున్నదో చూడు. ఇటువంటి సుజనుణ్ని చీకటిలో చంపించడానికి యేలాగున మనసువచ్చిందో! అతని మరణం సంగతి విని సృగాలమహారాజు యీరోజుతో ప్రపంచమంతా మునిగిపోయినట్టు వెక్కివెక్కి యేడుస్తూ, అటువంటి మంచివాడు పోయినతరువాత తనకికరాజ్యం చెయ్యడానికి యిష్టం లేనట్టు నటిస్తూ వున్నాడు. పయికి దొంగవేషాలు వేసి యెంత యేడిచినా ఇది తప్పకుండా మనరాజు పనేకాని మరివకరిదికాదు.

శున—అందుకు యెంతమాత్రమూ సందేహంలేదు. రాజ్యం వస్తేమాత్రం మునుపటి అల్పబుద్ధి పుడకలతోగాని పోదు. వీడివద్ద

యెన్ని నక్కజిత్తులైనా వున్నవి. నోరునవ్వుతూవుంటే నొసలు వెక్కిరిస్తూ వుంటుంది.

గ్రామ—అవును. వీడుచేసినమోసాలు మనం చిన్నప్పటి నుంచీ యెరుగుదుము. యెరిగివుండిన్నీ మనం బుద్ధిభ్రమసి మధ్య మధ్య గోతులలో పడుతూవుంటాము. మనం యెండలోపడి అడవులూ కొండలూ తిరిగి పెద్దపులులనూ సింహాలనూ తీసుకునివచ్చి పాదాక్రాంతులను చేసినపాపంచేత తుదకు మనకే మోసంవచ్చింది. నాలుగురోజులు రాజ్యం రావడంతోనే తానేమో మహారాజయినట్టూ మనమంతా తనకేమో పాదసేవకులమయినట్టూ మనను చూస్తే మాట్లాడనేమాట్లాడడు. చెవిటివాడివలె మనంచేసే మనవి వినిపించుకోడు. వాయువురోగం వచ్చినవాడివలె తల ఆడిస్తాడు.

సార—అవును. నీవు చెప్పినదంతా నిజం. దుష్టరాజుకున్న సన్నిపాతజ్వరం వచ్చినవాడి కిన్నిలక్షణాలు వకటేవిధంగావుంటవి. ఇప్పుడు జరిగినదానికి విచారించిన ఫలంలేదు. ఇఖముందు మన ప్రాణాలకయినా మోసం రాకుండావుండే సదుపాయంచూడవలెను.

శున—నాబుద్ధికి వక్కటే వుపాయం కనబడుతూవున్నది. సృగాలమహారాజును రాజ్యాన్నుంచి తొలగించి యెప్పటి నక్కను చెయ్యడం తప్ప రెండోవుపాయం కనబడడంలేదు.

గ్రామ—అవునుగాని ఆపనియిప్పుడు మనకు సాధ్యంకాదు. సింహాలూ వ్యాఘ్రాలూ పరమభృత్యులయి సేవచేస్తూవుండగా నాలుగుకుక్కలూ నక్కలూచేరి యెలా సింహాసన విహీనుణ్ణిగా చెయ్యడం సాధ్యమవుతుంది? సమయంవచ్చినదాకా కనిపెట్టుకొని వుండి స్వయంకృతపరాధం అనుభవిస్తూ సమస్తమూ దైవానికి వదలిపెట్టి వూరుకుంటే దుష్టుడు తానుచేసిన దోషంవల్ల తానే నశిస్తాడు. లోకంలో దుర్మార్గం యెల్లకాలమూ సాగదు. సత్పురుషు

లకు హానిచేస్తూ యిటువంటి దుర్మార్గాలు చెయ్యడంవల్ల తనగొయ్యి తాను తవ్వుకోవడమే కాని మరివకటి గాదు. చూస్తూవుండు వీడు మన కళ్ళముందరనే తాను తవ్వుకొన్న గోతిలో తానే పడి చస్తాడు. మహిషేశ్వరుడివంటి నిర్దోషులను వూరికే హింసిస్తే, ఆపాపం కట్టి కుడుపకుండా వూరికే పోతుందా? చూడు, ఆ మహిషేశ్వరుడి తలచూస్తే యెలా జాలివేస్తూవున్నదో! ఇటువంటి మాయామర్మమూ యెరుగనివాడి దుర్మరణంచూస్తే యెవరికి జాలిపుట్టదు?

సార—నీవు చెప్పినమాటలు సత్యమేకాని, దుర్మార్గుడు తనంతటతానునశించేవరకూ చూస్తూవూరుకోరాదు. చూస్తూవూరుకుంటేయీలోగామనకే యేదోహానిచేసి మరీచస్తాడు. కాబట్టి సాధ్యమయినంతశీఘ్రంగా దుష్టుణ్ని అణిచివేసేమార్గం చూడవలెను. బాగా ఆలోచిస్తే వుపాయం దొరకకుండా వుండదు. మన అందరిలోకి జంబుకేశ్వరశాస్త్రి మహాబుద్ధిమంతుడు. అతడు పూర్ణంగా తలుచుకుంటే మంచి వుపాయం దొరక్కపోదు. ఇతని సహాయం వుంటే మనకు తప్పకుండా కార్యసిద్ధి అయినట్టె.

జంబు—నేనూ అదే ఆలోచిస్తూవున్నాను. తొందరపడగూడదు. బాగా ఆలోచించిచేస్తే మనవుపాయం రామబాణంవలె అమోఘంగా పట్టుకోవలెను. నేను వక్క రహస్యం విన్నాను. అది మన కార్యసిద్ధికి పనికివస్తే పనికిరావచ్చును.

సార—నీవు బుద్ధియందు అపర బృహస్పతివి. అప్పుడే నీబుద్ధికి మంచి ఉపాయమేమో తగిలింది. నీవు విన్న రహస్యం యేమో కొంచెంచెప్పు.

జంబు—మరి యేమీలేదు. నాడు వీడి వంటికి పట్టుకున్న నీలిరంగు దేవతలూ యివ్వలేదు యెవ్వరూ యివ్వలేదట. వీడా రాత్రి కన్నుగానక ప్యాక్టరీ నీలిగూనలో పడితే రంగు పట్టుకున్న దని కోళ్ళనిమిత్తం తిరుగుతూ కంచెలోవుండి చూస్తూవున్న నాబంధువుడొకడు రహస్యంగా చెప్పినాడు.

గ్రామ—అది తప్పకుండా నిజమే అయివుంటుంది. అందుకు సందేహంలేదు. వీడిఇల్లు వల్లకాడుకానూ! యీనక్కపోతు యెంత మోసము చేసిందిరా! వృథాగా వీడి కుతంత్రంవల్ల యింతమంది బుద్ధిమంతులున్నూ ప్రముఖులన్నూ యిట్టే మోసపోయినారు. యీసంగతి తెలిస్తే సింహాలూ పెద్దపులులూ యీ అవమానం సహించి వూరుకోవు.

జంబు—కేకలువెయ్యక మెల్లిగా మాట్లాడు. చెట్లకుకూడా చెవులువుంటవి. మనసంగతి కొంచెం గ్రహించి యేపక్షిగాడైనా వెళ్ళి చెవులోవేస్తే దానికి తగినతంత్రం యేదోపన్ని తనకున్ను యీ వర్తమానం చెప్పిన నా బంధువుడికిన్నీ విరోధమని సాక్ష్యంతెచ్చి రాజద్రోహం చేసినాడని తల తీయించివేస్తాడు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా?

సార—వాడు అంతపని చేసేవాడే. ఈ కుట్రలో మన మంతా చేరివున్నామని మన్నందరినీకూడా కలిపి దలలు తీయించినా తీయించవచ్చును. కాబట్టి మన కార్యం యెవ్వరికి తెలియకుండా రహస్యంగానే సాధించుకోవలెను. ఇప్పుడు దేవతలంటే జ్ఞాపకం వచ్చింది కుక్కురసోమయాజుల మరణం యెలాగు జరిగిందంటే

దేవతలో దయ్యములో చేసివుంటవిగాని యిది భూలోకంలో వారు చేసింది కాదని యిందాకా సృగాలమహారాజు చెప్పినాడు. ఇది తన మీద అనుమానం తప్పించుకోవడానికి అన్నమాటకాని మరివకటి కాదని నాకు యిప్పుడు తోస్తూవున్నది. వీడు స్వర్గలోకంలోకి వెళ్ళిన మాటే అబద్ధమయి వీడి కీనిలిరంగు నీలిగూనలోనే గలిగినట్టయితే దేవతలూ దెయ్యాలూ స్వర్గమూ అంతా అబద్ధమే. నక్కయెక్కడ దేవలోకమెక్కడ నని మనం మొట్టమొదటనే అనుకునిన్నీ బుద్ధి భ్రమించి తుదకు మాయలో పడిపోయినాము. జంబుకశాస్త్రీ! నీవాలోచించిన వుపాయమేమో కొంచెంచెపుదూ.

జంబు—మరేమీ లేదు. ఇప్పుడు రెండుపనులు జరగవలెను. మొట్టమొదట నీలవర్ణం నీలిగూనలో పడడంచేత వచ్చిందేకాని స్వర్గలోకంలోకి దేవతలు తీసుకువెళ్ళి యిచ్చిందికాదని సింహశార్దూలాదుల కన్నిటికి నమ్మకంగా తెలియవలెను. రెండోది సింహాసనం రావటంచేత మునుపువున్న నక్కగుణాలుతప్ప కొత్తమహిమయే మీరన్నట్టు వాటికన్నిటికీ బోధపడవలెను.

సార—మొదటి సంగతి యెవరిచేతనయినా చెప్పించవచ్చును గాని కొత్తగా మహిమవచ్చిందీ రానిదీ దృష్టాంతపూర్వకంగా యెట్లా చెప్పగలము? ఆపనిమాత్రం సాధ్యంకాదు.

జంబు—సాధ్యంకాకేమి? ప్రయత్నంచేస్తే అన్నీ సాధ్యం అవుతవి. ఈ మంత్రాంగమంతా నాకు వదిలిపెట్టండి. యెంతటి అసాధ్యకార్యమయినా నేను విశ్వప్రయత్నంచేసి సాధిస్తాను. దానికి నాకు వకవుపాయం తోస్తూవున్నది.

సార—ఏమిటో యేమిటో వేగిరంచెప్పు విన్నదాకా నా మనస్సు యేమీ తోచకుండా తొందరపడుతూవున్నది.

జంబు—అదియేమీ గొప్పకార్యంకాదు. ఆపనినాచేతిలోనే వున్నది. సింహాలూ శార్దూలాలూ అన్నీవచ్చి కొలువుచేస్తూ సభ

తీర్చివున్న కాలంలో నేను యెదురుగా కూర్చుండి కుయ్యడానికి ఆరంభిస్తే స్వభావము యెవరికీ మారదుగనుక నాతో నృగాల మహారాజుకూడా అరుస్తాడు. అప్పుడు సింహాలు మొదలయినవాటికి యిది వెనుకటి నక్కే కాని దీనివద్ద విశేషం యేమీ లేదని తెలియక పోదు. తెలిసిన తరువాత అటువంటి వుత్తమమృగాలు వక్కదినం సేవచెయ్యడానికి వప్పుకోవు.

గ్రామ—ఇది మహాబాగావున్నది. ఇంతకంటే మంచివుపాయం లోకంలో యెక్కడావుండదు. దీన్ని తప్పకుండా యీరాత్రి ప్రయోగించవలెను. వేళుదాముర్రండి.

సార—ఈవుపాయం సర్వోత్తమంగా వున్నది.

శుక—ఇది దివ్యమయిన వుపాయం. ఆలస్యం అమృతం విషం అన్నాడు గనుక మన గ్రామసింహదాసుగారు చెప్పినట్టుగా యీ సాయంకాలమే యీవుపాయం ప్రయోగించవలెను.

జంబు—శుభస్యశీఘ్రం అన్నాడు. అలాగేచేద్దాముర్రండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

---

౯. రంగము—నృగాల మహారాజుసభ

[నృగాల మహారాజును, సింహసార్వభౌముఁడును, వ్యాఘ్రేశ్వర రావును, శునకాచార్యులును, జంబుకేశ్వర శాస్త్రియు, గ్రామసింహదాసును ప్రవేశించుచున్నారు]

నృగా—ఓసభికసార్వభౌములారా! కుక్కుర సోమయాజుల దుర్మరణవార్త వినడంచేత నాకు యీదినం సభచెయ్యడానికి యెంతమాత్రమూ మనస్కరించకుండా వున్నది. అతడు మహాసత్య సంధుడు. న్యాయమార్గావలంబుడు; లోకోపకారి; పరదార ధరా

పేక్షలేనివాడు, అటువంటి పరమ సుహృత్తుపోయిన తరువాతకూడా నాప్రాణాలు పోనందుకు నాకెంతో విచారంగావున్నది.

వ్యాఘ్రే—మీరాట్టే విచారించవలసినపని లేదు. లోకంలో యెవరికీ దేహం స్థిరంకాదు. మీరు సిద్ధసంకల్పులు. అటువంటి పరమసుహృత్తు పోయిన తరువాత యీ లోకంలో వుండడానికి మీకు నిజంగానే యిష్టం లేకపోయినట్టయితే మీకోరిక శీఘ్రంగానే సిద్ధిస్తుంది. మీకు దేవతల అనుగ్రహంకూడా చాలావున్నది గదా? మిమ్మల్ని తమలోకానికి తీసుకునివెళ్ళిరా?

సృగా—(తనలో) ఈవ్యాఘ్రేశ్వరుడి మాటలుచూస్తే యేదోవిధంగావున్నవి. యెవరయినా దుర్మార్గులువెళ్ళి మనమీద చాడీలు చెప్పి అతని మనస్సు విరసం చేసివుండకగదా? రాత్రినిద్ర పోతూవుండగా కుక్కుర సోమయాజులను చంపించిన మాట యెవరయినా చెప్పియుందురా? నేను నీలిగూనలోపడి రాజ్యంసంపాదించుకొన్నమాట చెప్పియుందురా? ఏమిచెప్పినాసరే. నాబుద్ధిబలంచేత శత్రువుల కుట్రలన్నీ సూర్యుడు మంచును విడగొట్టినట్టు విడగొట్టి వేసి తిరిగీవాళ్ళకే యేవోతంటాలు తెస్తాడు. న్యాయంగా వెళ్లేవాళ్ళకు వక్రమార్గం కాని నాకులక్షమార్గాలు వున్నవి. (బిగ్గరగా) వ్యాఘ్రేశ్వరుడు గారూ! మీరు సెలవిచ్చినమాట సత్యం. నాకు దేవతల అనుగ్రహం పరిపూర్ణంగా వున్నది. వారికటాక్షం నామీద పూర్ణంగావున్న సమయంలో నే నామిత్రులకూ ఆశ్రితులకూ యేదో వుపకారం చేస్తాను. నేనుచేసేది క్రియచేత కనపరచవలసిందే కాని మాటలచేత కనపరచకూడదు. ఇప్పుడు మంచి తరుణం తటస్థించినది గనుక కుక్కుర సోమయాజులకు దేవేంద్రుడితో చెప్పి మహాయజ్ఞాలుచేసిన సోమయాజులకు సమేతూ దుర్లభమయిన స్వర్గలోకవాసం శాశ్వతంగా యిప్పిస్తాను. కుక్కుర సోమ

యాజుల మరణంమూలంగా నాకనోటికి మెతుకులుపోలేదు. మన స్సులో యేమో పిచ్చియెత్తినట్టున్నది. నేటికి సభచాలింతాము.

వ్యాఘ్రే— దేవర వారిమాటలుచూస్తే నేడు తమరు కుక్కుర సోమయాజులకోసం స్వర్గలోకానికి విజయం చేసేటట్టువున్నది. ఇది వరకే చాలాకాలం కిందటనే మాకందరికీకూడా దేవతాసందర్శనం చేయిస్తామని వాగ్దానంచేసివున్నారు. ఇప్పుడయినా చేయిస్తారా?

సృగా—ఇటువంటి విచారసమయంలో అటువంటి కోరిక కోరడం న్యాయంకాదు. కావలిస్తే మీకు మరివకప్పుడు దేవతా సందర్శనం చేయిస్తాను.

వ్యాఘ్రే—అలాగయితే యిప్పుడు మీరువక్కరే స్వర్గ లోకానికి విజయం చేస్తారా? మీప్రధానమంత్రి గారినికూడా తీసు కునివెళుతారా? వెనుకటివలెకాకుండా యిప్పుడు మీరు రాజవేషం తో స్వర్గలోకానికి వెళుతూ వున్నారు గనుక మంత్రిసహితంగా వెళితే యెక్కువమర్యాదగా వుంటుంది.

జంబు—నేనా? నేనా? నేనీయనతో స్వర్గానికి వెళ్ళను. ఈ లోకంలోనే వుంటాను.

వ్యాఘ్రే—ఇప్పుడు నిన్నెవ్వరు స్వర్గలోకానికి తీసుకుని వెళుతామన్నారు?

జంబు—ఇప్పుడు మీరు సృగాల మహారాజగారిని ప్రధాన మంత్రితోకూడా స్వర్గలోకానికి వెళ్ళుమన్నారు. నేను ప్రధాన మంత్రిని గనుక నేనురానన్నాను.

సృగా—నీవు ప్రధాన మంత్రివిగావు, యేమంత్రివీగావు. సింహసార్వభౌము లంతటివారు ప్రధాన మంత్రులయి యెదుట కూర్చుండి వుండగా నలుగురిలోనూ సిగ్గులేకుండా ప్రధానమంత్రినని లేచి చెప్పడానికి నీకునోరుయెట్లా వచ్చిందిరా? మాట్లాడకకూర్చో.

జంబు—మీరు యిదివరదాకా నేనే ప్రధాన మంత్రినని నాతో చెపుతూ శుసకాచార్యులూ మొదలయిన వారందరి ముందరనూ నాకు మంత్రిత్వం యివ్వలేదా?

సృగా—ఓరినిర్భాగ్యుడా! అదంతా నీవునిజమే అనుకున్నావా యేమిటి? నాకు మంత్రిత్వం కావలెనని నీవు అంటూవుంటే నీ తెలివి తక్కువచూచి నిన్ను సంతోషపెట్టడానికి వూరికే వేళాకోళానికి నీకు మంత్రిత్వం యిచ్చినానంటే అదీ నీవునిజంగానే నమ్ముతూ వున్నావా? లోకంలో యెంతటిపిచ్చివాళ్ళయినా వుంటారు.

శుస—అలాగయితే కర్కర సోమయాజులుగారికి సేనాధిపత్యమూ, మాకందరికీ సభికత్వమూ, యిచ్చినమాటకూడా అబద్ధమేనా?

సృగా—అంతాఅబద్ధమే. ఇదంతా కేవలనాటకము. మీ పరువుకు నిజంగా మీరాపుద్యోగాలకు తగుదుమే అనుకున్నారా? వూరికే ప్రొద్దుపోవడానికి యెవరూ లేనప్పుడు మిమ్మలినందరినీపిలిచి వకడు మంత్రిఅనిన్నీ, వకడు సేనాధిపతి అనిన్నీ కొందరు సభికుల నిన్నీ పేర్లుపెట్టి బొమ్మలాటలాగు ఆడిస్తూవుంటే, ఆవినోదం అంతా నిజమేనని మీరుమాత్రం నమ్మినారా? నాటకంకూడా నిజమనినమ్మే బుద్ధిహీనులు లోకంలో యెవరయినా వుంటారా?

గ్రామ—మేము మంత్రులుకావడం మొదలయినదంతా నాటకమయితే మీరు రాజుకావడంమాత్రం నాటకంకాదా? నాటకంలో వకవేషం అబద్ధమయితే వకవేషంమాత్రం నిజమవుతుందా? అయితే అంతా అబద్ధమేకావలెను.

సృగా—మీబంధువుడయిన కర్కర సోమయాజులు పోవడముచేత మీకందరికీ మతిపోయి పిచ్చిమాటలంటూ వున్నారు. మీరు యిప్పుడు యిళ్ళకుపోండి తరువాతవచ్చి మాట్లాడుదురుగాని.

నేను గనుక మీపిచ్చిమాటలకు రహించినానుగాని మీరు ఈవాళ్లు తెలియకుండావున్న స్థితిలో సింహసార్వభౌముడూ మొదలయిన వారిని యేమయినా అన్నారంటే ప్రాణాలమీదికివస్తుంది. వేగిరం వెళ్ళండి.

గ్రామ—మమ్మలిని అవమానపరచిన తరువాత మీంగుట్టు మేముమాత్రం బయలపెట్టమా? నీలిగూన — నాకెందుకు? నేను చెప్పను.

సింహ—నీలిగూనయే మిటి? యేమిటో చెప్పుచెప్పు.

గ్రామ—నాకెందుకు నేనుచెప్పను. నిజమో అబద్ధమో అది నేను విన్నమాటగాని చూచినమాటకాదు.

వ్యాఘ్రే—(రహస్యముగా సింహసార్వభౌమునితో) నాతో కళ్ళారాచూచిన ముసలినక్క వకటి యీ మృగాలాధముడు రాత్రి యెవళ్ళ గుడిసెలోనో దూరడంచేత వాళ్ళు తరుముకునివస్తే ప్యాక్టరీ నీలిగూనలో పడ్డాడనిన్నీ అంగుచేత వంటికి రంగుపట్టుకుంటే స్వర్గానికి దేవతలు తన్ను తీసుకునివెళ్ళి అభిషేకం చేసినారని వేషం వేసి మనవందరినీ మోసంచేసినాడనిన్నీ, చెప్పినది. నాకంతమీద మహాకోపంవచ్చి వీడితాళం పట్టింతామనే యిప్పుడువచ్చినాను.

సింహ—(రహస్యముగా వ్యాఘ్రేశ్వరునితో) నీవుతొందర పడబోకు నిలకడమీద నిజం బయలపడకపోదు. మనంచేసేకార్యం నిదానించి మరీచెయ్యవలెను.

మృగా—ఓసింహసార్వభౌమా! చిత్తగించినారా? వీళ్ళంతా నేటిదినం యేదో కుట్రపన్ని ఆలోచించుకొని వచ్చినారు. దుర్మార్గులు వోర్వలేనితనంచేత యేమిచేసినా మీవంటిసన్మార్గులు వాళ్ళమాటలు నమ్మరు. కుక్కుర సోమయాజుల మరణవార్త విన్నప్పటినుంచీ నా మనస్సు నిప్పులలో పొర్లించినట్టు మండుతూవున్నది. హత్యచేసిన

కూలీలను పట్టుకోవడానికి నాశాయశక్తులా ప్రయత్నంచేస్తూ వున్నాను. నాకొంత రూఢిసమాచారమే తెలిసింది. దాచడం యెందుకు? ఇప్పుడు మీయెదుటనే చెప్పివేస్తాను. ఆహత్యచేసినవాడు యీగ్రామసింహదాసట. జంబుకేశ్వరశాస్త్రి, శునకాచార్లూ, మొదలయిన దుష్టులందరూ, కుమ్మకుదార్లట. అన్నీ రేపు తెలుస్తవి. రేపు మీయెదుటనే సాక్షివిమర్శ చేయిస్తాను.

జంబు—(తనలో) ఓరిపాపాత్ముడా! యెంతటియెత్తు యెత్తినావురా? ఈరోజంతాపనిచేసి వీడు లంచాలిచ్చీ బెదరించీ వుద్యోగాలిప్పిస్తానని ఆశపెట్టి మాయమాటలుచెప్పి మోసంచేసి కాళ్ళుపట్టుకుని బతిమాలుకుని కావలసినంతమందిని దొంగసాక్షులను కుదురుస్తాడు. ఈలోగానేమనం వీడిగుట్టు బయలుపెట్టకపోతే రేపు మన ప్రాణాలు దక్కవు. (బిగ్గరగా) ఇందులో నేను యేదోషమూయెరగను. ఈయనను దేవతలు తీసుకుని వెళ్ళలేదనిన్నీ, నీలిగూనలోపడితే యీరంగు పట్టుకున్నదనిన్నీ, పొదలోవుండిచూచిన నాబంధువుడు చెపితే యెరక్కపోయి వీరితో అన్నాను. ఆమాటలు రాజుగారికి యెలాగో తెలిసి నామీద పగపట్టినారు. ఈయన నాకు మంత్రిత్వం యిచ్చినానని చెప్పి సింహాల భార్యలనూ వ్యాఘ్రాల భార్యలనూ తీసుకురమ్మంటే నాచేత కాదన్నానని యీయనకు నామీద లోపల ఆగ్రహమండి.

మృగా—ఈతుచ్ఛుడుపేలే ప్రేలాపన పెద్దమనుష్యులు మీరంతా వింటూవున్నారుగదా? తనకుతంత్రం బయలుపడ్డదని వీడు యివన్నీ కల్పించినాడు. యీ కుక్కలూ నక్కలూ కూసుకుంటే పెద్దమనుష్యులు యెవరయినా నమ్ముతారా? నావంటి ఘరానాగల వారున్ను గొప్పదర్జాలో వున్నవారున్నూ యిటువంటి తుచ్ఛపు పనులు చేశారంటే యెవరునమ్ముతారు?

వ్యాఘ్రి— (తనలో) వీడిమాటలుచూస్తే నాకు వొళ్ళు మండుకుని వస్తూవున్నది. వీడిగొంతుక కాయ కొరికిపారవేస్తాను. వీడికి నిలువల్లా అబద్ధమే. వీడు మొదటినుంచీ మోసాలచేతనే జీవిస్తూ యిప్పుడు యీస్థితికివచ్చినాడు. దుర్మార్గం యెల్లకాలమూ సాగనియ్యకూడదు. మృగరాజంతటివాడికికూడా వీడివంచనవల్ల నక్కపోతుకు సేవచెయ్యవలసిన అవస్థవచ్చింది! (బిగ్గరగా) ఓసృగాలరాజా! నిన్ను దేవతలు స్వర్గానికి తీసుకని వెళ్ళినమాట నీవు రుజువుపరచవలెను. లేకపోతే నీరాజ్యం పోవడమేకాకుండా యింత మందిని మోసంచేసినందుకు నీకు తగిన శిక్షకూడాచేస్తాము.

సృగా—ఆమాటన్నారు బాగావున్నది. అదెంతసేపు? నిజమయిన సంగతి నిముషంలో స్థాపనచేసుకుంటాను. రేపటిదాకా వాయిదాయిస్తే ముప్పయిమూడుకోట్ల దేవతలనూ మీయెదుట నిలువబెట్టి వారిచేత మీకు సాక్ష్యంయిప్పిస్తాను. (తనలో) ఈగండం యిప్పుడు తప్పిపోతే యీరాత్రియెక్కడికైనా పారిపోతాను. బుద్ధిమంతుడికి యెక్కడకువెళ్ళినా లోపంవుండదు. పేరుమార్చి కొత్త వేషంవేస్తే మళ్ళీ కావలసినంతమందిని మోసం చెయ్యవచ్చును.

వ్యాఘ్రి—అలాగయితే రేపటిదాకా నిన్ను విడువకుండా మేమందరమూ నీవద్దనేవుంటాము. దేవతలను పిలిపించు.

సృగా—మీరు యిప్పుడు మీయిళ్ళకువెళ్ళి యీరాత్రి సుఖంగా నిద్రపోయి తెల్లవారినతరువాతరండి. మీరువచ్చేలోగా దేవతలనందరినీ యిక్కడ సిద్ధముగావుంచుతాను. నాయందు మీకీ అపనమ్మకంయెందుకు? నేను జిహ్వపడిపోయినా, అబద్ధమాడుతానండీ? దేవతలు రాకపోతే నామహిమలు మీకు ప్రత్యక్షంగా కనపడడంలేదండీ? దేవతానుగ్రహంలేని వట్టినక్కకు పులువంటి తేజస్సు వస్తుందంటే యెవరయినా నమ్మతగివుంటుందా? దేవతా

ప్రసాదంచేత నాకు వెనుకటి నక్కగుణాలన్నీపోయి నిజమయిన మృగరాజ లక్షణాలన్నీ వచ్చినవి. ఈసత్యం అనుభవంచేత మీకే తెలుస్తుంది. నాకిప్పుడు సెలవియ్యండి. ఈరాత్రి యిందర్రమంత్రం పురశ్చరణచేసి తెల్లవారేటప్పటికి దేవతలనందరినీ మీకు దాసులను చేసి మీగుమ్మాల యెదుట నిలువపెడుతాను. మంత్రజపానికి రహస్యస్థలం కావలెను.

గ్రామ—(రహస్యముగా) జంబుకేశ్వరశాస్త్రీ! వీడేమో తనవెనుకటినక్కగుణాలన్నీ పోయినవంటూవున్నాడు. ఇదేసమయం నీవు వెనుక చెప్పినట్టుగా వాడికేసితిరిగి కుయ్యడానికారంభించు.

జంబు—(రహస్యముగా) ఇదుగో నేనూఆప్రయత్నంలోనే వున్నాను. వీడు యెలాగయినా మాయమాటలుచెప్పి యీరాత్రి తప్పించుకుని పారిపోవడానికిచూస్తూయున్నాడు. నేను పోనిస్తానా? నాశక్తిచూడు. (అని మోరయెత్తి నృగాలమహారాజువంక తిరిగి కూయ నారంభించుచున్నాడు.)

నృగా—(తనలో) ఇప్పుడెన్నిమాటలూ చెప్పినా నాకు జాతి స్వభావం మళ్ళించుకోవడానికి శక్యంకాకుండావున్నది! (అని జంబుకేశ్వరశాస్త్రి కభిముఖుడై బిగ్గరగా కూయుచున్నాడు)

వ్యాఘ్రి—ఇప్పుడు యెన్నిబడాయలు కొట్టినా వీనినక్క చేష్టలు విడువనందుకు యిదే నిదర్శనముగావున్నది. ఇఖ నేను దీని మీదికి దుమికిచంపుతాను.

గ్రామ—శునకాచార్యులూ! వ్యాఘ్రేశ్వరుడు నోరు తెరుచుకొని నృగాలమహారాజుమీదికి యెలాగు దూకడానికి ప్రయత్నం చేస్తూవున్నాడో చూడు.

శున—అయిపోయింది. సృగాలమహారాజతని నోట్లో పడ్డాడు. తలవేరుగానూ మొండెం వేరుగానూ పడిపోయినవి.

వ్యాఘ్రి—ఓసింహసార్వభౌమా! మనము శత్రుసంహారముచేసి యికముందు యిటువంటిమోసం యెవ్వరూ చెయ్యకుండా అందరికి బుద్ధివచ్చేటట్టు చేసినాము. వెళుదాముర్రండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము.

25K

255

ప్రహ్లాద నాటకము

ఈ నాటకమునందు వచ్చుపాత్రములు.

హిరణ్యకశిపుఁడు:—రాక్షసరాజు.

విప్రజిత్తు:—హిరణ్యకశిపునిమంత్రి.

శంబరాసురుఁడు:—హిరణ్యాక్షుని కుమారుఁడు.

అలంబసుఁడు, దుర్ముఖుఁడు } రాక్షసభటులు

దితి:—హిరణ్యాక్ష హిరణ్యకశిపులతల్లి.

నారదుఁడు:—బ్రహ్మఋషి.

లీలావతి:—హిరణ్యకశిపునిభార్య.

ప్రహ్లాదుఁడు:—హిరణ్యకశిపుని కుమారుఁడు.

ఇంద్రుఁడు:—దేవరాజు.

వరుణుఁడు, కుబేరుఁడు, యముఁడు } దిక్పాలకులు.

బృహస్పతి:—దేవగురువు.

జయంతుఁడు:—దేవేంద్రుని కుమారుఁడు.

జమదగ్ని, భరద్వాజుఁడు } ఋషులు.

చిత్రరథుఁడు:—గంధర్వుఁడు.

చండామార్కుఁడు:—శుక్రపుత్రుఁడు; ఉపాధ్యాయుఁడు.

త్రిలోచనుఁడు, కాలనాభుఁడు } బడిబాలురు.

నృసింహమూర్తి:—నరసింహరూపమున నుద్భవించిన విష్ణువు.

మునులు, ద్వారపాలకుఁడు, పాములవాడు మొ.

ప్రహ్లాదనాటకము

ప్రథమాంకము

రంగము—సభామందిరము.

(పీఠముమీదఁ గూరుచుండి హిరణ్యకశిపుఁడును, విప్రజిత్త్యాది మంత్రులును, శంబరాది భ్రాతృతనయులును, పరివారమును ప్రవేశించుచున్నారు.)

విప్ర—ఓహిరణ్యకశిప మహారాజా! దేవరవారు సెలవిచ్చినది సర్వజన శ్లాఘాపాత్రముగా నున్నది. మీరు సత్వరముగా యుద్ధయాత్ర వెడలి ముల్లోకములును జయింపవలసినదే.

హిర—ఓయివిప్రజిత్తీ! బుద్ధియందు బృహస్పతినిమించిన నీవంటి మంత్రియొక్క మంత్రబలమును, వీరాధివీరుఁడయిన హిరణ్యాక్షునివంటి తమ్మునియొక్క బాహుబలమును, సహాయములయియుండఁగా నాకీముల్లోకములనే కాదు సహస్రలోకములనయినను జయింపఁగలుగుట యెంతపని?

విప్ర—దేవరవారి మొగముముందఱ శ్లాఘింపవలసినది గాదు. కాని, తలఁచుకొన్నయెడల అసహాయశూరులయిన దేవరవారొక్కరే కోటిలోకములయిన క్షణమాత్రమున గోటమీటి వేయుసమర్థులు. ఏదీ మీరుదండయాత్ర వెడలిరన్న వార్త చెవినిబడినప్పటి నిద్రాహారములు

మానిపరితపింపక యేయింద్రులును గింద్రులును దేవరయెదుర ప్రతి ఘటించి నిలుతురో మాతము. మీతమ్ముఁడుహిరణ్యాక్షుఁడును నిరుప మానమైన పౌరుషముచేత మీకు గోరంతయు తీసిపోవువాఁడు కాడు. అతనిపేరు తలంపునఁ బాటినమాత్రమున భూపాలకులమాట యేటికి సమస్తదిక్పాలకులును గుండెలు తల్లడిల్ల వడవడ వడఁకుచుందురు. మీయాజ్ఞయైనచో, యతఁ డొక్కఁడే వంటెత్తి యురనిమేషములో సమస్తలోకపాలురనుగొని తెచ్చి మీపాదాక్రాంతులను జేయఁగలఁడు.

హిర—అతని శౌర్యసంపద అంటువంటిదే. నాయెడలఁగల భ్రాతృస్నేహముచేత భూమిని చాపగా చుట్టమన్నను, వెనుకదీయక, అసాధ్యములయినను నిమిషములో సాధ్యములు చేయఁగలఁడు. అటు వంటిశూరాగ్రేసరునిబలదర్పములుమనకుతోడయియుండఁగా, ఒక్క మూడులోకముల జయించిన మనకేమి ప్రతిష్ఠరాఁగలదు? చతుర్దశ లోకములను గెలిచినను మనకేమి పౌరుషము? ఆహా! బుద్ధిహీను డయిన బ్రహ్మదేవుఁడు మనవంటి అసాధారణ విక్రమధౌరేయులు పుట్టుదురని యెఱిఁగి అనంతకోటి లోకములను చేయఁడయ్యెనుగా? అవునోయి శంబరమహారా! ఆబ్రహ్మదేవుని బుద్ధిహీనతను గూర్చి నీవేమి తలఁచెదవు?

శంబ—(తనలో) ఆహా! రాజులయానకెన్నఁడును మేరలేదు గదా? యోగులు మూడుమూరలభూమి లభించినను సంతుష్టిపొంది యుందురు; రాజులు మూడులోకములు లభించిననుసంతుష్టిపొందరు. (ప్రకాశముగా) ఓదేవా! ముదిమివచ్చినప్పుడెంతవారికినిమతులునిలు వవుగదా? బ్రహ్మదేవుఁడు లోకపితామహుఁడయిన పరమవృద్ధుడగుట చేత ముందు దేవరవంటి శౌర్యధుర్యు లుద్భవింతురన్నఆలోచనలేక లోకకోటులనుసృష్టింపమరచియుండును, ఆకులవృద్ధునిమరపుమన్నించి

మనమిప్పటి స్వర్గమర్త్యపాతాళలోకములు మూటితోనే తృప్తి నొందవలయును.

హిర—ఓయిముగ్ధుఁడా! కశ్యపవంశమునఁబుట్టి యిట్టివిండిన సభలో నాముందర ఎంతపౌరుషహీనమయినపలుకు పలికితివి! నీతండ్రి హిరణ్యాక్షుఁ డీమాటవిన్న తానెంత చిన్నపోవునో! సింహముకడు పున లేడిపిల్లపుట్టినట్లు అంతపౌరుషశాలికడుపున నీవంటి సాధు చిత్తుఁడుపుట్టుట సాధ్యమగునా? "అసంతుష్టా ద్విజానష్టా సంతుష్టా ఇవపార్థివా" అన్నవాక్యమును నీవు వినియుండలేదా? కుమారకా! ఉన్నదానితోనే రాజులు తృప్తినొందవలెనన్న నీమాటవిన్నచో, ఇప్పుడు రాజనీతి నభ్యసించుచున్న నీతోడి రాక్షసబాలురు నవ్వరా?

శంబ—ఓశౌర్యనిధీ! ముల్లోకములతోసంతుష్టి పొందవలెనన్న మాత్రముచేత నాయందు పౌరుషమునకు కొఱంతగలదని లేశమును భావింపఁబోకుము. మనకులమునకు మూలపురుషుఁడయి, కశ్యపునకు పితామహుఁడయి, మీకు ప్రపితామహుఁడయి, నాకు ప్రప్రపితామహుఁడయిన బ్రహ్మదేవునియొక్క లోపమును వెల్లడిచేయఁగూడదని అతనియందలి గౌరవముచేత నట్లంటినేకాని, ఆబ్రహ్మదేవుఁడే అన్యుఁడయ్యెనా మీరు బుద్ధిహీనుఁడని వట్టిమాటలతో సరిపెట్టితిరి కాని నేనయిననో నిజముగా నాకార్యములచేతనే ఆముదివేల్పునకు బుద్ధి చెప్పియుందును. "నీచోవదతినకురుతే నవదతికురుతేసజ్జనః" అన్న ఆర్యవచనము తాము విన్నదేకదా? నీచులు చెప్పుదురు గాని చేయరు. సజ్జనులు చేసి చూపుదురుగాని చెప్పనేచెప్పరు. నాభుజ వీర్యము, శౌర్యము, ధైర్యము, కార్యము వచ్చినప్పుడు మీరే చూచి మెచ్చుకోవలెనుగాని నేనిప్పుడు చెప్పనొల్లను.

హిర—ఔరా! కుమారకా! మాకు బుద్ధి వచ్చునట్లు ప్రత్యుత్తరము చెప్పితివిరా! నీబంధు వాత్సల్యమునకును సౌశీల్యమునకు నేను పరమానంద భరితుఁడనయినాఁడను. దితి కన్నకొడుకున కెన్నఁడయిన విక్రమహీనుండు పుట్టనేర్చునా? నేనిప్పుడు నీపౌరుషవాక్యములను బట్టి లేడికడుపుననే సింహముపిల్ల పుట్టినదని సంభావించెదను. అయ్యో! ముద్దుకుమారుని కర్ణరంజకములయిన ప్రతాపోక్తులువిని సంతోషించుటకిప్పుడు హిరణ్యాక్షుఁడు లేకపోయెనుగా!

(అప్పుడు ద్వారపాలకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

ద్వార—మహాప్రభూ! నమస్కారము. అలంబసుఁడురోఁజుచు పరుగెత్తుకొనివచ్చి దేవరవారితో ఏదో అవ్యవధానముగా మనవిచేయవలసినపనియున్నదని మొగము వ్రేలవేసుకొని గ్రుడ్లనీరు క్రుక్కుకొనుచు వాకిట నిలిచియున్నాఁడు. సెలవయ్యెనేని, ఏలినవారి సన్నిధానమునకు వానినితీసుకొనివచ్చెదను.

హిర—వెంటనే తీసుకొనిరమ్ము.

ద్వార—చిత్తము మహాప్రభూ! (అని పోవుచున్నాఁడు.)

హిర—విప్రజిత్తీ! ఇప్పుడలంబసుని విచారమునకు కారణమేమయియుండును? మనకేమి కీడుమాట వినవలసి వచ్చునోకదా? యెందుచేతనో కాని యిప్పుడు నాయెడమకన్నును భుజమును అదరుచున్నవి. అలంబసుఁడీయుదయకాలమునమనహిరణ్యాక్షునివెంట వేటకయి బోయినవాఁడు. అడవిలో ఘాతుక మృగములచేత నాతమ్మునికేదయిన అపాయము కలిగియుండదుకదా!

విప్ర—మృగమాత్రముచేత హిరణ్యాక్షునకు హానికలుగునని దేవరవారు స్వప్నావస్థయందునుతలఁపకుఁడు. ఒక్కఘాతుకమృగము కాదు; ముప్పదిమూడుకోట్లదేవతలొక్కమొత్తముగావచ్చి మీఁదబడి

నను నీతమ్ముని సిగపువ్వ్రాలెంపఁజాలరు. గొఱ్ఱెపిల్ల కోపదీపితంబగు సింహమును వధింపగలిగి నప్పుడును, లేడిపిల్ల బొబ్బలిడు బెబ్బులిని మ్రింగఁజాలినప్పుడును నీతమ్ముని ఘాతుకమృగమునొక వేళనొప్పింపఁ గలుగునేమో కాని అందాకకలుగనేరదు.

హిర—అట్లయిన, క్రూరులయిన దేవతలు సమయము వేచి ఘోరారణ్యములో ఒంటిగా సంచరించుచున్న నాతమ్ముని జ్ఞాతిద్వేషముచేత చుట్టుముట్టి చిక్కుపఱిచి యుందురేమో!

విప్ర—ఎలుకపిల్ల లొకపదిలక్షలువచ్చి పయినిబడినను గండుపిల్లిని బంధింపఁజాలునా? పిఱికిపందలయిన దేవతలెక్కడ? శౌర్యనిధియైన మీతమ్ముడెక్కడ? వారు మీతమ్ముని జిక్కుపరచుటెక్కడ? మీతమ్ముడు సాయంకాలమునకు కావలసినంత వేటమాంసముతో సుఖముగా యింటికి వచ్చిచేరును. మీరు లేనిపోని వ్యసనము పెట్టుకొకుఁడు. అలంబసుఁ డెవ్వనిచేతనో తన్నులుతిని దేహమునొవ్వ నేడ్చుచు దేవరవారితో మొఱ్ఱపెట్టుకొనుటకయి వచ్చియుండును.

అలం—(ప్రవేశించి శోకగద్గదస్వరముతో) స్వామీస్వామీ! నమస్కారము. ఏలినవారి—(అని వడఁకుచున్నాడు)

హిర—అలంబసా! మాకడనీ వేమియుభయపడక మాబంటవై నీకెవ్వ రేయపాయము చేసినారో చెప్పు. మాపాలసేవకుఁడయిన నీ మనస్సునొప్పించి నేఁడుయమపురమునకు దారిచేసికొన్నవాడెవ్వఁడు?

అలం—(భయోత్కంపముతో) చెప్పుటకునోరాడదు. ఏమని చెప్పుదును? ఓపాపపుదైవమా! ఈపిడుగువంటి దుర్వార్తను ఈ మహారాజుగారి చెవినివేసి హృదయము పగిలింపుటకు ముందుగా నాచేతనె వ్రాసిపెట్టితివా?

హిర—ఓయీ! అప్రియవార్త చెప్పవలసివచ్చునని శంకింపక జంకుమాని చప్పున చెప్పివేయుము. నీవుచెప్పక ఆలశ్యము చేసినకొలఁదిని మామనస్సునందు సంతాప మధికమగుచున్నది.

అలం—(పాదములమీదబడి) అడవిలో తమసోదరునితోఁ గూడ ప్రాణములు విడువక రాతిగుండె వహించి దుర్భరమయిన యీశోకవార్త వింతమారము తీసికొనివచ్చి మిమ్ముకూడ దుఃఖసముద్రములో ముంచునంతటి పాపమునకొడిగట్టుకొన్న పాపాత్ముఁడనయిన నన్ను పాపమునక సంహరించి నామనోవేదనమును పోఁగొట్టుడు.

హిర—హా! భ్రాతా! హా! లోకైకవీరా! హా! అసహాయశూరా! నీవింతబలఁగము గలవాఁడవయ్యును మహారణ్య మధ్యమున దిక్కుమాలి యేకాకివయి ప్రాణములువిడువవలసిన వాఁడవయితివా? ఘోరశత్రువులు వెనుకపాటునపలువురుపై బడి చేయూడనీయకగదలతోను ఖడ్గములతోను నిన్నుపడనడిచినప్పుడు అన్నినయిననన్ను తలచుకొని యెంతవిలపించియుందువో? అట్లేమరుపాటున పయిఁబడక శత్రువులు నీయెదురనిలిచి ధర్మయుద్ధము చేసియుందురేని, లక్షలనైనను కోట్లనయినను మదపుటేనుఁగుకాలికింద చీమలనునలుపునట్లు నలిపివేసియుండవా? నీశౌర్యవైభవము నేనెఱుఁగుదును. ఏమరుపాటునవచ్చి చుట్టుముట్టినను నీవెందఱినో మట్టుపెట్టి భూమికిబలిపెట్టక ప్రాణములువిడిచియుండవు. అలంబసా! నాముద్దుతమ్ముని దొమ్మిచేసి చంపిన పాపాత్ములెవ్వరో ముందుగా వాక్రువ్వుము. ఆచంపిన దుష్టాత్ముడు ప్రళయకాల రుద్రుఁడైనను వానినినాచేతులకసికీఱపొట్టచీల్చి చంపి భూమిమీద రక్తనదులను ప్రవహింపఁజేసి, వానిభార్యల కన్నీటితో నాసోదరునకుదకప్రదానము చేసినదాఁక నాకోపము దీఱదు.

శంబ—(ఏడ్చుచు) ఆలంబసా! నాతండ్రిని పొట్టబెట్టుకొన్న యాదురాత్ముఁడెవ్వఁడో వేగిరము చెప్పుము. వాఁడు చేపవలె నీటిలో

చొచ్చినను, తాబేలువలె కాలు చేతులు ముడుచుకొని కొండక్రింద నడఁగినను పందివలె గుహలు దూఱినను వెదకిచంపి నాతండ్రి ఋణము తీర్చుకొనెదను.

అలం—అయ్యా! ఒక్కమూషపంది యెక్కడనుండియో బాణమువలె వచ్చి మీఁదబడి కొమ్ముతో పొడిచి మీతండ్రిని నేల పాలు చేసినది.

హిర—పందియేమి? సోదరుని పొడిచి పడవేయుట యేమి? అట్లుజరగదు. ఇవి పట్టి మతిమాలిన మాటలు.

అలం—దేవర పాదములతోడు, నామాట రూఢిగానమ్ముడు. నడిగొండవలె ఒక యడవిపంది యెక్కడనుండియో ఆకస్మికముగా వచ్చి మీసోదరునిమీఁదపడి వజ్రాయుధముకన్నను వాఁడియైన కొమ్ముతో కొట్టగా నేను నాకనులార చూచినాను. ఆదెబ్బతో హిరణ్యాక్ష మహారాజు నేలమీఁదనిరుచుకొనిపడి, కొండనుండిపాలు సెలయేఱులవలె దేహమునుండి రక్తధారలుకార విలవిల తన్నుకొన సాగెను. అది యెక్కడిపందియో కాని సామాన్యపు పంది కాదు.

విప్ర—ఈమూషకుఁడు తప్పక్రాగి వచ్చి తప్పుడుమాటలు పలుకుచున్నాడు. మీరు వీని మాటలు పాటిగాఁ బట్టఁబోకుడు.

హిర—వీనికన్ను లెఱ్ఱగా నున్నవి; శరీరమువడఁకుచున్నది; మాటతడఁబడుచున్నది. వీఁడుక్రాగివచ్చినట్లే కానుపించుచున్నది.

ద్వార—(ప్రవేశించి) స్వామీ! మన యువరాజుగారితో వెళ్ళిన దుర్ముఖుడువచ్చి దేవర సమ్ముఖమున విన్నవింపవలసినదేదో యున్నదని వాకిట నేడ్చుచు నిలవఁబడి యున్నాఁడు.

హిర—వానిని శీఘ్రముగా తీసికొనిరమ్ము.

అలం—నామాట నమ్మరేని నాకంటెముందుగా బయలు దేఱిన యీ దుర్ముఖుని నడుగుఁడు. ఆమాయ వరాహముపోటుచేత

మొదలు నరికిన తరువువలెనే మీసోదరుఁడు నేలకూలఁగానే వెంట నున్న భృత్యులందఱును రాతిమీదకొట్టిన గాజుపెంకులవలె నానా ముఖముల చెల్లాచెదరై ప్రాణభీతిచేత పాఱిరి.

దుర్ము—(ప్రవేశించి) స్వామీ! నమస్కారము. మాప్రభువు హిరణ్యాక్షమహారాజు.....(అని యేడ్చుచున్నాఁడు)

శంబ—హా! తండ్రీ! (అని పీఠముమీఁద సోలుచున్నాఁడు)

హిర—నేను వినలేను, హిరణ్యాక్షున కెంతముప్పు సంభవించినది; అతడూపిరితోనున్నాడా? హా! సోదరుఁడా! (అని మూర్ఛపోవుచున్నాఁడు)

విప్ర—(శైత్యోపచారము చేయుచున్నాఁడు)

అలం—(దుర్ముఖు నీవలకులాగి రహస్యముగా) దుర్ముఖా! నీవుభయపడి నాకంటె ముందుగానే పరుగెత్తుకొనివచ్చితివే. ఇంత జాగేల చేసితివి?

దుర్ము—(ఏకాంతముగా) నేను నీవలెభయముచేత పరుగెత్తుకొని పోలేదు. నాయేలినవారికి సంభవించిన విపత్తును ముందుగా హిరణ్యకశిప మహారాజుగారికి నివేదించి యీప్రభువునక్కడకుతీసుకొని పోవలెననికొంతదూరము పరుగెత్తుకొనివచ్చితిని. కాని యేలిన వారట్టి దురవస్థలో నుండఁగా విడిచివచ్చుట భృత్యధర్మము కాదని, యింతలో మరలతలఁచుకొని, 'నాస్వామిప్రాణములుగొన్న యావరాహముచేతచచ్చి స్వామితోడ స్వర్గలోకసుఖమైనను అనుభవింపపోవలెను' అను నిశ్చయముతో నేచుమరల వెనుకకుపోయితిని. ఆపాడుపంది యెక్కడమాయమయ్యెనో కాని యెంతవెదికినను కనఁబడలేదు.

అలం—(రహస్యముగా) నీవు పాఱుఁబోతవయి ఆపందితల నఱకలేకపోయితివిగాని, నేనాపందితలను నాచేతిలోనియీఖడ్గముతో

ఒక్క వేటున రెండు ఖండములుగా ఖండించి స్వామియెడ ఋణ ముక్తుడనయి నీకంటె ముందుగానే ప్రభువువారికీవార్త తెచ్చి విన్నవించినాడను.

దుర్మ—నీవు నఱికినప్పు డాపంది జీవముతో నున్నదా?

అలం—అది మన హిరణ్యాక్ష మహారాజుగారి యీటెపోటు తినికాబోలు నేనువచ్చుతోవలో చచ్చినట్లు కదల మెదలక పడి యున్నది. కాని నేనీకత్తితో నఱకగానే కదలి మొండెమొక ప్రక్కకును తలయొక ప్రక్కకును పోయినది.

దుర్మ—(రహస్యముగా) సరిసరి! ఆపంది మీముప్రొద్దున వేటాడి పొగడచెట్టుక్రింద చంపిపడవేసినదే. నేనిప్పుడు వచ్చు నప్పుడు దాని తలనఱికి యుండగా చూచి, ఆపని యెవ్వరు చేసి యుందురా అని సందేహపడితిని. అది నీపనియైనట్లిప్పుడు తెలిసినది. నీవు చచ్చినపందిని నఱికినపోటుబంటవు.

అలం—మెల్లగామాటాడు. ప్రభువులు మూర్ఛతేరుచున్న ట్లున్నారు.

దుర్మ—నేనింతకంటె మెల్లగా ఏకాంతమాడలేను. నన్నెవ్వ రైన మెల్లగా మాటాడుమని బోధించినపక్షమున, నిద్రపొమ్మని భేరీని జోకొట్టినట్లగును.

అలం—నీవిప్పుడు మఱింత బిగ్గరగా మాటాడుచున్నా వేమి పాపము? ఊరుకో వారికి వినబడునేమో! నేను చచ్చినపందిని పొడ చిన పోటుబంటనయితే, నీవు పందిపాఱిపోయిన తఱువాత తఱుము కొనిపోయిన పెద్దబంటవుకావా!

విప్ర—ఓతాగుబోతులారా! మీరు మీలో నేమో గుస గుస లాడుచున్నారు. రాజు గారికి తెలియవచ్చుచున్నది. వృథా శ్రమ కలుగచేయక, నిజముగా హిరణ్యాక్ష మహారాజు వరాహము చేతనే సంహరింపబడెనేమో చెప్పుడు.

అలం—నా ప్రమాణపూర్వకముగా వరాహముచేతనే చంపబడినాడు.

దుర్ము—వరాహముచేత చంపబడుట సత్యమే.

హిర—(మూర్ఛతేరి నిట్టూర్పువుచ్చి) హా! తమ్ముడా! సింహశతముల నవలీలగా చంపినవానికి చెవులపిల్లిచేత చావవలసిన గతి పట్టినదిగదా! హా! నాముద్దుకుక్కా! నిన్ను బాసి నాప్రాణము లెట్లునిలుపుదును?

శంబ—హా! తండ్రీ! తొడమీద కూర్చుండబెట్టుకొని తల నిమిరి నన్నెవ్వరింక ముద్దుపెట్టుకొందురు? నాకిక రాజనీతులు బోధించి బుద్ధులుచెప్పువారెవ్వరు? నాశరీరమించుకంత నొచ్చిన వేయివిధముల పరితపించి మందులు మాకులు వేసి నన్నిక ఆదరించువారెవ్వరు? హా! తండ్రీ! హా ప్రియజనకా! దిక్కుమాలిన నన్నును నాతల్లిని నీ వెవ్వరికొప్పగించి పోయితివి?

హిర—ఓశంబరా! ఇంక మాతండ్రిని నేనెట్లు తేనేర్తును? తండ్రిపోయిన బిడ్డలను మిమ్ముఁజూచి దుఃఖమెట్లు సహింపనేర్తును?

విప్ర—ఓమహారాజా! శంబరాదులనోదార్చి వానికి బుద్ధి చెప్పి దుఃఖముడుపవలసిన మీరే యీప్రకారముగా వాపడిచి యేడ్చుచు తండ్రిపోయిన బిడ్డలను మఱింత అడలఁబెట్టుట మీవంటి వివేకులకు తగునా? మీకుగల ధీరత్వ మిప్పుడెక్కడకు పోయినది? ఆపదలు వచ్చినప్పుడే ధైర్యము లేకపోయినయెడల, ఆధైర్యము మఱియెప్పటికి? పోయినవారి నిమిత్తమయి అజ్ఞానివలె చింతించుట మీకుతగునా? ఎక్కడితమ్ములు? ఎక్కడియన్నలు? ఎక్కడిబంధువులు ఏటిలో కొట్టుకొనిపోవు కట్టెలవలె కాలవశముచేత నొకచోట కూడుకొని కొంతదూరము కలిసియుండి కాలవశముచేత మరల విడిపోవుచుందురు. కాబట్టి పోయినవారికయి చింతపడవలసిన పనిలేదు. మీతమ్ముని సంహరించినవాడు మీ మీవరహా

రూపుడయివచ్చిన కేవల విష్ణుమూర్తిగాని మఱియొకడు కాడు. సామాన్యవరాహమున కెప్పుడును హిరణ్యాక్షునిబోలిన జగద్విఖ్యాత సత్త్వుని వధించునంతటిబలముకలుగనేరదు. మనము శివభక్తులమగుట చేత ద్వేషముపూని మనరాక్షసకులమును విష్ణుడెప్పుడును బహు విధమాయోపాయముల చేత వెదకి చంపుచుండును. చేతనయినచో నీవాతనిపగ సాధించు ఉపాయము చింతింపుము.

హిర—అవునోయివిప్రజిత్తీ! నీవుతత్త్వమును బహుచక్కగా కనిపెట్టినావు. నాతమ్ముని మట్టుపెట్టినపాపాత్ముఁడు తప్పక విష్ణుడె. సందేహము లేదు. (రోషముతో) మగటిమికలవానివలె ఎదుటనిలిచి యుద్ధము చేయక పందివలెచాటునుండివచ్చి పొడుచుట విష్ణువున కేమి పౌరుషము? నాయెదుటఁబడక అదృశ్యుఁడయి యిప్పటికిబ్రతికిపోయి నాడుగాని, ఒక్కసారి నాకన్నులయెదుటఁబడినపక్షమున విష్ణునిగిష్ణుని నాకత్తికి బలియియ్యనా? అదిగో అంతఃపురములో పుత్రమరణవార్త తెలిసికాబోలును మాయమ్మ దితిదేవి పుత్రశోకముచేత ఱొమ్ము మోదుకొని విలపించుచు సభామందిరమువంక వచ్చుచున్నది.

[అప్పుడు దితి ప్రవేశించుచున్నది]

దితి—హా! పుత్రకా! హా! తండ్రీ! నీతల్లిని నన్ను దుఃఖముల పాలుచేసి యీలోకమును విడిచిపెట్టి నీవుమాత్రము స్వర్గలోకసుఖ మనుభవింపపోతివా? ప్రాణసమానుడైన కొడుకుపోయెనని వినియు నాప్రాణములు బొందిని బాయకున్నవి! నేనెంత కఠినచిత్తురాలను! పిడుగువంటి యీదుర్వార్త నాచిత్తము సోఁకియు గుండెలు పగుల కున్నవి! ఓయీశ్వరుడా! నీవు నాగుండెలు రాతితోనో యినుము తోనో చేసియుంచువు. నేనింకనుఎటువంటికష్టములుచూడనోచియో, యింతటి యాపదవచ్చియు బ్రదికియున్నాను. అన్నా! హిరణ్యాక్షా!

ఈనీకొడుకులను నీయన్నను నన్నును ఎవ్వరి కప్పగించిపోయినావు! మాకుదిక్కెవరు!

హిర—అమ్మా! నీవు శోకముమాని ఊఱడిల్లుము. చచ్చిన వానికయి వగచిన కార్యమేమి? నీవు వేయేండ్లుమఃఖపడినను పోయిన కొడుకు మరల లేచిరాడు. ఈబ్రతికియున్నవారిని చూచి దుఃఖము మ్రింగికొమ్ము. ఎక్కడనుండి వచ్చెనో అక్కడికిపోవుట ప్రాణికోటి నైజము. ఎవ్వరును శాశ్వతముగా బ్రతుకువారు లేరు. మనమును ఎప్పుడో ఉన్నట్లేయుండి ప్రాణములు విడుతుము. అందఱికిని చావు సామాన్యమేయయినను, అజ్ఞానముచేత మనమే మో చావనివారమై నట్లు చచ్చినవారి నిమిత్తమయి యేడ్చుచుందుము. ఓ వెఱ్ఱితల్లీ! నీవు పోయిన కొమారుని తలఁచుకొని యేడువవలసినపని యేమున్నది? ఎన్నాళ్లుబ్రతికినను చావెప్పుడయినను ఉన్నదే. భూమిమీద జన్మ మెత్తినతరువాత రాజయినవాడు యుద్ధభూమియందు వైరివీరులను నిర్వక్రపరాక్రమముతో గెలువనయినను గెలువవలెను; లేదా ఱొమ్ము గాయములతో చచ్చి వీరస్వర్గమునైనను పొందవలెను. నీకొడుకు బ్రతికిన దినములలో సకలరాజులను ఘోరయుద్ధములో జయింపను జయించెను; కడపట ఱొమ్ముగాయముతో చచ్చి వీరస్వర్గమును చూఱగొనెను. ఈరెండును పొందినవానినిమిత్తమయి యేల ఖేద పడియెదవు? అమ్మా! నీవుశోకముమాని అంతఃపురములో శోకించు చుండు నీకోడండ్రకు శోకోపశమనము చేయుము.

దితి—నాయనా! హిరణ్యకశిపా! నీమాటలచేత నాదుఃఖము శాంతిపొందినది. అయినను కారణమేమో తెలియదుకాని నామనస్సు లోని పరితాపమడఁగకున్నది. పుత్రశోకముస్వాభావికము. ఎంత తీసి వేసికోవలెనని ప్రయత్నముచేసిననుపోదు. ఎప్పుడును చావనికొడుకు లను కనుటకయి అదితియేమితపస్సుచేసినదో! నాయనా! కోడండ్ర

దుఃఖమును మాన్పుటకయి నేనంతఃపురమునకు పోయెదను. నీవును శంబరాదికుమారుని వెంటబెట్టుకొనివచ్చి నీతమ్మునికి దహనాది సంస్కారములకు ప్రయత్నింపుము. (అనివెళ్ళుచున్నది.)

హిర—విప్రజిత్తీ! హిరణ్యాక్షుఁడు పోవుటచేత నాకిప్పుడు కుడిభుజము పడిపోయినట్లున్నది. నేనిప్పుడసహాయుఁడనయి ఱెక్కలు తెగిన పక్షివలె నయినాడను. మాఅమ్మయిప్పుడుతపస్సుమీఁదట్టిప్పకముచేసినది. తపస్సుచేత సాధింపరాని కార్యము లేవియులేవు. పూర్వము మనపెద్దలుతపస్సుచేసియేసర్వార్థసిద్ధులనుపొందినవారు. నేనిక ఈహిరణ్యాక్షుని ఉత్తరక్రియలుజరపఁగానేసుందరగిరికితపస్సునిమిత్తమైపోయెదను. నేను తపస్సిద్ధిపొందివరములనుగైకొని వచ్చిన మీదట మనము సమస్తశత్రువులను సాధింతము. నేను తపస్సునకు పోయియుండుకాలములో నారాజ్యభారమునంతను ఈశంబరునియందు నిలిపెదను, నీవెట్లీతనికి సహాయుడవై నేనులేని లోపము లేశమును లేకుండ రాజకార్య భారమును నడపెదవో!

విప్ర—దేవరవారి యనుగ్రహముండఁగాయేవిధమయినలోపమును రాదు. మనశంబరుని మీరూఱుగాఁజూచుకొనుచుమీరుస్వయముగా ఉండి చూచుకొనుచున్నట్లే రాజ్యభారమునునిర్వహించెదను.

హిర—ఇంట చూలాలు లీలావతి యుండునుసుమా! దేవి నెట్లాదరించి నావియోగదుఃఖమామె లేశమును పొందకుండునట్లు విచారించెదవో?

విప్ర—దేవిగారిని మాకన్నతల్లినిగాభావించుకొని, వారికినమస్తోపచారములను నడపించుచు, మాచేతనయినంతవరకు మీరులేని లోపమేదియు కనఁబడకుండఁ జేసెదము.

హిర—శంబరకుమారుఁడు రాజకార్యములందంతగా అనుభవశాలి కాఁడు. సామదానాద్యుపాయము లెవ్వరియం దేప్రకారముగా

ప్రయోగించవలెనో యీతనికి చక్కగాబోధించి, మంత్రివై యుండి యు సమస్తకార్యములును నడిపింపుము—ఓశంబరా! నీవీవిప్రజిత్తి యాలోచనయందు గౌరవముంచి, నేను తపస్సుచాలించి, మరల వచ్చుపర్యంతమును ఇతని యాలోచనప్రకారము నడుచుచుండుము.

శంబ—దేవరయాజ్ఞను శిరసావహించి చేసెదను.

హిర—ఓయివిప్రజిత్తీ! దేవతలెప్పుడును మనకు విద్వేషులు. ఆగర్భశత్రువులనుండి ఉపద్రవమేమియు పుట్టకుండ నీవప్రమత్తుడవయి యంతఃపురమును రాజధానిని సహస్రముఖముల రక్షింపుచుండవలయునుజుమీ! యేమో చెప్పితివని అశ్రద్ధచేయక నీవుబహు జాగరూకుడవయి యుండవలెను.

విప్ర—ఈసంగతి దేవరవారు నాకు వేఱే శలవియ్యవలెనా? నేనొక కన్నెప్పుడును దేవతలమీఁదనే వేసియుంచెదను. వారికి విష్ణుదేవుఁడు ప్రాపకుడు. అతఁడెప్పుడేమి మోసముచేయునో యని మాత్రము నామనస్సు సందేహపడుచున్నది.

హిర—విష్ణువు పేఁరుచెప్పిన నాయొడలు మండుచున్నది. అతనిని రూపుమాపి నాసోదరుని చంపినపగ సాధించువఱకు నాకు నిద్రపట్టదు. అతనిని చంపుదమన్నను రూపము కనఁబడదు; వెదుకుదమన్నను ఉన్నస్థలము తెలియదు. అతఁడు యజ్ఞములయందును, స్వాధ్యాయములయందును, బ్రాహ్మణులయందును, ఋషులయందును, విష్ణుభక్తులయందును, ఉండుననిచెప్పుదురు—ఓరాక్షసులారా! మీరిప్పుడే నాయాజ్ఞను శిరసావహించిపోయి యజ్ఞములు పాడుచేసి, తపస్సులు చెఱిచి, స్వాధ్యాయములు దగ్ధముచేసి, బ్రాహ్మణులనుజంపి, మౌనులను భంగపరచి, విష్ణుడొక్కసారిగా నశించునట్లు భూమియంతయు కోలాహలము చేసిరండు పొండు.

దుర్ము—చిత్తము మహాప్రభూ! (రాక్షసులందఱును పోవుచున్నారు)

శంబ—(తనలో) కోపావేశముచేత పరవశులయియున్నవారి కుచితానుచితవివేక ముండదుగదా! పాపము! ఈయన తనతముఁడు చచ్చినాడన్న రోషముచేత నిష్కారణముగా సాధువులను బాధ చేయ బంపుచున్నాఁడు.

హిర—ఓయీ! శంబరా! మీతండ్రికి ప్రేతసంస్కారము చేయవలెను. మనముపోదము రా. విప్రజిత్తీ! నీవుకూడవచ్చి కావలసిన పరికరములను సిద్ధముచేయింపుము.

విప్ర—చిత్తము. (అందఱును పోవుచున్నారు)

ద్వితీయాంకము

రంగము—సభామందిరము

[అలంబసుఁడును, దుర్ముఖుఁడును ప్రవేశించియున్నారు]

అలం—ఓరీ దుర్ముఖా! మొన్న దేవేంద్రుఁడు మన మహారాజుగారు తపస్సునకు వెళ్ళినకాలములో మనపట్టణముమీఁదికి దండెత్తివచ్చి నగరుచూఱగొని, రాణీగారిని చెఱగొని పోయినప్పుడు నిన్నుఁ జంపినారన్నారే నిజమేనా?

దుర్ము—నేను చావలేదు. బహురాక్షసులు ఘోరయుద్ధము చేసి చచ్చినప్పుడు శూరాగ్రేసరులలో నన్నొక్కనినే దేవతలుచంపలేకపోయినారు. అంతఘోరయుద్ధము జరిగినప్పుడు శంబరవిప్రచిత్త్యాదులకయినను కాయములనిండ గాయములుతగిలినవి కాని నాశరీరము మీఁద ఒక్కగాయమైనను తగులలేదు. ఇది మహావిచిత్రము కాదా?

అలం—ఈవిచిత్రమునకేమిగాని నీవిప్పుడు చచ్చినావో లేదో నిజముగా చెప్పు. నేనిప్పుడునీతో పరియాచకమాడుచుండలేదుసుమా. అబద్ధమాడిన పక్షమున మనప్రభువు పాదములతోడు నిజముచెప్పు.

దుర్ముఖ—నేను నిజముగానే చావలేదు. కావలసిన పక్షమున ఈసంగతి న్యాయసభలో వేయి ప్రమాణములుచేసి చెప్పఁగలను. నిన్ను చంపుకొన్నట్టు సత్యముగా నేను చావలేదు. నీయెదుట నేను ప్రత్యక్షముగా నిలుచుండి మాటాడుచు స్వయముగా చెప్పుచుండఁగా నామాట నీవేల నమ్మకున్నావు?

అలం—నీమాటయందు నాకునమ్మకములేదు. నీవీవఱకబద్ధములాడి నన్నెన్నిసారులో మోసముచేసినావు. ఈమాటలుకూడా పెనుమోసమయియే యుండును. నీవెక్కడను కనఁబడలేదు. చచ్చితివని నాతో విరోచనుఁడు చెప్పినాఁడు. అతఁడెప్పుడును కల్లలాడువాడుకాఁడు. నేనతని మాటనే విశ్వసించెదను.

దుర్ముఖ—సీకు నామాటయందు నమ్మకము లేకపోయిన యెడల, నాదేహముతడవిచూచి ప్రత్యక్షముగా తెలిసికొమ్ము. అక్కడికిని నమ్మకము పుట్టనిపక్షమున పదిమంది రాక్షసులకు లంచమిచ్చి ప్రమాణముమీఁద సాక్ష్యమిప్పించెదను.

అలం—(దుర్ముఖుని దేహము తడవిచూచుచు) ఇది పిశాచదేహము కాదుగదా? ఇది నిజమయిన దేహమే అయిన పక్షమున చావకపోయినప్పటికిని యుద్ధములో గాయములుతగిలియుండవలెను. గాయములు లేవుగనుక ఇదినిశ్చయంగా మాయదేహము ఇది కేవలము రాక్షసమాయ. సందేహము లేదు. నీవుచచ్చినమాటయింకసిద్ధాంతమే.

దుర్ముఖ—నాఅద్భుత సామర్థ్యముచేత గాయములుతగులకుండ విచిత్రముగా తప్పించుకొన్నానని నీతో నేనిప్పుడు చెప్పలేదా?

అలం—ఎట్లు తప్పించుకొన్నావు?

దుర్ము—కోతులగుంపుతోకలసి యొక చెట్టుమీఁద కూచుచుండి నాసహాయము కావలసివచ్చినప్పుడుదిగివచ్చి దేవతలను ఖండఖండములు చేయవలెనన్న యుద్దేశముతో ఎవరెవరేలాగున యుద్ధము చేయుచున్నారో చూచుచున్నాను. దేవదానవులు లక్షమంది నేనున్న చెట్టువద్దకువచ్చినను, ఆమందలోనన్ను పెద్దగద్దెరగానిగాభావించినారే కాని నన్నొక్కరునుఆనవాలుపట్టలేకపోయినారు. ధూళిపయికిలేచుట చేత ఎవరెవరేలాగున యుద్ధముచేసినారో యెవరుచచ్చినారో తెలిసినదికాదు గాని, యుద్ధముతీఱి సందడి యడఁగినతరువాత దేవతలు నిర్మూలమైనారని, రాక్షసులకు విజయముకలిగినదని సంతోషించుచు దిగివచ్చినాను. అప్పటికప్పుడే దేవతలు లీలావతీదేవిని చెఱగొని పాఱిపోయినారనివిని, నాకు మహాకోపమువచ్చి దేవతలనందఱిని నాకోపాగ్నికి పూర్ణాహుతి చేయవలెనని భోజనమయినతోడనే బయలుదేఱి మహావేగముగా తఱుముకొనిపోయినాను. నేనువెనుక వచ్చిపోదునని నాకు జడిసికాఁబోలును దేవతలొక్కరును నాకంటఁబడక కాకులవలె ఆకాశమార్గమునఎగిరిపోయి స్వర్గములోదూఱి ప్రాణములుదక్కించుకొన్నారు. నాసహాయము పొందకపోవుటచేత మనరాక్షసులకు పరాభవము కలిగినదే కాని నేనున్నయెడల అసురులకపజయముకలుగదు. చూడు. ముందు నేను హిరణ్యకశిప మహారాజుగారితోపోయి దేవతలు మనల నవమానపఱిచిన ఋణము వడ్డీతోకూడ కక్కించివారి నెట్లు బాధపెట్టెదనోచూడు.

అలం—అయ్యో! హిరణ్యకశిప మహారాజుగారన్నతోడనే జ్ఞప్తికివచ్చినది! తపస్సుచేసి వరములుపొంది వేంచేయుచున్నహిరణ్యకశిప మహారాజుగారిని ఎదుర్కొనితోడుకొనితెచ్చుటకయి మనవిప్ర

జిత్తిమొదలయినవారు పోవునప్పుడు సన్నీసభామంటపమునలంకరించి పీఠములను వేయనియమించినారు. అదిగో వాద్యముల మ్రోత వినబడుచున్నది. వారు వేంచేయుచున్నట్లున్నారు. వేగిరము పీఠములను తగిన స్థలములలో వేయవలెను.

దుర్మ—నన్ను నీకీపనిలో సహాయముచేయుమని పంపినారు. అడిగినపక్షమున, ఈయలంకారమంతయు నేనే చేసితినని మనవి చేయుమా. నాకువచ్చెడు బహుమానములో సగమునీకిచ్చెదను. (అని యిద్దఱును పీఠములను సవరించుచున్నారు.)

(అప్పుడు హిరణ్యకశిపుడును, విప్రజిత్తియు, శంబరుడును, పరివారమును వచ్చి ఆర్హస్థానముల నుండుచున్నారు.)

హిర—(పీఠముమీఁద కూడుచుండి) ఓయీ! విప్రజిత్తీ! నీవు కూరుచుండుము. శంబరకుమారా! నాచేరువకువచ్చికూరుచుండుము.

విప్ర—మహాప్రసాదము.

హిర—మాతపోవృత్తాంతము త్రోవలోఁ బ్రారంభించియు, ప్రసంగాంతరముచే చెప్పలేదు. ఇప్పుడువినుము. మేము మందరపర్వతాగ్రము చేరినకథ విన్నావుగదా?

విప్ర—విన్నాను. తరువాతివృత్తాంత మానతియ్యవలయును.

హిర—నే నాపర్వతాగ్రమున ఒంటికాలితో బొటనవ్రేలిమీఁద నిలువబడి తెప్పవాల్చక సూర్యునివంక తేఱిపారఁ జూచుచు, ఊర్ధ్వబాహుడనయి, కొంతకాలముజలాహారుఁడను, కొంతకాలము వాయుభక్షకుఁడను, కొంతకాలము నిరాహారుఁడను, అయి పరమనిష్ఠతో ఘోరతపస్సు చేసితిని.

విప్ర—దేవరవారు పరమదారుణముగా మహోగ్రతపస్సు చేసినారు. ఇట్టి దారుణోగ్రతపస్సును మున్నెప్పుడును ఎవ్వరును చేసియుండరు.

హిర—అట్టితపస్వినీవ్వరును ఏయుగంబులను జేసియుండరు. నేనునిశ్చలతపోసమాధినుండఁగా నా దేహమంతయుపుట్టలుపెట్టి మేదో మాంసములు చెదలు తినిపోయినవి; నాజడలగుంపులలోపిట్టలుగూళ్ళు కట్టినవి; చెవులలో చెట్లు మొలచినవి. నాతపోవహ్నిముల్లోకములను ముంచుకొనఁగా దేవతలు భయపడి బ్రహ్మదేవుని యొద్దకుపోయి మొఱ్ఱలు పెట్టుకొనిరఁట.

శంబ—దేవతలెప్పుడును పరులతపస్సులకు విఘ్నముచేయు దుస్వభావులే. తమకు వెఱచికాఁబోలును మీవిషయములో తామట్టి పనిని మానుకొన్నారు.

హిర—కార్యములేకపోయినదిగానిఆదుష్టులు తమ ప్రయత్నమును మాత్రము మానలేదు. వారు కనకాంగియనెడి యప్సరసను సింగారించి, ఆటలచేతను పాటలచేతను తేనెమాటలచేతనునన్నవలపించి, నాతపస్సు చెఱిచిరమ్మని పంచిరిగాని, ఆయప్సరసవచ్చి నా నిష్ఠాగరిష్ఠత కచ్చెరువుపడి, నన్ను సమీపించి భీతిపొంది తన వచ్చిన దారినే మరల స్వర్గమునకుపోయి, నన్ను మరులుకొల్పతనచేతఁగాదని చెప్పివేసెనఁట! ఈసంగతిబ్రహ్మదేవుఁడు నాకు వరములిచ్చునప్పుడు చెప్పినాఁడు.

విప్ర—దేవరవారు బ్రహ్మదేవునిచేతఏయేవరములను పొంది నారో వినుటకు నామనస్సులో కుతూహలమగుచున్నది. దేవరవారనుగ్రహించి నన్ను కృతార్థుని జేయవలయును.

హిర—దేవతల ప్రార్థనలచేతనుఁ గాబోలును బ్రహ్మదేవుఁడు భార్యాసమేతుఁడయి నేను తపస్సుచేయుచున్న మందరగిరికివచ్చి నా తపస్సుకు మెచ్చి, కరుణాకటాక్షవీక్షణముచేత తనకమండలదివ్యోదకము నాశరీరముమీఁద ప్రోక్షించి, వజ్రశరీరుఁడనయి కన్నులువిచ్చి

చేతులుజోడించికొని వినయ భయభక్తులు ముప్పిరిగొనఎదుటనిలువఁ బడియున్న నన్ను తన చల్లనిచూపునఁజూచి, నా ధైర్యస్థైర్యాదులను తపోనిష్ఠను బహువిధముల శ్లాఘించి, కోరినకోరికలిచ్చెదనడుగుమని యానతిచ్చెను.

శంబ—ఆహా! పితామహుఁడు భక్తవత్సలుడుగదా?

హిర—ఆకరుణానిధి తన చల్లని కరపల్లవములతో నామేను నిమురుచు వరములడుగుమనిన, నేనును భక్తిపూర్వకముగా ప్రణామంబుచేసి ముకుళితకరములుఁడనై బహువిధముల స్తుతించి, ప్రసన్నుడయియున్నయాహిరణ్యగర్భునిముఖమునదృష్టినిలిపి, భూమియందును జలమునందును, అగ్నియందును, వాయువునందును, ఆకాశమునందును రాక్షసులచేతను దేవతలచేతనునరులచేతనుమృగములచేతనుపాముల చేతను పక్షులచేతను శస్త్రాస్త్రములచేతనుచావులేనిబ్రతుకును, యుద్ధముల నెదురులేనిశౌర్యమును లోకపాలకుల నతిక్రమించి త్రిభువన విజయముపొందుశక్తియు, కోరితిని. భక్తజనమనోభీప్సితార్థ ప్రదాతయైన యావిధాత కోరినవరములన్నియు నిచ్చి, నన్నుదీవించి, తానంతర్హితుఁడయ్యెను.

విప్ర—ఇప్పుడు మేమందఱమును ధన్యుల మయినారము. ద్రోహులయిన యాదేవేంద్రాదుల గర్వమడఁచి వారియైశ్వర్యము నపహరించి మన పగతీర్చుకొనుట కిప్పుడుగదా సమయమువచ్చినది!

హిర—హిరణ్యాక్షుని వరాహమయి వధించిపోయినవైరము సాధింప ముందుగా విష్ణుమూర్తిని వెదకి సంహరింపవలెను. మాతల్లి గారును, అంతఃపురమున లీలావతిదేవియు, కుశలులయి యున్నారు కదా? మేము తపశ్చరణమునకు పోవునప్పటికే లీలావతి గర్భవతియై యున్నదే. మాకావల పుత్రలాభము కలిగినదా? పుత్రికాలాభము కలిగినదా?

విప్ర—అందఱును సుఖులయియే యున్నారు కాని—

హిర—(తుళ్ళిపడి) కాని, యేమిటి? నేను లేనిసమయములో విరోధులెవ్వరైన మఱియెవ్వరికైన ఏమయిన అపకారము చేసినారాయేమి?

విప్ర—దేవరవారు తపశ్చరణమునకు పోయినతరువాత ఆకస్మికముగా దేవేంద్రుఁడొకనాఁడు తనసేనలతో మనపురము మీఁద దండువిడిసినాఁడు.

హిర—ఆహా! యేమీ యింతతడవును చెప్పకుంటివి! ఉన్న కన్నులుచాలవని గౌతముఁడు తనకు వేయి కన్నులిచ్చినను దేవేంద్రుఁడింకను కన్నుగానకున్నాఁడేమి? హిరణ్యకశిపుని ప్రతాపానలమును కొంచెముకాలములోనే చవిచూచి యింద్రుఁడు తన మదాంధకారమును విడువఁగలడు. అటుతరువాత నేమిజరిగినది? మీరందఱును సేనలను పన్నుకొనిపోయి దుస్సహమయిన మహాయుద్ధము చేసి దేవతలను చీకాకుబఱిచియుందురు.

విప్ర—మేము ఘోరయుద్ధమే చేసినారము కాని దేవరవారు సమీపమునలేని దురదృష్టముచేత మనవారు నిరుత్సాహులుకాఁగా శత్రువులు మనసేనల నతిక్రమించి ప్రాణముల కాశపడక పోరెడుశంబరకుమారాదులగు మా బోంట్లను లక్ష్యముచేయక లోపల ప్రవేశించి నగరు కొల్లపెట్టుకొనిపోయిరి.

హిర—అక్కటా! హిరణ్యకశిపుని శరీరములో ప్రాణములుండఁగానే మనరాజధాని కెటువంటి దుర్యోగముపట్టినది? పట్టణము పరులపాలయి అవమానము తటస్థించిన తరువాత, ఇఁక నాపౌరుషమెందుకు?

విప్ర—ఇంద్రాదులు మనకుచేసిన పరాభవమింతేకాదు—ఓ శంబరా! నేను చెప్పలేను. ఆపయిసంగతి నీవు విన్నవింపుము.

(అని దుఃఖము నభినయించుచున్నాడు.)

శంబ—(కన్నులు నలుపుకొనుచు దీనముఖముతో) ఆ అప్రియవార్తను విన్నవింప నాకుమాత్రము నోరెట్లాడును? మాతృ సంరక్షణముచేయ నేరక శత్రువులకొప్పగించి యూరకున్న పాపాత్ముడనయిన నేను హృదయము రాయిచేసుకొని ఆపాపపుమాటకూడ చెప్పకతీఱదు. మాతల్లి లీలావతీదేవిని దేవతలు తమవీటికి — (అని సగముచెప్పి శోకముతో) ఇంక నేను చెప్పలేను.

హిర—హా! నాహృదయేశ్వరీ! నేనుబ్రతికియుండఁగానే యెంతవైపరీత్యము పొసఁగినది! హా! హా! సాధ్వీమణీ! వినయవతీ! నిన్నుక్రూరులయి శత్రువులు చెఱగొనిపోయిరా? అయ్యో! ఇంకను నే నెట్టిపాపపుమాట వినవలయునో! ఆదయావిహీనులు నిన్నుఁగొని పోయి నామీదద్వేషముచేత నీప్రాణములు గొనరుగదా? ఇంత దారుణవృత్తాంతము చెవినిబడియు ప్రాణములు విడువకున్నాను. ఆహా! నాది యెంత మొండిబ్రతుకు! ఓలీలావతీ! ఓప్రాణేశ్వరీ! నీభర్త నీమీద ప్రేమచే పిలుచుచున్నను పలుకకున్నావేమి? నన్నేల యోదార్చవు? ఓపతివ్రతాశిరోమణీ! నీవు నావంటిరాజునకు భార్యవుగాక యేబీదవానికి భార్యవైనను, ఇటువంటి ఘోరాపదలు లేక సుఖముగా బ్రతికిపోదువే. నిర్భాగ్యుడనైన నాకేల భార్యవైతివి? (అని కౌద్రాకారముతో లేచి) ఓయీవిప్రజిత్తీ! నాప్రతిజ్ఞ వినుము. బ్రహ్మరుద్రాదులడ్డమువచ్చి కావఁబూనినను, నాప్రాణ వల్లభ లీలావతియేవచ్చి నాపాదములపూదపడి కాపాడుమని వేఁడుకొన్నను, నేనింటలేనప్పుడు దొంగవలెవచ్చి నాయిల్లాలిని పరమ సాధ్విని అపహరించిన ఆ పరమనీచుని దేవేంద్రుని పుత్రమిత్ర కళత్రసహితముగా నే నంతము నొందించెదను. వంటయింట

కుంజేలు నాచేతఁబడక వాఁడింక నెందుఁబోగలవాఁడు? ఆ విప్ర మహీనుఁడు పరకాంతను నిందుమాలాలి నెప్పుడుక్షోభ పెట్టికొని పోయెనో, అప్పుడే చచ్చినవాఁడు. ఈనెలకడ చనుంజోపల నేనువాని గర్వసంహారము చేయనియెడల, నేనుబ్రహ్మవలన పొందినవరములు వరములుకావు: నాపేరు హిరణ్యకశిపుఁడుకాఁడు; నేను కశ్యపుని పుత్రుఁడనుకాను.

విప్ర— దేవర కింతయాగ్రహము వచ్చినదిగనుక, ఇంద్రునకు నిశ్చయముగా చావుమూడినది. "వినాశకాలేవిపరీతబుద్ధి" యన్నట్లు, ఆత్మవినాశకాలమునసమీపించినదిగనుక నేఆదుర్మదాంధునకు నీపట్టపు దేవిని చెఱగొనిపోవు దుర్బుద్ధిపుట్టినది. కుడిచికూరుచుండి సుఖముగా బ్రతుకలేక కండగ్రొవ్వెక్కి, గుహలోనిద్రించుచున్న సింహముమీసములలాగ సాహసించినవానికి వెంటనే తత్ఫలము కట్టి కుడువక ఊరకపోవునా?

హిర— విప్రజిత్తీ! ఈవరకే ఆపాపాత్ముఁడు స్త్రీహత్యకూడ ఒడికట్టుకొని యుండునేమో!— ఓప్రాణనాయకీ! ఆమాలదైవము నీకు పగవారిచేత బలవంతపుచావుకూడ పెట్టియుండఁడుగదా?

శంబ— తండ్రీ! నాతల్లిలీలావతీదేవినిమిత్తమయినీవింతపరితపింపవలసిన పనిలేదు. ఆమె క్షేమముగానున్నది. మీమనస్సు నాపై నిమిత్తమయి నిష్కారణముగా ఆయాసపెట్టఁబోకుఁడు. దుర్నయుఁడయిన యింద్రునకుబుద్ధిచెప్పి చూలాలయియున్న దేవిగారినివిడిపించి నారదుఁడు తనయాశ్రమమునకుఁ గొనిపోయి, ఆదరించి, ఆమహాపతివ్రతను పుత్రరత్నముతోగూడ సురక్షితముగ కాపాడుచున్నాఁడు.

హిర— నారదాశ్రమముననే మాకుపుత్రజననముకూడ కలిగినదా? అట్లయిన ఆదేవగాయకుని ముందుమనయాస్థానమునందు వీణపాటకునిగా నుంచుకొందము.

విప్ర:—అతనికి చక్కని బ్రతుకు తెరువు కల్పించినారు. అట్లు చేయుట నారదునకు పరమానుగ్రహముకదా? అదె మన మాటలోనే నారదుఁడును దేవిగారిని, మీసుపుత్రతిలకమును వెంట బెట్టుకొని మన యాస్థానమునకువచ్చుచున్నాఁడు. అతనికి నూఱేండ్లు పూర్ణాయుస్సున్నది.

(అప్పుడు నారదుఁడును, లీలావతియు, కొమారుఁడును ప్రవేశించుచున్నారు.)

నార:—దిగ్విజయమస్తు! చింతితకళ్యాణ సమృద్ధిరస్తు! ఓ మహారాజా! ద్వారపాలకుఁడు నన్ను వెనుకకు లాగుచున్నాఁడు. యమపాశములవంటి పీని బాహుపాశములనుండి నన్ను విముక్తిని చేయుఁడు.

హిర:—ఓరీ ద్వారపాలకా! నీకిదె యొక్కసారిగా నాజ్ఞ యిచ్చుచున్నారము. ఈ నారదుఁడు మన సభాభవనమున కెప్పుడు వచ్చినను నీవడ్డుపెట్టక మన భృత్యుల తోడిపాటుగా ఈతనిని రానిచ్చుచుండుము. మునులలో మనకీతఁడు విశ్వసనీయుఁడు.

ద్వార:—మహాప్రసాదము.

హిర:—ఓహో! ఏమినాభాగ్యము! లీలావతీదేవి నాకిప్పుడు నేత్రోత్సవముచేయుచున్నది! ఓప్రాణేశ్వరీ! నిమిషముక్రిందట నీ నిమిత్తమై శోకబాష్పములు విడిచినకన్నులతోనే యిప్పుడు ఆనంద బాష్పములు విడుచుభాగ్యము లభించినది. ఏమి నీవింత చిక్కి యున్నావు? ఇంతకాలము దయమాలి నిన్ను వియోగదుఃఖముల పాలుచేసి పోయిన నాకు దూరస్థురాలవై యుండియు, దైవరక్షణము చేత సుఖముగా నున్నావుగదా? ఓహృదయేశ్వరీ! నీచల్లనిచేయి నా బొమ్మునమోపి నాదేహతాపమడపుము. (అని చేయిపట్టుకొని చేర దీసి అర్ధాసనముమీఁదఁ గూర్చుండఁబెట్టుకొనుచున్నాఁడు.)

లీలా:—ఓప్రాణేశ్వరా! నాశరీరముదూరముగానున్నను హృదయము మాత్రమెప్పుడును ఖీకు దూరముగానుండలేదు. అయ్యో!

ఘోరతపస్సులచేత శరీరమును దుఃఖపెట్టి పెద్దకాలమునకు గృహము నకు విజయంచేసిన దేవరవారి కుపచార శతములచేత దేహము చల్ల చేయలేకమీఁదిమిక్కిలినిర్భాగ్యురాలనయిన నేనుమీకుసంతాపమును కూడకలుగఁజేసితినిగదా? ఓప్రాణవల్లభా! మీరుక్షేమముగా మరల వచ్చితిరా? మీవియోగదుఃఖముచేత ప్రాణములుపోవలసిన వేయయి నను, ఈనారదుఁడు ప్రతిదినమును మీక్షేమసమాచారమును చెప్పుచు క్రొత్తయాశను పుట్టించుచువచ్చుటచేత నాయాశాబంధమేబొందిలో ప్రాణము వెడలకుండ నిలిపినది. దేవరవారి పునర్దర్శనమగుటచేత నాసహనముపలని ఫలమిప్పుడు కలిగి నేత్రసాఫల్యమయినది. ఓయి కుమారకా! చిరకాలమునకు చూడఁగలిగిన నీతండ్రికి మ్రొక్కుము. (అని తండ్రికాళ్ళమీఁద పడవేయుచున్నది.)

హిర—(కొడుకును లేవనెత్తి ముద్దుపెట్టుకొని) దీర్ఘాయుష్య మస్తు! సామ్రాజ్యమస్తు! ఓచిన్నికుమారా! నన్నుగన్నతండ్రీ! లెమ్ము లెమ్ము. నీవుఅల్లారుముద్దుగా ప్రాకుచుండగాను, తప్పటడుగులుపెట్టు చుండఁగాను, విద్దెములుచేయుచుండఁగాను, వచ్చిరాని ముద్దుపలుకులు పలుకుచుండగాను, కన్నులు చల్లగాచూచి సంతోషించుటకు నేను నోచుకోనైతినిగదా? అట్లయినను, ఓతండ్రీ! నిన్నిప్పుడుచూడగానే నాకన్నులుచల్లపడి, నీగాత్రము సోఁకుటచేత నాశరీరము సంతోష పులకితమగుచున్నది. నీవంక చూచినకొలఁదిని నాకంతకంతకు హృద యాహ్లాద మధికమగుచున్నది. గనుక, నేఁటినుండి నిన్ను ప్రహ్లాదు డని పిలిచెదను. (అని తొడమీద కూరుచుండఁబెట్టుకొని, మేనునిమిరి నిమిరి, బుగ్గముద్దుబెట్టుకొనుచున్నాఁడు.)

లీలా—ప్రాణనాథా! మనకీపుత్రభిక్షపెట్టి యిట్టి ఆనందము కలుగఁజేసినది యీనారదులు, వారిమేలునుమనముమఱవఁగూడదు.

ఈతని నామకరణ మహోత్సవకాలమున నారదుని సత్కరింప వలయును.

హిర—మనమవశ్యముగా సత్కరింతము (నారదునివంకతిరిగి) ఓయీ! నారదా! నీవింకను నిలువఁబడియేయున్నావా? యీపీఠము మీదకూరుచుందుము. (భార్యవంకతిరిగి) ఓప్రాణేశ్వరీ! ఇంద్రుఁడు నీకుచేసిన పరాభవమును నీవలన వినకోరుచున్నాను.

లీలా—ఓప్రాణవల్లభా! అప్పటినాయవస్థతలఁచుకొన్న ఇప్పటికి నాదేహము కంపమెత్తుచున్నది. ఆయింద్రుఁడు దండెత్తివచ్చినసువార్తమీకీవఱకే యీవిప్రజిత్త్యాదులు విన్నపము చేసియుందురు గదా? అతడంతఃపురమును ప్రవేశించువప్పటికి వ్యాఘ్రమును గన్న ఆడులేడివలె బెదరి ఆపాదమస్తకము చెమ్మటపట్టి, దేహము వణఁకవడ వడక, నేనొక తలుపుమూల కొదిగి నిలువఁబడినాను.

హిర—ఆహా! మహారాజపత్నికి నీకెటువంటి దురవస్థ సంప్రాప్తమయినది! అతఁడవాత.

లీలా—ఆదుష్టాత్ముఁడు వజ్రాయుధమునుపట్టుటచేత కాయలు కాచిన మోటుచేతితో నామృదుహస్తమునుపట్టుకొని యీవలకీడ్చిన వాఁడు. అంతవఱకు నేనెఱుఁగుదును. ఆపైని నేమి జరిగినదో నాకు తెలియదు. మూర్ఛతేఱి నేనుకన్నులువిచ్చిచూచునప్పటికినారదుఁడు నాయెదుటనుండి నా కుపచారముచేయుచు, ఇంద్రుని మందలించుచున్నాఁడు. తదనంతర వృత్తాంత మీయన నడుగుఁడు.

హిర—ఓయీ! నారదా! ఆయింద్రుని దౌష్ట్యమంతయు నీ వేమి మఱుఁగుపఱచక ఉన్నది యున్నట్లు చెప్పుమా.

నార—నాకు తెలిసియున్నంతవరకు దాచక చెప్పెదనువినుఁడు. మీరట్లు దారుణ తపస్సుచేయుచు అస్థిచర్మావశిష్ట దేహముతో

ముక్కనమూపిరి లేక, స్థాణువువలె నుండగా చారులుచూచిపోయి నీవు చచ్చితివని యింద్రునకు విన్నవించిరి, అంతనతఁడు నీప్రాణపున తేఱి చూడరాకున్న రాక్షసులను సంహరించుట కదే సమయమనుకొని తక్షణమే దండయాత్రి బయలుదేరినాఁడు.

హిర—హిరణ్యకశిపుఁడు కాలధర్మము నొందెననియే యిం ద్రుఁడు నావగరిమీఁదికి దండెత్త సాహసించెనుగాని, లేనిపక్షమున ఇంద్రునికట్టి చొరవ యెక్కడనుండివచ్చును? నా పేరువినబడిన దేవ లోకములో సహితము గర్భనిర్భేదము కాదా? అపయిసంగతి కొంత విన్నారము దేవినత్తుకొనిపోయినతరువాత నేమిజరిగినదో చెప్పు.

నార—అతఁడు లీలావతిని రథముమీద పెట్టుకొని, ఆకాశ మార్గమున ఎగయునప్పుడు దేవి దేహము తెలియక యే కాఁబోలును "ఓనాథా! ఓరాక్షసార్వభౌమా! దిక్కుమాలియున్న నీభార్యనైన నా మానమును కాపాడుము" అని పలవించినది.

హిర-ఓ దేవీ! ప్రాణేశ్వరీ! అడలఁబోకు. ఇదిగోనిన్ను కాచుట కయి నేనువచ్చుచున్నాను. ఓరీ! ఇంద్రా! హిరణ్యకశిపుని ముందర నీవెటుబోయెదవురా? నిలువు నిలువు; ఈభల్లమున నీతలడొల్లసేసెదను (అని లేచుచున్నాఁడు)

నార— దేవా! ఇప్పుడింద్రుఁడిక్కడ లేడు. దేవి విలపించిన విధమున నేను చెప్పినాను.

హిర—అలాగుననా? దేవివిలాపము నా చెవిసోకఁగానే నా దేహము పరవశమయి పయిమాట చెవినిజొరక నిజముగా దేవేం ద్రుఁడు నాకన్నులయెదుట కట్టినట్టేకనఁబడినాడు. అందుచేత నేను లేచినాడను. నారదా? తరువాత నేమిజరిగినది?

నార—నే నాఁడుదాని యేడుపువిని జాలిపడి, ఆపన్నిహార ణముచేయవలెననినాయాశ్రమమునుండిబయలు దేరివచ్చి, నిండుగర్భి

ణితోనుండి దేహము తెలియక యేమేమో పలవరించుచున్న లీలావతిని ఇంద్రుని రథముమీఁదఁ జూచితిని.

హిర—ఆహా! ప్రాణనాయకీ! నీహృదయమప్పుడెంత సంతోషపడియుండెనో! ఆదుండగీని దుండగములు విన్న నాశరీరము మండుచున్నది. నారదా! కానిమ్ము.

నార—"ఓయిఁద్రా? పతివ్రతాశిరోమణియైన పరస్త్రీని తెచ్చుట ధర్మముకాదు. ఒక్కవీరపతివ్రతయొక్క కన్నులనుండి జారిన నీటిబొట్లన్నియు అన్నిఅగ్నికణములయి నీకులమునుదహింపవా? నా బుద్ధివిని యీరాక్షసరాజు భార్యను విడువుము" అని నేను బుద్ధి చెప్పితిని. అందుకతఁడు శత్రుశేష ముండగూడదు గనుక. హిరణ్యకశిపుని కడుపున పుట్టినవాఁడు వారికంటెను మహోగ్రసత్త్వుఁడు కావచ్చునని యెంచి పుట్టినతరువాత శిశువునుమాత్రము చంపి వదలిపెట్టవలెనని యీమెను తెచ్చితినేకాని నేను మరియొక ద్రోహము తలఁచుకొనలేదని ప్రత్యుత్తరమిచ్చెను.

హిర—ఓరా! ఆక్రూరుఁడు కడుపులోనున్న నిర్దోషియైన యీశిశువునుచంపి నన్ను పుత్రశోకమునకూడ ముంచదలచుకొన్నాఁడుగా? ఆపాపఫలమతఁడు త్వరలోనే యనుభవింపఁగలఁడు. నారదా! అందుమీఁద నీవేమన్నావు?

నార—'ఓయిఁద్రా! నీవు రాక్షససార్వభౌమునిరాణిని తెచ్చి లోపపుపని చేసితివి. ఆరాక్షసేంద్రుఁడు సామాన్యుడనుకొన్నావా? రేపే తపఃప్రభావముచేత దుర్లభవరములు పొందివచ్చి త్రిజగత్సంహారము చేయఁడా? ఎంతపని చేసితివి! ఆడుదానిని తెచ్చుట మహాపరాధమని యెంచితివా? తండ్రిబలవంతుడయిననుకొడుకుబలహీనుడు కావచ్చును; జనకుఁడు గుణహీనుడయినను పుత్రుఁడు గుణవంతుఁడు గావచ్చును.

తండ్రిచేసినదోషమునకయి పుత్రకుని దండించుట క్రూరకర్మము కాని రాజధర్మము కాదు. చంపుటకయి గర్భములోనున్న నోరులేనిశిశువు నీకేమిఅపకారముచేసినాడు? ఈపాపకర్మమునకొడిగట్టిలోకనిందపాలు కాకుము" అని నయమున భయమున బోధించి యొప్పించి నీవిభుఁడు వచ్చినదాఁక నాయుండను తలదాచుకొమ్మని యీమానవతిని మా ఆశ్రమమునకు వెంటబెట్టుకొనిపోయి భద్రముగా సంరక్షించితిని. ఆ మహేంద్రుఁడు లీలావతిని నాకప్పగించునప్పుడు "మీయాజ్ఞనుల్లఘింప రాదనియీపాఁడతినివిడుచుచున్నానే గానిరాక్షసాధీశ్వరుని దోర్దర్పము నకు వెరచికాదుసుఁడీ! నాచేత వజ్రాయుధముండఁగా లక్ష రాక్షసాధ్యక్షులు వచ్చినను నేను భయపడను" అని చెప్పి మఱి విడచినాఁడు.

హిర—ఆహా! ఏమియాతనిగర్వము! నేను స్వర్గమునుజొచ్చినప్పు డీమాటలు మఱచిపోక జ్ఞాపకముంచుకొమ్మనుము. నీవుచేసిన పని మంచిదేకాని లీలావతీదేవిని వెంటనే తీసుకొనివచ్చి మాశంబరాదులకు ఏలయొప్పగించినావు కావు?

నార—ఈయుబలక్షేమముకోరియే మీరువచ్చినదాఁక ఇందు తీసుకొనిరాక మాఆశ్రమముననే యీపావనిని పుత్రసహితముగానుంచి కాపాడినాను. నేనట్లు చేయకుండినయెడల నీశత్రువులు నీవులేని సమయముల పలుమారు దండెత్తి వచ్చి అలజడిపెట్టుచు వచ్చినచో ఉపద్రవ మధికముగా నుండునుకదా!

హిర—ఔరౌరా! ఇంద్రుడెంత ద్రోహముచేసినాఁడు! నా సవతితల్లిపుత్రుఁడయినందున కీలాగునఁ జేయవలసినదే. ఏమి యీఅన్నదమ్ముల శత్రుత్వముఁ ఎవ్వరిని నమ్మినను నమ్మవచ్చునుగాని జ్ఞాతిని మాత్ర మెన్నఁడును నమ్మరాదు. కాని యెడల 'జ్ఞాతిశ్చేదనకిమ్మ' నెడిమాట యూరకేపుట్టినదా? జ్ఞాతియున్నయెడల, అగ్నిహోత్రము లేక యేదగ్ధముచేయును, కాబట్టినీదేవజాతి జ్ఞాతిపురుగునుపోరులేకుండ

రూపుమాపెదను. ఔనోయి విప్రజిత్తీ! నిన్నొకటి అడుగమరచి పోయినాను. మదాంధుఁడయిన యింద్రుఁడు దండెత్తి వచ్చినప్పుడు దిక్పాలకులుకూడ వచ్చినారా?

విప్ర—కేవలము వచ్చుటమాత్రమే కాదు పరాభవ దుఃఖితులయియున్న మనశంబరాదులను ఎన్నెన్నో కారులుకూడ ప్రేలినారు.

హిర—ఏమేమి! మిడుతలు మహోగ్ర దవానలము మీఁద పడి మూడనెంచినవిగా? మనలను దిక్పాలకులు కాక మరియెవ్వరా క్షేపింతురు? వారాడిన దుర్భాషలిప్పుడు మఱవకుందుము గాక! మన మిందుర్లోకమునకు పోవునపుడు త్రోవలో ముందుగా ఈదిక్పాలకుల పొగరే అడఁతము.

విప్ర—వారికండకొవ్వడచవలెను. వారు మిక్కిలి మిడిసి పడుచున్నారు.

హిర—ఓయీ నారదా! దంద్రులెప్పుడును కొమాళ్ళు బుద్ధిమంతులు కావలెననియు, శౌర్యవంతులు కావలెననియు, దీర్ఘాయుష్మంతులు కావలయుననియు, కోరుచుందురు. ఈప్రహ్లాదుఁడు నీయొద్దనున్నప్పుడు బుద్ధికలిగి యుండెనా? ఈతఁడు రాజనీతి నభ్యసించి, అస్త్రవిద్యయందనమానుఁడయి. నిజప్రతాపముచేత తనతల్లిని పరాభవపఱిచిన దేవేంద్రాదులను సంగరరంగమున భంగపఱచి యేలుచుండగాకన్నులపండువుగాఁజూచెడుభాగ్యము నాకెన్నఁడులభించునో!

నార—నీకొమారుఁడు బహుబుద్ధిమంతుఁడు. ఆటలయందైనను ఎన్నఁడును బొంకియెఱుఁగఁడు; దీనులనుజూచినవారిని కావపరితపించుచుండును; తోడిబాలురతన్ను నిష్కారణముగా కొప్పించినను వారికి బుద్ధిచెప్పనే కాని వారిమీఁద కోపపడఁడు; తల్లిదండ్రులను గురువులను దైవముగా భావించుకొనుచుండును. వేయిమాటలెందుకు? సమస్త

సద్గుణములును సంఘీభవించి వచ్చినీకొడుకును ఆశ్రయించినవని చెప్ప వచ్చును. నీకు పుత్రుఁడయినవాడు శౌర్యవంతుఁడగునాయని సందేహ పడవలెనా? సింహముకడుపున పిల్లిపిల్ల యెప్పుడును పుట్టదు. ఈతఁడు ప్రతాపమున నిన్నుమించినవాఁడే కాగలఁడు.

హిర—కొమాళ్ళట్లయినప్పుడేకదా తల్లిదండ్రులకు మనోరథ పరిపూర్తియగును. ఓపుత్రకా! నీవీయరివర్గము నెప్పుడు నిర్జించెదవు?

ప్రహ్లా—నేనీవఱకే జయించినాను.

హిర—వీఁడు శత్రువిజయమనఁగా నేమో తెలియని పసి బాలుఁడయ్యును, జయించినంతమాట చెప్పినాఁడు. వీఁడు నిశ్చయ ముగా శత్రువులను జయించినట్టే సంతోషించెదను. తండ్రీ! నీశత్రు విజయమునకు సేనలు కావలెనా?

ప్రహ్లా—నేను సేనలు లేకయే గెలువఁగలను.

విప్ర—ఆహా! ఏమి యీ బాలుని అసహాయశూరత్వము! పువ్వుపుట్టగానే పరిమళించునుగదా!

హిర—పుత్రకా! దీర్ఘాయుష్మంతుఁడవుకమ్ము. నీవంతటి వాడవు కావలయునని యే నాకోరిక. ఓవిప్రజిత్తీ! దేవలోకముమీఁదికి దండెత్తుటకయి సైన్యములను సిద్ధపఱుపుము. మేము జనసీజనుల వద్దకుపోయి వారి యాశీర్వాదమును పొందివత్తుము. మనరాకవిని ఆనందించుచుండెడి నీతత్తగారికి కొడుకుతోడ కూడ మ్రొక్కి నీవెన లందుచువుగాని రమ్ము.

లీలా—ఓప్రాణనాథా! నేను యింతకుముందే దేవరవారిని ఈకోరిక కోరవలెనని అభిలషించితిని. మీకు మిత్రులతో సల్లాప సుఖము ననుభవింపుచుండగా నడుమ రసభంగముచేసివయెడల తమ చిత్తము కేమితోచునోయని సంకోచించి ఊరకున్నదానను.

హిర—అట్లయిన అంతఃపురమునకు పోవుదము లెమ్ము. విప్ర జిత్తీ! ప్రభువువారు రేపే దేవతలను శిక్షించుటకయి దండయాత్ర వెడలుదురని సేనానాయకుల కాజ్ఞాపింపుము.

విప్ర—మహాప్రసాదము. మనరాక్షససేనలకు దేవతలమీద దండెత్తనోచిన దినమేక దాపండువు? వారీమాటవిన్న అపరిమితోత్సాహులయి పెండ్లికిపోవువట్లు సంతోషింతురు.

హిర—నారదా! నీవు రేపుమా వెంట వత్తువుగాని నేటికిందు నిలువుము.

(అని అందఱును నిష్క్రమించుచున్నారు.)

తృతీయాంకము

రంగము—ఇంద్రభవనము

[ఇంద్రుఁడును, వరుణుఁడును, కుబేరుడును, బృహస్పతియు, జయంతుఁడును, పరివారమును, జమదగ్నియు, భరద్వాజుఁడును, ప్రవేశించియున్నారు]

ఇంద్ర—ఓయి వరుణదేవుఁడా! మేము పనియున్నదని పిలువ నంపినను, దిక్పాలకులలో మీరిద్దఱు మాత్రమే వచ్చినారు. తక్కిన వారేమయినారు? వారికి నామాటయుందింత అలక్ష్యమేమి?

వరు—దేవా! వారుతమ యాజ్ఞయందు అనాదరముచేత రాక పోయియుండరు. రాకపోవుటకు వారికేదో విపత్తుసంభవించియుండును. బ్రహ్మచేతవరములుపొంది శౌర్యగర్వముచేత మర్మదాంధుఁడయిహిరణ్యకశిపుడు దిక్పాలకులపట్టణములమీదికి దాడివెడలినాడనివిన్నాను. ఆ దురాత్మునిచేతిలోఁబడి వారెట్టి దుఃఖములననుభవించుచున్నారో!

వారంచుచేత నే యేలినవారిదర్శనమునకు రాకపోయియుందురు. మా పట్టణముమీఁదికి ఆదుష్టరాక్షసుఁడు దండెత్తి వచ్చుచున్నాఁడని చారులు వచ్చి చెప్పినను, నిమిషమునిలువక భార్యాపుత్రులను మహా సముద్రములో విడిచినేను తమ సెలవయినదనిపరుగెత్తుకొనివచ్చినాను.

ఇంద్ర—నీస్వామిభక్తికి సంతోషించినాము. ఆఖలుఁడెంత దుర్జయ కార్యమును తలపెట్టినాఁడు. ఇంతకు వచ్చినతరువాత వాఁడిఁక మన పట్టణముమీఁదకుకూడ రాకమానఁడు. ఓయీ కుబేరా! బ్రహ్మదేవుఁడు వానికి దేవతలకు దుర్జయుఁడగునట్లుకూడ వరము నిచ్చినాడుఁగా?

కుబే—దుస్సహమయినవాని తపోవహ్నికి భయపడినవాడు కోరినవరముయిచ్చి మమ్ము బ్రతికింపుమని మనమేపోయి బ్రహ్మదేవుని ప్రార్థించినప్పుడు, అతఁడియ్యకుండునా? ఆవరప్రభావము చేతనే మహాసాహసముతో ప్రళయకాలరుద్రునివలె తేఱిచూడ రాక లోకపాలకుల పట్టణములమీఁదికి దండువెడలినాఁడు. వాఁడు నిర్వృతినిజయించి, అలకాపురముమీఁదికి వచ్చుచున్నాఁడని దూతలు వచ్చి చెప్పఁగానే అలుబిడ్డలను నామిత్రుఁడయిన శివునివద్దదాఁచి దేవరవారియొద్దకు పరుగుపరుగున వచ్చినాను. నానవనిధులును ఈపాటి రాక్షసాధీశ్వరునిపురము చేరియుండును. అర్థములేనివాని బ్రతుకువ్యర్థముకదా? అదిగో యముఁడు వచ్చుచున్నాఁడు. అతఁడు మనకేమయిన విశేషవార్తలు తెచ్చియుండును.

[యముఁడు ప్రవేశించుచున్నాఁడు]

ఇంద్ర—ఓ యమధర్మరాజా!

యము—ఓ మహేంద్రా! ఇఁక నన్నాపేరుతో పిలువకుము. ఇప్పుడు యమునిపాలిటికిని పెద్దయముఁడొకఁడు బయలుదేఱినాఁడు.

ఇంద్ర—ఏమి? నీవంతనిసుగుదలతో మాటాడుచున్నావు? నీవు క్షేమముగా నున్నావా?

యమ—పిడిగుద్దులతో దేహమంతయు బలిసి, వీసెగుద్దుల ప్రభావముచేత ఒక్కొక్క అవయవము రెండేసిఅయి, ఈప్రకారముగా మోచేతికి దెబ్బతగిలినవానివలె సుఖమనుభవించుచున్నాను. నేనీవర కెప్పుడును పరులను శిక్షింపుచుండునేగాని పరులచేత శిక్షపొంది యెఱుంగను. ఏకాలమున కెవ్వరికేగతిబట్టునో యెవ్వఁడెఱుఁగును? అదృష్టరాక్షసులు పొడిచిన మోకాటిపోట్లచేత శరీరమంతయు తేలు కుట్టినట్లు నొచ్చుచున్నది. నన్నుఏయనామధేయునిగానైనను చేయక బ్రహ్మదేవుఁడు నిర్దయుఁడయి దక్షిణదిక్కునకేలప్రభువుగాఁజేసెను?

ఇంద్ర—ఆహిరణ్యకశిపుడు మీలోకమునకు దండెత్తినాడా?

యమ—శ్రీహరీ! (అని చెవులు మూసికొని) నేను వినలేను. ఆ పాపాత్ముని పేరు నాముందరతలపెట్టఁబోకుడు. ఆపేరు విన్నమాత్రము చేత నాదేహమిప్పుడు మరలకంపమెత్తుచున్నది. (అనివడకుచున్నాడు)

ఇంద్ర—ఓయమధర్మరాజా! భయపడఁబోకు భయపడఁబోకు. ఆ పేరుమరచిపో.

యమ—నిన్న నన్నాఖలుఁడు పెట్టినబాధ తలఁచుకోఁగా, వేయిజన్మములెత్తినను వానిపేరిఁక నాకు మఱపునకు వచ్చునట్లుకనఁబడదు. నిన్నటినుండి యేపని చేయబోయినను నాకువాఁడేతలఁపునకు వచ్చుచున్నాఁడు. భోజనమువద్ద కూరుచుండునప్పటికి వానిరూపము ఎదుటకనఁబడిముద్దలోపలికిపోయినదికాదు. పరుండవలెననిమంచము చేరి కన్నులు మూసికొనునప్పటికి దయ్యమువలె వాఁడువచ్చి చెంత నిలువబడినట్లయి లేచిమంచముదిగివచ్చి తెల్లవాఱువఱకునిద్రపట్టక నడవలో జాగరముచేసినాను. దేవరవారివద్దకువచ్చిదుఃఖముతీర్చుకో

వలెనని బయలుదేఱఁగా త్రోవపొడుగునను వాఁడు నన్ను వెంబడించి తఱుముకొని వచ్చుచున్నట్లోఁచి, చీమచిటుక్కుమన్న అదరిపడుచు వచ్చితిని. మూలిగెడు నక్కమీఁద తాటిపండుపడ్డట్లు సగము దూరము రాగానే, ఒకతాటితోటలో వానిసేనలే నాకు ప్రత్యక్షమై మీఁది ప్రాణములు మీదికిపోయి నడవ కాళ్ళురాక భయజ్వరము తగిలి తమ దర్శనము చేసికోవలెననెడి యుత్సాహముచేత ఎట్లో శరీరమిక్కడికి చేరవేసినాను.

ఇంద్రు:—అయ్యో! వాడుమనపట్టణముమీఁదికి వచ్చుచుండ లేదుగదా? ఇఁక స్వర్గమున కేమిపాట్లు సంభవించునో! ఓయీ! అంతకా! వాఁడును వాని సేనలును నీపట్టణములో ప్రవేశించి యేమి చేసినారు?

యము:—చేయవలసినదెల్లను చేసినారు. పట్టణము ఏనుఁగు తిన్న వెలగపండువలె నయినది. ముందుగా విప్రజిత్తివచ్చి లెక్కలు వ్రాయుచున్న చిత్రగుప్తునిచూచి, ఏమివ్రాయుచున్నారో చూపుఁడని వారిచేతిలోని లెక్కలను బలవంతముగా ఊడఁదీసికొని తాటాకులు తిరుగవేసి, లెక్కలలో నాకు పాపమెందుకు వ్రాసినారని వారికంటిమీఁద ఒక్కగుద్దు గుద్దినాఁడు. ఆగుద్దుతో చావుతప్పి కన్ను లొట్టపోయి చిత్రగుప్తు లావలికి పోయినారు. ఆక్రూరాత్ముడు మరల వారిని రాక్షసకింకరులచేత ఈడిపించి తెప్పించి వారు వ్రాసిన లెక్కలు పుఱ్ఱున చింపివేసి, రాక్షసులందఱును పుణ్యాత్ములయినట్లు క్రొత్తలెక్కలు వ్రాయునట్లు నియమించి, రాక్షసుని కెవ్వనికైనను పాపము వేసినపక్షమున మీఁడొక్క బద్దలుచేసెదనని చెప్పి, వాఁడు ముందుకు పాఱి పోయినాఁడు.

ఇంద్రు:—చిత్రగుప్తుడు అలాగేవ్రాసినారా?

యము:—చచ్చినట్లు వ్రాసినారు. వ్రాయకపోయినపక్షమున వారి దేహములో సున్నమున కెముకలుండునా? ఒక్క అక్షరము హెచ్చుతగ్గు వ్రాసినయెడల రాక్షసకింకరులు వారిని దంచి పిండి పెట్టుదురు.

ఇంద్రు:—తరువాత నేమిజరిగినది?

యము:—తరువాత శంబరుఁడువచ్చి వారిలెక్కలు పరీక్ష పట్టినాఁడు కాని, అతఁడు కొంచెము మంచివాఁడు గనుక, దేవతలకు పుణ్యమెందుకు వేసినారని కోపపడి తీసివేయించి, ముందుకు నడిచిపోయెను. అతని వెనుక రాక్షసులొక్కరొక్కరేవచ్చి, నాకెంత పుణ్యము వేసినావు నాకెంతపుణ్యము వేసినావు చెప్పఁడనిఅడుఁగుచు పదిమందిచేరి నాకు ముందుచెప్పు నాకుముందుచెప్పుమని తొందర పెట్టుచు ఇంత యాలస్యమేమని యొకఁడును, నేనుండఁగా వానికేల ముందుచెప్పినావని యొకఁడును, నన్నుచూచి లేచినావుకాదేమని యొకఁడును, నాకుమర్యాద చేయనేలేదని యొకఁడును, చిత్రగుప్తులను తలయొక చెంపకాయకొట్ట మొదలుపెట్టిరి. రెండుగడియలసేపు వారిదాడలు రణభేరులవలెమ్రోగి, బూరెలలాగపొంగి, భయముచేత తొలగిపోయి సఖ్యము చేసికోవలెనని కాఁబోలును తమ స్థానమును బాసి రెండుదాడల పండ్లును ఒక్కచోట నోటిలో గుంపుగా చేరినవి.

ఇంద్రు:—అయ్యో! పాపము! చిత్రగుప్తుల కెంతటివిపత్తు సంభవించినది!

యము:—ఒక్కచిత్రగుప్తులకే కాదు. రాక్షసాధీశ్వరుఁడుసభలో కూరుచున్న తరువాత మాపురములోనివారి కందఱికిని బోసినోళ్ళైఅయిపోయినవి ఎవ్వరైనకొంద అదృష్టవంతులైన పక్షమున

వారు యేకదంతులయినారు. రాక్షసభటులు కొట్టిదిప్పన కాయలవలన మాభటులకొకరికిని తలమీఁద వెంట్రుకలు లేవు మీరొకవింతవిన్నారు కారుగదా? నేనుత్రోవలో వచ్చునప్పుడు బట్టతలవాఁడుకనఁబడినను బోసినోటివాఁ డెదురుపడినను మావారేమో అని నేను పరామర్శ చేయబోవుచువచ్చినాను. చూడు నాతలమీఁదకూడ వెంట్రుకలు లేవు. (అని కిరీటముతీసి తలతడవుకొని) నాతలమీఁద వెంట్రుకలు కనబడు చున్నవి. నేను నేనుకానేమో!

ఇంద్రు—(నవ్వి) ఏమోయి యమధర్మరాజా! నిన్ను నీవే యెఱుఁగనట్లు మాటాడుచున్నావు. అదృష్టనిభయముచేత మనసు చెదిరినది కాఁబోలును.

యము—బోడితల కాకపోవుటచేత నిజముగా నేనుయముఁ డను కానేమో అని సందేహముతోఁచుచున్నది. నేనేయముడనయిన పక్షమున, నెత్తిమీద అన్ని దెబ్బలు తగిలిన తరువాత ఇంకను వెంట్రుకలుండునా? మీరీ ధర్మసందేహము తీర్చవలెను.

ఇంద్రు—సందేహముమాట తరువాత చూచుకొందముగాని, తరువాత జరిగిన సంగతి చెప్పుము?

యము—తరువాత సంగతియేమున్నది? ఉక్కుతునియలువంటి రాక్షసులు పలువురువచ్చి సింహాసనములమీఁద కూరుచుండియున్న మునులను పితృదేవతలను చేయిపట్టుకొని యీడిచివైచి తామాసింహా సనములమీఁద కూరుచున్నారు. అప్పుడు (బతికిపోయితిమిగదా అని తలలు తడవుకొనుచు నిలుచున్న పితృదేవతలనుచూచి మఱికొందఱు రాక్షసులు, "వీరినివిడువకూడదు. రౌరవాదినరకములలో పడవేయు వలె" నని పడగెంటుచు రాక్షసరాజు వెంటనెట్టుకొనిపోయిరి. ఒక్క నిమిషములో రౌరవాదినరకములలో ఉన్న రాక్షసులకందఱకును

విడుదల ఆరంభమయి, వారిస్థానమునపిత్రు దేవతలకునరకలోకనివాస ప్రాప్తికలిగినది. అటుతరువాత రాక్షసులను నరకలోకములో వేసిన నేరమునిమిత్తము మాకు శిక్షలారంభమయినవి. అటుతరువాత మా దేహములమీఁద పుట్టిన పిడుగుల చప్పళ్ళు మీకు స్వర్గములో విన బడియేయుండును. పిత్రులోక రాజ్యసుఖమిక చాలును. ఇఁక నాయెత్తు ధనము గ్రుమ్మరించినను నేను పిత్రులోక పరిపాలనమునకు ఒప్పు కోను. ఇది నిశ్చయము.

ఇంద్రు—మనదూత లెవరో వచ్చుచున్నట్లున్నాఁడు. చూడు ఆవచ్చువాఁడు చిత్రరథుఁడులాగున నున్నాఁడు.

[చిత్రరథుఁడు ప్రవేశించుచున్నాడు.]

చిత్ర—ఓత్రిలోకాధీశ్వరా! నమస్కారము. మనపురమునకు యోజననూరములో హిరణ్యకశిపుఁడు సేనలతో నిలిచియున్నాఁడు. వెనుకపడినవారువచ్చి కలిసికొన్న తరువాతవచ్చిఅమరావతీనగరము నకు ముట్టవేయునట్లు తోఁచుచున్నది.

యమ—గోరుచుట్టుమీఁద రోకటిపోటుపడ్డట్టు, నాపత్తిని దెబ్బలమీఁదనేదెబ్బలు వ్రాసి పెట్టినట్లున్నవి. ఈసారి మంగలివా డక్కర లేకయే నాతల నున్నపడును. నాకు స్వర్గమునకు వచ్చినను గ్రహచారము తప్పినదికాదు. ఏమిచేయుదును?

కుబే—చుట్టమయి చూడవచ్చిన దయ్యమయిపట్టుకొన్నట్లు, మహేంద్రునిచూడవచ్చిన నన్ను రాక్షసులు పట్టుకొని మర్దింతు రేమో! ఏమిదిక్కు?

వరు—ఊరువిడచి పొరుగూరికి వచ్చినను పూనినకర్మము మానదన్నట్లు నాకేమిపాట్లు రానున్నవో!

ఇంద్ర—ఓదిక్పాలకులారా! మీరేమియు జడియవలసిన పని లేదు. ఆపదవచ్చినప్పుడు బుద్ధిమంతులైనవారు దానినితప్పించుకొను ఉపాయ మాలోచించవలెను గాని ఒకరిమొగము లొకరుచూచుకొనుచు తెల్లపోయి యుండరాదు. మీరందఱు బహుబుద్ధిమంతులు. మీమనస్సులు చెదరనియ్యక కొంచెముసేపాలోచించి మన మిప్పుడేమి చెయ్యవలెనో చెప్పుఁడు.

యమ—మాపట్టణము మాత్రమే కాక నామనస్సు కూడ ఏనుఁగు తొక్కిన తామర కొలనువలె పాడయియున్నది. నాకిప్పుడేమియు ఆలోచన తోఁచదు. తక్కినవారి నడుగుఁడు.

వరు—ఇక్కడనున్నవారిలో బుద్ధివైభవముచేత బృహస్పతిని మించినవారెవరును లేరు. అతని ఆలోచనవిని ఆయన మాటప్రకారము మన మందరమును నడుచుకొందము.

కుబే—ఔను. ఈమాట యుక్తముగానున్నది.

ఇంద్ర—ఓబృహస్పతీ! మీబుద్ధిబలముచేతనే యింతకాలమును మే మేయాపదలను పొందక సుఖముగానున్నాము. మనపట్టణముమీఁద ఘోరరాక్షసుఁడు దండెత్తివచ్చుచున్నాఁడు. ముందు చేయవలసినపని యేమో సెలవిండు. ఇఁక మాటలకవకాశము లేదు.

బృహ—నాబుద్ధికిచూడఁగా వానితో యుద్ధముచేయుట కార్యముగా కనఁబడదు. ఆరాక్షసేశ్వరుఁడు బ్రహ్మదేవునిచేత దుర్లభములయిన వరములనుపొంది పక్షులకజేయుఁడయి యున్నాడుగనుక మనమవశ్యముగా యుద్ధమున పరాజయము నొందుదుము. ఓడిపోయిన తరువాత వానిచేపొందెడు పరాభవమును అవమానమును పదిరెట్లు హెచ్చుగానుండును. నేను చెప్పవలసిన ముఖ్యాంశము చెప్పితిని. పిమ్మట మీయిష్టమువచ్చినట్లు చేయుఁడు.

ఇంద్ర—మనము పరాజితుల మగుదుమని నిశ్చయముగా తెలిసినప్పుడు యుద్ధమునకు పోవుటకంటె బుద్ధితక్కువ మరియొకటి లేదు, నాకుచూడఁగా మనమిప్పటి కారాక్షసుని మంచిమాటలతో సమాధానపరిచి సంధిచేసికొనుటయే ముఖ్యకార్యముగా తోఁచు చున్నది. అయినను మనవారిలో ఈపని నిర్వహింపగలవారు మీ రొక్కరుతప్ప నాదృష్టికి అన్యులెవ్వరును కనఁబడకున్నారు. కాఁబట్టి మీరు శిష్యవాత్సల్యముంచి మనజయంతునికూడ మీవెంటఁబెట్టు కొని రాక్షసరాజున కెదురుగాపోయి, కానుకలు సమర్పించి మా టాడవలసిన రీతిగామాటాడి; అతని యాగ్రహముడిపి, పట్టణము లోనికి తీసికొనివచ్చి విడిదలుకుదిర్చి అందుప్రవేశపెట్టుడు. అటుతరు వాత అప్పటికిపోలినట్లు చూచుకొందము.

బృహ—దేవకార్యము నిమిత్తమయి నన్నగ్నిహోత్రములో ఉఱుకుమన్నను ఉఱికెదను. కాఁబట్టి నేనవశ్యముగా పోయి నాచేత నయినట్లెల్లను ప్రయత్నముచేసి రాక్షసాధీశ్వరుని ప్రశాంతుని చేసె దను. అటుపయిని వానిచిత్తము మీభాగ్యము. మననారదుఁ డక్కడ ఇచ్చకములాడుచు, ఆరాక్షస రాజువద్దచనువుగా తిరుగు చున్నాడు గనుక, అతఁడు మనకు కొంతసహాయము చేయవచ్చును. అయినను నీనిమిత్తమయి నాకు పరితాపము కలుగుచున్నది. నీకిఁక సేవకవృత్తియేకాని దొరతనము కొంచెమైనను సాగదు. వజ్రాయుధ మును పట్టెడు చేతులతో కాళ్ళుపట్టవలయును; హంసతూలికాతల్ప ములఁ మీఁద మోపెడుపాదములతో పల్లకులవెంట పరుగులెత్తవల యును; కొట్టు తిట్టుమను మాటలు మఱచిపోయి 'అయ్య' 'చిత్తము' అనుమాటలు నేర్చుకొనవలయును. హా! ఇంద్రభోగమనుభవించెడు మహాభోగివి నీవు సేవకవృత్తి కెట్లుసహింపగలుగుదువు? హా! విధీ! ఎంతచేసితివి!

ఇంద్ర—మీరు నాసమిత్తమయి విచారింపఁబోకుఁడు. ఏ యెండకాగొడుగు పట్టవలెను. ఎప్పటికిని కాలమొక్కరీతిగానుండదు. అత్తకాలము కొన్నాళ్ళును కోడలికాలము కొన్నాళ్ళును వచ్చును. ఇంతవఱకును మనకుసుఖకాలము; ఇఁకనుకష్టకాలమువచ్చుచున్నది. అనుభవించి తీఱవలెను. మీరు వేగిరము విజయంచేసి కార్యసాధ్యము చేసికొనిరండు.

బృహ—జయంతా మనము వెళ్లుదమురమ్ము.

(అని యిద్దఱును పోవుచున్నారు)

ఇంద్ర—ఓ మునీశ్వరులారా! ఇంకొకనిమిషములో రాక్షసరాజిక్కడకు వచ్చును. అప్పుడు మీరీవేషములతో నున్నపక్షమున మండిపడును. మీరు భుజములయందలి శంఖచక్రములను శ్రీగంధము చిక్కగాపూచి మాఱుకొనుడు; ముఖములయందు నామములను దీసి వేసి విభూతిపట్టెలుపెట్టుడు; తులసిపూసలతావళములుదాఁచి రుద్రాక్షమాలలు ధరింపుఁడు.

జయ—ఓమహేంద్రా! మాకు శివకేశవులిద్దఱును సమానులే. మే మేచిహ్నములుధరించిననుధరింతుము. ఏదేవునికొలిచినను కొలుతుము. లోకములో మూఢభక్తిగలవారు కొందఱు తమకీసమభావములేక విష్ణుభక్తులను చూచిన శివభక్తులును, శివభక్తులను చూచిన విష్ణుభక్తులును, ద్వేషించుచు, మానుషస్వభావమును మరచి, తామే యధికులము తామే యధికులమని తగవులాడుచు, నిజమయిన భక్తియు సత్యమును దయాళుత్వమునులేక, బాహ్యచిహ్నములను మాత్రముధరించి వానినిమిత్తమయి పోరాడుచు, తాముకొలిచిన చిల్లరదేవతను కొలువనంతమాత్రముచేత శమ దమ దయా సత్యశౌచాది సమస్తసద్గుణ సంపూర్ణులయిన పుత్రులనైనను

పరమ శత్రువులనుగా భావించి ప్రేమానుబంధమును కోసివేసి బహువిధముల బాధలుపెట్టుచు రాక్షసకృత్యములు చేయుచుందురు. మేము యోగులమగుటచేత లోకమునిమిత్తము మే మే దేవతలను కొలిచినను, పరమార్థమునిమిత్తము సకలాంతర్యామి అయిన పరమాత్మునిని ఒక్కనినే హృదయములయందు నమ్మియుందుము.

ఇంద్ర—మునీంద్రా! ఈరాక్షసులు మీరు చెప్పిన మూఢాత్ములలోనివారు. వీరుశివభక్తులయివిష్ణువును నిష్కారణముగా ద్వేషించుచు, దురభిమానము కలవారయి శివభక్తులు కానివారినందఱిని దయాదాక్షిణ్యములు లేక సకలహింసలను పెట్టుచుందురు. వీరిలో నొకఁడు విష్ణునామము చెవిసోఁకునని చెవులకు ఘంటలు కట్టుకొని తిరుగుచున్నాఁడు; మఱియొకఁడువిష్ణుభక్తుఁడగపడునేమోయని కన్నులకు గంతలుకట్టుకొన్నాఁడు. వీరెంత యజ్ఞానులో చూచినారా?

జన—వీరొక్కరేకారు. ఇటువంటి అజ్ఞానులు సమస్తమతములలోను ఉందురు. ఆలోచనలేక వంశక్రమాగతమైన మతమునందును ఆచారములయందును దురభిమానము కలిగి, సత్యము నెఱుఁగ నొల్లకుండుట జనసామాన్య స్వభావము. ఎక్కడనో ప్రాజ్ఞులు కొందఱుమాత్రము ఏమతమువారిని ద్వేషింపక సత్యమెక్కడనున్నను గ్రహింపుచు, సదాచారముల నవలంబించుచు, సత్యము శాంతము భూతదయ మొదలగు సమస్తసద్గుణములును కలవారయి, తమ్ము ద్వేషించువారినికూడ ప్రేమించుచు, అజాతశత్రువులయి లోకోపకారమే పరమవ్రతముగా పూనియుందురు. అట్టిమహానుభావులు మాత్రమే పరమేశ్వరునియొక్క సంపూర్ణానుగ్రహమునకు పాత్రులయి, శాశ్వతసుఖ మనుభవింతురు.

ఇంద్రు—మునీంద్రా! తాళుము. ఏదో కోలాహలము వినబడు చున్నది. రాక్షసరాజువచ్చుచున్నట్లున్నాఁడు. మీరందఱును సింహాసనములుదిగి తగిన సత్కారము చేయువలెను.

(అప్పుడు హిరణ్యకశిపుఁడు, విప్రచిత్తి, శంబరుఁడు మొదలయిన రాక్షసులును తంబుర పట్టుకొని నారదుఁడును, వారివెనుక బృహస్పతియు ప్రవేశించుచున్నారు.)

హిర—(కోపముతో సభకలయఁజూచి) ఆదురాత్ముఁడయిన యింద్రపశు వెక్కడ నున్నాడురా?

ఇంద్రు—(వల్లెవాటుగానున్న ఉత్తరీయము నడుముకు చుట్టుకొని) స్వామీ! ఇదిగో మీదాసుఁడు వచ్చుచున్నాఁడు. నేను మీవాఁడను. నాకభయమిచ్చి రక్షింపుఁడు. (అని పాదములమీఁద పడుచున్నాఁడు.)

హిర—(తల యెడమకాలితో త్రోసివైచి) ఓరీకుత్సితా! నీవందిన సిగయు అందకున్న కాళ్ళను పట్టుకొనియెదవు. నీవెంత వేఁడినను మాకు నీమీఁద దయరాదు. ఓరిదురాత్మా! అవివేకీ! నాఁడు నారదునితో "నాచేతవజ్రాయుధముండఁగా లక్ష రాక్షసాధ్యక్షులు వచ్చినను నేను భయపడను" అన్న కండగ్రొవ్వు నేఁడయిన అడఁగినదా? లెమ్ము. పాదములమీఁదనుండి లెమ్ము. నీవు నాపాదములు ముట్టతగవు.

ఇంద్రు—(లేచి చేతులు జోడించుకొని) దేవర వారిప్పుడు సెలవిచ్చినట్లు నాయందవగుణము లెన్నియైననుఉన్నవి. నేను కుత్సితుఁడను. దురాత్ముఁడను. నేనవివేకినగుదును. నేరిచియో నేరకయో నేనుచేసిన నేరములుక్షమించి, కూరుచుకొనిరాకమీ రేకోపపడినపక్షమున నాకిఁక దిక్కెవ్వరు? మన మొక్కతండ్రిబిడ్డలము. అన్నదమ్ములము. మనలోమనమే యింత దుర్మత్సరముపూని తగవులాడుచున్న యెడలపరులుమనలను వేళెత్తిచూపరా? మనకదిచిన్నతనము కాదా?

హిర—ఓరీ! నీవిప్పుడు చెప్పిన బంధుత్వమంతయు లీలావతీ దేవిని చేయిపట్టియీడ్చి యింద్రలోకమునకు తీసికొనివచ్చినప్పుడేమై పోయినదిరా? ఈ వెర్రిమునులు నిన్నొక పెద్దనుచేసి పొగడుటచేత నీవు విర్రవీఁగి విశ్వము తెలియలేక కండకొవ్వెక్కియున్నావు. ఆక్రొవ్వెల్లను నేఁడు క్రక్కించెదను? చూడు.

ఇంద్రు—స్వామీ! నిగ్రహములకేమి? ఈయొక్క తప్పును సైపుము. ఇఁకమీఁదట నేనేమయినచేసిన నీయిచ్చవచ్చినట్లు నన్ను శిక్షింపుము. నేనెట్టియుపరాధినైనను దాసుఁడనని మీపాదములుచేరితిని గనుక దయతో రక్షింపదగును. ఆవల మీచిత్తము.

హిర—ఓరీ! వివేకహీనా! నీదయకుకోరిన బృహస్పతి మొదలయినవారు నీతప్పును సైరింపవలయునుగాని సైరించినదాఁకమాకేమిరా? నీయిచ్చకములుమాని రాజ్యమువిడిచి యెందయిన పొమ్ము.

ఇంద్రు—శరణన్నరక్షించుటవీరధర్మము. మీరుమహావీరులు. నేను మీదాసుఁడను; శరణార్థిని. నామీఁదకోపముంచకరక్షింపుఁడు రక్షింపుఁడు. దేవరాజ్యమువిడిచి తొలఁగుమని సెలవిచ్చుటకీరాజ్యమెవరిది? నేనెవఁడను? మేమందఱము మీవారముకామా? కావలసినపక్షమున, ఈదేవరరాజ్యమునుకూడ దేవరవారేపుచ్చుకొని నేఁటినుండి మీపాద సేవకుని నన్ను భార్యాపుత్రసహితముగా పోషింపుఁడు. ఇంతటినుండి దైత్యులను దేవతలనుకూడమీరేయేలుచు, మీసేవకుఁడనయిన నాకు మీచిత్తమువచ్చిన పనియేదో నియోగింపుఁడు. ఈ దిక్పాలకుల కందరికిని కూడ మనసునచ్చినపని పెట్టుఁడు.

హిర—(ఇంద్రుని పీఠముమీద కూరుచుండి) ఓరియింద్రా! మీరందఱును నాచేతిలోనివారే. రేపీమంత్రులతో నాలోచించి పిమ్మట మీవిషయమయి మాయిచ్చవచ్చినట్లు చేసెదము. నీవిప్పటికి దెబ్బలులేక బ్రతికిపోయినావు. మాయెదుటదూరముగానిలువబడుము.

విప్ర—ఓరీ! దుర్ముఖా! ఊరకచూచుచు నిలుచున్నా వేమిరా? ఈదిక్పాలకులను మునులను ఆనలకీడ్చి మనవారికి పీఠము లను చోటుచేయుము.

దుర్ము—చిత్తము. (అని దిక్పాలకులను మునులను పడ గెంటు చున్నాడు.)

మునులు—ఇదిగో పీఠములను మీకుసమర్పించి మేమే తొలగుచున్నాము. మమ్ము బాధింపకుండు నమస్కారము. (అని తొలఁగి అక్కడక్కడ నొదుగుచున్నారు.)

దిక్పా—కుమ్ముకొట్టకుండు. మేమిదె పీఠములను విడిచి వచ్చుచున్నాము. (అని వడఁకుచు దిగివచ్చి క్రిందనిలుచున్నారు.)

విపచ్చిత్తి, శంబరుడు—[పీఠములమీఁద కూరుచున్నారు]

విప్ర—ఓరీ దుర్ముఖా! ఈదిక్పాలకులందరును మనకడ్డముగా నిలుచున్నారు. వీరిని ప్రక్కలకు తొలఁగించు. ఓరీ! అలంబసా! ఆ మునులను చేతులు జోడించుకొని నిలువఁబడుమను.

దుర్ము—తొలఁగుండి. (అని త్రోయుచున్నాఁడు.)

అలం—చేతులు జోడించు. (అని చేయిపట్టుకొని విఱుచు చున్నాఁడు.)

హిర—ఓరీ! ఇంద్రా! ఆమూట మోచుకొని వచ్చువాఁ డెవఁడురా?

ఇంద్ర—స్వామీ! అతఁడగ్నిహోత్రుఁడు. భూలోకము నందు బ్రాహ్మణులు యజ్ఞములుచేసినందున దేవతలనిమిత్తమై హవి ర్భాగములను తెచ్చుచున్నాఁడు.

(అప్పుడొకమూటపట్టుకొని, అగ్నిహోత్రుఁడు ప్రవేశించుచున్నాడు.)

హవిర్భాగములు దేవతలకేమి? ఆ హవిర్భాగములు మాకిటు తెమ్మను.

ఇంద్రు—అగ్నిహోత్రా! నీ వా హవిర్భాగములను తీసికొని పోయి హిరణ్యకశిప మహారాజుగారికి సమర్పింపుము.

అగ్ని—చిత్తము. (అనితీసికొనిపోయిసమర్పించుచున్నాఁడు.)

హిర—(మూటవిప్పి కొంచెము నోటిలో వేసికొని) ఛీ! ఛీ! ఈ హవిర్భాగములు చప్పగా ఏడిచినట్టేయున్నవి. (అని మూట పార వేసి, అగ్నిహోత్రుని మొగముమీఁద నుమియబోవుచున్నాఁడు.)

అగ్ని—(మొగమునకు చేయడ్డముపెట్టుకొని) స్వామీ! కృతార్థుడనయినాను.

హిర—ఓరీ! అగ్నిహోత్రా! భూలోకమునందు యజ్ఞములలో సంకల్పమేమని చెప్పుచున్నారురా?

అగ్ని—శ్రీపరమేశ్వర ప్రీత్యర్థమని చెప్పుచున్నారు మహాప్రభూ!

హిర—అట్లుకాదు. ఇఁకముందు శ్రీహిరణ్యకశిప ప్రీత్యర్థమని సంకల్పము చెప్పించు. అట్లు చేయకపోయినయెడల నీవీపుచర్మ మొలిపించెదనుసుమా, జాగ్రత్త.

అగ్ని—చిత్తము, చిత్తము.

హిర—మేము దిక్పాలకులకందరికిని పనులుచెప్పుచున్నాము. ఓరీఅగ్నిహోత్రా! నీవుమాకు వంటలవాడవుగానుండుము. ఇప్పుడే నీవుపోయి మేము వచ్చులోపలస్నానమునకు నీళ్ళుకాచుము పో.

అగ్ని—మహాప్రసాదము. (అనిపోవుచున్నాఁడు.)

హిర—ఓరీ! వరుణా! నీవుమాకు నీళ్ళకావళ్ళు మోచువాడవుకమ్ము. నీవిప్పుడే అగ్నిహోత్రుని వెంటపోయి స్నానమునకు నీళ్ళు సిద్ధముచేయుము పొమ్ము.

వరు—చిత్తము (అని పోవుచున్నాఁడు)

హిర—ఓయిటు బేరా! మా యిష్టదైవమయిన ఈశ్వరునకు నీవు సఖుఁడవుగనుక నీకు మంచిపని పెట్టెదను. మాయింట వెచ్చము తెత్తువుగాని నీవుమాతో నుండుము.

కుబే—మహాప్రసాదము.

హిర—ఓయీ! విప్రజిత్తీ! నీవు వాయుదేవుని మనవీధులు తుడుచుటకు నియమించి, తక్కిన దిక్పాలకులకు కూడ నీయిష్టము వచ్చిన పనులు చెప్పు.

విప్ర—దేవరవారు సెలవిచ్చినట్లు చేసెదను.

హిర—(మూలవంక చూచి) చలిద్వారము వచ్చినవారివలె వడఁకుచు, ఆమూల నొదిగియున్నవాఁ డెవడురా?

యమ—స్వామీ! నేను దండధరుండను మీదాసుడను.

హిర—నీవు దండధరుండవా? నీవు యమలోకమునుండి మా కంటె ముందుగా వచ్చితావే. ఓవిప్రజిత్తీ! నీనిపేరు సార్థకమగు నట్లుగా నీనిచేతికొక కట్టయిచ్చి నీనిచేత మనపశువులను కాపించు.

విప్ర—చిత్తము.

హిర—ఓయీ నారదా! నీవొక్కసారి తంబురశ్రుతిచేసి, ఒక్క గీతమును పాడు.

నార—చిత్తము. (అని తంబురశ్రుతిచేయఁబోవుచున్నాడు)

హిర—నీచేత కాదు. నేను శ్రుతిచేసి చూపెదను. తంబుర యిటుతే. (అని పుచ్చుకొని టింగుటింగునమీటి బిరడతిప్పి తీగె తెప్పించుచున్నాఁడు) నారదా! ఈతంబుర మంచిదికాదు. దీనినెవఁడు చేసినాడో వాని పేరు చెప్పు. పట్టి తెప్పించి దొక్క బద్దలుచేయించె దము. (అని తంబురనిచ్చుచున్నాఁడు)

నార—చిత్తము. (అని తంబురపుచ్చుకొన్నాఁడు)

హిర—తావళముత్రిప్పుచు, ఏమేమోగొడుగుచు, వేలు గడ్డములతో మూగవాండ్రిలాగున నిలుచున్నారు. ఈయిద్దఱును ఎవరు?

మును—మేము మహర్షులము మహాప్రభూ!

హిర—మీరిప్పుడు చేసెడి దేమిటి?

మును—మేము జపము చేసికొనుచున్నాము.

హిర—ఎవరిని గురించి.

మును—పరమేశ్వరుని గురించి.

హిర—ఛీ. ఛీ. వేలకు. ఇకముందు మీరట్లు చేసినపక్షమున గుండెలు బద్దలుచేయించెదను. ఇకమీరు చేయఁబోయెడు జపము హిరణ్యకశిపునిగూర్చి చేయుఁడు. మీకు కావలసినవరములు మేమే యిచ్చెదము.

మును—చిత్తము స్వామీ!

హిర—మహర్షులు మీరెంతమందిరా?

మును—మే మేడుగురము మహాప్రభూ!

హిర—సప్తమహర్షులా? సరిసరి; సంఖ్యకు చక్కగానే కుదిరినారు. ప్రక్కకుముగ్గురేసిచొప్పున మీలో ఆఱుగురు మాపాలకీపట్టి మిగిలినవాఁడు కాగడాపట్టుడు. వేగిరముపోయి పల్లకిని సిద్ధముచేసికొనిరండు. మేమిప్పుడు నందన వనమునకు పోయెదము.

మును—చిత్తము. (అని పోవుచున్నాడు)

హిర—ఓరీ యింద్రా! రేపు మేముపోవునప్పుడు మాతోటలో వేయించుటకు నందనవనములోని కల్పవృక్షములన్నిటిని తీసికొనిపోవలెను. దేవతలను త్రవ్వి సిద్ధముగానుంచుమను. మాతోటలోని క్రీడాసరస్సునందునాటించుటకయి మానస సరస్సులోని బంగారు కమలములను దుంపలతోకూడా పెల్లగించి యుంచుమని చెప్పు.

ఇంద్ర—చిత్తము. ఈర్ష్యగ్రమేతనుది. తమయాజ్ఞప్రకారముగ చేసెదను.

హిర—నీవద్దనున్న అమృతభాండము మా విడిదికిపంపి విప్రజిత్త్యాదులకు పదిలముగా ఒప్పగించుటకయి జయంతుని నియమించి మేము మాపురమునకు తీసికొనిపోవుటకయి కామధేనువును, ఉచ్చైశ్రవమును, ఐరావతమును, మావాకిటిముంగల చెట్లకుకట్టించి సిద్ధముగా నుంచుమని చెప్పు.

ఇంద్ర—చిత్తము. దేవరసెలవిచ్చినట్లెల్లను చేయించెదను. ఓ జయంతా! నీవును బృహస్పతియు పోయి ప్రభువువారిప్పుడు నియమించిన పనులనెల్లను చేయింపుఁడు.

(బృహస్పతియు జయంతుఁడును పోవుచున్నారు.)

హిర—నారదా! నీవు ముందుగాపోయి సమస్తమహర్షులు వీధిలోపల్లకిని ఉంచినారో లేదో చూడు. ఓయీ! విప్రజిత్తీ! నీవు విడిదికిపోయి కామధేనువు మొదలయినవి వచ్చినతరువాత ఒప్పగించుకో. మేము శంబరునితోఁగూడ నందనోద్యానమునకుపోయెదము.

విప్ర—చిత్తము. (అని నారదునితోఁగూడ పోవుచున్నాఁడు.

హిర—ఓరీ! దుర్ముఖా! అలంబసా! మీరిద్దరును ఈయింద్రుని మీవశములో నుంచుకొని మావెనుక నడిపించుకొని తీసికొనిరండి. మేము నందనవనమునకు పల్లకిలో పోయెదము.

దుర్ము—మహాప్రసాదము.

హిర—ఇంద్రుఁడు పాఱిపోవునుసుమా! పదిలముగా తీసికొనిరండి. మనమూటలేవైన ఉన్నపక్షమున వీనినెత్తి నెత్తి మోపించుకొనిరండు. (అని శంబరుని వెంటబెట్టుకొని పోవుచున్నాడు.)

దుర్మ—(ఇంద్రుని చేయిపట్టిలాగుచు) ఉండు వెళ్లుదము. ఈరాత్రి నీవు మాయింటికి రంభను పంపవలెనుసుమా. నాకు మంచి యిల్లు సిద్ధము చేయించినావా?

ఇంద్రు—మీ సెలవుప్రకారము చేసెదను.

అల—(రెండవచేయి పట్టుకొని లాగుచు) రంభ లెంతమంది యున్నారు? రంభను దుర్ముఖునివద్దకు పంపినపక్షమున మరినాకో?

ఇంద్రు—స్వర్గములో రంభ ఒక్కతెయున్నది. నీకు ఊర్వశిని పంపెదనులే.

అల—నాకూర్వశి పనికిరాదు. ఈసారి మాప్రభువుగారితో బ్రహ్మలోకమునకు వెళ్ళినప్పుడు స్వర్గములోని వారినందఱిని రంభలనుగా ఎందుచేత చేయలేదో బ్రహ్మదేవుని పనిపట్టించెదను. యజ్ఞములు చేసినవారికి రంభాసంభోగము దొరకునని చెప్పుకొందురు. ఆ రంభ యిదేనా?

ఇంద్రు—ఇదే.

అల—నాకులేకుండ ముందుగా ఛాందసపు గాడిదకొడుకులు రంభనువారనుభవించుచున్నారా? ఇంటికిపోయినతరువాతస్వర్గములోనున్న సోమయాజుల నందఱిని నాకప్పగించు. ఇకరంభపేరు తలపెట్టకుండ ఒక్కొకనినే పట్టుకొని మెత్తగా దంచి వదలిపెట్టెదను.

ఇంద్రు—చిత్తము. అలాగున చేసెదను. మీయిల్లుసోమయాజుల మయముచేసెదను.

దుర్మ—అమృతమంతయు మారాజుగారికేపంపెదనని యొప్పుకొన్నావే. నాకెక్కడినుండి అమృతము తెచ్చెదవు? నాకమృతము పోయకపోయినపక్షమున త్రోవపొడుగునను దంచి రాజుగారిదగ్గరకు పోవునప్పటికి నీదేహము పిండిచేసి వదలిపెట్టెదను.

ఇంద్రు:—అమృతము ముందుగా నీకు పోసినతరువాతనే రాజుగారికంపెదను.

అల:— ఇప్పుడు మారాజుగారినే గౌరవము చేసినావుకాని నాకు మర్యాదచేసినావుకాదుగదా? ఈసంగతి మఱచిపోకు. నిన్నీ రాత్రి కొట్టులో పెట్టి రేకు మణగకొట్టెదను.

ఇంద్రు:—ఈతప్పు క్షమింపుము. ఇంకముందు రాజుగారి కంటె ముందుగా నీకే పెద్దరికము చేసెదను.

దుర్ము:—అలంబసా! మనము వేగిరము పోకపోయినయెడల ప్రభువుగారు కోపముచేయుదురు. మనబట్టలమూట ఈయింద్రుని నెత్తిమీద పెట్టి వీనిని వెంటబెట్టుకొని పోదమురా.

(అని యందఱును పోవుచున్నారు.)

చతుర్థాంకము

రంగము:— హిరణ్యకశిపుని సభాభవనము.

అల:—దుర్ముఖా! మనమహారాజుగారిప్పుడు మూడులోకములను జయించినారు. యక్ష, పన్నగ, గరుడ, కిన్నర, కింపురుషాది సమస్తదేవతలును భృత్యులయి ప్రభువారిని సేవించుచున్నారు. దిక్పాలకు లందఱును తమదిక్కులనువదలి నీవేదిక్కని మనరాక్షస సార్వభౌమునినే కొలుచుచున్నారు. మూడులోకములయందునుగల ప్రశస్తవస్తువులన్నియుమనపురము చేరినవి. మనమందరముపోయియజ్ఞ

ములు చెరచి, మునులను బాధించి విష్ణుభక్తులను వెదకిచంపి, విష్ణు పేరు లేకుండ రూపుమాపివచ్చినారము. మనరాజుగారికి మఱియేవిధ మయిన విచారమును లేదుగాని కుమారుని విషయమయిమాత్రము కొంచెము మనోవ్యథ పట్టుకొన్నది.

దుర్మ:—అలంబపా! ఏమీ చెప్పవు? కొమారుని విషయమయి యేమిమనోవ్యథ?మీరు స్వర్గమును కొల్లకొనివచ్చినతరువాత నేనిన్ని దినములక్కడనే రంభనిమిత్తమై కనిపెట్టుకొనియుండి స్వర్గమునుండి నేటిప్రొద్దుననే వచ్చుటచేత నాకీలోకమేక్రొత్తగానున్నది. నాకిక్కడి సంగతులేవియు తెలియవు. మీవెనుకనేవచ్చుచున్నానని చెప్పి మిమ్ము మోసపుచ్చి యింతకాలము స్వర్గములోనున్నను తుదకు నాకు రంభ యొక్క ముఖదర్శనమయినను లభించినదికాదు. మనరాజుగారు స్వర్గముమీదికి దండెత్తివచ్చినారని విని, తనకెక్కడమానభంగము వచ్చునో యని జడిసి రంభ యెవ్వరికిని తెలియకుండ ఆత్మహత్య చేసికొన్నదంట? ఇది మహారహస్యము. నీవీసంగతి యెవ్వరితోను చెప్పకుమా. నేనీమాట మొట్టమొదట నమ్మక నన్ను దేవతలు మోసముచేసియుందురేమో యని తలంచి యింతకాలమక్కడ సహస్రాక్షుడనై యుండి చెట్లు పుట్టలు రాళ్ళు రప్పలు సమస్తమును శోధించి చివరకు వారిమాటసత్యమనినమ్మి బయలుదేఱి వచ్చినాను. నన్ను మోసపుచ్చుటకు దేవతలకు గుండెలున్నవా? వారు సత్యమే చెప్పినారు. రంభ యెక్కడను కనంబడలేదు. అందుచేత రంభ నిమిత్తమయి వచ్చిన సోమయాజులనందఱిని చావమోఁది రంభా సంభోగము దొరికినంత సంతోషమును పొంది వచ్చినాను.

అలం—సోమయాజుల విషయమై నేను చేయుదలఁచుకొన్న పనిని నీవే చేసివచ్చినావు గనుక, నాకు పరమానందముగానున్నది.

దేవతలు నిన్నిట్టిమోసము చేసినారుగదా! రంభ చావదు. దేవతలకు చావులేదని నీకు తెలియదా? రంభ ఆత్మహత్య చేసికొన్నదన్న నీవెట్లు నమ్మినావు? రంభయిల్లు గంధర్వపీథిలో కొట్టుకొననున్నదే, నీవా బంగారుమేడను వెదకినావా?

దుర్ము—అయ్యో! నేనిండ్లమాటే మఱచిపోయినాను. నే నేయిల్లును వెదకలేదు. మనము బాల్యమిత్రులమయియుండఁగా, దేవతలకు చావులేదన్నమాట యింతవఱకును నాకు చెప్పినావు కావుగదా? ఇంతమిత్రద్రోహముచేసినావుగనుక, నేను తెచ్చుకొన్న వస్తువులలో నీకొక్కటియునియ్యను. ఆహా! దేవతలు నన్నెంత మోసముచేసినారు? నేనుపోయి హరినిశిక్షించిరావలెను. ముందుగా మన ప్రహ్లాదునికథ నాకు చెప్పు. ఆకథ విని నేను స్వర్గమునకుపోయెదను. నేను స్వర్గమునకు దారి మఱచిపోయినాను. నీవే చెప్పవలెనుసుమా? మఱచిపోక తరువాత చెప్పు.

అలం—నేనిప్పుడే చెప్పెదను. తరువాత నేను మఱచిపోయిన యెడల, మరలమిత్రద్రోహముచేసినానందువు. ఇప్పుడే తిన్నగావిను. మరలచెప్పుచున్నపక్షమున నాకీచెప్పినత్రోవరాదు. నీవిక్కడనుండి తిన్నగాపయికిలేచి, ఆకాశమార్గమున పదియోజనముల దూరమెగిరి, అక్కడనుండి తూర్పునకుతిరిగి, పడమరకుమరలి, నూటిగాదక్షిణము చేరి, ఉత్తరపుదిక్కుకేసినడచి, అక్కడనుండి తిన్నగా మోచేతవంపుగా మూలకుపోయి పయికెక్కి క్రిందికిదిగి, వాయువ్యమూలచేరి, ఆగ్నేయమూలనుండి యీశాన్యమూలకువంగి, నైరృతిమూలను విశ్రాంతిపొంది బయలుదేఱి, అక్కడనుండి ముక్కుసూటిగా పయికెరిగినపక్షమున తిన్నగా రాజవీథినిపడి కాళ్ళు నొప్పులెత్తువఱకును నడిచినసరిగారంభయొక్క పెరటిగుమ్మముచేరుదువు. ఇంక రెండవవారి నడుగవలసినపనిలేదు. నీవు రంభాసంభోగముచేసి వచ్చునప్పుడు నా

కమృతమును తీసికొని రావలెనుసుమా. అప్పుడు రేయుంబగళ్ళు ప్రభువుగారితో ఉండవలసివచ్చుటచేత మరల ఇంద్రునిచూచి అమృతము తెచ్చుకొనుట కవకాశము చిక్కినది కాదు.

దుర్మ—స్వర్గములోని అమృతపుకుండనే యిక్కడకు పట్టుకొనివచ్చెదను. ఇప్పుడు నీవుచెప్పిన స్వర్గమార్గముమాత్రము నామనసున పట్టలేదు. ముందుగా ప్రహ్లాదుని సంగతిచెప్పు. స్వర్గముమాట తరువాత చూచుకొందము.

అలం—అట్లయిన వినుము. మనమహారాజుగారి పుత్రుండు తల్లిదండ్రులుపిలిచిననుపలుకక తనలోనే యేమోమాటాడుకొనుచు ఆడుచు, పాడుచు, నవ్వుచు, చేతులుజోడించుకొని నమస్కరించుచు, ఆనందించుచు, తఱుచుగాపరధ్యానముతో నుండఁగాచూచి, హిరణ్యకశిప మహారాజుగారు చిన్నపోయియుండి, వీనికి వెఱ్ఱియెత్తినదో భూతము సోఁకినదో యని విచారించి, ఆతఁ డప్పుడప్పుడుతల్లిదండ్రుల వద్దకుపోయి ప్రేమతో పలుకుచు ముద్దులుచూపుచు వచ్చుచుండుట చేత మరల కొంత సంతోషము తెచ్చుకొని, విద్యచెప్పినంగాని యీ చిన్నిపాపఁడు మతిమంతుఁడు కాఁడని నిశ్చయించి, గురుపుత్రులగు చండామార్కులను రప్పించెను.

దుర్మ—తల్లిదండ్రులెప్పుడుచు పుత్రులు ఏవేళలైనపక్షమున పరమానందభరితులగుదురు; కొడుకులు జడులయిన పక్షమునచింతాక్రాంతులయి తక్కినసుఖముల నన్నిటిని దుఃఖములుగా నెంచుకొందురు. ఆహా! లోకములో కొడుకుల మీఁది ప్రేమానుబంధ మెంత యధికమయినది? శుక్రాచార్యుని పుత్రులను పిలిపించినతరువాత రాజుగారేమి చేసినారు?

అలం—చండామార్కులురాఁగానే రాజుగారు వారికి నమస్కారము చేసి తగినపీఠములమీఁద కూరుచుండ నియోగించి, అంతః

పురమునుండి కొడుకును పిలిపించి, నాయనా రమ్మని చేరఁదీసి తొడ మీఁద కూరుచుండఁ బెట్టుకొని జుట్టుదువ్వుచుఁ "లోకములో చదువెఱుఁగనివాఁడు మూఢుఁ డగును; విద్య నేర్చిన పక్షమున సదసద్వివేకముకలిగి పండితుఁడగును. కాఁబట్టి, తండ్రీ! నీ వీ గురువులవద్ద విద్య నేర్చుకొమ్ము" అని, గురుకుమారులవంక చూచి "ఓ గురుపుత్రులారా! వీఁడు విద్యాగంధము లేని హేతువుచేత రాక్షసవంశమునకు సహజమైన ప్రతాపగుణ మేమియు లేక, అడవులలో తపస్సులుచేయు మునులవలె శాంతాత్ముఁడయి కనఁబడుచున్నాఁడు. మన్నుతిన్నపాము వలె మందుఁడయియున్న వీనిని మీవెంట తీసికొనిపోయి విద్యాభ్యాసము చేయించి కన్ను తెఱపి నీతిశాస్త్రకోవిదునిచేసి రక్షింపుఁడు" అని చెప్పి కొమారుని వారికొప్పగించెను.

దుర్ము—వారేమి చేసినారు?

అలం—వారు రాజుగారివలన సత్కారమునుపొంది సెలవు పుచ్చుకొని, బాలకుని తమయింటికి తీసికొనిపోయి, అక్షరాభ్యాసము చేయించుటకయి ముందుగా గురువులు "ఓం నమశ్శివాయ" యుపదేశింపఁగానే ప్రహ్లాదుఁడు "ఓం. నమో నారాయణాయ" అని చెప్పెనఁట?

దుర్ము—శివశివా! ఎంతపాపపుమాట వినఁబడెను? నోరెఱుఁగని పసిబాలకునకీమర్యాద యెవరుచేసినారో? ఆపాపాత్ముని పేరిఁక నాముందఱ ఉచ్చరింపఁబోకు.

అలం—విష్ణు నామము లేకుండ నేను కథ యెట్లుచెప్పఁగలను? ముందుకథఅంతయు ఆ పేరుతోనే యున్నది.

దుర్ము—అట్లయిన నాకు ఇఁక నీ వేమియు చెప్పనక్కఱలేదు. నీవు చెప్పఁబోయెడి దంతయు నాకు తెలిసిపోయింది.

అలం—ప్రహ్లాదుఁడు గురువులేమి చెప్పినను చెవిబెట్టక, విష్ణు నామము పాటగా పాడమొదలుపెట్టినాఁడట!

దుర్మ—ఛీ! ఛీ! మాటాడకు. ఆపాడుపేరు నా చెవిని వలదన్నను, పడనీయమా నక నామతి చెడఁగొట్టుచున్నావు. మఱచిపోయినాను. నేనిప్పుడిక్కడ కెందుకు వచ్చినానో చెప్పఁగలవా?

అలం—నే నెందు నిమిత్తము వచ్చినానో కూడ పరాకుపడినాను. నే నేపనిమీఁద వచ్చియుందును?

దుర్మ—నీపని మఱచిపోతే పోయినావుగాని నాపనియేదో చెప్పు. నీకేమి? చెప్పినపని నేను చేయకపోయినపక్షమున రాజుగారు నన్ను చంపివేయుదురుసుమా. నేను దెబ్బలుతిన లేను. వేగిరము చెప్పు.

అలం—నేనువచ్చినపని నీవు చెప్పిన పక్షమున, నీవు వచ్చిన పని నేనూహ చేసి చెప్పెదను. నీవు చెప్పనిది నేను చెప్పుటకు నేను మాత్ర మంత వెఱ్ఱివాఁడ ననుకొన్నావా యేమి? నేను దెబ్బలు మొదలే తిన లేను.

దుర్మ—నీ వీ సభాభవనములలో ప్రహ్లాదునికథ చెప్పుటకు వచ్చినావు.

అలం—నీవు వినుటకువచ్చినావు. ఏమీ! ఇదిసభాభవనమా? అట్లయిన నేనువచ్చినపని నాకు జ్ఞప్తికివచ్చినది. నాకు దెబ్బలు తప్పిపోయినవిలే. ప్రహ్లాదుని చదువు పరీక్షచేయుటకయి రాఁబోవుచున్నాము గనుక సభాభవనములో పీఠములు వేయుమని రాజుగారు నన్ను పంపినారు. ఇది నేనుప్రతిదినమును చేసెడు పనియే అయినను నే నెంతలో మరచిపోయినానో చూచితివా? ఒకానొకప్పుడెంతటి బుద్ధిమంతులకయినను, మఱపుండును. "ప్రమాదో ధీమతామపి" అని మాగురువుగా రెప్పుడును చెప్పుచుండెడివారు.

దుర్మా—నా దెబ్బలంతకమునుపే తప్పిపోయినవి. 'పసుపు పరీక్ష' అన్నతోడనే నాపని నాకను స్మరణకు వచ్చినది. నన్నును చండామార్కులను శిష్యసహితముగా వెంటబెట్టుకొనిరమ్మని రాజుగారే పంపినారు. నేనుపోయి తీసుకొనివచ్చెదను. అయ్యో! నావంటి బుద్ధిమంతునకు కూడ మఱపుకలిగినదికదా? (అని పోవుచున్నాఁడు)

అలం—నేను పీఠములను వేసెదను. వీధిలోకలకలము వినఁబడుచున్నది. రాజుగారు వచ్చుచున్నారేమో!

[హిరణ్యకశిపుఁడును, లీలావతియు ప్రవేశించుచున్నారు]

హిర—ఓరీ! అలంబసా! నీవింకను పీఠములు తిన్నగా వేసినావు కావేమిరా? నీకు భయభక్తులు లేనట్టున్నవే. (అని పీఠము మీఁద కూరుచున్నాఁడు)

అలం—స్వామీ! దేవరవారియెడ నాకున్న భయభక్తులు మరియెవ్వరికినిలేవు. నాకున్న భయముచేతనే చేతులు వడఁకెత్తి పీఠములు తారుమారులయినవి. చేతులుజోడించుకొని వంగినిలుచున్న యీబాలకము చూచినమాత్రముననే నాభక్తి యేలినవారికి విశదము గాఁగలదు.

హిర—ఏడిచినావులే. ఈ నక్కవినయములుమాని తిన్నగా నిలుచుండు. దేవీ! నీవీపీఠముమీఁద కూరుచుండుము. మనముప్రహ్లాదుని గురువులయింటికి పంపివేసి చిరకాలమయినది. వానినిగురువులు కఠినశిక్షచేసినట్లు నాకు రాత్రి స్వప్నమువచ్చి నామనస్సెంతో పరితాపపడినది. అప్పటినుండియు వానిని చూడవలెనని నాబుద్ధి వానిమీఁదికిపాఱి తెల్లవారినదాఁక నిద్రపట్టినదికాదు. నాధ్యానమంతయు వానిమీఁదనే యుండుటచేత తెల్లవారుజామునను యొకభటునిపంపి గురువులవెంట ప్రహ్లాదుని తీసికొనిరమ్మని పంపినాను. ఇంతకాలమును

గురువులేమేమిబోధించినారో, బాలకుఁడేమి నేర్చుకొనెనో మనమిప్పు డు పరీక్షచేయుదము. కొడుకులవిద్యాబుద్ధులుచూచి సంతోషించుట కంటె తల్లిదండ్రుల కధికసంతోషము మరియొకటియుండునగదా?

లీలా—ప్రాణనాథా! మనముద్దుకుమారుని నెడబాసియెంతో కాలమయినది. అప్పటినుండియు నాప్రాణములన్నియు వానిమీఁదనే యున్నవి. వాఁడు విద్యాబుద్ధులు నేర్చుకొనుచున్నాడన్న ధైర్యము చేతనే నింతకాలము నిమిష మొకయుగముగా సహించఁగలిగితిని గాని వాని ముద్దుమొగము చూడక నేనిఁక నొక్కదినమయినను తాళలేను. అందుచేతనే ప్రహ్లాదుని నొక్కసారి పిలిపింపుఁడని దేవర వారితో మనవిచేసినాను.

హిర—వానిని తీసుకొని రమ్మని నేను రెండవసారి మర్కు ఖునిఁగూడ పంపినానే? వాడును పోయినదేపోక అయినాఁడు. చండా మార్కులు శిష్యునితీసికొని యీవఱకే వచ్చియుండవలసినది. అదిగో వారు వచ్చుచున్నట్లున్నారు. వారికంటె ముందుగానే మన విప్రజిత్తియు వచ్చుచున్నాఁడు. విప్రజిత్తీ! వచ్చికూరుచుండుము.

విప్ర—చిత్తము. (అని కూరుచున్నాఁడు)

[అప్పుడు చండామార్కులును, ప్రహ్లాదుఁడును, ధర్మఖుఁడును ప్రవేశించుచున్నారు]

లీలా—అదే నాముద్దుకొమారుఁడు నాకు కన్నులపండువు జేయుచున్నాఁడు. (అని చేతులుచాఁచి కొమారుని కౌఁగిలించుకొని ముద్దు పెట్టుకొనుచున్నది)

హిర—గురువులకు నమస్కారము. పీఠమునిమీఁద దయ చేయుఁడు.

చం—నిరంతర కళ్యాణసమృద్ధిరస్తు. (అని కూరుచున్నారు)

లీలా—ప్రహ్లాదా! నీతండ్రిగారు నీవిద్యామహిమనుచూచి

సంతోషింపవలెనని కడువేడుక పడుచున్నవారు. నీవు నేర్చిన విద్య చూపి వారికానందము కలుగజేయుమా,

హిర—ప్రహ్లాదా! నాతండ్రీ! ఒకసారి నాతొడమీఁద కూరుచుండి నాకుముద్దిమ్ము(అని చేరదీసి తొడమీఁదకూరుచుండఁ బెట్టుకొని బుగ్గలు ముద్దుబెట్టుకొని జుట్టునిమురుచు) నాయనా! నీతల్లి నీచదువుచూడవలెనని ముచ్చటపడుచున్నది. నీవేమేమి చదివినావో నీగురువులేమేమి నీతిశాస్త్రములు నీకు నేర్పినారో చెప్పి, నీవు చదివిన వానిలో నొక్కపద్యము చదవి, యేదీ దానియర్థము చెప్పుమా చూతము.

ప్రహ్లా—తండ్రీ! నేను చదివినచదువు లెన్నియైన యున్నవి. నాకు గురువులెన్నియైనను చెప్పినారు. చదువులన్నియు వట్టి నిస్సారములు. సకలశాస్త్ర సారమయిన చదువు నేరొకటియున్నది.

హిర—నాయనా! నీవు సకలశాస్త్రములుకూడ గ్రహించినావుగా? ఏదీ నీవెఱిఁగిన సారాంశము? నేనుకూడగ్రహించి సంతోషించెదను చెప్పు.

ప్రహ్లా—ఓదానవేంద్రా;

గీ. ఏను నేర్చిన సారాంశ మిదిగొనినుము—
సారహీనము లిహలోక సౌఖ్యతతులు;
సారమొక విష్ణుభక్తియె సత్యముగను;
కడమవన్ని యసారములు పుడమిమీఁద.

హిర—(తనలో) ఆహా! ఏమి నాపుత్రుఁడు కులాచారవిరుద్ధమయిన విష్ణువినుతిచేయుచున్నాఁడు! (ప్రకాశముగా) నాయనా!నీకిది బుద్ధికాదు. విష్ణునిస్తుతించుట మనరాక్షసకులములోతప్పు. నీవు తెలియక యీవరకేమిచేసినను చేసితివిగాని యిఁకముందెప్పుడును నాకు

విరోధియైన విష్ణునిపేరు తలపెట్టకుము. మన వంశములోలేని విష్ణు భక్తి నీకెందుకు? అదిమాని కావలసినపక్షమున శివునిబ్రస్తుతింపుము.

ప్రహ్లా—

సీ. విష్ణుభక్తితో వినుతింపఁగాలేని
జిహ్వజిహ్వయె గొడ్డుజిహ్వగాని
పురుషోత్తమునిఁ బ్రేమఁబూజింపఁగాలేని
చేయిచేయియె మొండిచేయికాని
యచ్యుతుఁబ్రీతితో ధ్యానింపఁగాలేని
మనసుమనసె కొయ్యమనసుగాని
నారాయణునిఁగూర్చి నారయుగాలేని
బుద్ధిబుద్ధియె మంకు బుద్ధిగాని
దేవదేవుని నిర్మలసేవలేని
జన్మజన్మయె దురితంపు జన్మకాని
పరమపావన పరిశుద్ధభజనలేని
నరుడునరుఁడె తా వెడఁగువానరుడుఁగాని.

హిర—పుత్రకా! నీవాక్యము నాకిప్పుడుకర్ణములకు శూలమై నాటుచున్నది. అతిపాపాత్ముఁ డెవ్వఁడో యిప్పుడు నీమనస్సులో నానహించి యున్నందున, నాయెదుట వినరానిపలుకులు పలుకుచున్నావు. ఆవిష్ణుఁడు మనకు శత్రుపక్షమువాఁడు. మన మా పాపాత్ముని పేరెప్పుడును స్మరింపరాదు. నాబుద్ధివిని విష్ణు స్మరణము మానుము. (విప్రజిత్తివంకజూచి) ఓయీవిప్రజిత్తీ! నిన్నావా మన ప్రహ్లాదుని విపరీత సంభాషణము? బాలకులేమియు నెఱుఁగరు. ఎవ్వరేమను మన్నను వానినట్లందురుగాని మంచియు చెడ్డయు విచారింపఁజాలరు. నోరెఱుఁగని వీని కెవ్వరో దుర్బోధచేసి విష్ణుభక్తిని గట్టిగా

మనసునపట్టించినారు. అంతేగాని వీనికీబుద్ధి లోపల పుట్టినదికాదు. నీ వేమితలంచెదవు?

విప్ర—తెలియనివానిని జేసి యీ బాలకున కెవ్వరో నీతి మాలినవారు తప్పక యీదురోధచేసియుందురుగాని యిది యీపసి పాపనికి తనంతపుట్టినబుద్ధికాదు.

హిర—(కన్నులెఱ్ఱచేసి గురుపుత్రులవంకజూచి) ఓబ్రాహ్మణ బ్రువులారా! నీతిశాస్త్ర పారంగతుని జేసెదమని చెప్పి నాకుమారుని మీయింటికిఁ దీసికొనిపోయి యీపాడువిష్ణుభక్తినా యిన్నాళ్ళును నేర్పినారు? మీరీ బాలకుని నేమో నీతికోవిదునిచేయుదురని భ్రమ చేత గురుపుత్రులని నమ్మి మీకొప్పగించినందుకు మీ రీపసిబిడ్డనికి రాక్షసాంతకుఁడయిన విష్ణుని వినుతింపుమని చెప్పి మంచినీతి నేర్పినారు. ఈపసిపాపని కీలాగున శత్రుపక్షములు బోధించుట మీకుతగునా? నిజముగా బ్రాహ్మణ వేషధారులయియున్న కిరాతులుగాని మీరు గురువులుకారు.

చండా—ఓరాక్షససార్వభౌమా! మామీఁద కోపపడఁబోకుము. మేము నీక్షేమమునుగోరెడు గురుపుత్రులముకాని శత్రులము కాము. అట్టి మేమెప్పుడయిన నీపుత్రునకు శత్రుపక్షములు చెప్పుదుమా? మీపాదములతోడు. వీనికి విష్ణుభక్తితనంతనేకలిగినది కాని యొకరు చెప్పి పెట్టినదికాదు. ఓమహారాజా! మాయెడ లేశమాత్రమును తప్పులేదు. మమ్ము మన్నింపుము. నీకొమారుని చేష్టలు నాశిష్యులెఱుఁగుదురు; వారినడిగి తెలిసికొమ్ము. (అనిప్రహ్లాదునివంకఁజూచి) ఓకుమారకా! చూడఁబోయిన నీవింతలేవు. మేము చెప్పినశాస్త్రములోని ముక్క యొక్కటియైనను చెప్పక, విష్ణుని బంటువలె పొగడి యీసభలోమహారాజుగారిముందరమమ్ము తలలువంచుకొనునట్లుచేసి

నావు. ఇటువంటిమంచిశిష్యుఁడు దొరకినతరువాత మాకుతలవంపులు రాక యెట్లుమానును? విద్యచెప్పిన గురువునకు నీవు పేరును ప్రతిష్ఠయు చక్కగా తెచ్చినావు. అన్నా! నీతండ్రివద్ద విష్ణుకథలు చెప్పక మేము చెప్పిననీతులు చెప్పుమని త్రోవపొడుగునను బోధచేసినందుకు మంచిపని చేసినావు.

హిర—ఓగురుపుత్రులారా! జ్ఞానమెఱుఁగనియీపసిబాలకుని మీరెందుకు కసరెదరు? గురువులు శిష్యులను మంచిమాటలచేత తమకు లోఁబఱుచుకొనవలెనుగాని కోపపడికాదు. వీనికెవ్వరోకుత్సాత్ములు దుర్బోధచేసియున్నారు. మీరూరకుండుఁడు. నేను బుజ్జగించియడిగెదను. (కుమారునివంకతిరిగి) నాయనా! గురువులు చెప్పనియీబుద్ధులు నీకెవ్వరు చెప్పినారు? నీకీకుర్నీతులు మనసున పట్టించినవారెవ్వరో వారిపేరు చెప్పుము. నేనిప్పుడే వానినిపట్టి శిక్షించెదను.

ప్రహ్లా—తండ్రీ! దుర్లభమయిన యీవిష్ణుభక్తి ఒకరుచెప్పినంతమాత్రముచేత వచ్చునా! ఆజగదీశ్వరునియొక్క నిర్హేతుకజాయమాన కటాక్షముచేతనే నాకు హరిభక్తియను నిధానములభించినది. ఆహా! యేమిభాగ్యము!

గీ. విష్ణుభక్తికంటెను విష్ణువిరుతికంటె
నెక్కుడయినట్టి ధర్మమీయిలనులేదు
భాగ్యవశమున నాకిదె పట్టువడియె
విబుధులకు దుర్లభంబైన విష్ణుభక్తి.

హిర—(కోపముతో) ఓరీ! కుమారకా! నీవు రాక్షసకులమున పుట్టియు కులాచారమును విడిచి నాసమ్ముఖమునఁగూడరాక్షసకులమునకు శత్రువయిన దుర్జనునివిష్ణుని సంస్మరించుచు నాబుద్ధినివినకున్నావు. ఓరీ పితృద్రోహీ! జనకునియాజ్ఞనుమీఱికులాచార విరుద్ధ

మయిన విష్ణునామస్మరణము చేయుటకు నీకు తగునా! నీవింతటనైన బుద్ధి తెచ్చుకొని విష్ణుభక్తి విడువని పక్షమున, నిన్నిప్పుడు పట్టి శిక్షించెదను సుమా!

ప్రహ్లా—ఓతండ్రీ! క్షణభంగురమయిన యీశరీరమును మీరెన్ని బాధలు పెట్టినను, నాహృదయముమాత్రము శాశ్వతానంద ప్రదాతయయిన యాపరమేశ్వరునినుండి మరలనేరదు.

గీ. తండ్రి! నీయాజ్ఞయైనచో దడవులేక
ప్రాణమైనను నిచ్చెదభక్తితోడ;
చెలఁగి మఱియేమి చెప్పినఁ జేయువాఁడ
విష్ణుభక్తినిమాత్రమే విడువఁజాల.

హిర—ఓరీ! కులద్రోహీ! నీవింక నాతోడయిఁద కూరుచుండఁదగవు. పో. పో. (అని క్రిందికిపడఁద్రోచి) ఓరీ! దుర్ముఖా! ఓరీ! అలంబసా! ఈపాపాత్ముఁడు మేమెంత చెప్పినను తన మార్గమును మానకున్నాఁడు. వీఁడు శిక్షలచేతఁగాని మంచిమాటలచేత చెప్పినట్లు వినఁడు. మీరు వీనిని పట్టికొనుఁడు. పొడువుఁడు; అప్పుడు వీనికి విష్ణుఁడెవఁ డడ్డమువచ్చునో చూతము.

దుర్ము—మహాప్రసాదము. స్వామీ! దేవరయాజ్ఞ శిరసావహించి చేసెదము.

హిర—ఏమీ? మీరు మొద్దులలాగున కదలకున్నారేమి? వీఁడు దండనముచేతఁగాని మంచిమాటలచేత చక్కఁబడడు. తన్నుఁడు; పొడువుఁడు.

[దుర్ముఖుఁడును, అలంబుఁడును ప్రహ్లాదుని తన్ని, గుద్ది పొడిచి బాధింపుచున్నారు.]

ప్రహ్లా—ఓదీనశరణ్యా! ఓజగదీశ! ఓభక్తవత్సల! ఓప్రసన్నరక్షక! (అని స్మరించుచు నిశ్చలుఁడుగా నున్నాఁడు.)

లీలా—(మగనితో రహస్యముగా) ఓప్రాణనాథా! ఈపసి బాలకుని రాక్షసులిట్లు క్రూరచిత్తులయి ప్రహరించుచుండఁగా కన్నకడు పగుటచేత నేను చూడఁజాలకున్నాను. వారెంతకొట్టినను వీని మొగమున దీనభావమగపడదు. అట్లయినను నామనస్సుమాత్రము వేఁడిపాలలోఁబడ్డ బల్లిలాగున పరితపించుచున్నది. వీనికి మనము మిత్రత్వముననే బుద్ధిచెప్పవలెనుగాని యీపసిబాలకుని యెడల మనము శత్రుత్వము సాధించ తలఁచుకోరాదు. నామనవి చిత్తగించి యీబాలకుని సామవచనముల చేతనే బుద్ధిచెప్పి సాధునిచేయు నట్లను గ్రహించి యాజ్ఞాపింపుఁడు.

హిర—(రహస్యముగా) ఓప్రాణేశ్వరీ! నాకుమాత్రము వీని యందుపగయున్నదా? వీనిశ్రేయస్సునుగోరియే బాలుఁడు నిష్కారణముగా చెడిపోవునని నయమున భయమున బుద్ధిచెప్పవలసి వచ్చినది. పుత్రకుని రాక్షసులకప్పగించి పయికి నేనెంతగంభీరముఁగా గూరుచున్నను, వానినికొట్టెడు దెబ్బలన్నియు నాదేహముమీఁద పడినట్లుండి లోపల నామనస్సెంతో బాధపడుచున్నది. అయ్యో! నాకెంత కష్టమయిన యవస్థతటస్థించినది! నేనేమిచేయుదును? ఏమిచేయుటకును తోఁచకున్నది. (అని దుఃఖమభినయించుచున్నాడు.)

విప్ర—(వారియభిప్రాయ మెఱిఁగి రాజుతో రహస్యముగా) ఓరాజేంద్రా! ఇతఁడుమీకుఁబుత్రుడుగాని పగవాఁడు కాఁడుగదా? మీకీబాలునితోడిదేమి? కొంతకాలముపోయిన వీనికే బుద్ధివచ్చును. మీరింక నిగ్రహములుమాని పుత్రుని ననుగ్రహింపుఁడు.

దుర్మ, అలం—(బాధ నభినయించుచు నిలుచుండి) ఓరి బాలకా! నిన్ను కొట్టికొట్టి మాచేతులునొచ్చుచున్నవిగాని నీకుకంట తడిరాదు; లేశమయినను భయమగపడదు; విష్ణుభక్తిని విడిచెదనని

తండ్రినైనను శరణుచొరవు; రక్షింపుమని తల్లివద్దకైనను పాఱిపోవు. ఇదియేమో మహామాయగానున్నది. నిన్నుకొట్టిన దెబ్బలచేతమాకీళ్ళన్నియు పడిపోయినవి. మేమింకకొట్టలేము. (అని చేతులు నలుపుకొనుచు, బాధపడుచు బాలునివిడిచి దూరముగా నిలుచున్నారు.)

ప్రహ్లా—(చేతులు జోడించుకొని కన్నులుమూసుకొని తల పైకెత్తి) ఓవిష్ణూ! ఓపరమపురుషా! ఓయాపద్బాంధవా! ఓదీనశరణ్యా! నాకెన్నికష్టములు వచ్చినను నాహృదయము మాత్ర మెప్పుడును నీభక్తికైంకర్యాదులనుండి తొలగకుండునట్లుచేయుము. నాబుద్ధియెల్లప్పుడునుధర్మమునందును, సత్యమునందును, నీధ్యానమునందును, నీయాజ్ఞలయందును తగిలియున్నట్లు కటాక్షింపుము. నే నేకార్యమును చేయబూనినను మనుష్యుల యంగీకార సంతోషాదుల నిమిత్తము చేయక నీప్రీతినిమిత్తమే చేయుచుండునట్లుచేయుము. ఓభక్తవత్సలా! నే నీ యిహపరలోకములోని సమస్తసుఖములను వైభవములను త్యజింపవలసి వచ్చినను, నాకత్యంత ప్రియములైన పదార్థములలోనెల్లను ప్రియతముఁడనయిననీయొక్క కరుణాకటాక్ష సంపాదనకొఱకు వానినన్నిటిని సంతోషపూర్వకముగా విడుచునట్టి ధైర్యోత్సాహములను నాకనుగ్రహింపుము. ఓపరమకృపాళూ! ఈలోకమంతయునన్నొక్క సారిగా నెదిర్చి బాధపెట్టబూనినను, నాచిత్తమణుమాత్రమును నిన్నువదలి చరింపకుండునట్లు చేయుము. నాకు నీయాజ్ఞలకంటెను, సత్యముకంటెను, ధర్మముకంటెను, ప్రాణము లధికప్రియములుగా నుండకుండునట్లు మన్నింపుము. ఓజగదీశ్వరా! నేనీలోకములోని మోహాదిబంధములకు వెఱచి నీపాదారవిందములు శరణుచొచ్చుచున్నాను. ఓభక్తభయార్తినివారకా! నాకభయహస్తమిచ్చి రక్షింపుము. ఓయనంతకరుణాకరా! అసత్యము, అహింస, చౌర్యము, కాపట్యము మొదలయినపాపములలో నొక్కటియు నాదరికి చేరకుండు

వట్లు కాచిరక్షింపుము. నాహృదయమునంతనుశోధించి దానియందు నాకు తెలియకుండ దాగియున్న దుష్టచింతలను, దుర్బుద్ధులను, దురాలోచనలను, దుర్వాంఛలనుదూరముగాతొలఁగత్రోలుము. నేను బ్రతికినదినములు వ్యర్థముకాకనీభక్తికైంకర్యాదులయందువినియోగ పడునట్లుప్రసాదించి, నాతనస్సును ప్రేమానుబంధముచేతనీతోలంకె వేసికొని యెప్పుడును నిన్నువిడిచి పోకుండునట్లు కాపాడుచుమ్ము. ఆపదలయందును, సంపదలయందును, సుఖములయందును, దుఃఖములయందును, రోగమునందును, ఆరోగ్యదశయందును, నిత్యకృత్యములయందును, కాలోచితకార్యములయందును,సమస్తవ్యాపారములయందును, నన్ను నీయాశ్రయము విడువకుండునట్లు చేయుము. నీభక్తులను, సన్మార్గవర్తులను, లోకోపకార శీలురను ప్రేమించి సేవించునట్లు చేసి నాజన్మసాఫల్యము చేయుము. మనోవాక్కాయ కర్మలచే నీభజనము మానకుండునట్లు చేయుము. ఓపాపవిమోచకా! ఓదయాస్వరూపా! అజ్ఞానముచేత నన్ను హింసింపబూనిన నాతండ్రి మొదలయిన వారిని పితృవాత్సల్యము చూచి వీరి యజ్ఞానమును బాపి, వీరి హృదయములు నీభక్తియందును సత్కార్యములయందును తగులునట్లాశీర్వదింపుము. వీరికి జ్ఞానదానముచేసి వీరిమనస్సులను దురభిమానమునుండియు దుర్మార్గమునుండియు మరలించి, తుచ్ఛములైన యిహలోకసుఖములకంటె వీరికి పరలోకసుఖ మెక్కువగా తోచునట్లుచేయుము. ఓదీనదయాళూ! నానిమిత్తమై వీరేమర్గతిని పోకుండునట్లు కటాక్షింపుము. ఓభక్తజనానంద సంధాయకా! నన్నెల్లవారును విడిచిపెట్టినను నీవుమాత్రము చేయివిడువక సదా నాహృదయమును కాయకుండుము.

[అని కన్నులువిప్పుచున్నాడు.]

హిర—(తనలో) ఓహో! ఉన్మాదములో సహితము వీఁడు పితృభక్తిని నామీఁదిప్రేమను విడువకున్నాఁడే? (ప్రకాశముగా) ఓరీ

దుర్ముఖా! బాలునిజోలికి పోక మీరు దూరముగా తొలగుండి—ఓయి పుత్రకా! నిష్కారణముగా నామనస్సున కామారము కలుగఁజేసి నీ వేలశ్రమపడియెదవు? ఇఁకనైనను నాబుద్ధివిని విష్ణుని స్మరింపకుండుము. నేను నీకభయ మిచ్చెదను—ఓగురుపుత్రులారా! మీరీ బాలకుని మరల మీవెంటఁగొనిపోయి కలవిద్య చెప్పి, నయమున భయమున బహువిధోపాయములచేత వీనిమతిమరలించి సన్మార్గమునకు త్రిప్పుఁడు. మామనస్సేమో వ్యాకులముగానున్నది. మేమంతఃపురమునకు పోయెదము మీరుపొండు.

చండా—చిత్తము. ఓరాక్షసేంద్రా! మేమున్నియుపాయముల చేతను నీపుత్రునకుబుద్ధి చెప్పి మాచేతనయినన్ని పాట్లుపడిచూచెదము. ఆవల వీని యదృష్టము.

హిర—మీరు మీచిత్తమువచ్చినట్లు చేయుండి. పొండి.—దేవీ! మనమంతఃపురమునకు పోదమురమ్ము. విప్రజిత్తీ! నీవుకూడా లెమ్ము. (అని భార్యామంత్రి సహితముగా నడుచుచున్నాఁడు.)

దుర్ము—ఓగురువర్యులారా! మీకు నమస్కారము. నేఁటికి మీరుపాయముగా శిక్షను తప్పించుకొన్నారు. ఇఁకనైనను మీరీ బాలకునకు దురోధలుచేయకమంచిబుద్ధి చెప్పుఁడు. ఈసారిమామహారాజుగారు ప్రహ్లాదునకు మాఱుగా మిమ్మును మాకప్పగించిన పక్షమున గురువులమని మమ్ము నెపపెట్టవలసిన పని లేదుసుండీ. ముందుగానే చెప్పుచున్నాను. మాచేతిలోపడిన తరువాత మీరు ప్రహ్లాదుని వలె తేలికగా తప్పించుకోనిపోలేరు.

చండా—ఓరిదుర్మార్గుడా! నీవు మామునిదఱ బ్రహ్మచారి చేష్టలు చేయుచున్నావేమిరా ! అధిక ప్రసంగము చేసినపక్షమున నిన్ను శపించెదమునుమా.

దుర్మ—స్వామి! నేనుమావంశాచారమునే చేయుచున్నాను. నేను బ్రహ్మచారిని; నాతండ్రి బ్రహ్మచారి; నాతాత బ్రహ్మచారి; గృహస్థాదినుండియు మాపూర్వులందఱును బ్రహ్మచారులే. అందు చేతనే నేను బ్రహ్మచారిచేష్టలుచేయుచున్నాను. కులాచారమెన్నటికిని మీఱరాదని మావంటివారికి గురువులు మీరానతిచ్చిన ధర్మమే కదా? గురువులు మీరేయాగ్రహముచేసినయెడల, శిష్యులమేము తాళఁగలమా? క్షమింపుఁడు. దాసునితప్పు దండముతోసరి. (అని చేతులు జోడించుచున్నాఁడు.)

చండ—పెండ్లిలేదుగనుక నీవు బ్రహ్మచారి వయినావుగాని, నీతండ్రి మొదలయినవారెల్లు బ్రహ్మచారులైనారురా?

దుర్మ—స్వామి! గురువులకు తెలియనిదేమున్నది? అది దేవరహస్యము. ఎవ్వరితోను చెప్పఁగూడదు. తగిన శుశ్రూషచేసి గురుదక్షిణయిచ్చిన పక్షమున, ఆరహస్యము ముందు నాశిష్యులకుపదేశముచేసెదను. ప్రభువువారింటికి వేంచేయుచున్నాడు. మేము వారి వెంటఁబోవలెను. అలంబసా! రమ్ము. (అని వారిని లాగుకొని పరుగెత్తుచున్నాఁడు.)

చండా—ప్రహ్లాదా! మనముకూడ మనయింటికి పోదము రమ్ము. నీతండ్రి విష్ణువును బోధించునని వేదములను శాస్త్రములను తగులఁబెట్టించినాఁడు; పురాణములను కాల్పించినాఁడు. ఇఁకనీవాతని పేరు తలపెట్టక మాగురూపదేశమునమ్మి గురుసేవచేత నీతిమంతుడవయి వర్ధిల్లుము.

[అని చెప్పుచు ప్రహ్లాదుని తీసికొనిపోవుచున్నాఁడు.]

పంచమాంకము.

౧. రంగము—గురుగృహము.

[ప్రహ్లాదుఁడును, చండామార్కులును, త్రిశోభన, కాలనాభాది శిష్యులును కూరుచుండి యున్నారు.)

చండా—ఓప్రహ్లాదా! నీకు దేని చేతను బుద్ధిరాకున్నది. నేనేమి చేయుదును? నీవెంత చెప్పినను వినక విష్ణుభక్తియేపరమార్థమనిపట్టు పట్టికూరుచున్నావు. రాజనీతి మోసమనుచున్నావు. ఇది నీకుతగదు. మామాటవిని బుద్ధిమంతుఁడవయి విష్ణుభక్తినివిడువుము.

ప్రహ్లా—ఓగురువర్యులారా! మాతండ్రిగారిని బట్టిన వెఱ్ఱియే మీకును బట్టినదేమి? మతావేశముచేత యుక్తాయుక్తముల నాలోచింప లేకున్న మానాయనగారి మాటలను బట్టుకొని ప్రాజ్ఞులయిన మీరును విష్ణుభక్తివలదని బోధించుచున్నారేమి? ఇదియేమిపాపము? పండితులయ్యును మీరెంత యజ్ఞానులుగా కనఁబడుచున్నారు! మీరు రాక్షసులకు పురోహితులయినంత మాత్రముచేత తుచ్ఛసంపదనమ్మి ముక్తిప్రదాతయైన బరమేశ్వరుని మఱచిపోవుట మీవంటివి వేకులకు తగునా? ఈవిషయమున మీవివేకమెక్కడకుపోయినది? వంశక్రమాగతమైనవాడయి జగద్వ్యాపియైన విష్ణుని కొలువులేక చెడిపోవఁదలచుకొన్న మాతండ్రిగారివలెనే మీరును చెడిపోకుఁడు.

చం—ఔరా! ప్రహ్లాదా! గ్రుడ్డునచ్చి పిల్లను వెక్కిరించిన దన్నట్లు నీవేమాకుబుద్ధిచెప్పవచ్చినావా? ఓరీ! ప్రౌఢుఁడా! మొన్న పుట్టినవాఁడవు. నీవు మాకే వేదాంతవాక్యము లుపదేశింపఁబోయెదవు. చాలుచాలు ఇంతటితో నీచదువు చాలించి మేము చెప్పిన నీతిశాస్త్రములు చింతనము చేయుచుండుము. మేమింకలోభోజనముచేసి మరల

వచ్చెదము. తాఁజెడ్డఁకోతి వనమెల్ల జెగచినదన్నట్లునీవు చెడ్డదిచాలక బుద్ధిమంతులయిన యీరాక్షసబాలకుల మతులుకూడ చెడగొట్టుచున్నావు. వీరికి నీగాలిసోఁకి విష్ణువిమీఁదికిమనసుపోవుచున్నట్లున్నది.

(అని వెళ్ళుచున్నాఁడు.)

ప్రహ్లా—ఓత్రిలోచనా! మన గురువులిప్పుడు మధ్యాహ్నిక కర్మానుష్ఠానము నిమిత్తము గృహమునకు విజయంచేసినారు. వీరెంత సేపు చెప్పినను ధనార్జనమునకును తుచ్ఛసుఖములకును తగిన మార్గములను చెప్పుదురే కాని శాశ్వతసుఖమునకనుకూలమయినపరమార్థమును లేశమును బోధింపరు. నిన్న నీవును కాలనాభుఁడుచుచేరి పరమేశ్వరుని గురించియు నిత్యసుఖమును గూర్చియు నన్ను కొన్ని ప్రశ్నలు వేసినారే. ఇప్పుడుత్తరము చెప్పెదనువినియెదరా?

త్రిలో—ఓరాజకుమారా! సంతోషపూర్వకముగా వినియెదను. మీయుపదేశమును వినుటనిమిత్తమేయింతవఱకునుమనగురువు లెప్పుడు పోయెదరాయని తొందరపడుచుంటిమి. వారిప్పుడులేరుగనుక శీఘ్రముగా సెలవిండు. ఇంతకంటె మనకుమంచిసమయముదొరకదు.

కాల—ఓమహారాజపుత్రా! నిన్న తమరు విష్ణుపదమున కర్థము సెలవిచ్చెదరని చెప్పినారు. ఇంతలో గురువుగారు వచ్చుట చేత చెప్పలేదు. ఇప్పుడు సెలవిచ్చెదరా?

ప్రహ్లా—అవశ్యముగా చెప్పెదను. విష్ణువనఁగా 'సర్వవ్యాపి' అని యర్థము. సమస్తలోకములను సృజించి దయతో కాపాడుచు మన లోపలను వెలుపలను సమస్తలోకములయందును వానిపయిని అంతటను వ్యాపించి నిండియున్న భగవంతునకు విష్ణువనిపేరు. అతఁడు రూపము లేనివాఁడు; ఆద్యంతము లేనివాఁడు; నిత్యుఁడు; సర్వవ్యాపి; సర్వజ్ఞుఁడు; సర్వశక్తుఁడు; సత్యజ్ఞానానందస్వరూపుఁడు; దయామ

యుఁడు; పరిశుద్ధుఁడు; దోషరహితుఁడు; సమస్తకళ్యాణగుణ పరిపూర్ణుఁడు; మోక్షప్రదాత.

కాల—మాటిమాటికి మీరువిష్ణుభక్తిని బోధించుచుందురే. ఆభక్తివలన ప్రయోజనమేమి?

ప్రహ్లా—మనకు సమస్తప్రయోజనములును సమస్త సుఖములును భగవద్భక్తి వలననే కలుగును. అట్టిభక్తి లేకపోయినయెడ మనుష్యుడెప్పుడును నిజమైనసుఖమును పొందనేరఁడు. మనముసమస్త వస్తుప్రదాతయైన పరమేశ్వరునే నమ్ముకొనియుండి ఆయనయాజ్ఞలను సదా చెల్లించుచు, ఆయన భక్తులయెడలను ఆయన ప్రేమించుసమస్త భూత కోటుల యెడలను ప్రేమగలవారమయి, మనముచేసెడిసమస్త కార్యములనుభగవత్ప్రీతికయి చేయుచు, ఆయనపాదారవిందధ్యానము విడువక యుక్తముగాప్రవర్తించుచున్నపక్షమున, భగవదనుగ్రహము వలన మనకు నిత్యానంద పదవి దొరకును. లోకములో సమస్తజీవులును కోరునది ఆనందమేకదా! అందఱును సుఖమునేపొందవలెనని కోరుచున్నను, నిజముగా సుఖము పొందువారు కొందఱేయుందురు.

కాల—ఎందుచేత?

ప్రహ్లా—ఎందుచేతనా? నిర్మలాంతఃకరణముతో భక్తజనానంద సంధాయకుఁడయిన పరమ విష్ణుని త్రికరణశుద్ధిగానమ్మి కొలువకపోవుటచేత హృదయమునందు నిశ్చలమయిన భక్తిలేక, ఆయనను నోటితో స్మరించినంత మాత్రముచేత ఫలములేదు; ఆయన సృష్టించి రక్షించుచున్న భూతకోటియందు దయగలిగి సత్యశౌచ పరోపకారాదులు విడువక, మాటలచేతనేగాక కార్యములచేతఁ గూడ భగవదాజ్ఞలను చెల్లించనిపక్షమున బాహ్యవేషములన్నియు నిరర్థకములు. సత్య శమ దమ దయా దాక్షిణ్యాదులు లేనియెడల, శరీరమున ధరించిన తులసిపూసలు మొదలయినవి మోతచేటుగాని

మోక్షదాయకములు కావు. నిత్యమయిన సౌఖ్యానందములను పొందుటకై నిష్కళంకమయిన భక్తిగలిగి వాక్కుచేతను మనస్సుచేతను కార్యముచేతను భగవత్ప్రీతికరముగా నడుచుకొనవలెను. భూమిమీఁద మనదేహములు నిత్యములుకావు. అవిక్షణభంగురములు. ఉన్నట్టుండి మనమెప్పుడో యీ దేహములను విడువవలసినవారమగుదుము. మనకన్నుల యెదురనే మనతోడిబాలు రెంతమంది కాలము చేసినవారు కారు? దేహము లనిత్యములగుటచేత దేహముతో సంబంధించిన విషయసుఖములును నిమిషభంగురములయి యుండును. కాబట్టి ప్రత్యేకముగా విషయసుఖముల నిమిత్తమే పాటుపడువారికెప్పుడును పూర్ణసుఖముకలుగదు. ఈయింద్రియసుఖములు మృగములకును మనకును సామాన్యములే. అట్టితుచ్ఛసుఖముల నిమిత్తమే మనము కాలము గడిపినయెడల మృగాదులకంటె మనకేమి యాధిక్యము రాఁగలదు? అదిగాక ఆహారస్త్రీసంభోగాదులయందు మృగాదులకు లేనికష్టములును రోగాదులును మనకెక్కువగా నుండుటచేత, పరమార్థచింతలేక కేవల విషయసుఖాసక్తులయిన వారిబ్రతుకు మృగాదుల జీవనముకంటెను నికృష్టమయినదని చెప్పవచ్చును. ప్రపంచములోని సృష్టికోటిలో మానుషజన్మ ముత్తమమయినది. మనకాశ్రేష్ఠత యుక్తాయుక్తజ్ఞానమువలనను, ధర్మచింతవలనను, పరోపకార శీలతవలనను, భక్తికైంకర్యాదులవలనను కలిగినది కాఁబట్టి మనమాశ్రేష్ఠత్వమును నిలుపుకోఁదలఁచినపక్షమున, అల్పములైన శరీరసుఖములకంటె నిత్యమయిన మనయాత్మ సుఖమును ప్రధానముగా చూచుకొనుచు, భూతదయ కలవారమయి ధర్మమార్గము తప్పక సంచరించుచు, భక్తజనప్రమోద సంధాయకుఁడయిన యాపరమపురుషుని యనుగ్రహమునకు పాత్రులము కావలెను.

కాల—ఆపరమపురుషుఁడయిన విష్ణునకు మనమీఁద దయ యెట్లు వచ్చును? ఆయన విషయమున మనమేవిధముగా నడుచుకొన

వలయును? ఏవ్రతములు చేయవలెను? మన మనుసరింపవలసిన భక్తి మార్గము లేవి? నాయందనుగ్రహించి చెప్పుఁడు.

ప్రహ్లా—ఆ పురుషోత్తమునియందు భక్తిగలిగి ఆయనయాజ్ఞలను మీఱకవర్తించుటవలనను, స్వార్థపరత్వమునువిడిచిభగవత్సృష్టిలోని సమస్తజీవులయందును దయగలిగి పరార్థశీలురమగుటవలనను, భగవత్కటాక్షము మనమీఁద వచ్చును. లోకములో వెలియునివారసేకులు తమప్రవర్తన మెట్లున్నను, భగవన్నామోచ్చారణము వలనను వినుటవలనను తాముపాపవిముక్తులై మోక్షమును పొందుదుమని భ్రమించుచున్నారు. అట్టివారెండమావులయందు దాహముతీర్చుకొన ప్రయత్నించువారు. తన్ను ముఖస్తుతిచేయుచున్నంతమాత్రముచేత, సదాతనయాజ్ఞల నుల్లంఘించి తనకు ప్రేమాస్పదులైనయితర పుత్రాదులయెడ కల్లలాడి వారిని మోసముచేసి బాధించుచుండు కొమారునియందు న్యాయబుద్ధిగల తండ్రి కెన్నఁడైనదయకలుగునా? ఆప్రకారముగానే న్యాయస్వరూపుఁడయిన యీలోకపితకును తన్ను స్తుతించినంత మాత్రముచేత తనకు ప్రేమాస్పదమయిన యీలోకకుటుంబము నెడల న్యాయముగా ప్రవర్తింపనివానియం దనుగ్రహము పుట్టదు. తనకార్యములచేత మనస్సునకు నొప్పికలుగఁజేయుచు నోటిచేత తండ్రివిషయమున స్తుతిపాఠముచేయుట పితృభక్తియెట్లుకాదో, అట్లే భగవంతుని కప్రియమగునట్లుగా లోకవిషయమున న్యాయము తప్పి ప్రవర్తించుచు భగవన్నామస్మరణము చేయుటయు భగవద్భక్తి కానేరదు. కాఁబట్టి నీతిమార్గమునసంచరించుచు త్రికరణశుద్ధిగా పరమేశ్వరుని సేవించుటయే విష్ణుభక్తియగును. అట్టిభక్తిచేతనే సమస్తకళ్యాణగుణములును కలుగును. అట్టిసద్భక్తి మనకు బాల్యమునందే పట్టుపడవలెనుగాని యేండ్లుముదిరి రాగద్వేషాదులచేత మనస్సుచెడి జాతిమతాదుల యందలి దురభిమానములు బలపడిన తరువాత పట్టు

పడుటకష్టము. అట్టిభక్తికైంకర్యాదులచేతసంపాదింపవలసిన భగవదనుగ్రహమునుబొందుటకై వ్రతములు, క్రతువులు, జపములు, ఉపవాసములు, ఉప్పిడులు, ఏమియునక్కరలేదు. మనలను సృజించి పేమించుచుండుటచేత పరమప్రేమమును, మనసుఖభోగములకువలసిన సమస్తమును ప్రసాదించియుండుటచేతకృతజ్ఞతను, మనలనుపాలించు ప్రభువగుటచేత పరమవిధేయతను, న్యాయస్వరూపుడగుటచేత పరమవిశ్వాసమును, సర్వశక్తుడై సమస్తకళ్యాణగుణ పరిపూర్ణుడగుట చేత పరమగౌరవమును, భగవంతునియెడల కనబఱుచుచు మనయాత్మనే యీశ్వరార్పణముచేసి మనకాయన కీడోమేలో యేదియనుగ్రహించిన అదే పరమానుగ్రహముగాభావించుకొనుచు ఎన్నికష్టములువచ్చినను భగవత్ప్రీతికరమయినకృత్యమునువిడువక పరమసంతోషముతో చేయుచుండవలెను. దేహప్రాణములను భగవదర్పితముచేసిత్రిప్తివహించునంతటిపరమభక్తికలిగినప్పుడే మనకు బ్రహ్మానందము కలిగి, మనము శాశ్వతమోక్షపదవి నొందుదుము. నిశ్చలమైన విష్ణుభక్తియొక్కటి కుదిరెనా, సమస్తసద్గుణములునుతమంతనే వచ్చిచేరును. భగవంతునియెడలహృదయపూర్వకమైన భక్తికలిగిన యెడల, నీతిమార్గముతొలగి సంచరించుటయే యసాధ్యము. కాలము మనదికాదుగనుక, యౌవనగర్వముచేతకన్నుగానక కామాంధులమై సంచరింపకముందే, ముదిమివచ్చిరోగాదులాశ్రయించి కఫశ్లేష్మాదుల చేత దేహస్మృతి తప్పకముందే, మనమట్టి సంపూర్ణభక్తిని పొంది మోక్షసామ్రాజ్యమును చూరగొనుటకై ప్రయత్నింపవలెను.

త్రిలో—ఓప్రహ్లాదా! నీయొక్క వచనామృతముచేత మేము మహానందపదవిని పొందినారము. ఇంత చిన్నతనములోనీకిట్టి దివ్యబోధ యెట్లుకలిగినదాయని మా కాశ్చర్యమగుచున్నది. ఇంకముందు మేమందరమును ఛాందసవిషయములనుబోధించెడి ఈగురువులనువిడచి

నిన్నే మాకు గురువుగాఁ జేసికొనెదము. మాకుమరుగురుఁడవయి జ్ఞానోపదేశము చేసి మాకెన్నడును తఱుగని యానంద పదవిని సమకూర్పుము.

ప్రహ్లా—నేను మాతల్లితోఁగూడ నారదాశ్రమమున నున్న కాలములో నారదమహాముని నాకీజ్ఞానోపదేశము చేసినాఁడు. ఆయన దివ్యోపదేశము నా లేఁతమనస్సులో శిలాక్షరమున లెనాటులోని, అప్పటి నుండియు నామనస్సు భగవంతునియందు లగ్నమయిపోయినది. నా మనస్సు బ్రహ్మానందపరవశమయియుండుటచేత నా దేహమునకు వేయి బాధలు చేసినను నామనస్సునకు నాటవు. నాకెక్కడఁజూచినను పర బ్రహ్మము నిండియుండినట్లు తోఁచి పరమానందము కలుగుచున్నది. ఆహా! ఏమినాభాగ్యము!

కాల—ఓప్రహ్లాదా! మన కులాగతమయిన శివమతమునందు నీకాదర మెందుచేత తప్పిపోయినదో వినవలెనని మాకు వేడుక కలుగుచున్నది. మాయందనుగ్రహించి చెప్పెదవా?

ప్రహ్లా—అప్పుడే నారదుఁడు మనవారారాధించు లింగము యొక్కయు పానపట్టముయొక్కయు స్వరూపమును నాకు వివరించి చెప్పినాఁడు. వానిస్వరూపమిప్పుడు మీవద్ద వివరించి చెప్పఁగూడదు. ఆరెండును వేనినుచ్చరించిన మనవారిప్పుడు బండబూతులని భావించెదరో యట్టిపురుషునియొక్కయు స్త్రీయొక్కయు రహస్యావయవములు సుమా. ఆసంగతి విన్నతోడనే నామనస్సు లింగార్చనమునుండి విముఖమయినది. అదె మనగురువులు వచ్చుచున్నారు.

[అప్పుడు చండామార్కులు ప్రవేశించుచున్నారు.]

చండా—ఓరీతిలోచనా! కాలనాభా! మీపాఠములు చదివినారా?

త్రిలో—ఇక మీపాఠములు మాకక్కరలేదు. మీరొక్కనాఁడును మాకు మంచిచదువు చెప్పలేదు. ఇంతవరకు ప్రహ్లాదుఁడు మాకు విష్ణుభక్తిని నేర్పినాఁడు మాకదేకావలెను.

కాల—మేమిఁక మీచదువు వినము. మీచదువు మీవద్దనే యుంచుకొనుఁడు. మాకక్కరలేదు. మాకీప్రహ్లాదుఁడే గురువు.

చండా—ఓరిప్రహ్లాదా! ఎంతపని చేసితివిరా? ఇప్పుడు నా ప్రియశిష్యులుకూడా నామాటవినకుండ చేసినావుగా! నీవు చేసిన దుర్ణయమిప్పుడేపోయి మీతండ్రిగారితో చెప్పి నిన్నేమి చేయించెదనో నిమిష మోపికపెట్టు. (అని కోపముతో పోఁగా, అందఱును నిష్క్రమించుచున్నారు.)

---

౨. రంగము—హిరణ్యకశిపుని సభాభవనము.

[హిరణ్యకశిపుఁడును, విప్రచిత్తియు, చండామార్కులును, అలంబుషుఁడును, దుర్ముఖుడును ప్రవేశించుచున్నారు.]

హిర—(కోపముతో) ఏమేమీ ? రాక్షసబాలకులుకూడ ప్రహ్లాదునిమతమే యనుసరించుచున్నారుగా! గురుపుత్రా! ఇంకొక సారిచెప్పు. వీఁడు నాకు శత్రుఁడు కాని పుత్రుఁడుకాఁడు. శుద్ధమైన యీ రాక్షసవంశమను చందనవనములో వీఁడు విషవృక్షమువలె పుట్టినాఁడు. దేహమున దుర్మాంసమువలె పుట్టిన యీకులద్రోహిని ఖండించి రాక్షసకులము నిర్దోషముగా చేయవలెను.

చండా—ఈచెడుగును కొడుకనిచూడక చంపించవలసినదే. ఇప్పుడుగోరంతకు వచ్చినది. రేపు కొండంతకు రాకమానదు. నేడు రాక్షసబాలకు లయినారు. రేపురాక్షసవృద్ధులే విష్ణుభక్తులగుదురు.

ఇంక నుపేక్షచేయక రోగమింకనుముదిరి యసాధ్యము కాకమునుపే తగిన చికిత్సచేయవలెను.

హిర—ఈపాపాత్ముని నాకేవిధముగా రూపుమాపుటకును ఉపాయము తోచకున్నది. వీని ప్రభావ మేమో కాని వీఁడేవిధమున చావకున్నాఁడు. మందో మంత్రమో వీనివద్ద నేమున్నదో తెలియరాకున్నది. వీనిని నేనీవరకు ఏనుగులచేత త్రొక్కించినాను; శూలములతో పొడిపించినాను; సముద్రములో ముంపించినాను; పర్వతముల మీఁదనుండి త్రోయించినాను; ఇటువంటి మారణోపాయములను మఱియెన్నిటినో చేయించినాను. దేనివలనను కార్యము లేకపోయినది. ఇంకొకవిచిత్రము చూచినారా? నేనెన్నిబాధలు పెట్టించినను నేనుచేసిన నిగ్రహములను పరులతో చెప్పుకొని యొక్కనాఁడును నన్నునిందింపఁడు. కోపమైనను చూపఁడు. వీనిశాంతతకుమాత్రము మనమద్భుత పడవలసినదే.

చండా—ఒక్కవిష్ణుభక్తి తప్ప నీకోమారునియొద్ద వెదకినను మఱియొక దుర్గుణ మగపడదు. ప్రాణాంతమువచ్చినను అసత్యమాడఁడు; తనవిరోధులమీఁదనయినను ప్రేమచూపఁడు; తన్ననొప్పించువారిపైనైనను పరుషవాక్యము నోటరానీయఁడు; తన్ను మేమెన్నివిధముల శిక్షించుచున్నను, మాయెడల వినయభయభక్తులు తక్కువకానీయఁడు. ఇంతమంచివాని కీపాడువిష్ణుభక్తి యెట్లు పుట్టినదాయని చింతపడుచున్నాము.

హిర—వాని నింకొకసారి యీసభకుపిలిపించి, విష్ణుభక్తి విడుచునో లేదో యిదే కడపటిసారి ఖండితముగా నడిగి ఇంకను తన బుద్ధి విడువకున్న పక్షమున వాని నేవిధముననయినను సంహరింతము.

చండా—వీనిని సంహరించుటకు నాకిప్పుడు రెండుపాయములు తోఁచుచున్నవి. మనముపచ్చునప్పుడు వాకిటనిలచియున్న పాముల

వాండ్రవద్ద క్రొత్తగాపట్టిన తక్షకజాతి క్రూరసర్పమున్నదట. దాని చేత కఱిపించినయెడల బాలుఁడు తప్పక ప్రాణములు విడుచును. అప్పటికిని చావక బ్రతికినపక్షమున మే మభిచారహోమముచేసి, అగ్నికుండమునుండి కృత్తియను శక్తిని పుట్టించి దానిచేత నిమిషములో చంపించెదము.

హిర—అట్లుచేయుదము. మనస్సులో సహజమయిన పుత్రవాత్సల్యమపుడపుడుపుట్టి నన్ను బాధించుచున్నను, మతాభిమానము చేత మోహపాశమును కోసివేసి దానిని చంపుటకే యిప్పుడు నిశ్చయము చేసికొన్నాను. అలంబసా! సంగీతశాలలో లీలావతీదేవి కొమారునికి బుద్ధిచెప్పుచు కూర్చుండియున్నది. నీవక్కడకుపోయి మాసెలవైనదని ప్రహ్లాదునిక్కడకు తీసికొనిరమ్ము.

అలం—చిత్తము మహాప్రభూ! (అని నాలుగడుగులు నడిచి) దేవా! అదిగో! కుమారుని వెంటఁబెట్టుకొని దేవిగారేయిక్కడకు వచ్చుచున్నారు.

[అప్పుడు ప్రహ్లాదుని ముందుంచుకొని లీలావతి ప్రవేశించుచున్నది]

హిర—దేవీ! రమ్ముకుఁ-యచుండుము. (అనిపీఠమును చూపుచున్నాఁడు)

లీలా—పుత్రకా! ఇఁకనైనను నామనస్సును మఱింత ఖేదపెట్టక నీతండ్రిగారు పొమ్మన్న మంచిదారిని పొమ్ము.

ప్రహ్లా—అమ్మా! నేనెప్పుడును మంచిదారినే పోయెదను. నానిమిత్తమై నీవు ఖేదపడకుము—ఓతండ్రీ! నీకు నమస్కారము—ఓగురులారా! మీకు నమస్కరించుచున్నాను. (అనిచేతులుజోడించుచున్నాఁడు)

హిర—ఇప్పుడు నిన్ను నేనేమని యాశీర్వదింపను? ఎంచుకయినను మంచిది. పుత్రకా! సుఖశాంతిరస్తు!

చండా—మేమును రాజుగారిత్రోవనే త్రొక్కెదము. సుఃఖ శాంతిరస్తు.

హిర—కుమారా! ఇంతసేపు కష్టపడి నీతల్లిచేసిన హితబోధ చేతనైనను నీమనసు తిరిగినదా? ఇంకను మునుపటివలెనేయున్నదా?

ప్రహ్లా—నా మనస్సెప్పుడును శ్రీమహావిష్ణుని పాదారవింద ధ్యానమునుండి మరలదు. ఓతండ్రీ! నీకు సర్వాంతర్యామి యయిన విష్ణుదేవునిమీఁద వృథా ద్వేషమెందుకు? నీకువరములిచ్చి నిన్నింత వానిగాజేసిన బ్రహ్మదేవునకు అతఁడు జనకుడుగదా! నీవంటిఘనుఁడు సాత్వికుఁడయి విష్ణునికొలవక తామసుఁడయి చెడతగునా! ఆమహాను భావున కొకరిమీఁద ద్వేషమున్నదా? ఆతఁడు భక్తవత్సలుఁడు. సత్ప్ర వర్తనము కలిగి మనోవాక్కాయ కర్మలచేత సత్యము తప్పక స్వార్థ పరులుకాని భక్తాగ్రేసరుల నందఱను ఆయన మన్నించును. ఆయన మన్ననగలవారి కెన్నఁడును తఱుగని మోక్షసామ్రాజ్యము లభిం చును. ఎంతకాలమున్నను నీకీరాక్షసరాజ్యసంపద శాశ్వతముకాదు గనుక చిన్నవాఁడనని నాప్రార్థనదీసివేయక నీవాపరమాత్ముఁడయిన విష్ణుని శరణము వేఁడుము.

హిర—ఓరి దుర్మతీ! నీకింకను కావరమడగలేదా? నీకంత కంతకు వెఱ్ఱి ముదురుచున్నది. పఱగడపందియైవచ్చి నీపినతండ్రిని చంపినవాఁడన్న యభిమానమయినను లేక సిగ్గువిడిచి నీవావిష్ణునిబంటు వలె సేవించుటయేకాక, నన్నుకూడ ఆపాపకర్ముని శరణు వేఁడుమను చున్నావుగా! ఎంతమాటాడితివి?

ప్రహ్లా—నాపినతండ్రినిఅతఁడుచేసినపాపమేవరాహరూపమున వచ్చి చంపినదికాని విష్ణుఁడు చంపలేదు. ఆ మహామహునకు రాగ ద్వేషము లెక్కడివి? ఓతండ్రీ! విష్ణుదేవునకు దేవతలు చుట్టములయి రాక్షసులు కాకపోయినారా?

హిర—ఓరీ! కూళబాలకా! ఏల్ప్రేలెదవురా? నీ నాలుక ప్రయ్యలుగాను! నీదురుక్తులుచాలించు. (అని కోపముతో లేచివచ్చి తన్నుచున్నాఁడు.)

ప్రహ్లా—శ్రీహరీ!

హిర—(కన్నులెఱ్ఱఁజేసి) వీడుహరిగిరియనియింకను మొఱుగుచున్నాఁడు. అలంబసా! నీవుపోయి వాకిటనిలుచున్న పాములవాండ్రను లోపలికి తీసికొనిరమ్ము. ఆ కాలసర్పము ఘోరవిషజ్వాలలతో కఱచినప్పుడు విష్ణునిప్రభావమును వీనిభక్తియు నేమగునో చూతము.

అలం—చిత్తము. తీసికొనివచ్చెదను. (అనిపోవుచున్నాఁడు.)

లీలా—(దీనవదనముతో) ఓకుమారా! యమకింకరులవలె రాక్షసకింకరులు నీచుట్టునుజేరి పాములచేత కఱిపించి బాధించుచుండఁగా చూచి నేనెట్లు సహింపగలుగుదునురా? నిన్ను గడ్డముపట్టుకొని బతిమాలుకొనెదను. నాతండ్రీ! నీతల్లిప్రార్థనవిని యింకనయినను విష్ణుభక్తిని విడిచి నీతండ్రిగారి యాజ్ఞాప్రకారము చేయుము. నీవెప్పుడును నామాట తీసివేయువాఁడవుకావు. ఈ యొక్కవిషయములో మాత్ర మింతపట్టేల పట్టెదవు? నీపంతము మానుము.

ప్రహ్లా—తల్లీ! నీవు మఱియేమాజ్ఞాపించినను శిరసావహించి చేసెదనుగాని నిరంతర పరలోకసుఖమునకు భంగమువచ్చెడి యీ విషయములో మాత్రము మీమాట వినఁజాలను. ఈలోకములో మీరుకలుగఁజేసిన యీదేహమును కావలసినపక్షమున మీకు సమర్పింప సిద్ధముగానున్నాను. దీనినిమీరు మీయిష్టమువచ్చినట్లు చేసికొనుఁడు. ఇఁకముందులేక, ఈజన్మమునకు వెనుకనులేక, నడుమకొంత కాలముతల్లిదండ్రులఁకాదటస్థించినమీనిమిత్తమై, ఇప్పుడును వెనుకనుముందును అనంతమయిన సర్వకాలమును తల్లియుదండ్రియు రక్షకుఁ

డును పాపవిమోచకుడును సుఖదాతయు భయత్రాతయు సమస్తము నైన యాజగదీశ్వరుని నేనెట్లు విడువఁగలను? నాఆత్మానందముతో సంబంధింపక భగవదాజ్ఞకు వ్యతిరిక్తముకాని సమస్తవిషయముల యందును నే మీఆజ్ఞను శిరసావహించిచేసి నాదేహసుఖముల నన్నిటిని విడువుమన్నను విడుచుటకు సంసిద్ధుఁడనయియున్నాను.

లీలా—పుత్రక! నీవ్రాఁతఫల మిట్లుండఁగా, నేనేమిచేయ గలను? నీవు గాకడుపున పుట్టిన దోషముచేత మనసుపట్టలేక, అఁడ దానిని గనుక దుఃఖపడియెదను. నీవేమో మహావైభవముతో సమస్తసంపదలనుపొంది సుఖించుచుండగా చూచి సంతోషించు భాగ్యము లభించునని యెదురుచూచుచున్న నాకు నీదురవస్థచూచిన మనసెట్లు పుత్రశోకముపాలు కాకుండును?

ప్రహ్లా—అమ్మా! నీవు నానిమిత్తమై చింతబొందఁబోకు. ఆ జగదీశ్వరుఁడు నన్నేమి చేయదలఁచుకొనెనో యట్లుకాగలదు. నన్నా పద పెట్టుచున్నారని మానాయనగారిని మాత్రమెప్పుడును దూషిం పఁబోకు. నేను నీకు పుట్టనేలేదనుకొని నన్ను మరచిపొమ్ము. అంతః పురమునకు పొమ్ము.

లీలా—ఓప్రాణనాథా! కన్నకడుపగుటచేత మనసు నిలువక మీకొక్క చిన్నవిన్నపము చేయుచున్నాను. నేనుమిమ్ము వేఱుకోరిక యెన్నఁడును కోరినదానను కానుగనుక, యీయొక్కప్రార్థనమాత్ర మంగీకరించి వీనిని ప్రాణముతో విడిచిపెట్టుఁడు. ప్రాజ్ఞతరానికొడుకు మీఁద మీకాగ్రహమెందుకు? ఈసంపదలు లేకపోయినను ప్రాణ మున్న పక్షమున వీఁడు బలసుకూర తినియైనను బ్రతుకఁగలఁడు. క్షమించి విడిచిపెట్టుఁడు. వీనిని మీయొద్దనుంచుకొనుట కిష్టములేని పక్షమునఁ వీని నడవులకయినను పంపివేయుఁడు: లేదా దూరదేశ మునకయినను పంపివేయుఁడు. (అని కాళ్ళమీఁద పడుచున్నది.)

హిర—ఓప్రాణేశ్వరీ! నీవు మరియేమిచెప్పినను విందునుగాని నేను యీమాటమాత్రము వినను. లెమ్ము పాదములమీఁదనుండి లెమ్ము. (అని లేవనెత్తును) వీఁడు మనకు శత్రుఁడుకాని, పుత్రుఁడు కాఁడు. వీని శిక్షను చూడతగదుపొమ్ము.

అలం—(పాములవానితో ప్రవేశించి) స్వామీ! ఇదిగో! పాములవానిని తీసికొని వచ్చినాను.

లీలా—నేనీ పాపకర్మమును చూడఁజాలను. నాదెప్పుడును దుఃఖపడవలసినబ్రతుకయిపోయినది. అంతఃపురమునకుపోయి, అక్కడనే విలపించెదను. (అని రెండడుగులు నడిచి) నాకు నడువ కాళ్ళు రాకున్నవి. (అని పోవుచున్నది.)

పాము—సామీ! దండాలు.

హిర—ఓరీపాములవాఁడా! నీవద్ద మంచి పాములున్నవటరా?

పాము—యేలినవారి సిత్తంవచ్చిన పాములుండాయిసామీ (పెట్టిమూఁతతీయుచు) యీనాగుపామును నిన్ననే కోటప్పకొండలో పట్టుకున్నాము. దీనివిసం సోకితే యేనుగులు పీనుగులయిపోతాయి సామీ! నాపాములపెట్టెతోడు. నేనబద్ధాలాడను మాప్రభో.

హిర—ఓరీ! నీవెప్పుడయిన నిదర్శనంచూచినావురా?

పాము—నీదరిసినమా? యిదివరకు నేనెప్పుడూ సెయ్యలేదు. ఇదే సెయ్యడం.

హిర—మాదర్శనముకాదు. నిదర్శనము.

పాము—నీదరిశినంరాదు? నిదర్శనమా! అదేంటో నాకు తెలియదు.

హిర—ఓరిభ్రష్టా! నీకు నిదర్శనమన్న మాటేతెలియదురా! నిదర్శనమురా నిదర్శనము.

పాము—నిదర్శనమా? తెలిసింది. తెలిసింది. మేము తిరిగే అడవుల్లో యెక్కడా మాకామెకం యిదివరకు కళ్ళపడలేదు. బాబూ!

హిర—ఓరినిర్భాగ్యుఁడా! అదిమృగముకాదు. నిదర్శన మనగా దృష్టాంతము. ఇప్పుడు తెలిసినదా?

పాము—బాబూ! మీరు బలేబలేమాటలు యేస్తున్నారు. ఇప్పుడునాకు తెలిసింది దృష్టాంతమంటేపుప్పికాదుష్పుపాకు. దాని కింత లేసి కాయలుంటవి. (వేలితో చూపుచున్నాఁడు.)

హిర—ఈమూఢుని మాటలును తెలియకున్నవి. అలంబసా! మాయభిప్రాయమును నీవు వీనితో విప్పిచెప్పు.

అలం—ఓరీ! "ఈపాము ఏనుఁగునుచంపఁగా నీవెప్పుడైనను దాఖలాచూచినావా?" అని నిన్ను రాజుగారడుగుచున్నారు.

పాము—డాఖలా? డాఖలా? లచ్చసారులు సూచినాము. బిచ్చపులచ్చలు లచ్చలేంలెక్క? డబ్బయిపదకొండుసార్లు సూశాం. నెల్లాళ్ళకింద వొక్కొక్కకాటేసేటప్పటికి యేనుగులమంద మందంతా చచ్చిపోయింది. వొక్కయేనుగని లెక్కయేంటి? దీన్ని రెణ్నెల్లుకాచి యెరమింగివున్నప్పుడు పట్టుకున్నాము.

హిర—ఓరీ పాములవాఁడా! ఈపాముచేత బాలకుని కరపించు—ఓరీ! అలంబసా! దుర్ముఖా! ఈబాలకుని మీరిద్దరును కదలకుండగట్టిగాఁబట్టుకొనుడు. ఓరీ! ప్రహ్లాదా! నీవికనైననువిష్ణుభక్తిని మానెదవా? ఈవిషసర్పముచేత కరిపింపుమన్నావా?

ప్రహ్లా—ఈవిషసర్పముకంటె క్రూరములయినపాపసర్పముల నుండి సహితము కాపాడి నాకాత్మరక్షణము దయచేయఁగలిగినలోకేశ్వరుఁడు పెనుప్రాపయియుండఁగా, దేహమాత్రమును బాధించెడి

యీ పాములు నన్నేమిచేయఁ గలవు ? మీచిత్తము వచ్చినట్లు చేయింపుఁడు.

హిర—(పండ్లుపటపటకొఱికి) ఓరి మొండీ! ఏమి నీకండ్ల కొవ్వు!—దుర్ముఖా! మీరింకను పట్టుకోరేమి? ఓపాములవాఁడా! ఈపాముచేత కరిపించు.

పాము—(చిత్తం అని, అలంబస దుర్ముఖులు పట్టుకొనఁగా పాముచేత కరపించుచున్నాఁడు.)

అలం—పాముచచ్చినది. ప్రహ్లాదునకువిష మెక్కలేదు. పాము కఱవనప్పటివలెనే నిర్భయముగా నున్నాఁడు.

హిర—ఓచండామార్కులారా! మీరు లోపలికిపోయి, అభిచార హోమముచేసి వేగిరము శక్తిని పుట్టింపుఁడు.

చండా—నిమిషములో మేము శక్తినిపుట్టించి తీసికొని వచ్చెదము. అప్పుడుగానిప్రహ్లాదుని పొగరడఁగదు. (అని పోవుచున్నాఁడు)

హిర—అలంబసా! ప్రహ్లాదుఁడు పాముకరచినను చావలేదుగా? ఏమి యీఆశ్చర్యము!

అలం—ప్రహ్లాదుఁడుచావలేదు పామేచచ్చినది. ఈపాములఁ వాఁడొకవేళ చచ్చినపామునే తెచ్చినాఁడేమో! అవునవును. వీనివాగ స్వరముచేతనుమంత్రశక్తిచేతనుపాముకదలికరచినదేకాని, నిజముగా వీఁడు ప్రాణములేని పామే తెచ్చినాఁడు. వీనిని శిక్షించవలెను.

పాము—బాబూ! ముసలాణ్ని, నేను సిచ్చలకు తాళలేను. నావరాలకెత్తుకెత్తుపాము నిముసంలోసచ్చింది. అదిసంపినా చచ్చేది కాదు. యేంసేతునుసామీ! నేను తెచ్చింది సచ్చినపాంకాదు. రచ్చించండి. వాకిట్లో ఈమారాజులందరూ సూశారు.

దుర్ము—నీవి చచ్చినపాముకాదా? అలాగయినపక్షమున, ఈ పాము చచ్చుటకు ప్రహ్లాదుని దేహములోనే విషమున్నది. ఖలులకు

నిలువెల్లను విషమేఅని పెద్దలు చెప్పుదురు. వెనుకరాజుగారు ఖలుఁ డయిన యీ బాలకుని శిక్షించుమన్నప్పుడు నేనెఱుఁగక కఱచినాను. నాకెక్కడ విషమెక్కునో? ఏమిబుద్ధి? ఏమిచేయుదును?

అలం—మానిసికాటునకు మందులేదు. నీవంటివాఁడొకఁడు రాజుగారిచెవి కొరికినపక్షమున, నావంటివారు నూరుగురు చత్తురు.

దుర్మ—అయ్యో! పరవిషమునకు మంత్రమాత్రమే కాక మంత్రమునులేదట! నేను మీదటికి పెండ్లి చేసుకోఁబోవు భార్యకు దిక్కులేకుండ చచ్చిపోదును కాఁబోలు!

అలం—దుర్మఖా! విచారపడఁబోకు. విషమెక్కెడుపక్షమున, ఎనిమిదిజాములలోనే యెక్కును నీవు ప్రహ్లాదుని కరిచి బహుదినము లయినది. గనుక నీవిప్పుడు చావవు. బెంగపెట్టుకొనకు. ప్రహ్లాదుఁడు విషయుగలవాఁడు కాఁడు.

దుర్మ—నేనెట్లు బెంగపెట్టుకొనకుండఁగలను! ఈపాములవాఁడు చచ్చినపాము కాదని చెప్పినప్పటినుండియు నాకింకొక భయము కలుగుచున్నది. ఈముసలిగాడిదకొడుకు త్రాగివచ్చి ప్రహ్లాదుని కాలనుకొని నాకాలు కరిపించినాఁడేమో! అవును. నన్నే కరిపించినాఁడు. నాకాలు తిమ్మిరెక్కుచున్నది. నాదేహము వడకెత్తుచున్నది. అలంబసా! వేపాకు తెచ్చిపెట్టు తియ్యగా నుండునేమో చూచెదను. విషవైద్యునికోసరము పరుగెత్తు. దిక్కుమాలినవానికి నాకు విషవైద్యము చేయించి ప్రాణదానము చేసినపక్షమున నీకు బహుపుణ్యము వచ్చును. పరుగెత్తు పరుగెత్తు. (అని కూలబడుచున్నాఁడు)

అలం—నీకాలికి కాటులేదు. భయపడకు.

దుర్మ—నాకాలిని కాటులేదా? నీతల్లికడుపుచల్లగా; నీఅత్త కడుపు చల్లగా వర్ధిల్లుము. ఈశుభవార్తచెప్పి నాప్రాణములు నీవు నిలువఁబెట్టినావు. నాకన్నియు గండములేవచ్చి నామంచితనముచేత తప్పిపోవుచున్నవి. నేనదృష్టవంతుఁడను గనుక, నాకు కష్టములు కొండలలాగునవచ్చి మంచులాగున విడిపోవుచున్నవి.

అలం—ఓమహారాజా! నాకు భయమగుచున్నది. మనచండామార్కులు నెఱ్ఱియెత్తినవానివలె కేకలువేయుచు పరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు. ఇంతవేగముగా పిచ్చియెత్తుట కతనిని వెఱ్ఱికుక్క కఱచినదేమో! భూతముపోఁకింది. నా దేహము కంపమెత్తుచున్నది. అదిగో భూతము. భూతము. (అని పారిపోవుచున్నాఁడు)

దుర్మ—అయ్యో! వెఱ్ఱికుక్క కాటుకు మందులేదు. ఏమి చేయుదును? ఎందుచొత్తును? (అని లేచిపోవుచున్నాఁడు)

చండా—బ్రాహ్మణుని చంపకు చంపకు. (అని పరుగెత్తుకొని వచ్చి ప్రవేశించుచున్నాఁడు)

విప్ర—స్వామీ! వెఱపింపఁబోయి మీరే వెఱచివచ్చినారేమయా? తొందరపడక సంగతి చెప్పఁడు.

శక్తి—ఓరీ! పాపాత్మా! నన్ను విష్ణుభక్తునిమీఁద కెందుకు పంపినావురా? చూడు నిన్నిప్పుడేపట్టి మ్రింగెదను.

(ఇట్లు కేకలువేయుచు శక్తి ప్రవేశించుచున్నది)

హిర—(నిశ్చేష్టుడై సింహాసనముమీఁద కూరుచున్నాఁడు)

చండ—ఈశక్తి నావెంటఁబడినది. విప్రజిత్తి పీఠమునుండి కదలఁడు. మహారాజుగారు నిశ్చేష్టితులై యున్నారు. నీవేదిక్కు ప్రహ్లాదా! దిక్కుమాలిన బ్రాహ్మణుని నన్ను రక్షింపుము. (అని ప్రహ్లాదుని వెనుకకు పోవుచున్నాఁడు)

విప్ర—భయభ్రాంతులయినవారికి మతిపోవునుగదా? ఈ బ్రాహ్మణుఁడు మావంటి మహావీరులనందరిని విడిచి బాలుఁడయిన ప్రహ్లాదుని మరుగు చొచ్చుచున్నాఁడు.

శక్తి—ఏఁడీ? ఏడీ? బ్రాహ్మణుఁడు. మత్తెక్కి నన్ను హరిభక్తునిమీఁద ప్రయోగించినందుకు, వ్యాఘ్రము మేకపిల్లను నమలినట్లు తల నాపండ్లసందున పెట్టి పటపట నమలెదను.

ప్రహ్లా—నేను నిజమయిన విష్ణుభక్తుఁడనయిన పక్షమున, ఈ బ్రాహ్మణుఁడు రక్షింపఁబడుగాక!

శక్తి—ఈపరమభాగవతోత్తమునిదయవల్ల బ్రతికిపోయినావు. నిన్నువిడిచితిని. పో. (అని పోవుచున్నది)

హిర—(కన్నులు విప్పిచూచి) ఈకలకలమేమి?

విప్ర—శక్తిపచ్చి ప్రహ్లాదుని చంపకయే పాఱిపోయినది. అమ్మవారిని చేయఁబోగా రాక్షసి అయినట్లు గురుపుత్రునే మింగ బయలుదేఱినది.

హిర—అయ్యో? ఈసంక్షోభములో తప్పించుకొని శక్తిపాఱి పోయినదిగదా! ఆహా! ఎంతప్రమాదమునంభవించినది! ఓరీప్రహ్లాదా! ఓరిమూర్ఖ! నీవింకను విష్ణువు విష్ణువనియే పలవించుచున్నావు. నీవిష్ణు డెక్కడ నున్నాడురా!

ప్రహ్లా—గీ. ఎచ్చటనున్నాఁడు శ్రీవిష్ణుఁడిప్పుడంచు,
అసురనాయకా! నన్నునీవడుగ నేల?
అఖిలవిష్టపాంతర్యామియైనయతఁడు
లేనిచోటేది గలదయ్య పూనివెదక ?

హిర—(తలతడవుకొనుచు పరధ్యానముతో నున్నాఁడు.)

విప్ర—ఓమహారాజా! మీరాలాగున తల తడవు కొను చున్నారేమి ?

హిర—ఓయీ! విప్రజిత్తీ! ఇప్పుడుచూచుచుండఁగా నేకన్నులు మూతపడి నాకుపాడుకల యొకటివచ్చినది. నాకు తలలేనట్లు దుస్స్వప్నమయినది. అంతచేతనామనసిపుడు కలఁగియున్నది. ఓరీప్రహ్లాదా! విష్ణుఁడిప్పుడెక్కడ నున్నాడన్నావు?

ప్రహ్లా—గీ. ఎచటనున్నాఁడు శ్రీవిష్ణుఁడిప్పుడంచు,
అసురనాయక! నన్నునీవడుగ నేల ?
అఖిలవిష్టపాంతర్యామియైన యతఁడు
లేనిచోటేది గలదయ్య పూనివెదక ?

అన్నాను.

హిర—విష్ణుఁడంతటను ఉన్నాఁడుగా? ఏఁడి యాస్తంభమున నుండుమను. (అని లేచి చేతిఖడ్గముతో స్తంభమునుకొట్టి) నీవిప్పు డీ స్తంభమున విష్ణుని చూపకపోతివేని ఈఖడ్గముతోనే నీతల సహస్ర భిన్నములు చేసెదను.

ప్రహ్లా—గీ. అఖిలజగముల నిండియున్నట్టి ఘనుండు
స్తంభమున నుండఁడే సభాస్థలినినిపుడు ?
దనుజనాయక! యీ స్తంభముననుగూడ
నిశ్చయంబుగ నున్నాఁడు నెమకిచూడు.

హిర—ఈ స్తంభములోనున్నాఁడా? ఉన్నయెడల పయికివచ్చి చాటుమాని పోటుబంటయిహిరణ్యకశిపుని యెదుట నిలువుమను. సింహమెలుకపిల్లను చంపినట్లు విష్ణుని గిష్ణునికూడ నేనీవాడిగోళ్ళతో పొట్టచీల్చి చంపివేసెదను. హిరణ్యాక్షుని పందినయి చంపిపోయిన పాపాత్మా! నీకేపౌరుషమున్నయెడల పురుషసింహుఁడవయి నాయెదుట నిలిచి నీమగతనము కనఁబరుపుము. నిన్నొక్క నిమిషములో పరమపదమునకుపంపి నాతమ్ముని పగ తీర్చుకొనెదను.

(అప్పుడు విష్ణుఁడు నరసింహమూర్తియయి స్తంభము బద్దలుచేసికొని బయలుదేఱి ప్రత్యక్షమగుచున్నాఁడు.]

నర—ఓరీ రాక్షసాధమా! నోరికివచ్చినట్లు దురాలాపములు పెక్కులు పేలుచున్నావు. తొలఁగక నిలువుము. ఈసూర్యుడస్తమించులోపల నీనోరడఁచి నిన్నును నీతమ్మునివద్దకు పంపెదను. నా భక్తుని నీవు నిష్కారణముగా హింసింపుచుండగా చూచి యింతకాల మోర్చి యూరకుంటిని. ఇఁక సహింపను.

హిర—సహింపక నీవేమిచేయగలవు? నేనాయిందుని మదమడఁచినప్పుడు నీవెక్కడకుపోయితివి? యముఁడు మొదలయిన దిక్పాలకులను బాధించునప్పుడేమయినావు? నేనువయికుంఠమునకు దండెత్తినపుడు నీవెందుదాఁగినావు? ఈబుద్ధియింతవఱకునునీకెక్కడికిపోయినది? ఓహో! నేడుగదా నాకుపండువు! నాతమ్ముని చంపినప్పటినుం

డియు నేను నీనిమిత్తమై వెదకుచుండఁగా, ఈప్రహ్లాదుని మూలమున నైనను నేటికాలమునకు నాకంటఁబడినావు. ఓరీ! ప్రహ్లాదా! నిన్ను మెచ్చుకోవచ్చును. నీవు దీర్ఘాయుష్మంతుఁడవుకమ్ము. నాసోదరుని చంపిన పగ సాధించుటకయి యెన్నాళ్ళు వెదకినను కానరాని యీ మాయగానిని నిమిషములో నాకన్నులకుచూపి నాకు మహోపకారము చేసినావు. ఇదె పిడుగువంటియీపిడికిటిపోటుతో నాపుణ్యవశముచేత దొరికిన యీవిరోధి శిరస్సు సహస్రఖండములు చేసెదను. కుందేలు వంటయిల్లు చొచ్చినది. హిరణ్యకశిపునియెదుట పీడికనెట్లుతప్పించు కొని పోఁగలడు? (అని నృసింహునిమీఁదికి నడుచుచున్నాఁడు.)

నర—ఓరీదుష్టాత్మా! యముఁడు మొదలయినవారిని బాధ పెట్టితిననిగర్వపడకు. నీవీవఱకాయమునిపెట్టిన బాధయంతయువడ్డీతో గూడ నేడాతఁడుదీర్చుకొనును. యమలోకమునకు ప్రయాణము కట్టుము. ఇదెనీడొక్క బద్దలుచేసి, దుష్టులు కొంతకాలము ప్రబలు లయియున్నను కడపట దురంతమునొందుదురన్న సత్యమును నేనీ లోకమునకు వెల్లడించెదను. (అని హిరణ్యకశిపుని పట్టుకొని చాటున కీడ్చుకొనిపోవుచున్నాఁడు.)

విప్ర—అయ్యో! నేనెంతపాపాత్ముఁడను! హిరణ్యకశిపుని వధనుగూడ చూడవలసిన వాఁడనయినాను. నృసింహమూర్తి తా నన్నంతపనియుచేయుచున్నాఁడు. అదిగో సింహద్వారమువద్ద ఘోరా కారుఁడయి నృసింహమూర్తి హిరణ్యకశిపునిపై కెత్తిపట్టి తనవాఁడి గోళ్ళతో పటపటధ్వనులుపుట్ట పొట్టచీల్చుచున్నాఁడు. హిరణ్యకశి పుని పనితీరినది. హా మహారాజా! రాక్షసకులమునకు నేడెంతదుర్వి షము పట్టినది! (అని దుఃఖమునభినయించుచు) అదిగో నృసింహుడు రాజకళేబరమును భూమిమీఁదఁ బడవైచి, రక్తముతోతడిసిన శరీ రముతో ఈవంకకే మహారోషముతో వచ్చుచున్నాఁడు. ఇక్కడ నున్నపక్షమున నన్నుకూడ చంపకవిడువఁడు. నేనుపాఱిపోయెదను.

(అని పరుగెత్తుచున్నాఁడు.)

(అప్పుడు నృసింహమూర్తి మరల ప్రవేశించుచున్నాఁడు.)

నృసిం—ప్రహ్లాదా! నీభక్తికిమెచ్చి ప్రత్యక్షమయినాఁడను. నీవు తలవంచుకొనిఖేదపడుచున్నావేమి? నీవు పోయినతండ్రినిమిత్తము చింతపడకుము. దుర్మార్గుల కెప్పుడునులోకములోనిటువంటిదుర్మరణమే సంభవించును. నిన్ను హింసబెట్టిన రాక్షసబాధ నేఁడు తొలగినది గదా! ఇఁక నీవే యీరాక్షసరాజ్యమున కధిపతివయి ప్రజాక్షేమకరముగా పరిపాలనము చేయుచు సుఖింపుము.

[అప్పుడు దిరుమణి నామములు ధరించుకొని, తులసితావళములతో అలంబనుఁడును, దుర్ముఖుఁడును ప్రవేశించుచున్నారు.]

అలం—(వచ్చుచు దుర్ముఖునితో) మనమిప్పుడు వీరవైష్ణవులవలె నున్నాము. ఈ వేషములుచూచి మనము నిజమయినభక్తులమనుకొని నృసింహదేవుఁడు మనలను తప్పకమన్నించును.

దుర్ము—(నమస్కరించి) స్వామీ! మీదాసులము. వైష్ణవులము. ఆదురాత్ముని మాటవిని ప్రహ్లాదుని బాధించితిమని మమ్ము సంహరింపక దీనులమై మీపాదములుచేరిన మమ్ము రక్షింపుఁడు. ఇదె మాపెరటిలో కాచిన వెలగపండ్లను కానుకగా తెచ్చినాఁడను స్వీకరింపుఁడు.

నృసిం—మీకభయహస్తమిచ్చినాఁడను. ఇఁకముందుమీరు బుద్ధిగలిగి బ్రతుకుఁడు. మాకీకానుక లక్కరలేదు. మేమొక్క హిరణ్యకశిపుని శిరస్సు కానుకతోనే తృప్తినొందుదుము.

దుర్ము—(తనలో)అట్లైన నీవీవెలగపండు బట్టలో వేసిశిరస్సని చూపి యీదేవునిమాయచేసి సంతోషపెట్టెదను. (తాను తెచ్చిన వెలగపండునుబట్టలో వేసిచూపుచు) స్వామీ ! అట్లయినచో హిరణ్యకశిపునిశిరస్సునే మీకు సమర్పించెదను. ఈ కానుక నందుకొనుఁడు.

అలం—(దుర్ముఖునితో) ఓరీ! ఇంతచిన్నది హిరణ్యకశిపుని శిరస్సన్న నమ్మడు. నేను తెచ్చిన కొబ్బరికాయను బట్టలో వేసి హిరణ్యకశిపుని శిరస్సని సమర్పించెదను.

దుర్ము—(అలంబసునితో) నీదిమాత్రము మన రాజుగారిశిర స్సంతయున్నదా? నీవట్లు చెప్పినపక్షమున స్వామివారు నేనసత్య మాడినానను కోరా? నీవూరుకో;ఇదిరాజుగారి శైశవావస్థలోని శిరస్సు నేను సంపాదించినానని చెప్పెదను.

అలం—(దుర్ముఖునితో) నీవే ఊరుకో.ఇది రాజుగారి బాల్యా వస్థలోని శిరస్సు. నేనే సంపాదించినానని చెప్పెదను. మన రాజుగారు పెద్దవారయి నేటిదాక బ్రతికియుండఁగాచిన్ననాటిపుత్రునికెట్లువచ్చి నది? నాదందువో విశ్వామిత్రసృష్టి.

దుర్ము—(అలంబసునితో) నాది బ్రహ్మసృష్టి.

ప్రహ్లా—(చేతులుజోడించుకొనినిలువఁబడి ధ్యానముచేయుచు)

ద్విపద. జయజయసర్వేశ! జయపాపనాశ!
జయజయగతపాశ! జయస్వప్రకాశ!
నిరతంబు నామది నీభక్తినుండి
మరలకుండగఁజేసి మన్నింపవయ్య;
దయయు సత్యంబును దప్పక, నీకుఁ
బ్రియమైన కార్యముల్ ప్రేమమీఱంగ
సతతంబు భువిలోన సలిపెడుబుద్ధి
నతులొనరించెద నాకియ్యవయ్య;
నీదుభక్తులయెడ నిత్యంబునాకు
నాదరమొదవెడు నట్లొనరించి
జనులనెల్లను భ్రాతృసములనుగాఁగ
వనితలఁ దోఁబుట్టుపడుచులఁగాఁగ
భావించుకొనుచుండి వారి క్షేమంబు
భావంబులోఁగోరి పనిచేయునట్లు
నాకుఁబ్రసాదింపు, న్యాయస్వరూప!

ప్రాకటధర్మంబు పాయకుండంగ
నీతిమార్గంబున నియమంబుతోడ
నేతఱి నేఁజరియిం చెడునట్లు
వరములునాకిమ్ము వాత్సల్యమానను
వరదయాకర! భక్తవరద! లోకేశ!
త్రికరణశుద్ధిగా, దేవాదిదేవ!
సకలార్తిహర! నీకుఁజాల మ్రొక్కెదను.

నృసిం—(ప్రహ్లాదుని చేతులతో దువ్వుచు) వత్సా! నీవుకోరిన వరము లన్నియు నిచ్చినాఁడను. పరమభాగవతోత్తముఁడవై వర్ధిల్లుము. మేమీసభాసదులకుఁగూడ నొక్కహితోపదేశముచేసి, అంతర్హితుల మయ్యెదము.

సీసమాలిక.

శ్రీమహావిష్ణుఁడ సింహాముఖంబునునరరూపమునుదాల్చికరుణతోడ, భక్తునిగావంగ వచ్చితినిటకు వినరయ్య జనులార వీనులలర, దుడ్డునామము పెట్టి తులసిపేరులుదాల్చి మ్రొక్కుమాత్రనె మీకు ముక్తిలేదు, నాపాదభక్తులై ననుదృప్తిఁజేయఁగఁ దలఁతురేనియు మీరు తెలియ వినుఁడు, ముందుగామీరలు భూతకోటులయందుదయ గల్గినత్యంబు తప్పకెపుడు, కామాదులజయించి కరుణాప్రపూర్ణులై పరవంచనములేక పరవనితల, తోడఁబుట్టువులట్లుఁ దోడిమానవులను సోదరులట్లును జూచుకొనుచు, నీతిమార్గంబున నిత్యాదరముతోడ మీరెల్ల నిరతంబు మెలఁగవలయుఁ, జిత్తశుద్ధిలేనిసేవచే నింతయు, ఫలములేదుగాన భక్తితోడ, నన్నుఁగొలుచుచుండి నాకుఁదృప్తినొనర్చు పనులుసలిపిముక్తిపదవి గనుఁడు. (అనియంతర్హితుఁడయ్యెను.)

३५१

సత్యహరిశ్చంద్రనాటకము

ఈనాటకమునందు వచ్చుపాత్రలు.

ఇంద్రుఁడు— దేవరాజు
బృహస్పతి— దేవగురువు
జయంతుఁడు— దేవేంద్రుని కొమారుఁడు
వశిష్ఠుడు, విశ్వామిత్రుఁడు, అగస్త్యుడు, గౌతముఁడు, అత్రి, కశ్యపుఁడు, వామనుఁడు } మహర్షులు
జాబాలి—మార్కండేయుని శిష్యుడు
గాలవుఁడు— హరిశ్చంద్రుని వేడుక చెలికాఁడు
హరిశ్చంద్రుఁడు—అయోధ్యాపురాధీశుఁడు
చంద్రమతి—హరిశ్చంద్రుని భార్య
లోహితాస్యుఁడు—హరిశ్చంద్రుని కొమారుడు
సత్యకీర్తి—హరిశ్చంద్రునిమంత్రి
భద్రుఁడు, పాలకుఁడు—భటులు
మాలెతలు—విశ్వామిత్రుని వనపాలకురాండ్రు
జనమిత్రుఁడు, కామపాలుఁడు—అయోధ్యాపురపౌరులు
నక్షత్రకుఁడు—విశ్వామిత్రుని శిష్యుఁడు.
దంతఘాతకుఁడు—విశ్వామిత్రప్రేరితుఁ డగురాక్షసుఁడు
కపాలకుండలుఁడు—పిశాచరాజు (భేతాళుఁడు)
కాలకౌశికుడు—చంద్రమతిని వెలకుగొన్న కాశీపురబ్రాహ్మణుడు
కలహకంటకి—కాలకౌశికుని భార్య
వీరబాహువు—ప్రేతభూమికధికారి
వీరదాసు—వీరబాహువు హరిశ్చంద్రుని కొసఁగిన మాఱుపేరు
మధుదాసుఁడు—వీరదాసుని యనుచరుఁడు
భీషణుఁడు, తామ్రాక్షుఁడు—కాశిరాజభటులు
ప్రతాపచంద్రదేవుఁడు—కాశీపురాధీశుఁడు
శివుఁడు—కైలాసపతి
పార్వతి—శివునిభార్య

B51

శ్రీ

సత్యహరిశ్చంద్రనాటకము

ప్రథమాంకము

శా. శ్రీకళ్యాణగుణాకరుండు త్రిజటత్సేవ్యుండు నిత్యుండు సు
శ్లోకుం డాద్యుఁ డతీంద్రియుండు పరమేశుం డప్రమేయుండు లో
కైకాధారుఁడు సర్వశక్తుఁ డమలుండాద్యంత శూన్యుండు ప్రే
మైకస్థానుఁడునైన దేవుఁ డిడు మీకత్యంత సౌభాగ్యముల్.

సూత్ర—(తెరవంకజూచి) ఓయీ! స్థాపకా! మీయలంకారము పూర్ణమయినపక్షమున నీవొక్కసారి యిటురమ్ము;

నటు—ఇదిగో వచ్చినాడను. ఈ సేవకుని కేమియాజ్ఞ?

సూత్ర—ఈరాత్రి మనమేమో వీరిని వినోదపెట్టుదుమని విని యీసభవారందఱును మననాట్యశాలకు విజయంచేసి చకోరపక్షులు వెన్నెలనిమిత్తమయి యాసపడి చూచుచున్నట్లు మనవంక నెట్లుచూచుచున్నారో చూడు. ఈ వేసవికాలపు సెలవులలో నొక యపూర్వనాటక మాడి పురజనులను సంతోషపెట్టెదమని యీ వరకే ప్రకటన చేసి యున్నాము గనుక, మనమిప్పుడాలస్యము చేయక యీనూతన హరిశ్చంద్ర నాటకమును ప్రయోగించి వేడుక చూడవచ్చిన వీరిడెందముల నానందింపఁజేయుదము.

నటు—సరిసరి! చక్కగాఁ జెప్పినారు. నాటకప్రయోగము నందు బాలప్రాయులమయిన మనమెక్కడ? స్తోకశల్య పరీక్షచేసెడి యీమహాసభ్యులహృదయరంజనమెక్కడ? ఈమహాసభను సంతోషపెట్టగలవా రెంతటి శక్తివంతులు కావలెను?

సూత్ర—గుణగ్రహణైకపారీణులైన వీరికడ మన మెంత మాత్రమును భయపడవలసిన పనిలేదు. ఆటపాటలయందు మన యొద్ద నెన్నిలోపములున్నను వానిని పాటింపక ముగ్ధజనసమాదరణ పరాయణులయిన వీరు మనయందలి వాత్సల్యాధిక్యముచేత మన గుణలేశములనే మెచ్చి సంతోషపడుదురు సుమా. అట్లుగాక వీరొక వేళ మన లోపములను జూపినను మన కది శ్రేయస్కరమేయగును. ఎట్లన—

క. రసికులు కానిమనుష్యులు
పొసఁ గన్వీక్షించి మెచ్చి పొగడుటకంటెన్
రసికు లగువార లారసి
పసలేదని తెగడుటెంతో వాసియొసంగున్. 2

నటు—అదిసరేకాని కాళిదాసాది మహాకవులచేత రసవంతము లయిన మృదు మధురవాగ్గుంభనలతో రచియింపఁబడిన రమ్యతరములయిన ప్రాచీన గీర్వాణనాటకము లనేకము లుండగా, దేట తెలుగు మాటలతోఁ గూర్పఁబడిన యీ నవీననాటక మిప్పుడు వీరి మనసుల కెట్లెక్కగలదు!

సూత్ర—మనమీవిషయమునను శంకింపవలసినపనిలేదు. ప్రౌఢకావ్యములరుచి మరఁగిన నవరసరసికులకు సహితము బాలురముద్దుమాటలు హృదయరంజకములు కాకుండవుసుమా! అదిగాక, యభిజ్ఞులైనవారెప్పుడును సారస్య మెందున్నను గ్రహించి యాదరింతురుగాని యిదివఱరాతన మనియు నాలోచింపరు. అందుచేతనే కవికులసార్వభౌముఁడయిన కాళిదాసుఁడు మాళవి కాగ్నిమిత్రమను నాటకరాజము నందుఁ బూర్వము,

ఉ. ప్రాఁతది యన్నకారణముఁ బట్టియెసర్వము మేల్మిజెందునే?
నూతనమన్న హేతువున న్యూనతఁజెందునెక్రొత్తవన్నియున్

ఖ్యాతిగనుత్తముల్గుణము నారసి మంచి గ్రహింతురెప్పుడున్
బ్రాంతవె మంచి పందు రవిమర్శితఁ గేవల మూఢమానవుల్ 3

అని చెప్పియుండలేదా? ఇది కాళిదాసాదుల మహా నాటకరత్నముల వలె నంత మనోహరముగా నుండకపోయినను నిత్యసత్యవ్రతము చేతఁ బ్రఖ్యాతి చెందిన శ్రీహరిశ్చంద్ర మహారాజచంద్రుని పవిత్ర చరిత్రమగుటచేతఁ దత్కథామృతపానమునందలి యపేక్ష చేతనైనను సభవారు దీనినంగీకరించి యాదరింపకపోరు. లోకములో సత్పురుషుల కర్ణములకు నీతికథాశ్రవణముకంటె మధురమయినది మఱియొకటి యుండదుగదా?

నటు—మీరిప్పు డెప్పటిదో కృతయుగవార్త సెలవిచ్చుచున్నారు. మీరన్నది పూర్వకాలపుమాట గాని యీకలికాలములో నీతివాక్యములయందు బద్ధాదరులగువారెవ్వరున్నారు!

సూత్ర—నీవు బుద్ధిమంతుఁడవే కాని యీవిషయములో నీబుద్ధిభ్రమసిపోయినది. ఇదియెంత కలికాలమయినను నీతి యిప్పటికిని మొదలంటఁజావలేదు. ధర్మస్వరూపుఁడయిన భగవంతుఁడు పయినుండి పరిపాలించు చున్నంత వఱకును లోకములో నీతియెప్పుడును నిర్మూలము కానేరదు. దుర్నీతియెంతప్రబలముగా నున్నను నీతియే యెల్లప్పుడు బ్రజల యుల్లములమీఁద రాజ్యము చెల్లించుచుండును. అవివేక ప్రేరణముచేత నీతివర్తనమును గొందఱు విడిచినంత మాత్రమున దానిమహిమ యెక్కడపోవును.

ఉ. తామిల నీతిమార్గమును దప్పిచరించెడువారుకూడ నీ
భూమిజనంబు తమ్మెపుడు ప్రోజ్వలనీతిపథానువర్తులం
చే మెయినెంచునట్లునటియింతురు వేషముపూనిభూమిలో
నోమహితాత్మ! చాలదెయిదొక్కటె నీతిబలంబుచాటఁగన్. 4

నటు—మీరు నీతిమార్గప్రభావము నెంతగావర్ణించుచున్నను, నాప్రత్యక్షానుభవమునుబట్టి చూడఁగా లోకములో దుర్నీతియే యధికసంఖ్యాకుల మనస్సులను లోఁ బఱచుకొని యధికారము చెల్లించుచున్నట్లు కనఁ బడుచున్నది.

సూత్ర—నీవన్నట్లు దుర్నీతి యెంతదూరము వ్యాపించి యెందఱిని కానిమార్గము పట్టించుచున్నను, అది దొంగవలె నడఁగి యుండి చాటునఁ బనిచేయ వలసినదే కాని బహిరంగముగాఁ దల యెత్తుకొని యెప్పుడును నిర్భయముగాఁ జరింపనేరదు.

చ. వినుపగలీశ్వరుం డిడిన వెల్తురులోఁ దలచూపనోడి మూ
లనడఁగి రాత్రిఁ జీఁకటిమెలంగెడుక్రూరమృగంబుకై వడిన్
దనజయ వేళయందు సహితమ్ము బయల్పడ లేక చాటునన్
బనియొనరించుఁ జూ వెభయభావముతో నవినీతియెప్పుడున్. 5

ఇంకొక్కవింతవినుము. అంతరంగమున దుర్నీతికి దాసులయి దాని కనవరత శుశ్రూష చేయువారు సహితము బహిరంగముగా దుర్నీతిని సేవింపనొల్లక నీతినే గౌరవించి భూషించుచు, తమ్మెవ్వరయిన నీతిమాలిన వారని పలికినంత మాత్రమున వారిమీఁద మండిపడుచుందురు. ఇందువలననే నీతియొక్క పూజ్యతయు గౌరవాధిక్యమును నీకు వెల్లడి యగుచుండ లేదా? అదిగాక యెంతటి నీతిమాలిన పరమ నీచులకయినను నీతియందును నీతిమంతుల యందును గౌరవమును బ్రేమయును బరమాదరమును నుంచుట సహజ గుణముగా నున్నది.

సీ. ఆగౌరవాదుల కారయ ధర్మంబెకారణంబియ్యులఁగాదెయేని
దీర్ఘకాలముక్రిందదివి కేగియున్నట్టిరామునినాధర్మరాజునిపుడు

దేవసన్నిభులఁగ భావించి పూజింప వారిసచ్చరితల గారవింప
మహిమీఁదవారలుమనకుజేసిన యట్టియతులోపకారమేదైన
మనము రావణు దుర్యోధనుఁగరంబు [గలదె?
దూషణమొనరించి ద్వేషింపఁ దొల్లివారు
మనకు నపకార మిమ్మహీమండలమున
నెప్పుడైనను జేసిరే యించుకైన? 6

ఉ. సీతవిపత్తులంబొరలి చేడ్పడెనన్నపు డార్తి చెందగా,
సీతమహోపకారమిటఁ జేసినదేది జగజ్జనాళికిన్?
క్ష్మాతలమందు శూర్పణఖ కష్టపరంపర చెందెనన్నచోఁ
జేతములంజెలంగ నదిచేసినదేది మహోపకారమున్? 7

లోకములో నెప్పుడును స్థిరమయిన గౌర వాదరములకు జనుల సుగుణ సుచరితలు పాత్రములగునుగాని యవిలేని కేవలధనాధి కార సంపదలు కావుసుమా !

గీ. గుణవిహీనుఁడు సామ్రాజ్య గురుతఁగన్న
నసుధవానికి స్థిరగౌరవంబురాదు;
ధరణిలోపలదారిద్ర్య దశగన్నఁ
గలుగు గుణవంతునకె స్థిరగౌరవంబు. 8

నటు—మీరిప్పుడువచ్చిన కార్యమును మఱచి ధర్మోపన్యాసములు చేయుచున్నారు. ఈసభవారో, కాలహరణమున కోర్వలేక త్వరపడుచున్నారు. నన్నిప్పుడు పిలిచిన కార్యమునంగతి తలఁపున నిలుపుఁడు.

సూత్ర—ఓహో! నేనిప్పుడు ధర్మప్రసంగాదర పరవశుఁడనయి ప్రస్తుతకరణీయమును మరచిపోయితినిగదా! ఇదిగో చూడుము.

ఉ. ఇంద్రసమానభోగులు కవీంద్రులు విత్తపతుల్గురు ల్బుధుల్
సాంద్ర యశస్కులై యిచటసభ్యులునిండి చెలంగఁగాహరి

శ్చంద్రుని గూర్చివింతగఁ బ్రసంగము చేయుచు నుండినట్టిదే
వేంద్ర సభాగృహంబుగతి నీసభ శోభిలుచున్న దెంతయున్.9

ఇఁక వేగిరము పోయి మన యపూర్వ నాటక ప్రయోగముచేత
మన మీ సభారంజన ప్రయత్నము చేయుదమురమ్ము.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు)

ఇదిప్రస్తావన.

రంగము—ఇంద్రసభ.

[సుధర్మాసనంబునఁగూరుచుండి దేవేంద్రుఁడును, జయంత బృహస్పతి ప్రభృతి ప్రకృతివర్గమును, వరుణ కుబేరాది దిక్పాలకులును, అత్రిగౌతమాగస్త్య వశిష్ఠ వామదేవ కశ్యప నారద విశ్వామిత్రాది మహర్షులును బ్రవేశించు చున్నారు.]

ఇంద్రు— (బృహస్పతివంకఁజూచి) ఓయాచార్యోత్తమా! ఏమి యీమధుర్యము! రచియించినప్పుడు మీరెంత యానందము పొందియుందురో కాని మే మిప్పుడీవాచస్పత్య నీతిశాస్త్రమును గర్ణ రసాయనముగా వినుచున్నకొలఁదిని క్రొత్తచవులుపుట్టి మాకర్ణములు చరితార్థములగుచున్నవి.

ఉ. భూతలమందు స్త్రీలయెడ, బుణ్యవివాహములందు బ్రాణమున్
భూతియు మానముంజెడెడుపొందున, గోద్విజరక్షణార్థముఁ
నీతియటంచుబొంకుమని నేర్పినశుక్రుని నీతినవ్వి, స
న్నీతిగ మెచ్చిరిమ్మునులు నీకృతిలోని విశుద్ధనీతినిఁ. 10

చెవులొగ్గి ఈమహర్షులు మహాదరముతో వినవేచి యున్నారు. ఏదీ తరువాత పద్యమును జదువుఁడు.

బృహ—ఓసుహేంద్రా! ఇటువంటి యపూర్వదివ్యసభలోఁ ద్రిలోకాధినాథులైన దేవరవారును, కేవలధర్మశాస్త్రకారులయిన జడదారులును విని యీప్రకారముగా శ్లాఘించుటచేత నాగ్రంథ మిప్పుడుగదా పావన మయినది! ఇఁక నేను నీతిశాస్త్రప్రణేతలలో ధన్యతముఁడను. ఇదె యీపైపద్యమును జిత్తగింపుఁడు.

చ. కులసతిబాసినన్, సుతుఁడుకూలిన, నాపదలెన్నివచ్చి త
న్నలమిన, మానభంగమయినన్, సిరిపోయిన, రాజ్యమూడినం

జెలులుత్యజించినన్, మద కసింగొని ప్రాణముతీయవచ్చినం,
బలుకఁగ రాదుచూ వెఱణుమాత్రమసత్యముమర్త్యఁ డెప్పుడున్ 11

వశి—ఓహో! ఈనీతివాక్యము దేవతా శ్రేష్ఠులును శిరసా వహించి శ్లాఘింపఁ దగియున్నదిగదా! మేలు! ఇట్టి నీతివాక్య రత్నముల కాకరమైన యుత్తమశాస్త్రమునురచియించిన మహానుభావుడు దేవగురుఁడనిపించుకొనుటకుఁ దగినవాఁడే.

విశ్వా—(తనలో) ఏమీ! ఈముదిబ్రాహ్మణుఁడు బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేయఁజాలిన నేనును, అఖండ తపోమహిమచేత నొక్కొక్కడే యీలోకముల నాకులపఱుపఁ జాలిన యీమహర్షి సత్తములును, ఉండఁగా మమ్మెవ్వరిని గణనచేయక తపోగర్వము చేత తానేఘనుఁడయినట్లు సభలోముందుగా మాటాడి మాయెడ దిరస్కారభావము చూపుచున్నాఁడు! మాపూర్వవైరమునుబట్టి యీతని మాటయన్న నాదేహము భగ్నమగుచుండును. ఈసభ చాలించెడి లోపల నేనేదో మిషకల్పించి యీతని గర్వభంగము చేసెదను. (అని తలయూఁచుచున్నాఁడు)

ఇంద్ర—జయంతా! ఏమి యీబృహస్పతిపుణ్యము! అధ్యాత్మ విద్యాగరిష్ఠుఁడైన యీవశిష్ఠుడుఁను సకల మహర్షి సమక్షమ్మున నీతని నిట్లుశ్లాఘించు చున్నాఁడు. ఏదీ నీవిందాఁకమందాకిని యందలి పొందామరాకులోఁ బొదివి తెచ్చిన యాసుందర మందార ప్రసూన దామ మిటుతెమ్ము. నేనది యీబృహస్పతి కంఠమునవైచి దానిని సార్థకపఱిచెదను.

జయ—ఇదిగో మందారమాల. ఈతని మెడ నలంకరింపఁ గలుగుటకిది తప్పక యేదో గొప్పసుకృతము చేసికొన్నది. (అని పుష్పమాల తండ్రిచేతి కిచ్చుచున్నాఁడు.)

ఇంద్ర—(పుచ్చుకొని బృహస్పతి మెడలో వేయుచు) ఓగురుసార్వభౌమా! మీ రిప్పుడు చదివినపద్యమునకుఁ ద్రిలోకాధిపత్యము నిచ్చినను మీ యోగ్యతకుఁజాలినదిగానుండదు. అయినను భక్తిపూర్వకముగా నిచ్చెడి యీపుష్పదామమును శిష్యవాత్సల్యముతో నంగీకరించి యీగ్రంథరచనచే మీ కాచంద్రార్కముగాఁ గలుగఁబోయెడు ధవళకీర్తికి సూచకముగాఁ గంఠమున ధరింపుడు.

బృహ—త్రిలోకాధిపతులయిన దేవరయంతటివారు సమస్తలోక పాలదత్తోప సిరగ్రహణ ప్రశస్తములయిన దివ్యహస్తములతో స్వయముగాఁ బుష్పమాల మెడనువేసి సేనించెడి యసాధారణ గౌరవమునే నేనిప్పుడు పొందుచుండఁగా నాకుఁ ద్రిలోకాధిపత్యమేల కావలెను? నా యందలి మీ నిర్హేతుకజాయమానకటాక్షముచేత నేను జరితార్థుఁడ నయినాను.

ఇంద్ర—ఎదుటజెప్పిన ముఖస్తుతిగాఁ దోఁచునేమో కాని యేసత్కారము జేసిన మీయుద్దేశకుఁ దగియుండునో నేనూహింపజాలకున్నాను. మీరు చెప్పిననీతి వాక్యము సర్వజన సమాదరణీయమయినదే కాని దాని నాదరించుట మాత్ర మెవ్వరికిని పూర్ణముగా సాధ్యముకాదని నాకుం దోఁచుచున్నది.

బృహ—లోకములో నసాధ్యమయిన నీతిని విధించుటవలనఁ బ్రయోజనమేలేదు. శాస్త్రమున విధింపఁబడు ధర్మ మెప్పుడును సర్వజనాదరణ సాధ్యముగానే యుండనలయును. దేవరవారు సెలవిచ్చునట్లుగా లోకములో నీతు లుపదేశించు వారివలె ననుష్ఠించువారంతగాఁ గానరాక పోవుచుండుటనుబట్టి తమ కట్టి సందేహము పుట్టుటకు హేతువయినది. కాని, విమర్శతోఁ జూడఁగా నేనిప్పుడు సత్యవిషయమున విధించిననీతి యాచరింప మనసుగలవారి కందరికిని బరమసాధ్యమే కాని యసాధ్యమెంతమాత్రమునుగాదు. అయినను

నీతులు చెప్పుటవలె నడుచుకొనుమాత్రమంత సులభము కాదని నేనె యొప్పుకొనెదను.

చ. పరులకు నీతులం గఱపువారలు లక్షలు గోట్లు నుందు; రెం
దరసినలక్షకోటి బదువురైనను నుండరు చెప్పినట్ల యా
చరణమొనర్చువారు; బలశాసన అయ్యుపదేశమట్ల యా
చరణయుఁ దేలికై తగిన, స్వర్గము కాదె సమస్తభూమియున్? 12

ఇంద్రు—ఓగురువర్యా! నాచిన్న విన్నపంబొకటి చిత్తగింపుడు.

చ. పదువురు కారు, భూతములపై మఱిలక్షకు నొక్కఁడైనను
వెదకఁగ గష్టములొడరు వేళను సత్యముతప్పకుండువాఁ
డొదవునొ బొత్తిగానొదవఁడో యని సంశయమయ్యెడిన్మదిన్
వదలక సత్యమేయెపుడుఁ బల్కుట దుష్కరమంచు నెంచెదన్. 13

ఓమహర్షులారా! మీయభిప్రాయమేమి? నాయభిప్రాయము సరి కాదని తోఁచినపక్షమున త్రికాలవేదులయిన మీ రెఱుంగనివారు ముల్లోకములయందును లేరుగాన వెనుక చన్నవారిలోఁ గాని యిప్పుడున్న వారిలోఁ గాని నిరంతరసత్యవాక్య ధురీణుఁడయిన నీతివిద్యా పారీణుఁడెవ్వఁడయిన మీ బుద్ధికి గోచరుఁడగునేని వ్రేలు మడఁచి యొక్కని పేరు చెప్పుఁడు.

అగ—(కిందచూచుచు నేలవ్రాయుచున్నాఁడు)

గౌత—(మీఁదుచూచుచు నాలోచించుచున్నాఁడు.)

అత్రి—కశ్యపునిముఖమువంకఁ జూచుచున్నాఁడు)

కశ్య—వామదేవునికి కనుసైగచేయుచున్నాఁడు)

వామ—(నారదునిగోఁకుచున్నాఁడు.)

నార—(వశిష్ఠునితోఁజూపి) నీవుత్తరమిమ్ము (అని తలయెగుర వేయుచున్నాఁడు)

వశి—(ముందునకు జరుగుచున్నాఁడు.)

విశ్వా—(తనలో) ఏమి యీతని సాహసము! తపోమహిమ చేత ముల్లోకముల నల్లలనాడింపఁగల మేమందఱును నిటనుండఁగా మఱల నితఁడేయిప్పుడును దానేమో చెప్పవలెనని ముందుకు జరుగు చున్నాఁడు.

నార—(ఋషులవంకఁజూచి) ఈమహేంద్రుఁడు మీవలనఁ దనప్రశ్నకుత్తరము గానక తహతహ పడుచున్నాఁడు. ఓవశిష్ఠా! తక్కినవీరివలె నీళ్ళునమలక జపసమయమునందు మాత్రమేకాక యీసభయందునుమౌనముద్ర ధరియించియున్న వీరి కందఱికిని సిగ్గు వచ్చునట్లుగా నీవే వేగిర మేదోచెప్పు.

విశ్వా—(తనలో) ఏమి యీనారదుఁడు మమ్మెత్తిపొడుచు చున్నాఁడు!

వశి—ఓ దేవాధీశ్వరా! నీవడిగినరీతి జగన్నుతుఁడయిన నిత్య సత్యవ్రతుడొక్కఁడిప్పుడు నాకన్నులకుఁ గట్టినట్టు పొడకట్టుచు న్నాఁడు. ఎప్పటివానినో యిప్పుడు చెప్పనేల? ఈవర్తమాన కాల మందున్న మహాత్మునినే చెప్పెదను వినుము.

వామ—(ఋషులతో రహస్యముగా) ఇప్పుడితఁడు మనలో నెవ్వరిపేరైనఁ జెప్పునేమో!

గౌత—(తనలో) నాపేరు చెప్పిన బాగుండును.

ఇంద్ర—వశిష్ఠా! అట్టియాడితప్పని పురుషరత్నముపేరుగా నోచినపుణ్యాక్షరములేవో నాచెవుల వేసి గర్ణోత్సవముచేయుము.

వశి—భూకాంత కలంకారమన సౌందర్యరాశియై సమస్త ప్రశస్తవస్తుసంపదల చేతులనునిస్తులంబయి యోధజనాసాధ్య మ యిన యయోధ్యానగరము ముక్తిదాయకములయిన సప్తపురముల లో నగ్రగణ్యమయి భూలోకమున నున్నసంగతిమీరెఱిఁగినదేకదా?

ఇంద్ర—మేమది యెఱుఁగుము. అదిమాకాప్తులయినకోసల దేశాధీశ్వరులకురాజధాని.

వశి—ఈపుణ్యపురమున కధీశ్వరుఁడయి, అనన్యసామాన్య విక్రమధురంధరుఁడై, సకలసద్గుణబంధురుఁడయియున్న హరిశ్చంద్రుడనుసార్వభౌముఁడు తన యవార్య శౌర్యముచేత సప్తద్వీపములను జయించి, రాజాధిరాజయి, అవక్రపరాక్రమంబున భూచక్రమెల్ల నేకచ్ఛత్రముగాఁ బాలించుచున్నాఁడు. అతఁడుస్వచ్ఛకీర్తులయిన షట్చక్రవర్తులలోను బ్రథమ గణ్యుఁడు.అగణ్యపుణ్యుఁడు ఆటల యందును బొంకెఱుఁగని పరమసత్యనిరతుఁడన్న లోకములో నతఁడొక్కఁడే.

విశ్వా—(తనలో) ఆహా! మాక్షత్రియ వర్ణములో వర్ణనీయుడయిన యటువంటిసత్యశీలుఁ డున్నాఁడని యింద్రసభలో వర్ణించుటచేత నేనిప్పుడు గర్వపడుచున్నాను.అట్టిసత్యవ్రతాదరణ పరాయణులు మాక్షత్రియకులమునందుఁ గాక మఱి యెందుందురు? బ్రహ్మర్షినయినను దొంటికులాభిమానము నన్నిప్పటికిని విడువకున్నది గదా? ఈచక్రవర్తిమూలమున మారాజవంశముకీర్తి కెక్కినదని లోకులనేనెంతపరమానందభరితుడనై యున్నను, బ్రహ్మ విద్యాధురంధరుల మయిన మేమిందఱ మిక్కడనుండఁగా మమ్మెవ్వరిని లక్ష్యము చేయక యీతఁడు స్వతంత్రమువహించి మేమందఱమును జేతకాని వార మయినట్లు తాను ముందునిలిచి పలికిన యవమానముకూడ నా మనస్సు నొకమూల వేధించుచున్నది. ఇప్పు డీతని గర్వసంహారముచేసి నాపూర్వవైరమును సాధించుటకు సాధనమేమున్నది?

నార—ఓవశిష్ఠా! నీవే నామనస్సువచ్చిన వాడవు. తామే సర్వజ్ఞులమని విఱ్ఱవీఁగుచుండెడి యీవిశ్వామిత్రాదుల గర్వమంతయు నడఁగి వీరికి సిగ్గువచ్చునట్లుగాఁ జెప్పినావు.

విశ్వా—(తనలో) ఏమీ! ఈనారదుఁడు కూడ మొదల నా పేరే యెత్తుచున్నాఁడు! ఇంతకు వచ్చినతరువాత నిఁక నూరకుండఁ

గూడదు. ఈనారదుని కుటిలవాక్యముకన్నను నాపూర్వవైరమే యీబ్రాహ్మణుని బరాభవింపుమని నన్ను వేయివిధములఁ బ్రేరే పించుచున్నది. కాని నాకు పాయముమాత్రము తోపఁకున్నది.

ఇంద్ర—ఓవశిష్ఠా! ఆరాజు కొంతవఱకు సత్యసంధుఁడే కావచ్చునుగాని నీ విప్పుడాతని సత్యాధికముగా వర్ణించుచున్నావేమో యని నాకు సందియము తోఁచుచున్నది.

వశి—నేఁజేసిన దతివర్ణన కాదు. ఆమహారాజుయొక్క సత్య సంధతకు నావర్ణనము చాలనిదయ్యెను గదాయని నాకు సిగ్గగు చున్నది.

విశ్వా—(తనలో) ఇప్పు డీయింద్రుఁడొక యుపాయము తోఁపించి నాకుమార్గదర్శియగుచున్నాఁడు. నేనాహరిశ్చంద్రుఁడు సత్యసంధుఁడు కాఁడని వివాదము పెట్టుకొని యీతనిని బరాభ వించెదను. అదిగాక నేనిప్పుడీతని వచనమును బూర్వపక్షముచేసి చెర్చపెంచుటచేతఁ గూడ హరిశ్చంద్రుని సత్య నిత్యతయే సిద్ధాంత మయి మారాజవంశమున కంతకును మఱింత వన్నెయు రావచ్చును. కాఁబట్టి నేనిప్పుడు సంకోచింపవలసిన పనిలేదు. (ప్రకాశముగా) వశిష్ఠా! ఇంతకుమున్ను నీవీపురందరుని ముందఱ నేమన్నావు? పరాకుగావిన్నాను. నీవిప్పు డెవ్వనినో నిత్యసత్యవ్రతుఁడని కైవా రము చేసినావే వానిపేరేదీ, యింకొకసారి చెప్పుము.

వశి—వినవిష్టమున్నచో నామహామహునిపేరు మనపాపపరి హార మగునట్లుగా నిఁక వేయిమాఱులు చెప్పుమన్నను చెప్పెదను. జగద్విశ్రాంతయశస్సాంద్రుఁడగు నారాజచంద్రుని పేరు హరిశ్చం ద్రుఁడు, హరిశ్చంద్రుఁడు, హరిశ్చంద్రుఁడు.

నార—ఓవిశ్వామిత్రా! మునిజనవరిష్ఠుఁడయిన యీవశి ష్ఠుఁడు దేవసభామధ్యమున నిర్భయముగా ముమ్మాటికిని హరి

శ్చంద్రుఁ డని చెప్పుచున్నాఁడు. ఇఁక నీచేత నగునేని హరిశ్చంద్ర సార్వభౌముఁడు సత్యవాక్య ధౌరేయుఁడు కాఁడని సాధింపుము.

ఇంద్రు—(తనలో) ఓహో! ఇతఁ డెప్పుడును గలహప్రియుఁ డుకదా! కలహ విద్యావిశారదుఁ డయిన యీనారదుఁడు వీరికి రోషమెక్కించి యొండొరులను బురికొల్పుచున్నాఁడు. ఇతనికిఁ గలహ మున్నపక్షమున వేఱే భోజన మక్కర లేదు. అందుచేతనే కలహ భోజనుఁ డన్న పేరితనికి సార్థకముగాఁ జెల్లుచున్నది.

విశ్వా—ఏమేమీ! ఆఖర్వరాజ్య గర్వాంధుఁడయి కన్ను గానకున్న యాహరిశ్చంద్రునా యీమునులెల్ల వినుచుండ జంకులేక నీవు నాముండఱ సత్యసంధుఁడని పేర్కొనుచున్నావు? ఇంద్రుని యెదుట మహాసభలోఁ బ్రజ్ఞలకయి యీరీతిగాఁ గల్లలేలయాడెదవు? ఉగ్గుపాలనుండియుఁ బరవంచనమే కులవిద్యగా నభ్యసించెడి రాజు లెక్కడ? సత్యవాక్యము లెక్కడ? చాలు ఇంతట నూరకుండుము. ఈమాట లెవ్వరయిన విన్న నవ్విపోదురు. మారాజవంశమునఁ బుట్టిన హరిశ్చంద్ర మహీంకళత్రుని చరిత్రమును నాకంటెను నీ వెక్కువ యెఱుఁగుదువా? (అని కన్ను లెఱ్ఱచేసి చూచుచున్నాఁడు)

ఇంద్రు—(తనలో) అయ్యో? ఇతఁడు కోపమునే ప్రధాన ముగాఁ జూచుకొనుచున్నాఁడు కాని మఱియేమియు నాలోచింప కున్నాఁడు.

వశి—తాటాకుల చప్పళ్ళకుఁ దోడేళ్లు బెదరవు. సూర్య వంశపు రాజులకెల్లను కులగురువైన వశిష్ఠుముందఱనా నీబింకములు కనఁబఱిచెదవు? ఇఁకనీబెదరింపు లటుండనిచ్చి న్యాయమునకురమ్ము. ఆడితప్పనివాఁడన్న లోకములో నాహరిశ్చంద్రుఁ డొక్కడే. నీవా తనినొక్క రాజసామాన్యుఁ డనుకొను చున్నావేకాని సాధుకీర్తి యైన యాచక్రవర్తి మహత్వము నించుకంతయు నెఱుఁగకున్నావు.

విశ్వా—కొలువులో నీవిచ్చకములకయి కల్లలాడుటయే కాక మెఱుఁగమని మాయందజ్ఞానమునుగూడ నారోపించుచున్నావుగా! సరిసరి! నీమాటలవలననే యిక్కడ నీగుట్టంతయు బట్టబయలయినది. నీవు మొదటినుండియు సూర్యవంశపు రాజులకెల్లను బురోహితుఁడవయి వారిసొమ్ము తినుచుండుటచేతనే చీకుకుఁ జేవకల్పించి నీవిష్ట డాతనిని బట్టువలెఁ బొగడుచున్నావు. ఇందున్నవారిలో నీస్తోత్రపాఠములు విని మోసపోవు వారెవ్వరును లేరు. ఇంతటివాఁడులేఁడని యీమహాసభలో నిన్నందఱును మెచ్చుకొందురని కాఁబోలు, నీవీ కల్లప్రజ్ఞలు ప్రకటించుచున్నావు. పిలువని పేరంటముగ నీకీకంఠశోషణమెందుకు? నీవే ప్రత్యుత్తరము చెప్పుమని నిన్నీపురందరుఁ డేమయిన బొట్టును గాటుకయుఁ బెట్టి పిలిచి ప్రార్థించినాడా? మహాతపోధనులైన యీమునులందఱు నూరకుండఁగా ముందువచ్చి చెప్పుటకు నీ కీయహంకారమేల? నీపలుకు లీ శచీధవుని చెవులకుఁ జవిగానుండిన నుండనిమ్ము. మాకుమాత్రము హాస్యాస్పదములుగా నగపడుచున్నవి. పురోహితత్వముచేయు నీవే కాని యారాజును మేమెఱుఁగమా? నీపూరక గోరంతలు కొండంతలుచేసి యేల కొనియాడెదవు?

ఉ. చిక్కనిపాలుఁ బాయసముఁ జేరల నిండ ఘృతంబు, జుఱ్ఱుచున్
జక్కెర రుచ్యభక్ష్యములె సారపుమాంసపుఁ గూరలున్ సదా
మెక్కుచుఁ గ్రొవ్వి సంపదల మిక్కిలి త్రుళ్లెడు మేదినీపతుల్
నిక్కముతప్పరంట ధరణింబరిహాసపుమాట యోఁజుమీ.

వశి—(కోపదృష్టితోఁ జూచుచు) ఓయీ! విశ్వామిత్రా! వినుము. సభలో నెవ్వరయిన నొకధర్మసందేహ మడిగినప్పుడు తెలిసినవారుండి సదుత్తరమీయకుండుట ధర్మము కాదుగనుక, ఇప్పు డీయింద్రుఁ డడిగిన ప్రశ్నకు మీఱు చెప్పక యొకరిమొగము

లోకరు చూచుకొనుచు మీరందఱు నూరకుండఁగా నెఱిఁగినవాడ నగుటచేత నే నుచితోత్తరము నిచ్చినాడను. పైత్యరోగిజిహ్వకుఁ బంచదారయుఁ జేదయినట్లు నిర్నిమిత్తద్వేష వివశుడ వయియున్న నీదృష్టికి నేను త్తరము చెప్పుటయు దప్పిదముగానే కనఁబడుచున్నది. ఈవిధముగా వ్యర్థప్రలాపము లేలప్రేలెదవు? సముద్రము లంఘించిన హనుమంతుని ముందరనా కుప్పిగంతులు? నీప్రతాపములు నాముందు సాగిరావు. గరుత్మంతునితో నూరఁబిచ్చుకలను సాటి తెచ్చునట్లు నీవిష్వ డాసంతత సన్మార్గవర్తి యయిన హరిశ్చంద్రచక్రవర్తిని సామాన్య రాజన్యాధములతో సరిపోల్చుచున్నావు. లోకములోని రాజలోకము నెల్లను గైకొన్నను వారి నందఱిని కలిసి యాతని సత్యములో సహస్రాంశ మయిన నుండునా?

ఉ. సందియ మింత లేక బలశాసన దివ్యసభాంతరంబునం
దండఱు నాలకింప విన నర్హ్యముకాని యసత్యవాక్కులన్
నిందయొనర్చె దీవు ధరణీధవచంద్రుని; నింతమాత్రనే
యిందలివారు మెచ్చుదురె యిప్పుడు నిన్నిటఁ? దాపసాధమా! 15

ఉ. ఎంతయుఁ బాతకం బొదవు నిట్టిదురుక్తులు వించు నున్న; నే
డింతటతోనె యానృపకులేశ్వరు నూనృతవాఙ్మహత్త్వ మా
వంతయులోపముం గనునె? యారయ వించుక యైన; దీననా
క్కింత త్వదీయనైజగుణమే యిట వీరి కెఱుంగవచ్చెడున్. 16

విశ్వా—(పటపట పండ్లుకొరుకుచు)

ఉ. క్రొవ్వి, వశిష్ఠ! యేమిటికిఁ గొవ్వున నోరికివచ్చినట్లుగా
నివ్వటిఁ బ్రేలెదీవు? విసుమే నల గాధసుతుండఁ జుమ్ము; న
న్నెవ్వనిఁగాఁ దలంచి తపుడే మఱపొందితె నన్ను? పంతమే
యివ్వడి వచ్చెనేని, తెలియించుమె కౌశికుఁ డల్లబ్రహ్మకున్? 17

ఓవశిష్ఠా! తొల్లిపంతము వచ్చినప్పుడు నీసుతశతమును గృ
తాంత నిశాంతమునకుఁ బంచిన విశ్వామిత్రునిగా న న్నెఱుంగుము.

మ. ఒకరాజాధము నిప్పుడీ విచట నెంతో పెద్దగా జేసి మా
నకవర్ణించెడు సత్యసంధు డనుచున్నా మ్రోల; చాల్చాలు; నూ
రకయాయాస పడంగ బోకు, మిక విశ్రాంతిం దగంబొందుమా;
యకటా! స్తోత్రము చేయ లే కలసి తత్యంతంబు నీ విమ్యెడన్.

చ. జలనిధి గ్రుక్కగొన్న మునిసత్తము డల్లయగస్త్యు డుండ, న
క్షులు హరికిన్ సహస్ర మొడగూర్చిన గౌతము డీతడుండ, ని
ర్మలమతి నేను నుండ, నిట మమ్ము గణింపక నీవువజ్రితో
బలుకఁగ నేల? మేటివె తపంబున నందరకన్న నీవిటన్? 19

(సభవారివంక దిరిగి)

శా. సందేహం బొకయింత లేక వినుఁడీ చర్చింప గాలోకమం
దెందున్; లేదు విశుద్ధసత్యనిరతుం డీమాట ముమ్మాటికే
నందున్; కాదనఁ జాలు మేటిమగఁ డెందైనం గలండేని, నా
ముందేఁడీ యిట నిల్చి పల్కు మనుడీ ప్రోద్దామధైర్యంబునన్.

వశి—(లేచి ముందుకువచ్చి పండ్లుకొఱుకుచు) ఓసభాసదు
లారా! వినుండు. ఆత్మస్తుతియు బరనిందయుఁ ననర్హములేయైనను
నేనిప్పు డీబాలీశుని మూలమున నన్ను నే నించుక చెప్పుకోవలసి
వచ్చినది. తపశ్శక్తియందలి మాయిద్దరి తారతమ్యములను మీ
రందఱు నెఱుగ బూర్వమా బ్రహ్మదేవుడే నిర్ధారణ చేసియున్నాడు
గాన దానధికుడ నని యిప్పుడెంత త్రుళ్ళిపడుచున్నను జగత్ప్రఖ్యాత
మయిన యీ విషయమయి నేనిక్కడ జెప్పవలసిన పనిలేదు. ఈ
దురాత్ముడు సభలో నన్ను నిష్కారణముగా నపహసించి దూషిం
చుచు ధర్మదేవతాపరావతారు డని చెప్పదగిన యీహరిశ్చంద్రుని

నెక్కసక్కెములాడి నిందించుచున్నాడు. ఆబోతు అంకె వేసినదని సింహ మెప్పుడయిన బెదరునా?

మ. వినుఁడీ, సభ్యులు! మీరు నాపలుకు లీ విశ్వంబు తార్మాణుగా
జనినన్ సూర్యుడు నగ్ని చల్లపడినన్, సంద్రంబు లొక్కుమ్మడిన్
జనముల్ భీతిల నెండిపోయిన, హరిశ్చంద్రుండు సత్యంబు పే
ర్మిని దప్పం డని నిల్చి పల్కెద నిదే మీరంద ఆలింపగన్.

చ. పరసతులెల్ల తల్లులు, స్వభావ గుణంబులు ధర్మవర్తనల్
పరమసుహృత్తు సూనృతము, బంధుచయంబు జగజ్జనంబు స
త్కరుణ విభూషణంబు, సముదంచిత శాంతత విత్త, మట్టి యా
నరపతి స్వప్నమందయిన నవ్వుల కయినను గల్లలాడునే?

ఇంద్ర—(నారదునితో రహస్యముగా) ఓ దేవమునిపుంగవా? నీవంతకంతకు గోపములరూపములు దాల్చినట్లు రౌద్రమూర్తులయి మత్సరము హెచ్చనొకరినొకరు నిందించుకొనుచున్నారు. వీరియాకారములు చూడఁగా నాకు భయ మగుచున్నది. నీ వేలాగునైన వీరి నిప్పుడు వారించి శాంతచిత్తులం జేయుము.

నార—(ఇంద్రునితో రహస్యముగా) మనము వారించినను వీరిప్పుడుప్రశాంతులగువారు కారు. ఈమునివృషభు లిద్దఱును గోపావేశముచేత దేహములు తెలియక బలిసి క్రొవ్వియున్న యాఁబోతులవలె అంకెలు వేయుచు నొకరిమీఁద నొకరు దుముకుచు, గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచున్నప్పుడు మనము వలదన్న మరలుదురా? ఎవ్వరికో యొకరికిం బరాభవము సంభవించినతరువాత మనప్రార్థన మక్కఱలేక తమంతనే వీరూరకుందురు. అయినను సమయము చూచి యీవిశ్వామిత్రుని శాంతస్వాంతునిఁ జేసెదను.

విశ్వా—(వసిష్ఠునివంకఁ దిరిగి) ఓరీ దురాత్మా! అతనిని బొగడుటకు నీకొక్క నాలుక చాలదు. నీ నాలుక లిప్పుడు వేయి కావలెను.

ఉ. చాలును జాలు డస్సితివి; సభ్యులు మెచ్చి రయారెనీదు వా
చాలత; యూరకుండు మిఁక; చప్పిడిమాట లివేల? నేను వే
లీలలఁ జిక్కు వెట్టి యువలీలఁ ద్రిశంకునిపట్టిచేత వే
వేలు మృషోక్తు లెల్ల యనిపించెదఁ; బన్నిద మేమి? చెప్పుమా.

మ. చని నీ విప్పుడు తిన్నగా నలహరిశ్చంద్ర క్షమాధీశునిం
గని ధైర్యాన్వితుఁ జేయు మాతనిని నీ గర్వోక్తుల న్మాని, నీ
ఘనశక్తిం గొనియాడువాఁడ నటుపై క్ష్మాభర్త ధైర్యంబుతో
నణుమాత్రంబును బొంకకుండిన మదీయానూనయత్నంబునన్.

వశి-మ. అవురా! యేమిప్రతాపవాక్యములు! మాయ ల్సేయు దే నీవుభూ
ధవునిం దేవుఁడె ధైర్యవంతునిగఁ దొల్తం జేసెఁ బుట్టించుచో;
నవనిం గొత్తగ నొక్కఁడేల యిఁకఁ జేయం ధైర్యధౌరేయుగా
అవలీలం జని చేత నైన నసత్యం బాడింపుమా యాతనిన్. 25

ఉ. నీవును నిన్నువంటియవినీతులు వేఱొకకోటి కూడి యీ
భూవలయంబునం గలుగుబూటకముల్ మటుమాయ లింద్రజా
లావళు లెన్ని పన్నిన, మహాపద లెన్ని ఘటించినన్, నృపున్
గేవలమిథ్య యింత పలికింపఁగ మీతర మౌనె యెప్పుడున్? 26

శా. వేయేడు ల్తలకిందు లైన, విను మావిశ్వంభరాధీశ్వరున్
మాయ ల్పన్ని యసత్యమీవు పలికింప న్లేవు; నిష్కారణం
బాయాసంపడ నేల? మానుకొనుమీ వ్యర్థప్రయత్నం బటుల్
సేయంగా మదికొల్పదేని, త్వరలో సిద్ధించు నీ కోటముల్. 27

(సభవంకఁదిరిగి ఓ సభ్యులారా!

మ. వినుఁడీ నాదుప్రతిజ్ఞ; యీతఁ డలయుర్వీనాథు బొంకింపఁగ
ల్గినచో, నేను గులంబులోన వెలియై, లీలన్ శిరస్సంతయున్
మునుముట్ట న్గొఱిగించుకొంచును, దపోముఖ్య క్రియ ల్మాని, లో
పనుమానింపక వీధులందు ఖరవాహానంబెక్కి యూరేగెదన్. 28

విశ్వా—(సభవంక దృష్టి నిగిడించి)

ఉ. వింటిరె యీదురుక్తులను ? వేలుపులార? మునీంద్రులార! నా
వంటిమహాతపోధనుఁడు పంతము పట్టిన, నొక్కమర్త్యునిన్
బంటుతనంబు మానిచి యబద్ధములం బలికించు టెంత? నేఁ
గంటున నానృపాధమునిఁ గష్టముపెట్టి, కలంతు స్వాంతమున్.

చ. అతఁడొకపట్టునన్ మృషల నాడక యుండిన, రాజ్యమంతయుం
జతురతఁ గోలుపుచ్చి, ఘనసంతదల న్హరించి నెయ్యపున్
సతి నెడఁబాపి పుత్రకునిఁ జావఁగ, జేసి, కులంబు కూల్చి, పె
న్వెతలును బెట్టి ధైర్యమును వేయివిధంబుల రూపు మాపెదన్.

ఉ. ఇంచుకయేనతండు చలియింపక బాధల కోర్చి నిల్చినన్
మంచుమలన్ జలాశసతియై బహుకాలము నిష్ఠ నిల్చి యా
ర్జించిన యాతపస్సున నరేంద్రునకర్థము ధారపోసెదన్?
వంచనకాదు; నేఁ బ్రతిన పట్టితి నిందఱ సమ్ముఖంబునన్. 31

నార—ఓ విశ్వామిత్రా! కోప ముపసంహరింపుము. ఆఁబోతును ఆఁబోతును గుమ్ములాడి నడుమ లేగ కాళ్లు విఱుగగొట్టినట్లు మీలో మీరు పంతములుపట్టి నిష్కారణముగా హరిశ్చంద్రుని బాధింపఁ బూనినారేమి? ఇది మీకు బుద్ధికాదని చెప్పి యీ మహేంద్రుఁడు మీ యిరువుర కలహములను వారింపు మనుచున్నాఁడు.

విశ్వా—(కోపముతో) ఏమేమీ! ఈ యింద్రుఁడు శరీరము నిండ వేయికన్నులున్నను స్వపరతారతమ్యమునుగానఁజాలకున్నాడు!

నన్ను శాంతింపుమని చెప్పుట కీ శచీకాంతుఁ డెంతటివాఁడు? ఈతని యాజ్ఞకు లోఁబడుటకు నేనీతని సేవకుఁడను గాను. స్వర్గముచుట్టును దిరిగి నిత్యమును వీణవాయించుచు ననుసరించెడు నీవును ఎల్లప్పుడు నిల్లుకాచుకొని దీవించి యాశ్రయించు బృహస్పతియును, ఈతని యాజ్ఞ వినవలెను గాని స్వచ్ఛందవిహారుల మయిన మే మేలవిన వలెను? ఈ వెడఁగు మును లందఱును తన్నొక పెద్దఁ జేసి వెఱ్ఱిస్తుతులు చేయుటచే నింతలోనే తలక్రొవ్వి యితఁడు తారతమ్యపరిజ్ఞాన మెఱుఁగఁ జాలకున్నాఁడుగా! తనభార్యయెడ మహాపరాధముచేసినను సహించి యూరకుండుటకు నే నానోరుమూలిన గౌతముఁడ నను కొన్నాఁడేమో? కానని చెప్పుము. వెనుక నేను స్వర్గమునకుఁ బంపిన త్రిశంకు నీతఁడుదుర్వినీతుఁడయి క్రిందికిఁ బడద్రొబ్బినప్పుడు క్షమించి యూరకున్నదాని కిది ఫలము కాఁబోలును? ఆ యవమానశల్యము నామనస్సున నాటియున్నది. మఱచిపోలేదని యింద్రునకు నీవు స్మరణకుఁ దెమ్ము.

గౌత—నేనిఁక నిట నిలువఁగూడదు. (అని చివాలున లేచి పోవుచున్నాఁడు)

కశ్య—(మునులను సైగచేసిపిలిచి) ఓతాపసోత్తములారా! ఈతామసుఁడు వెడఁగులమని మనలనందఱను నిందించుచున్నాఁడు. దుష్టున కెప్పుడును దూరముగాఁ దొలఁగవలెను. మన మీచోటు పాయక మన మొకటియు నీతఁడొకటియు ననుచున్న పక్షమున వివాదము పెరిఁగి యన్యోన్యశాపములనఱకును వచ్చును.

వామ—అవును. మీరు సెలవిచ్చినది సత్యము. వేగముగా మనమిక్కడనుండి తరలుటయే మంచిది. ఈతనికిఁ దగినవాఁడొక్క మనదుర్వాసుఁడే. ఆతఁడిప్పు డిక్కడలేఁడు. పోదమురండు.

(అని ఋషులు నిష్క్రమించుచున్నారు)

వశి—(తనలో) ఈమునులందఱు లేచిపోయిన తరువాతఁ గూడ నేనిక్కడనుండి యీమూఢుని కోపవచనములు వినుచున్న బాప మొదవును. నేనును మా యాశ్రమమునకుఁ బోయెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

ఇంద్రు—(తనలో) ఇతఁ డతిమూర్ఖుఁడు; పరమకోపి నన్ని ప్పుడు శపించినను శపింపవచ్చును. మూర్ఖుల కెప్పుడును గోపము ముక్కుమీఁదనే యుండును. ఈతని కోపమునకు వెఱచి మునులంద ఱును లేచిపోవుచున్నారు. ఇక్కడ నేనొక్కఁడను జిక్కుపడినాను. మంచిమాటలతో నేలాగునైనను నేనీతని నిప్పుడు మెల్లఁగా నద ల్చుకోఁ గలిగితినా తలతడవి చూచుకొనెదను. (ప్రకాశముగా) స్వామీ! నారదుఁడు దేవరవారి ప్రభావమెఱుఁగక యేమో విన్న వించినాఁడు. మిమ్మాజ్ఞాపించుటకు నేనేపాటివాఁడను? దేవర యీ సేవకున కేదయిన నాజ్ఞయిచ్చినపక్షమున, శిరసావహించిచేయుట కిదిగో సిద్ధముగా నున్నాఁడను. దేవరవారు హరిశ్చంద్రుని సత్య సంధతకు మెచ్చి మీ తపస్సులో సగమాతని కనుగ్రహించినయెడల దేవరవారికిఁ బ్రీతికరముగా నుండునేని నేనును యథాశక్తికి హరి శ్చంద్రునిఁ బదునాలుగు మన్వంతరములు నాయర్థాసనంబున నిలిపి దేవరయనుగ్రహమునకుఁ బాత్రుఁడ నయ్యెదను.

విశ్వా—విశ్వామిత్రుఁ డొక్కనిజక్కఁగాఁ బరిశోధించిఁ మెచ్చి సత్యసంధుఁడని నిర్ధారణము చేసినప్పుడ ర్హసత్కారమాతఁడే చేయవలెనుగా సత్కరించుటకుఁ బరులెంతవారు? ఈదేవతాధము లెంతవారు? వీరికి నాథుఁడవైన నీవెంతవాఁడవు? ఏబహుమానము చేసినను నేనే చేయవలెను. కాఁబట్టి నీ విప్పుడు చెప్పిన పదునాల్గుఁ మన్వంతరములును నేనే యాతనిని భూమినేలించి మఱి పదునాలుగు మన్వంతరములు కూడ నేనే నీయర్థాసనమునం దారాజును నిలిపె

దను. నీవు నీగర్వమును విడిచి దాసుఁడ ననుచున్నందున నిన్ను క్షమించినాఁడను. ఇఁక నీవు నీచింతామణిపీఠమును సిద్ధముగానుంచి మాయాజ్ఞను వేచియుండుము.

దేవతలు—ఉన్నట్టుండి యీతనికోప మిప్పుడు మనవంకఁ దిరుగుచున్నది. మనముకూడ శీఘ్రముగా మునులు చూపినమార్గమునే పట్టుదము. (అని నిష్క్రమించుచున్నారు)

ఇంద్రు—(తనలో) ఈమూర్ఖుఁ డిక్కడనుండి మనల శపింపకుండ లేచిపోవువఱకును, ఈతఁ డేమి చెప్పినను నౌనని తలయూఁచుచుండవలెను. (ప్రకాశముగా) స్వామీ! దేవరయాజ్ఞను శిరసా వహించి చేసెదను. నేను తెలియనివాఁడను; మూఁడుమాఱులు కాఱుతప్పులువచ్చెను. అజ్ఞానముచేత నేనన్నదాని మఱచిపోయి, మీయిచ్చవచ్చినన్నాళ్ళు హరిశ్చంద్రుని స్వర్గమున నిలుపుఁడు.

నార—ఓవిశ్వామిత్రా! చూచినావా? భూలోకమున హరిశ్చంద్రుఁడు చేయఁబోవుచున్న రాజసూయయాగములో హవిర్భాగములు తెచ్చుకొనుటకై కాఁబోలును సభలోనున్న దేవతలందఱును విజయం చేయుచున్నారు. ఇఁక నింద్రుఁడు నక్కడకే పోఁదలఁచినట్టున్నది. అధ్వర్యులును, ఉద్గాతలును, హోతలును, బ్రహ్మలును గాఁగోరి కాఁబోలును మనతోఁ జెప్పకయే ఋషులందఱును దేవతలకంటె ముందుఁగా బఱుగెత్తుచున్నారు.

విశ్వా—నారదా! నీవుచక్కఁగా స్మరణకుఁ దెచ్చినావు. నేనిప్పుడాయజ్ఞమునకుఁ బోయి హరిశ్చంద్రుని విశేషవిత్తమడిగిపుచ్చుకొని మాయచేసి బొంకింపఁదగు ప్రయత్నములో నుండవలెను. (చూపునలుఁగడలఁబఱపి) అరుగో దూరమున దర్భాసనములు మడఁచి చంకఁబెట్టుకొని యొకరుపోయినత్రోవ నొకరుపోక మును లెట్లుపరుగెత్తుచున్నారోచూడు. వారివెనుక దేవతలును భయము

చేత మాటిమాటికి వెనుకతిరిగి చూచుచుఁ బరుగెత్తు కాళ్ళురాక మెల్లఁగా వడుచుచున్నారు. ఈపిఱికిపందలందఱు నాకు వెఱచి పారిపోవుచున్నారుకాని యజ్ఞమునిమిత్తము కాదు. నాకోపమునకు దిక్పాలకులును దేవతలును మునీంద్రులునే యిట్లు వడవడవడఁకుచు నిలువలేక పాఱిపోవుచుండఁగా నిఁక మనుష్యమాత్రుఁడైన హరిశ్చంద్రుఁ డెంతవాఁడు? నేనిప్పుడ మర్త్యలోకమునకుఁబోయి హరిశ్చంద్రుని బొంకించి నాచిరకాలశత్రువైన వశిష్ఠుని పరాభవమును శీఘ్రముగాఁ జూడవలెను పోదము రమ్ము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము

[రాతిపైఁగూర్చుండి మార్కండేయశిష్యుఁడు జాబాలి కనఁబడుచున్నాఁడు.)

జాబాలి—(తనలో) మాగురువుగారు నన్ను సారోదసరస్సునకుఁబొమ్మని పంపినారు. నేనిక్కడకు వచ్చునప్పటి కెదుట రెండు దారులు కనఁబడుచున్నవి. ఇం దేదారి సారోదమునకుఁ బోవునో తెలిసికొనఁజాలకున్నాను. ఏపుణ్యాత్మునినైన నడుగుదునంటినా యీనట్టడవిలో మనుష్యసంచారమే కానరాదు. ఏమిబుద్ధి? (ముందువంక చూపు నిగిడించి) అదిగో దూరమున నెవ్వఁడో బ్రాహ్మణుఁడు కుంటుచు వచ్చుచున్నాఁడు? అతని నడిగి తెలిసికొనెదను.

(అప్పుడు రాజుయొక్క వేడుకచెలికాఁడయిన గాలవుఁడు, కఱ్ఱచేతఁ బట్టుకొని మెల్లఁగా నడచుచు ప్రవేశించుచున్నాఁడు.)

గాల—(నిట్టూర్పువిడిచి తనలో) అయ్యో! వేఁటగాండ్ర మాటలు నమ్మి మోసపోతినిగదా! మొదలే నాసీడను జూచి నేను జడిసికొనెదు ధైర్యశాలిని; ఆమీఁద రాజుగా రీటెత్తోఁ బొడిచి చంపినపులిని జూచి హృదయము చెదరియున్నాను. అట్టి నన్ను దిగ విడిచి యాకిరాతులు రాజుగుఱ్ఱము వెంట ముంసుపరుగెత్తుటచేత వాండ్రను కలిసికోలేక వెనుకపడి దారితప్పి యీప్రకారముగా వనచరుఁడనయి యిందుఁ దిరుగుచున్నాను. ఈరాళ్ళలో నడచుట చేత కాళ్ళు బొబ్బలెక్కినవి. అంతేకాక కురుపుమీఁద తేలుకుట్టి నట్లు కుడికాలిలో ముల్లుకూడఁ గ్రుచ్చుకొని వేధించుచున్నది. బ్రాహ్మణుఁడ ననియైనఁజూడక భక్తిమాలిన ఘాతుకమృగ మేది యేపొదలోనుండి వచ్చి పాపముకట్టుకొనిపోవునో యని నాకు భయ మగుచున్నది. జన్మ మెత్తినతరువాత జ్వరమువచ్చినప్పుడైన నొక పూట భోజనము మానియెఱుఁగని సుకుమారుఁడనైన నేను రాత్రి నుండి తిండిలేక శుష్కోపవాసముచేయుచున్నాను; కడుపు వెన్నంటు కొనిపోయినది; కన్నులు గుంటలుపడినవి. నాయరణ్యరోదనము విని నాకిక్కడ సమాచారము చెప్ప వారెవ్వరున్నారు? నాపుణ్యవశము చేతఁ బూర్వముచూచియున్న సారోదసరోవరమార్గమునకు వచ్చి యున్నాను. ఈయడవిలో నిడుములుగుడుచుచు పరిభ్రమించుచుండుట కంటె రాజుజాడ తెలియకపోయినయెడల సారోదముమీఁదుగా దిన్నగ మాయూరికి దారితీసి యింటికిఁబోయి నాభార్యతో నాకష్ట ములు చెప్పుకొని మరలఁ బ్రజలలోనైన బడెదను. అదిగో ముం దెవ్వఁడో ఋషికుమారుఁడొకఁడు శిలాతలముమీఁదఁ గూరుచుండి నావంకఁ జూచుచున్నాఁడు. అతనికి రాజుజాడ యేమయినఁ దెలియు నేమో పోయి యడిగెదను.

జాబా—ఓబ్రాహ్మణోత్తమా! నమస్కారము. నీవెఱిఁగిన పక్షమున సారోదసరస్సునకు దారిచూపి నాకు మాగురువుగారివలని చీవాట్లు తొలఁగించి పుణ్యముకట్టుకొమ్ము.

గాల—ఓఋషికుమారా! నమస్కారము. నాకు హరిశ్చంద్ర మహారాజుగారి జాడ కొంచెము చెప్పినపక్షమున నీకు సారోదము నకు దారిచూపెదను. మీగురువులెవరు? సారోదమునకు మిమ్ముఁ బంపినపని యేమి?

జాబా—నీవెవరిజాడ నన్నడిగితివో వారిపనిమీఁదనే బోవు చున్నాను. నేను మార్కండేయశిష్యుఁడను. నన్నందఱు జాబాలి యందురు. మా తపోవనమిక్కడకు మిక్కిలి సమీపముననున్నది. ఇంతకుముందే హరిశ్చంద్రమహారాజుగారు దూరముగా నశ్వమును దిగి పాదచారులయి మాయాశ్రమమును బ్రవేశించి మాగురువుగారి వలన నతిథిసత్కారమును బొందినారు. వారిరువురును మాటాడుచో గురువుగారు నన్నుఁబిలిచి, యీరాజుగారు వేఁటతమకముచేతఁ బరి వారమును వెనుకవిడిచి వరాహము వెంట నొంటిగా ముందువచ్చి నారు. నీవుపోయి సారోదమువద్ద నీరు నిలువనియమించివచ్చిన చంద్రమతి మొదలయినవారిని సపరివారముగా సిద్ధపటమునకు వెంటఁ బెట్టుకొని రమ్మని సత్యకీర్తితోఁ జెప్పుమని చెప్పినారు. నీవేల హరి శ్చంద్రుని వెదకుచున్నావు?

గాల—నేనాహరిశ్చంద్రమహారాజుగారి చెలికాఁడను. నా పేరు గాలవుఁడు. నేనును రాజువెంటనే బయలుదేఱి దారితప్పి యడుగులజాడనుబట్టి యింతవఱకు వచ్చితిని. ఇక్కడ కాళ్ళలో జాడతెలియరానందున నెటుపోవుటకును దోఁచక నాకు దారి చెప్పెడు పుణ్యాత్ము లెవ్వరయిన దొరకుదురాయని చింతించు చుండఁగా, వెదకఁబోయిన తీఁగ కాళ్ళకు జుట్టుకొన్నట్లు భాగ్య

వళముచేత నీవు నాకంటఁ బడినావు. నాపాలిటి భాగ్యదేవతయో నిన్నిక్కడకుఁ బంపినది కాఁబోలును.

జాబా—ఆహా ! ఏమి యారాజురూపరేఖావిలాసములు ! అతనిని జూచినప్పుడు విలాసార్థముగా భూమిమీఁద విహరింప వచ్చిన యింద్రుఁడో చంద్రుఁడో యని నేను భ్రమపడినాను.

గాల—ఆయన దర్శనమువలనఁ గృతార్థుడవైన నీకు బతివ్రతాశిరోమణియైన చంద్రమతి సౌందర్యమును సందర్శించుభాగ్య మెప్పుడయిన లభించినదా?

జాబా—అట్టిభాగ్యమింకను నాకన్నులకు లభింపలేదుగాని, సృష్టియారంభించినతరువాత నేఁటికాలమున కిట్టి యనన్యసామాన్య లావణ్యమూర్తులయిన యీదంపతులను సృజింపఁ గలిగితినిగదాయని బ్రహ్మదేవుఁడు తననిర్మాణచాతుర్యమునకుఁ దానే గర్వపడుచున్నాఁడని మాగురువుగారు చెప్పుచుండఁగా వినెడుభాగ్యము నాకర్ణములకుమాత్రము లభించినది. అందొకరూపమును జూడనోచి నాకన్నులింతకుమునుపే సగము పావనములయినవి కాని యింకొక నిమిషములో నీసాయముచేత రెండవరూపమునుగూడఁ గాంచిపూర్ణముగా ధన్యములు కావచ్చును.

గాల—అందుకు సందేహములేదు. అందఱును మహాసౌందర్యశాలులని చెప్పుకొను రతీమన్మథు లొకవేళసరివచ్చిన వత్తురేమో కాని నేను జూచినంతవఱ కీలోకములోఁ జక్కనిచుక్కలని పేరుపొందిన వారెవ్వరును మారాజదంపతుల కాలిగోరునైనను బోలరు.

జాబా—సరిసరి! ఈరాజుసౌందర్య మెక్కడ? కందర్పుల సౌందర్య మెక్కడ? ఈయనరూపమునకు మన్మథునిరూపమునకును హస్తిమశకాంతరమున్నదట! చిరకాలజీవు లగుటచేత మాగురువుగా రా రతీమన్మథులను శివునినేత్రాగ్ని వెలువడని కాలమునుండి యెఱుఁగుదురు. మాయాశ్రిమ

మునకు వచ్చినవా రెవ్వరైనఁజంద్రమతీ హరిశ్చంద్రులను రతీమన్మథులతోఁ బోల్చునప్పుడు మాగురువుగారు కోపపడి రూపమునుబట్టి చూడఁగా రతీమన్మథులు వీరిపాదములకు దాస్యముచేయుటకైన నర్హులు కారని యానతిచ్చుచుందురు.

గాల—అట్లయిన నిఁక నిశ్చయముగా జయంతవసంతాదులకు సౌందర్యగర్వభంగ మగును.

జాబా—సందేహ మేమి? వీరిమూలమునఁ దాము సౌందర్యవంతులన్న ఖ్యాతిపోయినదని సిగ్గుపడి రతీమన్మథు లిప్పు డెవ్వరికంటను బడకున్నారు. చంద్రమతి సోయగమును విని రంభ యంతటిది తలవంచుకొన్నదఁట! ఇఁక్కఁడక్కిన యప్సరస స్త్రీలమాట చెప్పనేటికి?

గాల—అవును వారిచక్కఁదన మచ్చరలనైనఁ జిన్నపుచ్చఁదగినదే. కాని నేనిప్పుడు వారిని శరీరసౌందర్యమున కంటెను గుణసౌందర్యముకొఱ కధికముగా గౌరవించెదను. ఈదంపతు లిరువురును కేవలరూపముచేతనే కాక గుణములచేతఁగూడ నిరుపమాన శోభాపరిపూర్ణులుసుమా.

జాబా—నీవురూపమునకంటె మీరాజుగారి సద్గుణములనే హెచ్చుగా మెచ్చుకొనుచున్నందున మీరాజుసత్కార్య మేదియైన నేను వినఁగోరెదను.

గాల—మొన్న మారాజుగారుచేసిన రాజసూయయాగమునకుమీగురువులను వేంచేసి యుండిరిగదా?

జాబా—అవును మాగురువుగారాయజ్ఞవైభవమంతయు వేనోళ్ళఁబొగడినారు. దేశదేశములనుండి దక్షిణలనిమిత్తమై రాకపోకలుచేసెడుబ్రాహ్మణులకప్పుడురాత్రింబవములు మానవమార్గములే రాజమార్గములయినవి. నీవు దాతృత్వవిషయమును జెప్పపోవుచు

న్నావు గాఁబోలును. అదిచెప్పనక్కర లేదు. అప్పటి దానధారాప్రవాహములచేత నూరిబయలఁ జిన్నయేరులు పాఱినవని కన్నులారా జూచిన ఋషులే సెలవిచ్చినారు. ఆతఁడర్థుల కిచ్చిన ధనకనకరత్నరాసులనుజూచి యీభూమిలో నింతధనమున్నదాయని మునులందఱు నత్యాశ్చర్యపడినారు.

గాల—యజ్ఞకాలముమీఁట యటుండనిమ్ము. యజ్ఞానంతరమునగూడ విశ్వామిత్రుఁడువచ్చి యజ్ఞార్థము యాచింపఁగా విశేషవిత్తములేని యసమయమయినను వచ్చినయర్థిపుంగవుని సంతుష్టాంతరంగునిఁ జేయక యూరకపంపుట కిష్టములేక యేనుగుమీఁదనెక్కి మనుష్యుఁడు నిలుచుండి రత్న మెగమీటినంతయెత్తు ధన మాతనికి దానమిచ్చిరి.

జాబా—ఆహా! ఏమి యాదాతృత్వము! అంత ధనము విశ్వామిత్రుఁడును శిష్యులును మోచుకొని పోఁగలిగిరా?

గాల—వా రాధనమును దీసికొనిపోనేలేదు. కావలసినప్పుడు వచ్చి పుచ్చుకొందునని చెప్పి విశ్వామిత్రుఁ డాధనరక్షణభారమును మారాజుమీఁదనే మోపిపోయినాఁడు.

జాబా—సరిసరి. ఇప్పుడునీవలన విన్నదానికిని మాగురువుగారన్నదానికిని సరిపోయినది. ఏదోకపటోపాయముచేత మీ రాజుగారిని మోసపుచ్చుటకయి విశ్వామిత్రుఁ డీ తంత్రము పన్నినాఁడుకాని నిజముగా ధనము కావలసి యీపనిని చేయలేదు. అతనికి ధనమే కావలసియుండినయెడల యజ్ఞదినములలో సమయమున కేలరాకుండును? ఇచ్చినప్పుడే యేల తీసుకొనిపోకుండును? అతఁడు మీరాజు నేలాగునైన బొంకింతునని ప్రతిజ్ఞ పట్టియున్నాఁడఁట! ఇది యాతనికృషి కంకురార్పణము.

గాల—విశ్వామిత్రుఁడు కాఁడుకదా వేవురువిశ్వామిత్రు లొక్కసారిగా వచ్చి వేయేండ్లు తలకిందుగాఁ దపస్సు చేసినను మారాజు నొక్కయసత్యమును బలికింపలేరు. విశ్వామిత్రుఁడు మహాతపశ్శాలియనివిందుమే. యట్టివాఁడు తనకు ధనమిచ్చినదాత యెడల నంతటిద్రోహము తలంచునా?

చ. తన కుపకారమున్ సలుపుదాతయెడం గరముం గృతఘ్నుఁడై
ముని యతఁ డెగ్గుచేసినను, భూమిపయిఁగడు డస్సియాఁకటన్
వనరుచుఁ జెట్టు చేరఁ జని బాగుగ నీడను విశ్రమించి పం
డ్లను దిని యమ్మహీజ మొకటం దెగఁగొట్టు కిరాతుఁ బోలఁడే.
దయారసవిశిష్టులయిన మునిశ్రేష్ఠు లంతటిపనికి సాహసింతురా?

జాబా—మనబ్రాహ్మణోత్తము లెంతటికైనను సాహసికులే. పూర్వము బ్రాహ్మణులు నృగమహారాజువద్ద దానముగొని యాతనినే యూఁగరవల్లివగుమని శపింపలేదా? ఆసంగతి యటుండనిమ్ము. మీరాజు సకలసద్గుణ సంపన్నుఁడని చెప్పుచున్నావుగదా సప్తవ్యసనములలో నొక్కటైన యీఁ వేటయందేల యాసక్తుఁడయ్యెను?

గాల—మారాజు కేవలవినోదార్థముగా వేఁటకు రాలేదు. భూమి యీనినట్లాకస్మికముగా లెక్కలేని జంతువు లొక్కసారిగాఁ బుట్టి యెల్లయెడలను దామే యయితోఁటలు దొడ్లు పయిరులు పంటలు పాడుచేయుచున్నవని కాపులువచ్చి మొఱ్ఱపెట్టుకోఁగా ఘాతుకమృగబాధ తొలఁగించి ప్రజాసంరక్షణముచేయుట రాజధర్మమగుటచే మారాజుగా రిప్పుడు జనక్షేమముకొఱకే వేఁట తలపెట్టినారు.

జాబా—ఇటువంటి సమయములయందు వేఁట దుర్వ్యసనమని నేను నిందింపను గాని యిన్నిజంతువు లాకస్మికముగాఁబుట్టుట చూడఁగా నాకిది విశ్వామిత్రసృష్టిగాఁ దోఁచుచున్నది.

గాల—నేనట్లు భావింపను. మనుష్యమాత్రుఁడయిన యొక ఋషి యెక్కడ? జంతుసృజనయెక్కడ? ఈమాట నమ్మనర్హముగా నుండలేదు.

జాబా—పూర్వమొకసారి బ్రహ్మతోఁ బ్రతిఘటించి సృష్టికిఁ బ్రతిసృష్టి చేయగలిగిన మహానుభావుఁ డీజంతుసృష్టి చేసినాఁడన్న వింతయేమున్నది? (పయివంకఁజూచి) అయ్యో! మనము మాటల పరాకున వచ్చినకార్యమును మరచి యాలస్యము చేయుచున్నాము గదా! అంతకంత కెండ యెక్కుచున్నది. నాకు శీఘ్రముగా సారోదమునకు దారిచూపి పుణ్యమునఁ బొమ్ము.

గాల—ఇదేమార్గము. నీవు తిన్నగాఁ బొమ్ము. నే నీమార్గమునఁ బోయి మారాజును గలిసికొనెదను. ఇదేమి యీమార్గమున కడ్డముగాఁ జమురొలికియున్నది! దొప్పలతో నెయ్యికొనిపోవునప్పుడు మీ తాపసకుమారు లెవ్వరో దారిపొడుగుననొలుకఁబోసియుందురు.

జాబా—ఇది చమురొలుకుట కాదు. రాజుగారి యీ టెపోటు తిని పాఱిపోయిన యడవిపంది కడుపులోనుండి కాఱినక్రొవ్వు. నీకా పందియడుగులు కనఁబడుచుండలేదా? ఇదియేమి? ఆముందు చూడుము. దారికడ్డముగా రక్తప్రవాహములు కాఱఁగా నేటుతిన్న వ్యాఘ్రము మెట్లు కాలీడ్చుకొనుచు మెల్లఁగా నడిచి ప్రక్కయడవిలో దూఱినజాడ కనఁబడుచున్నదో! నీవు పోయినకొలఁదిని కుప్పలుగాఁ గూలియున్న క్రూరమృగములను జూచి మీరాజుగారి మృగయా విహార సామర్థ్యమునకు సంతోషించెదవు.

గాల—చాలును. నాకిప్పు డామృగముల పేరు చెప్పిన దేహము కంపమెత్తుచున్నది. నేనాదారిని నిఁక నొంటిగాఁ బోలేను. నేనును నీతోడ నేవచ్చి తరువాత రాజుగారినిగలిసికొనెదను. పోదమురమ్ము.

(అని నిష్క్రమించుచున్నారు)

ఇది విష్కంభము

రంగము—విశ్వామిత్రాశ్రమోపాంతవనము.

[హరిశ్చంద్రుఁడును, చంద్రమతియు, లోహితాస్యుఁడును, సత్యకీర్తియు, గాలవుఁడును, భటులగు భద్రుఁడును పాలకుఁడును ప్రవేశించుచున్నారు]

లోహి—(చేయి చాఁపి వ్రేలితోఁ జూపుచు) నాన్నగారూ! ముద్దులమూటకట్టుచున్న యాలేడిని నా కాడుకొనుట కయి పట్టి తెచ్చిపెట్టరా?

హరి—కుమారా! సర్వవిధముల నేను దానిని నీకిప్పుడు జీవముతోనే పట్టియిచ్చుటకుఁ బ్రయత్నించెదనుగాని, అది యొకవేళ పట్టుపడకపోయినయెడల నావాఁడిబాణముతో దానిప్రాణమునుగొని నీ వాడుకొనుటకయి దానిచర్మమునైనను దెచ్చియిచ్చెదను. ఓ గాలవా! నాధనుర్బాణముల నిటు తెమ్ము.

చంద్ర—ఓప్రాణేశా! వేఁటాడియాడి యలసియున్న మీ రిప్పు డీపిల్లవాని మాటలనుబట్టి యీలేడివెంట మరల వ్యర్థప్రయాస మేల పడెదరు? కొంచెము సేపిట విశ్రమింపుఁడు.

హరి—ఓప్రాణేశ్వరీ! అట్లుకాదు. ఎంతో ముచ్చటపడి బాలకుఁ డింతచిన్నకోరికను గోరినప్పుడు చేతిలోనున్న యీపనిచేసి నేను వీనిముద్దెట్లు చెల్లింపకుండఁగలను? నేను దీని నింతలోఁ బట్టి తెచ్చి, అనాయాసముగా వీనికోరిక తీర్చెదను.

లోహి—మీరలసియున్నయెడల నేనే యాలేడిని బట్టుకొనెదను లెండి. మీరిక్కడ నుండుఁడు. (అని ముందుకు నడువఁబోవుచున్నాఁడు)

సత్య—ఓలోహితాస్యా! నిన్ను మెచ్చవచ్చును. నీవీతండ్రి బిడ్డ వగుటకుఁ దగినమాట చెప్పినావు. లోకములోఁ బువ్వు పుట్టిన తోడనే పరిమళము తెలియవచ్చునుగదా!

క. ఘనపంచాస్యముకడుపున
జనియించినపిల్ల కూడ సమదీగజంబున్
గనుఁగొన్న బయికి దుముకఁగఁ
జనఁ జూచును గాదె సహజసాహస గరిమన్.

హరి—(చేయి పట్టుకొనిలాగుచు) కుమారకా! ఈసాహసము చాలును. నీవిఁక నిలువుము. నేనుబోయి యీ కురంగమును గొని వచ్చెదను. (అని గాలవునివంకఁ జూచుచున్నాఁడు)

గాల—మీశరశరాసనము లిప్పుడే యిచ్చెదనుగాని, పేద బ్రాహ్మణుఁడను నన్నుమాత్ర మొక కంటఁజూచి మఱీబాణమును విడువుము. నా ఋణఫణములను నేను వచ్చునప్పుడింటివద్ద నా భార్యతోఁ జెప్పియైనను రాలేను.

హరి—ఓయీ! మహాశూరుఁడా! భయపడఁబోకు. లేడి యా సుందర మాకందపాదపసమీపమునముందువైపున నున్నదికాని నీవైపున లేదు. అదిగో—

ఉ. కెంపులచాయ మేనఁ దులకింపఁగ, చాఱలు వజ్రకాంతులన్
నింపఁగ, డెక్కచాలుహరి నీలములన్ హసియింపఁగా, మెడన్
సొంపుగఁ ద్రిప్పి యీకడనె చూచుచు, పచ్చిక నల్లమేయుచున్
బెంపుడులేడియో యనఁగ భీతిలకున్నది చూడు గాలవా?

గాల—అట్లయిన నివిగో బాణములనుబాణాసనమునుబుచ్చుకొని యాదిక్కున నీ మనసువచ్చునన్ని మృగములను వేఁటాడుము. నేనిప్పు డన్నమాట మిత్రోత్తముఁడవైన నీకు బ్రహ్మహత్యామహాపాతకము వచ్చునన్న సంకోచముచేతనే కాని [illegible] ప్రాణభీతిచేతఁ గాదుసుమా. ఏమి యీలేడి మనలను జూచియ[illegible] అక నిశ్శంకముగా నిలుచున్నది. ఇఁక నీవు పోయి చే[illegible] బట్టుకోవచ్చును. ఇది మాంసభక్షణముచేయ[illegible]

లయిన బ్రాహ్మణులుండుచోటు కాఁబోలును! కాకున్న నీపిల్ల లేడి యిట్లు నిర్భయముగా మనమాటలు వినుచు నిలువఁబడదు.

హరి—నీవన్నది సత్యమే. అదిగో చూడుమా పయి దేదో తప్పక యొక ఋష్యాశ్రమమే. [డున్;

ను. అదె యాలింపుము దూరమందు శ్రుతివాక్యంబుల్ విన న్వచ్చె
జదలం దోఁచెడు హోమధూమచయమాచాయందగంజూడుమీ;
యిదె యీవంకనుమోదుగుల్సమిధలెంతేఁద్రుంపమ్రోళ్ళయ్యె;న
ల్లదె దర్భల్ కడుఁగోయ నిప్పుడీపుడే యానేల మోసెత్తెడున్.

కానిమ్ము. ఈహరిణము నన్ను దూర మలయించి తీసికొనిపోకుండ నేనిప్పుడే మెల్లగాఁబోయి పట్టకొనెదను. (అని పొంచితాఱుచు ముందువంక మెల్లఁగానడుగు లిడుచున్నాఁడు.) గాలవా! చూడు మనమిప్పుడు తన్నుఁ బట్టనచ్చుచున్నామని తెలిసికొని కాఁబోలును చెంగుచెంగున దాఁటుచు నడుమనడుమ మనవంకఁ దిరిగి బెదరి చూచుచు లేడి యెట్లు పరుగెత్తుచున్నదో?

సీ. పేరెముల్ వాఱుచుఁ బెద్దదాఁటుల బయల్ కాళ్లుజాడించెడుఁ
గరముఁజూడు। ఖురములనుదరంబు గోఁకుకొంచును బ్రక్కలెగ
యరోఁజుచునిల్చెనిపుడుచూడు। మెఱుఁగు మెఱసినట్లు మీఁదఁ
దళుక్కని పల్లమున నడంగెఁబయిని జూడు। మరలమిట్టకు నిక్క
మనవంక మెడత్రిప్పి బెదరి చూచెడులేడి యదిగొచూడు

గీ. వోట గడ్డిపోచలతోడ నురుఁగు జాఱ
మింటఁ గొమ్ములు చిమ్మెడు మీఁదఁ జూడు
తోఁక జాడించి క్రమ్మఱ వీఁక తోడఁ
బరుగు[illegible]నుఁగొమ్ము బయలిమీఁద.

ఆలేడి[illegible]ండఁగానే యింతలోనే యెంతదూరము పా[illegible] శీఘ్రముగా వెంబడించి యించుకసేపు

లోన బాని నలయించి పట్టితెచ్చి యీ బాలకుని గంఠోపకంఠిక చేసెదను.
(అని విల్లును బాణములను చేతఁబూని పరుగెత్తుచున్నాఁడు.)

గాల—అమ్మా! రాజుగారు నన్నిక్కడ దిగవిడచియేగుటచే, వారు భూతదయాపరులన్నమాట నేఁటికి సత్యమయినది. వారింక నెన్ని లేళ్ళను జంపినను జంపనిండు. నే నదృష్టవంతుఁడను. మిట్ట మధ్యాహ్న వేళ నేనీయెండలోఁబడి కాళ్లుమండ నోరెండ నెత్తిమాడ ధైర్యముపీడ హృదయమేడ్వ కాళ్ళు వెనుకకీడ్వ బరుగెత్తి వచ్చి నెత్తురు త్రావెడి యేపులివాతను బడక నాతల్లికడుపు చలువచేతను నాభార్యమంగళసూత్రబలముచేతను నేఁటికిఁ దప్పించుకొని వచ్చి నాను.

చంద్ర—ఓభూసురోత్తమా! నీశూరాలాపములు కొంచెము చాలింపుము. దూరమున రాజుగారి కంఠస్వరమువలె వినఁబడు చున్నది.

హరి—(తెరలో)

చ. కరమును డస్సినాఁడ; కసుగందెను దేహము జిహ్వయెండెడున్:
చరణము లెఱ్ఱవాఱె; వదనమ్మునఁ జెమ్మట క్రమ్మె; నింతలో
దొరకదు జింక; యింకఁ గడుదూరము నేఁ బరుగెత్తఁజాల; నీ
శరమునఁ గూల్చువాఁడ నిమిషంబున నీహరిణంబు నియ్యెడన్.

చంద్ర—(గద్గదస్వరముతో) ఓసత్యకీర్తీ! అలసితినన్న ప్రాణ వల్లభుని బలుకులు ములుకులవలెఁ జెవులకు సోఁకి తామరాకులోని నీరువలె నాయుల్లము తల్లడిల్లుచున్నది. నన్నిప్పుడు కొనిపోయి హృదయేశ్వరుని చరణసన్నిధానమునఁ జేర్పుము. (అని కన్నీరు విడుచుచున్నది)

సత్య—అమ్మా! కన్నీరు తుడుచుకొని నీహృదయము పదిల పఱచుకొమ్ము. నీవు కేవల స్త్రీస్వభావముచేతను భర్తగారియెడలఁ

గలప్రేమావేశముచేతను మనసుచెదరి దిగులొందుచున్నావే కాని యిప్పుడు ప్రభువువారికి వచ్చినభయమేదియులేదు. ఆత డీపాటికి లేడిని యమపురికిఁబుచ్చి మరల వచ్చుచుండును.

గాల—అదిగో మరల నామిత్రునిమాట వినవచ్చుచున్నది. మీరుసందడిచాలించి వినుండి.

హరి—(తెరలో) ఆహా! మనుష్యుఁడెంతటి క్రూరకర్ముఁడు! కలలోను బరులకెన్నఁడును కీడుతలఁచి యెఱుఁగక మహారణ్యముల యందు మునులవలె నాకలములుతిని కేవల వన్యాహారములతోనే శరీరధారణము చేసికొనుచు దినములు పుచ్చెడిలేళ్ళ యంతటి సాధుమృగములనుగూడ వేడుకకయి నిష్కారణముగా మారణము నొందించుచున్నాఁడు!

ఉ. నాదుశరంబులేడితొడ నాటినయట్లు తదార్తనాదముఁ
నాదుహృదంతరంబునను నాటిశరంబయి, నన్గలంచెడున్;
పేదమృగంబు కన్గొనలవెంబడిఁబాఱెడు బాష్పబిందువుల్
ఖేదముపెంచి నాకనుల క్రేవల నశ్రుల జాలుకొల్పెడున్. 7

చంద్ర—ఇప్పుడు నాహృదయము కుదుటఁబడినవి. నా హృదయ వల్లభుఁడు ప్రజాపీడాకరములయిన ఘాతుక మృగోత్కరములనేకాని యీవఱకెన్నఁడును మృగయాసక్తుడయి వినోదార్థముగా దయనీయములయిన సాధుమృగములను బాణముపూని వేసి యెఱుఁగనివాఁడగుటచేతఁ దానీయేణమును బాణముపాలుచేసినందుకుఁ జింతనొందుచున్నాఁడు. ఆహా! నాప్రాణేశ్వరుని హృదయ మెప్పుడును నవనీతకోమలముకదా.

గాల—తాళుఁడు నా చెవులకెవ్వరిదో మఱియొకమాట వినఁబడుచున్నది!

(తెరలో విశ్వామిత్రశిష్యుఁడు.)

ఓరాజా! తప్పించుకొని పోతిననుకోకడి రాజ్యగర్వముచేత దేహముక్రొవ్వి నీ వాశ్రమమృగమును కొట్టినమాట నేనిప్పుడేపోయి యనుష్ఠాన మయిన తరువాత మాగురువులయిన విశ్వామిత్రుల వారితో నివేదించి నిన్నేమిచేయుంచెదనో చూడు.

చంద్ర—(భయముతో) ఈమాటలు విన్నను విశ్వామిత్రుని దలంచుకొన్నను నాచిత్తము స్వాయత్తముకాక తత్తరిల్లుచున్నది. ఈవిశ్వామిత్రుఁడు కోపులలోఁ బరమకోపి. ఆశ్రమమృగమును గొట్టినందున కేమిశపించునో! అన్నిటికి నీశ్వరుడేయున్నాఁడు. కానున్నదికాకమానదు. మించినదానికి వగచిన ప్రయోజనమేమి?

సత్య—(ఆలకించి) ప్రభువువారు వేంచేయుచున్నారు. వారి మాట యీచేరువనే వినఁబడుచున్నది.

హరి—(ప్రవేశించి) దెబ్బతినిపడక లేడియుఁ దపోవనములో దూఱి యదృశ్యమయినది. మునికుమారుఁడును నేనెంతబతి మాలుచు వెంబడించినను నామాటవినిపించుకోక కోపముతోఁ దొలఁగిపోయినాఁడు. నిష్కారణముగాఁ జేజేత ద్రాఁచుపాము నలగించి గొడవ తెచ్చుకొన్నాఁడను. ఏమికీడు మూడునో, ఆశ్రితాభయప్రదాతయైన యీశ్వరునిమీఁదనే భారము వేసి యాతనినే సర్వమునకు నమ్ముకొనియుండెదను. (అనుకొనుచు వచ్చుచున్నాఁడు)

చంద్ర—(ఎదురుగాఁబోయి) ఓప్రాణేశ్వరా! మీరు సుఖముగావచ్చి మరల నాకన్నులు చల్లపఱచితిరా! మీరెంతోవడదాఁకి బడలి లేఁతతోటకూర కాడవలె వాడుపాఱి యున్నారు. మొగము కందగడ్డవలెఁ గందిపోయినది. క్షణకాల మీ చిగురాకుసెజ్జను విశ్రమింతురుగాని రండి (అని చేయిపట్టుకొని తెచ్చుచున్నది)

హరి—(స్పర్శసుఖము నభినయించుచు) ఓమనోనాయకీ! ఆహా! ఏమి యీ స్పర్శసుఖము! నీకరసంస్పర్శనముచేత మంత్రించి

నట్లుగా నాయాయాసమంతయు క్షణములో బోయినది! నీకర పల్లవమే యిటుసోకి నామేను చల్లపఱచి యపూర్వసుఖము నిచ్చు చుండఁగా నిక నాకీచిగురాకు పానుపేల?

చంద్ర—అయ్యో! నాపాణవల్లభుల దేహమున కెంత చెమట పట్టినది! హృదయేశ్వరా! మీచూపులును ముఖభావమునుజూడఁగా మీస్వాంతమం దేదో చింతగదిరి యున్నట్లున్నది. మీ రేలాగుననో కనఁబడుచున్నారు. వాడియున్న మీ యంగముల నొక్కింతసేపీ మెత్తనిపాన్పుపయిఁ జేర్పుఁడు.

హరి—ఓప్రియురాలా! నీహస్తస్పర్శనముచేత నాశరీర తాప మడఁగినట్లేనీవచ నామృతవర్షముచేత నాహృదయతాపమును శాంతించుచున్నది. నీమాట దాటరాదు గనుకఁ కొంతసేపీ పల్లవ తల్పమునందు నామేనువాల్చెదను. (అని కూరుచున్నాఁడు.)

చంద్ర—మీ దేహమునందలి యీచెమ్మటసోనలు చూడఁగా నెండకాఁకచేత మీదేహసువర్ణము కరఁగి పాఱుచున్నదో యన్నట్లు కనఁబడుచున్నది. ఈపైట చెఱగుతోఁ గొంచెము విసరుదునా? (అని విసరుచు) ఏమి! పద్మగంధ మిప్పుడు గుప్పున ముక్కునకు గొట్టి ఘ్రాణేంద్రియమునకు విందుగొలుపుచున్నది! ఈగాలియెక్కడనుండి వచ్చియుండును?

హరి—ఈమందమారుతమా తామరకొలఁకునుండివచ్చినది. ఆహా! చెమ్మటలోఁ దొప్పతోఁగియున్న యీయంగముల కెంత చల్లఁగా సోఁకి, యపారసుఖము నిచ్చుచున్నది! మనము మణి మందిరములలో హంసతూలికాతల్పములయందు శయనించి పన్నీరు చిలికివట్టి వేళ్ళవీవనలతో విసరించుకొనుచున్నను మధ్యాహ్నవేళ నెప్పుడయిన గాలి మినకింతహాయిగా సోఁకినదా? ఇట్టిగాలి నవవ రతము ననుభవించెడి యీవనచరులు చేసికొన్నభాగ్యమేభాగ్యము.

ఉ. రాజులు దివ్యసౌధముల రమ్యసుశయ్యలఁ బండి తామె యు
వ్యాజసుఖోన్నతుల్ గనుదు మంచును గర్వముపొందుచుండినన్,
సాజముగాఁ బనుల్ సలిపి సల్పి శ్రమంపడుబీద లొందుని
ర్వ్యాజపు గాలిసౌఖ్యమున నబ్బునె వారికి షోడశాంశమున్? 8

చంద్ర—వారివలె నేఁడు మనకును గష్టజీవులమయితిమి గాన మన కీసుఖము లభించినది.

హరి—సందేహ మేమి? కష్టపడినతరువాత ననుభవించుసుఖ మెప్పుడు నధికసంతోషజనకముగా నుండును. దానికి దే నిదర్శనము.

ఉ. ఎండను మార్గము న్నడిచి యెంతయు డస్సినయట్టిపాంథుడే
నిండుసుఖంబు పొందఁగను నేర్చును జల్లని చెట్లనీడలన్
మెండుగఁ గాయకష్టపడి మేనను జెమ్మట పట్టియున్న యా
తం డొకఁడే కనం గలుగు ధారుణిలోపల గాలిసౌఖ్యముల్. 9

చంద్ర—ఓప్రాణేశ్వరా! ఈప్రకారముగానే భూమిలో నాపదల తరువాతవచ్చు సుఖములుగూడ నధికానుభవయోగ్యములుగా నుండునేమో?

హరి—(కొంచెము భయపడినవానివలె నగపడుచు గద్గద స్వరముతో) సుఖాధిక్యము నిమిత్తమయి బుద్ధిపూర్వకముగా నాపద లెవ్వరును గోరుకొనకుందురుగాక! (అనిచెప్పడి చూచుచున్నాఁడు)

చంద్ర—ఓప్రాణవల్లభా! అదియేమి? ఆపదయనుపేరు నా నోటినుండి వెడలఁగానే మీరు భయపీడితులవలెఁ గంపించినారు? మీచూపులేమో యిప్పుడు వింతగా నున్నవి. మీమనసు చెదరి యున్నట్లు మీ ముఖచిహ్నములు చెప్పకచెప్పుచున్నవి. మీభయ హేతువేమో నేనెంచుక యడుగవచ్చునా?

హరి—ఓప్రాణేశ్వరీ! నాహృదయము తెలిపెదనినుము. నే నిప్పుడు తలుచుకొనిపోయినది విశ్వామిత్రునియాశ్రమ మృగమఁట!

నీవిప్పు డాపదయని పేర్కొనంగానే నా కామృగవార్త మనస్సునం దట్టి నేను దానిని గొట్టినందునకయి చిచ్చులేక మండిపడెడి యా తాపసుం డేమియాపదలం బెట్టునోయని నాహృదయమున బెదరు గదిరినది.

చంద్ర—మీరు భయపడవలసిన పనిలేదు. ఎఱుంగకచేసిన దానికి విశ్వామిత్రుండుమాత్ర మేమిచేయును? విశ్వామిత్రుండు మహాతపస్వికాండా? నాయెడ నపరాధము వచ్చినదని యున్నది యున్నట్టుచెప్పి క్షమింపవేడినప్పుడే సైరణ వహింపండేని, ఇంక నాతపస్వితన మెందుకు?

హరి—కార్చిచ్చువచ్చి చుట్టుకొన నున్నప్పుడు నిప్పు నీళ్ళ వలెం జల్లగానుండునని చెప్పిన నెవ్వరికూరట కలుగును? నీవుచెప్పెడి యాశాంతిపరులయిన ఋషులు వేరు; విశ్వామిత్రుండు వేరు. నిప్పు యినను జల్లపడవచ్చునుగాని విశ్వామిత్రుడుమాత్ర మెప్పుడు శాంతుండుకాండు. అతండు చండకోపి. అతని పేరు విన్న ఫాలాక్షుండును నంచలించును. నీవాతని కోపస్వభావ మెఱుంగని ముగ్ధురాల వౌటచే ధైర్యము వహించుచున్నావుగాని యెఱింగి యెఱింగి నేనెట్లు మన స్థయిర్యము నిలుపుకోగలను!

సత్య—ఓరాజేంద్రా! దేవరవారు మిన్నువిఱిగి మీఁదబడినను జలింపని ధైర్యశాలులే. ఇప్పుడిట్టి పేదమాటలేల యాడెదరు? ఇట్టి సమయములోఁ బిఱికిగుండెగల యబలలకు ధైర్యము చెప్పవలసిన మీరే వారికిదిగులు పుట్టించినచో నింక మాకుదిటము చెప్పువారెవ్వరు? మీరు మీసహజధైర్యమును మరలఁ దెచ్చుకొనుఁడు. ఋషుల వచనములే కఠినములుగాని మనస్సు లెప్పుడును మృదువులుగానే యుండును ఒకవేళ విశ్వామిత్రుండు కఠినచిత్తుండై కోపమెత్తి నిర్నిమిత్తముగా మిమ్ము విపత్తులపాలు చేయుననుకొన్నను, మీరప్పుడే

కదా ధైర్య మవలంబింపవలెను! దైవమాయ యేమో కాని యీ లోకములో జనుల కాపదలు వచ్చుననుకొనుచుండునప్పు డుండుభయములో సహస్రాంశమయినను నిజముగా విపత్తు వచ్చినప్పు డుండదు.

గీ. అందుచేతనె జగతిలో నఖిలజనులు
నాపదలచేతఁ బొందెడు వ్యథలకన్న
నాపదలువచ్చు నన్నభయంబుచేత
శతగుణము లెక్కువగఁ గాంత్రు వెతలనెపుడు. 10

హరి—మీ రిప్పుడేమో యీబయలితో మాటాడుచున్నారు. మీమాటలను వేనిని నాపీనులు వినకున్నవి. నాకన్నులు మూఁతలుబడుచున్నవి. నాయింద్రియములు నాకు వశములుగాక యెక్కడికో పరుగువాఱుచున్నట్లున్నవి. విశ్వామిత్రుఁడు వచ్చి కోపము చూపకమునుపే యీయింద్రియములవలెనే మనమును పాఱిపోదమా?

చంద్ర—నిద్రచేతను గాఁబోలును మీరు జోగుచున్నారు. ఎండలో బడలివచ్చిన మీయవయవములు విశ్రాంతిఁగోరుచున్నవి. మీరు విశ్వామిత్రునిమాట మఱచిపోయి క్షణకాలము నాతొడ తలగడఁగాఁ జేసికొని యీశయ్యమీఁద శయనింపుడు. (అని పాన్పు మీఁదఁ జేర్చుచున్నది)

హరి—హృదయము కలఁగియున్నవారికి నిద్రరాదని చెప్పుదురు. నాకఁటి కిప్పుడేమో నిద్ర కూరుకొనివచ్చుచున్నది. నన్ను జోకొట్టి నిద్రపుచ్చుటకో యనఁ గోయిలలును దుమ్మెదలును మధుర స్వరముతో జోలలు పాడుచున్నవి. నాచిత్తశాంతికయి యీశ్వరుఁ డంపిన దూతవలెవచ్చి యిప్పుడీనిద్ర నన్నోదార్పఁ జూచుచున్నది. నేనొక్కనిమిషము నిద్రించి యామనో వేదనను మఱచిపోయెదను. (అని చంద్రమతి తొడమీఁద శిరస్సిడి పరుండి నిద్రపోవుచున్నాడు)

చంద్ర—ఓహో! నిద్రయెంతదొడ్డది! నాప్రాణనాథుఁడు మహావ్యాకులదశలోనుండ మాపాలిఁటి భాగ్యదేవతవలెఁ బ్రసన్నమయి దుఃఖోపశమనము చేయుచున్నది. ఏమి యీ యాశ్చర్యము! దివ్యభవనముల యందు బంగరు తూగుటుయ్యాలలో హంసతూలికా తల్పముమీఁద బరుండినప్పుడును రాజకార్యచింతాపరత్వముచేత నే వేళకును గన్ను మూయకుండునా మనోవల్లభుఁ డిప్పు డీచెట్టునీడలో గటికినేలను జిగురాకులమీఁద నెంతలో గన్నుమూసినాఁడు!

సత్య—అమ్మా! నిద్రసుఖ మెఱుఁగ దన్నమాట మీరు వినియుండలేదా?

గీ. ధనికుల గృహంబులందు నిద్రాపఘాటి
హంసతూలికాతల్పంబులందుఁ దాను
నిలువనొల్లక బీదలనెలవు చేరి
కటికి నేలనె సుఖియింపఁగనమె మనము?

గాల—అమ్మా! నాకితఁడు చెప్పినది స్వానుభవసిద్ధము. ధనికులైన మా పొరుగువారు పట్టెమంచములమీఁదను పట్టుపరుపుల మీఁదను బరుండి చోరభీతిచేత నిద్రపట్టక పొరలుచుండగా, ధనము లేని నేను మా నులకమంచముమీఁద మేనుచేర్చుటయే తడవుగా గుఱ్ఱుపట్టి హాయిగా నాదమఱచినిద్రపోవుచుందును. ఆవల నాచెవిలో నూఱుభేరులు మ్రోగుచున్నను నాకు మెలఁకువరాదు. నాగుఱ్ఱు మీరెప్పుడును వినలేదుగదా! ఏల వినకుందురు? మంచమెక్కి మాయింట గుఱ్ఱుపట్టితినా మీయింట మీరు నిద్రమేలుకొనవలసినదే.

చంద్ర—ఓయీ! నీయతిభాషిత్వము కొంతసేపు కట్టిపెట్టుము. ఓ సత్యకీర్తీ! అదియేమో కాని నాచిత్తము చేయిపెట్టి కలఁచినట్లు వ్యాకుల పడుచున్నది. ఈ నట్టడవిలో మా కేమికీడు మూడనున్నదో!

సత్య—అమ్మా! దంపతులు మీరిరువురును భగవదనుగ్రహము కలవారు. మీరితరుల కెప్పుడును గీడుచేసి యెఱుఁగరు. మీకేకీడును రాదు. విశ్వామిత్రుఁడు మీకొక యెగ్గుతలఁచినను, చిరకాలముండక మీకది యీశ్వరకటాక్షమువలన సూర్యునిముందు మంచు విడి పోవునట్లు విడిపోవును.

హరి—(ఉలికిపడిలేచి) ఓ బ్రాహ్మణోత్తమా! నా కిరీటము తన్నకు తన్నకు. నే నపరాధిని గాను (అని వడఁకుచున్నాఁడు)

చంద్ర—(వీపుచఱచి) ఓ ప్రాణనాయకా! భయపడకుము. మీకేదో పీడకల వచ్చినది కాఁబోలును. ఈశ్వరుఁడు మీకీదుస్స్వప్నఫలము కలుగకుండఁ జేయునుగాక.

హరి—ఔరా! బ్రాహ్మణుఁడు నన్నెంత తన్ను తన్నెను. నాతలయంతయు నొచ్చుచున్నది. ఈబ్రాహ్మణుఁడు నన్ను సింహాసనమునుండి పడఁద్రోచి రాజ్యమంతయు నపహరించి, పురము వెడలనడఁచి, ఈ యడవిలో నన్నెంత లేసిబాధలుపెట్టినాఁడు! ఓయీశ్వరా! నీవే దిక్కు నన్ను రక్షింపుము.

చంద్ర—ప్రాణేశ్వరా! ఇందుఁ బరులెవ్వరును లేరు. భయపడఁబోకుము. ఇది కలకాని సత్యముకాదు. కలలోఁదోచినయర్థము లెప్పుడయిన సత్యమగునా? మీరు తెలివి తెచ్చుకొని మా మొగముల వంకఁ గన్నులువిచ్చిచూడుఁడు. నేను మీ ధర్మపత్నిని చంద్రమతిని. వీఁడు లోహితాస్యుఁడు. ఈతఁడు మీమంత్రి సత్యకీర్తి. మేమందఱమును మీ యొద్దనే యున్నాము.

హరి—(కన్నులువిచ్చిచూచి) స్వప్నములు సత్యములు కావుగాని యిప్పుడు ప్రత్యక్షముగా జరిగిన యిదిమాత్రము స్వప్నము కాదు. అతఁడు తన్నిన తన్నుచేత శిరస్సింకను నొచ్చుచున్నది. మీరందఱు నిక్కడ నుండఁగనే యెంతలో నయోధ్యకుఁబోయి సింహా

సనమును గోలుపోయి, అడవులలో నిడుమలుకుడిచి మరల మిమ్మం డటిని గలసి కొన్నాను! ఆబ్రాహ్మణుఁడు కోపముతో నన్నిన్నియాప దలఁ బెట్టియుఁ గట్టుకడపట నా సింహాసనము నాకు విడిచియే పోయి నాఁడు.

సత్య—ఓమహారాజా! మీ రిప్పుడు చెప్పినదంతయు మీరు కలలోఁగన్నవార్త. ఇంత యల్పకాలములో మీకెంత పెద్దకలవచ్చి నది! ఇఁక మీరీకలను మఱచిపొండి. దీనినే మరల మగలఁ ద్రివ్వి తలపోయుచున్నయెడల, మీ మనస్సునకు లేనిపోని చింతకలుగును.

హరి—ఇది స్వప్నమా? నిజముగా జరిగినట్టే యున్నదే! (తలతడవుకొనుచు) నన్నతఁడు తన్నలేదా? ఇదికల కాదు. నిజము గానే యతఁడు నా కిరీటమును తన్నినాడు.

చంద్ర—అయ్యో! నా హృదయేశ్వరుని హృదయము చెదిరి పోయినది. ఈ మనోవ్యథ మాన్పుట కేదియుపాయము? ఇందెవ్వ రయినఁ గర్ణరసాయనముగా సంగీతము పాడఁగలవారయిన నున్న యెడల, నా ప్రాణవల్లభుని మనస్సు కలంక కొంత దీరునుగదా?

సత్య—ఇది మహారణ్యము. శ్రావ్యముగా ఝుంకారములు చేయు మధుపాంగనలుతక్క నిక్కడ సంగీతము పాడువా రెవ్వరుం దురు? మన యాస్థానమందలి గాయకు లెవ్వరును మనవెంట రాలేదు.

గాల—ఎవ్వరును రాకపోనేల? సంగీతశాస్త్ర ప్రవీణుఁడను నేనే వచ్చియున్నాను. నే నిప్పుడు నా యపూర్వ సంగీతముచేత మనస్సు కలఁకతీర్చి నా మిత్రుని దేర్చెదను. గాంధర్వస్వరమును పరిహసింపఁ జాలిన నాగాత్ర మాధుర్యమును జిత్తగింపుఁడు. (అని పాడుచున్నాఁడు.)

క. కలలో గాంచిన యర్థము
లిలలో సత్యములుకావు హితమిదివినుమా

కలలోన నరుకులాడినఁ
గలుగునె గాయంబు లెందుఁ గాయము నందున్?

ఓ సభ్యులారా! నా గాత్రమెట్లున్నది?

సత్య—ఎట్లుండవలెనో యట్లున్నది. అర్ధాంతరముచేత నీ వన్నట్లు గాంధర్వస్వరమే.

హరి—ఈగాలవుని పాటవలన మనస్తాపము పోయి నాకిప్పుడు కొంత స్వస్థత గలిగినది. ఇంతవఱకును మీరు చెప్పినమాటలు నా చెవిని చొరనే లేదు. ఓహృదయేశ్వరీ! మీరింతకు ముందేదో యన్నారే, అదియేమి?

చంద్ర—మరేమియును లేదు. దేవర వారిమనస్సు కలతఁ దీర్చుటకు హృదయరంజకముగా గానము చేయువారెవ్వరయిననుండిన బాగుండుననుకొన్నాము.

హరి—ఓమధురభాషిణీ! నీవు చెంతనుండి మాటాడుచుండఁగా వేఱుగసంగీత మేలకావలెను? నాకు నీమాటలేసంగీతము. ఆపయిని పాటపాడి నవ్వించుటకు సంగీతశాస్త్రపండితుఁడు గాలవుఁ డొకఁడు మనయొద్ద నున్నాఁడు.

గాల—అట్లయిన నిప్పుడిక్కడ నిద్దఱుపాటకు లున్నారు.

పాల—ఓమహాప్రభూ! శుభమగుగాక! మాతంగాంగనలఁట! ఇద్దరుముద్దియలు యాచనార్థమువచ్చి, యిచ్చట చెట్టునీడను నిలిచి పాటలుపాడి వినోదింపఁ జేయఁగలమని విన్నవింపుమను చున్నారు. సెలవయ్యేనేని వారిని గొనివచ్చెదను.

హరి—వారిపాటలచేతనైన నా మనసులోని యారాటము తొలగునేమో! పాడింతము తీసికొనిరమ్ము.

[ఇద్దఱు మాలెతలు ప్రవేశించుచున్నారు.]

మాలె—(చేతులుజోడించి మ్రొక్కి) ఓరాజసార్వభౌమా! దేవరవారికి మేలగునుగాక! ఇంతకుముందప్పుడప్పు డేలినవారిసుగుణ

సురూపాదులను శ్రవణానందముగావిని సంతోషించుచుండుటయే కాని కన్నులపండువుగా సందర్శించి యానందించు భాగ్యమీవఱ కెన్నఁడును లభింపలేదు. మీదివ్యసుందరవిగ్రహములు మాకన్నుల నిండఁ గూడఁ గాంచుటచే నేఁడు కదా మేము భూమిమీఁద జన్మ మెత్తినఫలము పొందఁగలిగితిమి! మాకన్ను లిప్పుడు ధన్యము లయి నవి. మేము చేసినపుణ్యము మఱి యెవ్వరును జేయలేదు.

హరి—(సత్యకీర్తితో రహస్యముగా) ఓమంత్రిపుంగవా! దృష్టి మిఱుమిట్లు కొలుపుచున్న యీమందయానలసుందరాకార మును జూచినను వీనులకు విందులుకొలుపు మృదుమధురవచోర చనా చమత్కారములు విన్నను వీరు విహారార్థముగా ధారుణి కవతరించిన లక్ష్మీసరస్వతులో, గానకళాకౌశలమును జూపవచ్చిన రంభోర్వశులో, రూపముధరించి సంచరించుచున్న పంచసాయకుని సమ్మోహనవిద్యలో యన్నట్లున్నారు గాని మాతంగకాంతలుగా నెంతమాత్రమును లేరు.

ఉ. వా తెఱ లల్లకెంపులకు వన్నియ వెట్టగ, ముద్దుమోములుం
బ్రాఁతిగఁ బూర్ణి మాశశికి వంకలు దిద్దఁగ, నవ్వు చంద్రికా
వ్రాతము తెల్విఁ బెంపఁ, గనుపట్టెద రింతులు నల్లరూపునన్
జేతన దాల్చి క్రుమ్మరెడు చెల్వపు నీలపు బొమ్మలో యనన్.13

మానవజాతిలో నిట్టిలావణ్యవతులను మన మెన్నఁడయినఁ జూచి యెఱుఁగుదుమా?

సత్య—ఒక్కమానవజాతిలోనే కాదు గంధర్వకామిను లలోఁ గూడ వీరిని బోలిన యందకత్తెలుండుట దుర్లభము. వీ రలం కారములు లేకయే నిసర్గమనోహరాకారములతో నెట్లు ప్రకాశించు చున్నారో!

హరి—స్వభావచారుమనోహరశరీరముల కలంకారము లక్కఱయే లేదు.

చ. తళుకు మెఱుంగు సోయగపుఁదావిశరీర మలంకరింపఁగా
వలయునె రత్నభూష లవి వట్టి వికారము లౌను గాక? మిం
చులకు మెఱుం గిడ న్వలెనె? శుద్ధసువర్ణము పూఁతఁ గోరునే?
యిలపయి రం గిడన్ వలెనె యింద్రధనస్సునకింతయేనియున్?14

ఓసత్యకీర్తి! సర్వసంగపరిత్యాగు లయినయోగులకును భ్రమలు పుట్టించు వీరి యసమానరూపకళావిభ్రమములు చూడఁగా విశ్వామిత్రుఁడే తనతపోబలముచేత వీరిని సృజించి మనలను వంచించుటకయి యిట్లు పంచి యుండునేమో యని యించుకసంశయ మంకురించుచున్నది. ఇది యాసంయమి చేసినమాయ యయియుండదు కదా?

సత్య—ఓరాజేంద్రా! మీ రిఁక విశ్వామిత్రునిపేరు మఱచిపోవలెను. అప్పుడు లేడిని గొట్టినప్పటినుండియు విశ్వామిత్రుఁ డేమి చేయునో యన్నభయము మీమనస్సునబట్టి విడువక యన్యచింత పోఁగొట్టినందున మీకిప్పుడు సర్వమును విశ్వామిత్రమయముగా నే తోచుచున్నది. మీరింతకుముందు నిద్రయందును విశ్వామిత్రునే చూచి యదరిపడి లేచితిరి. ఇప్పుడు మేలుకొని యుండియు విశ్వామిత్రునే పలువరించుచున్నారు. మీరొక్కసారి యిటు తిరిగి యించుకసేపు వీరిపాట యాలకింపుఁడు.

మాలె—ఓభూలోకదేవేంద్రా! అర్థి లడిగిన దానిని లేదనక యిచ్చెడుదొడ్డదాత లని దేవరవారి నెల్లవారును వేయినోళ్ళ శ్లాఘింపఁగా జెవులు చల్లఁగావిని, మీవలన మాయభిమతార్థసిద్ధియగు నన్నయాశతో మిమ్మిట వేఁడవచ్చినారము. మేము నృత్తగానవిద్యలయం దించుక ప్రవీణురాండ్రము, రసికజనశిఖామణు

లయిన యేలినవారు మావిద్య కొంచెము చిత్తగించి మాయభీష్ట మును దీర్చి మమ్ము సంతోషపెట్టి పంప ననుగ్రహింపవలెను.

హరి—లోకములో గానరసమునంచా బాలవృద్ధమునాదరము లేనివారెవరుందురు? భువిలో సంగీతశ్రవణమునందుఁజవిలేనివా రొక్క చెవిలేనివా రే. ఏదీమీరొక్కమంచిరాగము నాలాపన చేసి మీకు వచ్చి నగీతము నొకదానిని వీణెమీఁద జక్కఁగాఁబాడి మాకుగర్ణోత్సవము చేయుఁడు.

మాలె—(వీణెలు శ్రుతిచేసి మీటుచుఁ గంఠ మెత్తి పాడుచున్నారు.)

ద్విపద. నాయక! నీమీఁద నాచుచిత్తంబు
పాయక యెప్పుడుఁ బగలునురాత్రి
చిరకాలమందుంటి చిక్కి వేరూని
మరలించుకొన్నను మరల దే మందు?
కనికర మెదనుంచి కావుము నన్ను;
నను నిట్లు కలఁచుట న్యాయంబుకాదు.
మనుజులు కొందఱు మహిమీఁదఁ దమకె
ధన మున్న దనియు సౌధము లున్న వనియు
సిరు లున్న వనియును జెలు వున్న దనియుఁ
బరువ మున్న దనియుఁ బట్టరానట్టి
గర్వాతిశయమునఁ గన్గాన లేక
యుర్విపై మావంటియువతీజనంబు
వెతపెట్టుదురు వారి వేఁడికో ల్వినక
ఎల్లరు భూమిలో నేడుజేనలకై
యల్లపు డధికారు లంత్యకాలమున,
తలఁ గట్టుకొని పోము ధరణిలో దేది;

యిలమీఁద నటువెన్క నెల్లవారలము
సములమే యౌదుము సత్యంబుసుమ్ము.
సమయంబు మించినఁ జాలఁ జింతించు
కార్య మేమియు లేదు; కావున వేగ,
ధైర్యంబు విడనాడి తాళంగ లేక
ఘనసాహసమునకుఁ గడఁగకమున్న
ననుఁ బ్రోవు మోప్రాణనాయక! నీవు.
కడసారి ప్రార్థింతుఁ గాంక్షతో నిన్ను;
విడువకు విడువకు విడువకునన్ను.
ఆఁడువా రసు రన్న నవనిలోపలను
గీ డెంతవారికిఁ గెరలక కల్గు.
చెప్పితి మున్మాఱు చేయు మేదైనఁ
దప్పిఁక నామీఁదఁ దగదు త్రోయంగ.

హరి—ఓహో! వీరిపాట యెంత ముచ్చటగా నున్నది!

చ. జిలిబిలిపాట లంగళులఁ జిమ్మెడుతంత్రులసుస్వరంబుతోఁ
గలసి చెలంగె; హస్తముల గాజులచప్పుడు తాళమానమై
చెలఁగెను; లోచనాభినయచిహ్నము గీతములోని భావముం
దెలిపె; మనోజ్ఞమై లయను దెల్పె బదాభినయంబు చక్కగన్ 16

ఈగానరస మచ్చటి మోళ్ళను జిగురింపఁ జేయుచున్నను సంతో షాంకురము లేక మోడుపాఱియున్న నాయుల్లమును బల్లవింపఁ జేయ లేకున్నది.

సత్య—(తనలో) ఏమి! రాళ్ళుకరఁగెడి యీమనోహర సంగీతమువలనను రాజుగారి మనస్సు సుఃఖమును మఱచిపోకున్నది! ఇఁక నే నిందలి కథాంశమునకు దింపి మఱపించెదను.(ప్రకాశముగా) ఓరాజేంద్రా! ఈగీతమునందలి నాయిక వాక్యములను జిత్తగించినారా!

హరి—ఇవి చాతుర్యముచాలని ముగ్ధనాయికయొక్కయప్రౌఢవాక్యములుగానున్నవి. ఈనాయికయొక్క యీప్రార్థన నాకుఁ జూడఁగాఁ బ్రియుని మరులుకొల్పుటకంటె నిట్టితుచ్ఛసుఖములనుండి మరలుకొని ధర్మమునే చూచుకొమ్మని నాయకునకు వైరాగ్యములు బోధించుచున్నట్లు కనఁబడుచున్నది. తనువులు శాశ్వతములుకావన్న యీ హెచ్చరిక విశ్వామిత్రుఁ డెన్ని బాములు పెట్టినను ధర్మమును మాత్రము విడువవలదని నాకును హితబోధ చేయుచున్నది. ఇప్పుడు నామనస్సు వీరి పాటనుండి విముఖమగుచున్నది. ఓసత్యకీర్తి! తగిన సత్కారముచేసి వీరిని బంపివేయుము.

సత్య—మనస్సులో దీర్ఘవిచారమున్నప్పుడు సర్వమునసహ్యముగానే తోఁచును.

హరి—అవు నది సత్యమే. నామనస్సులోపలనే పరితాపముండి నన్ను బాధించుచున్నప్పుడు బాహ్యము లయినవస్తువులు నా కెట్లు సంతోషమును బుట్టింపఁగలవు? దుఃఖమునందు వస్తుగుణములను వ్యత్యస్త పఱిచెడు యద్భుతశక్తియేదో యున్నది సుమా! అట్లు లేక పోయినయెడల నాకింతవఱకును హృదయరంజకముగానున్న యీవస్తుజాలమంతయు నిప్పుడింతలోనే యేల యసహ్యమగును? కర్ణరసాయనమయిన గానరసమేల చెవులకు రుచియింపక పోవును? ఆహా! దుఃఖము బ్రహ్మసృష్టిని మార్చి నాకుఁ గ్రొత్త సృష్టిని జేయుచున్నది! ఓసత్యకీర్తి! వీరికి రత్నభూషణాదులు బహుమానమిచ్చి వేగిరము పంపివేయుము.

మొదటిమాలె—ఓసీ! ఈవింత చూచినావా? ఈరాజు రూపమునుజూచినప్పటినుండియు నామనస్సు నాకు వశముగాక సంచలించుచున్నది. అందుచేతనే చేతనముల నచేతనములను జేయవలసిన నాపాట యిప్పు డీరాజుమనస్సున కెక్కినదికాదు.

రెండవమాలె-నీమనస్సు చలించినదే కాని నిన్ను విడిచిపోయి నదికాదు. ఇంక నామనస్సో నన్నప్పుడే విడిచి నాలోపల నిలువక పరుగువాఱి పాటపాడినంతసేపును రాజుమీఁదనే యున్నది. నేనిప్పు డేమి పాడితినో యే నెఱుగను.

సత్య—ఓగోసంగిపడుచులారా ! ఇవిగో కాంచనాంబరా భరణములు రాజుగారనుగ్రహించి దయచేయుచున్నారు. వీనిని బుచ్చుకొనుఁడు.

మాలె—ఓమంత్రిచంద్రా! మేమీభూషణముల నొల్లము. ఈమండువేసవికాలములో దుస్సహమయిన యాతపముచేత మా దేహమంతయు లోపలను వెలుపలనుగూడ దహించుకొనిపోవు చుండఁగా మాకిప్పుడీయలంకారము లెందుకు? బాహ్యతాపమయిన నించుక శాంతించుటకు మీ రాజుగారి శ్వేతచ్ఛత్రము నిచ్చినను గొంత తలదాఁచుకొని సంతోషించెదము.

సత్య—ఓరాజేంద్రా! ఈమాలపడుచు లిప్పుడు కోరరాని కోరికలను గోరుచున్నారు. ఏమి చేయుదము?

గాల—మంత్రివైన నీకాలోచన తోఁపనిపక్షమున వీరిని నాకప్పగింపుము. చెఱినాలుగు లెంపకాయలు బహుమాన మిప్పించి, వీరు ముం దెవ్వరి నిట్టికోరకలు కోరకుండఁ జక్కచేసి సాగనంపె దను. వీరికి బాహ్యతాప మడఁగవలెనఁట! నేను జేసెడి యుప చారముచేత బాష్పవర్షము కురిసి యన్నితాపములును దీఱును. అయ్యో! నేను వీరిని దాఁకగూడని బ్రాహ్మణుఁడ నయిపోతినిగాని, కాకపోయినయెడల వీ రీపాటి యిల్లాండ్ర కేశఖండనమహోత్సవము నాటి రాగములు తీయుచుఁ బరుగెత్తి యిల్లు త్రొక్కిచూడరా?

హరి—ఓయి వెఱ్ఱిబ్రాహ్మణుఁడా! తప్పుచేసినప్పటికిని స్త్రీల యెడలఁ గోపముచూపరాదుసుమా. నీ పూరకుండుము. నేను మంచి

మాటలతో వీరిని సమాధానపఱచి సంతోష పెట్టి పంపివేసెదను. (అని మాలెతలవంకఁ దిరిగి) ఓకాంతలారా! మీరజ్ఞానముచేత నడుగరాని వస్తువడుగుచున్నారు. యాచకులెప్పుడును రాజులను ఛత్రచామరము లడుగరాదు. ఇయ్యఁదగిన మఱి యేవస్తువునయిన వేఁడుఁ డిప్పించెదను.

మాలె—అట్లయిన మేము మఱియొక వస్తువునే వేఁడెదము లెండి. ఈపయితాపమును మే మేశీతలవస్తువులచేత నయినను బాపుఁకోగలము. అడఁచుకొన్నను నడఁగక 'పయికిఁ' బొంగివచ్చెడి మాయంతస్తాపమును నీదయారసవృష్టిచేతఁ గాక మఱియెట్లు వారించుకోనేర్తుము? నిన్నుఁ జూచినప్పటి నుండియు మాహృదయములలో బెరుఁగుచున్న దురాపమయిన మన్మథతాపము పోవునట్లుగా మాకొక్కసారి నీచల్లని కౌఁగిలిదయచేయుము.

హరి—హరిహరా! (అని చెవులుమూసికొని) పాపము శమించునుగాక! ఔరా! ఏమి వీరి కండ కావరము! ఈచండాలాంగనలు యౌవనమదముచేతఁ గన్నుగానకకండక్రొవ్వున నోర నుడువరాని పాపపుఁ గోరికలను గోరుచున్నారు. వీ రసలేపరకాంతలు. ఆమీఁద ముట్టను ముచ్చటింపను గూడని చండాలాంగనలు నా మనస్సు స్వప్నమందయినఁ బరసుందరులమీఁదికిఁ బోవునా? ఇఁక వీరితో మాటలాడినదోషమువచ్చును. పాకము మఱింత ముదురకమునుపే వీరిసిక్కడనుండి సాగనంపింపవలయును. ఓసత్యకీర్తీ! ఉచితానుచితపరజ్ఞానము లేక తప్పుఁద్రాగి నోరికి వచ్చినట్లు కాఱులు పేలుచున్న యీమదవతులను మనభటులచేత మాయెదుటనుండి సాగఁ దోలింపుము.

సత్య—దేవరవారి సెలవుప్రకారము చేసెదను. ఓభద్రా! ఓపాలకా! మీరిద్దఱు నూరక చూచున్నారేమి? సురాపానవికార

ముచేత శరీరములు వణఁచి యున్మత్తప్రలాపములు చేయుచున్న యీశుద్రికాంతను దత్క్షణమావలికి గెంటివేయుఁడు.

పాల—మేమును దేవరవారి యాజ్ఞకొఱకే యెదురు చూచుచున్నాము. ఓ చండాలులారా! గుండెబెదరులేక రాజుగారి నిట్టి దుండగపుఁగోరికలు కోర మీకెట్లు నోరువచ్చినది? ఇఁక మీరిక్కడ నోరెత్తినపక్షమున నేనీ కత్తితో మీనాలుకలు కోసెదను. లేచిపొండి.

(అని కొట్టుచున్నాఁడు.)

భద్ర—సంకోచము లేక వెఱ్ఱిపోకలు పోవుచున్న యీనీచురాండ్రిమదము నేనడఁచెదను. (అని కొట్టుచున్నాఁడు.)

చంద్ర—ఓసత్యకీర్తి! ఈయబలలవీపులమీఁదబడిన దెబ్బలు నాహృదయము మీఁదఁ బడినట్లు తాఁకి నామనస్సు నొప్పించుచున్నవి. ఈబాధ నేను సహింపలేను. భటులను వెంటనేవారించి యజ్ఞానముచేత ననరానిమాట లన్నయీకన్నియలను గొట్టకుండఁ జేయుము.

హరి—ఓమంత్రివరా! దిక్కుమాలిన యీయాఁడువారిని జేయిచేసికొని నొప్పించుట నేను జూడలేను. నేనువీరిని దృష్టిపథము నుండి తొలగింపు మంటినే కాని యిట్లు దయమాలి చబుకులపాలు చేయుమనలేదే. సమయమువచ్చినప్పుడు శత్రురాజులమీఁద మన ప్రతాపముఁ జూపవలెనుగాని యిట్టి యబలలమీఁదనా చూపుట? ఎదిరింపఁజేతకాని మానవతులను మొత్తుటలో నీవీరభటుల కేమి పౌరుషమున్నది?

ఉ. అర్థులమీఁదఁ జూపనగునా? తనశూరత వీరుఁ డెందుఁ బ్ర
త్యర్థులమీఁద యుద్ధసమయంబునఁ జూపఁగఁ జెల్లుగాక! సం
వర్ధితదీర్ఘవృక్షములపైఁ దనశక్తి మహాబలుండు తా
నర్థిని జూపుఁగాక యడుగంటినతీఁగెలమీఁదఁ జూపునే?

మ. అలుగం గాంతల యూరుయుగ్మములు మత్తారీభ హస్తంబులే?
లలనాపాంగనిరీక్షణంబు లరిరాడ్వాతోగ్ర బాణంబులే?
తిలకింప న్విరిబోండ్లకన్నెమలు శత్రుక్ష్మాపచాపంబులే?
వల దీక్రొవ్విరిబోండ్ల నంట; నిపు డీబంట్ల న్నివారింపుమా.

సత్య—ఓవీరభటులారా! వీరి నావలకు గెంటుఁడని నేను నియోగింపఁగా మీరు మీశూరత్వమంతయు నీయాఁడువారిమీఁదనే కనఁబఱుచుచున్నారేమి? ప్రభువువారు కోపపడుచున్నారు. వీరిని గొట్టక విడువుఁడు.

పాల—ఓమంత్రిపుంగవా! రాజుగారిమనస్సు కలఁగియుండుట చేత వారికాగ్రహము తెప్పించి చిత్తమును జింతనుండి మరలింప వలయునని యిట్లు చేసినారమే కాని యాఁడువారిని జేయిచేసికొని కొట్టుటకు హరిశ్చంద్రునిబంట్లమయిన మేముమాత్ర మంతక్రూర చిత్తులమా?

మాలె—(ఏడ్చుచు) ఓరాజధమా! నీవాఁడుతోడునఁ బుట్ట లేదా? కిరాతుఁడవా? యాచింపవచ్చిన మావంటిపుష్పకోమలులను గొట్టుఁడని యీయమకింకరులవంటి క్రూరులను గరుణమాలి నియోగింప నీకు నోరెట్లు వచ్చినది? మామెత్తని దేహములు దెబ్బలచేత నెట్లు కందినవో చూడు. మాకొప్పులు వీడి యానేలమీఁద, పువ్వు లెట్లు చిందినవో చూడు. ఓదయావిహీనా! ఇప్పుడయిన నీకన్నులు చల్లపడినవా? ఆఁడువా రనురుసురని క్షోభపడినఁ దత్ఫలము కట్టి కుడుపక యూరకపోదు. మమ్ము బిడ్డలవలె జూచుకొనుచున్న విశ్వామిత్రునికి నీదుర్ణయమును నివేదించి నిన్నేమిచేయించెదమో చూడు. ఇంకొక్కనిమిష మోపికపెట్టుము. (అని వెడలిపోవుచున్నారు)

హరి—ఓసత్యకీర్తీ!

ఉ. కొప్పులువీడ, మోములనుగ్రొంజెమరెంతయుఁగూడ, బాష్పముల్
కుప్పలు గూరి యూరి కనుఁగొల్కుల జాలుగ నోడ, నయ్యెడ
ళొప్పు తొఱంగివాడ గపు నొక్కట నల్లల నాడఁ జేడెలా
చొప్పునఁ జూడు పోయెదరు శోకము రూపము తాల్చినట్లుగన్.

నిష్కారణముగా స్త్రీలను గొట్టించి మనము పాపమునకొడి గట్టుకొన్నాము. ఇట్లాడువారి నేడిపించిన క్షోభము మనకుఁదగులక పోదు. వారు విశ్వామిత్రునిగూడ బేర్కొనుచున్నారు. నాకిదియంతయు నేదో కపటనాటకముగాఁ గనఁబడుచున్నది. కాని సత్యము పలె లేదు. ఋష్యాశ్రమము లెక్కడ? చండాల స్త్రీలుండు టెక్కడ?

సత్య—దేవరవారూహించినది యథార్థము. తపోవనములయం దెక్కడను మాతంగాంగన లుండరని యీవఱకెన్నఁడును విని యుండలేదు. నాకుఁ జూడఁగా వీరేదో కపటము మనస్సులో నుంచుకొని యీప్రకారముగా వేషములు వేసికొని వచ్చినట్లుగాఁ దోఁచుచున్నారు కాని నిక్కంపుమాలెతలుగాఁ దోఁచరు.

చంద్ర—ఇదియేమో నాకును మహేంద్రజాలముగానే యున్నది. మనము భూతభూతుకి వచ్చియుండలేదుగదా? లేక విశ్వామిత్రుని మాయయై యుండునా? తాళుఁడు మేఘగర్జనమువలె దూరమున నెవ్వరిదో గంభీరఘోషణము వినవచ్చుచున్నది.

హరి—(ఆలకించి) మాలెతలమాటలు విని దురాగ్రహము చేత మండిపడుచు మనమీఁదికి వచ్చుచున్న విశ్వామిత్రుని యాజ్ఞ వాక్యమువలెనున్నది వినుండి.

అందఱు—(చెవిలొగ్గి వినుచున్నారు)

(తెరలో)

శా. ఏమేమీ! తనబంట్లచేత మిము రాజరీతి మం.తించెంగాఁ
యామూఢుండు తపఃప్రభావమును నావం తేమము న్నన్నుఁ

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P. R. I.
Acc. No.

శ్వామిత్రుం దెలియం డీకం దెలియు నస్మచ్ఛండకోపాగ్నిచే;
భీమోద్యత్ప్రళయాగ్నిమీఁద శలభం బేమాఁక నుంకించెనే? 20

సత్య—అవు నతఁడు విశ్వామిత్రుఁడే. మాలెతలుపోయి నేర ములు చెప్పి యాతనిని దీసికొనివచ్చుచున్నారు. ఓరాజేంద్రా! మీరు ధైర్యము వహింపవలసిన సమయమిది. దూరభీరుతయు నాసన్నధీరతయు మహాత్ములకు సహజగుణములు.

చంద్ర—ఓప్రాణనాథా! గాధేయుఁ డెట్లుకోపప్రకంపమానుఁడయి మనదిక్కునకు వచ్చుచున్నాడో చూచితిరా? మీరించుకయు సంచలింపఁగూడదు.

హరి—ఓసత్యకీర్తీ! ఆవంకం జూడుము.

మ. కనుల న్నిప్పులు రాల నల్దెసలు రూక్షప్రోక్షి నీక్షింపుచున్
ఘనదండాగ్రముతోడఁ బల్మఱును వీఁక న్నేల తాటింపుచున్
వనదంష్ట్రిక్రియుఁ బండ్లు దీఱుచు జటాభారంబు తూఁగాడ గ్ర
క్కున నేతెంచెడుఁ జూడు మాతఁ డదిగోఁగోపంబు రూపొందె
నా 21

అతఁడు మనమీఁదఁ గోపము చూపకమునుపే మనమిప్పుడెమరుగాఁ బోయి భక్తిఁజూపి శాంతచిత్తునిఁ జేయుదము. దుర్వారమయిన కోపాగ్నిని శాంతిజలముచేతనే యార్పవలయును.

చంద్ర—సలసలఁగాఁగుచున్న చమురులోఁబోసిన చల్లని నీరువలెనే మనశాంతవచనములు కోపపరవశుఁడయి యున్న యా తాపసుని మఱింత మండఁజేయునేమో! అయినను మనము శాంతత విడువరాదు. శాంతాత్ములయెడఁ గోపముచూపి యాతఁడే దుష్టుఁడు కానిండు. మన మెమరుగాఁ బోయి సాదాక్రాంతుల మగుదము.

విశ్వా—(ప్రవేశించి . పండ్లు పటపటకొఱుకుచుఁ గన్ను లెఱ్ఱచేసి) నీతండ్రినిమిత్త మెంతో కష్టపడి నాతపస్సు ధారపోసి

క్రొత్తగా స్వర్గమును నిర్మించి నీజనకునికి బొందితో స్వర్గ మిప్పించిన మేలునైనఁ దలఁపక యిప్పు డెంతపని చేసితివి రా? ఓరికృతఘ్నుఁడా! (అని చేతిలోని యక్షమాలను గ్రిందఁబడవైచి కాలునేలఁజఱచు చున్నాడు)

హరి—(ఎదురుగాఁబోయి పయిబట్ట మొలకుఁజుట్టుకొని సాష్టాంగపడి) ఓమునిసార్వభౌమా! నమస్కారము.

విశ్వా—(తల కాలితో తన్ని) ఓరిపాపీ! ఈవఱకుఁ జేసినది చాలక యిప్పుడు నీశిరస్సుమోపి నాపాదములనుగూడ నంటుచేయు చున్నావేమిరా? తొందరపడకు. నీవుచేసిన పాపఫల మిప్పుడే యనుభ వించెదవు.

హరి—స్వామీ ! దేవరవా రింతయాగ్రహముచేయుటకు దాసునియెడ నేమితప్పువచ్చినది? నవరత్నఖచితమయిన యీకఠిన కాంచనకిరీటము సోఁకి దేవరవారి మృదుపాదము నొచ్చినదేమో యని చింతిల్లుచున్నాను.

విశ్వా—ఓరిద్రోహీ ! ఇప్పు డొక్కపాదముమాత్రమేకాదు నీదుశ్చరిత్రముచేత నాసర్వాంగములును నొచ్చుచున్నవి. నీవు మా యాశ్రమమృగమును నొప్పించితివన్న దుఃఖముతోనే కోపాగ్నిరగుల నీకిదిబుద్ధి కాదని చెప్పవచ్చుచుండఁగా నింతలో గోలుగోలుననేడ్చుచు దారిలో వీరెదురుపడి గోరుచుట్టుమీఁద రోకలిపోటు వేసినట్లు తమ్ముఁగొట్టించితివన్న పిడుగువంటి దుర్వార్తను నాచెవులవేసి రాఁజు చున్న నాకోపాగ్నిని భగ్గునమండఁజేసి రారు. ఆశ్రమమృగముల హింసించు దుర్బుద్ధి నీకేలపుట్టినది? ఇట్లునోరులేని సాధుజంతువులను తపోవనములుగూడ సంహరింపుమని నీకునీకుఁడుపదేశించి నాఁడా? ఉ. రాజులు మున్ను వేఁటలకురారె? మదించినదుష్టజంతులన్
దేజముచూపి కానలను దీవ్రశరంబుల రూపు మాపరే?

యాజననాథు లేయెడల నాశ్రమభూములు చొచ్చినీవలెఁ
నైజమదోద్ధతిన్ మునివనంబుల సాధుమృగాళిఁ గూల్చితే?

హరి—ఓ తాపసోత్తమా! ఈవిషయమున నే నేపాపము నెఱుఁగను. బాల్యచాపలముచేత వీఁ డాడుకొనుటకయి నన్నాలేడిని బట్టియిమ్మని వేఁడఁగా సామాన్యతురంగ మనుకొని తఱిమితి నేకాని నేనప్పుడది యాశ్రమమృగ మని యెఱుఁగను. ఎఱుఁగక చేసిన యీయపరాధమును క్షమింపుఁడు.

విశ్వా—మృగమును గొట్టుటయన్న నెఱుఁగక చేసితి నని బొంకితివి. వేఁడవచ్చిన యీనిరపరాధిను లయినకన్నియలను గొట్టించిన యపరాధము నేమని బొంకెదవురా? నీకీచక్రవర్తిత్వముపచ్చుట యడవులలోఁ గందమూలాదుల నేఱుకొని తిని బ్రదుకు మావంటి సాధులను బాధించుకొఱకా? శిరీషపుష్పకోమలు లయినయీముద్ద రాండ్రను కఱకుకశలతో మోఁదు మన నీకు నోరెట్లువచ్చెను.

హరి—ఓమునీంద్రా! ఇఁక మాటలెందుకు? నేను జేసిన వన్నియు నపరాధములే నేనపరాధములు లక్ష చేసినను శరణంటిని గనుక నన్ను మన్నింపుఁడు. శరణన్నమాత్రమున శత్రువకైనను భయ మియ్యవలెను. తన్ననఱకవచ్చినవారికిఁగూడ వృక్షమునీడనియ్యదా? ఓదయామయా! శాంతింపుము, శాంతింపుము.

విశ్వా—శాంతిపరు లయినయాఋషులు వేరు; మేము వేరు. మమ్ము వారివలెఁ దలంపకుము. నీవు చంకదుడ్డును శరణార్థియు ననుచున్నావు. ని వింక లక్ష చెప్పినను నీమీఁద మాకు దయరాదు. నాదుర్వారకోపాగ్నికి నిన్నిప్పుడు మిడుతనుజేసెదఁజూడు.

గాల—ఓబీదతాపసీ! మారాజు వెఱ్ఱివాఁడయి బతిమాలు కొన్న కొలఁదిని నీవంతకంతకు బిఱ్ఱబిగిసి మిఱ్ఱెక్కుచున్నావు. దయా

లేశము లేని ఈ నీ తపమెందుకు? జప మెందుకు? చదువెందుకు? స్వాధ్యాయ మెందుకు? కాల్పవా.

చ. అరయఁగ నంతరాత్మను దురాగ్రహపాపమునుండి పాపి సు
స్థిరమతి నిష్కళంకముగఁ జేసినఁ గాక, జపంబు వల్కలాం
బరములు, మౌనమున్, జడలు, వహ్నులుఁ, గృష్ణమృగాజినంబు
లున్
బురుషుఁ దపస్వి చేయునె? సమూలము వమ్ముగుఁ గాక యున్నియున్.

సత్య—ఓగాలవా! పెద్దల నట్లనరా దూరకుండుము. ఋషులు మాటలలోఁ గాఁకను జూపినను గ్రియలలోఁ జల్లదనమునే కనఁబఱుతురు. వీరి పలుకులు వజ్రకఠినము లయినను హృదయములు నవనీతకోమలములు.

గీ. కఠినముగ మందు కోపవాక్యంబు లన్న
ఋషులు మేలు నెచేయుదురు రెండుఁ బిదప;
మొదల మేఘంబు లుఱిమినఁ బిదప నవియె
వానకురిపించు గాదె యీవసుధమీఁద. 24

విశ్వా—ఓరీ! విప్రాధమా! మమ్ము దయయెఱుఁగని క్రూరులమని చెప్పసాహసించుచున్నావుగా! మాకోపమునకు బ్రహ్మరుద్రాదులయినను దలంకుచుండఁగా నీవెంతనిర్భయముగా మమ్ము నిరాకరించుచున్నావురా? మాక్రోధవహ్నిని నీవును జవిచూతువు గాని నిమిషము తాళుము.

గాల—క్రౌర్యము మీవంటి మునివ్యాఘ్రములు చూపినప్పటివలె వ్యాఘ్రములు చూపినప్పుడంత బాధాకరముగా నుండదు. వేఁడుకొన్నను నిరపరాధులమీఁద దయరాదేని, నిర్దయుఁ డయిన యామనుష్యుఁడు కేవల క్రూరమృగమే. కాదు, కాదు. క్రూరమృగమే వానికంటెను సహస్రగుణములు శ్రేష్ఠమయినది. నీ బెడ

రింపులకు జడియుటకు నేనడవిలో ముక్కుమూసుకొని కూరుచుండెడు పశిష్ఠుఁడనుగాను. నన్నెవ్వనిగా భావించుచున్నావు? నీకంటెను బది రెట్లెక్కువ నేర్చిన యాస్థాన పరిహాసకుఁడను జుమా నేను.

హరి—మునిచంద్రా! తాను బరిహాసకుఁడనని యీబ్రాహ్మణుఁడే చెప్పుకొనుచున్నాఁడు. అట్టి పరిహాసకు నవ్వులాటమాటలను మీరుపాటిగాఁబట్టిరోషముచూపఁదగదు. కాలకూటవిషాగ్నినిమించెడు మీకోపానలమునకు బ్రహ్మేంద్రాదులును దాళఁజాలరన, మేమేపాటివారము? మీవంటిఘనులు పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రము వేయుదురా? కొడుకు లెప్పుడయిన బుద్ధిలేక తప్పుచేసినచో, తండ్రి శిక్షచేసి రక్షింపఁడా? ఇఁక మీకు దయవచ్చునందాఁక మీ పాదములనుండి లేవను. నన్ను నీటముంచినను శూలముంచినను దేవరదే భారము. (అని మరల పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

చంద్ర—ఓమహాత్మా! మారక్షణభారము మీది. ఈతప్పు బుద్ధిపూర్వకమైనది కాదు. ఎఱుఁగక చేసినతప్పును మీవంటిసత్వగుణప్రధాను లయిన మునిసత్తములే క్షమింపకపోయినయెడల మఱి యెవ్వరు క్షమింతురు?

విశ్వా—(శాంతతతో) ఓరాజేంద్రా! పాదములమీదనుండి లెమ్ము. ఋషులకెప్పుడును దీర్ఘరోషము గూడదు. నీవిప్పుడు పశ్చాత్తాపముగలవాఁడవయి భార్యాపుత్రులతో మాపాదములమీఁదఁ బడి యింతగాఁ బ్రార్థించుచున్నావు గాన నీదీనత్వమును జూచి కరుణించి నీయపరాధముల నన్నిటిని మఱచిపోవుచున్నాము. నీకు మాయెడల నిజమైనభక్తి యున్నయెడల, నీవుచేసిన యపరాధమునకుఁ బ్రాయశ్చిత్తముగా మాకూఁతులైన యీమాలెతలను వరించి మాకు మనఃప్రీతిచేయుము. నిన్నిప్పుడు క్షమించెదము.

హరి—(చేతులు జోడించి నిలిచి) సర్వధర్మవిధులయిన దేవ రవారికి నేను ధర్మములు చెప్పునంతటివాఁడను గాను. ధర్మతత్త్వము లన్నియు మీకుఁ గరతలామలకములయి యుండును. లోకములో మీరెఱుఁగనిధర్మములు లేవు. అట్టి సకలధర్మవేత్తలయిన మీరే ధర్మవిరుద్ధమయిన యీపని చేయుమని నియోగించుట యర్హమగునా నామనసుకనిపెట్టవలెనని మీరిట్లానతిచ్చి యుందురు. కానివర్ణాశ్రమ ధర్మపరిపాలన పరులయిన తమరిటు మనఃపూర్తిగాఁ బనిచియుండరు.

విశ్వా—ఏమి? నీవేమాకిప్పుడు ధర్మోపదేష్టవుగా, గనఁబడు తున్నావు! నీకుమాకంటెను ధర్మము లెక్కువ తెలియునుగా? నీవు సుఖపడగోరుచు వేని, అన్యచింతమాని వీరిని వరింపుము. మామాట దాటక వీరి నిప్పుడు చేపట్టితివా, నీతండ్రికివలెనే నీకును బొందితోనే స్వర్గలోకసుఖమును గలిగించెదము.

హరి—ఓమునివర్యా! ధర్మబాహ్యమయిన కార్యమును గురువు విధించినను జేయఁగూడదని మీవంటిపెద్దలు చెప్పుదురు. ఇఁక నామనోనిశ్చయమును వినుఁడు, కులధర్మమును మీతో పొందు స్వర్గసుఖముకంటెను ధర్మమార్గము నవలంబించుట చేత లభించెడు నరకదుఃఖమయినను నాకుఁ బరమప్రియము. నాకున్న రాజ్యమును సర్వసంపదలను విడువుమన్నను విడుతునుగాని ధర్మముమాత్రము నేనెన్నఁడును విడువఁగలవాఁడను గాను. మీరిఁక నన్నేమి చేసినను జేయుఁడు. ఇవిగో నాయర్థమును దేహమును మీయధీనములు.

విశ్వా—నీప్రతిజ్ఞకు మేము సంతసించినారము. నీవు సత్య సరస్వతివి. నీవిప్పుడన్నమాట తప్పఁగూడదు. ఏవీ నీరాజ్యమును ధనమును సర్వమును మాకు ధారపోయుము. మేమింతటితోఁ దృప్తి పొంది యాశ్రమమునకుఁ బోయి రాజ్యసుఖమునయిన ననుభవింపు చుండెదము.

హరి—(చంద్రమతివంకఁజూచుచున్నాఁడు.)

చంద్ర—ఓపాణేశ్వరా! మీరనుమానింపక వెంటనే మీ రాజ్యమునుమిగిలిన సర్వస్వమును యాచకోత్తముఁడయిన యీముని సత్తమునకు ధారాదత్తముచేయుఁడు. మీధర్మపత్నినయు యుండి నేనుమాత్రము మీసత్యమునకు ధర్మమునకును భంగము గలి గింతునా?

హరి—ఓమునిచంద్రా! ఈభూమి మొన్నమొన్నటిదాఁక మీ రేలినిస్సారమని విడిచిపెట్టినదేకాని క్రొత్తదికాదు. దీనినిమరల ననుభవింపవలెనని మీకుఁ గోరికపుట్టినయెడల మీరాజ్యమును మీరు మరల గ్రహించి నన్నుఁగృతార్థుని జేయుఁడు.

విశ్వా—నీ చమత్కార వాక్యము లింతటితోఁజాలును. ఈ తేనెమాటలకు మోసపోవువా రిం దెవ్వరును లేరు. ఇఁక జాగు చేయక ముందుగా నీసర్వసామ్రాజ్యమును మాకు ధారపోసి తరు వాత మఱి మాటాడుము.

హరి—పాత్రదానముచేత నేను ధన్యుఁడనగుచున్నాను. ఇదిగో స్వీకరింపుఁడు. గాలవా! ఆజలకలశ మిటు తెమ్ము.

గాల—(ఇచ్చుచున్నాఁడు)

హరి—(పుచ్చుకొని) అస్మత్కులసామ్రాజ్య ధనకనకవస్తు వాహనాని శ్రీపరమేశ్వరప్రీత్యర్థం ధారాపూర్వకం బ్రాహ్మణాయ తుభ్య మహం సంప్రదదే నమమ. (అని చేతిలో ధారపోయు చున్నాఁడు)

విశ్వా—(గ్రహించి) ఓరాజేంద్రా! నే నిప్పుడు కొంతవఱకు సంతుష్టాంతరంగుఁడయినాను. మీశరీరములయందున్న యీయాభర ణములుకూడ నీవు మాకిప్పు డిచ్చిన సర్వస్వములోనివే గనుక నీ యలంకారములును నీభార్యాపుత్రుల యలంకారములునుగూడ నిప్పించి మమ్ము సంపూర్ణసంతోషులం జేయుము.

హరి—నేను ధన్యుఁడ నగుచున్నాను. ఇవిగో బుచ్చుకొనుడు. (అని తీసియిచ్చుచున్నాఁడు)

చంద్ర & లోహి—(తమనగ లిచ్చుచున్నారు)

విశ్వా—(పుచ్చుకొని) ఇది యంతయు సరేకాని మేమయోధ్యకుఁ బోయిన తరువాత నీమంత్రులు మొదలయినవారు మమ్ముఁ జేరనీక తతిమి రాజ్యమియ్యకపోయిన యెడల, మేమేమి చేయఁగలము? నీ విప్పుడు మాతోఁగూడ స్వయముగా వచ్చి రాజ్యము మాకిప్పించి తరువాత నీయిచ్చవచ్చినచోటికిఁ బొమ్ము.

హరి—స్వామీ! అంతకంటెను నాకుఁ గార్యమేమున్నది? మీచిత్తమువచ్చినట్లు చేసెదను. పట్టణమునకుఁ బోవుదము విజయం చేయుఁడు. (అందఱు నిష్క్రమించుచున్నారు)

తృతీయాంకము

రంగము—అరణ్యమార్గము

[చంద్రమతీ లోహితాస్య సహితముగా హరిశ్చంద్రుఁడును, జనమిత్రుఁడు కామపాలుఁడు మొదలయిన పౌరులును ప్రవేశించుచున్నారు]

హరి—ఓపౌరజనులారా! ఈయరణ్యమార్గములయం దింకను మీరెంతదూరము నాతోవచ్చెదరు? నాప్రార్థన విన మీరిక్కడ నుండి మరలుఁడు.

జన—(కన్నుల నీరు పెట్టుకొనుచు) ఓ మహారాజా! చిన్ననాఁడు కన్న తల్లిదండ్రులను మఱచిపోయి తల్లియుఁ దండ్రియు జుట్ట

ములును సమస్తమును మాకనీవే యనుకొని, కలలోను గష్టము లన్నమాట యెఱుఁగక చిరకాలమునుండి మేము తల్లిచాటుబిడ్డల వలె మీపాలఁబడి సుఖంపుచున్నాము. అట్టిమే మిప్పు డెట్లు మిమ్ము విడిచి మరలి పోగలము? మేమును మీపాదసేవ చేయుచు మీవెంటనే వచ్చెదము.

కామ—ఓసార్వభౌమా! అనాథులమయిన మమ్మెవ్వరికొప్పగించిపోయెదవు?

చ. తడవుగఁ జిల్కలం బెనిచి దారుణలీలను గండు బిల్లికిన్
గడపట నప్పగించి చనుకైవడి, మమ్మిటు లింత కాలమున్
గొడుకులకన్న నెక్కుడుగఁ గూరిమి నారసి మీరిప్పుడీ
చెడుమునివాతఁద్రోచినఁ జెల్లునె నిర్దయవృత్తి నక్కటా!

చ. నిలువఁగ నీడయున్ గుడువనిచ్చలుఁ దియ్యనిపండ్లునిచ్చి, గా
డ్పులకును నెండవానలకుఁ బ్రోపయి ప్రాపయియున్నవృక్షమున్
దొలఁగినిమేషమేని ధృటిదూలక పక్షులు నిల్వఁ జాలునే?
పలుకు లిఁ కేల? దిక్కటిన పక్షులమే యయినార మియ్యెడన్.

ఇన్ని నాళ్ళును గష్టపాటన్న నెట్టిదో యెఱుఁగక మీచాటున బ్రతుకుచున్న గంగిగోవులవంటి మమ్మాదురాగ్రహశీలుఁ డయిన మునిశార్దూలునిపాల విడిచిపోవ మామీఁద మీకింతకరుణయేల లేకపోవలెను?

హరి—ఓపౌరజనులారా! మిమ్ము నేనుదయలేక విడుచుచున్నానని మీరెప్పుడును స్వప్నమందును జింతింపఁబోకుఁడు. ఈ విశ్వామిత్రుఁడు తపోధనులలో నెల్లను బరమపవిత్రుఁడు; విశుద్ధచరిత్రుఁడు. ఈమునిసత్తమునిమహత్వ మెఱుఁగనివారగుటచే మీరీ లాగునఁ దెలియనిమాటలుపలుకున్నారు. ఈతఁడుపూర్వముచిరకాలము సకలజనరంజకంబుగాఁ బ్రజాపాలనముచేసినమహానుభావుఁడు. ఈయన

సత్పరిపాలనముచేత మీరును ముందత్యల్పకాలములోనే యనంత సౌఖ్యముననుభవింపుచు నన్నుమఱవఁగలరు. నిర్విచారముగా మీరు మీయిండ్లకుఁబొండు.

జన—అకారణముగా రాజ్యమంతయుఁబుచ్చుకొని, నగలపహరించి, కట్టుబట్టలతో నరణ్యములకు సాగనంపి, మీవంటిపరమసాధువులకే యింతలేసియపకారములుచేసిన మహాత్ముఁడు మమ్ము మాత్రముసంరక్షించి మాకుపకారము చేయునన్న మే మెట్లునమ్మగలము? గోహింసకు సంకోచింపని క్రూరవ్యాఘ్రము మేఁకలనుమేపి కాపాడునా! మాకీవట్టిభ్రమలు కల్పించి యడియాసలు పెట్టక మమ్ము మీవెంటఁ గొనిపొండు.

కాహ—ఓ మహారాజా! సాధుబాధకు వెనుదీయని యీయన దయాగుణమును మావద్దఁ జెప్పఁబోకుము. మీధనకనక వస్తువాహనాదులకు క్రూరచిత్తుఁడయి కయికొన్న యీతనికి దయయెక్కడిది? సర్వసంగపరిత్యాగినని యడవులలోఁ దపస్సు చేసెడి యీతని కీ యిహలోకసంపద లేలకావలసి వచ్చెను? ›

చ. ఒనరుగృహాదిభోగములు యోగములే? ప్రతివృత్తి వ్రేల్ప నిం
ధనములె యాధనంబులు? రణన్మణిభూషలు వేదఘోషలే?
మొనసినపూవుఁదోఁటలు తపోవనవాటులె? రాజ్యమాజ్యమే?
మునికి నివేల భూవిభవముల్? వెత పెట్టఁగఁ గాక సాధులన్. 3

హరి—ఓపౌరులారా! పెద్దలను మీరట్లనఁగూడదు. మహాత్ముల చిత్తవృత్తులు మనవంటివారికి విదితములు కావు. మమ్ముఁ కృతార్థులను జేయఁదలఁచియే వారీధనకనకాదిసంపదలు స్వీకరించిరి కాని, ముముక్షువు లయిన తమకుఁగావలసి కాదు.

క. జనకులు నగ లిడఁ గొడుకుల
కును జెవుల న్నొప్పి యెత్తఁ గుట్టించుగతిన్

నను ధన్యునిఁ జేయనె యీ
ఘనుఁడును గష్టములు నాకుఁ గల్పించుఁ జుఁడీ. 4

ధనముపోయినప్పుడేపురుషుని యోగ్యతలులోకములోఁ దెలియనగును. కాఁబట్టి నాధన మాతఁడు గ్రహించుట నామేలుకొఱకే. ఇఁకముందు నేను మీకందఱకును నాస్వచ్ఛగుణముతో నగపడుదును.

చ. వినుఁడు ధనంబు భీరులను వీరులఁ గాఁగను దోఁపఁ జేసెడున్;
ఘనతరబుద్ధిమంతులఁగఁ గన్పడఁ జేయును బుద్ధిహీనులన్;
బనుపడఁ దోఁపఁ జేయు గుణవంతులఁగా గుణహీనులన్; సదా
జనులను మోసపుచ్చి ధనసంపద చిత్తము మత్తుగొల్పెడున్. 5

ఇట్లు మోసము చేయని దొక్కబీదతనమే.

చ. కనకము శుద్ధ మాటయును గల్మషదూషిత మాట తిన్నఁగా
ననలముచేతనే యెఱుఁగ నయ్యెడుకైవడి, భూమిలోపలన్
జనుఁడు విశుద్ధుఁ డౌటయు నిజంబుగఁ దాఁ గలుషాత్ముఁ డౌటయున్
వినికిడి చేయు స్పష్టముగ బీదతనంబె జగజ్జనాళికిన్. 6

జన—దేవరవారు సెలవిచ్చినట్లు పేదవారిని మంచివారినిగఁ జేయలేకపోయినను మంచివారినిసహితము చెడ్డవారినిగాఁదోఁపించెడి దుర్గుణ మొకటి బీదతనమునందుఁగూడ నున్నది. కాఁబట్టి బీదతన మెప్పుడును మంచిదనరాదు.

చ. సిరులు తొలంగినన్ సఖులు చేరరు; చేరువ రారు బంధువుల్;
కరముఁ దిరస్కరించుఁ గులకాంతయు; లోకులు సద్గుణంబులన్
సారిదిని దుర్గుణంబులుగఁ జూతురు; పేదరికంబుకంటెఁ దా
మరణమె శ్రేయ మంచుఁ బలుమాఱును నేమదిలోఁదలంచెదన్. 7

క. జీవించినంతకాలముఁ
దా వేదనలన్ ఘటించు దారిద్ర్యమిలన్;
చా వన్న నొక్కనిమిషమె
యావేళను బాధ పెట్టు నవనీజనులన్. 8

హరి—నీవన్నమాట కొంతవఱకు సత్యమే కాని పామర జనులవలన గౌరవము పోవు నని బీదతనము వచ్చినంతమాత్రముచేత నెవ్వరును సిగ్గు పడవలసిన పని లేదు. లోకములో ధనికుఁ డన్న స్థిరమయిననీతిసంపద గలవాఁడే కాని చంచల మయిన కాంచన సంపద యున్నవాఁడు కాఁడు. బీదవానియొద్దనున్నను ధనికునియొద్ద నున్నను నీతి యెప్పుడును నీతియే. దానిగౌరవముదానిదే.

ఉ. నీతికి హేమభూషణమణిప్రకరంబుల వన్నె రాదిలన్;
నీతికి వన్నె పోదు ధరణిన్ వెలమాలినచింపిగుడ్డలన్;
నీతికి గౌరవం బెపుడు నిల్చుఁ జుమీ సహజంబుగానె; వి
ఖ్యాతిగ నీతివర్తనము నందఱు మానక యుండఁగానలెన్. 9

ఈరీతిగా బీదతనము వచ్చినందుకు నేను లేశమును జింతపడనుగాని ఇఁక నతిథులును నభ్యాగతులును మునుపటినలె నావలన సత్కారమును గానక శూన్యమయిన నాగృహమును జూచి యుస్సురని పోవలసినవా రగుదురుగదా యని మాత్రము విచారపడుచున్నాను.

జన—ద్యూతాదులచేతఁ గాక యోగ్యదానముచేత ధనము కోలుపోయిన మీరంతగాఁ జింతిల్లవలసిన పనిలేదు.

క. సరి లేని దానమహిమన్
సిరులం బోఁగొట్టుకొన్న శ్రీమంతుఁడొగిన్
ధరలోన సానఁ బట్టిన
వరరత్నముఁ బోలి మిగుల వన్నెకు నెక్కన్. 10

అయినను దారిద్ర్యము మిక్కిలి దుస్సహమయినదే. అందులోను గష్టపడి సుఖపడవచ్చునుగాని సుఖపడి కష్టపడుట మిక్కిలి దుర్భరము. కటకటా! మహారాజపదవినుండి నిరుపేదతనము నొంది మీరీకష్టముల కెట్లు సహింపఁగలుగుదురు? ఋషివేషముననున్న క్రూరచిత్తుఁ డయిన యాకిరాతుఁడు నిర్నిమిత్తముగా మీకిట్టిపాట్లు తెచ్చిపెట్టెనుగదా?

హరి—ఓజనమిత్రా! నీవు విశ్వామిత్రుని బరోక్షమున నిందింపఁ బోకుము. ఆమహర్షియే యిప్పుడిక్కడఁ బ్రత్యక్షమయిన పక్షమున మీ గతి యేమి గావలసియుండును?

(తెరలో విశ్వామిత్రుఁడు)

ఉ. పోకుర పోకు మెచ్చటికిఁ బోయెదు మమ్మిటు మోసపుచ్చి? నీ
వోకలుపాత్మ! నిల్వు మిట నొక్కనిమేషము; పోయినంతనే
నీకణువైన దక్కఁగను నేర్చునె బ్రాహ్మణవిత్త మోరి దో
షాకర! విప్రవిత్త మపహర్తలఁ జంపుఁ జుమీ విషాభమై. 11

జన—విశ్వామిత్రుఁడు రౌద్రాకారముతో నిక్కడకే వచ్చుచున్నాఁడు. నేనిప్పు డన్నమాట విని యుండఁడుగదా!

హరి—ఓపౌరులారా! విశ్వామిత్రునికంటఁబడకమునుపే మీరు వాటిపొండు. మీ వ్యర్థప్రయత్నములు మాని యిల్లు చేరి సుఖింపుఁడు. పొండు.

జన—ఇకుమలు గుడువుఁ డని విధి మానొసట వ్రాసిపెట్టగా, మే మెట్లు పోకుండఁగలము? అమ్మా! చంద్రమతీ? మేము పోయి వచ్చెదము. మమ్ము మరచిపోకుము. ఇన్నాళ్ళును మిమ్ము మాకన్న తల్లివలెఁ జూచుకొని మీ చల్లదనముచేత మీచాయను సుఖించు చుంటిమి. దైవమోర్వలేక మాకిప్పుడాభాగ్యము లేకుండఁజేసినాఁడు. (అని యేడ్చుచుఁ బౌరులు పోవుచున్నారు.)

[అప్పుడు విశ్వామిత్రుఁడును శిష్యుఁడగు నక్షత్రకుఁడును బ్రవేశించుచున్నారు.]

విశ్వా-ఉ. పోకుర పోకు మెచ్చటికిఁ బోయెదుమమ్మిటుమోసపుచ్చి?నీ
వోకలుపాత్మ!నిల్వుమిట నొక్కనిమేషము; పోయినంతనే
నీకణువైన దక్కఁగను నేర్చునెబ్రాహ్మణవిత్త మోరి దో
షాకర!విప్రవిత్త మపహర్తలఁ జంపుఁజుమీవిషాభమై 12

నేను మఱియెవ్వఁడను గాను! విశ్వామిత్రుఁడను జుమా! నాసొమ్ము నీకు దక్కినదనుకోకు.

హరి—ఓమునికులతిలకా! ఇదియేమి? నేను నాసామ్రాజ్యమును వస్తువాహనములును సమస్తమును మీకే సమర్పించి పట్టపగలు కట్టుబట్టలతో లేచివచ్చుచున్నను మీధన మపహరించినాఁడనని నావెంటఁ బడుచున్నారు!

విశ్వా—ఏమీ! ధనరాజ్యమదాంధత! నాఁడు మాకు యజ్ఞార్థము ధనమిచ్చిన మాటకూడ నీవప్పుడే మఱచిపోయినావుగా! ఆధన మప్పుడు మేము నీయొద్దనే, యునిచిపోలేదా? మాధనమును మరల మాకప్పగింపక పాఱిపోవుట నీకు న్యాయమగునా? మేము పరాకుపడినను నీవు మాకు స్మరణకుఁ దేనక్కఱలేదా?

హరి—ఓమునిసార్వభౌమా! లేనిపోనియప్పు నామీఁదబెట్టి యన్యాయముగా నన్నిట్లు చిక్కులుపెట్టుట మీకు ధర్మముకాదు. మీయజ్ఞమునిమిత్తము నేనిచ్చెదనన్నసొమ్ము మీకింతకు మునుపప్పగించిన ధనములోనే యున్నది.

విశ్వా—ఏమిరా! నీకండక్రొవ్వు! నీవన్యాయమున కొడిగట్టి యెదురుకెదురు మేమే న్యాయము తప్పినవాన మయినట్లు చెప్పుచున్నావు! నీవు మొన్న యరణ్యములో నీవద్దనున్న సర్వస్వమును నాకు దానమిచ్చి నప్పుడు దానవాక్యములో నే నప్పుడుదాచనిచ్చినధనము తక్కఁ దక్కినదానినిమాత్రమే యిచ్చినానని చెప్పినావా? ఈధనము నిమిత్తమయి నీ వేల బొంకులుపలికెదవు? ఇంతకన్న నాకు దానమే యియ్యలేదని చెప్పరాదా? నీవట్లు బొంకినపక్షమున నీవద్ద నేను దాఁచుకొన్నధనమంతయు విడిచిపెట్టుటయే కాక నేఁడు నీవద్ద గైకొన్నరాజ్యమునుగూడ నీకిచ్చివేసి నే నీ గోచిపాఁతతో లేచిపోయెదను.

హరి—ఓమునీంద్రా! ఈరీతిగా విపరీతార్థకల్పనము చేసినచో నే నేమియు మీయెదుట బదులు చెప్పఁజాలను. మీకుఁ బుచ్చుకొనుట న్యాయమని తోఁచినపక్షమున మీధనమునుమీకు నాతలతాకట్టుపెట్టియైనను, నెలదినములలో సమర్పించెదను. అంతేకాని ప్రాణము పోయినను నాజిహ్వ యసత్యమెప్పుడును బలుకదు. నాతండ్రి సత్యవంతుడు; సత్యమే నా కతఁడు విడిచిపోయిన ముఖ్యదాయము. జంగమస్థావర రూపమయిన నాపిత్రృధన మంతయుఁ ద్రృణప్రాయముగా మీకు విడిచితినిగాని మీవంటివారు పదివేలుపచ్చి యాచించినను పీడించినగూడ సత్యరూపమయిన యీపిత్రృ ధనమును నేను విడువఁగలవాడను గాను.

విశ్వా—మేమిన్ని మాటలవారముగాము, మాకు న్యాయముగా ధనమురావలసియే యున్నది. మేము శాంతిధనుల మయిన మునుల మగుటచేత నిన్ను నిర్బంధించి క్రౌర్యము చూపలేము. నీవు కోరినట్లు ముప్పది దినములును గడు విచ్చినారము. మా శిష్యులలో నెల్లను సదాచారుఁడయినయీమునికుమారుని మీవెంటఁ బంపుచున్నాము. మాధనము నీ వీతనిచేత నిచ్చి పంపివేయుము.

నక్ష—ఓగురువర్యా? నాబత్తెముమాట చెప్ప మఱచిపోయినారు.

విశ్వా—నేనుజెప్పనక్కరలేదు. ఉచితజ్ఞుఁడైనయీతఁడే నిన్నుసంతోషపెట్టును.

హరి—ఓమునిసార్వభౌమా! అనుగ్రహించి మమ్మింతటితో విడిచిపెట్టుము. మితిదినములలోపల మీ ధనమును మీకు సమర్పించుకో లేకపోయినయెడల మమ్ము విక్రయించియైన మీరుమీవిత్తము రాబట్టుకోవచ్చును.

విశ్వా—నీవేది చెప్పినను దానికెల్లను మే మొప్పుకొను చున్నాము. ఈబాలుఁడు నాప్రియశిష్యుఁడు; ఈతని పేరునక్షత్రకుఁడు. ఇతఁడు కొంచెము కోపస్వభావుఁడు. మీరు వీనిపరుషభాషణములకు రోషపడక కుఁడఁగట్టుకొని రావలెను. ఇతఁడు బహుసుకుమారుఁడు; ఎన్నఁడును మార్గాయాసమున కోర్చినవాఁడుకాఁడు. వేళపట్టున వీనికన్నపానాదు లిచ్చి వీనిని మీరెట్లాదరించెదరో ! నేనుబోయి వచ్చెదను. (అని విశ్వామిత్రుఁడు బోవుచున్నాఁడు.)

హరి—ఓమునికుమారా! నీవు ముందు నడువుము. మన మిప్పుడు బయలుదేఱి యీమార్గంబునఁ గాశికాపురమునకుఁ బోవుదము. ఓప్రాణేశ్వరీ! నామూలమున నీకెంతదురవస్థ తటస్థించినది! ఆగర్భశ్రీమంతురాల వయిననీవిప్పు డీకటికినేలను ముండ్లలోను నడువవలసినదానవయినావుగదా? (అందఱు నడుచుచున్నారు.)

చంద్ర—ఓప్రాణనాథా ! నానిమిత్తమై మీరెంతమాత్రమును విచారింపఁబనిలేదు. మీతో నుంటచే నాకిక్కడ సుఖముగానే యున్నది. మహారాజ్యభోగ మనుభవించిన మీరిట్లు దివ్యభవనములు విడిచి మహారణ్యములలో సంచరించుచు నెట్లుకష్టపడఁగలరా యని మాత్రము నామనస్సు ఖేదపడుచున్నది.

హరి—(కన్నీరునించుచు) పరిచారికాశతములు సేవచేయ, సదా యంతఃపురములయందుండి, ఎండకన్నును నెఱుఁగకుండెడి నీది కాని నా దేమికష్టము? నీవు నాతో నెక్కడనుందువో నాకదే దివ్యభవనము; నీవు లేనిచోటే నాకు మహారణ్యము.

చ. అనవరతంబు ప్రాణపద మైనపదార్థముఁ గూడి యుండినన్
వనమును మందిరం బగు; విపత్తులు సారసుఖప్రదంబు లౌ
తనప్రియవస్తువున్ విడిచి దవ్వుగ నుండెడివాని కాప్తులన్
విను సుఖ మియ్యఁజాలరు· భువిం దనప్రాణమె భారమాఁజుమీ.

అయ్యో! నీకష్టములకుఁ దోడు నాకష్టములనిమిత్తమయి కూడ దుఃఖపడుచున్నావుగదా!

సీ. పికనాదముల కింత భీతిల్లిపఱచెదు
పులులయార్పుల కెట్లు నిలిచెదీవు?
విరిదోఁటలో నింత విహరింప వలసెదు
నట్టడవుల నెట్లు నడచెదీవు?
శశికాంతములపైనె చరణముల్ కందును
మొనరాళ్ళపై నెట్లు మోపెదీవు?
పసిఁడిమేడలమెట్లపయి నెక్కనోడెద
విచటిమెట్టల నెట్లు లెక్కెదీవు?
గీ. అలరుదీఁగె యింత తొలఁకఁద్రోయఁగ లేవు
పాఱుపాదల నెట్లు దూఱె దీవు?
కేళిశుకముఁ దడవు కేలఁ దాల్పఁగ లేవు
కొడుకు నెటు వహించి నడతు వీవు? 14

కటకటా! ఈశ్వరునకును మనమీఁద దయలేదు కాఁబోలును!

చంద్ర—ఈశ్వరునకు మనమీఁద దయయున్నదని మన సంరక్షణనిమిత్తము కత్తులును గటారులును దెచ్చి యిచ్చునా? మనయెడల నాతని కనుగ్రహ మున్నందుననే మన కాతఁడు నీతి పథమునుండి మరల మంచిబుద్ధిని దయచేసినాఁడు. ఆబుద్ధిని యెప్పుడును మన మాయుధముగా నుంచుకొని ప్రవర్తించితిమా రాళ్ళమీఁదఁ బరున్నను సుఖనిద్ర పొందుదుము. ఓప్రాణవల్లభా! ఇవి కష్టములని తలఁచి యేల చింతిల్లెదరు? ఈశ్వరుఁడు మనకు మనస్థైర్య మున్నదో లేదో పరిశీలించుటకయి యేర్పరచిన శోధనలే కాని యివి వేఱు కావు.

హరి—అవు నవును. నీవు చెప్పినది పరమసత్యము. ఆపదలు లేని సుఖదినములయందు మనుష్యుని యోగ్యతను దెలిసికొనుట కవకాశ ముండదు.

ఉ. ఆపద లొక్కటం దగులునప్పుడె ధీరుఁడు సుస్థిరుం డగున్;
కాపురుషుండు కష్టముల గాసిలి నిల్వక సంచలించెడున్
దాపునఁ దీవ్రమారుతము దండడి ముట్టిన, బెండు నిల్వగా
నోపక పాఱుచో నిలిచి యుండవె మ్రాఁకులు సుస్థిరంబులై? 15

నక్క—మీరు మహాపండితులవలె ధర్మోపన్యాసములు చేయుచుఁ బెండ్లినడకలు నడుచుచున్నారు. నాకుఁ గ్రింద కాళ్ళు కాలుచున్నవి; పైని నెత్తిమాడుచున్నది. నేను మిమ్ము వదలి ముందయినను నడువవల్లఁగాదు. మీరు నాకు గుదెకఱ్ఱలవలెఁ దగులుకొని నాకాలు సాగనీకున్నారు. మీసుకుమారత యంతయు నాయొద్దనే కనబఱుప నక్కఱలేదు. నాలుగడుగులు వేగిరము పెట్టుఁడు. ఇంతలోనే మీకాళ్ళు నొచ్చిపోవు.

హరి—ఓమునికుమారా! కోపపడకుము. మున్నెప్పుడును వీధిలోఁగాలుమోపియెఱుఁగని యీకోమలి పిల్లవాని నెత్తుకొని నడవలేక మెల్లఁగా నడుచుచున్నది.

చంద్ర—ఓబ్రాహ్మణోత్తమా! ఇదిగో నేనునడుచుచున్నాను. మీరునానిమిత్తమయి మెల్లఁగా నడువవలసిన పనిలేదు. వేగిరము కాలు సాగనిండి. అయ్యో! నాకాళ్ళ కీరాళ్ళు ముళ్ళవలె గ్రుచ్చుకొనుచున్నవి. (కాలు చూచుకొని) నాయఱికాలి నెంత లేసిపొక్కు లెక్కినవి! పిక్క లంతకంతకు లావయి నొచ్చుచున్నవి.

హరి—ఓప్రాణనాయికా! నీవెండబడి మిక్కిలి యలసినట్లున్నావు. నీమొగము వాడుపాటినది; చెక్కులఁ జెమ్మటలు కాలువలు కట్టుచున్నవి. లోహితాస్య నొకసారి నాచేతికిమ్ము. కొంచెము దూరము నేనెత్తుకొని నడిచెదను.

నక్క—(తనలో) ఈసమీపమున నెక్కడను నీళ్ళు దొరకవు నేనిప్పు డలసినట్టు నటించి, త్రాగుటకు నీరు తెమ్మని యీతనిని మఱింత చిక్కులుపెట్టెదను. (మిట్టనేలను గూలఁబడి నిట్టూర్పు విడిచి) ఓరాజా! నేనిఁక నడుగుదూర మయినను నడువలేను. దాహముచేత దేహము తాప మొందుచున్నది; కాళ్ళు తేళ్ళు కుట్టినట్టు మండుచున్నవి; నోరెండుకొనిపోవుచున్నది; నానాలుకను తడిలేదు; నా దురవస్థ నీతోఁబూర్ణముగాఁ జెప్పుకొనుటకు నోటమాటకూడా రాకున్నది. (హీనస్వరముతో) ఓమాలదైవమా! నన్నీయడవిలో దిక్కుమాలిన చావుచావుమని విధించితివా? ఓతల్లీ! నేనిఁక నిన్నుఁ జూడను గాఁబోలు! ఓగురువర్యా! ఇఁక మీకు శుశ్రూష చేయు భాగ్యము నాకు లభింపదు.

హరి—ఓఋషిపుత్రా! అధైర్యపడకు. నేనిప్పుడే పోయి యెంతైనను మంచినీరు వెదకి తెచ్చి నీదప్పి తీర్చెదను. ధైర్యము తెచ్చుకొమ్ము.

నక్క—(తడఁబడుచు) ఓరాజా! నీవు మరలి వచ్చినదాఁక నాప్రాణములు నిలువవు. నామన స్సెప్పుడు వృద్ధురాలయిన నా తల్లిమీఁదికి బోవుచున్నది. నాతల్లికి నే నేకపుత్రుఁడను. నీవు నా కియ్యఁదలఁచిన బత్తెమును బుత్రశోకముచేత విలపించుచుండెడు నా తల్లి కిచ్చి యోదార్పుము.

హరి—అయ్యో! ఊరుచేరకుండ మునికుమారుఁడు దారిలోఁ బడిపోయినాఁడుగదా! ఎంత ప్రమాదము సంభవించెను! ఇప్పుడితని నొక్కయూరుచేర్చి రక్షించు నుపాయ మేది?

చంద్ర—ఓప్రాణవల్లభా! మీ రక్కడ విచారించుచు నిలుచున్న కార్యములేదు. ఆలస్యమయిన నితఁ డేమగునో! మీరు శీఘ్ర

ముగాఁ బోయి యెందైన వెదకి నిర్మలోదకములు తెచ్చి బ్రహ్మ హత్యాదోషము రాకుండ నీతనిప్రాణములు నిలుపుఁడు.

హరి—ఇదిగో నే నుదకమునిమిత్తము పోవుచున్నాను. నేను వచ్చినదాఁక నీ వీతని కుపచారములు చేయుచుండుము. (అని పోవుచున్నాఁడు)

చంద్ర—(పైటచెఱఁగుతోవిసరుచు) ఓబ్రాహ్మణోత్తమా! నీవు వ్యసనపడఁబోకు. ఈమహారాజుగా రిక్కడ నున్నట్టే నీరు కొనివచ్చి నీకు దాహశాంతి చేయుదురు. ఆయన వచ్చులోపల నీవీ పండు తినుము. (అని యొకనారింజపండొలిచి తొనలిచ్చుచున్నది)

నళ—(తొనలు తిని లేచికూరుచుండి) అమ్మా! ఈఫల రసముచేతను నీవచనామృతముచేతను గొంతవఱకు దాహశాంతియై మరల నానోట మాటవచ్చుచున్నది. బ్రాహ్మణసేవచేత మిక్కిలి పుణ్యము గలదు. నా కాళ్ళు నొచ్చుచున్నవి. కొంచెము సేపుపట్టుము. (అని కాళ్ళు చాచుచున్నాఁడు)

చంద్ర—(కాళ్ళు పిసుకుచు) ఓవిప్రోత్తమా! కొంచెముప శమనముగానున్నదా?

నళ—ఓపతివ్రతాశిరోమణీ! నీయనుగ్రహముచేతఁ బ్రాణములు మరల మెల్లగా నాదేహము నిప్పుడు చేరుకొనుచున్నవి. నీవు దొడ్డయిల్లాలవు. ఆజన్మశ్రీమంతులయిన తల్లిదండ్రులకడుపునఁబుట్టి, మహారాజునింటఁ జొచ్చి, కష్టము లెట్టివో యెఱుఁగక నిత్యసుఖము లనుభవించుచుండెడు నీభర్తమూలమున మహారణ్యములలో దుస్సహకష్టములు పొందవలసినయోగము సంభవించినధికదా! అయ్యో! నీవెంత యభాగ్యురాలవు?

చంద్ర—ఓయి వెఱ్ఱిబ్రాహ్మణుఁడా! నీవు తెలియనిమాటలు చెప్పుచున్నావు. పెసిమిటితోఁగూడ నుండుటవలన నాకీకష్ట

ములు కష్టములు కావు. మహారాజుకూఁతురయినను భర్తకు బరిచారికయేసుమా ఈయరణ్యములకిట్లు రాఁబట్టియేస్వయముగాభర్తకు సేవచేసెడుభాగ్యమిప్పుడు నాకు లభించినది. నేనెంతమాత్రముభాగ్యహీనురాలను గాను. వేయి యాపదలు వచ్చినను నీతి తప్పక ప్రవర్తించెడు సద్భర్త పూర్వపుణ్యముచేత నాకు లభించుటచేత, ఇల్లాండ్రిలో నన్ను మించిన ధన్యురాండ్రెవ్వరును లేరు.

నక్క—అమ్మా! నీవు నావిషయమయి మిక్కిలి శ్రమపడుచున్నావు. నీయవస్థచూడఁగా నాకు జాలియు దయయుఁ బుట్టుచున్నవి. బ్రాహ్మణసేవ యెప్పుడును నిష్ఫలము కాఁగూడదు. నీవును నీపుత్రుఁడును నావెంట రండు. నేనువిశ్వామిత్రుని కాళ్ళను గడుపును బట్టుకొని బతిమాలి యొప్పించి నీకొమారునికిఁ బట్టాభిషేకము చేయించి మీరాజ్యమును మరల మీకిప్పించెదను. నీభర్త విషయమయి చెప్పిన యెడల మాగురువు నామాట వినునో వినకపోవునో కాని నీకుమారునివిషయమయి నామాట తీసివేయఁజాలడు.

చంద్ర—ఓబ్రహ్మచారీ! ఇప్పుడు నీవుచెప్పినఁ జెప్పితివికాని యిఁకముం దెప్పుడును నీవు నాతో నిటువంటిప్రసంగములు చేయఁబోకు. నాకు భర్తయెక్కడనుండునో యదియేరాజ్యము. అరణ్యములోనయినను నాకాతఁ డున్నచోటనే సమస్తసౌఖ్యములును గలుగును. ఎవ్వఁడో రాక్షసుఁడు పలుకవలసిన యీమాటలు బ్రాహ్మణుఁడవైన నీనోటినుండి వెడలఁగూడదు.

[అప్పుడు దంతఘాతకుఁ డను రాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు]

దంత—(తనలో) నా రాక్షసమాయచేత హరిశ్చంద్రుని దారి తప్పించి యీరాత్రి యూరుచేరకుండ బేతాళవటముక్రిందఁ బరుండునట్లు చేయుమని నన్ను విశ్వామిత్రుఁడు పంపినాఁడు. ఈ రాత్రి యిక్కడశయనించిరా మట్టిచెట్టుమీఁది బేతాళుఁడు వీరిని హింసింపక విడువఁడు. నాముని వేష మిప్పుడు సరిగానున్నదా? నా

చేతిలో రుద్రాక్షమాల మఱచిపోలేను. కుంపటిలోని బూడిదతోఁ ద్రిపుండ్రములు దిట్టముగాఁ దీర్చినాను. ఈవ్యాఘ్రాజినమునకుసమీపమున దండమును కమండలమును పదిలపఱచినాను. హరిశ్చంద్రుఁడు వచ్చెడి యీమార్గములోఁ దావళము త్రిప్పుచు, ముక్కుపట్టిఁ కన్నులు మూసికొని, జపము చేసికొనుచున్నవారివలె నభినయించెదను. హరిశ్చంద్రు డిప్పుడే వచ్చుచున్నాఁడు! (అని వ్యాఘ్రచర్మముమీఁదఁ గూరుచున్నాఁడు)

హరి—(ప్రవేశించి) నేనెంతదూరము తిరిగినను వృథాప్రయాసమే కాని నీటికొలఁ కెక్కడను గనఁబడలేదు. నేనాలస్యము చేసినయెడల నింతలో మునికుమారుఁ డేమగునో! వెళ్ళిన తరువాత నేనేపాపముమాట వినవలసివచ్చునో! హా దైవమా! ఈమునికుమారునకుఁ బ్రాణాపాయము రాకుండ రక్షించి మరల నీతనిని సుఖముగా గురువున కొప్పగించెడు సుకృతము నాకు లభింపఁజేయుము. అదుగో సమీపమున. నెవ్వఁడో యొకఋషి తపస్సు చేయుచున్నాఁడు. కన్నులు తెఱచి నావంకఁ జూచుచున్నట్టున్నాఁడు. అతఁడింతలోనే మరలఁ గన్నులు మూసికొన్నాఁడు. అతని కమండలములో జల ముండక మానదు. ఈఋషిని బ్రార్థించి కొంచెము జలము కొనిపోయి ఋషికుమారుని బ్రతికించెదను. (అని సమీపించి) ఓ తాపసోత్తమా! నీకు నమస్కారము.

దంత—(కన్నులువిచ్చి చూచి) ఎవఁడురా యిప్పుడు మా తపస్సునకు విఘ్నముచేసి మాయనుసంధానమును జెడఁగొట్టుచున్నాడు? (అని కన్నులు మూసి యాలోచించి తలయూఁచి) ఆహా! తెలిసినది. (కన్నులు తెఱచి) ఓరాజోత్తమా! కూరుచుండుము. నీ వృత్తాంత మంతయు మే మిప్పుడు దివ్యదృష్టిచేతఁ జూచినారము. నీవుహరిశ్చంద్రుఁడవు. సత్యపరిపాలనము నిమిత్తమయి నీసామ్రాజ్య

మంతయు విశ్వామిత్రునికి ధారపోసి భార్యాపుత్ర సహితముగా నరణ్యములలోఁ దిరుగుచున్నావు.

హరి—(తనలో) ఈమహానుభావుఁ డీశ్వరానుగ్రహముచేత మమ్ము దరిచేర్చవచ్చిన పరమతపోధనుఁడు కాఁబోలును? నా వృత్తాంత మంతయుఁ జూడఁగానే చెప్పినాఁడు. (ప్రకాశముగా) ఓమహాత్మా! నాకిక్కడఁ దడయఁగూడదు. అవలఋషి—

దంత—ఓరాజేంద్రా! నీవు వచ్చినసంగతియు మాకుజ్ఞాన దృష్టిచేతనే తెలియవచ్చినది. నీవు విన్నవింపవలసిన పనిలేదు. సొమ్మునిమిత్తమై మీవెంటఁ దరువువచ్చిన ఋషికుమారుఁడు పిపాసాతురుఁడయి పడిపోఁగా నీవు జలమునిమిత్తమై వెదకుచువచ్చి యెందును గానక జలమున్నచోటు చెప్పఁడని మమ్మడుగవచ్చినావు.

హరి—సర్వవిదులైన మీతో మనవి చేసికోవలసినపనిలేదు. మీకమండలములోని పావనోదకములను గొంచెముదయచేసి విప్రబాలునికిఁ బ్రాణదానము చేయుఁడు.

దంత—ఓరాజోత్తమా! ఈకమండలములోనివి మంత్రోదకములు. ఇవి యెవ్వరికి నియ్యఁగూడదు. జలమక్కఱలేకయే మా తపోబలముచేత ఋషికుమారుఁడు నీవు పోవునప్పటికి సుఖముగా మాట్లాడుచుండును. సూర్యాస్తమానము కావచ్చుచున్నది. మీరు పోయి చేరుటకు సమీపములో నూరేదియులేదు. ఆలుబిడ్డలతోఁ గ్రూరమృగబహుళమయిన యీమహారణ్యములో నీవీ రాత్రి యెట్లు వేగింపగలవు?

హరి—ఓమునివర్యా! ఈ రాత్రి భార్యాపుత్రాదులతో మేము విశ్రమించుటకు సురక్షితమయిన తావొక్కటి యనుగ్రహించి మమ్ము ధన్యులఁ జేయుము. మీపే రానతిచ్చినయెడల, మీ యాశ్రమమునకు వచ్చి యందీరాత్రి తల దాఁచుకొనెదము.

దండ—నాపేరు దంత. (తనలో) అయ్యో! ప్రమాదము సంభవించినదిగదా! తడవు మాటాడినయెడల నాగుట్టు బయలఁ బడకమానదు. నేను వేగిర మిక్కడనుండి తప్పించుకొని పోవలెను. నేను వచ్చినప్పుడు పేరు పెట్టుకొన మఱచిపోయినాను. ఏమని చెప్పను? జాబాలి యని చెప్పెదను. (ప్రకాశముగా) ఓరాజ చంద్రా! నీవేమో యడుగుచున్నావు. మాదృష్టి యంతయు నీశ్వర ధ్యానముమీద నున్నందున మాచెవులు నీమాటలను వినకున్నవి. మాపేరు జాబాలి; మాయాశ్రమము హిమవత్పర్వతమం దున్నది. మీరక్కడకు రాలేరు. మేము మాతపోమహిమచేత దివ్యమార్గ మున క్షణకాలములోఁబోయి చేరుదుము. మాకనుష్ఠానసమయము సమీపించినది. ఇఁక మాటాడఁదీరదు. మీరువచ్చి నాకుఁదిన్నఁగా నెదుటనున్న యీమఱ్ఱిచెట్టుక్రిందఁ బరుండుఁడు. (అని వ్రేలితోఁ జూపి యదృశ్యుఁ డగుచున్నాఁడు)

హరి—ఋషీశ్వరుఁ డంతర్ధానమయినాఁడు. ప్రొద్దును వ్రాలిపోయినది. పక్షులును మేఁతలనుండివచ్చి కొలకొలకూయుచు గూళ్ళ చేరుచున్నవి. ఇఁక జీఁకటిపడక మునుపే ఋషిపుత్రుని భార్యాపుత్రాదులను గొనివచ్చి యీచెట్టునీడకుఁ జేర్చెదను.

(అని నడచుచున్నాఁడు)

నక్ష—అమ్మా! చంద్రమతీ! రాజదేపోకగాఁ బోయినాఁడు. అతఁడు మనమిక్కడ నున్నవార్త మఱచిపోయినాఁడేమో! చీఁకటి పడుచున్నది. ఈయరణ్యమును దలఁచుకొనఁగా నాగుండెలు బద్ద లగుచున్నవి.

చంద్ర—ఓమునికుమారా! భయపడకుము. ఆఁడుదానిని నేనే భీరురాల ననుకొన్నాను. నీవు నాకంటెమభీరుఁడవుగానున్నావు! అదిగో

నాప్రాణేశ్వరుఁడు వచ్చుచున్నాఁడు. లేచిసిద్ధముగానుండుము. ఆతఁడు మరల నిప్పుడు భద్రముయిన చోటికిఁ దీసికొనిపోవును.

హరి—ఓనక్షత్రికా! జలము—

నక్ష—ఓరాజా! నాకు జల మక్కరలేదు. చీఁకటి పడకము నుపే నన్ను సురక్షిత మయిన శయనస్థలము చేర్చి బ్రతికింపుము.

హరి— ఓమునికుమారా! నా వెంట రమ్ము మనముపరుండఁ దావు చూచి వచ్చినాను. ఓప్రాణేశ్వరీ! లోహితాస్యుని వెంటఁబెట్టు కొని రమ్ము. మనము శయన స్థలమునకుఁబోదము.

(అందఱును నడుచుచున్నారు.)

చంద్ర—నక్షత్రికా! దారి చూచి నడువుము. అప్పుడేచీఁకటి పడినది. దారితిన్నఁగాఁ గనబడకున్నది.

హరి—అప్పుడే గాఢాంధకారము క్రమ్మి కన్నును మిన్నును గానరాకున్నది. ఓనక్షత్రికా! వచ్చుచున్నావా? ఈచీకటి యిప్పుడు మిట్టపల్లముల నేకము చేసినది.

నక్ష—నా దేహము కంపమెత్తుచున్నది.

క. పాములు కడు బుసకొట్టెడు;
నామూలను గాండ్రు గాండ్రు మనియెడుఁ బులులున్;
నామన సగలెడు భయమున
భూమీశా! పట్టుకొమ్ము పొదిగిట నన్నున్.

హరి—ఓమునికుమారా! నీకు వచ్చినభయములేదు. ఇదిగో నేను చేయి చాఁచుచున్నాను. నన్ను వచ్చి పట్టుకొనుము. ఇదిగో నీహస్తము దొరకినది.

లోహి—నాన్నగారూ! ఈచేయినాది.

నక్ష—(తడవుకొనుచు) ఓరాజేంద్రా! నన్ను గిల్లుచున్నా వేమి? నీహస్తము ముళ్లకంపవలె నెంతకఱకుగా నున్నది!

హరి—నీవు కంపమీఁద జేయి వేసినట్లున్నావు. నాకంత స్వరమునుబట్టి కొంచెము కుడివైపునకుఁ దొలఁగి నడువుము.

నక—(ఏడ్చుచు) ఓరాజేంద్రా! నన్నుఁ బాము కఱచినది కాఁబోలును! నా నడిమివ్రేలు చిమచిమలాడుచున్నది. ఏమిబుద్ధి? నాకిక్కడ విషవైద్యులెవ్వరు దొరకుదురు? మంగు వేయువా రెవరున్నారు? ఓయీశ్వరుఁడా! నేనీరాజుమూలమునఁ జూచుచుట్టమును ప్రముక్కదైవమును లేక మహారణ్యమధ్యమున దిక్కుమాలినపక్షినయి చచ్చి నక్కలపాలగుచున్నానుగదా! అయ్యో! తుదకు నాకు దహనసంస్కారమయిన లేకపోయెనా?

హరి—ఓమునీంద్రా! నీవు లేనిపోనియూహల మేల పడియెదవు? పాములుక్రింద నుండును గాని పయి నెక్కడ నుండును? నీకు గ్రుచ్చుకొన్నది. ముల్లు నీపిఱికి తనమును విడిచిపెట్టుము. చా విన్నిసారులు వచ్చునా?

ఉ. భీరుఁడు చావు చావనుచు వేమఱునుఁ మరణార్తినొందెడుఁ;
ధీరుఁడొ యొక్కసారియె మృతిం గనునప్పుడు బాధ నొందెడుఁ
ధారుణి దేహధారులకుఁ దప్పక చా వెపుడైన నుండఁగా;
నూరక చావుకై వగపు నొందఁగ నేటికి మాటి మాటికిఁ?

నక—ఓరాజా! బ్రాహ్మణోత్తముఁడ ననియైనఁ జూడక పిఱికినాఁడు చావులేకయే గడియగడియకును మరణవేదన నొందుచుండునని నన్నాక్షేపించుచున్నావుగా? ఈయాక్షేపణ మఱచిపోకుము. నేనే యుత్తమబ్రాహ్మణుకొడుకు నయినపక్షమున నే నెప్పటికైన నీపగ తీర్చుకొనకపోను. నేను బట్టుకొన్న యీహస్తమెవరిది?

హరి—నాదే నీవింక గుండెబెదరు తీఱి యుండుము. ఓలోహితాస్యా! నీవు మీయమ్మను విడువకున్నావా?

చంద్ర—లోహితాస్యుఁడు నాచంకనున్నాఁడు. మునికుమారుని మీఱువదలకుఁడు. మనమునిలువవలసిన చోటెంతదూరమున నున్నది?

హరి—ఇదిగో సమీపించినారము. ఈచెట్టుక్రిందనే మన మీరాత్రి విశ్రమింపవలెను. ఈయంధకారమునకుఁ దోడు నీలమేఘములు కూడ మనలను జుట్టుకొన్న మాయాంధకారమువలెనే యాకాశమునఁ గాఱుక్రమ్ముకొన్నవి.

నక్ష—నాకఱకాలు మొదలు శిరస్సువఱకును వ్యాపించి శీత జ్వరమువచ్చినట్లు కుదుపు వచ్చుచున్నది. మీ మాటలు చాలించి చలిపోవ నాకేవైన బట్టలుకప్పుఁడు.

హరి—ఓప్రాణేశ్వరీ! ఈమునికుమారునిశరీర మొత్తుకొన కుండఁ గొన్నిబట్టలు మెత్తగాఁ బ్రక్కవేసి, కొన్నిబట్టలు మీఁదఁ గప్పి మనమధ్యను బరుండఁబెట్టుము.

చంద్ర—అలాగే చేయుచున్నాను.

(అని చెప్పినట్లు చేయుచున్నది)

నక్ష—(పరుండి నిద్రపోవుచున్నాఁడు)

హరి—ఈతఁ డెంతలో నిద్రపోయినాఁడు! ఆహా! ఏమి ఈతనిగుఱ్ఱు పయియుఱుములతో నియ్య మంచుచున్నది!

చంద్ర—వర్ష మారంభ మయినది. ఆకులమీఁద జినుకులు పడుచున్నవి.

హరి—లోహితాస్యునిగూడఁ బరుండబెట్టి పయిని బట్ట కప్పినావా?

చంద్ర—నాచీర చెరఁగు కప్పినాను. ఈవాన సంతతధారగాఁ బడుచున్నది. ఈయుఱుములును వర్షధారలును జూడఁగా, ఆకాశము మనకష్టములనుజూచి యేడ్చుచు గన్నీరు విడుచుచున్నట్లున్నది.

హరి—ఓప్రాణేశ్వరీ! ఈమఱ్ఱికొమ్మలనుండి దిగజాఱెడి వర్షధారలను జూడుము.

క. మెఱుముల వెలుఁగున నల్లవె
వఱలెడుఁ గొమ్మలను జాఱువర్ష పుధారల్
మఱిమఱి లావై నిడుపై
యొర పగుచున్నట్టిమట్టియూడ లనంగన్. 18

(కొంచెముసే పూరకుండి) నాప్రియురాలికిఁగూడ నిద్ర పట్టినట్టున్నది. వాన యింకను దిన్నగాఁ బోకపోయినను మార్గాయాసపడియున్నప్రాణము లగుటచేత వీరి కందఱికి గొడుగువలె నున్న యీవిశాలశాఖక్రిందఁ గునుకుపట్టినది. ఇఁక నే నీ కత్తిని ధరించి వీరికిఁ గావలికాచెదను. ఈబ్రాహ్మణునిగుఱ్ఱు చూడఁగా, నాకీచెట్టుమీఁదఁబిశాచములున్నను బెదరి దిగిపాఱిపోవునని తోఁచుచున్నది. ఈమట్టియూడనుండి భల్లూకమో యేదో దిగుచున్నట్టున్నది. (అని నిలిచి చూచుచున్నాఁడు.)

భూతము—పెద్దకాలమునకు నాకు మనుష్యమాంసము లభించినది. ఈబాలకు నెత్తుకొనిపోయెదను.

హరి—ఓహోహో! ఇది భూతమువలె నున్నదే! (అని చేరఁబోయి యొకభూతమును జుట్టు పట్టుకొని యీడ్చుకొను వచ్చుచున్నాఁడు.)

భూత—ఓమహాప్రభూ ! నన్నువిడిచిపెట్టుము. నేనీవృక్షము నాశ్రయించియుండు కపాలకుండలుఁ డనుపిశాచరాజు సేవకుఁడను. సంచారార్థము పోయియుండిన మారాజీపాటికి వచ్చుచుండును.

హరి—మేమున్నచోట భూతములుండఁగూడదు. భయార్తుని సంహరించుట ధర్మము కాకపోయినను నీవు మావారిమీఁదికి దిగి వచ్చినందునకయి నిన్నూరక పోనియ్యరాదు. ఈకత్తితో నీముక్కప్పుడు కోసి మఱి వదలిపెట్టెదను. దిక్కున్న యెడల నీవుపోయి నీనాయకునితోఁ జెప్పుకొమ్ము. (అని ముక్కుకోయుచున్నాఁడు.)

భూత—(పెద్ద పెట్టున నేడ్చుచు ముక్కు చేతఁబట్టుకొని పరుగెత్తుచున్నాఁడు.)

హరి—అదియేమి ? ఈ చెట్టుకొమ్మలనుండి కోఁతులవలె గుభిల్లునదుమికి భూతములు కాఁబోలును నానాముఖములఁ బరుగెత్తుచున్నవి. ఆవైపున నాకోలాహలమేమి?

[తెరలో బేతాళుఁడు.]

శా. ఔరౌరా! యొకమానవాధముఁడు మిమ్మత్యంతగర్వంబునన్
దోరింపం గమకించెనే? యితని నార్తు న్నాసికం గోసెఁగా?
వీరుండైనకపాలకుండలుని నన్ విన్నాఁడె? యీశుంత దు
ర్వారం బైనమదీయకోపశిఖలో ప్రమందు న్నిమేషంబునన్.

హరి—ఇప్పుడు నాచేత ముక్కు చెక్కఁబడినవాఁడు పోయి తనప్రభువైన బేతాళుని గొనివచ్చుచున్నాఁడు. వీరికి నిద్రాభంగము కలుగకుండ నేను వీనిని దూరముగాఁ గొనిపోయి యీశితాసిచే శిరస్సు ఖండించెదను.

[కపాలకుండలుఁడు ప్రవేశించుచున్నాఁడు]

కపా:—

శా. ఓరీ! నీ విటు కండ క్రొవ్వున మదీయోర్వీజముం జేరి శం
కారాహిత్యమునన్ మదీయభటులన్ గారించినా వేమిరా?
ధీరుల్ మెచ్చఁగ ని న్వధించి యిపు డర్థి న్మద్భటశ్రేణికిన్
గూరల్ చేసెద నీదుమాంసచయముల్ గొంతుబ్బభక్షింపఁగన్

హరి:—

శా. ఓరోరీ! వదరంగఁ బోకు మిట గర్వోక్తుల్గడుం బ్రేలినన్
గ్రూరాసిం గొని యీకరంబుననె నేఁద్రుంతున్ శిరంబియ్యెడన్;
ఘోరాకారత నున్ననీతను విటన్ ఝుత్పీడ పోవంగ నా
హారం బౌఁ బదివేలనక్కలకు నత్యంతంబు సంతృప్తిగన్. 21

పంచచామరము. కరంబు గూర్కియున్నవీరు గాసి చెందకుండఁగా
బిరాన దవ్వు గాఁగఁ బొమ్ము ప్రేల కింక నిచ్చటన్,
దరంబు మాలి నిల్చితేని దవ్వు గొంచుఁ బోయి నీ
శిరంబు ద్రుంచువాఁడ గత్తిచేత నొక్క వ్రేటునన్. 22

కపా:—

ఉ. ఏమిర! కండకావరము? హీనమనుష్యుఁడె నన్నుఁ ద్రుంచుఁగా?
యీమహిషేఁడు నేనుభుజియింపఁగఁగంటి మనుష్యమాంసమున్
సోమరి యాచు వంటయిలు చొచ్చెను గుండెలు; తప్పిపోవునే?
చీమల భల్లుకంబువలెఁ జెంగున మిఁగెద మిమ్ము నండఱన్.

(అని మీఁదికి వచ్చుచున్నాఁడు.)

హరి—(వారిని జుట్టు పట్టుకొని పిడికిలియెత్తి)

మ. ఇదిగోఁ జూడుము వజ్రపాతనిభమౌ యీముష్టిఘాతంబునన్
బదియార్వక్క లగున్ శిరం బిచటఁ గాల్వల్గట్టఁ గ్రొన్నెత్తురుల్
ముదముం జేసెద నింక నీవటమహాభూజంబుక్రింద న్నిశల్
నిదురం జెందెదు పాంథలోకమునకు న్నేఁ డాదిగా దుర్మతీ! 24

(అని యీడ్చుకొని పోవుచున్నాఁడు.)

[తెరలో]

కపా-ఉ. భూతములారా!రండు; పెనుభూత మొకండిదెనన్నుఁ బట్టిని
ర్ఘాతసమానముష్టిహతి వ్రచ్చె శిరంబు; కరంబు ముక్కునన్
వాతను నెత్తురుల్ వఱదవాఱెడు; మీప్రభు నన్నుఁగావరే;
భీతి వడంకెడున్ దనువు; పెల్లుగఁ బ్రాణము తల్లడిల్లెడున్ 24

నక—(ఉలికిపడిలేచి) అయ్యో! పిడుగువంటిశబ్ద మేదో నా చెవులఁబడి గుండెలు పగులుచున్నవి. నా దేహము కంపమెత్తుచున్నది; ఈ వెలుతు రెక్కడిది? వీరందఱు దేహము లెఱుఁగక పడి నిద్రపోవుచున్నారు. హరిశ్చంద్రుఁడు మమ్ము విడిచి పారిపోయినట్లున్నాఁడు.

ఎవ్వఁడో యీ యూడలనుండి దిగి పాఱిపోవుచున్నాఁడు. ఓచంద్రమతీ! ఓలోహితాస్యా! లెండు లెండు. మన మీ యర్ధరాత్రి నిద్రపోయి మోసపోయినాము.

చంద్ర—(లేచి కన్నులు నలుపుకొనుచు) ఓబ్రాహ్మణోత్తమా! చెడుకలగనిపలవరించుచున్నావాయేమి? మేము నీచెంతనే యున్నాము. భయపడకు నీకు నిద్రలోను భయమే.

నక్ష—నన్నొంటివానిని జేసి మీరందఱు నిద్రపోవుచున్నారు. ఏదోభూతము చెట్టుమీఁదినుండి దిగి నామీఁదనుండి పరుగెత్తినది. నేనెట్లు భయపడకుండఁగలను? నాభయమే నన్ను రక్షించుచున్నది.

చంద్ర—భూతమును లేదు పిశాచమును లేదు. మరల ముసుఁగుపెట్టుకొని మాటాడక పరుండుము. నీకేదో పీడకలవచ్చినది.

నక్ష—కలకాదు. నేనీకన్నులతోఁ బ్రత్యక్షముగాఁ జూచినాను. ఈమఱ్ఱియూడనుండి దిగి పరుగెత్తినది.

చంద్ర—(తేఱిపాఱఁజూచి) అమ్మో! నాప్రాణనాథుఁడెక్కడనున్నాఁడు?

హరి—(ప్రవేశించుచు)

మహాస్రగ్ధర.

అలఘూద్యత్ఖడ్గధారా హతఘనగళుఁడై యద్రిరాజం బనంగా
నిలఁగూలె న్వైరి వీరుండిటు రుధిరచయంబేరులై నేలఁబాఱన్;
గలఁకం దద్భృత్యులెల్లన్ గడురయమున శాఖామృగవ్రాతరీతిన్
బలుశాఖల్దూఁకి భీతిన్ బఱచెద రదె దిగ్భ్రాంతి నల్దిక్కులందున్.26

చంద్ర—ఈబ్రాహ్మణునికల యూరకపోలేదు. మాకపాయము చేయవచ్చిన దురాత్మనెవ్వనినో సంహరించి భర్తవచ్చుచున్నాఁడు. నే నెదురుగాఁ బోయెదను. (రెండడుగులు నడిచి) ఓప్రాణేశ్వరా!

హరి—హృదియేశ్వరీ! తొందరపడఁబోకు. చిమ్మచీఁకటిలో మీరు శరీరములు మఱచి నిద్రిపోవుచున్నప్పుడు మీ కపాయము చేయ వచ్చిన యామట్టిచెట్టుమీఁది భూతాదులను దఱిమిపాఱదోలి, భూతనాయకుఁడగు బేతాళుని నేనిప్పుడే భూమికి బలిచేసివచ్చినాను.

నక్క—భూతములపేరు చెప్పిన నామేను వడఁకుచున్నది. ఇఁక నొకయర్ధనిమిషమయినను నేనీదయ్యములమట్టిక్రింద నుండను. నన్నావెలుతురు కనఁబడుచున్నదిక్కునకుఁ దీసికొనిపొండు.

హరి—అర్ధరాత్రమప్పుడీయోరుగాలిలో దారిలేని మహారణ్యమధ్యమున మనమిప్పుడెక్కడికిఁ బోఁగలము? ఆకనఁబడునది దవానలమేమో! అది గార్చిచ్చైనపక్షమున స్త్రీలతోను శిశువులతోను గటికిచీఁకటిలో బరుగెత్త లేక త్రొక్కులాడి, ముల్లుతీసి కొఱ్ఱడచుకొన్నట్లు మఱింతశ్రమపడవలసివచ్చును. నీవేలాగునన్నైన మాప్రార్థన విని మానిమిత్తమయి కొంచెము ప్రయాసపడి నేఁడు తెల్లవాఱినదాఁక నీ చెట్టుక్రింద శయనింపుము.

నక్క—నీవిఁక లక్ష చెప్పినను నేను వినను. ఏభూతమయినను నన్ను నోటవేసికొని పోయినపక్షమున, నప్పు తీర్పుమని యడుగువారు లేక సుఖపడవచ్చునని మీరనుకొన్నారు. నాముందఱ యీయాటలు సాగిరావు. ఇప్పుడామంటయొద్దకుఁబోయి చలికాచుకొని పొలములోనిపర్ణశాలలో నేనీరాత్రి పరున్నఁగాని బ్రమకను. మీరు రానిపక్షమున నురిపెట్టుకొని యిప్పుడిక్కడఁ బ్రాణములు విడిచెదను.

చంద్ర—ఓభూసురోత్తమా! ఆమంట కార్చిచ్చేమో!

నక్క—అది కార్చిచ్చుకాదు. పొలములోఁ గాపులుచలి నిమిత్తము వేసికొన్నమంట.

హరి—అట్లయినఁ బోదము రండు.

అందఱు—(కొంచెము నడుచుచున్నారు)

నక్క—ఇదియేమి? మన వెనుకవంకఁగూడ మంట కనఁబడు చున్నది.

చంద్ర—ఒక్క వెనుకదిక్కుననే కాదు. మనకుడియెడమ గూడ దూరమున మంటలు లేచుచున్నవి.

నక్క—(నలుదిక్కులుచూచి) మీరు కార్చిచ్చు కార్చిచ్చని మొదటనే వాక్యముపెట్టినారు. మీదెట్టిపాపపునోకో కాని మీమాటే నిజమయినది. మీమూలమున బీదబ్రాహ్మణుఁడ నయిన నేనిప్పు డగ్నిహోత్రున కాహార మగుచున్నాను. ఓవైశ్వానరా! బ్రాహ్మణ హత్య మహాపాతకమునుగూ! నీవీపేద బ్రాహ్మణునిజోలికి మాత్రము రాకుము. అయ్యో! ఏమిచేయుదును? మంట లాకాశమంటుచున్నవి.

హరి—ఓహో! అగ్నిహోత్రమెంతలో వ్యాపించుచున్నది!

గీ. దుష్టులిద్దఱు తమలోన దొమ్ములాడి
సాధుజనులకు మహిఁ గీడు సలుపునట్లె
యెండుమ్రోడులు రాచుకొంటిట్లు వహ్నిఁ
గలుగఁజేసి వనంబెల్ల! గాల్పఁదొడగె.

చంద్ర—ఓప్రాణేశ్వరా! మంట లన్నిప్రక్కలనుండియు వచ్చి చుట్టుకొనుచున్నవి. మన మీ దవాగ్నినుండి తప్పించుకొనుమార్గము కానరాకున్నది. మీరొంటిగానున్నయెడల నెట్లయినను దప్పించు కొని యుందురు. నానిమిత్తమున మీరును భాగ్యహీనులగుచున్నారు. ధనబంధము వీడినట్లే కాలిసంకిలివలె నున్నభార్యాబంధముకూడ వీడియుండినపక్షమున మీకీచిక్కు లేకపోవునుగదా?

హరి—ఓప్రియురాలా! అట్లనఁ బోకు. నీవు నన్ను విడువ కుండఁబట్టియే నేనిప్పుడు మహాగ్నిమధ్యమున నుండియు సంతాపము పొందకున్నాను. నేను భాగ్యహీనుఁడనుగాను; ధనహీనుఁడనుగాను.

మహాపదలు వచ్చినప్పుడును విడువని బహిఃప్రాణమగు భార్య చెంత నుండఁగా లోకములో నాకంటెను భాగ్యసంపన్నుఁ డెవఁడు? నీస్నేహ ధనమే కాక నీతిధనముకూడఁ గావలసినంత యున్నప్పుడు. నే నేల ధనసంపన్నుఁడను గాకపోదును? అందఱిలోను నే నే ధన్యతముఁడను.

నక్ష—కావలసినవా రందఱు నొక్కచోట నుండుటచేత మీ రందఱు ధన్యతములే. ఎవ్వరును లేక యొంటిగాఁడ నైన నే నొక్కఁడనే యిందు మందభాగ్యుఁడను. మాతండ్రియైనను బ్రతికి యున్నపక్షమున మరణకాలమునందు నందనుని విడిచిపెట్టక కొంచె మోదార్చునుగదా? ఓదైవమా! నన్నిట్లేకాకిని జేసితివా?

హరి—ఓమునికుమారా! దుఃఖపడకుము. మాప్రాణములు పోయినతరువాతగాని నీకుఁ బ్రాణాపాయము రాదు. మేమీ చిచ్చులో నుఱికి వీపుమీఁద మోచుకొనిపోయి యయినను, నీప్రాణ రక్షణముఁ జేసెదము. అక్కటా! అగ్ని యంతకంతకు సమీపించు చున్నది! ఈప్రాణరక్షణ మెట్లు సంభవించును?

చ. చిటచిటవిస్ఫులింగములు చెంతల నెంతయు వింత మీఱఁగాఁ,
పెటపెటనాదము ల్పొదలఁ బెక్కులు పండువెదుళ్లు ప్రేలఁగాఁ,
పుటపుట ధూమసంచయము భూమియు నింగియు నావరింపగాఁ,
గటగట! యున్నిప్రక్కలను గ్రమ్మెను ముమ్మ దవాగ్ని యియ్యెడన్.

చంద్ర—ఓప్రాణేశ్వరా! ఇప్పుడు మన మీ మునికుమారుని ప్రాణరక్షణము చేయకపోయినయెడల మన కపకీర్తి వచ్చును. ధన మియ్యవలసివచ్చునని మన మీతని ప్రాణముల కెగ్గు చేసితిమని లోకము తలంచినను దలఁచును. ఋషీశ్వరునిఋణము తీర్చి ధర్మము నిలుపుకొనుటకయి మీరును సర్వవిధముల నాత్మరక్షణము చేసికొన వలయును. మనుష్యుఁడు ప్రపంచమునకువచ్చునప్పుడు దానొంటిగానే వచ్చును. ప్రపంచమునుండి పోవునప్పుడును దానొంటిగానే పోవును.

ధర్మ మొక్కటిమాత్రమే మరణానంతరమునను వెంటవచ్చును. కాఁబట్టి మీరు దారాదిబంధమును గోసివేసి ధర్మ రక్షణోపాయమున కనుజ్ఞ యియ్యవలెను.

హరి—ఓ ప్రాణనాయికా! నా కేమియు నపాయము తప్పించుకొనుట కుపాయము తోఁచకున్నది.

చంద్ర—నాకొక్క చక్కని యుపాయము తోఁచుచున్నది. మీ రందున కొడఁబడవలెను. ఈప్రక్క నొక్కనిలివెడుమేర మాత్రమే నిప్పుమండుచు, దీని కావలదారి కనఁబడుచున్నది. నే నడ్డముగాఁ బరుండి యగ్నిహోత్రున కాహారము నయ్యెదను; మీరీ యిరువురును దీసికొని నామీఁదనుండి నడిచి మార్గమునఁబడి ప్రాణరక్షణము చేసికొనుఁడు. ఇన్నిప్రాణము లొక్కసారిగాఁబోవుటకంటె నొక్క ప్రాణము పోవుట శ్రేయస్కరముకదా!

హరి—హరహరా! ఎంతపాపపుమాట యిప్పుడీ చెవులఁబడినది! ఈ మాటలు నా చెవులయందు నూనులకంటెను దీక్ష్ణముగా నాటి మనస్సుకలంచి యింద్రియముల నవశము చేయుచున్నవి. ఇట్టి దారుణవాగ్విషబాణము నాటియు నా ప్రాణములుపోకున్నవి. (అని మూర్ఛపోవుచున్నాడు.)

చంద్ర—ఓ బ్రాహ్మణోత్తమా! మూర్ఛ తేరినతరువాత నా ప్రాణవల్లభుఁడు నా చావున కంగీకరింపఁడు. ఇఁక జాగుచేయుట కవకాశములేదు. నేనీ యగ్నిహోత్రున కడ్డముగాఁ బడెదను. నీవు నాప్రాణవల్లభునిఁ బుత్రునిఁ గొని నా మీఁదనుండి నడిచి మీప్రాణములను రక్షించుకొనుఁడు. (అని అగ్నికెదురుగా నడుచుచున్నది.)

లోహి—అమ్మా! నేనుగూడ నీతోనే వచ్చెదను. నన్నుఁ దీసికొనిపొమ్ము.

చంద్ర—నాయన! నేనిప్పు డీ యగ్నినార్చి నిన్నావలకుం దీసికొనిపోవుటంకయి త్రోవచేసెదను. నీవు నాన్నగారివద్దకుంబొమ్ము. (అనికన్నీరు నించుచున్నది.)

నక—లోహితాస్యా! మీతల్లినివిడిచి నీవిటురా.

చంద్ర—నాకుం దల్లిదండ్రులు చెప్పించినవిద్య సార్థక మగున ట్లాశుకవిత్వముగా దండక మొకటి చెప్పి యిప్పు డిప్పావకుని మెప్పించెదను. (అని యగ్నిహోత్రుని కభిముఖురాలయి సమీపించి చేతులు జోడించి దండకము చదువుచున్నది.)

దండకము—శ్రీమన్మహావాయుమిత్రా! పవిత్రా! లసద్దీప హోత్రా! జగత్ఖ్యాతచారిత్ర! నేనీమహత్త్వంబు వర్ణింపఁగా నెంతదానన్? గృపాదృష్టివీక్షించి రక్షింపుమోహవ్యవాహా! చలజ్జ్వాలికాజాలజాజ్వల్యమానోన్నతక్ష్మాజసందోహ! లోకంబులెల్ల భవన్నిస్తుల ప్రేమచేఁకాదె సంపూర్ణసౌఖ్యంబులంబొందు? నీవెల్లచో స్వస్వరూపంబులం దెల్లగూఢంబుగా నుంగు వత్యంతమున్; మానవుల్ తాము రుచ్యంబు లౌభక్ష్యముల్ శాకపాకాదులున్ జిహ్వకుం దృప్తిగాఁ జేసికొంచున్ సుఖం బొందఁగాఁ గల్గుటల్ నీప్రసాదంబునంగాదె? శీతంబుచే బాధ పొందంగ నీవెంతయున్ బీదలన్ సాదరన్ బ్రోవవే? రాత్రులం జీఁకటుల్ క్రమ్మినర్వేళ్ల రుండిచ్చియున్నట్టి నేత్రంబులన్ వ్యర్థముల్ చేయదీపాళిరూపంబు నన్నేత్రసాఫల్యముం జేసి కారుణ్యముంజూపవే వ్యాధివర్గంబుఁ బుట్టించు నానావిధాశుద్ధవస్తుప్రపంచంబు భక్షించి లోకాళికారోగ్యముం గూర్పవే? చాలఁగా నిన్ను నేస్తోత్రముల్ చేయఁగాఁ జాల; నేనీధరిత్రిన్మహాసాధ్వి నాదేని, నాభర్త సత్యవ్రతుండేని, యోపావకా! వేగనా మొఱ్ఱయాలించి పాలింపుమా యిమ్మహీదేవపుత్రున్

పవిత్రుఁ, ధరిత్రీకళత్రుఁ, మదీయైకపుత్రుఁ; నమస్కారముల్ నీకు వేవేలు కావింతు; దేవా! నమస్తే నమస్తే నమస్తే నమః

నక్క—ఓహో! ఈమెమహిమచేత దవాగ్ని యెంతలో మరలి పోయినది! ఓమహారాజా! మనము బ్రతికినారము. కన్నులు విప్పి చూడుము.

హరి—(కన్నులువిచ్చి) అయ్యో! నావ్యధ యధికము చేయుటకయి నన్నిప్పుడెవ్వరు మూర్ఛ తేర్చినారు? ఈమూర్ఛమూలము నయినను నిమిషకాలము దుఃఖమును మఱచి యుండఁగా నింతలోనే యిట్టిపాపమును గట్టుకోఁజెల్లునా? హా! ప్రాణనాయికా! నేనిఁక నెట్లుజీవనములు నిలుపుదు నే?

చంద్ర—ఓహృదయేశ్వరా! ఈశ్వరానుగ్రహముచేత నేను సుఖముగా నేయున్నాను. నానిమిత్తమయి మీరు చింతపొందఁ బోకుఁడు. (అని చేరవచ్చి కౌగిలించుకొని లేవఁదీయుచున్నది.)

హరి—చల్లని నీహస్తస్పర్శమువల్ల నాయుల్లమిప్పుడు చల్లపడినది. నీవుబ్రతికి నన్ను బ్రతికించినావు.

నక్క—ఓమహారాజా! నిన్నొక్కనినేకాదు. మమ్మందఱిని గూడ నిప్పుడీపతివ్రతాతిలకమే బ్రతికించినది.

చంద్ర—ఇప్పుడు మాటల కెడములేదు. ఈకార్చిచ్చింకను మనదిక్కున మండుచునేయున్నది. ఈవంకను మనకుఁ ద్రోవ యిచ్చినది గనుక, మన మీ చోటుదాటి దారిలోఁబడి యావల సావకాశముగా మాటలాడుకొందము రండు.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థాంకము

రంగము—కాశికాపురవీథి.

[హరిశ్చంద్రుఁడును, చంద్రమతియు, లోహితాశ్వుఁడును; నక్షత్రకుఁడును, ప్రవేశించుచున్నారు.]

చంద్ర—ఓప్రాణనాథా! ఈదివ్యక్షేత్రమునకు వచ్చి యిరువదిదినములయినను, మనమింకను గాశికాపురమునందలి దివ్యస్థలములనేకములు సేవింపనేలేదు. అవి ముక్తక్షేత్రమున జూడలేదు; కేశవస్వామిని దర్శింపలేదు; జ్ఞానవాపిని కనలేదు; కేదారశంభులింగ దర్శనము చేయలేదు; దుండివిఘ్నేశ్వరుని బొడగనలేదు; వరుణానదియందు స్నానము చేయలేదు. వచ్చినతరువాత నాలుగయిదుదినములు మార్గాయాసముచేత నిల్లుకదలలేకపోయినాము. నక్షత్రకుని యుపచారములమూలమునఁ గొన్నిదినములు తీఱలేదు.

హరి—ఓహృదయేశ్వరీ! మనమిప్పుడ విముక్తక్షేత్రమునకుఁ బోవుచున్నాము. ఉన్నదివ్యస్థలముల నన్నిటిని నేటరేపటఁ బోయి సేవింతము.

క. హరుఁ డిటఁ దారకమంత్రము
మరణింపుచు నున్నజంతు మండలిచెవులన్
బరువడి నుపదేశించును
గరుణమెయి న్నిత్యముక్తిగలిగించుటకున్. 1

ఉ. ఓలినిసప్తవాయువులు నొక్కట వీవఁగ ద్వాదశార్కులా
భీలత నెండకాయఁగను, భీకరపుష్కల ముఖ్యమేఘముల్
చాలఁగ వర్షముల్ కురియ, సప్తసముద్రము లొక్కపెట్టునన్
వేలనుమించిరాఁ, బ్రళయవేళను గాశినశింపఁ దింతయున్, 2

చంద్ర—నిస్సందేహముగా మన మీ కాశికాపురసందర్శనముచేతనే ధన్యులమైనాము. ఇప్పుడు మేఘగర్జనమువలె నాచెవులకేదో మ్రోఁత వినవచ్చుచున్నది. అది యేమయి యుండును?

హరి—అది గంగాప్రవాహఘోషము ఆవంకఁజూడుము.

ఉ. అల్లతరంగడోలికల హంసము లూఁగెడు మెల్లఁమెల్లఁగాఁ;
దెల్లనినీరు కూలనిహతిఁ బెనుముత్యము లట్లు లేచెడుఁ;
జల్లనిగాలి వీచెడును సౌరభముల్ వెదచల్లు చల్లనఁ;
నల్లలితప్రశస్తినదెజాహ్నవి పోల్చెడు నేత్రపర్వమై. 3

ఓప్రియురాలా! నాచెయిచాయఁ దిన్నఁగాఁ జూడుము.

ఉ. మేలిమిపైడి పూఁతలను మెచ్చులుగుల్కెడు చిత్రజంతులఁ
జాలఁగ నొప్పిమిన్నలముచక్కని గోపురమందు గుంపులై
చాలుగఁ బావురంబు లవెసందడిచేయఁగ విశ్వనాథు దే
వాలయమాదెసఁ దవుల నల్లదె చూడ్కికి వేడ్కగొల్పెడుఁ. 4

(చూపుచున్నాఁడు.)

నక్క—ఓరాజా! మీరు కృతార్థులయినారు.

క. వినుమీ కాశీపురమున
నొనరంగా నైదుదినము లుండినఁ జాలుఁ
జనుఁడఘము లెల్లఁ బోనిడి
యనఘంబగు ముక్తినొందునందురు పెద్దల్. 5

చ. ఇరువదినాళ్లు నేఁటితుద కీపురి నీవు వసించియుంట నీ
కరగతమయ్యె ముక్తి; యటుగావున నీవిఁకలక్ష బొంకినఁ
బరము నిహంబునుం జెడవు; నమ్ముము కాసయినఁ లభింపదీ
పురమున నీకు; నప్పెఱుఁగ బొమ్మని బొంకుము నేను బోయెదఁ. 6

హరి—ఓబ్రాహ్మణోత్తమా!

చ. తలఁపగ బోకు మీశ్వరుఁడు తా నొక చోటనె యుండునంచు, నీ
స్థలమె పవిత్రమై జనులఁ దద్దయు శుద్ధులఁజేయునంచు; నె
ల్లెడలను నిండియుండుఁ బరమేశుఁడు; వానికి విశ్వమంతయున్
నిలువఁగ నాలయంబె యగు; నిక్కమె యాతని యాజ్ఞ యెల్లెడన్ 7

క. సత్యముపలుకని మనుజుఁడు
నిత్యంబుగఁ గాశి నున్న నిజముగ నఘరా
హిత్యముపొందఁడు; దెలిసి య
సత్యముపలుకుదునె యల్పసౌఖ్యము కొఱకన్? 8

కొంచెంసేపు తాళుము. నేఁ డెట్టులయిన సూర్యుఁ డస్తమించులోపల నీధన మిచ్చి ఋణవిముక్తుఁడనయ్యెదను.

నక్క—ఓహోహో! నీమాటలు వాటముగానున్నవి.

సీ. విశ్వేశ్వరునిఁ బోయి వీక్షింతునీవేళ
నుండు నేఁటి కటంటి వొక్కనాఁడు
మణికర్ణికను గ్రుంకి ప్రణుతింతునీవేళ
నుండు నేఁటి కటంటి వొక్కనాఁడు
తల్లిభాగీరథి దర్శింతు నీవేళ
నుండు నేఁటి కటంటి వొక్కనాఁడు
చేరి విశాలాక్షి సేవింతునీవేళ
నుండునేఁటికటంటి వొక్కనాఁడు

గీ. కాలభైరవు నీవేళఁ గాంచఁ జనుదు
నుండు నేఁటికటంటి వీవొక్కనాఁడు
నేఁడు నేఁడని సొమ్మొకనీవుగడప
నెంతకాలంబు తాళుదు నింక నేను? 9

ఉ. రాజ్యసుఖంబుల న్మరగి రాజసవృత్తిని నున్ననీకు వా
ణిజ్యము చేతఁ గా దలవణిక్కులరీతిని; బ్రాహ్మణాకృతిన్

బూజ్యత భిక్షమెత్తి ధనముం గడియింపఁగలే! విఁ కెట్టలీ
రాజ్యములోనఁ దేఁగలవు ద్రవ్యము మాఋణ మెల్లదీర్పఁగన్?10

చ. గడవుదినంబు నేఁడె; యఱకాసయినం జెయిచేర్పలేదు; నీ
యెడమొకమోటముం గదిరి యేనిట నూరక యున్నమద్గుణం
డుడుగని కిన్కతోడ ననునొక్కట మ్రింగును; విన్ను నింక నే
నడుగటుపెట్టనీను?ధనమంతయు నిక్కడఁ గ్రక్కఁగావలెన్. 11

(అని త్రోవకడ్డమువచ్చి మొలలో చేయివేసి నిలుపుచున్నాఁడు.)

హరి—మహాత్మా! నీవు చెప్పినట్లు బ్రాహ్మణ వృత్తిచేతను వైశ్యవృత్తిచేతను ధనమార్జించుట నాచేతఁగాదు. నారాజ్యము సర్వమును మీగురువుగారికి ధారపోసి రాజవృత్తినీవఱకే విడిచి యున్నాను. ధనార్జనమున కిఁక నాకొక్క సేవకవృత్తి మాత్రమే కనఁబడుచున్నది. పట్టువిడిచి నాలుగడుగులు సాగనిమ్ము. ఏమహానుభావుని యొద్దనైనను గొలువు కుదిరి నీఋణము తీర్చివేసెదను.

నక్ష—నేనట్లుపోనియ్యను. నెలదినములనుండి నిన్ను మంచి మాటలతో నడుగుచుండినఁ గార్యము లేకపోయినది. నిష్ఠురవృత్తి చూపి నిన్నాయాస పెట్టినంగాని నీవు ధనమియ్యవు. నెలదినముల నుండి నీమూలమున నా స్నానసంధ్యాద్యనుష్ఠానము మంటఁగలిసి పోయినవి. ఇంతకాల మోపిక పట్టినను నేను నీ కేమయిన మంచి వాఁడనయితినా? ఆవలమాగురువుగారి యాగ్రహమునకుఁ గూడ నే నేల పాత్రుఁడను గావలెను? ధన మిప్పుడు నా ముందు పెట్టి మఱిమాటలాడుము.

హరి—ఓమహాత్మా! నన్నేల నిర్హేతుకముగా నడివీథిలో సిగ్గుపఱిచెదవు? ధనసంపాదనమునిమిత్తము నేను పడుచున్నపాట్లను నీవు కన్నులారఁ జూచుచునేయున్నావుగదా! ధన మెవ్వరినైనను వేఁడుట కయినను ముందు సాగనిమ్ము.

నక్ష—కార్యములు కావలెను గాని నీ తియ్యమాటలు నాకక్కఱలేదు. ముందుగా నీయొద్దనున్న సొత్తును విక్రయించి కూడినంత ధనము నాచేతఁబెట్టి మిగిలినదాని నిమిత్తమయి యేసేవకవృత్తియందో ప్రవేశింపుము.

హరి—ఓనటువర్యా! కట్టుబట్టలతో లేచి వచ్చినమావద్ద నీ వెఱుఁగని సొత్తేమున్నది?

నక్ష—నీభార్యాపుత్రులు నీసొత్తుకారా? వారిని విక్రయించి వచ్చినసొమ్ము నాచేతిలోఁ బోయుము.

హరి—హరహరా! ఎంతపాపపుమాట వినుచున్నాను!

(అని తలవంచుకొని దీనత్వముతోఁ గ్రింగు చూచుచున్నాఁడు)

చంద్ర—ఓ ప్రాణేశ్వరా! మీరీప్రకారముగాఁ జింతాక్రాంతులయి ధైర్యమును విడుచుచున్నారేమి? ఈ మునికుమారుఁడు చెప్పినయుపాయము చక్కఁగా నున్నది. ధర్మము చెడిపోవునప్పుడే భర్తకు సాయపడదేని, ఆ భార్యయెందుకు? మనఃపూర్తిగా నేనే మిమ్ము వేఁడుచున్నాను గనుక మీకు భార్యావిక్రయపాతక మణుమాత్రమునురాదు. మీరాలస్యము చేయక నన్ను దాసినిగా విక్రయించి వచ్చినధనముతో మీ ఋణముతీర్చి మిమ్ముబొంకింపఁ గంకణము కట్టుకొన్న విశ్వామిత్రుని ప్రతిజ్ఞ బొంకు చేయుఁడు.

హరి—ఓ హృదయేశ్వరీ! నీమాటలు నా హృదయమునకు బాణములకంటెనుఁ దీక్షణముగా నాటుకొనుచున్నవి. ఈ దుస్సహపరుషవాక్యాగ్ని శిఖలను నామనస్సునందుఁ జొనిపి యేల బాధపెట్టెదవు?

క. ఒక్కట నీవాగ్వహ్నియుఁ
జిక్కక చిత్తముఁదపింపఁ జేసెడునింతే
గ్రిక్కున దహింపఁ జేయుఁగ
నక్కటకట చేతఁగాని దయ్యెను నిదియున్. 12

క. ఇలలో నెందయినను దన
కులకాంతను విక్రయించుకూళయుఁ గలఁడే!
పలుకను దలఁపను గూడని
కొలయేటికిఁ గట్టెదీవు కొమ్మరొ నాకున్?
(అని కన్నీడు విడుచుచున్నాఁడు.)

చంద్ర—ఓ ప్రాణనాథా! దుఃఖింపఁబోకుము. విధియిప్పుడు మనకిద్దఱకును వియోగము కలుగవలయునని విధించినాఁడు. ప్రతిబంధము చెప్పక దేవర నాప్రార్థన మంగీకరింపవలయును. భార్యారక్షణముధర్మరక్షణమునకంటె నధికమయినది కాదు. మరణానంతరము ధర్మమొక్కటియె సఖునివలె వెంటవచ్చి సుఖపెట్టునుగాని బ్రతికినన్నాళ్లనుదెమ్మని తినితిని యనుభవించెడి యీ భార్యలును బంధువులును దా మొక్కరునువెంటరారు. మృత్యువెప్పుడు వచ్చునో మనతోఁజెప్పిరాదు. కాఁబట్టిభార్యపోయినను బిడ్డలుపోయినను లోకములోనిదిమఱియేదిపోయినను బుద్ధిమంతుఁడు ధర్మముతప్పక శాశ్వతానందము కలుగుమార్గమునుజూచుకొనవలెను. కాఁబట్టి మీరు ధర్మరక్షణార్థమయి నన్నుఁద్యజింపవలయును.

హరి—ఓ ప్రాణేశ్వరీ! అప్పుతీర్పలేని దుఃఖాగ్నిచేతనే తాపమొందుచున్న నాహృదయమును నీదుస్సహవాక్యాగ్నిచేత మఱింతతపింపఁజేయకుము. సత్యవర్ణనమెంత ధర్మవిరుద్ధమో ధర్మపత్నీ విక్రయమును బురుషున కంత ధర్మవిరుద్ధమే. ధర్మబాహ్యమయిన నీ ప్రార్థనకు నే నెట్లొడంబడనేర్తును?

చంద్ర—ఓ ప్రాణేశ్వరా! మీచింతమాని నామనవిసొంతముగాఁ జిత్తగింపుఁడు. ఆపత్కాలమునందు దనదేహము నయిన విడిచి భర్తనుద్ధరించుట కులసతికి ధర్మము. అంతేకాక వివాహవిధిచేత భార్య భర్తసొత్తనుట లోకప్రసిద్ధముగదా! ఆపన్నివారణము

సకయి యట్టిపాత్రునన్యులకు విక్రయించుటచేఁ బాపమేమున్నది? అదిగాక నేను మనఃపూర్వకముగా నన్యులకు దాసినయి మిమ్ము ఋణవిముక్తులను జేయుటకయి యొప్పుకొనుచున్నాను. మీరు సంకోచింపక ప్రేమానుబంధము కోసివేసి నన్ను దాసినిగా నమ్మివేసి యీ ఋణబాధను దప్పించుకొని శక్తియున్నప్పుడు నన్ను మరలమీ ధనముగాఁ జేసికొనుఁడు. మీరంగీకరింపకపోయినను నాకు దాస్యము తప్పదు. పూర్వము దుర్వాసుఁడొకసారి నన్ను మూడుమాసములు దాసినిగా నుండ శపించినాఁడు.

హరి—అయ్యో? మానులెప్పుడును దయావిహీనులుగదా? నీవేమియపరాధము చేసితివని నీకతఁడట్టి ఘోరశాపమిచ్చెను?

చంద్ర—నా చిన్నతనములో నే నొకనాఁడు వాకిటనిలుచుండఁగా నొకకిరాతుఁడొక చిలుకపిల్ల నాదారిని గొనిపోవుచు నా కమ్మఁ జూపెను. ఆకీరపోతము మిక్కిలి మనోహరముగా నున్నందున నేను దానిని ముచ్చటపడి కొని ప్రతిదినమును పండ్లును బంచదారయుఁ బెట్టి పద్యములు చెప్పుచుఁ బ్రాణతుల్యముగాఁ బెంచుకొనుచుంటిని. ఇట్లు మూడుమాసములు చెల్లిన తరువాత నొకనాఁడాకస్మికముగా దుర్వాసుఁడు మాతండ్రిని జూడవచ్చి నాచేతనున్న చిలుకను జూచి యిదియెక్కడదని యడిగెను.

హరి—ఋషు లెక్కడకుఁ బోయినను జోలిమాలినప్రశ్నలడుగుదురు. అటుతరువాత—

చంద్ర—ఒకనాఁ డొకకిరాతుఁ డీచిలుకను మాయింటి మార్గమునఁ గొనిపోవుచుండఁగా నాపుత్రికయైన యీచిన్నది మక్కువపడి కొని వినోదార్థముగాఁ బెంచుకొనుచున్నదని చెప్పఁగానే యతఁడు మండిపడి—అతనిరూపము తలఁచుకొన్న నాకిప్పుడు భయమగుచున్నది. (అని భయము నభినయించుచున్నది.)

హరి—ఓహో! ఈమూర్ఖముని కోపముచేత విశ్వామిత్రుని గూడ మించిపోయినాఁడే! ఇంతమాత్రము కోపమాపుకోలేని యాతనితపమెంతకు? అడవులలోనుండియు నాగ్రహగుణము విడువలేని తపస్సులకంటె శాంతులయి యింట నుండు గృహస్థులే యుత్తములు.

ఉ. కానలనుంట నిష్ఫలముగాఁ జను నింద్రియనిగ్రహంబు లే
దేని; మనుష్యుఁ డింట వసియించియు నింద్రియనిగ్రహంబొగిన్
దానొనరించునేని, సతతంబును సత్ఫలమొందు; శాంతుఁడౌ
మానవుఁ డెంచు నున్నవినుమా యదె యాశ్రమరాజమాఁజుమీ.

అటుపయి నేమిజరిగినది ?

చంద్ర—(గద్గదస్వరముతో) అతఁడు మండిపడి. కటము లదర, ముకుపుటములు చెదర నాపంకఁ గన్నులనిప్పులొలుకఁజూచుచు మాయాశ్రమవృక్షమునుండి కిరాతుఁ డపహరించి తెచ్చిన శుక పోతమును బంజరబంధము కావించి బాధించితివి గావున నీవును దాసివై సేవాబంధ మనుభవింపుమని ఘోరశాపమిచ్చి చివాలున లేచెను.

హరి—ఏమి యా తాపసునిదుండగము! ఎఱుఁగక చిలుకను గొన్ననీది మహాపరాధ మని యెంచి నిర్దోషురాలి నూరక శపించుట దోషముగా నెంచకున్నాఁడు!

క. తెలియఁగఁజాలఁడు మనుజుఁడు
తలఁపన్ గిరులంత లైనఁ దనదోషములన్;
తిలకించుఁ బరులతప్పుల
నలుకన్ సన్నావగింజ లంతటివానిన్. 15

ఓహృదయేశ్వరీ! నీశాపమున కా మునీశ్వరుఁడు మాసత్ర యావధి పెట్టనే లేదా?

చంద్ర— మొదటమితి పెట్టలేదు. అప్పుడు నాభినకుఁడాతని పాదములమీఁదఁబడి, ఓమునితల్లజా! బాల్యచాపలముచేత నెఱుఁగక చేసిన యీ మె నేరమును క్షమింపవేయని బహువిధముల మనసు కరఁగఁ బ్రార్థించెను. అంతట నామునితల్లజుడు కొంతప్రసన్న హృదయుఁడయి మూడునెల, లీచిలుకకు స్వేచ్ఛావిహారభంగము గలిగించినది గనుక, ఈమెదాస్యమును మూడుమాసములే యుండు నని యనుగ్రహించి కొలువువిడిచి వెడలిపోయెను.

హరి— ఈయుపకారమున కాతనికి మన మనేకాభివందనములు చేయవలసినదే. ఇది యెఱిఁగియే కాఁబోలును మన కుల గురువులైన వశిష్ఠులవారు మనవివాహకాలమునందు నీకు దాసీయోగ మున్నదని నాతో సెలవిచ్చినారు. నీమీఁదఁగల ప్రేమచేత నాకామాటలప్పుడు చెవిని నాటినవి కావు.

చంద్ర— ఈసంగతి నేను నేఁడు క్రొత్తగా దేవరవారితో విన్నవించుట కాక యీవఱకే వశిష్ఠులవారు సెలవిచ్చి యున్నారు గదా? మీరిఁక సందేహముమాని నన్నెవ్వరికైన విక్రయింపుఁడు. ఇందువలన నమోఘమయిన బ్రాహ్మణశాపహతిచేత నాకవశ్యభోక్తవ్యమయియున్న దాస్యమునుం దీఱును; మీఋణమునుదీఱును.

హరి— ఓప్రాణేశ్వరీ! పుష్పకోమలివైన నిన్నిట్లు కాఱడవులలోఁ గష్టపెట్ట సంశయింపని కఠినచిత్తుఁ డెట్టిదారుణకర్మమునకయినను లోఁబడును. నామూలమునఁగదా,

చ. చెలువపు హేమసౌధముల స్నిగ్ధశశాంకశిలాతలంబులన్
మెలఁగెడునీవు ఘోరవనమేదినిలోపల సూదిరాళ్ళలో
నడుగులు పొక్కఁ గంటక చయంబులు గ్రుచ్చుకొన న్మెలంగుచున్
బలుమఱు నిట్టిపాట్లుపడఁ బాలితి వక్కట మిక్కుటంబుగన్. 16

క. పరిచారికాశతంబులు
పరిచర్యలు చేయ నతుల వైభవలీలన్

జరియించెడు నీవిపు డే
కరణిం బరిచర్య చేయఁ గల వన్యులకున్? 17

క. ప్రాణములు నిల్పఁ గలనే
యేణాక్షిరో నిన్నుఁ బాసి యేనిమిషంబున్ ?
రాణీ! నినువిడిచిన నా
ప్రాణంబులు క్షణములోనఁ బాయును బొందిన్. 18

ఉ. ఈవు సమీపమందు వసించుట నాకునిశల్ పగళ్ళగున్,
బూవులతోఁట లౌను వనముల్, గిరిగహ్వరముల్ గృహంబులౌ,
గేవలజీర్ణపర్ణములు గెంజిగు రాకులమేలిపాన్పులౌ;
హా! వనజాస్య! తాళఁగలనా నినుఁబాసి నిమేష మేనియున్? 19

నక్షు—ఓరాజా! నీకీయాఁడుదాని కున్నంతవివేకమయినను లేదు. పెట్టిన మితిలోపల ఋణ మేలాగునైనఁ దీర్పవలెనని యీమె సదుపాయము చెప్పుచుండఁగా నీ వీమెమాటలను బెడచెవులఁబెట్టి కల్లయేడ్పు లేడ్చుచు భార్యమీఁద మహాప్రేమ యున్నవానివలె నటించి మాయపెగి వేయఁ జూచుచున్నావు. నక్షత్రకుని ముందఱ నీ యాటలు సాగిరావు. నాకు నీకంటెను మాయ లెక్కువ తెలియును. ఈబుడిబుడి యేడుపులుచూచి జాలిపడి విడిచిపోవుటకు నేను మఱి యెవ్వఁడను గాను; కరుణయన్న నేమో యెఱుఁగని విశ్వామిత్ర శిష్యుఁడను జుమా. రమ్ము. పోయినంతవట్టుకు నీభార్యనమ్మి వచ్చిన సొమ్ము నాచేతికిమ్ము. (అని లాగుచున్నాఁడు.)

చంద్ర—ఓ ప్రాణేశ్వరా! ఈతనిచేత నీడుపులు పడక విధి కృతమయిన నా దాసీత్వమునకు మీరును సహకారులు కండు.

హరి—(గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు) భార్యావిక్రయము చేయు పాతకిని కమ్మని విధి నానొసట వ్రాసియుండఁగా నేనెట్లుసహకారుఁడను గాకుందును? ఓ భూసురోత్తమా? నీ యభిమతమే చెల్లనిమ్ము. (అని వెంటనడచుచున్నాడు.)

[అప్పుడు కొందరు పౌరులు ప్రవేశించుచున్నారు.]

నక్ష—ఓపురజనులారా! ఈతఁడు తనభార్యయైన యీ సుందరి నమ్మబోవుచున్నాఁడు. మీలో నెవ్వరికైనను దాసి కావల సినయెడలఁ దగిన రొక్కమిచ్చి కొనుఁడు.

హరి—ఓహో? ఈదారుణవాక్యము పిడుగువలెఁ గర్ణరంధ్రములఁ దూఱియు నాకఠినహృదయమును పగిలింపఁజాలకున్నది. నాహృదయము వజ్రముతోనో యినుముతోనో చేయఁబడినది.

ప్రథమపౌరుఁడు—ఓనరోత్తమా? నీకీ త్రిలోకసుందరి యయినభార్యను విక్రయింపవలసినంత దురవస్థ యేలపట్టినది?

ద్వితీయపౌరుఁడు—హరహరా? ఇటువంటి కులకాంతను విక్రయింప నెంతటి బుద్ధిహీనుని కయినను మనసుకొలుపునా? ఓ పుణ్యాత్మా? నీవు నిజముగానే కులాంగనా విక్రయపుణ్యమున కొడిఁగట్టుకొనఁ బూనినావా?

హరి—(కన్నుల నీరునించుచు నూరకున్నాఁడు.)

నక్ష—ఓరాజా? నీవు బేరమడుగువారిప్రశ్నల కుత్తరమియ్యక కార్యము చెడఁగొట్టుచున్నావు. ఈలాగున మౌనము ధరించివచ్చెడు బేర మెల్లను చెడఁగొట్టుటకంటె మీ యప్పపహరించెదనని మూగతనము విడిచి స్పష్టముగానే చెప్పుము. ఈ యడియాస మాని నేను మాగురువునొద్దకుఁ బోయెదను.

హరి—(గద్గదస్వరముతో) ఓ మునికుమారా? వేగిరపడఁబోకు. లోకవిరుద్ధమైన యీవార్త చాటుటకొకపట్టున నానోటమాట రాకున్నది. కొంచెము తాళుము.

నక్ష—అప్పపహరింపఁ దలచుకొన్న నీకుఁ దాళిక యుండును గాని సొమ్ముగోలుపోయిన నేనెట్లు వేగిరపడకుండఁగలను? ఓపౌరజనులారా! ఈతనికి మీతోమాటాడ నోరురాకున్నదఁట! నేను జెప్పె

దను వినుఁడు. ఈ తడు సూర్యవంశ జలధి చంద్రుఁడగు హరిశ్చంద్రుఁడు? ఇతఁడు మునికుల పవిత్రుఁడైన విశ్వామిత్రునకుఁ దన రాజ్యమంతయు దానమిచ్చి యావఱకు యజ్ఞార్థ మిచ్చెదనన్న ధనమియ్యలేక ఋణబాధ తప్పించుకొనుటకయి యాలినమ్మజూపుచున్నాఁడు.

ప్రథమపౌరుఁడు—శివశివా! ఈ మాటలు విన్న పాపము వచ్చును. మనము పోదము రండు. మన మెక్కడ? మహారాజు భార్యను కొను టెక్కడ?

ద్వితీయపౌరుఁడు—ఈతఁడు తనరాజ్యమంతయు విశ్వామిత్రునకా ధారపోసినది? రాజ్యమంతయుఁ దనకు ధారపోసిన మహాదాతను మున్నిచ్చెదనన్న స్వల్పధనము నిమిత్తమయి యిటు తనముల్లె దాఁచఁబెట్టినట్లు బాధ పెట్టుచుండుటచేత నతఁడు విశ్వామిత్రుఁడనదగినవాఁడే! తనవంటి పాత్రుని వెదకి దానమిచ్చిన యీ సాధుచరిత్రుని చిక్కులు పెట్టెడియతఁడు విశ్వమున కమిత్రుఁడు గాక మిత్రుఁడెట్లగును?

ప్రథమపౌరుఁడు—ఎవ్వరును లేనట్లు పరమకోపి యని పేరు పొందిన యాకౌశికునికేల దాన మిచ్చితివి? ఇచ్చినను దగుమాత్రపు దానము చేయవలెనుగాని శక్తికి మించినదానము చేయ వచ్చునా?

ఉ. కొందఱు యాచకాధముల క్రూరముఖస్థితి కుబ్బియీవిచే
ముందట నేమొముక్తితముఁ బొందెదునన్ భ్రమదాతలంచుఁ బే
రందఁగ నాలుబిడ్డల గృహంబున వంగదఁ బెట్టిదానముల్
క్రందుగఁ జేయుచుండుదురు కారెకిరాతకు లట్టివారిలన్? 20

ద్వితీయపౌరుఁడు—ఇందులో రాజుననవలసిన దేమున్నది! మన బ్రాహ్మణోత్తములే యెంతకయినను దగినవారు. వారు సమయము వేచి తమ కుపకారము చేసినవారికే యుపకారము చేయుదురు. (అని పోవుచున్నారు.)

నక్క—ఓరాజా! అమ్మవలసినవాఁడవు నీవు నోరెత్తకపోవుట చేత కొనఁదలఁచివచ్చిన వీరందఱును తొలఁగిపోవుచున్నారు. నీమౌనము చూచి నీవేమో ముగ్ధుడవనిభావించి మీఁదుమిక్కిలి వీరు మాఁగుఁదవుమీఁదనే తప్పుమోపి దూషించుచున్నారు. పరమపవిత్రుఁడయిన యీవిశ్వామిత్రునిఁ వీరిచేత నిట్లు తిట్టించుట నీకుధర్మమా? నీవిప్పు డాలి పమ్మ నని తెగఁజెప్పుము. నీవసత్యవాది వని యెఱిఁగి, నాదారిని నేను బోయెదను.

హరి—ఓఋషికుమారా! నిష్ఠురము లాడకు. నేనిదిగో చంద్రమతిని విక్రయించుచున్నాను. (పురజనుల నుద్దేశించి)

గీ. పౌరులార! సుస్థిరమహోదారులార!
మునిఋణముదీర్ప నాభార్యఁ పుణ్యధుర్య
దాసిఁగా విక్రయించెద దయ దలిర్ప
వేగఁ గొనరయ్య నేఁ గోరువిత్తమిచ్చి. 21

సీ. కలలోననైన నవ్వులకైన నిసుమంత
బొంకి యెఱుంగని పుణ్యశీల
తప్పుఁ జేసిననైనఁ దన్ను దూఱినననైనఁ
గోపించి యెఱుఁగనిగుణధురీణ
పెఱలను దనవారి వేఱుగాఁ జూడక
నారయునట్టిసదయహృదయ
కానిమాటలు తన్నుఁగలుషాత్ము లాడినఁ
గలహింపనొల్లని గరితమిన్న

గీ. పరులసొమ్ము తృణంబుగ భావమందుఁ
దలఁచి యెప్పుడు వర్తించుధన్యచరిత
చంద్రమతి నాదుభార్య నీసాధ్వి మణిని
విక్రయించెదఁ గొనరయ్య విబుధులార! 22

[అప్పుడు వికృతవేషముతో కాలకౌశికుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

నక్క—ఓరాజేంద్రా! నీవందఱికిని వినఁబడునట్లు బిగ్గరగాఁ జాటకున్నావు. అందుచేతఁ బౌరు లిటురాక దూరదూరముల బోవుచున్నారు. ధాన్యపుమూటలును జింపిబట్టలును బంచాంగపుఁగట్టయును ధరించి యొక బీదబ్రాహ్మణుఁడుమాత్ర మీవంక వచ్చుచున్నాఁడు.

కాల—(ప్రవేశించి) అయ్యా? మీరు గుంపుకూడి యేమి చేయుచున్నారు?

నక్క—ఈసుందరిని దాసినిగా విక్రయించుచున్నాము.

కాల—ఓకాంతా! నీ వేమిపనులు చేసెదవు?

చంద్ర—రెండుపనులు తక్కఁ దక్కిన పనులన్నియు నేను జేసెదను.

కాల—ఆరెండుపనులు నేవి? నీవు భోజనము చేసెదవుగదా?

చంద్ర—నేను బహుచ్ఛిష్టభోజనము చేయను.

కాల—అట్లయినఁ గొనువారి కందువలన లాభ మేదియు లేదు. ఇఁక నీవుచేయని రెండవపని యేది?

చంద్ర—పరపురుష—(అని చెప్పుటకు సిగ్గుపడుచున్నది.)

కాల—నీవు చెప్పనక్కఱలేదు. నాకది బోధపడినది. మంచిది యిప్పుడు నీభర్త యెక్కడ నున్నాఁడు?

హరి—ఇదిగో జీవచ్ఛవము నయి యిక్కడనే నిలుచున్నాను

కాల—నీవెవఁడవు?

హరి—నేనవార్యశౌర్యధుర్యుఁడయిన త్రిశంకుని తనూజుఁడను; సూర్యవంశ—

కాల—నీవు చెప్పనక్కఱలేదు. నీవృత్తాంతము నేనీవఱకే యెఱుఁగుదును. సామ్రాజ్య మంతయు గాధిపుత్రుఁ డయినవిశ్వా

మిత్రునకు ధారపోసి యాతని కంతకుమున్న యజ్ఞార్థ మిచ్చెద నన్నవిత్త మియ్యలేక చిక్కులు పడుచున్న హరిశ్చంద్రుఁడవా నీవు?

హరి—అవును. ఆ విత్తముసిమిత్తమే యిప్పు డీయిల్లాలిని విక్రయింపబోవుచున్నాను.

కాల—సరిసరి! సర్వమును దెలిసినది. ఇంతేకదా? ఆఋణ బాధ తప్పించుకొనుటకయి నేను నీ కిప్పు డొక్కయాలోచన చెప్పెదను వినుము. సుందరీమతల్లియయిన యీయిల్లాలిని పరుల కమ్మనేల? నిష్కారణముగా నిందపాలు కానేల? నీవియ్యవలసినయర్థ మీబ్రహ్మచారిచేతి కిచ్చితినని యొక్కబొంకుబొంకుము. స్త్రీల విషయమయి బొంకుట దోషము కాదుకనుక నీకు నేను సాక్షిగా నుండెదను. ఇప్పుడీతనిచేతిలోనుండి తప్పించుకొని పోఁగలిగినయెడల, నీకసత్యమావల బాణమయినాటుకొనదు. నాబుద్ధి విని యీయొక్క యసత్యము పలుకుము. అసత్యభయము నీమనస్సును బాధించెడు పక్షమున, నాకల్పదక్షిణ యిచ్చితివా పాపపరిహారార్థముగాఁ దగిన ప్రాయశ్చిత్తము చేయించి నీయసత్యదోషము తొలఁగించెదను.

హరి—అసత్య మొక్కటియే యయినను నరుని నరకగామిని జేయకమానదు.

గీ. చిన్నసూది బెజ్జంబంతచిల్లి యున్నఁ
గడవెఁడుజలంబుఁ గ్రమముగాఁ గాఱునట్లె
పాపమున కింత యెద సందు వదలునెడల
సర్వపుణ్యముల్ క్రమముగా సమసిపోవు. 23

కాఁబట్టి బుద్ధిమంతుఁ డైన్నఁడును బాపహేతువయిన యసత్యమునకుఁ దనహృదయము నందఁగమాత్రమును చోటియ్యఁ గూడదు. వేయిప్రాయిశ్చిత్తములు చేసికొన్నను, అసత్యదోషము పోదు.

కాల—నీవు వట్టిబుద్ధిహీనుఁడవు. ఋణవిముక్తుఁడ వగుటకు దగినసదుపాయమును నేనుపదేశించుచున్నను గ్రహింపజాలకున్నావు. లోకములో నసత్యములాడి బాగుపడి సంపదలతోఁ దులఁదూగుచున్న వారిని నీవు చూచుచుండలేవా? ఈలోకములోఁ గల్లలాడుటవలన గౌరవహాని యెంతమాత్రమును రాదు.

హరి—ఓవిప్రోత్తమా! నీయభిప్రాయముతో నే నేకీభవింప జాలను. నీతిమార్గననడుచువా రొకవేళ దైవవశమునఁ గష్టముల పాలయి యడఁగినను వారికిగౌరవమేవచ్చును; నీతిమాలినవా రొకా నొకప్పుడు సుఖ మనుభవించుచున్నను వారికి గొప్పతనము రాదు. తాత్కాలికసుఖ మొకసుఖము కాదు. మన మెప్పుడును ధనము పోయినప్పుడును ముసలితనము వచ్చినప్పుడునుకూడ లోపల నంత రాత్మ పోరులేక సుఖపడునట్లుగా నడుచుకోవలెను. ఆసుఖము నీతి మార్గముచేతఁ దప్ప మఱి దేనిచేతను లభింపదు. నీవు చెప్పినగౌరవ మయినను సత్యవేషమును వేసికొని వచ్చినప్పుడే యసత్యమునకుఁ గొంతకాలము కలుగును గాని నిజస్వరూపముతో వచ్చినప్పు డెప్పు డును గలుగదు.

గీ. ధాత్రిలో గౌరవము పొందఁ దలఁచునేని;
ధర్మవేషంబె వేయు నధర్మ మెపుడు;
స్వస్వరూప మొక్కించుక బయలఁబడిన;
నడుచు నాగౌరవం బెల్ల నాటితోనె. 2.

ఓబ్రాహ్మణోత్తమా! నాకిప్పుడు నీతో వాదమున కవకాశములేదు. ఇఁక బహుభాషలుమాని నీకుఁ గావలసినా నేను గోరినవిత్తమిచ్చి యీసాధ్వినిబానిసనుగాఁ గొనుము. అక్కఱ లేనియెడల మాపని చెడఁగొట్టక నీదారిని నీవు పొమ్ము.

కాల— నీబాగుకొఱకే నేనిప్పుడు నీకుహితము చెప్పితిని గాని నామేలుకొఱకుఁగాదు. నీభార్యను విక్రయించుటకు నీకే చింత

లేకపోయినపక్షమున, మాకుమాత్రమేమిటికి? ఈమె యోగ్యురా లని చెప్పుచున్నావు గనుక నీవీమె కెంతధనము కావలెనందువో కోరుము. ఇప్పుడ నే నారొక్క మిచ్చి కొనెదను.

హరి—ఏనుఁగుమీఁదనెక్కి నిలుచుండి రత్న మెగమీటి నంతయెత్తుధనమిచ్చినజాలును. దానితో నాకిప్పుడు ఋణవిమోచన మగును. నేను మరల నీధనమును నీకు వడ్డితో నిచ్చివేసినప్పుడు మరల నాభార్యను దాస్యమునుండి విముక్తురాలినిగాఁ జేయ వలెనుజుమా.

కాల—అందుకు నేనొప్పుకొన్నాను. ఆయెదుటిదే మాయిల్లు నాతోవచ్చినయెడల విత్త మీభూసురోత్తమున కిచ్చెదను.

హరి—నక్షత్రకా! నీ వాధన మప్పగించుకొమ్ము.

నక్ష—ఓబ్రాహ్మణోత్తమా! ఇఁక నీవు నీబానిసయైన యీ చంద్రమతిని నీవెంటఁ గొనిపోవచ్చును.

కాల—హరిశ్చంద్రా! కొనిపోవచ్చునా?

హరి—(డగ్గుత్తికతో) కొనిపోవచ్చును. (అని కన్నులనీరు పెట్టు కొనుచున్నాఁడు)

చంద్ర—(కన్నుల నీరు నించుచు) ఓప్రాణేశ్వరా! నానిమిత్త మయి మీరడలఁ బోకుఁడు. నాశరీరము దూరముగా నున్నను, నాహృదయ మెప్పుడును మీయొద్దనే యుండును.

హరి—నాబహిఃప్రాణమా! నిన్నుఁబాసి నే నెట్లు తాళఁ గలను? జీవములనుబాసి బొంది యెప్పుడైనఁ దల యెత్తఁగలుగునా! ఇఁక నాకెక్కడిబ్రదుకు? ఎక్కడిసుఖము?

గీ. అఖిలసామ్రాజ్యసంపద లనుభవించి
వైభవసముగ్రుఁ డగుసార్వభౌమునకును
దేవివై యుండి యొక్కని కీవు నేఁడు
దాసివైతివె కటకటా దైవగతిని. (అని యేడ్చుచున్నాఁడు.)

కాల—ఓరాజేంద్రా! నేను గ్రొత్తగా దాసిని గొన్నపు డమంగళకరముగా నీవేల యేడ్చెదవు? ఈలోకము మాన నీహృద యము పదిలపఱచుకొమ్ము. నీచేతలనున్న పంచేంద్రియములలో నొక్కదానిని జయింప లేనివాఁడవు లోకముల నెట్లుజయింపఁగలిగితివి?

హరి—అనుభవించువారు తాము కావప్పుడు పయినుండి పరుల కెన్నినీతులనైనను బోధింపవచ్చును గాని తమకే యాపదలు వచ్చినప్పు డెంతటిపండితులును ఖేదము నొందకుండజాలరు. ఎంతటి వేదాంతియైనను దేలుకుట్టినప్పు డేడువకుండునా?

కాల—అట్లయినపక్షమునఁ బైత్యపునీరు కాఱిపోవునట్లుగా నీవు కావలసినంతసే పేడువుము. మాదాసిని దీసికొని మాయింటికి నేనుబోయెదను. ఓచంద్రమతీ! ఈమాటలను మోచుకొని నావెంట మాయింటికి రమ్ము ఏమి? కదలవేమి? (అని మూఁటలు మీఁద వేయుచున్నాఁడు)

చంద్ర—క్షణము తాళుము. నాభర్తముఖ మింకొక్కసారి కన్నులారఁ జూడనిమ్ము.

కాల—నీభర్త దెప్పుడును జూచెడుప్రాఁతముఖమే. నడువు నడువు. (అని గెంటుచున్నాఁడు.)

లోహి—ఓబిచ్చపుబ్రాహ్మణుఁడా! బలవంతముగా మాయమ్మ నెక్కడకుఁదీసికొనిపోవుచున్నావు?

చంద్ర—ఓలోహితాస్యా! నీవు మీనాన్నగారియొద్దకుఁ బొమ్ము. నీఋణానుబంధము నాకు నేటితోఁ దీఱినది. (అని కన్నుల నీరువిడుచుచున్నది)

హరి—ఓలోహితాస్యా! ఆలిని విడిచిన పాపాత్ముఁడను నా యొద్ద కేలవచ్చెదవు? నీతల్లివెంటనే పొమ్ము.

కాల—ఓబాలకా! నీతల్లివెంబడినే రమ్ము. నీవును నేను కొన్నవిలువలోనివాఁడవే.

హరి—ఇది యేమన్యాయము? నాభార్యను నీకమ్మఁజూపి నప్పుడు నే నీబాలకునిఁ జెప్పలేదే. వేఱుగ వెలయిచ్చి వీనినిగూడఁ గొని తల్లిబిడ్డల నేకము చేయుము.

కాల—నీ వీసుందరిని నాకమ్మినప్పు డీబాలుఁడు జట్టిలోని వాఁడు కాఁడని నాతోఁ జెప్పలేదు. ఆవును గొన్నప్పుడు లేగ దాని తో రాదా? అట్లేయీ బాలుడును దల్లిని గొన్న నాసొత్తె యగును.

నకు—ఈవిషయమయి మీరిరువురును బరస్పరవివాదమేల పడియెదరు? మాగురుప్రసాదముచేత నేను ధర్మశాస్త్రము ల నేకము లెఱిఁగినవాఁడను. నన్ను మధ్యస్థునిగాఁ గోరుకొన్నయెడల మీలో నెవ్వరికి నన్యాయము కలుగకుండ యథాపథిగాఁ దగవు తీర్చెదను.

హరి—నీవు నీయిష్టము వచ్చినట్లు న్యాయము తీర్పుము.

కాల—నేనును నీమధ్యవర్తిత్వమున కొప్పుకొని పుణ్యమును పాపమును నీమీఁదనే వేసెదను.

నకు—అట్లయినపక్షమున నాకుఁ దోచినన్యాయమును జెప్పె దను వినుఁడు.

హరి—సావధానుల మయి యున్నాము చెప్పుము.

నకు—ఏధర్మశాస్త్రప్రకారముగా నే నిప్పుడీతగవు తీర్ప వలెనో సందిగ్ధముగా నున్నది. సందిగ్ధమైన ధర్మశాస్త్రములను మాని నే నిప్పు డభ్యసించుచున్న వ్యాకరణశాస్త్రప్రకారముగా వ్యవహారము తీర్చెదను. వినుఁడు. ఈమె తల్లి! ఇతఁడుపిల్లఁడు. తల్లిలోను పిల్లలోను కారద్వయమున్న సంబంధముచేతఁ తల్లియుఁ బిల్లఁడు నొక్కటే తండ్రిపిల్లల కట్టిసంబంధము లేకపోవుటచే నిద్ద ఱును వేఱు. కాఁబట్టి తల్లిని గొన్న సంబంధముచేత బిల్లవాఁడును గాలకౌశికుని సొత్తెయయినాఁడు. ఓరాజా! ధర్మాధికారివైన నాతీర్పు

నకు బద్ధుఁడ వయి మాఱుమాటాడక లోహితాస్యు నీతని కిచ్చి వేయుము.

హరి—అయ్యా! వ్యవహారనిర్ణయమునకు ధర్మశాస్త్రములు ప్రమాణముకాని శబ్దశాస్త్రముకాదు.

నక—నేను జెప్పినదే ధర్మశాస్త్రము ఋషులవాక్యములే ధర్మశాస్త్రములు. నేనును ఋషికుమారుఁడనే కాఁబట్టి జెప్పినది పిల్లధర్మశాస్త్రము. ఈపిల్లధర్మశాస్త్రమునుబట్టి యీపిల్లవానిని నీతని గొనిపోనిమ్ము.

కాల—ఓమునికుమారా! నీవు ధర్మశాస్త్రపారంగతుఁడవు. నాపాలిధర్మదేవతవలె వచ్చి న్యాయము చెప్పినావు. నేను నీమేలు మఱచిపోను. (అని కౌఁగిలించుకొనుచున్నాఁడు)

హరి—లోహితాస్యా! నీవు నీతల్లివెంట నీబ్రాహ్మణునితోఁ బొమ్ము.

కాల—ఓచంద్రమతీ! నాకు శివపూజాసమయ మయినది. వేగిరము నడువుము.

చంద్ర—నాప్రాణనాథుని సెల వడిగి రానిండు. ఓప్రాణేశ్వరా! (అని పాదములమీఁదఁ బడుచున్నది)

హరి—ఓప్రాణేశ్వరీ! లెమ్ము. విశ్వనాథుఁడు శీఘ్రముగా నీ దాస్యమును దొలగించి నీకు సుఖ మిచ్చునుగాక! (అని కన్నీరు నించుచున్నాఁడు)

చంద్ర—(లేచి) ఓప్రాణేశా! విధి పాపాత్ముఁడయి యిప్పుడు నాకు నీపాదసేవకూఁగ లేకుండఁ జేయుచున్నాఁడు. కటకటా! నిన్నెల్లెడఁ బాయ నేర్తును?

కాల—నాకావలఁ బ్రొద్దెక్కుచున్నది. నీచదువు చాలించి నడువుము.

నీముఖముపయి నీబాలచంద్రరేఖలు పడియుండకపోవునే! పోయినది పోనిమ్ము. నేనిఁక శాంతురాలనయ్యెదను. దీర్ఘక్రోధ మెవ్వరికిఁ గూడదు.

కాల.—ఓప్రాణేశ్వరీ! నీవప్పుడు నన్ను మాటాడ నిచ్చితివా?

కల.—ఇప్పుడును మాటడనియ్యను. ఊరకుండుము. ఓముద్దరాలా! ఇటురమ్ము నీ వీవరకు నాప్రభావ మెఱుఁగవు. నామాట వినఁబడినఁ బొరుగువా రెవ్వరును వీథిలోనికి రారు. ఆమాట యటుండనిచ్చి నీవు చేయవలసినపనులు వినుము. నీవు ప్రతిదినమును జాముప్రొద్దుండఁగా లేచి ప్రాచిపనులు తీరిచి తెల్లవాఱునప్పటికి నాకొలువునకు రావలెను. సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమానమువఱకును జేయవలసినపనులన్నిటిని నీ కాలోచించి తరువాతఁ జెప్పెదను. ఇట్లంటినని సూర్యాస్తమానముతో నీదాస్యము ముగియునని సంతోషింపకుమా. రాత్రిపదిగడియలకు మేముపాన్పు చేరినతరువాత మాకాళ్ళుపట్టి మమ్ము నిద్రపుచ్చవలయును నీ కేదో పని కల్పించి యెప్పటికప్పుడేదో చెప్పుచుండెదను. నీకొడుకడవులకుఁ బోయి యనుదినము తోడిబాలురతో సమిధలును బుష్పములును ఫలములును బత్రములును గొనితెచ్చుచుండవలెను.— మనవీథి నెవ్వఁడో మాలవాఁడు వచ్చుచున్నాఁడు. లోపలికిరా. నీపని యంతయు లోపల వివరముగాఁ జెప్పెదను.—ఓరి చండాలుఁడా! దగ్గఱగా వచ్చుచున్నావేమిరా? ఆగు. ఎవడవురా నీవు?

[అప్పుడు వీరబాహువు ప్రవేశించుచున్నాఁడు]

వీర.—నేను వీరబాహుఁడను. వేగిరము లోపలికిఁ బొండి నేను పోవలెను.

కల—రండిరండి—మమ్ము లోపలికిబోనిమ్ము. ముఱికి పాతలును గల్లుపాయయు దోలుముక్కలును జూచుకొని యేమి పొంగిపడుచున్నావురా? (అందఱును లోపలికిఁ బోవుచున్నారు.)

వీర—(నిలువబడి తనలో) అయ్యో! నక్షత్రకుఁడును హరిశ్చంద్రుఁడును దామింతలోనే యీచోటుఁ బాసియెక్కడకుఁబోయినారో! అతఁడు హరిశ్చంద్రుడన్న వార్త యీపట్టణ మేలెడు రాజునకుఁ దెలిసినపక్షమునఁ గోరినధన మిచ్చి యతఁడు హరిశ్చంద్రుని విడిపించును. అటువంటి వైపరీత్యము పుట్టకమునుపే నేను వారిని గలిసికొని విశ్వామిత్రుఁడు నాకిచ్చినధనముతో హరిశ్చంద్రుని వేగిరము కొనవలెను. అతఁడు నాచేతఁ జిక్కినా, విశ్వామిత్రుఁడు నాతోఁ జెప్పినదంతయుఁ జేసి యాతనిని బాధపెట్టెదను. (అని పయివంకఁజూచి) అదిగో వారీవంకనే వచ్చుచున్నారు.

[అప్పుడు నక్షత్రకుఁడును హరిశ్చంద్రుడును మరలఁ బ్రవేశించుచున్నారు.]

నక్ష—ఏవాడను దిరిగినను నిన్నెవ్వరును కొనకున్నారు. దైవము నిన్ను మాలవానికే దాసుఁడవు కమ్మని వ్రాసెను గాఁబోలును! మాలగూడె మీసమీపమున నేయున్నఁడట! రమ్ము.

హరి—విధి నన్నేమి చేయఁదలఁచుకొన్నాఁడో యట్లు కాక మానదు. ఇక్కడ నొక్కసారి కేక వేయుము. (తనలో) నామనస్సున కారాటము హెచ్చుచున్నది.

నక్ష:—

గీ. సత్య మెప్పుడుఁ దప్పని సజ్జనుండు
పదువురను మించి పనిచేయు బాహుబలుఁడు
వీని నిప్పుడు నేఁ జెప్పవెల యొసంగి
వచ్చి కొనరయ్య వేవేగఁ బౌరులార!

హరి—అయ్యో! ఈపగలెంతదీర్ఘముగానున్నది! నేటిదినము సూర్యాస్తమానమే లేనట్టున్నదే! ఈ దినము సూర్యుఁడు క్రుంకఁడు. ఆహా! ఏమి యీవింత! ఎప్పుడును వెలుతురునే కోరుచుండెడు నేను నేడుఁ చీఁకటిని గోరుచున్నాను!

మ. ధరఁ బ్రేమాస్పదులైనవారలు కడున్ దవ్వైనచోఁ జాల సుం
దరమావస్తువుకూడఁ జిత్తమున కెన్నందా నసహ్యంబగున్;
గరముం జల్లనిపండువెన్నెలలునుం గల్గించు సంతాపమున్;
బెరుఁగం జేయని దేది దుఃఖమును బృథ్వీ గష్టకాలంబునన్.

ఈ మనస్తాపమున కంతకును నా ప్రాణేశ్వరియే కారణము.

ఉ. ఇంతిరో! నీవు చెంత వసియించిన నెండయు వెన్నెలయ్యె; న
త్యంత సుగాన మయ్యెను మదాత్మకు నీదుగళస్వనంబు; నీ
వింత యొసంగినట్టిఫలమెల్ల సుధాసమ మయ్యె నప్పు; నా
కెంతయు నింద్రభోగసుఖ మిచ్చెను వింతగ నీదుస్పర్శయున్.

వీర—(సమీపించి) ఓ బ్రాహ్మణోత్తమా! నిలువునిలువు. నేను వచ్చుచున్నాఁడను.

నళ—నీ వెవఁడవు?

వీర—నేను వీరబాహుఁ డనుమాతంగుఁడను. నీవమ్మఁ జూపుచున్న యీతనిని గొనుటకయి వచ్చినాను. నీ కెంతధనము కావలెనో చెప్పుము.

నళ—నా కేనుఁగుమీఁద నెక్కి రత్న మెగమీటినంత యెత్తుధనము కుప్పవోసితివా, యీరాజును నీకు విక్రయించెదను.

వీర—ఈరా జేమిపనులు చేయును?

నళ—అన్నిపనులును జేయును-ఓరాజా! నీవే మేమిపనులు చేయగలవో చెప్పు.

హరి—ఈతడు చెప్పిన న్యాయమయిన పనుల నన్నిటిని జేసెదను.

నక్క—మఱియేపనులను జేయవా?

హరి—నామనస్సుకు మంచివికావని బోధించుపనులను నే నెట్లు చేయఁగలను?

వీర—ఓవిప్రోత్తమా! ఇతఁ డేమనుచున్నాఁడో విన్నావా! అప్పుడే యితఁడు నేనుజెప్పినపనుల నన్నిటిని జేయుననుచున్నాఁడు. తన మనస్సుకునచ్చినపనుల మాత్రమే చేయునఁట! ఇంతధన మిచ్చి కొని యిట్టిసేవకుని నే నేమిచేసుకొను?

నక్క—ఓరాజా! రాకరాకవచ్చినబేరమును నీవిప్పుడు చెడఁగొట్టుచున్నావు. నన్నిట్లు చిక్కులు పెట్టి చంపుటకన్న ఋణము తీర్ప నిష్టము లేదనియే చెప్పరాదా?

హరి—సత్యముతప్పిన ధర్మహానివచ్చునని ధర్మమునిమిత్త మమ్ముడు పోవుచున్న నే నీతని నిమిత్తము ధర్మవిరుద్ధము లయిన పనులు చేయుదునా? ఈతఁడు తగవుమాలి యెవ్వరితల యయినఁ బగులగొట్టమన్నఁ గొట్టుదునా? ఎవ్వరిసొత్తయిన దొంగిలింపుమన్న దొంగిలి తెత్తునా?

వీర—అట్టి ధర్మబాహ్యములయినపనులు నే నెప్పుడును జెప్పను.

హరి—చెప్పకపోయినయెడల, నీయాజ్ఞలనన్నిటిని నేను శిరసా వహించి చేసెదను.

వీర—నీవు మరి యేమి కోరికలు కోరెదవో యిప్పుడేచెప్పు. నీవు చెప్పెడిది నా కంగీకారమయినయెడల నిన్ను గొనెదను; లేదా, మానుకొనెదను.

హరి—నే నింకొక్క కోరిక కోరవలసి యున్నది. నేను స్వహస్తపాకముచేసికొని తినుచు దూరముగా నుండి నీసేవచేయుట కంగీకరింపవలయును. ఇంతకన్న వేఱుకోరికలు లేవు.

వీర—ఓబాపనయ్యా! నేనీతఁడు చెప్పినదాని కంగీకరించితిని గాని నా మనస్సు నొక్కసంశయముమాత్రము బాధించుచున్నది. ఈతఁడాలుబిడ్డలు లేని యేకాకి. ఈతని నెట్లు నమ్మవచ్చును? ఉన్నట్టే యుండి యేయర్ధరాత్రివేళనో యీతఁడు నన్నేమఱించి పారిపోయిన నేది దిక్కు? అప్పుడు నాధనము నాకిచ్చుట కెవ్వరయినఁ బూట పడువారున్నారా?

నక—ఓమాతంగపుంగవా! నీవట్టిసందేహము పెట్టుకోవల సిన పనిలేదు. దానమిచ్చిన ధనమును దీర్చుటకే భార్యాపుత్రులను బోఁగొట్టుకొని యేకాకియై యిట్లిడుములు బడుచున్నయీతఁడు నీవద్ద బుచ్చుకొన్నధన మపహరించి పాఱిపోవఁజూచునా? ఇట్టిపనికిమాలిన శంకలు మాని నీవీతనిని విశ్వసింపవచ్చును. ఒకవేళ నితఁడు మోసము చేసి నీధనమపహరించి పారిపోవునంతటివైపరీత్యమే పుట్టినపక్షమున నీ ధనము నీకు మరల నిచ్చివేయుటకు నేను బూటపడెదను.

హరి—ఓ మాతంగపుంగవా! నే నొక్కమాటచెప్పెదను వినుము. సత్యపరిపాలనము నిమిత్తమే రాజ్యమంతయు నిడిచి అర ణ్యములపాలయి, భార్యాపుత్రులనుబోఁగొట్టుకొని, ఆత్మవిక్రయము నకు సహితము లోఁబడితిని. నీవద్ద భయభక్తులతో గొలువు చేసె దనని చెప్పుచున్నాను. కాఁబట్టి నాసత్యవాక్యమునందే గౌరవముంచి కోరినధన మీవిప్రకుమారున కిచ్చి పంపివేయుము.

వీర—ఇప్పుడు నీమీఁద నాకు విశ్వాసము కలిగినది. ఇఁక నాకర్థభయములేదు.- ఓబ్రాహ్మణోత్తమా! నావెంట మాపల్లెకు రమ్ము. నీవిత్తమిచ్చెదను.

నక—ఇదిగో వచ్చుచున్నాను. హరిశ్చంద్రా! ముందు నడు వుము.

హరి—నడుచుచున్నాను—ఓవీరబాహూ! నేను నీయొద్ద జేయవలసినపని యేమి?

వీర—నే నీయూరి ప్రేతభూమికధికారిని. నేఁడు మొదలుకొని నాయాజ్ఞచేత నాయధికారమును నీవు వహించి, అహోరాత్రములందుఁ గనిపెట్టియుండవలెను. అక్కడ కాల్చుట కెవ్వరు శవమును దెచ్చినను కాటికట్న మొకమాడ పుచ్చుకొనక దహనము చేయనీయఁగూడదు. నీయాజ్ఞ చెల్లుటకయి యిదిగో నీకునాముద్రగుదియ నిచ్చుచున్నాను. (అని తనచేతికఱ్ఱనిచ్చి) నీకిప్పుడు వీరదాసుఁడను పేరిచ్చుచున్నాను. నేఁటినుండి నీవీ పేరితో స్మశానవాటికయందు రాత్రిందివములు మిక్కిలి జాగరూకుఁడవయి యుండవలెను. ఈ కల్లుపంటిని నావెంటఁ గొనితెమ్ము. (అని కల్లుకుండ నిచ్చుచున్నాడు)

హరి—మీరు చెప్పినపని యెల్లను జేసెదను. (అని కల్లుపంటి పట్టుకొని నడుచుచున్నాఁడు)

వీర—ఓవీరదాసా! వేగిరము రమ్ము.

(అందరు నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము

రంగము—స్మశానవాటిక

[వీరదాసుఁడును, తదనుచరుఁడగు మధుదాసుఁడును ప్రవేశించుచున్నారు]

మధు—ఓమహారాజా! దివ్యభవనములలో సంగీతారావములు కానందించు చెవులతోఁ బితృవనములలో నృగాలారావము

లాలకించుచు, ఏనుఁగులను నడిపిన చేతులతోఁ బీనుఁగులను నడుపుచు, వీరదాసను పేరున మాలవాడలో నీవిప్పు డెంతకష్టపడవలసి వచ్చినది? ఇన్నికష్టము లనుభవించుచున్నను నీవు నిశ్చింతుఁడవై యుండుట చూడఁగా నాకాశ్చర్య మగుచున్నది.

వీర—ఓమధుదాసా! స్వామికార్య పరాయత్తచిత్తుఁడనయి కష్టములు మఱచియున్న నాకిప్పుడు పూర్వకష్టములను స్మరణకుఁ దెచ్చి దుఃఖము పుట్టింపకుము. అన్నికష్టములు వచ్చినను, వాని నన్నిటిని మఱపించుటకయి యాపదలయందు సహితము సత్యము విడువలేదన్న సంతోష మొక్కటే నాకుఁ జాలును. ఈసంతోషములో నాకేదుఃఖములును దోఁచవు. అయినను మానుషప్రకృతి యగుటచేత వెనుకటివిపత్తులు దలఁపునకు వచ్చినప్పుడుమాత్రము దుఃఖమాగదు. నీమాటలచేత నాదురవస్థ యిప్పుడు నాకుఁ దలఁపునకు వచ్చుచున్నది.

ఉ. నేనిఁట గాటికాపరికి నీచపుభృత్యుఁడనైతి నక్కటా!
తానును దాసి యయ్యె వసుధాసుర ధూర్తునియింటభార్యయున్;
భానుసమానతేజుఁ డగుపట్టియు సేవకుఁ డయ్యె; నయ్యయో!
నే నెటు దుఃఖ మాపుకొన నేరుతు నిన్నియుఁ జిత్తమేపగన్? 1

(అని కన్నీరు విడుచుచున్నాఁడు)

మధు—ఓరాజేంద్రా! శోకమడచుకొమ్ము. ఆపంక నెవ్వరో మన సుంకమియ్యకయే దహనము నిమిత్తమై శవమును దింపినట్లున్నారు. పడమటికడను జూడుము.

వీర—స్వామికార్యము పేరుచెప్పఁగానే నాదుఃఖమంతయుఁ బాఱిపోయినది. మన మక్కడకుఁ బోయి కాటిరూక లియ్యక మనలను వంచింప నెంచిన యావంచకుల నదలింతము. (అని నిక్కిచూచి) ఇప్పుడు తెలిసినది. అది పశుకళేబరము కాని మనుష్యకళే

బరముకాదు. పశ్చిమమున వాలుచున్న సూర్యుని కిరణములచేత మనకన్నులు మిఱుమిట్లు గొని యాదిక్కున నున్నవానిని దిన్నగాఁ గానకున్నవి. ఎండకుఁ జే యడ్డము పెట్టుకొని యిప్పుడావంకఁ జూడుము.

మధు—(చూచి) అవు నవును. అది నేటి ప్రాతఃకాలమునఁ జచ్చినధేనువుయొక్క కళేబరము. ఆమొండెమును లాగుచున్న కుక్కలను జూచి మనుష్యులని భ్రమపడినాను.

వీర—అట్టిభ్రమ మొదట నాకును గలిగినది. ఆశునకములు మోఱ లెత్తుకొని మొఱుఁగుచు నొకదానితో నొకటి యెట్లు కలహించుచున్నవో చూడు.

మధు—అట్లు పోరుచున్న వొక్కకుక్కలు మాత్రమే కావు. రాజ్యభాగమునిమిత్తమయి యుద్ధముచేయు వీరభటులవలెనే మాంసభాగమునిమిత్తమయియాకాశమున కెగసి కాకులును యుద్ధయు చేయుచున్నవి.

వీర—వట్టియుఱపులేకాని కాకులలోఁ గాట్లాటలంతగా లేవు.

చ. మనుజుల కైకమత్స్యమును మన్నన నేరుపు చున్నవో యనన్
గనుఁగొను మామహీజములఁ గాకులుగుంపులుకూడియొండొరున్
ఘనమతిఁ బిల్చుచున్ బిశితఖండము లల్లన నారగించెడున్
దునుకలు కాళ్ళక్రింద నిడి తోటిపుటంబులఁజించి చీల్చుచున్. 2

మధు—అవి యట్లే యున్నవి. రెండును ద్విజాతులేయైనను గాకుల కున్న యైకమత్స్యము గ్రద్దలకుఁ గానరాకున్నది. అవి నోరెత్తి యొకదాని నొకటి పిలిచిన పాపమునఁ బోకున్నవి.

వీర—ఆగ్రద్దలను నిపుణముగాఁ గనిపెట్టుము.

ఉ. గ్రద్దలు కొన్ని చంచువునఁ గట్టిగ మాంసము లాగి మెక్కఁగాఁ
దద్దయు మండలాకృతిని దవ్వుల మింటఁ బరిభ్రమించుచున్

గ్రద్దలు కొన్ని చూచి తమకంబున నోళ్ళను విప్పి తెక్కలన్
బెద్దయుఁ జాచి వేఁదిగెడు బీనుఁగుమీఁదికిఁ జూడు మాదెసనే.

మధు—ఇటు మనము మాటాడుచుండఁగానే సమస్తవస్తువులు నెఱ్ఱపడుచున్నవి. ఆకాశమునుండి మేఘములు రక్తవర్షము కురియుచున్నవా యేమి?

వీర—ఓయీ! నీ విప్పుడు సాయంకాల మగుచున్నదన్న మాట మఱచిపోయినావు. సూర్యుఁడు తనకిరణముల వేడిఁమిని బోఁగొట్టుకొని శాంతమూర్తియయి పశ్చిమమునఁ గ్రుంకఁబోవుచున్నాఁడు. నీ విప్పుడు చూచినది సంధ్యారాగముగాని రక్తవర్షము కాదు. ఇప్పుడు సూర్యుఁ డెంత మనోహరముగా నున్నాఁడో చూచినావా?

క. అమ్మార్తాండుని దెసఁగనుఁ
గొమ్మామూలాగ్ర మొక్కఱుప్పగ నత్యం
తమ్ముఁ జిగిర్చినయెఱ్ఱని
క్రొమ్మామిడిగున్నవంటి కొమరువహించెన్. 4

కాఱుక్రమ్ముకొనుచున్న యీకటికచీఁకట్లు పల్లవభక్షణాపేక్షచేతఁ జనుదెంచుచున్న కోయిలగుంపులవలె నున్నవి.

మధు—నాదృష్టి కెఱ్ఱనైన యాసూర్యబింబము మండుచున్న సొదగాను, చీఁకట్లు దానిపయి పొగలుగాను, నక్షత్రములందుండి లేచిన మిడుఁగురులుగాను, పొడకట్టుచున్నవి.

వీర—కాటికాపరివాఁడవగుటచే నీమన స్సెప్పుడును జితుల మీఁదను, శవములమీఁదను, మంటలమీఁదనే యుండును. అందుచేత నీకుసర్వమును కాష్ఠమయముగానే తోఁచుట యాశ్చర్యము కాదు. ఆహా! మనము చూచుచుండఁగానే యెంతలో గాఢాంధకారము వ్యాపించి కన్నులు నిరర్థకములయి మిట్టపల్లము లెఱుఁగ

రాక మిన్నునుమున్నును నేకమయిపోయినవి! నీ వొక్కగడియ సేపిందుఁ గూరుచుండి యప్రమత్తుఁడవై కాచియుండుము. నేనింతలో సాయం కాలకృత్యములను దీర్చుకొనివచ్చి స్వామి కార్యతత్పరుఁడ నయ్యెదను.

మధు—నీవు పోయిరమ్ము. నీవుమరల వచ్చువఱకును నేను గనిపెట్టియుండెదను.

వీర—పోయివచ్చెదను. నీవు క్షణకాలమయిన నేమఱి యుండఁగూడదునుమా. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

మధు—అయ్యో! నాకప్పుడే యావులింతలు వచ్చుచున్నవి; తెప్పలుమూసికొనిపోవుచున్నవి. ఈలోపల నొక్కనిద్రతీసి వీర దాసు మరల వచ్చునప్పటికి మేలుకొని కావలి కాచుచుండెదను.

(మంచెకుఁ జేరగిలఁబడి నిద్రపోవుచున్నాఁడు.)

[అప్పుడు లోహితాస్యుని భుజముమీఁద వేసికొని విలపించుచునొక్క బ్రాహ్మణబాలకుఁడు వెంటరాఁగా చంద్రమతి ప్రవేశించుచున్నది.]

బాల—అమ్మా! మన మిప్పుడు స్మశానవాటికకువచ్చి నాము. మనమేఱుకొనివచ్చినచితుకలతో సొదఁ బేర్చి యీలోహి తాస్యున కిక్కడ దహనసంస్కారము చేయవచ్చును.

చంద్ర—(లోహితాస్యుని దింపి యాతనివంకఁ జూచుచు) నాకన్నతండ్రీ! ఓలోహితా! నేనెంత పిలిచినను నాతో మాటాడ వేమి? బ్రాహ్మణుని నిమిత్తమయి నీవు విఱిచినసమిధ లిప్పుడు నీకే వినియోగపడవలసివచ్చినవా? "ఓవిప్రవరా! మీయాజ్ఞచొప్పున నరణ్యమునకుఁ బోయి సమిత్కుశాదులను దెచ్చితి"నని యింకగాల కౌశికున కెవ్వ రర్పింతురు! ఫలపర్ణకుశాదులు తక్కువ తెచ్చితి వని కాలకౌశికులు కోపపడి కొట్టితిట్టెనని కన్నుల నీరుగార నేడ్చుచు వచ్చి యిప్పుడు నాతోజెప్పవేమి?

బాల—అమ్మా! దుఃఖపడఁబోకు. పాపాత్ముఁ డయిన యీ కాలకౌశికుని పేరిప్పుడేల యుచ్చరించెదవు? వాని పేరు విన్నఁ బాపమువచ్చును. కటకటా! ఆపాపిమూలమున నేక దా నవమన్మథుని వంటి యీ బాలకునికిటువంటిగతి పట్టినది! ఓకౌశికా! ఇప్పుడయిన నీకు సంపూర్ణసంతోషము కలిగినదా?

చంద్ర—ఓవిప్రబాలకా! కాలకౌశికుని నిందింపఁబోకుము. మాభాగ్యమిట్లుండఁగా నతఁ డేమి చేయఁగలఁడు? ఓలోహితా! దుఃఖమాపుకొందునన్నను నాగక మహాసముద్రమువలె లోపలి నుండి పొరలిపొరలి వచ్చుచున్నది. (అని యేడ్చుచున్నది.)

బాల—అమ్మా! అడలఁబోకుము నీయరణ్యరోదనమువిని యిక్కడ నిన్నోదార్చు వారెవ్వరున్నారు? సహించుకొమ్ము. అగ్ని హోత్రమువలెనే దుఃఖమును స్వాశ్రయమును దహించును. ఈయర్ధ రాత్రమున నీస్మశానభూమిలోఁ దడవు నిలువఁగూడదు. వేగిర మీతని కగ్నికార్యముచేసి పట్టణమునకుఁ బోదము లెమ్ము.

చంద్ర—ఓవిప్రబాలకా! రాత్రి చీఁకటిలో మిక్కిలి నిన్నా యాసపెట్టినాను. క్షమింపుము. నాయేలిక సానియయిన కలహాకంటకి నన్నంపుట కాలస్యము చేసినందున నిన్నీనిశీధవేళదాఁక నిలుపవలసి వచ్చినది. నీవు గాఢాంధకారములో మహారణ్యమార్గమున నన్నుఁ గొనివచ్చి యీకుమారుఁడు పడియున్న చోటు చూపి పుణ్యము కట్టు కొన్నావు. నీఋణము నేను దీర్చుకోలేను. నేను జేయఁగలిగినది కృతజ్ఞతాపూర్వకమయిన నమస్కార మొక్కటి చేసెదను. దాని నంగీకరించి యింటికడ నీతల్లిదండ్రులు నీనిమిత్తమయి యడల కుండ వేగముగా నిల్లుచేరుము. గుడ్లగూబలు తొఱ్ఱలువెడలివచ్చి కూయుచున్నవి; పాములు బుసకొట్టుచున్నవి; నక్కలరచుచున్నవి. త్రోవలో భయపడక పదిలముగా నింటికిఁ బొమ్ము.

బాల—ఇవి యన్నియుఁ బిఱికివారికి భయము పుట్టించును గాని నావంటివానిని జడిపింపలేవు. అర్ధరాత్రమునఁ బుత్రశోకాతురవై యున్న నిన్నీ నట్టడవిలో నొంటిగా దిగవిడిచి నేనెట్లు పోగలను? పరమ పాపాత్ములకైనయాకలహాకంటకి పుత్రుఁడడవిలో మడిసెనన్నను నిన్ను విడిచిపెట్టక కానిమాట లాడి దుఃఖసముద్రములో నున్న నీచేతఁ బనిచేయించి యెంత చేసినది? అడవిలోఁ బడి యున్నకొడుకు నొక్కసారి చూడనిచ్చి పుణ్యము కట్టుకొమ్మని నీవు దీనత్వముతోఁ బ్రార్థించినప్పు డాదుష్టురా లాడినదుర్భాషలు నామనస్సు నిప్పుడును వేధించుచున్నవి. తెల్లవాఱినతరువాత నేనీ నీచురాలితులువతనమును నాసహపాఠులయిన బ్రహ్మచారులతోఁ జెప్పి నేనును వారును జేరి యెట్లు పగతీర్చుకొనెదమో నీవే చూచెదవు.

చంద్ర—ఓవిప్రబాలకా! నీకు నమస్కారము చేసెదను. నానిమిత్తమయి మీరావి! పభామినిమీఁద నెంతమాత్రమును దుడుకుతనము చూపఁబోకుఁడు. నేనామెకు శరీర మమ్ముకొన్నదానను. దాసురాలనయియున్న నన్నామె కానిమాటలాడి యయినను బనితీఱినతరువాత విడిచిపెట్టినందుకే సంతోషపడవలెను.

బాల—అమ్మా! నీవుపుత్రశోకములో మునిఁగియున్నప్పుడు—

చంద్ర—పుత్రశబ్దోచ్చారణముచేత దుఃఖము పొరలిపొరలి వచ్చుచున్నది. నేనీదుఃఖమును సహింపఁజాలను. ఇప్పు డీవృక్షమున కురిపెట్టుకొని ప్రాణములువిడిచి శీఘ్రముగాఁ బోయి పరలోకమున నాపుత్రునిఁగలిసికొనెదను. హర హరా! ఎంతపాపపుఁదలంపు తలఁచితిని! ఇక్కడ రజ్జుబంధముచేతఁ బ్రాణహానిచేసికొన్నపక్షమున నన్నుఁ గొన్న బ్రాహ్మణుని వంచించినదానననగుదును. అంతేకాక యాత్మహత్య నరకహేతువనియుఁ బెద్దలు చెప్పుదురు—ఓపుత్రకా! నన్నుఁ

గన్నతండ్రీ! నాతొడలమీఁద మోపెడునీశిరము నీకటికి నేలను మోపుచున్నావా? (అని కొడుకును క్రింద దింపి కూలఁబడుచున్నది.)

బాల—(పడకుండఁ బట్టుకొని) అమ్మా! మూర్ఛిల్లబోకుము. దుఃఖము మ్రింగి ధైర్యము తెచ్చుకొమ్ము.

చంద్ర—(గద్గదస్వరముతో) ఓతండ్రీ! నేనెట్లు దుఃఖ మాపుకోఁగలుగుదును? హా! కుమారా! హా! లోహితాక్ష్యా! నీపాలిటి కకాలమృత్యుదేవతయువచ్చిన యీకాలసర్పము నిన్నుఁ గాటువేసినప్పుడు విషమెక్కి సర్వాంగములును నిర్వేదింపఁదల్లడిల్లి నన్నుఁదలఁచుకొని యెంతపరితపించితివో గదా! హాపుత్రకా! నిత్యమునుగన్నులముందట సంపూర్ణపూర్ణిమాచంద్రునివలె నీముద్దు మొగము కానఁబడుచుండఁగా భర్తనుబాసి యున్నదుఃఖమును మఱచియున్న నన్నగాధమైన శోకసముద్రములో ముంచి విడిచి పోయితివా? కటకటా! నాకింకదిక్కెవ్వరున్నారు? పుష్పసుకుమారములయిన యీబాహువులతో దేహము చల్లఁగా నన్నెవ్వరింక గౌఁగిలించుకొందురు? తేనియలొలుకు ముద్దుపలుకులతో నావీనులకు విందులు గొలుపువా రెవ్వరు? ఓకుమారా! నామాటలకు మాఱుపలుక వేమి? (అని పెద్దపెట్టున నేడ్చుచున్నది.)

[అప్పుడు వీరదాసు ప్రవేశించుచున్నాఁడు.]

వీర—(చెవియొగ్గి యాలకించి) ఈస్మశానభూమిలో నేదో రోదనధ్వనివినఁబడుచున్నది. కంఠస్వరము చూడఁగా స్త్రీకంఠము వలెనున్నది. ఈయర్ధరాత్రివేళ నెవ్వరిక్కడ నేడ్చుచుందురు? నేను బోయి విచారించి వచ్చెదను—ఓమధుదాసా! నీవాయార్తనాదము వినుచున్నావా? ఏమి! మధుదాసుఁడు త్తరము చెప్పకున్నాఁడు! వీఁడు నిద్రపోయినాఁడు కాఁబోలును. ఒకవేళ తనపేరు సార్థకమగునట్లుగా మధుపానముచేసి మత్తెక్కి యొడలు తెలియక పడిపోయినాఁడేమో!

(అని చేరువకుఁ బోయి) మధుదాసా! మధుదాసా! (అని లేపు చున్నాఁడు.)

మధు—(ఉలికిపడి లేచి) నేను జాగరూకుడనయి కావలి కాచుచున్నాను. ఇట్లు స్వామికార్యతత్పరుడనైయున్నప్పుడు వేయేం డ్లయినను నాకంటికి నిద్రరాదు.

వీర—(తనలో) వీఁడు మత్తుగొని యవ్యక్తప్రలాపములు చేయుచున్నాఁడు. తప్పుఁద్రాగియేయుండును. (ప్రకాశముగా) మధు దాసా! నీవు మత్తుగొనియున్నావు. సురాపానము జేసినావా?

మధు—అయ్యా! మీపాదములతోడె! నేనీసాయంకాల మొక్కచుక్కయయినను గల్లు చవిగొనలేదు. మీరు చేసిన బోధనుబట్టి యిఁక సురాపానము చేయరాదని వ్రతముపట్టి యీ సాయంకాలమునుండి మానుకొన్నాను. నాకున్న యీమత్తుస్వాభా వికముగా నున్నదే కాని కల్లువలనఁ గలిగినది కాదు.

వీర—కానిమ్ము. ఈచేరువ నామజ్జివంక నెవ్వరోరోదనము చేయుచున్నారు. నే నక్కడకుఁ బోయెదను. నీవు దీపము వెలిఁగించు కొని శీఘ్రముగా రమ్ము.

మధు—మీవెనుకనే వచ్చెదను బొండి. నాకాయేడుపిప్పుడు వినఁబడుచున్నది. ఇంతవఱకును నిద్రలో వినఁబడినదేకాదు. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

వీర—(కొంచెము నడిచి) ఈనడిరేయి యిక్కడ రోదనము చేయుచున్నవారెవ్వరు?

చంద్ర—(గద్గదస్వరముతో) అయ్యా! నేనీపట్టణములో నుండెడియొక బ్రాహ్మణుని బానిసదానను: నాపేరంసనారి.

వీర—నీవీరీతిగా నర్ధరాత్రసమయమున నొంటిగా నీపరేత నిలయమున కేతెంచి యేల యేడ్చుచున్నావు?

చంద్ర—(గద్గదస్వరముతో) అయ్యా! నాపుత్రుడు వీడుఫలస మిత్కుశాహరణార్థ మడవికి వచ్చి యాకులు కోయుచు సర్పదుష్టుడై ప్రాణములువిడిచినాడు.

వీర—అయ్యో! పాపము నీ కిప్పుడెంతయాపద వచ్చినది! తరువాత—

చంద్ర—(గద్గదస్వరముతో)పిడుగువంటి యీవార్తను వెంటఁ బోయిన బ్రాహ్మణబాలకులు వచ్చి చెప్పఁగా మొదలునఱికినకదళీ తరువువలె నేలఁగూలికొంతవడికిఁదెప్పిఱిలి విలపించుచు, పరాధీనతయి యుండుటచేత వెంటనే వచ్చిపుత్రశవమును జూచుటకైన వలనుపడక నాయజమానురాలు చెప్పినపనులన్నియుఁజేసి యామెనిద్రపోయిన తరువాత నీవిప్రకుమారునిఁతోడుగాఁగొని వెదకుకొనుచువచ్చి యడవిలో నీకుమారుని శరీరము పొడగన్నాను.

వీర—కటకటా! నీయజమానురాలెంతకఠినజిత్తురాలు!(తనలో ఈమెమాటలు వినఁగా నామనస్సులో నాపుత్రుడుపోయినట్లుదుఃఖము కలుగుచున్నది. స్పష్టముగా వినఁబడకపోయినను నాకీమెకంఠస్వరము మున్నెన్నఁడో విన్నదానివలెగూడఁ గొంచెము పొడకట్టుచున్నది.

చంద్ర—(గద్గదస్వరముతో) ఆమెనిద్రనుండి మరలలేవక మునుపే యీబాలునకు దహనసంస్కారముచేసి యిల్లుచేరి మరలఁ బనులు చేయుటకయిపోవలెను. ఓమహానుభావా! నీవు నాకీపనికిఁ గొంతతోడుపడవలెను.

వీర—నీవు కాటిమాడ తెచ్చినావా? సొద పేర్పఁదగినంత చోటికొక్కమాడ యియ్యవలెను. ముందుగా నారెండురూప్యము లును నాచేతిలోఁబెట్టి తరువాతదహనవిషయమయి మాటాడుము. అప్పుడగ్నిసంస్కారవిషయమున నేనునీకుఁగావలసినంతసాహాయ్యము చేసెదను.

చంద్ర—ఓదయామయా! నే నిప్పుడునిఱుపేదరాలనయి యున్నదానను. నాకిక్కడ నెవ్వరును దిక్కులేరు: కడుపుకూటికయి యొకరికి శరీరమమ్ముకొని పరుల పెట్టుపోఁతలకు లోనయి పరాధీనురాలనయి యున్ననాకు మాడ ఎక్కడనుండి వచ్చును? గతిమాలి యున్న నన్ననుగ్రహించి యీబాలుని యగ్నిసంస్కారమునకయి బారెఁడు నేలను ధర్మార్థముగా దయచేయుము.

వీర—నేనిక్కడ మోమోటపడి యూరక సొద పేర్పని చ్చినపక్షమున నాకు స్వామిద్రోహము సంభవించును. మాడగొనక మూరెఁడు నేలయైనను నేనియ్యఁజాలను.

చంద్ర—(కన్నులనీరి కార నార్తస్వరముతో) హాకుమార కా! సార్వభౌమత్వము పొందవలసిన నీకెంతగతి పట్టెనది! హాదైవమా! సప్తసముద్ర ముద్రితమయిన సమస్తధాత్రియు నేలుచుండెడు చక్రవర్తిపుత్రుఁడు బారెఁడునేలకు నోచుకోకబోయెనుగా! కటకటా! కాలవక్రత నేమనవచ్చును?

వీర—(తనలో) అక్కటా! ఈమె మాటలు శూలములవలె నాటి మనస్సునకు నొప్పి కలిగించుచున్నవి. ఈమె పలుకుబడి చంద్రమతి దానిని గొంత పోలియున్నది. ఈబాలుడు లోహితాస్యుఁడు కాఁడుగదా! మధుదాసుఁడు దీపము వెలిగించుకొని వచ్చుచున్నాఁడు. ఆదీపకాంతి నన్ను శోకాంధకారమున ముంపకుండును గాక! (ప్రకాశముగా) ఓకాంతా! దైవము జేసినదాని కేల చింతిల్లెదవు? వేయేడులు దుఃఖించినను పోయినవాఁడు మరల లేచిరాడు. నీయేడుపు చూచి దాక్షిణ్యము వహించి నేనిప్పుడు మాడవిడచిపెట్టరాదు. నీమెడలోని మంగళసూత్రమునందున్న బంగారు కాళినివిక్రయించియైనను మాడతెచ్చి యిచ్చి దహన క్రియకుఁబూనుము.

చంద్ర—(దుఃఖముతో తనలో) ఇది నాప్రాణనాథుని కంఠ నాదమువలె నున్నది, కటకటా! నా పాపపుఁగన్ను లేమిచూడనున్నవో ఓహృదయమా! నీవింతట నైనను సహస్ర ఖండములుగాక వజ్ర కాఠిన్యము వహించుచున్నావేమి! ఇతఁడు నా ప్రాణేశ్వరుఁడే కాక పోయినయెడల, పతివ్రత నైన నాకంఠమునందలి శతమానము పరుల కెట్లు నేత్రగోచరమగును? సందేహము లేదు! ఇతఁడు నాప్రాణవల్ల భుడే. దీపపు వెలుతురున స్పష్టమయినది. అయ్యో! ఇప్పుడితఁడెంత మాఱిపోయినాడు! (ప్రకాశముగా) ఓచునోవల్లభా! తొల్లినీయూరు తలమున నిద్రపోయెడు లోహితాస్యుఁడీభూమితలమున దీర్ఘనిద్ర పోయియున్నాఁడు చూడుము.

[దీపము పట్టుకొని మధుదాసుఁడు ప్రవేశించుచున్నాడు.]

మధు—ఇదియేమి! నేను దీపము గొనువచ్చుచున్నప్పటి కీవీర దాసుమూర్ఛిల్లుచున్నాఁడు! (అని యాతనిని పట్టుకొనుచున్నాఁడు)

వీర—(కూలఁబడుచున్నాడు.)

చంద్ర—ఓప్రాణనాథా! మూర్ఛిల్లబోకు. ఓసార్వభౌమా! నీకిప్పు డీరుద్రభూమియే రాజ్యమయినదా? ఈకఠినశిలయే హంసతూ లికాతల్పము లయినవా?

వీర—(తెప్పిఱిలి నిట్టూర్పువిడిచి) హాపాపపుదైవమా! మంద భాగ్యుఁడనైన నాకాపదలమీఁదనే యాపదలు తెచ్చుచున్నావా? హా! కుమారకా! చేరవచ్చికౌఁగిలింపుమోని నాకొక్కసారి ముద్దియ్య వేమి? ఇఁక నాతోడలమీఁదఁగూరుచుండి యమృతరస మొలుకు ముద్దుపలుకులతో నాకుఁ గర్ణోత్సవ మెవ్వరుచేయుదురు? ముం దెప్పుడో నాకుఁ దిలోదకము లిచ్చి సుగతి కల్పింతువని యాశ పడియున్న మేమే యీకన్నీటితో నీకిప్పుడు తర్పణము చేయవలసి వచ్చినదా?

చంద్ర—ఓప్రాణనాయకా ! ఊఱడిల్లుము. నీవుపుత్ర మోహమునువిడిచి శీఘ్రముగా దహనసంస్కారముజరుగుమార్గముఁ జూపుము. నేను శీఘ్రముగాఁ బోకపోయినయెడల విప్రాంగన నామీఁదఁ గోపపడును.

వీర—(తనలో) అయ్యో ! నేనిప్పుడు పుత్రశోకములో మునిఁగి స్వకృత్యమును మఱచుచున్నాను ! (ప్రకాశముగా) ఓ యిల్లాలా! నేనిక్కడ సుతుఁడని చూచి మోమోటపడినయెడల ధర్మహానిసంభవించును. కాఁబట్టి నీవిప్పుడు శీఘ్రముగాఁబోయి నీప్రభువైన బ్రాహ్మణుని వేఁడుకొని యొక్కమాడను దెచ్చు కొమ్ము. పొమ్ము.

చంద్ర—హా! తండ్రీ! నిన్ను నేనెట్లు విడిచిపోఁగలను? నవ మాసములుమోచి కని కష్టపడి యిన్నాళ్ళనుబెంచినది నిన్నీ కాశికా పురమున కప్పగించుకొఱకా! నీవెప్పుడో సమస్తయిశ్వర్యములను బొంది నన్ను సుఖపెట్టుదు వనుకొంటిని గాని యిట్లగుదువని కల లోను దెలిసికొనఁ జాలనైతిని. జన్మనక్షత్రమును గ్రహఫలమును జూచి జ్యోతిష్కులు దీర్ఘాయుష్మంతుఁ డగుననిరికాని యల్పా యుష్కుఁడవగుదువని చెప్పరయిరి. ఓగ్రహతారకాదులారా ! మనుష్యులవలె మీరును నన్ను మోసపుచ్చుచున్నారా?

వీర—ప్రాణేశ్వరీ! నీకీ వెఱ్ఱిభ్రమ లేటికి? ఫలాపేక్షతోఁ బలికినజోస్యులమాటలను నమ్ము యిప్పుడేల యుమ్మలించెదవు ? గ్రహములెక్కడ? ఫలములిచ్చుటెక్కడ? మన కార్యములఫలమును మన మనుభవించునప్పుడు మనదోషములకయి ప్రాణములేని సూర్యచంద్రాదిగ్రహములను నక్షత్రములను దూషించిన ఫల మేమి? వేగిరముపోయి మాడను దెచ్చుప్రయత్నము చేయుము.

చంద్ర—(లేచి) నాకు నడవఁ గాళ్ళురాకున్నవి; శరీర మవశ మగుచున్నది ఏమిచేయుదును? నామనస్సున కున్నచొరవ కాళ్ళకు లేకున్నది. ఓకుమారా! నాపాలిటి పుణ్యరాసివలె నీవు కన్నుల యెదుటనుండఁగా నెన్నికష్టములువచ్చినను నిర్విచారముగా నుండఁ గలిగితిని. ఇఁక నెట్లుందును? నీరూప మెక్కడఁజూతును? నీవు వత్తువని యెక్కడ నెదురుచూతును? నిన్నేలాగున మఱచిపోదును? ఇఁకఁ బోకతీఱదు. నాతండ్రీ! పోయివత్తునా? (అని నడుచుచున్నది.)

విప్రబాలకుఁడు—అమ్మా! రమ్ము. నేనుదారి చూపెదను.

చంద్ర—(రెండడుగులు నడిచి) కాళ్ళు ముందుకు సాగు చున్నను మనస్సు వెనుకకు లాగుచున్నది. నే నెట్లుపోఁగలను ? ఓయీశ్వరుఁడా! ఈరాత్రి యేలాగునైన నగ్ని కార్యము జరిగి ప్రభాతమగులోపల నేనిల్లుచేరి బ్రాహ్మణగృహిణికిఁ బరిచర్య చేయునట్లు చేయుము. (అని తిరిగి తిరిగి చూచుచుఁ బోవుచున్నది.)

వీర—(లోహితాస్యునివంకఁ జూచి దుఃఖముతో)

చ. అకటకటా! కుమార! చతురబ్ధిపరీతమహీతలం బకం
టకముగ నేలినట్టిప్రకటప్రతిభుండగుచక్రవర్తి పు
త్రికునకు నీకుఁ బ్రేతవసుధాస్థలిలోపల మూడుమూళ్ళ నే
లకును ముహూర్తకాలము నలంతిస్వతంత్రత లేక పోయెనే? 6

క. పటుతరనానాసుఖచయ
ఘటనాచణచక్రవర్తి గర్భమునమహో
త్కటజననముఁ గనఁ గాంచియుఁ
గటకట నీ కడవిపాలు గావలసెనుగా?

మధు—ఓవీరదాసా ! నీవాఁడుదానికన్నను బేలతనమును వహించుచున్నావు! ఆఁడుది ధైర్య మవలంబించి యింటికిఁ బోయి నప్పుడిక్కడఁ గూరుచుండి వావిడిచి విలపించుట నీవంటిమగవానికిఁ దగునా?

వీర—ఓమధుదాసా! నీవేమో యనుచున్నావు. జల్లెడలోఁ బోసిననీటివలె నీమాటలు నామనస్సున నిలువకున్నవి. హాకుమారా!

సీ. తతహంసతూలికాతల్పంబునకు జేర్చు
మృదుతర దేహమా యిది కుమార
కమ్మసంపెఁగనూనె కడు రాచి పెంచిన
ముంగురులా యివి ముద్దుకుఱ్ఱ
నవరత్నమయభూషణంబులఁ బెనగొన్న
హస్తంబులాయివి యనుఁగుపట్టి
చిఱుగజ్జియలుమ్రోయఁ జెలువొప్ప
నడయాడుచరణంబులాయివివరకుమార

గీ. నేలఁ బొరలాడుచును బెనుధూళి బ్రుంగి
తాఱుమాఱుగఁ బడి చెల్వు తప్పియున్న
నీదుకోమలాంగకము లీనేత్రములును
గాంచి యెట్లోర్తురా ననుఁగన్నతండ్రి.

మధు—ఓవీరదాసా ! ఊఱడుము. నీ విట్లు దుఃఖపడు చుండఁగా నీభార్య వచ్చినయెడల నామె మఱింతదుఃఖపడును.

వీర—నాకిఁక నెక్కడిశాంతి? ఓచంద్రమతీ వివిధచిత్రరత్న భూషణ, భూషితురాలవైయుండు నీకలంకారార్థము కాకపోయినను బాలుని దహనసంస్కారార్థ మిచ్చుటకైన నేఁడొక్కచిన్ననగ లేక పోయెనుగా? ఎటువంటి దివ్యరత్నాలంకారములును నీసుందరాంగ ముల కలంకారములు కాఁజాలవని నేనెఱుఁగుదును.

ఉ. ఆరమణీయకోమలతరాంగములందిడ హేమమణ్యాలం
కారము లేల? కేవలవికారము లాటకుఁ గాక! కేకికిన్
వేరుగవన్నె లేల? జిగవీడిన కాకికిఁ గాక? పైపయిన్
బూరి మెఱుంగు లేటికి నభోమణికి న్వలె న్నహిన్? 8.

మధు—ఐనను స్వర్ణరూప మయిన ధనమునకంటె సౌందర్య ధనమునే యౌవన మదాంధు లగుదొంగ లధికముగా నాశింతురు. కాఁబట్టిదానిని గాపాడుటకయి పురుషుఁడు సర్వదా కష్టపడవలెను. స్త్రీలును స్వభావచంచలురాండ్రుసుమా!

వీర—స్త్రీలుచంచలురాండ్రనియుఁగతినురాండ్రనియుఁబురుషులు నిష్కారణముగా దూషింతురు గాని నిజమది కాదు. స్త్రీలు స్వభావముచేత మంచివారును దయాధిక్యము కలవారు నని యనుభవముచే నెల్లవారికినిఁ దెలియును. కుత్సితులకు మాత్రము వారు కుత్సితురాండ్రుగాఁ గానఁబడుదురు.

ఉ. అద్దములట్ల స్త్రీలహృదయంబులు స్వచ్ఛములా యనంగ; నే
ప్రాద్దును జెంతల న్మెలఁగుపూరుషపాళికి నాత్మచిత్తము
ల్పెద్దయు వానిలోఁ బ్రతిఫలించుచు నుంట, నిజాత్మలం బలెం
దద్దయు దోఁచుచుండు వనితాహృదయంబులు వారివారికిన్ 9.

హా! నిర్మలహృదయా! చంద్రమతీ! నామూలమున నీకెట్టిపాట్లు సంభవించినవి.

మధు—వీరదాసా! చూడుచూడు. రాజభటులెవ్వరినో యిటకుఁ దీసుకొనివచ్చుచున్నారు, ముందు వచ్చుచున్నవాఁడు మన పురి పెద్దతలారి యయిన భీషణుఁడు. ఆతనివెనుకకు మనస్వామి యయినవీరబాహుని ప్రధానసేవకుఁడు త్రిమాత్రుఁడుకూడ నున్నాఁడు. వారివెనుక దూరమునఁ బౌరజనులు గుంపులుకూడి వచ్చుచున్నారు. అదిగో తూర్పు తెల్లవారుచున్నది.

వీర—ఏమియీవింత! రాజాజ్ఞచేత నెవరినైన శిరశ్ఛేదము చేయించుటకయి రాజభటులు తీసుకొనివచ్చుచున్నారాయేమి? అప్పుడే తిన్నగాఁ బ్రభాతము కాకమునుపే రా జెవ్వరికి మరణశిక్ష విధించియుండెను? ఆవచ్చెడివారిలో జంద్రమతికూడ నున్నట్లున్నదే? హా దైవమా! ఇప్పుడేమి పాపపుమాట వినవలసివచ్చునో!

[అప్పుడు చంద్రమతిని వెంటఁగొని భీషణుఁడును తామ్రాక్షుఁడును మఱికొందఱు రాజభటులును ప్రవేశించుచున్నారు.]

భీష—ఓవీరదాసా! ఈపట్టణమేలెడి మహీపాలుని ముద్దుల బాలుని రత్నాలంకారముల నిమిత్తమయి వధించిన యపరాధమున కయి యీయింతిని శిరశ్ఛేదము చేయింపుమని రాజుగారు విధించినారు.

తామ్ర—వీరదాసా! స్త్రీహత్యయని చూడక శిశుహంతకు రాలయినను యీఘోరపాతకురాలిని నీ చేతులతో శిరఃఖండనము చేయుమని మనస్వామి యయిన వీరబాహుఁడు నీకాజ్ఞాపించినాఁడు.

వీర—(నలువంకలుఁజూచి దిగ్భ్రమతో) ఇదియేమి! నేని ప్పుడు కలఁగనుచున్నానా? మేలుకొనియున్నానా? ఇది యింద్ర జాలమా? సత్యమా? నేను హరిశ్చంద్రుఁడ నగుదునా కానా? నా ముందు నిల్చియున్నవారెవ్వరు?

చంద్ర—ఓప్రాణేశ్వరా! దిగ్భ్రాంతిపడి చూచుచున్నారేమి? ఇది స్వప్నముగాదు; యథార్థమే నేను జంద్రమతిని; వీరిప్పుడు చెప్పెడు బాలఘాతినిని నేనే.

వీర—(తేఱిచూచి డగ్గుత్తితో) శృంగారవనములోని పుష్పలతల పూవులనయినను గట్టిగా గోటితో గిల్లి కోయ సంకో చించుచుండెడు నీవు శిశుహంతకురాలవయితివన్న నే నెట్లు నమ్మఁ గలుగుదు నే? ప్రాణేశ్వరీ! నీకుఁ పాపపువిధి యీ యపసింద యెక్కడఁ దెచ్చిపెట్టెనే? డేగను దప్పించుకొని వచ్చి కిరాతుని వలలోఁదగులుకొన్న కలరవాంగనవలె విశ్వామిత్రుని మాయావాగు వలనుండి విడివడిన నీకీ విధిపాశములం దగులుకొనుట సంభవించెనా?

చంద్ర—ఓధైర్యనిధీ! అధైర్యపడకుము. ఓప్రాణనాథా! దొంగ నని నాకిట్టి యపఖ్యాతివచ్చినందునకయి నీ వెంతమాత్ర

మును జింతిలఁబోకుము. ఓపుత్రికా! వీఁడు హంతకురాలి కొడుకని ప్రజలాడుకోకుండ నీవుముందుగానే కాలముచేసికృతార్థుడవయితివా?

వీర—ఓప్రాణేశ్వరీ! నీకీదురవస్థ యెట్లుసంప్రాప్తమయినదో చెప్పఁగలవా?

చంద్ర—ఇటువంటి నిందకోర్చి ప్రాణములతో నుండగలిగిన కఠినచిత్తురాలను నేను దేనినైనను జెప్పఁగలుగుదును. మాఁడఁ దెచ్చుటకయి మీ యాజ్ఞగొని పురివంక జనుచుండఁగా నొక్క-పురుషుఁ డెదురుపడి "అమ్మా! నీ వెవ్వరవు? ఈచీకటిలోనొంటిగా నేపనినిమిత్త మెటకేగెదవు?" అని యెంతో దయగలవానివలెనడిగెను.

వీర—లోకములో ననేకులకు మాటలలో నమృత ముట్టిపడు చున్నను హృదయము కోసిచూచినయెడల లోపల నంతయు విషమే యుండును. తరువాత?

చంద్ర—నావృత్తాంతమంతయు నేను వినిపింపఁగాజాలిపడిన వానివలె 'నటించి నాసహోదరీ! ఇంత యల్పకార్యమునకయి వగ పేటికి? ఈరత్న భూషణములను గొనిపోయి నీయక్కఅందీర్చుకొమ్ము' అని నేను వలదనుచుండఁగాఁ గొన్నిస్వర్ణాభరణములని నామీఁదఁ బడవైచి "దొంగదొరికినది రం"డని కేకలువేసెను.

వీర—దుష్టులుచేసినదోషములకు లోకములో సాధులు బాధ పడుదురు. అటుపైని?

చంద్ర—అప్పుడు యమకింకరులవంటి రాజభటులు దండ హస్తులయి వచ్చి నన్నుఁ బట్టుకొని యీడ్చుకొనిపోయి "నగలనిమి త్తమయి మీముద్దులపట్టిప్రాణములుగొన్న మహాపాతకురా లిదియే" యని నన్ను రాజుమ్రోలనిలిపిరి.

వీర—ఆహా! లోకములో బంగార మింతచెడ్డది! అది ప్రాణ మిత్రులను బగవారిని జేయును. తండ్రికొడుకులకును, అన్నదమ్ములకును శత్రుత్వముఁ కలిగించును.

క. గరళముకంటెను స్వర్ణమె
ధరలో నెక్కుడువిషంబు తథ్యము కాకో
దరవిషముకంటెఁ గనకమె
పొరిగొనుఁ జూ వేయిరెట్ల పురుషుల నెపుడున్
అటుపయిన రాజేమిచేసినాఁడు?

చంద్ర—"స్త్రీవేషమునను న్న యోవ్యాఘ్రమా! ఎత్తిము ద్దాడవలసిన నీమృదుహస్తములతో నీబాలకుని మెడ యెట్లు విఱువఁ గలిగితివి? నీదిబిడ్డలగన్నకడుపు కాదా? నీవు గొడ్రాలవా? బంగారు తొట్లలో మైమఱచి నిద్రించుచున్న పసికూనను జంప నీకెట్లు చేతు లాడెను?" అని రాజు కొంతసేపు నన్ను నిందించి, లేనియపరాధము మీఁదఁ బడినందునఁ నోటమాటరాక నిలుచున్న నన్నీ పెద్దతలారికిఁ జూపి "దీనితో నింక మాటాడినఁ బాపమువచ్చును. మృత్యుస్వరూప యయినదీనిని నీక్షణమనాయెదుటనుండి గొనిపోయి తల కొట్టివేయిం పుము" అని యాజ్ఞ యిచ్చెను.

వీర—కోటలుదాటి కవాటములు తెఱచి కావలివాండ్ర నేమఱించి యంతఃపురము చొచ్చి బిడ్డను జంపుటయొక్క స్త్రీకి శక్యమగునా యని విచారింపక, రాజు పాపము కట్టుకొనెను. 'రాజ్యంతే నరకంధ్రువ' మ్మని విద్వాంసులు చెప్పుదురుగదా!

గీ. కనికరములేక మృగయుఁడు కాననమునఁ
గ్రూరశార్దూలముల లేళ్ళఁ గూల్చునట్లు
యవనిలోపల నవివేకియైన నృపుడు
దోషులట్ల నిర్దోషులఁ ద్రుంచుఁ జూవె.

చంద్ర—మరణము వచ్చెనని నా కిప్పు డణుమాత్రమును జింతలేదు. కాని మరణదశయందు నాకిటువంటి యపకీర్తివచ్చెను గదాయని మాత్రము నామనస్సెంతో నొచ్చుచున్నది. అపకీర్తితోడి

బ్రతుకు కంటెనుగీర్తితోడిచావేయుత్తమము. ఓప్రాణనాథా? నీవిఁక జాగుచేయక నీస్వామియాజ్ఞను నెఱపుము.

వీర—(తనలో) పాదమున గ్రుచ్చుకొన్న ముల్లు తీసినను దీయకపోయినను గూడ నొప్పికలుగునట్లే, స్వామికార్యము చేయుటకును జేయకపోవుటకును గూడ నామనస్సు బాధపడుచున్నది. (ప్రకాశముగా) స్వామియాజ్ఞమర్లంఘ్యమే యయినను సంగరాంగణంబున విపక్షులను శిక్షింప దక్షంబైయుండిన యీకౌక్షేయకంబునఁ గులాంగనయుత్తమాంగంబు ఖండించి స్త్రీహత్య కొడిగట్టుకొన మనసొప్పకున్నది.

చంద్ర—ఓమనోవల్లభా! లోకములో నీవెఱుఁగని ధర్మములు లేవు. భృత్యునకు స్వామియాజ్ఞ చేయుట పరమధర్మము, రాజాజ్ఞచేతను స్వామి నియోగముచేతను భృత్యధర్మమునుబట్టి చేసెడి విధ్యుక్తమైన యీహత్య హత్యకాదు. కాఁబట్టి మమకారమును దయను నీహృదయమునుండి పాఱఁదోలి ధైర్యముతో స్వామికార్యమును నిర్వహించి కృతకృత్యుఁడవు కమ్ము.

వీర—గోమాంసభక్షణకు శంకింపక తలలు నఱకుటయే నిత్యకృత్యముగా గల చండాలునకుఁ గింకరుడనై యున్న నాకు దయ యెక్కడనుండును? అనాథరక్షణ ప్రశస్తంబులైన యీహస్తంబులింక నెన్ని స్త్రీహత్యల కొడిగట్టుకొన నున్నవో!

చంద్ర—ప్రాణేశ్వరా! స్వామికార్యమును నిర్వహించునప్పుడు ఖేదపడరాదు. నన్నును లోహితాస్యునిని మాప్రేమాను బంధమును మఱచి ధర్మమునందే బుద్ధినిలుపుము. ఇదిగో నేను వధ్యశిల నధిరోహించుచున్నాను. నీచేతికరవాలముతో నొక్కవేటున నాశిరము తెగ వ్రేసి నన్ను నాపుత్రునిఁ జేరఁ బంపుము. ఓకౌశికా! తరుచ్ఛాయను

విశ్రమించి బడలిక తీర్చుకొని యా చెట్టుకొమ్మలనే తెగనటికిసయాం టవికునివలె దానమిచ్చినదోషమునకై యీమహారాజునింత చేసితివా?

[అప్పుడు విశ్వామిత్రుడు ప్రవేశించుచున్నాఁడు]

విశ్వా—(తనలో) ఇప్పటి వీరియవస్థ చూడఁగా వజ్రకఠిన మయిన నాహృదయముకూడ నీరుగాఁ గఱగుచున్నదే. వీరుమాత్ర మింకను జలింపకున్నారు. నామనస్సులో నిప్పుడు వేయి తేళ్లును జెఱ్ఱులును బ్రాకుచున్నట్లున్నది. ఇది సాధువుల కకారణముగా బాధ చేసినదానిఫలమా యేమి?

చంద్ర—(భర్తకుఁ బ్రదక్షిణము చేసి నమస్కరించుచు నిలిచి ఓయీశ్వరా! నాప్రియవల్లభుని మనస్సెప్పుడును ధర్మమునందే వర్తిల్లునట్లును సత్యవ్రతమునుండి యణుమాత్రమును జలింపకుండునట్లును జేయుము. జన్మాంతరములున్నచో, నాకు జన్మ జన్మములయందును సత్యశీలుఁడైన యీహరిశ్చంద్రనృపాలుఁడే భర్తయగునట్లు ప్రసాదింపుము. మమ్ము బాధించి సత్యసంధులను జేసిన విశ్వామిత్రుని మామూలమున నేకీడును బొందకుండునట్లు చేయుము. (అని వధ్యశిల నెక్కుచున్నది.)

వీర—(ఖడ్గముధరించి చేయెత్తి) ఓయీశ్వరా! స్వామికార్యనిర్వహణాయత్తచిత్తుఁడనగు నాకిందువలన స్త్రీహత్యాపాతకము కలుగకుండ ననుగ్రహింపుము.

భీమ—వీరదాసా! క్షణకాలము తాళు. శిరశ్ఛేదము చేయుటకు ముందు రాజాజ్ఞను ముమ్మాఱు ఘోషింపవలయును—ఓ పౌరులారా! రాజకుమారుని వధించిన నేరమునకై యీసుందరి యిప్పుడు శిరశ్ఛేదము చేయఁబడుచున్నది. చూడుడు.

విశ్వా—(తనలో) ఇఁక నేనుపేక్ష చేయఁగూడదు. నా మనస్సు చేయిపెట్టి కలఁచుచున్నట్లున్నది. (ప్రకాశముగా) ఏమి?

కాశికానగరమంతయు నేఁడిక్కడనే మూఁగినది! ఓపౌరజనులారా! ఏమి చూచెదరు? మీయిండ్లకుఁబోండి, దారియిండి!

వీర—ప్రాణేశ్వరీ! ఇదిగో నాచేతికృపాణముతో నొక్క వ్రేటున శిరఃఖండనము చేయుచున్నాను. మనస్సులో నీశ్వరుని నిలుపుకొమ్ము.

చంద్ర—ఓప్రాణేశ్వరా! నేను సంసిద్ధురాలనై యున్నాను. ఓయీశ్వరా! ఓదీనజనసంరక్షకా! ఓయార్తజనశరణ్యా! రక్షింపుము రక్షింపుము రక్షింపుము.

భీష—ఓపౌరులారా! రాజకుమారుని వధించిన నేరమునకై యీసుందరి యిప్పుడు శిరశ్ఛేదము చేయఁబడుచున్నది. చూడుఁడు.

వీర—ఓప్రాణేశ్వరీ! నిశ్చలురాలవయి యున్నావా? (అని ఖడ్గమును కంఠమున మోపి గుఱిచూచి నఱకుట కయి చేయి పయి కెత్తుచున్నాఁడు)

విశ్వా—(పరుగెత్తుకొనివచ్చి చేయిపట్టుకొని) ఓరాజా! నీ సాహసమింతటితోఁ జాలును. ఇటువంటి యబలలను జూచినఁ జండాలునకైనను మనస్సులోఁ గొంతెదయ కలుగునే! నీకేల కలుగక యున్నది? ఇట్లు స్త్రీలను జంపుమని నీకు నీకులగురుఁ డుపదేశము చేసినాఁడా! కులకాంతను వధించుట ధర్మము గాదు, మానుము.

వీర—ఓమానిచంద్రా! నాపూనిక కడ్డముగాక నాచేయి విడిచి స్వామికార్యమును నిర్వహింప నిండు. ఇట్టిసమయమందు మీవంటి మునిసత్తములు చెంత నుండగూడదు. నావిన్నపము మన్నించి శీఘ్రముగా నెందేనియు నిజయంచేయుఁడు.

విశ్వా—ఓరాజా! నన్ను నీవుపరునిగా నెన్నక నీక్షేమమును గోరి చెప్పెడి యీహితము విని కులసతిని జంపక విడువుము!

వీర—ఓమానిచంద్రా! కాలము మంచిది కానప్పుడు ప్రాణ బంధువులును గర్భశత్రువులు కావచ్చును; మంచిదినములు వచ్చినప్పుడు పరులును బరమాప్తులు కావచ్చును.

క. మనదేహంబులలోపల
జనియించినవ్యాధి దుఃఖజనకంబును గా
ననములఁ బుట్టినయోషధి
ఘనసుఖజనకంబు నగుట కనమే ధాత్రిన్? 12

కాఁబట్టి మీరిప్పుడు చెప్పినది నాకు క్షేమకరమే కావచ్చును. అయినను నేనీవిషయమున మీయాజ్ఞ వినఁగలవాఁడను గాను.

విశ్వా—ఓరాజా! వెఱ్ఱివాఁడవయి ఖ్యాతికయి కష్టములేల తెచ్చిపెట్టుకొనెదవు? ధర్మము ధర్మమని యేల పలువరించెదవు? భార్యాపుత్రులు పోయిన తరువాత నీఖ్యాతియు నీధర్మమును వచ్చి నిన్ను సుఖపెట్టఁ జాలునా?

వీర—ఓఋషిశ్రేష్ఠా! వేయిమాటలేటికి? నాకుసత్ఖ్యాతియే యుత్తమధనము. ధర్మమే సంపూర్ణసుఖదాయకము. నాకీర్తిధనమును దొంగిలినవాఁడు తాను ధనవంతుఁడు కాకపోయినను నన్ను మాత్రము భాగ్యహీనునిగాఁ జేయును.

చ. తెలివిని మర్త్యుఁ డెప్పుడును దేహపటుత్వము పోకమున్నె వ్యా
ధులు చనుదేకమున్నె జరదొట్టి మతిభ్రమ రాకమున్నె దొం
గల కణుమాత్రము న్వశము గాక నిరంతరసౌఖ్యమిచ్చి యి
మ్ముల వెలయించు పుణ్యధనముంగడియింపఁగజూడఁగావలెన్.

భార్యాపుత్రాదులు విడిచినను విడువక ధర్మము పురుషునికి శాశ్వతసుఖ మిచ్చును.

విశ్వా—ఎన్నఁడో యప్రత్యక్ష మయినపరలోకసుఖము వచ్చునని ప్రత్యక్షమయిన యిహలోకసౌఖ్యము నేలపోఁగొట్టుకొనె

దవు? నీవొక్క యసత్యమాడిన పక్షమున నీపుత్రుని మగల బ్రతి కించి సకలసంపదలతోను భార్యాసహితముగా నిన్ను రాజ్యసుఖ మనుభవించునట్లు చేసెదను.

వీర—దేహము లస్థిరములు; సంపదలు క్షణభంగురములు; దారసుతాదులు బుద్బుదప్రాయులు. ధర్మమొక్కటియే సుస్థిరమయి నది. సమస్తసంపదలతోను మలదూఁగుటకై యసత్యదేవత నాశ్ర యించుటకంటె మృత్యుదేవతనే నేను జేరెదను.

విశ్వా—నీవిప్పుడు దారిద్ర్యకష్టము లనుభవించుచున్నావు గదా! ఆలోచించుకొమ్ము.

వీర—దరిద్రుఁడ నైతినని నా కావంతయుఁ జింతలేదు, నే నెప్పుడును సంపదలతోఁ దులఁదూగుచునే యుందునేని నాసత్యనిత్యత లోకమునకు వెల్లడి కాకయే యుండును. చందనవృక్షము నలుగఁ దీసినప్పుడే సువాసన బయలు వెడలునట్లుగా, కష్టములు వచ్చి నలు గుడు తగిలినప్పుడే మంచివారికి సౌజన్యము వెల్లడియగును.

చ. సిరులును జూచియున్ దురగసింధురసౌధసుతాళిఁ జూచియున్
గరువము పొందుచుఁ బ్రకృతి కనుఁగానక మూఢులు ధారుణీస్థలిన్;
మరణము సంభవించునెడ మాత్ర మవేమియు లేనివారలై
ధర నధికారు లయ్యెదరు తా మొకనిల్వెడు భూమి కేయిటున్.

చ. ప్రజ లెఱుఁగంగ లేరు సిరిపట్టుల మర్త్యులతారతమ్యముల్;
నిజమును దాము గన్గొనఁగ నేర్తురు ధారుణిలోనిమానవ
వ్రజముల నెవ్వరుత్తములొ వారొనరానియయోగ్యు లెవ్వరో
రుజల శరీరముల్తొఱఁగి రూపఱుపిమ్మట మెల్లమెల్లగన్. 15

విశ్వా—(తనలో) ఇఁక నీతఁడు నామాయలకు లోఁబడఁడు. వేయేండ్లు తలక్రిందుగాఁ దపస్సుచేసినను నే నితనిచేత బొంకింప లేను. ఇంతటితో నీతనినిగష్టములనుండి గట్టెక్కింపవలెను. (ప్రకాశ

ముగా) ఓరాజేంద్రా! నీచిత్రచరిత్రము చూడఁగా నాకచ్చెరు వగుచున్నది. నీసత్యసంధతకు మెచ్చినాను. బొంకెఱుగనివాఁడ వన్న లోకములో నీవొక్కఁడవే.

వీర—ఓమౌనీంద్రా! మీవలన నే నిప్పుడు కృతార్థుఁడ నయినాను.

విశ్వా—నావలనఁ గాదు. ఈశ్వరానుగ్రహము వలనను నీ నిత్యసత్యమువలనను గృతార్థుఁడవయినావు. తనలోని పంచేంద్రి యములను జయించినవాఁడు సర్వలోకములను జయించినవానికంటె నధికుఁడు. నీవు సప్తద్వీపములను జయింపఁగలుగుట యీ యింద్రియ జయముతో సమానమని యెంచను. నీసత్యశీలతను బరీక్షింపఁగోరి మీయెడలఁ జేసిన యపరాధముల కన్నిటికిని నన్ను క్షమింపవలెను.

వీర—మీరు నాకు మహోపకారము చేసినవారు గాని నా యెడల నపరాధమేదియుఁ జేయలేదు. తల్లినొప్పుల నొందియుఁ బుత్రజన్మమునకు సంతోషించునట్లుగానే బహుబాధలు పొందియు మీవలన నాకుఁగలిగిన సత్యసంతానలాభమునకు నేనమితానందము నొందుచున్నాను. మనసులో మీరేమియు సంకోచపడబోకుడు.

విశ్వా—నీ వీ పతివ్రతశిరోమణి యయిన చంద్రమతిని శిరశ్ఛేదము చేయకుండినయెడల నేనప్పుడు మనస్సంకోచము లేక యుందును.

వీర—రాజశాసనమును స్వామియాజ్ఞను నేనెట్లు మీఱఁ గలుగుదును? అట్లుమీఱుట ధర్మమగునా? సకలధర్మవేత్తలైన మీరు నన్నధర్మముచేయుమని బోధింతురా?

విశ్వా—నాప్రార్థన చెల్లించి క్షణమాత్ర మీపని నిలు పుము. ఈలోపలరాజువచ్చి యీమెను మన్నింపఁగలఁడు.

వీర—మీయాజ్ఞ యవిలంఘ్యముగాన క్షణకాల మాగె దను. (కత్తి విడుచుచున్నాఁడు.)

విశ్వా—పాముకాటుచేత విషమెక్కి మూర్ఛిల్లియున్న నీకు మారుసకింతలోఁ జికిత్స చేయుదము రమ్ము. (అని లోహితాస్యుని నోటిలో నేదో వేయుచున్నాఁడు.)

లోహి—(మూర్ఛ తెలిసి లేచికూరుచుండి) హా! ఎంతనిద్ర పోతిని! నన్నిక్కడ కెవ్వరు తెచ్చినారు? ఓవిప్రబాలకులారా! దర్భలు సమిధలువిఱిచినారా?

వీర—(సంతోషముతో) ఏమి నాకన్నులు చేసికొన్న భాగ్యము! చంద్రమతికూడ రాజదండనమునుండి విముక్తురాలయిన గదా నాకుఁ బుత్రుఁడు పునర్జీవుతుఁడైనాఁ డన్న సంతోషము పూర్ణమగును!

గీ. నారికేళంబుపయి నొక్కసారిగానె
వారిదము నీరుఁ బిడుగున పంపునట్లు
విధియు సంతోషదుఃఖములెల్లయనాకు
నొక్కసారియె కూర్చుచునున్నఁవాడు

భీష—ఓహో! కాశీపురాధీశు లయిన ప్రతాపచంద్రదేవ మహారాజుగారు మంత్రులతోడఁ గూడ నిక్కడకు విజయముచేయు చున్నారు.

[అప్పుడు రాజు మంత్రులతోఁ గూడఁ ప్రవేశించుచున్నాఁడు.]

ప్రతా—ఓయతిచంద్రా! పుత్రశోకములో మునిఁగియున్న వాఁడనైనను దేవరయాజ్ఞ యైనదని వచ్చినాను. శిష్యుని కేమి యాజ్ఞ?

విశ్వా—సుపుత్రాప్తిరస్తు!—ఓనక్షత్రికా! నక్షత్రకా!

నక్ష—స్వామీ! వచ్చుచున్నాను (అని రాజపుత్రునితోఁ బ్రవేశించుచున్నాఁడు.)

విశ్వా—నక్షత్రకా! పుత్రుఁడు మరణమునొందెనని దుఃఖించుచున్న రాజుకడకుఁ గొనిపోయి యీ బాలకుని సమర్పించి యాతని సంతోషపరవశునిం జేయుము.

ప్రతా—ఆహా! ఏమి నాభాగ్యము! చచ్చెననుకొన్న నా ముద్దుల బాలకుఁడు మరల సజీవుఁడై నాకు నేత్రోత్సవము చేయుచున్నాఁడు! అయ్యో! శిశుహంతకురాలని యొకయిల్లాలిని నిష్కారణముగాఁ జంపించి పాపము కట్టుకొంటినిగదా!

విశ్వా—రాజేంద్రా! పరితాపపడకు. ఆ నిరపరాధిని సజీవురాలై యున్నది.

ప్రతా—ఇప్పుడు నాయుల్లము చల్లబడినది.—ఓభీషణా! ఆనిర్దోషురాలిని శిరశ్ఛేదము చేయక విడువుచుని యిప్పుడ వీరబాహుని కాజ్ఞాపింపుము.

విశ్వా—ఆమె యెవ్వరనుకొన్నావు? నిత్యసత్యవ్రతుఁడైన హరిశ్చంద్రుని యిల్లాలైన చంద్రమతీదేవి. ఆపతివ్రతాతిలక మిక్కడనేయున్నది. వీరబాహునియొద్ద వీరదాసను నామముతోఁ గొలువు చేయుచున్న యీమహానుభావుఁడు హరిశ్చంద్రుఁడు.

ప్రతా—ఇప్పుడు వీరి దర్శనముచేత నాకన్నులు సఫలములయినవి. (అని లేచి హరిశ్చంద్రునిఁ గౌఁగిలించుకొనుచున్నాఁడు.)

వీర—పిచ్చుగుంటుమీఁద భాగీరథి పాఱినట్లు మీరయాచితముగా దర్శనమిచ్చుటచేత మీరన్నవాక్యములు నేనసవలసినవిగాని మీరు సెలవియ్యవలసినవి కావు. మీరు పెద్దలు; పూజ్యులు మీదర్శనలాభమువలన నేను జరితార్థుఁడ నయినాను.

ప్రతా—ఒకవేళ వయస్సుచేత నేనే వృద్ధుఁడ నైనను బుద్ధిచేతను గుణసంపదచేతను మీరేవృద్ధులు. మీరు దంపతులిరువురను గొన్నిదినములు మాయింట నతిథులుగా నుండి మా

గృహము పావనము చేయువలెను. ఓమహానీంద్రా! శిశుహంతకు డాలన్న యపనింద సాధ్వీశిరోరత్నమయిన యీచంద్రమతి కెట్లు వచ్చినది?

విశ్వా—ఓరాజేంద్రా! చెప్పెదనువినుము. ఈహరిశ్చంద్రుని సత్యపరిశీలనార్థమై నేనే యీనక్షత్రికుని నియమింపగా నితఁడొరు లెఱుఁగకుండ రాజాంతఃపురముచొచ్చి యుయ్యాలలో నిద్రించుచున్న యీబాలకు నెత్తుకొనివచ్చి దాఁచి యీయర్భకుని శరీరమున నున్న నగలను గొనిపోయి యూరివంకఁ బోవుచున్న యీమెయొడిలోవైచి, దాదులుబిడ్డనుగానక మొఱ్ఱపెట్టినపిమ్మట వెదకుచు బయలుదేఱిన తలారులకీమెను సొమ్ముతోఁ బట్టియొప్పగించెను. ఈయనసత్యసంధత నేఁడు స్థిరపడినదిగదా! సర్వదేవతాసమక్షమున నేను జేసినప్రతిజ్ఞను నేనిప్పుడు చెల్లించుకొనెదను, (అని యాకాశమువంకఁజూచి) ఓమహేంద్రా! నీవిక్కడఁ బ్రత్యక్షమగుము. ఓకాశీవిశ్వనాథా! నీవిందు వచ్చి సాక్షిభావము వహింపుము. ఓవశిష్ఠా! నీశిష్యునిమహిమను జూడ రమ్ము!

[ఇంద్రుఁడును, ఉమతో శివుఁడును ప్రవేశించుచున్నారు.]

ప్రతా—ఆహా! ఏమి ఈభాగ్యము? ఇప్పుడు హరిశ్చంద్రుని మూలమున నందఱికిని దేవతా సాక్షాత్కారము కలుగుచున్నది.

విశ్వా—ఓపార్వతీశా! నీకు నమస్కారము. ఓమహేంద్రా! నా యెదుటకురమ్ము. ఓవశిష్ఠా! నీమాట గెలిచినది. నీశిష్యుని బొంకింపలేక నేనే యోడిపోయినాను. ముల్లోకములలో నీహరిశ్చంద్రుఁ డొక్కఁడే నిక్కమైన సత్యవాది యని యీమహేశ్వరాదుల సమక్షమున నేనే ముమ్మాటికిని ఘోషించుచున్నాను. ఈతఁడింకమీఁదట లోకములో సత్యహరిశ్చంద్రుఁడని ప్రఖ్యాతి చెందఁగలఁడు. ఓసత్యహరిశ్చంద్రా! ఇటురమ్ము నే నింద్రసభలోబలి

కినప్రతిన తప్పకుండఁ దొల్లి నేను జలాశనుఁడనై హిమవత్పర్వతమునఁ జేసినతపస్సులో నీకు సగము ధారపోయుచున్నాను. గ్రహింపుము. (అని చేతిలో ధారపోయుచున్నాఁడు.)

ఇంద్రు—విశ్వామిత్రా! నీవు పలికిన ప్రతిజ్ఞలో నొకదానినే చెల్లించినావు.

విశ్వా—ఇదిగో కడమదానినిగూడ నిర్వహించుచున్నాను. సత్యహరిశ్చంద్రా! నీరాజ్యమును నీకిచ్చుచున్నాను. నాయాజ్ఞచేత నీవు నీయిచ్చవచ్చినన్నాళ్లీభూమి యేలినతరువాత స్వర్గములో నీయిందునియర్థాసనమందుండిసుఖమనుభవింపుము. ఓమహేంద్రా! నీ కిది సమ్మతముగా నున్నదా?

ఇంద్రు—ఇటువంటి సత్యసంధునితోఁ గలిసి యర్థాసనమునం దధివసించు భాగ్యముక్కలుగుటచే స్వర్గమును నేనును గూడ ధన్యత నొందుచున్నాము.

విశ్వా—కాలకౌశికుఁడును వీరబాహుఁడును వెనుక నిలచి తా మిచ్చినధనమెక్కడఁ బోవునో యని తహతహపడుచున్నారు. వీరివలన నేను గైకొన్నధనమును మరల వీరి కిచ్చివేసి యీదంపతులను దాస్యమునుండి యీక్షణమ విముక్తులనుజేయుచున్నాను. ఓనక్షత్రికా! వీరిధనమును వీరి కిచ్చివేయుము.

నక్ష—మహాప్రసాదము. కాలకౌశికా! వీరబాహుడా! మీరిద్దరును నావెంటరండు. మీధన మిచ్చెదను.

(అని వారిని గొనినిష్క్రమించుచున్నాఁడు.)

శివు—ఓహరిశ్చంద్రా! మీరు వధూవరు లుభయులును నాయెదుటకు రండు. మీసత్యవర్తనము నాకాశ్చర్యము పుట్టించుచున్నది.

హరి-(భార్యతోవచ్చి యెదురనిలిచిచేతులుజోడించి)ఓ దేవా! నమస్కారము.

సీ. జయజయ యంబరచరవాహినీజూట
జయచంద్రమఃకళాసత్కిరీట
జయజయ పాతకజ్వలనామలకృపీట
జయ వినిర్ధళితకుంజరనిశాట
జయజయ పావకనయనాంచితలలాట
జయ నివసద్రాప్యశైలకూట
జయజయ వ్యాఘ్రరాక్షసనిర్భరాఖేట
జయధృతనీరజాసనకరోట
గీ. జయ భువనపావనామ్నా యసంఘఘోట
జయ నిశాసమయచరత్స్మశానవాట
జయ సతతభూషణీకృతసర్పఝూట
జయ కనదుచిరామోఘశంబఖేట. 17

శివు—ఓరాజేంద్రా! నీవు మమ్ము స్తుతింపనక్కఱలేదు. నీభక్తితాత్పర్యములను మే మెఱుంగుదుము. మావలన నీకేమి కావలెనో వరముకోరుము.

హరి—దేవరకటాక్షసంపాదనము తప్ప నాకు మఱేమియుం గోరిక లేదు. అయినను దేవరయాజ్ఞాపించినప్పు డేదో కోరకయూర కుండరాదు.

ఉ. దేవ! మదీయమానసము దేవరమీఁదను ధర్మమందునున్
భావిని నిల్చునట్లుగను, భ్రాతలఁ బోలె జనంబుల న్సదా
భావన చేసి తోడ్పడుచు వర్తిలునట్లును; జీవహింసకుం
బోవక యుండునట్లును ప్రభుప్రవరా! వర మిమ్ము సత్కృపన్ 18

శివు—వత్సా! నీవు కోరినకోరికల నిచ్చినారము.

పార్వతి—ఓసాధ్వీశిరోమణీ! నీకేమయినఁగోరిక కలదా?

చంద్ర—అంబా! నామన సెప్పుడును ధర్మమునందే వర్తిల్లు నట్లును, ఈశ్వర భక్తిని బతిభక్తిని పాయకుండునట్లును, జేయుము.

పార్వ—నీ కీ వరమును బ్రసాదించినాము.

శివు—ఓహరిశ్చంద్రా! నీకు మఱేమయినఁ గోరికకలదా?

హరి:—

చ. అనయము భూమి సస్యవతియై ఫలియించును గాక! మానవుల్
ఘనతర నీతివర్తనలఁ గాంతురు గాక సుఖంబు! దుష్టవ
ర్తనులు సమర్హదండనల దౌష్ట్యముమాని చరింతు గాక! భూ
జను లెటనున్న మానక రజమ్మొ గ్రహింతురుగాక యెప్పుడున్ 19.

(అందఱునిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము.

507

దక్షిణగోగ్రహణము

ఈ నాటకమునందు వచ్చుపాత్రములు.

సుశర్మ—త్రిగర్తాధీశుఁడు
సత్యసేనుఁడు—సుశర్మ తమ్ముఁడు
విక్రమభుజుఁడు—త్రిగర్తసేనాధిపతి
ఘటోదరుఁడు, నిపుణకుఁడు—సుశర్మయొక్క భటులు
ధనగుప్తుఁడు—విరాటరాజు ప్రియభృత్యుఁడు, వైశ్యుఁడు
విరాటరాజు—మత్స్యదేశపురాజు; విరాటనగరాధీశుఁడు
వామనశర్మ—పురోహితుఁడు
సుధేష్ణాదేవి—విరాటరాజు భార్య
ఉపచారిక—చేటిక
కంకుభట్టు—ధర్మరాజుయొక్క మాఱుపేరు
వీరసేనుఁడు—విరాట సేనాధిపతి
దామగ్రంథి—నకులుని మాఱుపేరు
తంత్రీపాలుఁడు—సహదేవుని మాఱుపేరు
వలలుఁడు—భీముని మాఱుపేరు
పురుషోత్తవర్మ—విరాటనగరపు కాపు
వజ్రబాహువు—పురుషోత్తవర్మ కొమారుఁడు
ద్వారికుఁడు, సూతుఁడు, భటులు, సైనికులు &c.

౫౯౧

శ్రీ

దక్షిణ గోగ్రహణము

ప్రథమాంకము

రంగము—విరాటనగర సమీపారామము.

[సుశర్మయు తమ్ముఁడగు సత్యసేనుఁడును, సేనాధిపతి యగు విక్రమభుజుఁడును, భటులును ప్రవేశించుచున్నారు]

సుశ—ఓ సేనానీ! విక్రమభుజా! మనదుర్యోధనమహారాజుగారసన్యసామాన్య మేధావంతులనుమా, రారాజుగా రూహించిన ట్లొకవేళఁ బ్రచ్ఛన్నవేషు లయి పాండవు లిం దుండిన నుండవచ్చును. నీ వేమి తలఁచెదవు?

విక్ర—ఉండనేవచ్చును. ఆమహారాజుగారిదికుశాగ్రబుద్ధిగదా!

సుశ—అందుకు సందేహ మేమి? భీష్మద్రోణకృపాశ్వత్థామాది ధీమంతు లందఱుండఁగా నిండుసభలో దుర్యోధనమహారాజుగారి కొక్కరికిఁ దక్క మఱి యెవ్వరికయిననీయాలోచన తోఁచినదా?

గీ. ఆవగింజంత యవకాశ మబ్బునేని,
యతఁడు కొండంతయూహ చేయంగఁ గలఁడు;
పనిని దూర మాలోచించి కనుటగాదె
శేముషీమంతులకును విశేష మెందు?

విక్ర—ఒకానొక యుబలమూలమున సింహబలుఁ డొక్క యపార బాహుబలునిచే నిహతుఁడయ్యెనన్నవృత్తాంతశ్రవణ మాత్రమున నేకదా సుయోధనుఁ డంతయూహ చేయగలిగెను! ఆయూహయే సత్య మయ్యెనేని, ఆతనిబుద్ధిరంపన మెంతయైననుశ్లాఘింపఁదగినదే.

సుశ—నిస్సందేహముగా.

సీ. బలుఁడు శల్యుఁడు సింహబలుఁడు భీముండును సమబాహుబలులిలా
[చక్రమునను
చంపిన నొండొరుఁ జంపంగవలెఁ గాని పరు లేరు వారిఁ జంపంగ లేరు
శల్యుండుహలియును జాలదప్పుగనుంటఁ జంపియుండరలకీచకునివారు
కావున భీముండె గంధర్వుఁ డనుపేర నడిరేయి నాతనిఁ గెడపియుండు

నంతె కాకుండఁ దా నొక్క యింతికొఱకు
సింహబలుఁ డీల్గె నని జనుల్ చెప్పుకొనుట
కతన నయ్యింతి ద్రౌపది కాఁగనోపు
ననుచు నీరీతి నూహించె నవనిభర్త.

విక్ర—మేలు మేలు! అది మిక్కిలి చక్కనియూహ.

సుశ—కానిమ్ము.

ఉ. ఎవ్వరు చంపి రేమి? దివి కేగెను గీచకుఁ డంతెచాలు; నా
కివ్వడిఁ బండు వయ్యె నలహీనుని దుర్మరణంబు వింటచేఁ;
జివ్వను భంగపుచ్చె మునుచేవ మెయిన్ ననువాఁడు క్రూరుఁడై
యవ్వెడఁగు న్వధించి నతఁ డాప్తుఁడునా కతఁ డెవ్వఁడేనియున్.

సత్య—అన్నయ్యా! కురుమహీకాంతుఁ డూహించినట్లు సింహబలు నంతకాంతికంబున కంపినవాఁడు భీమసేనుఁ డయినను, నీ కాతఁ డాప్తుఁడే యగునా?

సుశ—(కొంచె మాలోచించి) అవు నాప్తుఁడే యగును. తమ్ముఁడా!

క. మన మియ్యెడ కరుదెంచుట
యనఘా! పాండవుల నరసి యడవికి వారిన్
బనుచుటకొఱకును గాదే
ఘనసమయాతిక్రమంబు కనఁబఱిచి వెసన్?

కీచకాంతకుఁ డిప్పుడు భీముఁడే యయి బయలఁ బడునేని, ప్రతిజ్ఞా భంగమును జెప్పి యెప్పటియట్ల యప్పాండవుల మరల నడవులకుఁ బంపి మనము స్వామి కార్యనిర్వహణ ధుర్యులము కాఁ గలుగుట కతఁడు తోడుపడినవాఁ డౌను గాన మన కట్టిమహోపకారి యాప్తుఁడు గాక యన్యుఁ డెట్లగును?

సత్య—అది సత్యమే కాని పాండవులే యిం దుందు రను కొందము. అప్పుడు—

క. పాండవమహాబ్ధి వెలువడి
చండతరవిరాటవాయు సంప్రేరితమై
నిండి యతివేగముగ మన
దండుల వడి నాక్రమింపఁ దరమే నిలుపన్?

సుశ—మన మప్పుడును భయపడవలసినపని లేదు. మనల నిక్కడకుఁ బంపు నప్పుడు కురురా జన్నమాట వినలేదా?

ఉ. ఏసరు పాండవాంబునిధి నీఁదుట దుర్భర మయ్యెనేని, దు
శ్శాసన వాయుసంగతిని శాంతనవాది సునావికేంద్ర రా
ధాసుత కర్ణధారసహితం బగుకౌరవరాజపోత ము
ల్లాసముతోడ వచ్చి మనలన్ సరగం దరిఁ జేర్ప కుండునే?

సత్య—కురురాజు కౌరవయోధులతో రేపుగదా యిక్కడకువచ్చును?

క. మన మీదినమునఁ బసులన్
ఘనజవమునఁ బట్టఁగాన కని కౌంతేయుల్
చనుదెంచి తాఁకి రేనియు
ననిలోన న్వారి గెలువ నగునే మనకున్?

ఆ భీమార్జునులపేరు తలఁపునఁ బాఱిన నాగుండె లిప్పుడు తటతట కొట్టుకొనుచున్నవి.

మ. బకకిమ్మీరహిడింబముఖ్యదనుజవ్రాతంబు నెవ్వాఁడు మ
త్తకరీంద్రంబులఁద్రుంచు సింహముగతిన్ దాఁద్రుంచె; నెవ్వాఁడుయా
చకబంధుఁ భుజవీర్యసింధుని జరాసంధుఁ హతుం జేసె; నా
ప్రకటస్థేముని భీమునిం దలఁప నాప్రాణంబు భీతిల్లెడున్.

మ. పటుశౌర్యోన్నతి నెక్కటిం గడఁగి దేవవ్రాతముం గూల్చి దు
ర్ఘటమౌ ఖాండవదాహము న్నలిపె; నాగంధర్వయూథంబు ను
ద్భటశక్తిం బరిమార్చి కాచెఁ గురుభర్తృఘోషయాత్రన్; మహో
త్కటతేజోనిధి యైన యానరునకున్ ధాత్రి న్నరుల్ లెక్కయే?

సుశ—ఓయనుజా! నీవాశంక పెట్టుకోకు. వారజ్ఞాతవాస సంవత్సరాంతములోపల బయలఁబడి ప్రతిజ్ఞాభంగమగునట్లుగామనతో యుద్ధము చేయువత్తురా? తమ్ములొక వేళ తొందరపడుదురనుకొన్నను, ధర్మబాహ్య మయినపనికి ధర్మరాజెన్నఁడయిన నొడఁబడునా?

గీ. తమ్ము లొక వేళ నున్మత్తదంతు లట్లు
విడివడిన, ధర్మజాంకుశ విహతిచేతఁ
దారు మరలింపఁగాఁ బడి ధర్మపాశ
బద్ధు లగుచుఁ గ్రిమ్మఱఁ గానపాలు కారె?

కాఁబట్టి మనము ముందుగాఁ బాండవులవృత్తాంతమునే విచారింతము. దుర్యోధనమహారాజు నాజ్ఞయు మన కట్టిదేకదా? మీరు పాండవులుసుండీ యని మనము నిరూపించినతోడనే వారు మాఱు మాటాడక తత్క్షణ మరణ్యమార్గము పట్టుదురు. ధర్మజుఁడు ధర్మము తప్పుటవలన లభించెడు నింద్రపదవినైనఁ దృణకణమువలె నిరసించును.

సత్య—ధర్మనందనుఁడు ధర్మవెప్పుడును దప్పఁడని నీకు దృఢనిశ్చయ మున్నదా?

సుశ—సూర్యుఁడు నేఁడు సహజతేజోవంతుఁడై పూర్వదిక్కున నుదయించునని యెంత నిశ్చయ మున్నదో యంత నిశ్చయమున్నది. సూర్యుఁడు నైజతేజము విడుచునని నీకేమయిన సందేహమున్నదా?

ఉ. భానుఁడు నైజతేజమును బాసిన, శీతకరుఁడు వేఁడిమిం
బూనిన, నగ్ని చల్లపడిపోయిన, వార్ధి జలంబు తౌరతన్
మానిన, వ్యాఘ్రసింహములు మాంసము తింటఁబరిత్యజించినన్,
దా నిల ధర్మనందనుఁడు ధర్మవు తప్ప డొకించుకేనియున్.

సత్య—అజ్ఞాతవాససంవత్సర మీవఱకే కడచినదేమో! అప్పుడు పాండవుల నెవ్వ రడ్డుపెట్టఁ గలరు?

సుశ—అజ్ఞాతవాసాబ్దమింకను నతీతము కాలేదు. దాఁటి పోయిన యెడలఁ బాండవుల వెదకించుటకు దుర్యోధనమహారాజంత మతిహీనుఁడా?

సత్య—అట్లయిన మనము పాండవాన్వేషణ ప్రయత్నమునే చేయుదము.

సుశ—విరాటునిగర్వ మడఁపక ముందుగా మనకాపని సాధ్యముకాదు. కాఁబట్టి మనము ముందుగా శత్రువైన విరాటుని పశుగణమును వస్తుసంపదను జూఱగొందము.

సత్య—మమ్ము దేపరచిత్తమువచ్చినపనికి నియోగింపవచ్చును. మేమందఱము భవదాజ్ఞాధీనమానసుల మయి వేచియున్నాము.

సుశ—(పయివంకఁ జూచి) ఓవిక్రమభుజా! తూర్పు తెల్లవాఱుచున్నది. మనచేఁ బంపఁబడినచారు లింకను రాలేదు. రాత్రి యంతయు నడిచిన మార్గాయాసముచేత సేనలు నిద్రకుఁ బడినవి. సేనలను లేపి యుద్ధసన్నద్ధము లగునట్లు చేయుము.

విక్ర—తమయాజ్ఞాప్రకారము చేసెదను.

సుశ—మనజాడ కనిపెట్టి యెవ్వరును శత్రువులకుఁ దెలుపక మునుపే మన మాకస్మికముగాఁబోయి గోగణమునుబట్టి యడ్డు వచ్చిన గోపాలురఁ బాఱఁద్రోలి పశుబృందమును ముందు కొంత సేనతో సత్యసేనుని వెంటఁబంపివేయవలెను. వెనుక మనమనుకూల

స్థలమున సేనలను బన్నించి నిలిచి పశువిమోచనమునకయి వచ్చెడి విరాటాదుల నోడించుటకయి సంసిద్ధుల మయి యుండవలెను.

విక్ర—ఆలాగుననే యుందము.

సుశ—విరాటుని నోడించి యాతనినగ రెప్పుడు చూఱకొందమాయని నామనస్సెంతో తహతహపడుచున్నది. పూర్వమాతఁడు పఱిచిన భంగపాటు నాహృదయము నిప్పటికిని శల్యమయి వేధించుచున్నది. వేగులవారు వచ్చెడులోపలనే మన దళములను నడిపించుకొనిపోయి గోవులను బట్టుదమా?

విక్ర—స్వామీ! తొందరపడఁబోకుఁడు. మనచేఁ బంపఁబడిన నిపుణకుఁడు మొదలయినవారు దేశ కాలానుకూల్యములను విచారించుకొని యింతకు వచ్చుచుందురు. మనకిది క్రొత్తదేశము; మార్గ మడిగినను జెప్పువారులేరు; మర్మమెఱుఁగక శత్రుమధ్యమున సాహసించి పనిచేసినచోఁ దరువాతఁ బశ్చాత్తాప పడవలసి వచ్చును. విరటుఁడును మన కశ్రమసాధ్యుఁడు కాఁడు. అతనిబల విక్రమాదులను మున్ను దేవర కొంత యెఱుఁగుదురుగదా?

సుశ—(తిరస్కారముతో) విరాటుని గిరాటుని నాముందఱ నొకపౌరుషశాలినిగాఁ జెప్పకుము. అతనివిక్రమము నే నెఱుఁగనిది కాదు. ఆతఁ డొకసారి యెట్లో దైవికముగా రణజూదమున నాపయి గెలుపు కొనుట నీ వొకమహాకార్యముగా నెంచుచున్నావు. ఆచిఱు గెలుపయినను సింహబలునిచే నైనదిగాని స్వశక్తిచేత నైనదికాదు.

సత్య—అట్లయిన సింహబలుఁడు మరణము నొందినందున కయి మన మిప్పుడు సంతోషపడవలెను.

సుశ—సింహబలుఁ డున్ననేమి? ఆసింహబలుఁడయినను గేక యసాళ్వులను దోడుచేసికొనివచ్చి నాతోఁబోరి యల్పజయమును బొందఁగలిగెనుగాసియప్పుడీవిరాటుఁడును సింహబలుఁడునుమాత్రమే

వచ్చియుండినయెడల నే నాయిరువురను జెఱియొక కాలిక్రిందను జీమలను వలె నలిపివేసి యుండనా?

ఉ. సింహబలుండు నేఁ డిచట జీవముతోడుత నుండె నేని, నే
రంహగతిం గనద్గద కరంబునఁ దాలిచి దంతిమీఁదికిన్
సింహము దూఁకు కైవడిని జెంగున దూఁకి, గదాహతి న్వడిన్
సంహరణం బొనర్చి నిమిషంబునఁ దీర్పనె తొంటి వైరమున్?

విక్ర—ఇప్పుడు దేవరవారు స్వబలమునం దతి విశ్వాసముంచి పరబలమును దిన్నఁగా గణింపజాల కున్నారు. మనసేనలు మార్గాయాసముచే నలసి—

సుశ—కాళు, కాళు, వాకిట నేదో కలకలము వినవచ్చుచున్నది. ఆలకింపుము.

[తెరలో]

గీ. బ్రతికియున్న నిన్ను రంగమున మున్ను
సింహబలుఁడు గెలిచె శితశరాళిఁ;
జచ్చియున్న యతనిఁ జప్పిడిమాటల
గెలిచె దిపుడు నీవు గృహమునందు.

సుశ—(కోపముతో) విక్రమభుజా! ఆప్రలాపము విన్నావా? ఆయువుమూడిన వాఁడెవ్వఁడో చాటుననుండి నిర్భయముగా నన్నే యాక్షేపించుచున్నాఁడు! వాఁడు ప్రాణము లొల్లఁడు కాఁబోలును! ఈరాజద్రోహి మనపరిజనులలో నెవ్వఁ డయి యుండును?

విక్ర—ఆకంఠస్వరము మున్నెన్నఁడును విన్నది కాదు. శత్రుపక్షమువాఁ డెవ్వఁడైన మనవారిచేతఁ జిక్కి యట్లు ప్రేలుచుండి యుండును. మనపరిహార మెక్కడ! స్వామిద్రోహ మెక్కడ!

సుశ—కావచ్చును. ఆదుష్టునిఁ దత్క్షణ మిక్కడ కీడ్చుకొని రమ్మనుము.

విక్ర—ఓరీ! ఘటోదరా! ఆసందడిచేయువారి నందఱిని బ్రభువుగాని సముఖమునకుఁ దీసికొనిరా

ఘటో—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాడు.)

[తెరలో]

ఓరీ! పలుగాకీ! నీవిప్పుడుకూసినకూఁత మా ప్రభువుగారి చెవులఁ బడియుండిన పక్షమున నీతలయుఁక నీమెడమీఁద దడవు నిలువదు. నీకుమృత్యువు సమీపించినది మిడిసిపడక నడువు.

విక్ర—(చూచి) మనసిపుణకాదు లెవ్వనినో పెడఱెక్కలుకట్టి దేవరసన్నిధి కీడ్చుకొని వచ్చుచున్నారు.

సుశ—ఇప్పు డాకాఱు లఱచినవాఁడు వాఁడే యయియుండును. అందుకు సందేహములేదు. నేనూరక మనపక్షమువాఁడని భ్రమపడితిని.

[అప్పుడు నిపుణకుడు, ఘటోదరుడు, పెడఱెక్కలు విఱిచికట్టిన యొకవైశ్యునితోఁ బ్రవేశించుచున్నారు.]

నిపు—దేవా! నమస్కారము. దేవరకు విజయమగుఁగాక!

సుశ—నిపుణకా! కార్యసాఫల్యము చేసికొనివచ్చితివా?

నిపు—మనసుభటు లిప్పుడె కార్యము పండించుకొనివత్తురు. నేను వారిని వెనుకవిడిచి దారిలోఁ దాఱుచున్న వీనిని బట్టుకొని వచ్చినాఁడను—ఓధనగుప్తా! మారాజుగారికి మ్రొక్కుము. చెప్పినను చేయెత్తవేమి?

ధన—(గర్వముతో) ఈబంధములు లేనప్పుడే పరులముందు చేయొగ్గనివాఁడను నేనీనిర్బంధముతో మ్రొక్కుదునా?

సుశ—ఓ వదరుఁబోతా! ఎవఁడవురానీవు?

ధన—(గర్వముతో) మాప్రభువువారి పశువులను దొంగిలి వచ్చిన యీదొంగల గుంపునకు నాయకుఁ డీమువ్వురిలో నెవ్వఁడో ముందుచెప్పుడు. నేనాతని కొకింత బుద్ధిచెప్పవలెను.

సత్య— ఇట్లు కాఱులు ప్రేలుచున్న యీతులువ నాలుక కోయక కత్తి చేతఁబట్టుకొని యూరక చూచుచున్నావేమిరా?

ఘటో—(ఒరలోనుండి కత్తి దూయుచున్నాడు.)

సుశ—ఘటోదరా! క్షణకాలము తాళుము. వీఁడు శత్రుపురము నందలి వార్తలేమయినఁ జెప్పునేమో యడిగి తెలిసికొందము—ఓనిపుణకా! వీఁ డెవఁడు?

నిపు—వీఁడు విరాటుని ధనాగారమునందున్న బచ్చు. వీని పేరు ధనగుప్తుఁడట? వీడు మొదట మాతో శాంతముగా మాటాడుచు మేము దేవర నిర్దేశము చెప్పగానే కాఱు లఱవ మొదలు పెట్టినాఁడు.

ధన—మీరు శత్రుపురము నందలి వార్తలు కావలెనుగా! ఏమి యీత్రుళ్ళు! సిగ్గులేక—

ఘటో—ఓరిమూర్ఖా! ప్రేలక యూరకుండెదవా? ఈ కత్తితో నీనాలుక కోయుదునా?

ధన—కోయుము కోయుము. నిర్దోషులనాలుకలు కోసెడి యసహాయశూరుఁడవు నీవొక్కఁడవేనా మీసేనలో నీవంటి పుణ్యాత్ములింకను బలువు రున్నారా?

సత్య—వీనికి నేఁ డాయువు మూఁడినది.

ధన—మీరు చెప్పనక్కఱలేదు. నా కాయువు మూఁడినదని నా కీవఱకే తెలియును.

సత్య—ఎట్లు తెలిసినది?

ధన—మీవంటి దయావంతుల చేతులలోఁ బడుటచేత.

విక్ర—వీనికి నిశ్చయముగానే చావు వ్రాసినది.

ధన—అందుకుసం దేహ మేమి? ఈ జ్యోతిషము నాకునీకంటెను ముందుగాఁ దెలిసినది. నీభటులు నన్నెప్పుడుపట్టుకొన్నారో నాకప్పుడే చావువ్రాసినదని నీముఖవిలాసము చూడకమునుపే తేలనుకొన్నాను.

సత్య—ఈశుంఠకు జ్యోతిషముకూడఁ దెలిసినదా?

ధన—ఒక్క జ్యోతిషమే కాదు మీసన్నిధికి రాఁగానే నా కిప్పుడు సాముద్రికమును దెలియుచున్నది. మీముఖలక్షణము తేటిపాఱఁ జూచినకొలఁదిని నామరణము నా కంతకంతకుఁ దేటగా బోధపడుచున్నది.

విక్ర—ఓరి వైశ్యాధమా! ప్రేలబోకు.

సుశ—ఈనీచుఁడు చావునకుఁ దెగించి తెంపరియైనోరికి వచ్చినట్లెల్లఁ బ్రేలుచున్నాఁడు. వీనిచేఁ బ్రేలింపకుఁడు.

ధన—నానోరడఁగియుండదు. నన్ను రేఁచుట భేరిని జోకొట్టుటసుమీ!

సుశ—వీఁడువైశ్యుఁ డనుచున్నారే వీనివంశమునలేని యీ వాక్యశూరత వీని కెట్లు వచ్చినది?

సత్య—తల్లి వైశ్యాంగనయే యయియుండును. వీనితండ్రి నెవ్వరెఱుఁగఁగలరు?

ధన—ఈశ్వరుఁ డెఱుఁగఁగలఁడు. నినుబోటి యజ్ఞు లెఱుఁగలేకున్న నష్టమేమి? సహజభీరువులని పేరొందిన వైశ్యులే మావీట నింత శూరు లయియుండఁగాఁ బరాక్రమోపజీవు లయినవారిచర్య లెట్లుండునో నన్నుఁబట్టి యూహించుకొనుఁడు.

సత్య—వీఁడు సురాపానము చేసినవానివలెఁ బ్రేలుచున్నాఁడే!

ధన—సురాపానము చేయుట మాకులాచారము గాదు.

సుశ—నిపుణకా! వీని కేమైన నున్మాద మున్నదా?

నిపు—మనదండయాత్రనుగుఱించి ప్రసంగింపనంతవఱకువీఁడు మహర్షివలె మాటాడినాఁడు. ఆపే రెత్తగానే వీనికీవెఱ్ఱియెత్తినది.

సుశ—(తనలో) వీనిని మంచిమాట లాడి దారికిఁ దేవచ్చునేమోచూతము (ప్రకాశముగా) ఓధనగుప్తా! నీవు మంచివాఁడవు. భయపడఁబోకు. నీప్రాణములు రక్షింపించెదను. మనస్సు కదిలపఱుచుకొని నేనడిగినదానికి సదుత్తరము చెప్పుము.

ధన—ప్రాణభయ మెప్పుడును నాకు లేదు. మీకుఁ గావలసి నన్ని సదుత్తములను జెప్పెదను. మీప్రశ్నపత్రములను విప్పుడు.

సుశ—మీవీటఁ బాండవు లున్నారేమో యెఱుంగుదువా?

ధన—ఎఱుగుదును.

సుశ—ఏ మెఱుఁగుదువు?

ధన—పాండవులు లేరని.

సత్య—వీఁ డసత్యము పలుకుచున్నాఁడు.

ధన—మావీట నున్న కుక్కయు నసత్యము పలుకదు.

సుశ—ఎఱుఁగకున్నఁ బోనిమ్ము. కోపము తెచ్చుకోకు. మీ రాజుగారి బావ సింహబలుఁడు సుఖుఁడయి యున్నాఁడేమో చెప్పఁ గలవా!

ధన—చెప్పఁగలను. అతఁడు చచ్చి స్వర్గలోకమున సుఖుఁ డయి యున్నాఁడు.

సుశ—స్వర్గలోకమునా?

ధన—స్వర్గమునఁ గాకున్న నరకమున నని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఏదో యొకలోకమున నున్నాఁడు. ఈలోకమున మాత్రము లేఁడు.

సుశ—ఎందుచేతఁ జచ్చినాఁడు?

ధన—తన దుర్మార్గత్వముచేత.

సుశ—ఎవని చేతఁ జంపబడినాఁడు?

ధన—విధిచేతఁ జంపఁబడినాఁడు.

సుశ—నీ వేదాంతార్థ మక్కఱలేదు, లౌకికార్థము చెప్పుము. సింహబలుని జంపినవాఁ డెవ్వఁడు?

ధన—గంధర్వుఁ డఁట!

సుశ—భూలోకమున నున్న సింహబలునకు గగనచరుఁ డయిన గంధర్వునితోడ వైర మేల కలిగినది!

ధన—గగనచరు లేమి? భూచరు లేమి? దుష్టున కందఱును వైరులే. పరాంగనానురక్తులకును బరధనాసక్తులకును వైరులు కానివా రెవ్వ రుందురు? కండకొవ్వున వాఁడొక్క మహాపతివ్రత కాశపడగా కావలసినకార్యము గంధర్వులే తీర్చిరి.

సుశ—అతఁడు జారత్వదేవతకే బలి యయ్యెనా?

ధన—అవును. ఆరాక్షసికే నరబలియయినాఁడు. పరకాంత కాశపడి బ్రతికినవాఁడెవఁడు?

ఉ. సీత మహాపతివ్రతను జేరఁగఁ గోరి దశాస్యుఁ డీల్గఁడే?
పాతకియై సురాంగనలఁ బట్టి వెస న్నరకుండు కూలఁడే?
ఘాతుకు లైనయాదనుజకాంతులయట్ల నరాకృతిన్ సురా
రాతి యితండు పుట్టి మహి ప్రమందెను, నేఁ డిట వింత యేటికిన్?

సుశ—(తనలో) ఈమూఢుఁడు దారికివచ్చుచున్నాఁడు. ఇఁక మెల్లఁగాఁ గార్యాంశమునకు దింపెదను. (ప్రకాశముగా) ఓసెట్టీ! అన్నగారి దుర్మరణమును జూచి తమ్ము లోర్చి యూరకుండిరా?

ధన—ఆయన్నతమ్ము లేల యూరకుందురు? అన్నవలెనే త్రుళ్ళిపడి సాధుహింసకు యత్నింపఁగా గంధర్వు లెఱిఁగియన్నవద్దకే వారిని దోడుపంపిరి.

సుశ—అది సరేకాని యీదుష్టుఁడాశించిన యామహాపతి వ్రతయెవ్వరు?

ధన—అంతఃపురపరిజనముమాట నన్నడుగఁబోకు. నేను బర కాంత పేరెత్తను.

సుశ—పోనిమ్ము. మీ దేశమునఁ బశుసమృద్ధి గలదా?

ధన—కావలసినంత యున్నది.

సుశ—మీరాజుపశువు లెక్కడ క్షేమముగా నుంచఁబడును?

ధన—మా రాజుపశువులా! సరిసరి! మీతలఁపు నాకిప్పుడు బోధపడుచున్నది. ఆపశువార్త పశువులకే కాని మనకెందుకు?

సుశ—(తనలో) పశువుల పేరుతల పెట్టఁగా నేవీనికిమరలఁబిచ్చి యెత్తుచున్నది. (ప్రకాశముగా) నీవు ప్రాణముల కాశపడెడుపక్షమున నీశ్శ్వసమలక నిజము చెప్పుము. నీకభయదానము చేసెదను.

ధన—నాకు రాజభక్తికంటెను ప్రాణము లెక్కువవి కావు. వలయునేని యీపాడుప్రాణములఁ బుచ్చుకొమ్ము. నేనీదేహమునైనను విడిచెదనుగాని ప్రాణము పోయినను రాజద్రోహముఁ జేయను.

క. రుజలం బస చెడి ముదిమిని
ద్యజియింపఁగవలయు నట్టిదగు నీయొడలిన్
భజియించిన స్వామ్యర్థము
త్యజియించుటకంటె భాగ్యమన్యము కలదే?

సుశ—ఓయి పిచ్చివాఁడా! మామాట వినక నీ విప్పు డేల నిష్కారణముగాఁ జెడిపోయెదవు? నీవు చెప్పకపోయినను మేమెట్టును మీరాజుగోవులను బట్టకమానము. మానిపుణకాని వెంటఁ బోయిన చారులు సర్వమును దెలిసికొని నీవిక్కడనుండఁగా నేవత్తురు. ఈలోప లనె బుద్ధిమంతుఁడ వయి మాకిప్పుడు త్రోవ చెప్పినడిపించితివా, నీకుఁ దగినప్రత్యుపకారమును జేసెదము. ఇదిగో ప్రస్తుతమీబహుమానము నందుకొమ్ము. (అని చేతి రత్నకంకణ మియ్యఁబోవుచున్నాఁడు)

ధన—ఆహాహాహా! బహుమానమా!

సుశ—అవును బహుమానమే. మాబహుమానమన్న నీకంత తిరస్కారముగా నున్నదా?

ధన—ఒక్క నీబహుమానమునే కాదు నీబహుమానమును నిన్నునుగూడఁ దిరస్కరించుచున్నాను. నేఁ డుండి రేపు పోయెడు

నీతుచ్ఛధనమును నీయొద్దనే యుంచుకొమ్ము. నావద్ద నెన్నఁడును దఱుఁగని దివ్యధనము కావలసినంత యున్నది.

సుశ—మీరాజువద్ద నని నీయభిప్రాయము కాఁబోలును!

ధన—కాదు నావద్ద ననియే.

సుశ—నీయింటివద్దనా?

ధన—ఇంటివద్ద కా దిక్కడనే.

సుశ—ఇక్కడ నెక్కడ?

ధన—ఇక్కడ. (అని హృదయమును జూపుచున్నాఁడు)

సుశ—అక్కడనున్న దేమిధనము?

ధన—ఏమిధనమా? సత్యధనము; దయాధనము; ధైర్యధనము; అమూల్యనీతిధనము. ఈధనములు మీరు వేయిజన్మములెత్తినను రావు.

సత్య—ఓరి చండాలుఁడా! స్వపరతారతమ్య మెఱుఁగక నోరికివచ్చిన ట్లెల్లను బ్రేలుచున్నావు!

సుశ—ఈమూర్ఖుఁడు సామవచనములచేతఁ జక్కఁ బడఁడు. ఓభటులారా! వీనిని దండింపుఁడు.

ఘటో—ఓరిమూర్ఖా! నీపాపఫల మనుభవింపుము. (అని కొట్టుచున్నాఁడు)

ధన—అనుభవించెదను! అనుభవించెదను! మీరన్నట్లు స్వయంకృతాపరాధ ఫల మనుభవింపకతీఱదు. ఇక్కడ నావిషయమునఁ జేసినదంతయు మీ రక్కడ యమసన్నిధానమునందు కోటిగుణితముగా ననుభవించెదరు.

సుశ—ఓరీ! ఇఁకనైన బుద్ధితెచ్చుకొని మీరాజుగుట్టు చెప్పెదవా? నిన్ను మన్నించెదను.

ధన—మన్నింపనక్కఱలేదు చెప్పెదను వినుము.

సుశ—సావధానులమయి యున్నాము. చెప్పుము.

ధన—ఇదిగో మర్మము విడిచి చెప్పుచున్నాను. నీవు వృథా పశుహరణమున కేల యత్నించెదవు? వంచకులకుఁగాని ఋజుమార్గ వర్తులకు గోప్యాంశమేమి యుండును? ఆతనిగుట్టంతయు నీతి తప్పకుండుటయే.

గీ. దుర్గిరీశ్యుఁడౌ మత్స్యేంద్రు దోయ్యగంబు
నొరసి నిలిచిన మగఁటిమి యొదవుఁగాక,
భీరులగుగోవులను గొట్టి నోరు లేని
పసరములఁ బట్టు టిది యేటిపౌరుషంబు?

నీవు మానప్రాణములు దక్కించుకోఁ గోరితివా, యీవ్యర్థ ప్రయత్నమును మాని యిప్పుడు వచ్చినదారినే మరలనింటిమార్గము పట్టుము. నీ కీ దుర్బుద్ధి వదలక ప్రాణములు చేఁదయి చెడిపోఁ దలఁచితివా, పోయి గోవులను బట్టుము. అప్పుడు

మ. లయకాలానలభీషణాకృతిని లీల న్నీదు సేనాటవిన్
రయమారంగ శరార్చులం బొదివి తీవ్రప్రక్రియం గాల్చుచున్
భయదాస్త్రంబుల నవ్విరాటుఁడు నినున్ దర్పోద్ధతిం దాఁకఁ ద
ద్దయుఁ బ్రాణంబును మానముఁ రణమునందక్కించుకో నేర్తు వే?

మ. గజబృందంబులతో నఖర్వమదరేఖన్ దా శతానీకుఁడున్,
విజయాశ్వంబులతో భుజాబలమునన్ సూర్యదత్తుండు, వా
యుజవం బొప్పరణాళితోడమదిరాస్యుండున్, ద్రిమూర్తుల్నృపా
నుజు లొక్కమ్మడిఁ దాఁకఁ గూలరెభవన్ముఖ్యాగ్ర సేనాపతుల్?

ఉ. ఆతని యగ్రనందనుఁ డహార్పతితేజుఁడు శంఖుఁ డున్మదా
రాతిభయంకరుండు మృగరాజు గజంబులఁ బోలెఁ దోలి బల్
శాతకృపాణిచే నడరఁ జంపఁగ నొంపఁగ నీదుసైన్యిక
వ్రాతము గుండియల్ పగిలి పాఱక జాఱక నిల్వ నేర్చునే?

క. చావం దలఁచితి వేసియు
గోవుల నిటఁ బట్టు మీవు కుటిలత్వమునన్.
జావక బ్రదుకం దలఁచిన,
నీ విదె నాబుద్ధి వించు నేగుము పొకిన్.

సుశ—ఓరీ! ఆత్మస్తుతి పరనిందా పాండిత్యధురీణా! నీచదువు పూర్ణమయినదా? ఇంకను గొంత కొఱంత యున్నదా?

ధన—చెప్పవలసినదానిలో సహస్రాంశమయినను గాలేదు. అందనిద్రాక్షపండ్ల కఱ్ఱులు చాచుటవలన నేమి ప్రయోజనము? శక్యాశక్యవిచారములేక నీవేల నిష్కారణముగా చెట్టుగొట్టి పైని వేసికొనెదవు? మారాజు వీరాధివీరుఁడు—

సుశ—ఇంతటితో నీచదువుచాలించు. నీపాండిత్యము మేము మెచ్చుకొన్నాము—విక్రమభుజా! మన మీమూఢునితోఁ గాలమంతయు వ్యర్థపుచ్చుచున్నాము. వీనితో వేయేండ్లు మాటాడినను మనకుఁ బ్రయోజనలేశమును గలుగదు. ఓఘటోదరా! వీనిని గొనిపోయి మనకార్యాలోచన వినఁబడకుండ దూరముగా నాతాళవనమునం దుంచుము. బంధములు త్రెంచుకొని పాఱిపోకుండ వీనిని పదిలముగా మీ రందఱును గను గలిగి కాచుచుండవలెను జుడీ.

ధన—(తనలో) ఇతఁడు నాకు మంచియుపాయము తోపించినాఁడు.

ఘటో—చిత్తము. (అని ధనగుప్తునితో నిష్క్రమించుచున్నాడు)

సుశ—విక్రమభుజా! వాఁడు దాఁటిపోయినాఁడా?

విక—పోవుచున్నాఁడు. మనమిఁకరహస్యాలోచనము కుపక్రమింపవచ్చును. అదె మననిపుణకుఁడు మరల వచ్చుచున్నాఁడు. ఆతని ముఖవికాసముచూడఁగా నేదోశుభవార్త తెచ్చుచున్నట్లున్నది.

సుశ—మనరాక శత్రువుల కెఱుక పడకుండ నేను నీతోఁ జెప్పినట్లు చేసినావా?

విక్ర—సర్వమును దేవర యాజ్ఞాప్రకారము చేసినాను. భేరులు మొదలయిన రణవాద్యములు మ్రోయింపకుండ సైనికుల కాజ్ఞాపించినాను; భటు లెవ్వరును తోఁట విడిచి యవలకుఁ బోవకుండఁ గట్టడి చేసినాను! గుఱ్ఱములు గజములు—

సుశ—చాలును. ఇవన్నియు సరేకాని విరటుని కనుపుల జాడ మాత్ర మింకను మనకుఁ దెలియనే లేదుగదా?

[నిపుణకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

నిపు—స్వామీ! నమస్కారము. నేను వెనుక దిగవిడిచి వచ్చిన భటులు విరటుని గోపులజాడ కనిపెట్టి వచ్చినారు. ఆతని గోగణ మాతోఁట కీశాన్యమూలనున్న పొలములోనుండి గోపాలు రచే రక్షింపబడుచున్నది.

సుశ—అట్లయిన వేగముగాఁబోయి పసులఁ బట్టుదము లెండు. ఓపీరులారా! ఇప్పుడాధనగుప్తుఁడు ప్రేలినవీరాలాపములనువిన్నారా?

సత్య—మీ రావాగాడంబరము నమ్మి యణుమాత్రమును జింతిలఁబోకుఁడు.

చ. విరటునితమ్ముల న్మువుర విక్రమలీల వధించు వాఁడ నొ
క్కఁడుఁడనె నేను వ్యాఘ్రములుకఁ హరిణంబులఁజంపుకైవడిఁ;
నరవర! చింత మానుము మనంబున; నాయసిపాలు మత్స్యభూ
వరు ననుజన్ము లెల్ల; సభ వారు వినంగఁ బ్రతిజ్ఞ పట్టితిఁ.

విక్ర—ఇఁక నాప్రతిజ్ఞ చిత్తగింపుడు.

క. శిరములు త్రుంచెద సునిసిత
శరధారలచేత నేగె శంఖాదిమహీ
వరసుతుల నెల్ల; నాపా
లరయఁగ సేనానితోడ నఖిలకుమారుల్.

సుర—నే నిదె శపథము చేయుచున్నాను వినుడు.

క. విరటునిఁ బొరిగొనియెద నీ
ఖరతరకౌక్షేయకమున క్షణకాలమునన్;
విరటుఁడు నాపాలయ్యెడు
సుర లెల్లను నచ్చి తోడు చూపిరయేనిన్.

ఓసత్యసేనా! నీవు నిపుణకనివెంటఁ బోయి యడ్డువచ్చిన గోపకులఁ దూపులపాలు చేసి గోవులను బట్టుము—ఓ విక్రమభుజా! నీవు సేనలనుబన్ని పురమునకును గోవులకును మధ్య నిలువుము. పొమ్ము. నే నిదె నిన్నుఁ గలిసికొనెదను.

సత్య—అట్లు చేసెదము.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

ద్వితీయాంకము

రంగము—విరాటుని సభామంటపము

[విరాటరాజును, రాణియైన సుధేష్ణాదేవియు ఉపచారిక యను చేటికయు, పురోహితుఁడగు వామనశర్మయు, దౌవారికుఁడును ప్రవేశించుచున్నారు]

విరా—ఓవామనశర్మా! నిన్నటిదినము పూజ్యులైన కంకభట్లవారాశౌచవిషయమయిన ప్రస్తావనలో "దశాహం బ్రాహ్మణానాంతు। క్షత్రియాణాం త్రిపంచక"మ్మని దేవలస్మృతివచనము నొకదాని నుదాహరించినారు. దానినిబట్టి పదియేనుదినము లాశౌచము పట్టవలసినపని లేదుగదా?

వామ—లేదు. దేశాచారమునుబట్టి మనకుఁ బండ్రెండుదిన ములతోనే యాశౌచ శుద్ధి యగును. ధర్మశాస్త్రమును శిష్టాచార మున కనుగుణముగానే యున్నది.

శ్లో. శుద్ధే ద్విప్రో దశాహేన ద్వాదశాహేన భూమిపః
వైశ్యః పంచదశాహేన శూద్రో మాసేనశుద్ధ్యతి.

అనుదక్షస్మృతివచనమును దేవరవారు చిత్తగించియుండ లేదా? ఈవఱకేర్పఱిచినట్లుగా సింహబలాదుల పత్నులచేత నేఁడే శుద్ధిస్నానము చేయింపవచ్చును. అయ్యో! సింహబలుని పేరుచ్చ రింపఁగానే దేవిగారు మరల రోదనమున కారంభించినారు!

విరా—

చ. వనితరో! గ్రీష్మతాపమున వాడినపూసరమట్టు లున్న యీ
తనువును దుఃఖవహ్ని నిటు తాపము నొందఁగఁ జేసె దేల? నె
మ్మనమునఁ దాల్మి పూని యిఁక మానుముశోకము నిన్నుఁజూచి నీ
తనయులు నేముఁ గుందెదము; ధైర్యమునన్నమునూఱడింపుమా.

నీ వీరీతిఁగా వేయేండ్లు చింతిల్లినను, అప్ప యేడ్చుచున్నదని జాలిపడి సింహబలుఁడును దమ్ములును లేచివచ్చి నిన్నోదార్తురా? వారు నీతల్లికడుపునఁబుట్టనేలే దనుకొని వారిని మఱచిపొమ్ము.

ఉప—అమ్మా! ఊఱడిల్లుము.

వామ—ఓహో! ఈపండ్రెండుదినములలోనే యీమె యెంత మాఱిపోయినది! నిత్యమును జూచుచుండఁబట్టి నేనీమె దేవియనుకొం టిని గాని పదునేనుదినములక్రిందఁ జూచినవా రిప్పు డీమెను గుఱుతు పట్టలేరు. అమ్మా! ప్రభువుగారు చెప్పినట్లుచేసి దుఃఖమును నీమనసు లోనే దిగమ్రింగికొమ్ము.

సుధే—హా! సింహబలా! ని న్నెట్లు మఱచిపోఁగలుగుదునురా తమ్ముఁడా? నీవుపోయి నేటికి బంగ్రెండుదినములు దాఁటిపోయినను నామనోవ్యథ యంతకంతకు మఱింత క్రొత్తదగుచున్నది. మఱతు నన్ననుమఱపునకు రాక నామనోనేత్రమున కిప్పుడును నీవు సైరంధ్రిని నీయింటికి బంపు మని దీనముఖముతో వేఁడుచు నాయెదుట నిలువఁ బడినట్లే కనఁబడుచున్నావు!

విరా—ఓ దేవీ! నీ వూరక తమ్ముఁడాతమ్ముఁడా యని పలువ గించెదవు. ఇంకను నీకెక్కడితమ్ముఁడు? నీమీఁదఁ బ్రేమలేక నిన్ను విడిచిపోయిన కఠినచిత్తునికొఱ కెన్నాళ్ళు విలపించెదవు?

సుధే—ఓప్రాణేశ్వరా! ఎన్నాళ్ళని సెలవిచ్చెదరేమి? ఎన్ని యేండ్లు విలపించినను శోకసముద్రమునకు దరి గానరానట్లున్నది. నా కిప్పుడు క్షణ మొకకల్ప మగుచున్నది. ఎంతసేపటికిని తెల్లవాఱక నా కీరాత్రి యొక మహాయుగమైనది. హాదైవమా! చిరంజీవినివై దుఃఖములనుభవింపుమని నన్నీ లోకములోఁ బుట్టించితివా!

విరా—హా! హృదయేశ్వరీ! (అని తలంచుకొని నేల చూచు చున్నాఁడు.)

ఉప—అయ్యో! రాజుగారునునధైర్యపడుచున్నారు! ఏమిబుద్ధి!

వామ—అమ్మా! ఊఱడుము. నిన్నుఁజూచి రాజుగారును దుఃఖపడుచున్నారు. భర్తగారిని మీపుత్రులను పుత్రాధికులనుగాఁ జూచుకొనుచున్న ప్రజలమయిన మమ్మునుజూచి దుఃఖముపశమించు కొనుము. ఓరాజేంద్రా! మీకీవెఱ్ఱియేమి? దేవిగారినోదార్పవలసిన వారు మీరే యిట్లు వావిడిచి దుఃఖపడినచో మి మ్మూఱడించువా రెవ్వరు? ధైర్యమవలంబించి దేవి నోదార్పుఁడు.

సుధే—ఓవిప్రోత్తమా! ఇట్లొక్కసారిగా నూర్వురతమ్ములను మ్రింగుకొని మరలఁ బ్రజలముఖములుచూచుటకు నాకు ముఖ మెట్లు

చెల్లును? ఇఁక నా కెక్కడిలోకము! ఎక్కడి ప్రజలు! లోకములో నన్నుఁబోలు భాగ్యహీనురాలు వేఱొకతె లేదు.

విరా—ఓభూదేవోత్తమా! నేనీదేవి నెట్లోదార్పఁగలను?

ఉ. ఊరికిఁ బోయి రింకను సహోదరు లాదట నేఁట రేపటన్
దా రరుదెంతు రోర్చుకొను ధైర్యముతో నని యూఱడింతునా?
వారల నేను దెచ్చెదను వందురఁ బోకని యూఱడింతునా?
ఊఱడు మిట్టు లీ వనుట కొక్కయుపాయముఁ దోఁప దక్కటా!

హా! సింహబలా! నారాష్ట్రమునకు నీవొక పెట్టని కోటవు గదా? కొండవలె నీవుదండ నుండుటచేత నెట్టివిక్రమధురంధరులును నారాజ్యమువంకఁ దేఱిపాఱఁ జూడ వెఱచుచుందురు. ఇఁక నీవులేని యీరాజ్యమున కేయోగము పట్టనున్నదో! నాభాగ్యహీనతచేతనే నీ కకాలమరణము సంప్రాప్తమయినది.

సుధే—నేను గేవల మందభాగ్యురాలను. నావంటినిర్భాగ్యురాలి కటువంటి సోదరరత్నము దక్కునా? హా! నే నెంతటి కఠిన చిత్తురాలను! అటువంటి భ్రాతృశతమును మృత్యుదేవత కప్పగించి వారివెంటఁ బోలేక హృదయము పగులక మొండిజీవినై బ్రతుకు చున్నాను. ఓవిధాతా! నీవు నాహృదయమును రాతితోఁ జేసితివా?

ఉప—అమ్మా! ఓర్చుకొమ్ము. మృత్యుదేవతను నీవడ్డగింపఁ గలుగుదువా? అట్లు మృత్యువు త్రోచుకొనిరాఁగా నీవేమిచేసెదవు?

సుధే—ఆహా! ఎటువంటి బలవంతు లంద ఱొక్కసారిగాఁ గార్చిచ్చు పొదివినజీర్ణాటవివలె దగ్ధు లయినారు! హా! సైరంధ్రీ! నా తల్లీ! కీచకకులమున కకాలమృత్యుదేవతవయి మాకు నీవెక్కడ దావురించినావు! ఇంతమందిని నీపొట్టఁ బెట్టుకొనుటచేత నయినను నీకుఁ దృప్తి కలిగినదా? నీకన్ను లిప్పుడు చల్లపడినవా?

విరా—ప్రాణేశ్వరీ! మనభాగ్య మిట్లుండఁగా నీవేల పరుల నిందించెదవు? ఇం దామహాపతివ్రతదోష మేమున్నది? పరాంగనను బలిమినిబట్టఁబోయిన వాని దుర్ణయవిషమే వానిని జంపినది.

సుధే—అవు నాసాధ్వియెడల దోషము లేశమును లేదు. దోష మంతయు మనవానియొద్దనేయున్నది. ఒక్కగడుపునఁబుట్టినదోషము చేత నే నిట్లు మతిచెడి ప్రలపించుచున్నాను. హా! తమ్ముఁడా! నీకు రంభలమించు సుందరు లంద అంతఃపురముననుండఁగా, పరదారకేల యాశపడితివి? పరసతిపొందు పలదని నేను నాఁడే చెవినిల్లుకట్టుకొని పోరితిని. నాహితవాక్య మొక్కటియుఁ జెవిని జొరనియ్యక సర్వమును బెడచెవులఁ బెట్టితివి. ఇప్పుడయిన నాపాట హిత మని నీ కనుభవమైనదా?

విరా—వినాశకాలము దాపించినవాఁ డాప్తులహితాలాపము లేల వినును?

క. మృత్యువు విడువక తలపై
నృత్యం బటు సల్పుచుండ నెన్నండును దా
నత్యంతహితులమతులం
బ్రత్యయ మిడ నిచ్చునె యల పాపపువిధియున్?

విధి నవవలసిన పనియేమి? వానిచావునకు నీయుపేక్షకూడఁ గొంత తోడుపడినది. నాఁ డట్లు మధువునకై మాలినిని వానియిం టికిఁ బంపకుంటివా, ఇంతలో నింత వైపరీత్యము పుట్టదు.

సుధే—అవును. ఈసంఘమరణమునకుఁ బాపకర్తృరాలనయిన నేనే కొంత కారకురాలను. అప్పుడునాబుద్ధిబ్రమిసిపాడుసురకై సైరంధ్రిని వానియింటికిఁ బంపి పాపము కట్టుకొని నూటయేవుర తమ్ములను నాపొట్టనుబెట్టుకొన్నాను. నాలోపలఁజొచ్చి విధినాచేనట్లు చేయించుచుండఁగా, నేనెట్లు మాలినిని సురహరణార్థము పంపకుండనేర్తును?

విరా—అది నీదోషము కాదు. విధి బలవంతమయి ప్రేరేపించుచుండగా, విధి విధానము తప్పింప నెవ్వరికి శక్యమగును? వాఁడా లాగున వాఁడు పట్టపగలు సిగ్గువిడిచి వీధినిబడి మాలినిని సభ కేసి తలుముకొని వచ్చినప్పుడే వానికిఁ జేటుకాల మాసన్న మయినదని నే ననుకొన్నాను. ఆయువుమూఁడఁబట్టియే వానికట్టి దుర్బుద్ధిపుట్టినది.

సుధే—వాఁడు నా కాళ్ళమీఁదఁబడి లేవక సైరంధ్రిని దన గృహమున కంపనియెడల మన్మథాగ్ని చేత నప్పుడే ప్రాణములు పోవునని ప్రలపించినాఁడు. అప్పటి వానియవస్థను జూచి వాఁ డెట్లును కాముని నిశాతశరములచేతఁ జచ్చుట నిశ్చయ మని తలపోసి భ్రాతృవాత్సల్యముచేఁ గార్యాకార్యవిచారము చేయలేక సోదర ప్రాణరక్షణార్థమయి యాపని చేసితిని.

ఉప—ఆహా! సోదరస్నేహ మట్టిదేకదా! సహోదరునివ్యథఁ జూచి యాడుతో డెట్లోర్వఁ గలుగును?

సుధే—ఓతమ్ముడా! అఖర్వశౌర్యగర్వు లైనగంధర్వులు నీప్రాణములు గొంపురని నే భయపెట్టినప్పుడు సైరంధ్రిపతులయిన గంధర్వపతులెంతటి బలవంతు లైనను వారి నర్థక్షణములో నంతము నొందించెదనని ప్రగల్భవచనములు పలికితివే, లోకములో నాకంటె బలవంతులు లేరని విఱ్ఱవీఁగెడు నీమర్జయ మయినబలము వారిముందేమయిపోయినది? అతిలోక బాహుబలుఁ డైనసింహబలు నొక్క రాత్రిలో నంతము నొందించిన యాగంధర్వు లెంతబలము గలవారో!

విరా—పాపోపహతుని జంపుటకు బలమే యక్కఱలేదు. ఇతరులూరక నిమిత్తమాత్రమే కాని వానిపాపమే వానిని జంపును. ధర్మబాహ్యుఁ డయి పాపకార్యమునకుఁ జొచ్చినవానికడ ధైర్యశౌర్యాదులు నిలుచునా? నీతిబల ముడిగినవాఁ డన్ని బలములు నుడిగినవాఁడే.

నీతిబలహీనుని బాలుఁడైన ననాయాసముగాఁ జంపగలుగును. ఆతని పాపమే కాకున్న లోకాతీతసత్త్వాఢ్యుఁ డయినసింహబలు నొక్కరు చంపఁగలుగుదురా?

సుధే—ఓతమ్ముడా! నీవు శాస్త్రము లెఱిఁగినవాడవే? పరవనితాసంగమము పాప మని తెలిసియు బుద్ధి యేల మరలించుకొన్నావు కావు? దీనివలననపఖ్యాతియేగాక నీ వేమిసుఖ మనుభవించినావు?

విరా—ఓప్రియురాలా! ఏమి నీవెఱ్ఱి! వ్యభిచారమువలన దుఃఖమే గాక సుఖము కూడఁ గలుగునా?

చ. పతి వినెనేని ప్రాణములపై వలుగున్; జనులింత చూచినన్
క్షితిపయి మానుషంబు చెడుఁ; జింతమెయిం గులకాంత విన్నచో
బ్రతుకు త్యజింపఁ జూచుఁ: డలవంపు లగు న్సరివా రెఱింగినన్
వెత యగుగాక! సౌఖ్య మొదవించునె యన్యసతీరతం బెటన్?

గీ. ఆయువు నడంచు, నైశ్వర్య మపహరించుఁ,
గీర్తితరువు నుగ్మూలించుఁ గేవలంబు
పరసతీసంగమం బట్టిపాడుపనికి
ధర్మపరుఁ డెప్పుడైనను దలఁపుగొనునె?

సుధే—స్వానుష్ఠానసమయమునఁ దెలిసినవారును తప్పుదారిఁ బట్టుదురు. ఓతమ్ముడా! ఈవిషయమునఁ నీవి వేక మెక్కడకుఁ బోయినది?

విరా—కామాతురునకుచితానుచిత వివేక మెక్కడనుండును? ఆస దోసమెఱుఁగ నిచ్చునా?

మ. అలనాఁ డాయువివేకి కీచకుఁడు మధ్యాహ్నంబునం గామవి
హ్వలుఁడై బావురుగాఁడు రాచిక డాయన్వచ్చున ట్లేచి రా,
నిలువెల్లం జెమరింప మే న్వడఁకఁ గన్నీ రక్షులంగ్రిమ్మదా
నలసై రంధ్రి కడంగి నన్ననినవాక్యం బుల్లమున్ వ్రచ్చెడున్.

సుధే—ఆవాక్యమేది?

విరా—ఇది—

చ. నరపతి చూచుచుండ సభ న న్నిటు లీకుజనుండు కూరుఁడై
పరిభవ మందఁ జేయఁగ నృపాలకుఁడే కని యూరకుండఁగా
నరయఁగ నింకమీఁదటఁ గులాంగన లెవ్వరిభార్య లీపురిన్
పరిభవ మందకుండ మనువారలు మానముతోడ? నక్కటా!

సుధే—అధర్మమును జూచి రాజుపేక్షకుఁ డైనయెడల ఆపాపములో సగము రాజును జెందు నని నీతివేత్తలు చెప్పుదురే! మీ రేల యుపేక్ష చేసితిరి? అప్పుడు మీరు వానికిఁ దగినబుద్ధి చెప్పి వారించి యుండినయెడల మనకీచక వ్రజమున కీయ కాండప్రళయము రాకుండియుండును. దుఃఖకరమైన యీ వాక్యమువినిమీ రేమి చేసితిరి?

విరా—ఆమెను శాంతవచనములతోఁ గొంత యూరడించి, తరువాత విచారించి ని న్నిట్లు భంగపఱిచిన యీ దుష్టుని శిక్షించెదఁ బొమ్మని సమయోచితముగాఁ జెప్పి యొడఁబఱిచి నే నామె నప్పటికి బంపివేసితిని. అంతలో పాడుదాక్షిణ్య మడ్డువచ్చి నానోరు నొక్కుటచేత సభలోఁ గీచకుని గినియుటకయిన నాలుకాడినదికాదు.

సుధే—కుర్కారుడయిన సింహబలుడు పోలిసినను వంశము నిలుచుటకై నూటనలువురు తమ్ములలో నొక్కఁడైన బ్రతుకరాదా?

విరా—పుట్టుకచేత నేకాక దుర్నయముచేతఁగూడ వానికిఁ దమ్ములనఁదగినవారు మాత్రమేల యన్నను విడిచి బ్రతుకుదురు? అన్నగారి యవస్థను గన్నులార చూచియు భయపడక యీపరమ పాపనిని ముద్దయు యుక్తమున్న యున్నశవము మీఁదఁ బెట్టి కట్టినట్టి దుష్టుల కట్టికష్టపాటు తప్పునా?

సుధే—హా! పాపపు దైవమా! నీకంటికీచకులమింతయెక్కువ బరువయ్యెనా? భ్రాతలకును బితలకునుదిరోదకము లిచ్చుటకొక్కని నైన విడిచిపెట్టలేకపోతివా? మీకితరులెందురు? ఇదిగో మృతకల్పు

రాలనయిఁ బ్రతికియున్న నేనే మీయందఱికిని గన్నీటితో తర్పణ జలము విడుచుచున్నాను. (అని యేడ్చుచున్నది.)

వామ—అమ్మా! తలఁచుకొని తలఁచుకొని యేల దుఃఖించెదరు? మీ రేడిచి యీపోయినవారిలో నొక్కరినైన బ్రతికింపఁ గలరా? మిమ్మిట్లు దుఃఖపెట్టెడువారు మీకు శత్రువులుగాక తమ్ము లగుదురా? ఇఁక వారిమీఁది మోహపాశము కోసివేసి నేఁటిదినమున జరగవలసిన క్రియలమాట చూడుఁడు.

విరా—ఓమనోనాయకా! నేను జెప్పుమన్నమాటలు నీ వా సైరంధ్రితోఁ జెప్పితివా?

ఉ. ఓకమలాస్యలో! పురుషు లుర్విని జంచలచిత్తు లెంతయున్;
లోకములోని సుందరులలోఁ గడుసుందరి యామె; యెవ్వరే
నాకమలాయతాక్షి దెస నాసఁ గనుంగొని రేని, చావొగిన్
జేకుఱుఁగాన, మాలినిని శీఘ్రము సాగఁగ నంపఁగాఁ దగున్.

పురుషులకంటెఁ దరుణులు మృదుతరమధురవచనరచనలతో సమయోచితముగాఁ బలుక నేర్తురుగాన, నేనీభారమును నీమీఁదఁ బెట్ట వలసివచ్చినది. అంతేకాక నేనునుబురుషుడనే యగుటచేత నాతరుణి చెంతకుఁబోయిన నాస్వాంతము కలఁగి యేమి చేటు మూడునోయని భీతికలుగుచున్నది.

సుధే—ప్రాణేశా! ఎంతమాత్రమును మీరా సైరంధ్రి దృష్టిపథమునఁ బడగూడదు. మీరు చెప్పుమన్నమాట లీవఱకే నేను సైరంధ్రితోఁ జెప్పి శీఘ్రముగా మారాష్ట్రమును మమ్మును విడిచి మహోపకారము చేయుమని నాఁడే వేడుకొన్నాను.

విరా—సైరంధ్రి యందు కొప్పుకొన్నదా?

సుధే—ఇఁకపదుమూడుదినములుమాత్ర మెట్లయిన నేనుమీ యింటనుంటకోర్చుకొమ్ము. అట్లుంటకీకొంటివా కృతజ్ఞులయిననాపతు

లప్పుడు మీకుఁ గనఁబడి తగిన మేలుచేసి నన్నుఁ గొనిపోదురు. అందాఁక నింట నాయునికి కీకొనవలయు నని యామె నన్ను బహు విధములఁ బ్రార్థించినది.

విరా—నీ వామెప్రార్థన మంగీకరించితి వనుకొనెదను.

సుధే—అందుల కొప్పుకొని యీలోపల నేయుపాయమును గలుగకుండ నాపుత్రులను వల్లభుని రక్షించుకొమ్మని మి మ్మామె కొప్పగించినాను.

విరా—అట్లయిన గడుపుదాటునంతకు సహించియుండుము. నేఁడే కదా తుదిదినము?

సుధే—ఒక్కదినమయినను నే నెట్లు సహింపఁగలుగుదును? నాతమ్ములపాలిటి యపమృత్యుదేవతయైన యామాలిని నాకంటఁబడి నప్పుడెల్లను చచ్చినవాఁడు స్మరణకువచ్చి దుఃఖము సముద్ర తరంగములవలె పొరలిపొరలి వచ్చుచుండఁగా, సైరంధ్రి సదా చెంత నుండి పనిచేయుచు నాకన్నులయెదుర మెలఁగఁగా నెట్లు చూచి సహింపగలుగుదును ? ఓసహోదరులారా ! నాకన్నులు మండించు మంటలవలె మీభార్యలగతికలయి ప్రతిదినమును నానేత్రముల యెదుర నేలకుఁ గంటికి నేకధారగా నేడ్చుచుండ నే నెట్లు చూఁడ గలుగుదును? (అని పెద్దపెట్టున నేడ్చుచున్నది.)

విరా—ఇఁక నేనీమెకు దుఃఖశాంతి చేయలేను. కంకుభట్టు వచ్చినయెడల, పురాణగాథలనుజెప్పి శోకోపశమనము చేయఁగలు గును. ఆతఁడు నేఁటి శ్రాద్ధకర్మలందు యోగ్యులయినబ్రాహ్మణుల నియోగించి వచ్చెద నని పోయి యింకను రాలేదు.

దౌవా—దేవా! కంకుభట్టుగారు వచ్చుచున్నారు.

విరా—ఆయనను శీఘ్రముగాఁ గొనిరమ్ము.

[కంకుభట్టు ప్రవేశించుచున్నాఁడు.]

విరా—(లేచి చేతులు జోడించి) స్వామీ! భట్టారకా! నమస్కారము.

కంకు—విజయోస్తు! దేవరసింహాసనమును స్వీకరింపుఁడు.

విరా—మీ రీపీఠమున నధివసింపుఁడు. (ఇద్దఱును గూర్చున్న తరువాత) స్వామీ! మీరుపురోహితానుమతంబున బ్రాహ్మణులసమర్థుల నాయాకర్మలకు నియోగించి వచ్చినారా?

కంకు—సర్వమును సంసిద్ధము చేయించినాను. గోదానములకు పలఁయుగోవులు మాత్రి మింకను రాలేదు.

విరా—దానార్థమయి సవత్సకగోసహస్రము నేఁటి తెమ్మని పంపిన ధనగుప్తుఁ డింకను రాలేదు. ఆతఁ డేపని చెప్పినను యుక్తకాలములో నిర్వహించుకొనిరాక యిట్లెప్పుడును మసలినవాఁడు కాఁడు. ప్రభాతమునకు ముందే వచ్చెద నని పోయినవాఁడు జాము ప్రొద్దెక్కవచ్చినను రాజపోవుటచూడఁగా గిట్టనివారివలన నాతని కేమో విపత్తువచ్చియుండు నని నాచిత్తము తత్తరిల్లు చున్నది.

కంకు—మీరు చింతిల్లవలసినపనిలేదు. అతఁ డెట్టివిఘ్నములనైనఁ దప్పించుకొని యింతకు వచ్చుచుండును.

దౌవా—దేవా! ధనగుప్తుఁడు రోఁజుచు పరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు.

విరా—వెంటనే లోపలికి రమ్మనుము.

[రోఁజుచు ధనగుప్తుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

ధన—(రోఁజుచు) దేవా! నమస్కారము. నా దేహము—దేహము-కంప మెత్తుచున్నది; నానోట-మాట-మాట రాకున్నది. (అని గడియకొకమాటగాఁ జెప్పుచున్నాఁడు.)

విరా—పడకపోకు; తొందరపడక. శాంతించుకొని నీకేమి యుపద్రవము వచ్చినదో చెప్పు. నీ వెక్కడనుండి వచ్చుచున్నావు?

ధన—యమ—యమ—యమసన్నిధానము నుండి.

సుధే—అయ్యో ! ధనగుప్తున కెంతగతిపట్టినది! నామన స్సిప్పుడు దుఃఖసముద్రములో మునిగియుండియు తనదుఃఖమును మఱచి పరుని యాపదకై పరితపించుచున్నది.

విరా—ధనగుప్తా! నీవు వెఱ్ఱిచూపులు చూచుచున్నావు. నీకు మతిభ్రమణముకలిగినదా? నీ వెక్కడనుండి పరుగెత్తుకొనివచ్చినావు?

ధన—మృత్యుముఖమునుండితప్పించుకొని పరుగెత్తివచ్చినాను.

విరా—నీకు చిత్తచాంచల్యముకలిగినదా? దేహము తెలిసియే యున్నదా? గోవులను తోలించుకొని వచ్చినావా లేదా చెప్పు.

ధన—గోవులనా? గోవులనా? ఇంకను మనకెక్కడి గోవులు? మనగోవులను గోవులను—నేను చెప్పలేను. (అని నిట్టూర్పు విడుచు చున్నాఁడు.)

విరా—అయ్యో! పాపము! వీని కాకస్మికముగా చిత్తభ్రమ కలిగినదిగదా? వైద్యులను బిలిపించి వీనికి చికిత్స చేయింపుఁడు. ఓధనగుప్తా! గోవులను దీసికొనిరాలేదా? కొంచెము శాంతించుకొని చెప్పు.

ధన—నాకు మతిభ్రాంతి లేదు. నా దేహము పూర్ణముగా తెలిసియేయున్నది. అప్రియమని చెప్పఁజాలకున్నాను. మనసింహ బలుఁడు చచ్చియు నదృష్టహీనుఁడే యయినాఁడు. అతఁడు గోదాన పుణ్యమునకు నోచుకోలేదు.

విరా—(ఉలికిపడి) అప్రియ మేమి? నే నుండఁగా వానికి గోదానము లేల లేకపోవును?

ధన—మనగోవులనుబట్టుటకయి సేనలతో సుశర్మవచ్చినాడు.

విరా—(ఆశ్చర్యముతో) ఏసుశర్మ? ఎక్కడకు వచ్చినాఁడు?

ధన—ఏసుశర్మా అసుశర్మే. మనశత్రువైన సుశర్మ. ఊరి బయలికి వచ్చినాఁడు.

విరా—(విస్మయముతో) ఆత్రిగర్తరాజు కాఁడుగదా?

ధన—ఔ నతఁడే. అతఁడు దుర్యోధనుని ప్రేరణముచేత మనగోవులను బట్టుటకయి దక్షిణదిక్కునకు వచ్చినాఁడు.

విరా—ఓసభికులారా! వింటిరాయీవైపరీత్యంబు? ఏమేమీ?

మ. ధనగుప్తా! మనగోగణంబులఁ దిగ్రర్తల్ పట్టఁగా వచ్చిరే?
మును దానొందిన భంగపాటలసుశర్మం డప్పుడే విస్మృతిం
గనెనే? క్రమ్మఱ నేమొగంబునను సంగ్రామార్థియై వచ్చె? న
మ్మైనల న్నాదు ప్రతాపవహ్ని కొకటం బూర్ణాహుతింజేసెదన్.

క. శలభం బియ్యెడఁ గాలా
నలముపయిఁ గంతువేయ నడతెంచె; నిదే
పొలిసె సుశర్మ; మదిష్టము
ఫలియించెను; నేఁడు కాదె పండువు నాకున్?

(అని తనలో నేమో యాలోచించుచు క్రిందుచూచుచున్నాఁడు.)

కంక—(తనలో) సుయోధనుఁడు మే మిందున్నజాడ కని పెట్టినాఁడేమో! (ప్రకాశముగా) ధనగుప్తా! గోవులఁ బట్టుటకయి సుశర్మ దుర్యోధనుని ప్రేరణముచేత వచ్చినాఁడా? ఆకారవాధముఁ డెంతదుర్మార్గుఁడు!

ధన—భటుల సంభాషణమువలననేనీసంగతి గ్రహించినాను. న న్నాసుశర్మ పాండవులవృత్తాంతముకూడ నడిగినాఁడు.

కంక—(తనలో) ఈతఁడు మనవృత్తాంత మేమయిననెఱిఁగి చెప్పినాఁడేమో! (ప్రకాశముగా) ఓధనగుప్తా నీవేమి చెప్పినావు?

ధన—చెప్పుట కేమున్నది? నే నేమియు నెఱుఁగ నని చెప్పినాను. న న్నాపశువు మనపశువులజాడకూడ గ్రుచ్చి గ్రుచ్చి యడిగినాఁడు.

కంకు—(తనలో) ఇఁక నే నూఱట చెందవచ్చును. ఈవార్త రాజుగారికిఁ గావలసినది. రాజుగారు తమలోఁ దా మేమో యాలోచించుకొనుచు వినకున్నారు. (ప్రకాశముగా) దేవా! ధనగుప్తుఁ డేదో మనవి చేయుచున్నాఁడు.

విరా—అతఁ డేమనుచున్నాఁడు?

కంకు—ఆసుశర్మ మన పశువులజాడ తన్నడిగినాఁ డనుచున్నాఁడు.

విరా—(ధనగుప్తునివంకఁ దిరిగి) ఓధనగుప్తా! ఎదేదీ? ఆమాట యింకొకసారి చెప్పు. ఆనరపశువు మనపశువులజాడకూడ నిన్నే యడిగినాఁడుగా! ఏమి యాతని పోతరము! ఆక్రూరుని నీ వెట్లు తారసించితివి?

ధన—నేఁటి దానార్థమై నేను గోవుల నేర్పఁబోవుచుండఁగా దారిలో యమభటులవంటి వానిభటు లెదురుపడి నన్నుఁ బట్టి కొట్టి తమ ప్రభువుసన్నిధికిఁ గొనిపోయిరి.

గీ. కటకటా! నేను మిమువంటి ఘనబలాఢ్యు
పాదభక్తుఁడ నయ్యు నాతులువచేతఁ
గానిమాటలుపడి కొల్వులోన కొట్టఁ
బడితి· విధిభ్రాంత తప్పింప వశమె యెందు?

విరా—ఇట్లవమానితుఁడనైతి నని నొచ్చుకోకు. నాప్రియ భృత్యుని బరిభవపఱిచిన పాపఫలము వాఁడిప్పుడ యనుభవింపగలడు. ఆతులువ మ మ్మేమైన నన్నాఁడా?

ధన—ఆదుష్టుఁడు నోరికి మాఱు లేదుగనుక దేవరవిషయమయి కావలసి నన్ని కాఱు లఱచినాఁడు. ఆప్రలాపములు నిండీనసభలో

నుచ్చరింపఁ బోలవు. ఆకుక్క చాటున మొఱిఁగినమాత్రమున దేవర ప్రతాపము కొఱవడునా?

నిరా—ఆహా! ఎంతపనిపుట్టెను! వాఁ డేమి తలఁచుకొని యింత నిర్భయముగా వచ్చియుండును?

ధన—మఱియేమి యున్నది? ఆత్మవినాశము తలఁచుకొనివచ్చినాఁడు. కాలనియోగము మీఱ నెవరితర మగును?

విరా—(తలయూఁచి) ఔరా! ఇంతకాలమున కెంతవింత వినఁబడెను! నాప్రియభృత్యుని భంగపఱిచినవాఁ డింకను ప్రాణములతో నున్నాఁడు. ధనగుప్తా! యమకింకరులవంటి యాకిరాతుల చేతులలోనుండి నీ వెట్లు తప్పించుకోఁగలిగితివి?

ధన—మరల దేవరవారిపాదసందర్శనము చేయవలసినభాగ్యమున్నది కాఁబట్టి దైవికముగా మృత్యుముఖమునుండి వెడలివచ్చినాను. ఆసుశర్మ తనమంత్రులతోఁ గార్యాలోచనము చేయఁదలచి నన్నుదూరముగాఁ గొనిపోయి నిలువుండని భటుల కాజ్ఞాపించెను. నన్నుఁ గొనిపోయి యొక తాళవృక్షమునకుఁ గట్టి, ఆదారిని సురాభాండముఁ గొనిపోవుచున్న శౌండినిని గొట్టి బలవంతముగా దాని పంటిలోని కల్లు త్రావి, మత్తెక్కి చెట్టుకిందఁజేరి జూద మాడఁ దొడఁగిరి.

విరా—వారుతమనాయకునికిఁ దగినభటులు. తరువాత.

ధన—ఆసందడిలో నేను మెల్లఁగా నాబంధములను పండ్లతోఁ గొఱికి త్రెంచుకొని పురివంక మరలి నాపిక్కబలము చూప నారంభించితిని. అది చూచి నలుగురు భటులు నావెంటఁ బడినన్నుఁ దఱుముకొనివచ్చిరికాని వారు నాపరుగు పట్టఁజాలక కొంతదూరము వచ్చి వెనుకకు మరలవలసిన వారైరి. ఇప్పు డాదుష్టుల పశుగ్రహణ వృత్తాంతమును దేవరకు నివేదింపఁ గలిగి కృతార్థుఁడనయి గాడఁచు.

విరా—ఓదౌవారికా! ఇప్పుడ తమతమసేనలతోడ యుద్ధసన్నద్ధులయి యుండుఁడని మనదండనాథులకు జెప్పి పంపుము. మే మిదే విపక్షశిక్షాదీక్షఁబూని దండయాత్ర వెడలఁబోవుచున్నాము.

దౌవా—మహాప్రసాదము. (అని నిష్క్రమించి మరల ప్రవేశించి) దేవా! సేనానియగు వీరసేనుఁడు మహావేగముగా గోపాలురను వెంటగొని దేవరను సందర్శింప వచ్చుచున్నాఁడు.

విరా—ఏఁడీ? ఏఁడీ? ఇటు రమ్మను.

వీర—(ప్రవేశించి) స్వామీ! నమస్కారము.

విరా—సేనానీ! సింహబలుఁడు పోఁగానే శత్రువులవలన మనవీటి కెంతవైపరీత్యము పుట్టినదో విన్నావా?

వీర—దేవా! వినుటయేకాదు కన్నార కనియే వచ్చినాను. ఇఁక మాటల కెడము లేదు.

ఉ. ఆవల గర్భశత్రుఁ డగు నల్లసుశర్ముఁ డపాకమైన సై
న్యావళితోడ వచ్చి యతులాతిమదాంధత దక్షిణంబునన్
గోవులఁ బట్టె; నడ్డుపడు గోపుల వీరిని గొట్టెఁ దూపులన్;
భూవర! యాలఁ దోలుకొనిపోయెడుఁ బచ్చెపుదొంగయో యనన్.

ఆగోవులదొంగ నిప్పుడ వెంబడించి వేఁడిచూపినంగాని మన గోవులు మనకు దక్కవు.

క. పాపిష్ఠుఁ డడ్డు చొచ్చిన
గోపాలుర వీరి నెటు కుపికుండె వాల్
తూపులపా లొనరించెనో
యీపట్టునఁ జిత్తగింపుఁ డెల్లరతనువుల్.

నేను మనసేనల నన్నిటిని సన్నద్ధము లయి యుండ నియమించి వైరి సంహారమున కయి యేలినవారియనుజ్ఞ పొంద వచ్చినాను.

విరా--(గోపకులవంకఁ జూచి)

ఉ. గోపకులార! చింతపడకుం డణుమాత్రము మీరె దీనికిన్;
దూపు లవెన్ని మీయొడల దూఱెనొ వానికి నూఱురెట్లుగాఁ
దూపులు వాని దేహమునఁ దూర్చెదఁ, గార్చెద నెత్రు టేరులన్,
బాపెద మీపరాభవము; పంపెద నంతకు చెంతకుఁ రిపుఁ.

వీరసేనా! మనసైన్య ముత్సాహ వంత మయియున్నదా?

వీర--ఉత్సాహమో గిత్సాహమో నేను జెప్పలేను.

ఉ. డాసె సుశర్మ యంచు వినుటన్ మనసైనికు లెల్ల సంగరో
ల్లాసము మోములందు బొదలన్ రిపు నెప్పుడు రూపడంతుమా
గాసిలకంచు మించుతమకంబునఁ బెండ్లికిఁ బోవుకైవడిఁ
భాసిలుచున్న వారు గెలువం బయనం బయి నవ్వుమోములన్.

పగవారి నెప్పుడు పరాభవింతుమా యనుచింతయే కాని మనవీరభటులలో నొక్కనికిని ప్రాణములమీఁది చింతలేదు.

కంక--(తనలో) విక్రమక్రీడకు నాకు నుత్సాహము కలుగుచున్నది. ఏదో యుపాయముపన్ని నేనును వీరివెంటఁ బోవఁ బ్రయత్నించెదను.

విరా--డావారికా! సూతుని నారథము సాయుధముగా నాయితముచేసి తెమ్మనుము. ఇదిగో నేను విక్రమవిహారమునకు లేచుచున్నాను. (అని లేచుచున్నాడు.)

వీర--ఇంతమాత్రపుపనికి దేవరవారు శ్రమపడవలెనా? మీ భటుని నన్నుఁ బంపుడు. క్షణకాలమున సుశర్మను బట్టితెచ్చి మీపాదములకుఁ గానుకచేసెదను. శత్రుశిరఃఖండనమున కయి నాచేతులు త్వరపడు చున్నవి.

విరా--నాతోఁ బ్రతిఘటించి వీరాధివీరుఁడనని గర్వాలాపములుపలుకుచున్న యీప్రతివీరుని నేనుండగాఁబరు లెవ్వరునుసంహరింప

గూడదు. ఈసేనలను నేనే నడిపెదను. ఓవీరసేనా! మనశతానీకాన్యను జన్నులను శంఖాదిశుమారులను నావీరవిహారమును జూచుట కయి రథారూఢు లయి నావెంట రా నియమింపుము. పురసంరక్షణార్థ మయి యుత్తరుఁ డింట నుండును.

వీర—నే నీవఱకే వారల క్షత్రియర్తలవార్త చెప్పించితిని. వారీవార్త చెవి సోఁకినతరువాత వీరవిహారమునకు బయలుదేఱక క్షణకాల మయిన నింట నిలువఁజాలరు.

సుధే—ప్రాణేశ్వరా! నన్నుఁగూడా యుద్ధభూమికి మీవెంటఁ గొనిపోండు. మిమ్ము విడిచి నే నింట నొంటిగా నుండలేను. ఒక వేళ బలవంతముగా నా దేహము నిం చుంచఁగలిగినను ప్రాణము లెట్లును మీవెంట రాకమానవు. సోదరమరణదుఃఖమే నన్ను సంతాపింపఁ జేయుచుండఁగా, మీదుస్సహవిరహతాపముకూడ దానికిఁ దోడు పడిన నేను దాళఁగలుగుదునా?

కంకు—(తనలో) ఇదిగో సమయము తటస్థించినది. నే నీమెను బ్రోత్సాహపఱచి యీమెతోఁ బ్రయాణ మయ్యెదను. (ప్రకాశముగా) అమ్మా! సోదరమరణ వ్యథాతుర వయియున్న నీ కిప్పుడు పతివిరహము నిశ్చయముగా దుర్భరమే యగును.

నిరా—ఓహృదయేశ్వరీ! నామాట వినుము. వీరులకుసహితము దుర్నిరీక్షమయి యుండెడు రణరంగమునకు సహజభీరువు లైన స్త్రీలు రాఁదగినవారు కారు. అంతేకాక మనప్రతివీరులును గ్రూరాక్రేసరు లని పేరు పడినవారుగదా?

సుధే—ఆవల దేని కయినను సహింతునుదాని యిం దుండి ప్రాణములు నిలుపఁజాలను.

కంకు—ఓమహారాజా! ఈమెప్రార్థన నంగీకరింపుఁడు. క్షత్రియ స్త్రీలుభీరురాండ్రుకారు. పూర్వము కేకయరాజపుత్రిభర్తయైనదశరథు

నకు సంగరరంగమునందుఁ దోడుపడలేదా? మొన్నసుభద్ర యాదవుల తోడఁ బోరాడిన విజయునకు సారథ్యము చేయలేదా? ధైర్య గరిమచేత దేవియు వారికిఁ దీసిపోవునదికాదు. నా కొక్క వలలుని తో డిచ్చిన పక్షమున సురక్షితస్థలమున నిలిపి మే మిద్దఱము నీమెను గంటికి రెప్పవలెఁ గాచియుండెదము. ఆతఁడు కావలికాచుచుండును; నేను ధర్మతత్త్వములుచెప్పి దుఃఖశాంతి చేయుచుండెద.

విరా—మంచిది. ఆలాగే కానిమ్ము. పెద్దలయాజ్ఞ మీఱరాదు గనుక దేవిరాక కంగీకరించినారము. ఈమె రక్షణభారము మీది. మీకిం కెవ్వరు తోడుకావలెను?

కంక—పాండవులవద్ద నున్నప్పుడు తంత్రీపాలదామగ్రంథుల పౌరుషములు కొంత యెఱిఁగియున్నాను. వారుగూడ వార్తాహరణాదులకై నాకుసహాయులు కానిండు.

విరా—వీరసేనా! దేవికిని వీరికి నలువురకును సర్వారథములను బన్నింపఁబంపుము. నడుమనడుమ నీవును వీరిక్షేమము విచారించుచుండుము.

వీర—దేవరయాజ్ఞాప్రకారము చేసెదను.

విరా—వామనశర్మా! దేవికూడ మాతోడనే వచ్చును. సింహ బలాడులయుత్తరక్రియల కయి యీదినమున జరపవలసిన దంతయు ధనగుప్తుని సాహాయ్యమున నడుపుడు. మీకన్నిటికిని నామాఱుగానుత్తరుఁ డున్నాఁడు. మేము పోయివత్తుమా?

వామ—నిమిత్తము లనుకూలములుగా నున్నవి. శీఘ్రముగా విజయంచేయుఁడు. మీకు విజయ మగుగాఁక!

కంక—ఇది యాశీర్వాదముకాక వరమే యగును.

దౌవా—దేవా! శతానీకాదులు రథారూఢులయి చతురంగ సేనాసమేతముగా వచ్చి వాకిట నిలిచి దేవరకు విన్నపము చేయు

చున్నారు. ఏలినవారిసారథియు నాయుధ సహితముగా నుత్తమాశ్వ ములను బూన్చినరథమును దెచ్చి వీథిలో నిలిపియున్నాఁడు.

విరా—ఇదిగో మేమును వచ్చుచున్నాము. ధనగుప్తా! నీ వుత్తరకుమారుని యొద్దకుఁ బోయి పురరక్షణ మేమఱకుండు మని నాపలుకులుగాఁ జెప్పుము.

[అందఱు నిష్క్రమించుచున్నారు.]

తృతీయాంకము

[ఆసీనురాం ద్రయియున్న సుధేష్ణాదు లగునంతఃపుర స్త్రీజనమును పరివేష్టించి కంకుభట్టు దామగ్రంథి తంత్రీపాలాదులు ప్రవేశించుచున్నారు.]

కంకు—తంత్రీపాలా! వలలుని బలమును నమ్మి నామాట యందలి విశ్వాసముచే శ్రీమహారాజుగారు తమయంతఃపురాంగనా రక్షణభారమంతయు మనమీఁదఁబెట్టి కొలఁది సైన్యమునుమాత్రము మనకు తోడిచ్చి ప్రధానసేనాసమేతు లయి నిర్విచారముగా గోగణమును మరలింప దండయాత్ర వెడలియున్నారుగదా.

తంత్రీ—సమర్థులపైని గార్యభారము నుంచినప్పుడునిర్విచార ముగా నుండుట నైసర్గికమే.

కంకు—రిపుసేనలవెంట ధృతరాష్ట్రుఁడిందునచ్చెననియెవ్వరో చెప్పినంతమాత్రమున వలలుఁడు స్వకృత్యమును విడిచి నేను వల దనుచుండఁగానిదెవచ్చెదననితద్దర్శనకుతూహలచాపలమునఁ బరుగెత్తి యింకనురాలేదు. అంధరాజెక్కడ? శత్రుసేనలవెంటవచ్చు టెక్కడ?

దామ—అట్లనఁగూడదు. పాండవులిందుదాఁగియుండిరేమో యన్న శంకచేత నొకవేళ ధృతరాష్ట్రుని యాలోచనమీఁద వారి నన్వేషింపవలె నన్నతలంపుతో గోగ్రహణమిష పెట్టి దుర్యోధనుఁడే యీసుశర్మ నిందుఁ బంచియుండవచ్చును.

కంకు—వాని కట్టిదురూహ పుట్టుట వింతగాదు.

దామ—అట్లయ్యేనేని, మాయోపాయధురంధరుఁడైనయంధ నరపాలుని ముందుగా నీసేనవెంట నంపి సుయోధనుఁడుసహితము యోధవీరులతో తేపురావచ్చును.

తంత్రీ—వలలుఁడు సత్య మారసి రానిమ్ము. అతఁడు వచ్చు లోపలనె శత్రుభటు లొకద్రోహమునకుఁ జొచ్చినచో వైరులఁ బాఱఁద్రోలి యీశుద్ధాంతజనమును మనము రక్షింపఁజాలమా?

సుధే—అయ్యో! అధర్మపరులైన పరులమూలమునమహాను భావులైన పాండవులెక్కడ నజ్ఞాతవాసము చేయుచు నిడుములఁ బడు చున్నారోకదా! ఓహృదయమా! ఏమి నీసామర్థ్యము! ఇంతలోనే భ్రాతృమరణశోకమును మఱపించి నే నేమో కష్టములెఱుఁగనిదాని నయినట్లు పరులకష్టములనుగూర్చి నన్నుఁ బరితాప పడునట్లు చేయు చున్నావు!

కంకు—స్వకష్టములను దలఁపక పరులకష్టములకుఁ బరిత పించుట మంచివారికి స్వభావము. సజ్జనహృదయములు వెన్నకంటెను మృదుతరములు.

క. తాపాధిక్యము తనకుం
బ్రాపించినయపుడె వెన్న రయమునఁ గరఁగున్
దాపలవం బన్యులకున్
బ్రాపించినఁ గరఁగు సజ్జనస్వాంతంబుల్.

సుధే—అదియేమో నాహృదయము భయసదన మగు చున్నది. దూరమున నేదో శ్రవణవిదారణ నారణధ్వనులు వినఁబడు చున్నవి.

కంకు—అమ్మా! ఆ భీమధ్వనులకు భయపడఁ బోకు. అవి మన భటుల సింహనాదములును గజబృంహితములును హయహేష లును రథఘోషలునుగాని వేఱొండు కావు. మే మిందఱము సన్ని ధానమునఁ గాచియుండఁగా వెఱపేల?

సుధే—మీయట్టివారి ప్రాపుండఁగా వెఱవవలసిన పనిలేదు. అదెగదను కేలఁదాలిచి భీమునివలె వలలుఁడు వచ్చుచున్నాఁడు. నా గుండె కుదుటఁ బడినది.

కంకు—(తనలో) ఈమె వలలుని భీముఁగా నెఱిఁగి యుం డదుగదా?

[గదాహస్తుఁడయి వలలుఁడు ప్రవేశించుచున్నాఁడు]

సుధే—ఓయీ! వలలా! నీవు పోయినకార్యము పండయి నదా? కాయయయినదా?

కంకు—మనోరథసిద్ధి యైనదా?

వల—దేవీ! నమస్కారము. కంకుభట్టారకా! వందనము. నేనుబడిన ప్రయాసము పిపాసచేనెండ మావివెంటఁ దగిలినట్టయినది.

కంకు—అంధరాజు కనఁబడలేదా?

వల—అంధరాజు కనఁబడెను. కాని యతఁడు మన మను కొన్న యంధరాజు కాఁడు.

కంకు—మఱియెవఁడు?

వల—సంగ్రామవీక్షాపేక్షచే వచ్చుచున్నయొకవృద్ధాంధరాజు.

కంకు—అంధుఁ డయినచో నిఁక యుద్ధమును జక్కఁగానే వీక్షింపఁగలఁడు.

వల—అతఁడు కేవలాంధుఁడే కాక బధిరుఁడు సహితమైనను, సంగరదర్శనమునకును సమరవార్తావిశేషాకర్ణనమునకును దగిన సాధన సంపత్తి లేనివాఁడు కాఁడు.

కంకు—అట్టి యద్భుతసాధన మేది?

వల—దక్షిణభుజాదండము లేకయు జనకుని కవలంబదండముగానున్న పుత్రరత్నము.

కంకు—అట్లయినచో నతఁడు తండ్రికిఁ దగిన తనయుఁడే.

వల—ఆయంగహీనతలు వారికిస్వదోషమువలనవైనవి కావు. స్వరాష్ట్ర రక్షణార్థముగా మున్నొకసారి వారొనర్చిన సంగర రంగమునందే వారి కీయంగ వైకల్యములు సంప్రాప్తములయినవట!

కంకు—వారి రతి సుకృతులు

వల—మేలు మఱవక మహారాజుగారు తాము పారితోషికముగా నొసంగెడి యుపకార వేతనము నంగీకరింపవలసినదని యెంత ప్రార్థించినను వినక వినయవచనములతో నిరాకరించి స్వతంత్రజీవనము చేయవలెనన్న యుదారబుద్ధితో వారిప్పుడు కృషివృత్తి నవలంబించి చెమటయూడ్చి స్వకాయమువలన జీవించుచున్నారఁట! గ్రుచ్చి గ్రుచ్చి నేనడిగినమీఁదట వారిష్టములేకయే యీవృత్తాంతమును నాతోఁ జెప్పవలసినవారైరి.

కంకు—వారు మన కత్యంత గౌరవార్హులు.

గీ. పృథివిలోపలఁ బరతంత్రవృత్తితోడఁ
బడయునట్టి మహేంద్రవైభవముకంటె
నుత్తములు దాము స్వచ్ఛందవృత్తితోడి
కొలఁది విభవంబె గొప్పగాఁ దలఁతు రెపుడు.

పరభాగ్యోపజీవులు కానొల్లని యాయోగ్యపురుషులపేరు లేవో యెఱుఁగుదువా?

వల—వారిలో వృద్ధునిపేరు పురుషోత్తవర్మయఁట! కుమారుని నామము వజ్రబాహువఁట!-అదె వారు వచ్చుచున్నారు. క్షణకాల మూర కుండుఁడు.

సుధే—వృద్ధుని భుజములమీఁద నెక్కించుకొని కుమారు డెల్లు మిట్ట నెక్కుచున్నాఁడో! వారును మన మున్నయెడకే వత్తురా?

వల—రారు. వారు మనముందున్న యీమెట్ట నెక్కియక్కడ నుండి యుద్ధమును జూతురు. పల్లములోనున్న మనకు వారాడుకొను మాటలు వినఁ బడునుగాని వారికి మనము కంటబడము.

తంత్రీ—వారివలెనే మనమును మిట్టనెక్కి ప్రత్యక్షముగా సంగ్రామము నేల సందర్శింపరాదు?

కంకు—మన మట్లు చేయరాదు. ఉన్నతప్రదేశ మధిరోహించి యుంటచే మనమొక్కింత పగవారికంటఁ బడితిరూ, మనకపాయము సంభవించును.

వల—వీరియాజ్ఞ మన కవిలంఘనీయము. ఈ యుభయుల మూలముననే మనము సకలమునునిరపాయముగా నెఱుఁగవచ్చును. వృద్ధుఁ డంధుఁ డగుటచేతఁ దానుజూచిన దెల్లను గుమారు డాతనికి దెలుపుచుండును. బధిరుఁడగు తండ్రికిఁ దెలుపునప్పుడు కొడుకు బిగ్గరగా జెప్పక తీఱనంచున నందనుఁడు పలుకు ప్రతివాక్యమును మనకు వినఁ బడుచునేయుండును.

దామ—కన్నదానికిని విన్నదానికిని భేద ముండదా?

కంకు—మొట్టమొదటఁగొంతసేపు మనము శ్రవణానందముగా వినుటతో దృప్తి వహించినయెడల, తరువాత నేతోత్సవాపాదకమగు నమదర్శనమే కాక మహోత్సాహముతో నాహవముననే భాగస్థుల మగుభాగ్యముసహితము మనకు లభించునేమో! కొంచెము తాళిమి వహింపుము. అదిగో వారు గుట్ట నారోహించినారు.

[కుమారుఁడు తండ్రిని మూఁపుమీఁద వహించుకొని వచ్చి దింపఁగా నిరువురును ప్రవేశించుచున్నారు]

వల—ఆలమనఁ బాలికాఁపుల మగుభాగ్యము లభించినప్పుడు గదా నాకుఁ బండువు! వారు చెట్టుమొదటఁ జేరినారు. ఏ మను కొందురో విందము.

పురు—కుమారా! పూర్వయుద్ధమున సుశర్మని భటుఁడు నాకన్నులలోఁ దూపుటనాటి యిట్టిపాపమును గట్టుకొన కుండిన పక్షమున, ఈయుత్సాహవంతము లైన ముసలిచేతులతోనే కొంత వఱకు నేనును శత్రుసంహారముచేసి ప్రభువువారి మున్నన ఋణమును దీర్చుకోఁగలుగుదునుగదా!

వజ్ర—హా! తండ్రీ! వద్ధుఁడవైన నీకే యింతపౌరుష మున్న ప్పుడు నీకడుపునఁ బుట్టిన యుత్తమక్షత్రియకుమారునకు నా కెంత క్షాత్ర ముండవలెను? నా కుడిభుజమే పోకుండినయెడల నే నిప్పుడు పిడుగుతునకవలె నరాతిబలములపైనిబడి నాప్రియజనకుని నేత్రావ రోధమునకుఁ గారణమైన విరోధితల నైన నటికి యాపాపపుశిరస్సును మీపవిత్రపాదముల కుపాయనము చేసి పితృఋణవిమోచనమును జేసికొనా?

పురు—తిన్నఁగా వినఁబడని నాచెవులకు సహిత మేదోమహా శబ్దము వినవచ్చుచున్నది పయినుండి పిడుగు పడుచుండలేదుగదా? అర్జునః ఫల్గునః పార్థ—(అని తొలగఁ జూచుచున్నాడు.)

వజ్ర—జనకా! జడియుబోకు. అది పిడుగుచప్పుడుగాదు.

క. ఇందలి వసుంధరాధర
కందరములు మాఱుమ్రోయఁ గర్ణము లవియన్
గ్రందగుశబ్దం బిది రణ
దుందుభినాదమ్ము సుమ్ము తూలకు తండ్రీ!

వల—ఈసంగర భేరీభాంకరణముచే నాయంగము పొంగు చున్నది. ఏదీగద? (అని లేవఁబోవుచున్నాఁడు.)

కంకు—సలలా! తాళుతాళు ఇది సమయము కాదు. నీ వేమి రణరంగభీముఁడవనుకొనుచున్నావా?నీ వెవ్వఁడవో స్మరణకుఁదెచ్చుకో.

వల—(తన్నుఁ జూచుకొని) నేను విరాటుని వంటలవాఁడనా? వీరావేశమున నన్ను నేను మఱచితిని మన్నింపుఁడు. (అని మరలఁ గూరుచున్నాఁడు.)

పురు—ఓహో! తెలిసినది. యుద్ధ మారంభము కాఁబోవు చున్నది కాఁబోలును! నామీఁద నేదో ధూళిలాగునఁ బడుచున్నది. ఇది యీవృక్షమునుండి పడుచున్న పుష్పరజమా? గమన వేగమున నుత్థాపితమైన బలపాదపరాగమా?

వజ్ర—ఇది యుద్ధయాత్రచేయుచున్న మనసైనికనికరముల చరణ హతులచే లేచినదుమారము, అదిగో మనసేన శత్రుసేన మీఁది కెంత వేగముగా నడుచు చున్నదో!

ఉ. తమ్మపు డప్పు మింటి జలదమ్ములు వృష్టి నడంచు చుండుటన్
బమ్మిన పూర్వవైరమును బాపికొనన్ ఘనరోషమూర్తులై
దొమ్మి యొనర్పఁ బోవుగతిఁ దోయదవీథికి శోణధూళి మే
ఘమ్ములు మిన్నుమన్నొకటఁ గ్రమ్ముచు లేచెఁజమూపదాహతిన్.

పురు—యుద్ధ మన్నపేరు విన్న నామేను పొంగు చున్నది. నేను వ్యర్థుఁడనై దూరమున నిలువఁజాలను. నన్ను రణరంగముకుఁ గొనిపోయి విడువుము. ఖడ్గపాణినయి పోరాడి జయము నొంది స్వామికార్య నిర్వాహకుఁడనయి చిరకీర్తినైనను గందును. విమతులఁ గొందఱనైన హతులను జేసి స్వామ్యర్థపరిత్యక్త దేహుఁడనై లయము నొంది వీరస్వర్గమునైనను జూఱగొందును. ఏదీ ఖడ్గము? ఎక్కడ నున్నది? (అని తడవుచున్నాఁడు.)

వల—(లేచుచు) ఈవృద్ధునకు నేనును దోడుపడుదునా?

కంక—వలలా! కూరుచుండుము. నిమిషనిమిషమునకును నిన్ను నీవు మఱచుచున్నావు. త్వరపడఁబోకు. మహారాజుగారు నిన్నీ దేవికి సంరక్షణార్థముగా నియోగించి పోవుట విస్మరించితివా?

వల—అవునౌను. రాజాజ్ఞ మీఱి నే నీస్థలమును విడువఁగూడదు. (అని కూర్చున్నాఁడు.)

వజ్ర—నాయనా! వృక్షమూలమున నట్లు తడవెద వేమి? ఊఁతకోలనేకాని నీవిచటికిఁ గరవాలమును దేలేదు. యుద్ధవార్తనువిని మనమింటికిఁ బోక పొలములుండియే యిచ్చటికి వచ్చినాము కామా?

పురు—అక్కటా! పాపపుదైవము సమయమునకు నాచేత ఖడ్గము సైతము లేకుండఁ జేసెనుగా! నీవిక్కడనుండి చూచి సంగ్రామ క్రమమునైనను నాచెవుల వేయుచుండుము. కన్నులతోఁ జూడలేక పోయినను మహారాజుగారి యవక్రవిక్రమమును తద్భటుల యద్భటపరాక్రమమును వీనులార వినియైనను సంతోషించెదను.

వజ్ర—క్రిందినుండి రణరంగము నాకు స్పష్టముగాఁ గానరాకున్నది. వృక్షారోహణము చేసి చూచి సరిగాఁ జెప్పెదను. ఈతరువుపై కెగఁ బ్రాఁకుటకు నా కొకింత చేతోడ రుము.

పురు—ఎక్కుము (అని చేయి సాయ మిచ్చి యెక్కించుచున్నాఁడు.)

వజ్ర—నే నీకొమ్మమీఁద నెక్కి కూరుచున్నాను. ఇక్కడనుండి నాకు సమస్తమును దృగ్గోచర మగును (అని ముందువంకఁ జూచి) అదిగో సంగరరంగము సర్వమును నాకిప్పుడు కన్నులఁ గట్టినట్లున్నది. మనభటులు పరబలమును సమీపించినారు. వారెట్లు వీరాలాపము లాడుచున్నారో వినుచున్నావా? ఇంతదూరమునకు వారి మాటలు చెవిలోఁ జెప్పినట్లెంత స్పష్టముగా వినఁబడుచున్నవి!

పురు—పయినుండి యేమోయనుచున్నావు బిగ్గరగాఁజెప్పు.

వజ్ర—వారి వీరాలాపములు—వీరాలాపములు—వినఁబడు చున్నవా?

పురు—నా చెవిటిచెవులు చవులుగులుకు వారిశుభవచనము లను వినుపాటి పుణ్యమునకు నోచుకో లేదు. వా రేమనుచున్నారు?

వజ్ర—ఏమనుచున్నారా?

క. కొట్టుఁడు—పరుగులు వెట్టుఁడు—
పట్టుఁడు—మనపసులఁ గొంచుఁ బాఱెద రదె యా
కట్టిఁడిపగతుర నిలువం
బెట్టుఁడు—వడి గోగణంబు విడిపింపుఁ డిటన్.

అని పలువురు పలుఁదెఱంగుల వీరోక్తులు పలుకు చున్నారు. ఉభయబలములును గలియఁబడినవి. సంకులసమర మగుచున్నది.

పురు—కన్నులు లేనికొఱంత నాకిప్పుడగదా తోఁచుచున్నది!

వల—మేము కన్నులుగలవార మైనను లేనివార మేయైనాము.

వజ్ర—ఓహో! ఏమి యారణక్రీడ!

మ. ధరణీకాంతయు నంతరిక్షసతియున్ దా రొండొరుల్ కందుకో
త్కరసంక్రీడ యొనర్చుచో నెగయు నుద్యత్కందుకౌఘం బనన్
శరధారాహతిఁ ద్రెస్సి నూఱులు సహస్రంబు ల్మహోగ్రాకృతిన్
శిరము ల్మింటికి నొక్కట న్నెగసిరోణిం గ్రమ్మఱం గూలెడిన్.

వల—పుచ్చకాయలవలె నెగయుచున్న యీపుఱ్ఱె లన్నియు మనపగవారవే యగునుగాక!

కంకు—తథాస్తు!

పురు—ఆహా! ఏమి వారిపుణ్యము! ఒక్కసారిగ నెందఱు సుభటులు వీరస్వర్గమును గొల్లగొనుచున్నారు!

వజ్ర—

చ. బలికి నలంకరించుకొని వచ్చినకైవడి యోధవీరు ల
త్యలఘుగ దాసి ముద్గర శరాసనకంకటభూషితాంగులై
కలఁగక పోరు సల్పి తృణకల్పముగా నదె యుద్ధరంగమం
దెలమిని మృత్యుదేవతకు నిచ్చెద సగ్రములున్ శిరంబులున్.

చూడు చూడు మనసేనాని తేరు డిగ్గి కౌక్షేయకము కర
మ్మునఁ గరమ్మును మెఱుఁగులుగ్రక్క విపక్షసేనాధ్యక్షులమీఁదఁ
బడి యెట్లు వీరవిహారము సలుపుచున్నాఁడో!

ఉ. ముమ్మర మైనకాంక్ష నసిపుత్రిక వీరపరప్రశస్తకం
ఠమ్ములఁ గౌఁగిలింపఁ బ్రకటం బగుదివ్యసతీస్వయంవరే
ష్టమ్మున వేడ్క నాడెడు వసంత మనన్ రుధిరప్రపూరముల్
ఛిమ్మనగ్రోవులం బఱుకిఁ జిమ్మినయట్లుగ మిన్నుముట్టెడున్.

ఇప్పుడు ధూళిపూర్ణముగానడఁగిపోయినది. స్వసైన్యనాశమున
కోర్వక శత్రుసేనాపతి యైన విక్రమభుజుఁ డడ్డుపడి వీరసేనుని
వనూనశరధారాప్రవాహమున ముంపఁగా నతఁడు మరల రథారోహ
ణము చేసి శరశరాసనముల నందుకొనుచున్నాఁడు.

వల—మనవీరసేనునకుఁబోరు భారమగునేమో! నేనుబోయి-

కంక—తాళు. వారిమాటలు విననిమ్ము.

పుర—కుమారా! మన మహారాజుగారి నుపేక్షించుచున్న
ట్టున్నావే?

వజ్ర—లేదులేదు. ఈక్రందుకయ్యమున మహారాజుగారి
రథమే నాదృష్టిపథమునఁ బడకున్నది.

సుధే—ఏమిబుద్ధి?

కంక—అమ్మా! అతఁడు మఱేమో యనుచున్నాఁడు విను.

వజ్ర—ఇప్పటి కది నేత్రగోచర మైనది. కేతనమునుబట్టి రథమును గుఱుతుపట్టినాను. మహారాజుగారును బ్రత్యక్షముగాఁగాన వచ్చుచున్నారు. ఆమహారాజపర్జన్యుఁడు వైరివీరులమీఁదశరవర్షము లెట్లు కురియుచున్నాఁడో!

పురు—నీవు వేఱుప్రక్కకు దృష్టి మరలింపక మనమహారాజు గారిపౌరుషమునే నాకు వర్ణించి చెప్పుచుండుము.

వజ్ర—ఏమి యాయాశ్చర్యము!

ఉ. తూణమునంచుఁ జేయిడుట తూపులఁ దీయుట కార్ముకంబునన్
బాణచయంబుఁ గూర్చుట విపక్షులపై గుఱి పెట్టి యేయుటల్
కానఁగరా వొకింతయును; గానఁగ నౌ విలు మండలాకృతిన్
బూనుట యంపవాన లరిముఖ్యుల ముంచుట మాత్ర మెప్పుడున్

క. కరలాఘవ మే మందును
శరములు పుంఖానుపుంఖరంగతి నడరన్
శరములు వింటిని శాత్రవ
శిరములు మంటిని శతములు చేరెడు నొకటన్.

శా. ఆహా కారముతోడ నల్గడల నత్యార్తి న్నిజానీకినీ
వ్యూహంబు ల్పఱవంగ నడ్డుపడి తాఁ బుంఖాను పుంఖంబుగా
బాహాటో పముతో సుశర్మ ధరణీపాలాగ్రణిం డాఁకి యు
త్సాహస్ఫూర్తిని నించెడున్ విశిఖవర్షంబు ల్మహోగ్రంబుగన్.

కటకటా! మనరాజుగారిధ్వజంబును రథాశ్వధ్వజంబును నేలఁగూలెను కదా!

సుధే—ఏమిబుద్ధి?

వల—తోడుపడ మన కిది సమయము.

కంకు—తాళు. ఆతఁ డేమోయనుచున్నాడు.

వజ్ర—

మ. గద కేలన్ ధరియించి తేరు డిగుచుం గాలాంత కాకారుఁడై
కదియం బోయి విరాటభర్త రిపుయుగ్యవ్రాతము న్నూతునిన్
జదియ న్నోఁదె సుశర్మయు న్విరథుఁడై సర్వం సహామండలం
బదరన్ దూఁకెగ దారణం బొకటఁ జేయన్ దారుణప్రక్రియన్.

క. కని శంఖాద్యనుజులు మన
మనుజపతికిఁ దోడుపడిరి; మఱి యరియోధుల్
చని తోడ్పడిరి సుశర్మకు;
రణసంకులతన్ గుఱు తిడరా దొండొరులన్.

దృష్టి చెదరనీక మహారాజుగారి దారుణప్రవిదారణకౌశలమునే నేత్ర పర్వముగా నాలోకించుచుండఁగా మన కత్యంతసమీపముననేయేదో నేమి ధ్వనివలె వినవచ్చుచున్నది. ఈ చెట్లక్రిందికి రథ మేదియు రాదుగదా? ఏమిది? మనభటు లింతమంది పరుగువాఱు చున్నారు!

పురు—సుశర్మమీఁదికా?

వజ్ర—కా దీవంకకు.

సుధే—రాజుగారు మన కేమైన సందేశమును బంపు చున్నారేమో!

వల—ఏరీ భటులు? నే నెదురుపోరునా?

కంకు—వేగిరపడకు. వారి నిల రానీ.

పురు—శత్రుభటులవలన నీ కిప్పు డేమి కీడు మూఁడునోయని నాయుల్లము తల్లడిల్లుచున్నది.

వజ్ర—వారిబాణము లింతదూరము రావు.

పురు—నాభయ మదికాదు. కంటఁబడితివా శత్రు లిటవచ్చి నిన్ను వధింతురేమో యని భయపడుచున్నాను.

వజ్ర—అంధున కూఁతకోలగా నీతోనున్న నన్నుఁ జూచియు నా కెగ్గు దలఁతురా? నీచెంత నున్నంతవరకు నాకా భయము లేదు.

పురు— లోకానుభవము చాలని బాలుఁడ వగుటచేత నీవు పరులను నీవలెనే భావించు చున్నావు వారి కంతనీతి యుండినపక్షమున నిష్కారణముగా మనగోగణములను బట్టుదురా? కానిమ్ము. ఈ రీస్థలమును దాఁటిపోవునఱకును క్షణకాలము నీవు మాటాడక నామాటవిని మౌనము వహించి యుండుము.

వజ్ర—నా రెవరు? ఇందు వచ్చువారు వైరిభటులు కారు. విరాటభటులు. మనభటులే.

పురు—కారు కారు. నీవు భ్రమపడుచున్నావు. నీమాటలు నేను నమ్మను. విరాటభటు లైనపక్షమున సంగర రంగమును విడిచి వెనుక కెన్నఁడైనఁ బరుగెత్తుకొనివత్తురా? కన్ను లున్నయెడల నేనే చూచి నిజ మెఱుఁగుదునుగదా? నేత్రహీనుఁడ నగుటచేత నితరు లేమి చెప్పినను నేను విని యూరకుండవలసి వచ్చుచున్నది.

వజ్ర—నీవు నామాట నమ్ముము నమ్మకపొమ్ము. నాకన్నులారఁ జూచినది నేను జెప్పుచున్నాను. నాకన్నులను నే నెట్లు నమ్మకుండఁగలను? ఇదిగో వారు మన మున్న చోటనుండియే పరుగెత్తుచున్నారు. వారిరాకకుఁ గారణాంతర ముండి యుండవచ్చును.

[ఇరువురుభటులు ప్రవేశించుచున్నారు.]

పురు—అట్లయినయెడల వారేల పరుగెత్తుచున్నారో యడుగు.

వజ్ర—ఓ భటులారా! మీరేల యింతవేగముతోఁ బరుగెత్తుచున్నారు? ఎక్కడ కరిగెదరు? యుద్ధమెట్లు చెల్లుచున్నది? ఎవరి కపజయము కలుగునట్లున్నది? ఇటు వచ్చి చెప్పిపొండు.

భటులు—మాకు మీవద్దకు వచ్చి మీతో మాటాడుచుండుటకుఁ దీఱదు. వెనుక నిలువయున్న సేనలను బిలుచుకొనిపోవుటకయి

పరుగెత్తుచున్నాము. శత్రుసేనాధిపతియొక్క శరాఘాతముచేత మన సేనాని మూర్ఛితుఁడైనాఁడు. ఇప్పుడు నిమిత్తములు మన కంత యనుకూలముగా నున్నట్టు లేవు.

పురు—అయ్యలారా! అట్లయినచో నిలువక పరుగెత్తుఁడు. మీ రతివేగమునఁ బరుగెత్తుఁడు.

భటులు—(పరుగెత్తిపోవుచున్నారు.)

కంకు—వలలా! సుధేష్ణాదికామినీజనరక్షణమునకయి మన మిందఱ ముండగా మనకు సేనలతోఁ బనిలేదు. ఈభటులవెంట మనబలకరపుబలమును బంపి వేయవచ్చును. అమ్మా! ఏమిసెలవు?

సుధే—వలలాదులు మీ రిందఱుండఁగా నాకేమిభయము? శీఘ్రముగాఁ బంపివేయుఁడు.

కంకు—తంత్రీపాలా! నీవుపోయి యీభటులవెంట మన కావలి సేనను బంపివేసి యిక్కడ నున్నట్టే నుండల రమ్ము.

తంత్రీ—చిత్తము (అని పోవుచున్నాఁడు)

[సారథిసహితముగా రథముతో సేనాధిపతి ప్రవేశించుచున్నాఁడు.]

సేనా—(అంతటఁ గలయఁజూచి) సూతుఁడా! మనరథ మిక్కడ కేల వచ్చినది?

సూతు—శత్రుశరప్రహారముచే దేవరవారు మూర్ఛితులు కాఁగా రథమును రణరంగమునుండి తొలఁగించి యీవృక్షచ్ఛాయకుఁ దెచ్చి నిలిపినాను.

సేనా—యథాపూర్వముగా రథమును యుద్ధభూమికి మరలఁ గొనిపొమ్ము. నాకిప్పుడు గాయ మంత బాధాకరముగా లేదు. నేనిప్పుడే పోయి నన్ను మూర్ఛపుచ్చిన యాతుచ్ఛనిప్రాణమును గొనవలెను.

సూతు—అదిగో పగదీర్చుకొనుటకయి మనసేనపోవుచున్నది. స్వామీ! మీరు నాప్రార్థన మంగీకరించి యించుకతడ విందు విశ్రమించి విగతశ్రమము లయి మఱి శత్రువు మీఁదికిఁ బొండు.

సేనా—అట్లుకాదు. ఆప్రకారముగా వీరభటు లంతమంది ప్రాణములు డాపక పోరాడుచుండఁగా సేనాధిపతి నన్నపేరు పెట్టుకొన్న నేను శరీరములోఁ బ్రాణము లుండఁగానే వీరవిహారము గలుపక పయినుండి చూచుచు నూరకుందునా? ఆవల భూవరుఁ డేమయ్యెనో! తోలుము-తోలుము

పురు—(ఆలకించి) ఇక్కడ నెవ్వరో గుసగుసలాడుచున్నారు. ఆమాటాడువా రెవరు? వీరభటు లైనయెడల మీ రీచెట్టునీడ కేల వచ్చినారు? ఆవల మీరాజు ప్రాణార్థుడై పోరాడుచుండఁగా మీ రాతనిని దిగవిడిచి యిచట మీప్రాణములు దాఁచుకో వచ్చినారా? పొండి పొండి. అవమానమునకు భయపడక మీరు చావునకా జడియుచున్నారు?

వజ్ర—తూలనాడకు.

సేనా—ఓవృద్ధుఁడా! నీ వనుకొన్నట్లు—

పురు—ఇది తూలనాడుటా? చేతఁ గత్తిదాల్చి వెనుక తిరిగి వచ్చుటకు మీరు సిగ్గుపడకున్నారు. అట్టిసిగ్గుమాలిన మీరు నాతో మాటాడ రాఁబోకుడు. మీయాలాపములశబ్దమే కాని మీరూపము నాకు గోచరము కాకున్నవి. నేనే యంధుఁడనుగాక మిమ్ముఁ జూడ గలిగియుంటినా పాఱుపంద లయి వెనుక తిరిగి వచ్చినందున కయిమి మ్మీభూమికి బలి యిచ్చి యుందును. లెండు. పొండు. పోవుచున్నట్లు లేదేమి? మీవద్ద మగతనమే లేదా? మీరు ధరించినవి తెల్లా? ఖడ్గములు కావా? ఖడ్గములే యయ్యెనేని పోయి పోరాడుఁడు.

సేనా—ఓయంధుఁడా! కోపపడఁబోకు. ప్రాణములు దక్కించు కోవలె నని పితికితనముచేత నే నిటరాలేదు. మూర్ఛితుఁడ నయి యున్న సమయమున నాకుఁ దెలియకుండ సారథి నారథము నిచ్చటికిఁ దోలితెచ్చినాఁడు. ఇదె పోవుచున్నాను-సారథీ! రథము తోలుము.

సూతు—మహాప్రసాదము. (అని తోలుచున్నాఁడు.)

వజ్ర—రాయనా! మనసేనాని మహావేగముతోఁ బోయి శత్రు సేనలమీఁదఁ బడుచున్నాఁడు.

పురు—ఎక్కడనుండి పోవుచున్నాఁడు?

వజ్ర—ఇక్కడనుండియే. ఎదుటిమాట వినిపించుకోక నీవింత వఱకు వదరుచుండినదిమనసేనాధిపతి నే. అతఁడుగాయపడి మూర్ఛలో మునిఁగియున్నపుడు సారథి రథము నిటఁ దోలితెచ్చినాఁడు. అతఁడు మూర్ఛ తేరి తేరినిబోరికుమ్మఖము చేయుటకయి సారథిని ద్వరపఱుచు చుండఁగా నిజ మెఱుఁగక నీవు నిష్కారణముగా దూలనాడితివి.

పురు—అయ్యో! అజ్ఞానముచేత సేనానియెడల నేను మహాప రాధము చేసితినే! అది నాబధిరత్వదోషముగాని నాదోషము కాదు. ఈయంధుఁడు చెవిటివాఁడని యెఱిఁగి నన్నతఁడు మన్నింపకపోఁడు.

వజ్ర—ఇప్పుడీగతజలసేతుబంధ మేల? పోనిమ్ము. అదిగో యుద్ధభూమియం దంతకంతకుఁ గలకలము హెచ్చుచున్నది. రోఁజుచు మఱి యొకభటుఁ డిందుఁ బరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు.

పురు—యుద్ధ మెట్లు నడుచుచున్నదో యాతని నడుగు.

[భటుఁడు ప్రవేశించుచున్నాఁడు]

వజ్ర—ఓవీరభటా!—

భటు—నీతో మాటాడుటకు నా కవకాశములేదు. నేనీ వృద్ధునిమాట విన్నాను. నిమిత్తములు మన కిప్పుడు ప్రతికూలముగా

నున్నవి. రాజుగారు మూర్ఛితులైనారు. నే నంతఃపుర స్త్రీ సంరక్షణార్థము పరుగెత్తుచున్నాను (అని పరుగెత్తుచున్నాఁడు.)

పురు—మహారాజుగారే మూర్ఛితు లయినారా? ఓభటుఁడా! నిరాయుధుఁడ నయియున్న నాచేతికి నీఖడ్గము నిచ్చి నన్ను శత్రుసేనలో విడువుము. గ్రుడ్డియెద్దు జొన్నచేనిలోఁ బడ్డట్లు శత్రుసేనాటవిలోఁబడి ప్రాణముల కాశింపక కృప యెఱుఁగని నీకృపాణముతో జేతి కందిన వారి నెల్లఁ దెగనఱికెదను.

సుధే—భర్తగారు మూర్ఛితు లయినా రన్నపిడుగువంటి దుర్వార్త నాచెవిని బడి హృదయభేదమును కావించుచున్నది. ఏమి చేయుదును? ఎందుఁజొత్తును?

కంకు—అమ్మా! తొందరపడఁబోకు. ఈభటుఁడు చెప్పునది సావధానముగా వినుము.

సుధే—ఓభటోత్తమా! శుభమా? అశుభమా? ఏమివార్త?

భటు—దేవీ! అశుభ మేమియు లేదు. తత్తరపడఁబోకుఁడు. రాజుగారించుక మూర్ఛితు లయిరి. ఇప్పటికి మూర్ఛతేరి మరల గదోత్సవము చేయుచుండి యుందురు. సంకులసమరములో నడ్డుపడిన తమ్ములకును గుమారునికిని గాయములు తగిలినవి. మనసేనల కపజయము కలుగునట్లు కనఁబడఁగా వైరులు క్రూరు లగుటవిచారించి ముందుగాఁ బోయి యంతఃపుర కాంతాబృందము నుద్యానమందలి కృత్రిమాద్రికందరమునఁ దాఁగియుండ హెచ్చరించి రమ్మని సేనాని నన్ను నియమింపఁగాఁ దన్నియోగమును నివేదింప వచ్చినాను. నేను వచ్చుచుండఁగా శత్రుసేనలోనుండి యెవ్వఁడో యొకదుష్టుఁడు రాజుగారు పట్టుబడిరని యఱచెను గాని యంతపని పుట్టునని నేననుకోను.

సుధే—(గుండెలు కొట్టుకొని విలపించుచు) ఓవలలా! ఓదామగ్రంధీ! ఓతంత్రీపాలా! నాకుఁ బతిభిక్షపెట్టుఁడు. హాప్రాణనాథా! హా-

వల—అమ్మా! శోకింపకు, కొంచెము తాళుము.

సుధే—అన్నలారా! తాళఁగలమార్గ మేదో నాకుఁ జెప్పుఁడు. భర్త క్రూరకిరాతు లగుపశులచేతులలోఁ బడె నని విని నే నెట్లు తాళఁగలను? (అని యేడ్చుచున్నది)

వల—దేవీ! ధైర్యము విడనాడకు. ఇప్పుడే మేము పోయి నీభర్తను విడిపించి తెచ్చెదము. (అని లేచుచున్నాఁడు.)

సుధే—అందాఁక మేన నే నెట్లు ప్రాణములు నిలుపగలను? విధవనై పృథివిమీఁద నే నొక్కక్షణమయిన బ్రతుకఁజాలను.

వల—ఎంతమాట! వైరిభార్యలుగాక మీరు విధవ లగుట మా దేహములలో నూపిరి యుండఁగానే సంభవించునా? అమ్మా! అధైర్యపడకు— ఓకంక భట్టారకా! మీ రీశుద్ధాంతకాంతలను రహస్యస్థలమునకు దూరముగాఁ గొనిపోయి వీరి రక్షణ మేమఱ కుండుఁడు—ఓదామగ్రంధీ! ఓతంత్రీపాలా! మనము పోయి యిప్పుడ రాజుగారిని విడిపించి తెచ్చి దేవిగారినేత్రముల కపూర్వపర్వ మొనర్తము, రండు. ఆయుధములను గైకొని లెండు.

కంక—శీఘ్రముగాఁబొండు. మీకు విజయ మగుఁగాక! దేవీ! మనము ముందు సపరివారముగాఁ గృతకధరాధరకందరమున కరుగుదము రండి.

సుధే—(లేచి) నాకు నడవఁ గాళ్ళు రావు—ఓవీరోత్తములారా! మీరు మరల వచ్చి భర్తృపునర్దర్శనము చేయించినదాఁక నాహృదయము కుదుటఁబడదు. మీకుఁ గార్యసిద్ధియగునుగాక! పొండు. (అని నడచుచున్నది.)

వల—అమ్మా! కార్యసిద్ధి యైనట్టే సంభావింపుము. మేము పోయి వచ్చెదము. (అని ముప్వురు నాయుధపాణులయి రణరంగము వంకఁ బోవుచున్నారు.)

పురు—ఇంతకుముందేదో రోదనధ్వనివలె గొంచెమునాచెవిని బడ్డట్లున్నది! అది యేదయిన మనకేమి? రాజుగారివార్త చెప్పుము.

వజ్ర—మనరాజుగారు పగతురచేఁ బట్టుపడినారఁట! విడిపించుటకయి కాఁబోలును సేనాని వైరివీరులతో ఘోరసంగ్రామము చేయుచున్నాఁడు.

పురు—ఏమి! ఇంతసేనలో రాజును విడిపింపఁగల మగతనము గలవాఁ డొక్కఁడును లేఁడుగా!

వజ్ర—ఎవ్వరో ముగ్గురువీరపురుషు లీవంకనుండి త్రేతాగ్నులవలెఁ దేజరిలుచుశత్రుసేనాటవిమీఁదకుఱుకఁ బరుగిడుచున్నారు.

పురు—వారి కీశ్వరుఁడుతోడుపడునుగాక! ఓశూరవరులారా! శత్రువీరులలో నొకరిని మిగులనీయక యందఱిని మీప్రతాపాగ్నికిఁ బూర్ణాహుతి చేయుఁడు. ఇసీ! అశక్తునివలె నే నిప్పుడు శూరత్వము చేతఁగాక నిరర్థకప్రలాపములచేతనే రాజభక్తిని గనఁబఱుచుచున్నాను!

వజ్ర—పలాయితు లగుచున్న సైనికులను జూచి సింహగర్జనములవలె గుహలు మాఱుమ్రోయు వారు వీరాలాపము లెట్లు పలుకుచున్నారో విను.

వల—

క. సంగరరంగమునం దిటు
భంగము పడి సిగ్గు విడిచి పాఱెద రేలా?
శృంగారార్థమె మీమీ
సింగుణులును గైదువులును? జెడు భటులారా!

చ. నిలుఁడు నిలుండు; పాఱకుఁడు; నెట్టనఁ దాకుఁడు వైరివీరులన్;
దలపడిపోరి శౌర్యఘనత న్విడిపింపుఁడు మీనృపాలునిన్;
గలఁగి తొలంగఁ జేతులవి గాజులె? కత్తులు కావె? భీతియే
యలఁచెడుఁ గాని మిమ్ము భయదారులుగాఁడు; యశంబునొల్లరే?

జామ —

ఉ. పాఱెద రేల మీర లిటు పౌరుషహీనత? భీరులార! చీ!
పాఱినయంతమాత్రమునఁ బాఱుని మృత్యువుకూడ మీవలెన్?
దీఱనిసిగ్గుచేఁ జివికి త్రెళ్ళెద రింట రణోర్వీఁ బాసినన్;
బాఱక పోరినన్ గెలువ వచ్చును; జావది సందియం బగున్.

తంత్రీ—

గీ. పసరములుమాత్ర మీగతిఁ బాఱిపోవు:
గాని వెను కంజ యిడ రెంను మానధనులు;
భూమిపా లగునట్టి యీబొందికొఱకు
మానమును మీరు విడుతురే మనుజు లయ్యు?

పుర—వీరివాక్యములు నాడెందమునకుఁ బరమానందము కలిగించినవి. ఇఁక వీరరసమూర్తు లయిన వీరివీరవిహారమును వివరించి వీనులకు విందుచేయుము.

వజ్ర—(రణరంగమువంకఁ జూడ్కి నిగిడించి)

ఉ. మేలు! విచిత్ర మయ్యెడు! నిమేషముక్రిందన నెత్రుటేర్లఁ గెం
ధూళు లడంగియున్ మరలఁ దోఁచెడు ధూళిని నెఱ్ఱచీకటుల్
క్రాలు ధరాపరాగములు కావని యిప్పు డెఱుం నయ్యెడిన్
హేళి ప్రతీచిఁ గ్రుంకు నెడ నెల్లెడఁగ మ్మెడు సాంధ్యరాగముల్.

క. ఈరణవీరోత్తము దు
ర్వారాత్యుగ్రప్రతాపపటిమను గని వీ
డారతిఁ దేజోహీనుం
డైరవి పాఱె ననఁ బశ్చిబాంబుధిఁ గ్రుంకెన్.

కాలుక్రమ్ముచున్న చీఁకట్లకుఁ దోడుగా సేనాసమ్మర్దమునలన ధూళి సహితము రేఁగుచున్నది. సంగరరంగమున నేమి నడుచుచున్నదో నాకన్నులకుఁ గానరాకున్నది. ఇంచుచేరువనే యున్నను సమరోన్ముఖు

లయి పోవుచున్న యీవీరత్రయముయొక్క విగ్రహములే స్పష్టముగాఁ గంటఁబడవు. మన మింకఁ గ్రిందికి దిగుదమా?

పురు—చీఁకట్లు కారుక్రమ్మినపక్షమునఁ గన్నులు లేని నాకును గన్నులున్న యాసైనికులకును భేదముండదు. కాఁబట్టి యింటికిఁ గాక నన్నును యుద్ధభూమికే కొనిపోయి వీరశయన మొందిన భటునిచేతి కరవాల మొకటి నా చేత నిడి శత్రు మధ్యమున విడువుము. రమ్ము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థాంకము

రంగము—సుశర్మశిబిరములోని పటమందిరము.

[సుశర్మయు, సత్యసేనుఁడును, విక్రమభుజుఁడును, భటులును, ప్రవేశించుచున్నారు.]

సుశ—ఓవిక్రమభుజా! ఓసత్యసేనా! భగవదనుగ్రహమువలనను యుష్మదాదుల యవక్రవిక్రమమువలనను మనకు నేఁడు విజయ మహోత్సవము కలిగినది. ఓవిక్రమభుజా! మన యీగెలుపునకు ముఖ్యకారణము నీబాహుబలమే సుమా!

చ. బవరమునం ద్వదీయ కరవాలఫణీంద్రుఁడు కాఁడె యెల్లెడన్
జవమున దూఁకి దూఁకి బహుశాత్రవవీరుల ప్రాణవాయువుల్
చవిగొని క్రోలి తాఁ బఱపె సర్వగృహాళి విరాఁలువీట నేఁ
డవిరళలీల నేత్రముల నాంధ్రకుఁ దల్లుల కశ్రువాహినుల్?

మనపక్షమున విశేషనష్టము లేకుండ ననాయాసవిజయము కలిగించినది నీభుజవిక్రమము గాక వే ఱేమున్నది?

విక్ర—ఇది యంతయు నీశ్వరానుగ్రహమువలన నైనది గాని నాపౌరుషము వలనఁ గాదు. మీవిజయమునకు నన్నుఁగూడ నొక యుపకరణముగాఁ జేయ ననుగ్రహించినందున కయి యీశ్వరున కనేకాభివందనములు సమర్పించుచున్నాను.

సుశ—నీయసహాయసాహసక్రీడచేతఁ గాక యనన్యసామాన్య పరాక్రముఁ డైన విరాటుఁడు మనచేతఁ పట్టుపడువాఁడా? నీవుచేసిన యుపకారకృత్యమును మఱవక నీయెడ నేను సదా కృతజ్ఞుఁడ నయి యుండెదను—ఓసభాసదులారా! మనకుఁ గలిగిన యీ విజయమునకయి మీరందఱు సేనాపతి నభినందింపుఁడు-ఓవీరభటులారా! ప్రభుభక్తితోఁ బ్రాణములు డాఁపక పోరాడిన మీ కందఱకు రే పర్వా సమ్మానములు చేసెదను—ఓసభ్యులారా! ఏన మిఁక విరాటరాజు విషయమున నడపవలసినపని యేమి?

సత్య—అత్యంతశీఘ్రముగా నంతకాంతికమున కనుచుట దక్క మఱి యేమున్నది?

విక్ర—అది ద్వేషైకదూషితులైన దయాశూన్యులు చేయఁ దగినదిగాని యుదారహృదయులు చేయఁదగినపని కాదు. మీవంటి వారు చంపఁదగిన శత్రువు చేతఁ జిక్కినప్పు డెల్లు చేసిన లోకము మెచ్చునో యట్లు చేయవలెను.

సుశ—శత్రుసంహారము రాజధర్మము కాదా?

విక్ర—శత్రుసంహారము రాజధర్మమే.

సుశ—అట్లయినచో నుత్తమక్షత్రియునకు శత్రుసంహారమున కంటె లోకము మెచ్చఁదగిన పని మఱి యే ముండును?

విక్ర—రణరంగమున శత్రుసంహారము చేసినప్పుడు లోకులు మెత్తురుగాని చేతఁ జిక్కినవానిని జంపినప్పు డెవ్వరును మెచ్చరు.

సుశ—ఈవిరాటుఁడు మనకు శత్రుఁడు కాఁడా?

విక్ర—పోరాడుచుండినంతవఱకు శత్రుఁడే కాని యిప్పుడు పట్టుపడి దయనీయుఁడైనాఁడు.

సుశ—నాప్రాణములు గొనఁబూని నాపైకి దండెత్తివచ్చిన గర్భశత్రువు ప్రాణములు గొనవైన సంగ్రామవిజయశాలినగు నాకు స్వాతంత్ర్యము లేదా?

విక్ర—శత్రువు మీ చేతిలో నున్నప్పుడు మనసు వచ్చినట్లు చేయుటకు మీకుఁ గావలసినంత స్వాతంత్ర్య మున్నది. అది నేను లేదనను. అయినను బట్టువడి యసహాయుఁడయియున్న పగవాని ప్రాణముల కలుగుట క్రూరకర్మముగాని వీరధర్మముకాదు.

గీ. పట్టువడి నిరాయుధుఁ డౌచు బద్ధుఁ డైన
యట్టిశాత్రవుఁ డసహాయుఁ డగుటకతన
మృతునితోడను దుల్యుండు పృథివిమీఁద;
శవముఁ జంపుటె యవ్వానిఁ జంపు టెల్ల.

ఉ. అక్కట! నీకు లోఁబడినయట్టి యరాతినిఁ జంపితేనియున్,
మిక్కిలి నీశ్వరుండు నిను మెచ్చునె? నీసరివారు మెత్తురే?
నిక్కము నీదుగౌరవము నీదుయశంబును జంపుకొంటగా
కెక్కవ యేల? శత్రు మడియించుటయే యదియించు కేనియున్?

సుశ—ఇప్పుడు నీవు చెప్పినదానినిబట్టిచూడఁగా బహుప్రయాసలబ్ధమైన మన యుద్ధవిజయ మంతయు వ్యర్థము కావలసిన దయినట్లు కనఁబడుచున్నది.

విక్ర—మనయుద్ధవిజయము వ్యర్థముగాక సార్థకపడవలయునని యే నా యభిమతము. జేతయొక్కయుదారకృత్యమువలననే గెలుపు సఫల మగును. ఉదారబుద్ధి యింద్రియజయమువలనఁగాని కలుగనేరదు. రిపువర్గమును గెలువగలుగుటకంటె నింద్రియవర్గమును గెలువఁగలుగుట యధికకీర్తికరము. బాహ్యశత్రువులకంటె నంతశ్శత్రువులను జయించుట దుష్కరము.

సుశ—ఏల?

విక్ర—యుద్ధజయము దైవాధీనము; ఇంద్రియజయము పౌరుషాధీనము.

ఉ. యుద్ధము చూడఁ గేవలము ద్యూతమువంటిది; యిందునందునున్
సిద్ధముగా నసర్వానకె చేకఱు గెల్పొకకొన్ని వేళలం
దిద్ధర; వెట్టివాఁ డొకట నేసిన రాయియుఁ బోలె, భీరుఁ డ
త్యుద్ధతిఁ జిమ్మునమ్మె ఘనయోధునిఁ గూల్చును దైవికంబుగన్.

ఉ. కావునఁ గయ్యపుం గెలు పొకానొక చోట నదృష్టకార్య మౌఁ:
గేవలపౌరుషం బచటఁ గీడ్పడవచ్చు; నయోగ్యుఁ డైన, వీ
రావళి గెల్చు; నింద్రియజయం బటువంటిది గాదు; ధైర్యమున్
భావబలంబునుం గలుగు భవ్యుఁడె గెల్చెడు నింద్రియంబులన్.

బాహ్యరిపులతోడి పోరాటములో బలవంతుఁడును బలహీనునిచేఁ జావవచ్చును; బలహీనుఁడును బలవంతునిచేఁ జావవచ్చును. అందు యోగ్యత ప్రధానము కాదు. ఇంద్రియములతోడి పోరాటమో యట్టిదికాదు. అందు నిజమైన ధైర్యమును మనోబలమును గలవాఁడేకాని యవి లేనివాఁడెన్నఁడును జయము నొందఁజాలడు. కాఁబట్టి యింద్రియవిజయమే నిజమయిన విజయము; అదియే నిజమైన పౌరుషము; అదియే నిజమయిన శూరత్వము.

క. ఇల నింద్రియముల గెలువం
గలవాఁ డొకఁడె పురుషుండుగాక తదన్యుల్
బలముగ గడ్డము మీసం
బులుఁ గలమగరూపుఁ దాల్పఁ బురుషులె తలఁపన్?

సుశ—విరాటుఁడు పూర్వము నా కెంతో యవమానము చేసినవాఁడు. ప్రతి క్రియ గానక చిరకాలమునుండి పెరుఁగునుండిన తొంటిపగను వడ్డితోఁ దీర్చుకొనుటకిప్పుడుసమయమువచ్చినది. ఇట్లు

దైవికముగా లభించిన యీసమయము నిప్పుడు జాఱవిడిచినపక్షమున లోపల మెఱమెఱ మెఱయుచున్న నాహృదయశల్యమును బాపుకొనుట కవకాశము నాకు మరలఁ గలుగిచ—ఓభటులారా! మీరు పోయి విరాటు నిట కీడ్చికొని రండు.

భటు—చిత్తము, మహాప్రభూ! (అని పోవుచున్నారు.)

విక్ర—దేవరవారు పాపకృత్యమును దేనినిఁ దలపెట్టరాదు. ఇట్టి సమయమునందు వేగిరపడి యొకయకార్యమునకుఁ జొచ్చుట రాజనీతికాదు; యశస్కరమును గాదు.

సుశ—నాకు యశస్సుతోను గిశస్సుతోను బనిలేదు. చేతఁ జిక్కిన శత్రువు మారక విడువరాదు. విడిచినచోఁ గాలాంతరమునఁ బ్రాణాంతము వచ్చును. ఇతఁ డిప్పుడు నా చేతిలో నున్నవాఁడు; నాకు శత్రువు.

విక్ర—ఈరెండు హేతువులచేతనే నీ కతఁ డాదరణీయుఁడు.

సుశ—నీమాటలయర్థమేమో నాకు బోధపడలేదు. నీవిప్పుడు చెప్పెడి దేమి?

విక్ర—శత్రువును క్షమించి విడిచిపుచ్చుటయే యుదారచిత్తులగు వీరపురుషుల కిట్టి యెడఁ గర్తవ్యము. కారుణ్యమయమయిన యీ కార్యమే యుద్ధవిజయమున కలంకారము తెచ్చునది.

క. ఆరయఁ గారుణ్యసమో
దారగుణం బొందు లేదు ధరణీస్థలిలోఁ
గారుణ్యమె భూతలమునఁ
జారుగతిన్ నరుని దేవసన్నిభుఁ జేయున్.

[అంతట భటునితోడ విరాటుఁడు ప్రవేశించుచున్నాఁడు]

సుశ—(లేచి పరిహాసముగా) ఓహోహో! విరాటమహారాజులవారా? దయచేయుఁడు. బహుకాలదర్శనము! ఏలిన వారెప్పుడును బగవారికి లోఁబడువారు కారుగాదా?

విరా—అదృష్టదేవతయొక్క యువివేకముచేత ముండ్లకంప మీఁదఁ బుష్పగుచ్ఛము పడ్డ ట్టీయల్పజయ మిప్పుడు నీపాలఁ బడినంత మాత్రమునను నీ వధికుఁడ వయితివనుకొని విఱ్ఱవీఁగఁబోకు. ఇల్లలుకఁగానే పండుగకాదు. ఇంతటి నడుమంత్రపుసిరి కింత గర్వమేల? నీ పూర్వస్థితి నొకింత స్మృతికిఁ దెచ్చుకో.

సుశ—నీనోటి కడ్డులేదు గనుకఁ గావలసినన్ని దురుక్తుల నిప్పుడే ప్రేలుము. ఱేపు నీజిహ్వ నీకు వశముగాదు. తెల్లవారినతరువాత నీవు మరల సూర్యునిముఖమును జూడఁబోవు. మృత్యుముఖమున నుండియు నీ వెట్లుత్సాహము చెడనట్లు నటించుచున్నావు!

విరా—నినుబోటి వేషధారులకుఁ గాని నావంటి ఋజువర్తనులకు నటన మక్కఱలేదు. నాయంతరాత్మ నిర్దోషమయి యున్నప్పుడు నాకుత్సాహముగాక విచార మెక్కడనుండివచ్చును? నీవు పరిహాసముగా నన్నట్లు నే నిప్పుడు మహారాజునే. నాదేశమును నాగోధనమును గాపాడుకోవచ్చిన మహారాజును. స్వదేశరక్షణమును మించిన మహారాజధర్మ మింకొకటి యేది యుండును? నీవలె నేను బరుల గోధనమును దొంగిలవచ్చిన తస్కరుఁడనుగాను. నేనుదొరను; నీవుదొంగవు. నీనిలివెడెత్తుధనము పోసినను నాకున్న మనోత్సాహమునీకురాదు.

సుశ—ఇఁక నీకుఁ జావు నిశ్చయము.

విరా—దొంగలచేతిలోఁబడిన ధనస్వామికి మరణముగాక మఱి యేమివచ్చును?

సుశ—పాపము! ఈదొరగారిభార్యకు ముసలితనములో వైధవ్య దుఃఖము సంభవించుచున్నది గదా!

విరా—చేతికి ఖడ్గమిచ్చి నాతో సరిగా నిలిచి పోరాడుము. నాముసలితనమును నీపడుచుతనమును లోకమున కప్పుడు వెల్లడి యగును.

సుశ—ఓవిరాటా! నీవు ముసలిపిల్లవాఁడవే కాని బుద్ధిగలిగి పాండవు లెక్కడ నజ్ఞాతచర్య నడుపుచున్నారో చెప్పెదవా?

విరా—ఆమహానుభావులగూఢచర్యయెవ్వరికి గోచరమగును? అట్టి సత్పురుషుల నామసంస్మరణముచేత మన మిప్పుడు కృతార్థుల మయినాము.

సుశ—వారు నీయుండను దల దాఁచుకొని యున్నా రన్నచో నీప్రాణము పోదు. భయపడక నిజము చెప్పు.

విరా—నీ వడుగుచున్నావని నేటికాలమున కసత్యము లాడ నేర్చుకొమ్మన్నావా? మావీట నుండు కుక్కకుఁగూడ నాలుక కసత్యము రాదు. పాండవుల యంతటి మహామహులే నాయొద్ద నుండునంతటి భాగ్యము తటస్థించినపక్షమున నేను నిర్భయుఁడ నగుదునుగాని భయ మేలపడుదును? అణుమాత్రమైనను వారికి సహాయుఁడు కాఁజాలిన వాఁడెల్ల గర్వపడవలెను.

సుశ—నీబావను సింహబలుని సంహరించిన మహాపురుషు లెవరు?

విరా—గంధర్వులు. ఆగంధర్వులే యాపుణ్యమును గట్టుకొన కుండిరేని నీవిప్పు డాసింహబలుఁ డనుసింహము బాఱికి గుఱియ వయి యుందువు.

సుశ—ఇప్పుడు నాచే కాఁగలకార్యమును గంధర్వులేతీర్చిరా?

విరా—నీచేఁ గాఁగలకార్యమేమో నాఁడు సింహబలుఁడు బ్రతికియుండఁగా నేయైనది. లోకమెఱిఁగిన నీపౌరుషమును సిగ్గుమాలి నీ విప్పుడు పొగడుకొనేల?

సుశ—పాండవులు నీవీటను లేనేలేరా?

విరా—ఆపాండవులే మావీటనున్న పక్షమున, నిన్నిప్పుడు ప్రాణములతో విడుతురా?

సుశ—నా ప్రాణములమాట తరువాతఁజూచుకొందము. ముందు నీ ప్రాణములమాట చూచుకో. నీకుఁ బ్రాణదానము చేసినయెడలఁ బాండవులఁ బట్టి యొప్పగించెదవా?

విరా—నిమిషభంగుర మయిన యీశరీరమున కాశపడి మిత్రద్రోహముచేసి యకార్యకరణమునకుఁజొత్తువనుకొన్నావా? నిజముగాఁ బాండవులే నన్ను శరణొంది యున్నపక్షమున, నాకున్న యీయొక్క ప్రాణమునకుఁ దోడు మఱి లక్షప్రాణముల విడువవలసి వచ్చినను దృణప్రాయముగా నన్నిటినివిడిచి వారినిరక్షించి యుందును.

సుశ—ఓరత్యాసేనా? ఈతనికిఁ బ్రాణత్యాగములు తృణప్రాయములఁట! ఈతని మనోభీష్ట సిద్ధి యగునప్పుడు భార్యాపుత్రాదులు చూచి సంతోషింపవలెను. సంగర విజయోత్సవమును జూడవలె నన్న యభిలాషతో సుధేష్ణాదేవియు నీతనివెంట వచ్చియున్నదని విన్నాను. నీ వర్హాసేనాసమేతముగాఁ బోయి యామెను బట్టియిందుఁ దోడితెమ్ము. విజయోత్సవమునకు మాఱుగా భర్తృవధోత్సవముతో తే పామికు నేత్రపర్వము చేయుదము.

సత్య—మహాప్రసాదము. దేవరయాజ్ఞ శిరసావహించినిర్వహించెదను.(అని కొలువు విడిచి పోవుచున్నాఁడు)

విరా—ఘోరకృత్యమున కీశ్వరుఁడు విఘ్నము కలిగించునుగాక!

సుశ—ఇతఁ డిప్పుడు కొంచెము దారికి వచ్చుచున్నట్లున్నాడు. ఓవిరాటా! నీకుజీవితాశ యున్నపక్షమున, నీ నీతిని గీతిని గొంతసేపు దూరముగా నుంచి పాండవులజాడ తెలిపి నీజీవితమును గొంతదీర్ఘపఱుచుకో.

విరా—నీతిసహితమైన జీవన మొక్కపూటయైనను దీర్ఘమయినదే. వేయేండ్లు వర్ధిల్లినను నిష్ప్రయోజన మగుటచే నీతిమాలిన జీవనమే యత్యల్ప మయినది.

చ. మనుజునిజీవితంపుఁ బరిమాణము నేఁడులచేతఁగాక చే
సిన ఘనకార్య సంచయముచేత గణింపఁగఁ జెల్లు నెప్పుడున్;
బసివడి నూఱువర్షములు వాయుసమట్టులు పొట్టకూటికై
మనినఫలంబునుం గలదె మర్త్యుఁడు; భారమె కాక భూమికిన్?

మ. ఎతఁ డత్యంత పరోపకారి యయి సద్వృత్తంబుఁ దాఁబూనునో
యతఁడే యల్పపుఁగాలమే మనియు దీర్ఘాయుష్కుఁడెంతేనియున్;
ఎతఁ డెంతే నుపకారశూన్యుఁడయి సద్వృత్తంబుఁ దామానునో
యతఁడే దీర్ఘపుఁగాలమున్ మనియు నల్పాయుష్యుఁడత్యంతమున్.

నీతి విడిచి ప్రాణములు కాపాడుకోఁదలఁచుట నీవంటిపౌరుష హీనులకుఁగాని నావంటి పౌరుషశాలులకు లక్షణముగాదు.

సుశ—కాటికిఁ గాళ్ళు చాచుకొనియున్న యీముసలివాని కీమొండిధైర్య మెక్కడనుండి వచ్చినదో!—ఓభటులారా!

విరా—ఈధైర్యము నాకు నిష్కలుష మైన యీహృదయ మధ్యముననుండి వచ్చినది. ఆపత్కాలమునందు మంచివారి కెప్పుడును ధైర్యమే సహాయము.

గీ. సాధుజనులకు నాపద ల్సంభవిల్లు
కాలముననె ధైర్యంబు ప్రకాశ మొందు;
అఱుగరాచిన సమయంబునందుఁ గాదె
వసుధపయి గంధసారంబు పరిమళించు?

సుశ—ఓభటులారా! ఈతెంపరి నింక నిటఁ బ్రేలనీక నా యెదుటనుండి యీడ్చుకొని పొండు — ఓరాజాధమా! ఇప్పటికిఁ బొమ్ము. నీవిప్పు డాడిన గుర్భాషలకుఁ దగినట్లుగా నిన్నెట్లు బాధ పెట్టి హింసింపవలయునో తెల్లవాఱులోపల విచారించెదను—ఓ భటులారా! ఈడ్చుకొనిపోయి శృంఖలాబద్ధుని జేసి యీరాత్రి యీతని భద్రముగాఁ గాపాడుచుండుఁడు.

భటు—చిత్తము మహాప్రభూ! (అని యాతనిఁ గొనిపోవు చున్నారు)

సుశ—విక్రమభుజా! ఈతులువ ప్రేలిన ప్రలాపము లన్నియు విన్నావుగదా? నీ వింకను వీనిని జంపక విడువవలయు నని చెప్ప సాహసింతువా?

విక్ర—మన కీతనిఁ బొలియించుట ఘనకార్యము కాదని యిప్పటికిని జెప్పెదను.

ఉ. చంపఁగ నర్హుఁ డైనఘనశాత్రవుఁ డేపరి చేతఁ జిక్కినన్
జంప కుదారతన్ విడిచి సాగఁగ నంపుటె చావుకన్న నూ
హింపఁగ మానవంతునకు నెక్కువలాఘవ ముర్విలోపలన్;
బెంపునుఁ బేరు వచ్చుఁ బృథివిం గరుణాపరుఁ డైనజేతకున్.

సుశ—కర్తవ్యమును దెల్లవాఱిన తరువాత విచారింతము. వంటయింటి కుందే లీవిరటుఁ డిఁక నెక్కడకుఁ దప్పించుకొని పోఁ గలఁడు? ఇట్లు విరటుని గర్వభంగముచేసి స్వకార్యమును సాధించు కొన్నాము; ఇఁకఁ బాండవుల నన్వేషించి స్వామి కార్యమును నిర్వ హింపవలసియున్నది. పాండవులు కంటఁబడినదాఁక మనము చరి తార్థుల మైతి మనుకోరాదు.

విక్ర—మహామేధావంతులగు దుర్యోధన మహారాజుగారు చేసిన యూహ యబద్ధ మగునా? ఇఁకఁ బాండుపుత్రులును మనకు నేత్రగోచరు లగుదు రనుకోవలసినదే.

[తెరలోఁ గలకలము]

సుశ—(ఆలకించి) ఏమి యాసందడి? భటుల సంక్షోభ ధ్వనులు వినఁబడుచున్నవి.

[తెరలో]

ఎవ్వరో వీరపురుషులు ముగ్గురు త్రేతాగ్నులవలె మనసేనా టవిపయిం బడి బాణార్చులచే నడ్డు వచ్చినవారి నెల్ల నిర్దహించు చున్నారు. ఇదిగో గావలివారల మమ్ముఁ బడమోఁది విరాటుని విడిపింపఁ జూచుచున్నారు. ఓమహారాజా! వచ్చి రక్షింపుము—విడిపించినవాఁడవు నీ వెవఁడవురా?

సుశ—ఏమి యీసాహసము! వాఁ డేమో యుత్తర మిచ్చు చున్నాఁడు.

[మరలఁ దెరలో]

చ. వలలుఁడ; నే విరాటుకడ వంటలవాఁడ: నిదే త్వదీయ సే
నలఁ బరిమార్చి మామనుజనాయకుని న్విడిపించుకొంటి, బె
బ్బులి పెనువాతఁబడ్డవృషమున్వలె; వీరుఁడ వేన్, సుశర్ముఁడా!
వెలువడి వచ్చి వేగ విడిపించుకొనంజనుఁ గ్రమ్మఱన్ నృపున్.

సుశ—ఏమిది! వాఁడు నన్నే పేర్కొని పిలుచుచున్నాఁడు! ఓవిక్రమభుజా! నీ విందు నిలువుము. నేను బోయి వానిని స్వర్గమున కంపివచ్చెదను—ఓరిమూర్ఖా!

క. ఇదె వచ్చుచు నున్నాఁడను
బదరగ క్షణకాల మచట వదరక నిలుమీ
యిదె నాప్రతాపశిఖి కి
య్యదన న్నీ విందనంబ వయ్యెద వొకటన్.

[తెరలో]

నీవు నిక్కంపుఁ బౌరుషశాలి వగుదువేని, న న్నెదిరించి ప్రాణమును మానమును దక్కించుకొని పొమ్ము.

సుశ—ఊరక వదరఁబోకు. నీకండగర్వ మిప్పుడేయడఁగును. నేను దారసింపువఱకేకాని యామీఁదట నీనోటినుండి మాటరాదు.

(అని సత్వరముగాఁ బోవుచున్నాఁడు)

విక్ర—ఓభటులారా! నాకృపాణమును ధనుర్బాణములను వేగఁ గొనిరండు.

[తెరలో]

ఓవిక్రమసేనా! మూర్తీభవించిన వీరరసాధిదేవతవలె నీవీర పురుషుఁ డెవఁడో గదాఘాతములచేత మనరాజును జదియమోఁదు చున్నాఁడు. వేగ వచ్చి యీతని ప్రాణరక్షణము చేయుము.

విక్ర—ఓసుభటా! ఆయుధములు వేగఁ దెమ్ము.

భటు—ఇవిగోఁ దెచ్చినాను. (అని చేతి కిచ్చుచున్నాఁడు)

విక్ర—ఇదిగో నేనువచ్చితిని. మారాజును విడువుము. నేను దారసించులోపల విడువకుంటివా, నీప్రాణములు నీవికావు. నాచేతి ఖడ్గము దయయు గియయు నెఱిఁగినదికాదు సుమా. (అని పరుగిడు చున్నాఁడు)

[తెరలో]

త్రిమూర్తులవలె వచ్చిన యీముమ్వురిలో నొకఁడు ముందు విరాటుని గొనిపోవుచున్నాఁడు. అయ్యో! విరాటుఁడు తప్పించుకొని పోయెనుగదా! ఇంకొకఁడు గదాఘాతముచే మనరాజును మూర్ఛ పుచ్చినాఁడు. అయ్యో! ఇఁక నేమున్నది? ఓసేనాపతీ! వచ్చితివా? ఇఁక రాజునకు భయము లేదు.

వల—ఓదామగ్రంథీ! నీ వీసుశర్మను గొని విరాటునివెనుకఁ బొమ్ము. నేనీవచ్చినవానినిఁ బాఱఁద్రోలివచ్చి నిన్నిప్పుడే కలిసి కొనెదను.

విక్ర—ఓరీ! నరాధమా! నీ వింకను మారాజును విడువనే లేదుగా? నాచేతఁ జావుమని విధి నీనొసట వ్రాసియుండ, సామవచన ములతో నీ వెట్లు విడుతువు?

వల—ఓవిక్రమహీనా! నాముందఱ నీవృథాప్రలాపములు ప్రేలక పౌరుషశాలివేని నీరాజును విడిపించుకొమ్ము. కార్యముల చేత నేమియుఁ జేయఁజేతఁగాక నీవిప్పుడు మాటలచేతఁ జేయుచున్నావు.

విక్ర— ఇఁక ములుకలచేతనేకాని పలుకులచేత నేను నీ కుత్తరమియ్యను.

వల—నన్నుఁ దారసించినతరువాత నీ విఁక వేనితోను నా కుత్తరమియ్యవు. నీవు చేసినపాపముల కుత్తర మిచ్చుట కయి నిన్ను యమసన్నిధానమునకుఁ బంప నాచేతి గద వేగిరపడుచున్నది. పాఱక నిలువుము.

[తెరలో]

అయ్యో! వీఁడు ప్రళయ కాలదండధరునివలె మాఱులేక మలయుచు నడ్డుపడిన యోధవీరుల నెల్ల గదాఘాతమునఁ జదియ మోఁదుచు మనసేనాపతితల భిన్నము చేసినాఁడు? పిడుగడిచిన తాళమువలె నేలఁగూలి విక్రమభుజుఁడు కొట్టుకొనుచున్నాఁడు. నెత్తురు వఱదలు కట్టుచున్నవి. సేనాపతిమేన ప్రాణములు లేవు. హావిక్రమభుజా! హాసేనానీ! విరాటసేనాసముద్రము నీఁదివచ్చిన నీ వీవంటలవాఁడను చిఱుకాలువను దరింపలేక మునిఁగి చచ్చితివా?

వల—మీసేనాపతి నిహతుఁ డయినాఁడు. మీసేనలో నన్నెది రింపఁగల బిరుదుమగ లెవ్వరైనఁ గలిగిరేని రండు. అందఱిని సేనాపతి పోయినతోవనే పంపెదను. ఏమి! ఎవ్వరును రా రేమి?

సుశర్మసైనికులు—ఓపాపపుదైవమా! అతిప్రయాస లబ్ధమైన మాగెలుపు నంతను నిమిషములో నిష్ఫలము చేసితివి! లోకములో నిన్ను నమ్ముకొన్నవాఁ డెవ్వఁడు బాగుపడును? క్షణకాలముక్రింద మాలోనుండి యింతలోనే మమ్ము విడిచిపూపగవారిచెంతఁ జేరితివా?

సుశర్మ—(మూర్ఛ తెరలి) ఎవఁడురా నన్నుఁ బట్టుకొన్నవాఁడు? మనవాఁడా? పగవాఁడా?

దా—నీశత్రుఁడను, నీ విప్పుడు విరాటునకు దాసుఁడ వయితివి. ఆతని యాజ్ఞానుసారముగా నర్హదండనమును బొందుట కయి నీ విప్పుడాతనికొలువుకూటమునకుఁ గొనిపోఁబడుచున్నావు.

వల—అది యేమి? దామగ్రంథీ! సుసర్మ మూర్ఛతేఱినాడా?

దామ—మూర్ఛతేఱి వీఁడు విడిపించుకొనఁ బెనఁగులాడుచున్నాఁడు. నీవిటురమ్ము.

వల—ఇదిగో నేను వచ్చి యాత్రాళ్ళతోనే వీని పెడ ఱెక్కలు విఱిచికట్టెదను.

సుశ—ఇట వచ్చితివా నిన్నే విఱిచికట్టెదను.

వల—ఇదిగో వచ్చితిని. నన్నుఁ గట్టవేమి? నీగర్వభంగమయినదా? యమపాశములవంటి యీపాశములతో నిన్ను బంధించినాను. శక్తి యున్నచోఁ దెంచుకొమ్ము. ఓవిరాటమహారాజా! ముందుగా నీ వీతంత్రిపాలునితో నడచి మనవి వేశమును జేరుము. నీసుఖవార్త దెలియక యంతఃపురకాంతలు తల్లడిల్లుచుందురు. మీవెనుకనే మేమును మనపశుగుణములను దొంగిలిన యీనరపశువును మీసన్నిధి కీడ్చుకొనివచ్చెదము.

విరా—తంత్రిపాలా! దారితీయుము.

తంత్రి—ఇటు. ఇటు.

వల—ఓసుశర్మా! మ మ్మాయాసపెట్టి యీగుదెపెట్లు తినక బుద్ధిమంతుఁడ వయి శీఘ్రముగా నడువుము. నడవ పెనఁగితివా తావు చేరునప్పటికి నీశరీరములో గట్టియెముక యొక్కటి యుండదు.

(సుశర్మసైనికులు దీనముఖములతోఁ జూచుచున్నారు.)

ప్రథమభటుఁడు—వారు మనరాజుతో దృష్టిపథమును దాఁటిపోయినారు. ఇఁక మనకుఁ బ్రాణభయములేదు. మనము మెల్లఁగా నడచి సేనతో ముందు నడచిన సత్యసేనుని గలిసికొని, రాజును రక్షింపఁ బ్రయత్నము చేయుదము రండు.

ద్వితీయభటుఁడు—వారు మఱికొంతదూరము సాగిపోనీ. మనము మెల్లఁగాఁ బోవుదము. కార్యసాధననిపుణు లెప్పుడును ద్వరపడఁగూడదు.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము

రంగము—విరాటరాజు సేనాని వేశము.

[సింహాసనాసీనుఁ డయి విరాటరాజును, సమీపమున నర్హపీఠముపైని తంత్రీపాలుఁడును, కొందఱు భటులును ప్రవేశించుచున్నారు.]

విరా—ఓతంత్రీపాలా! ఇటువంటి శ్రవణవిదారణమైనదారుణ వార్త వినియు హృదయము పగులక ఱాతిగుండెవాఁడనై బ్రతుకు చున్నాను! హా! ప్రాణేశ్వరీ! హా! సుధేష్ణా!

ఉ. ఒం డననేల? సింహబలు సోదరివయ్యును వీరమాతవై
యుండియు వీరపత్ని వన నొప్పియు ముక్కున నూర్పు గల్గి నే
నుండఁగ దాయచేత నయయో కొనిపోఁబడితే? యనాథ య
ట్లుండజయాన! యీయొడలియం దెటునిల్పుదునింకఁ బ్రాణముల్?

ఓభటులారా! దేవి యేవంకకుఁబోయినది? కంకభట్టారు లెటుచనిరి? ఆసత్యసేనుఁడు—ఆపాపాత్ముని పేరుచ్చరింపరాదు.

ఉ. ఎక్కడ కాన్పృపాలపశు విప్పుడు సాప్రియుఁ గొంచుఁ బోయెనో
యెక్కటిఁ గూడముట్టి మ దహీనకఠోరకఠారధారచే
ప్రక్కలు చేసెదం దనువు ప్రక్కలు ముక్కలొనర్చెదం దలల్
చెక్కలు బాపెదన్ సతిని జెచ్చెరఁ దెచ్చెదఁ జింతఁ బుచ్చెదన్.

(అని ఖడ్గహస్తుఁ డయి లేచుచున్నాఁడు.)

తంత్రీ—ఓమహాప్రభూ! సేవకుఁడ నే నుండ దేవర కీశ్రమ యేల? కంకభట్టారకుఁడే యింతకు నావైరిభూకాంతుని నంతకుఁ జెంతకుఁ బుచ్చ కుండినయెడల నేనుబోయి తోడ్పడి యాతని నవలీలం దునిమి దేవిని దెచ్చి యిచ్చట నున్నట్ల నీకు సమర్పించెదను.

విరా—అటువంటి క్రూరకిరాతుని చేతఁజిక్కి యింకను దేవిప్రాణములు చిక్కఁబట్టఁ గలుగునా? నాఁడు ధనగుప్తు డామృత్యుదేవత వాతఁబడి పురుషుఁ డగుటచేత మరల బ్రతికి బయటఁబడఁ గలిగెనుగాని యీయబల యెట్లు తప్పించుకొని రాఁగలుగును? ఈయడియాసతోఁ బనిలేదు.

భటులు—ఓమహారాజా! దేవిని దేవేంద్రునివలె సహస్రదృష్టులతోఁ జూచుచుఁ గంకభట్టారకుండు కాపాడుచుండుటచేత దేవి చెంతఁ దేటిచూచుటకైనను సత్యసేనుని సేనకు సాధ్యము కాలేదు- అదె ధనగుప్తుఁడు రోఁజుచుఁ బరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు. అతఁడు యుద్ధవార్తను విన్నవింపఁ గలఁడు.

[కొందఱు సైనికులువెనుక రా ధనగుప్తుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ధన—(పగర్చుచు)—ఓ-ఓ-ఓమహారాజా! సత్య-సత్యసేనుఁడు—

విరా—ఏమి చేసినాఁడు?

ధన—పాఱి—పాఱిపోయినాఁడు.

విరా—ఊపిరి సంబడించుకొని కొంచెము తాళి మఱిచెప్పు.

ధన-(తెప్పిఱిలి) కంకుభట్టారకు దాడికిఁ దాళఁజాలక సత్యసేనుఁడుపరాజితుఁడై పలాయితుఁడయ్యెను. దేవిసురక్షితయైయున్నది.

విరా—ధనగుప్తా! కంకుభట్టారకుని దాడికిఁ దాళఁజాలక సత్యసేనుఁడు పరాజితుఁడయి పలాయితుఁడగుట నీవు కనివచ్చితివా? విని వచ్చితివా? దేవి సురక్షితయై యుండుట నిశ్చయమేకదా? నిత్యసత్యుఁడ వని ని న్నెఱిఁగియుఁ బగతునిచే భంగపడి సంచలత నొందియున్న నాడెంద మిప్పుడు నీవు చెప్పిన మేలివార్త నొకపట్టున నమ్మజాలక సందేహపడుచున్నది.

ధన—ఓమహారాజా! విన్నది కన్నట్టు నే నెన్నఁడైనవిన్నవింతునా? సత్యసేనుఁడు సిగ్గువిడిచి పాఱుచుండఁగా నే నీ కన్నులారజూచియేయాశుభవార్తను దేవర చెవిని వేయవడివడి బరుగిడివచ్చినాఁడను. ఇఁకమీచిత్తము నించుకసేపు తత్తఱపాటు మాన్వి సస్థత నొంది యూఱడిల్లి యుండు మనుఁడు. కంకుభట్టారకుని వెంటఁజెక్కుచెమర్పకవిచ్చేసెడు సుధేష్ణాదేవియొక్క శుభస్వరూపమే క్షణకాలములోఁబ్రత్యక్షముగా దేవర డెందములోనిసందియమునుదీర్పఁగలదు.

విరా—నీవాక్కు ఫలించి యంతటిభాగ్య మిప్పు డీకన్నులకుఁ గలుగవలెనుగదా? బ్రాహ్మణుఁ డయ్యును బరాక్రమమున మనకంకుభట్టారకుఁడు బవరముల నాఱితేఱినక్షత్రియవీరుని నోర్వఁగలుగుట నాపాలిటి భాగ్యదేవతయే యాతని రూపమును ధరించి నన్నుగ్రహింప వచ్చిన దని భావించెదను.

తంత్రీ—అస్త్రవేత్తలైనబ్రాహ్మణసత్తములుత్తమక్షత్రియుల నోర్చుట యది క్రొత్తగాదు.

క. జమదగ్ని కుమారుఁడు మును
సమరంబున నిరువదొక్క సారులు నృపులన్
సమయించి నెత్రుసుడువులు
సమదగతిం జేయలేదె క్ష్మాతలమందున్.

ఈమహాద్విజునిశౌర్యవిశేషమును నేనుబూర్వము హస్తినాపురమునం దుండినప్పుడే యెఱిఁగినవాఁడను. ఈతఁడు ధనురాచార్యుఁడైనద్రోణా చార్యుని శిష్యుఁడు. శౌర్యసంపదచేత నీతనిని క్షత్రియులలోనుత్తమ క్షత్రియుఁ డనవచ్చును.

విరా—ఓధనగుప్తా! క్రూరజనాగ్రగణ్యుఁడైన యాసుశర్మ తమ్ముఁడు దేవిని జెఱగొనిపోవుచుండగా వీరాగ్రేసరుఁడగుకంకుభట్టా రకుఁ డడ్డుపడి పోరాడి డేగ నోటఁబడ్డ పారావతినిబోలె రాణినెట్లు విడిపించెనో సవిస్తరముగా వివరింపుము.

ధన—మొదటినుండియు నే నచటలేను. యుద్ధమెట్లు నడచు చున్నదో చూచివచ్చి యెఱిఁగింపుమనియుత్తరకుమారుఁడు పంపఁగా నేను వచ్చునప్పటికే మార్గమధ్యమునముంచు పలాయితుఁడగుచున్న సత్యసేనుఁడును వెనుక వానిని దఱుముచున్న కంకుఁడును నాకెదురు పడరి. గంగరవృత్తాంత మాద్యంతము దేవర కీసైనికులు విన్నవింపఁ గలరు. ఓసైనికులారా! మీరుకన్నది విన్నవింపుఁడు.

సైని—ఓమహారాజా! దేవరవారు పగతురచేఁ బట్టుపడి రన్న పిడుగువంటి దుర్వార్తచెవినిబడఁగానే దేవిగారుమూర్ఛపడి మొదలు నఱికిన రంభాతరువువలె నేలఁ గూలి సఖీజనశైత్యోప చారములచేఁ గొండొకవడికిఁ దెప్పిఱిలిరి.

విరా—అక్కటా! దేవికెంతసంతాపముకలిగినది! అనంతరము.

సైని—అంత నంతఃపురకాంతలు చింతాక్రాంత లయిభయ భ్రాంతిచే దాయలు వచ్చి తమ్ము దొమ్మి చేయుదురని నానాముఖ ములఁ బఱవఁ జొచ్చిరి. కంకుభట్టారకులవారు వారిసంభ్రమమును వారించి ధైర్యముచెప్పి దేవీపురస్సరముగా వారినందఱినిగూర్చుకొని మావెంటఁ గృతకాద్రికందరమునకుఁ గొనిపోవుచుండఁగా దారిలో సత్యసేనుఁడు తనసేనతో వచ్చి తాఁకెను.

విరా—తరువాత?

సైని—తరువాత మనకంకుభట్టారకుండు మొగంబు జేవురింపఁ గనుంగవ విస్ఫులింగంబులుగురియ మూర్తీభవించిన వీరరసాధిదేవత యోయనన నాగ్రహవ్యగ్రుండై మహోగ్రంబుగా సత్యసేనునివంకఁ జూచుచు-

ఉ. వీరుఁడ వౌదు స్త్రీలకడ బీరముఁ జూపఁగ వచ్చినావె? యో
రోరి నరాధమ! నిలువు మొక్కనిమేషము పాఱిపోక; నీ
శూరత యెల్లఁ దెల్లమగుఁ జుమ్మని యమ్మరిఁ బోసి యేసినన్
నోరను నెత్తురొల్కఁబడె నొచ్చి యతం డరచచ్చి యుర్వరన్.

విరా—మేలు! మేలు! ఆపయిని?

సైని—ఆపైని మఱి యేమున్నది? ఆతులువ తెలివిరాఁగానే లేచిమఱియుద్ధభూమిసినిలువనొల్లక కాళ్లకుబుద్ధిచెప్పియూడనిఁబాడెను

విరా—ఔరౌరా! ఏమి యీపౌరుషము! ఓకంకుభట్టారకా! ఒక్కసారి నీ గాఢాలింగనమిచ్చి నన్ను గారవింపుము.

(అప్పుడు కంకుభట్టుసుధేష్ణాసహితముగాఁ బ్రవేశించుచున్నాఁడు)

కంకు—అమ్మా! నామాట నీవిప్పుడైనను నమ్మెదవా? అదె మహారాజుగారు సుఖాసీను లయి యెట్లు కూర్చున్నారో చూడు. మన వలలుఁడు కార్యసాధనదీక్ష వహించి పోయినప్పుడును గార్యసిద్ధి గాకుండునా?

సుధే—ఓమహాత్మా!! నా కిట్లు నేత్రోత్సవముచేయుచున్న యతఁడు నిజముగా నాప్రాణనాథుఁడగునా? ఇప్పుడు సహితము నా చిత్తమునాకన్నులనునమ్మజాలకున్నది. ఇదియింద్రజాలముకాదుగదా? ఒకవేళ స్వప్నమేమో! కాదుకాదు. నేనుమేలుకొనియే యున్నాను. ఓదైవమా! ఇది మాయచేయకనిజము చేయుము. నాప్రాణేశ్వరుఁడు నామాటకు మాఱుపలికిన నిది మాయకాదని నమ్మవచ్చును. (దాపునకుఁబోయి) ఓప్రాణనాథా!

విరా—(లేచి) ఓ ప్రాణేశ్వరీ!

సుధే-(తనలో) ఇది నిస్సందేహముగా నా ప్రాణేశ్వరునికంఠస్వరమే. (గాత్రస్పర్శనము చేసి) ఇందు మాయ లేదు. (ప్రకాశముగా) ఓమనోవల్లభా! ఏమి నా పుణ్యము! మీ రాయ కాలమృత్యువునోటఁ బడియు విడివిడి యిప్పుడు మరల నాకంటఁబడుచున్నారు!

విరా—ఇది వలలుఁడు చేసిన యుపకారము. అతఁడు సాక్షాద్రణరంగభీముఁడయి శత్రువులమీఁదఁబడి పలుపురఁ బొలియించి పోయిన వనుకొన్న ప్రాణములనే మరల నిలిపినాఁడు. నీ వెట్లాదురాత్మునిపాలఁబడక మానప్రాణములు దక్కించుకోఁ గలితివి?

సుధే—ఈద్విజసార్వభౌముని యనుగ్రహమువలన (అనికంకుని జూపుచున్నది.)

విరా—ఓకంకుభట్టారకా! సహస్రనమస్కారములు. చేరవచ్చి యొక్కసారినీపరిష్వంగసౌఖ్య మిచ్చి నన్నుఁ జరితార్థుని జేయుము. నేను సహస్రజన్మము లెత్తియైనను నీఋణలేశమును దీర్చుకోలేను. (అని గౌఁగిలించుకొనుచున్నాఁడు.)

కంకు—విజయోస్తు! మహారాజా! నా కిప్పుడు జన్మసాఫల్యమయినది.

విరా—మారాజ్యమును బ్రాణములును మీరిచ్చినవే. ఇటువంటిప్రాణదాతకు నే నేమి సమర్పించి సంతోషపెట్టఁగలను?

గీ. మృత్యుదంష్ట్రాంకురంబుల నిఱికికొన్న
నన్ను విడిపించె వలలుఁడు నాగబలుఁడు;
పట్ట వచ్చినఖలుబారిఁ బడక యుండఁ
గాంతఁ గాపాడితివి నీవు కంకుభట్ట.

దీని నంగీకరించి నాభక్తి కానందింపుము. (అని తనమెడ నున్నరత్నహారమును దీసి యాతనికంఠమున వేయుచున్నాఁడు.)

కంకు—దేవరవారి యీచల్లనిమాటమాత్రముననే నాకు సకల సత్కారములును జరిగినవి? వేఱుగఁ గంఠమాలయేల?

విరా—నేను జేసిన యీసత్కారము మీరొనర్చిన యుపకృతికిఁ దగినదికాదు. కొండంత దేవరకుఁ గొండంతపత్రి యెవ్వరు సమర్పింపఁగలరు?

కంకు—తనయేలిక కయి ప్రాణములు డాపక పోరాడుట భృత్యసామాన్యధర్మము. అంతకంటె మే మధికముగాఁ జేసిన దేది యు లేదు. స్వకృత్యమును నిర్వహించిన మమ్మింత పొగడనేల? ఈ యపూర్వసమ్మానము దేవరవారి గుణగ్రహణ పరాయణతను దెలుపునుగాని మాయర్హతను గాదు.

విరా—ఈవిషయమున మన మేకీభవింపఁజాలము. అది పోనిమ్ము. దేవిని జెఱగొనవచ్చిన యాదురాత్ముఁడు ప్రాణములతో దప్పించుకొని పోఁగలిగెనా?

కంకు—వంటయిల్లు చొచ్చినకుందే లెందుఁ బోఁగలదు? అదె యానరపశువును మనసైనికు లిట కీడ్చుకొని వచ్చుచున్నారు.

విరా—క్షణకాలము వానిని దూరముగా నుండనిండు. మన వలలుఁడును దామగ్రంథియు సుశర్మనిటఁ గొనివచ్చుచున్నారు—ఓధనగుప్తా! మేము మరలఁ బిలిచినదాఁక నీ వించుకతడ వావలికిఁ బోయి యాదుష్టునికడ నేమఱక కాచి యుండుము.

ధన—చిత్తము. (అని పోవుచున్నాఁడు)

కంకు—ఆసుశర్మ యెట్లు బెదురుగదిరి వడఁకుచున్నాఁడో!

[అంతట వలలదామగ్రంథులతో సుశర్మ ప్రవేశించుచున్నాఁడు]

విరా—(లేచి యెదురుగాఁబోయి) "ఓహోహో! సుశర్మ మహారాజులవారా? దయచేయుఁడు. బహుకాలదర్శనము! ఏలినవారెప్పుడును బగవారికి లోఁబడువారు కారుగదా?" ఇది యింతకు

మున్ను దేవరవాణ నాకుఁ జేయ ననుగ్రహించిన సమ్మానమునకుఁ బ్రతిసమ్మానము.

సుశ—(తనలో) దీనికేమి యుత్తరము చెప్పను? ఇప్పుడు భీతిచేత నాయొడలు వడఁకుచున్నది. నాలుక తడఁబడుచున్నది, గుండెలు కొట్టుకొనుచున్నవి. అయినను గాంభీర్యము తెచ్చుకొని తగినసమాధానము చెప్పి నిక్కపు ధైర్యశాలివలె నటింపఁ బ్రయత్నించెదను. (ప్రకాశముగా) ఓరీ! నృపాధమా! ఇంతలోనే నీ కీ కండకావర మేటికి? గడియక్రిందటి నీయవస్థను స్మరణకుఁదెచ్చుకొని మఱి మాటాడు. విధిదోషముచేతఁ బరాభూతుఁడైన వీరపురుషునిఁ బరిహసించుట యుత్తమక్షత్రియ లక్షణముగాదు. ఇట్లు పరిహాసము చేసినంతమాత్రముననే నీ వధికుఁడవు కావు.

విరా—"నీ నోటికడ్డులేదుగనుకఁ గావలసినన్ని దురుక్తుల నిప్పుడే ప్రేలుము. ఱేపు నీజిహ్వ నీకువశముగాదు. తెల్లవాఱిన తరువాత నీవు మరల సూర్యునిముఖమును జూడఁబోవు."

సుశ—(తనలో) ఇతఁడన్నంతయుఁ జేయునేమో! ఏమిచేయుదును? హాదైవమా నా కెట్టిగతి తెచ్చిపెట్టితివి! ఓధైర్యమా! నన్ను విడనాడి పోఁబోకు. (ప్రకాశముగా) స్వపౌరుషముచేత నన్నుగెలువఁజేతఁగాక యన్యుఁడు లోఁబఱిచినప్పుడు నాముందఱ సిగ్గుమాలి యీగర్వోక్తు లేల ప్రేలెదవు?

విరా—ఓరోరిదురాత్మా! నన్నింతకమున్ను మూర్ఛితునిఁ జేయుట నీపౌరుషమో నీసేనాని యైనవిక్రమభుజుని పౌరుషమో స్మరణకుఁ దెచ్చుకో. ఆసుకృతాత్ముఁడు వీరస్వర్గమును జూఱఁగొనఁగా, 'పాపీ చిరాయు' వన్నట్లు నీవు బ్రతికి లజ్జలేక యాతని పౌరుషమును నీపౌరుషమునుగాఁ బరిగణించుకొనుచున్నావు.

సుశ—నేను బాపాత్ముఁడనా! ఏమియీయున్మత్తప్రలాపములు!

విరా—నావి ప్రలాపములో యమోఘవాక్కులో యిప్పుడే తెలిసికోఁగలవు. త్రుటికాల మోర్చియుండుము. పాపాత్ముఁడ వన్న నీ కెంత కోపము వచ్చినది! ఆపదలో నున్నప్పు డన్యకళత్రమునకు ద్రోహము దలఁచిననీవు పాపాత్ముఁడవుగాక సుకృతాత్ముఁడ వగుదువా! ఔనౌను! నేనే చెప్పఁదలఁచితిని. ఈరాత్రియే విగతప్రాణుడవు కాను న్నందున, 'సుకృతీగతాయు' నన్నట్లునీవుసుకృతాత్ముఁడ వేయగుదువు?

సుశ—నిరాయుధుఁ డయి చేతఁ జిక్కి యున్న యరాతిని జంపఁబూనుట పౌరుషముగాదు, ధర్మమును గాదు.

విరా—ఇది యింతకుముందు నీవలన నేర్చుకొన్న పౌరుషమే. నీవు నేర్పిన నీతిని నీవిషయముననే ప్రయోగింపవలెను. దుష్టులన్యుల విషయమున ధర్మమును దలఁపకపోయినను స్వవిషయముననైనను ధర్మమును బేరుకొందురు. నీవు నేర్పిన ధర్మం మిం కొకటి గలదు. నీకు సుకృతత్వసిద్ధి యగునప్పుడు నీబంధువులు నీవద్దనుండి వేడుక చూచి సంతోషపడవలెనుగాదా? -ఓభటులారా! ఈతని మరణ మహోత్సవ సందర్శనార్థ మయి యంతఃపుర కాంతలను జెఱగొన నేతెంచిన మహానుభావుని నీతని తమ్ముని నిటకుఁ దోడ్కొని రమ్మని మన ధనగుప్తునితోఁ జెప్పి రండు.

భటులు—మహాప్రసాదము. (అని పోవుచున్నారు.)

విరా—సుశర్మా! నీనీతి.నీవు మఱచిపోకు. భ్రాతృవధోత్సవ ముతో నీతమ్మునికి నేత్రపర్వము చేయఁదలెచుగదా? చెప్పు.

సుశ—(మేను చెమర్ప వడఁకుచున్నాఁడు.)

విరా—ఏమి? నోట మాటరా దేమి? ఓరిపిఱికిపంచా! ప్రాణ భీతిచేత గాలిలోని పూరిపుడకవలె నెట్లు కంప మొందుచున్నావు!

సుశ—(గద్గదస్వరముతో) దయ-దయ-దయయే పరాక్రమ శాలి కలంకారము.

[బద్ధుఁడయిన సత్యసేనుఁడు ధనగుప్తాదుల వెంటఁ
బ్రవేశించుచున్నాఁడు.]

సత్య—(తనలో) ఇది యేమి! విజయశాలియైన నాయన్న గారే యిచ్చట ఘనపాశబద్ధు లయి విజితుఁ డైనవిరాటరాజు ముందఱ నిలిచి యున్నట్లు కనఁబడుచున్నారు! ఇది యేదో యింద్ర జాల మయి యుండవలెను.

ధన—ఓరీ! మదాంధా! మహారాజపత్నిని జెఱఁగొన నిన్ను బనిచిన నీయన్నగారియవస్థను గన్నులారఁ జూచితావా?

సత్య—ఇప్పుడు నాకన్ను లేనన్ను మోసపుచ్చుచున్నట్లున్నవి. ఇదియేదో రాక్షసమాయ-మ హేంద్రజాలము-ఇదికనుకట్టే కాకుండిన పక్షమున, జాముక్రింద భండనోద్దండవిజయవిరాజితుం డయి నిండు కొలువుండి పరాజితుం డయి పట్టువడిన విరాటున కర్హదండనము విధింపఁ గూరుచుండియుండిన యితఁ డింతలో నావిరాటునకే భృత్యు డయి మ్రోల నిలుచుండుట యెట్లు సాధ్య మగును?

ధన—ఓసత్యసేనా! నీకన్ను లే నిన్ను మోసపుచ్చుచున్న వేమి? నీవు సత్యసేనుఁడ వగుదువో కావో చూచుకో. నీవు సత్యసేనుఁడవు కాకుందువేని, యితఁడు నీయన్న సుశర్ముఁడును గాకపోవచ్చును.

విరా—ఓసుశర్మా! నీవు పరలోకయాత్రకుఁ బోవనున్నావని విని నీతమ్ముఁ డితఁడె నిన్నుఁ జూడ వచ్చియున్నాఁడు. మరణమునకు ముందు నీవు నీభార్యకుఁ జెప్పవలసిన పలుకు లేవేని గలవేని యిప్పుడే యీతనితోడఁ జెప్పిపంపుము.

ధన—స్వామీ! ఈతనికి భ్రాతృస్నేహము మెండు. ఇతఁ డగ్రజుని విడిచి యరనిమిషమైన నుండజాలఁడు. యమమందిరమున కన్నకుఁ దెమ్మనుచూపుచు నాతనితోడనే యితఁడు ముందు నడుచును.

సుశ—ఓపలువలారా! పరాజితు డయియున్నవానిని బరిహ సించుట శూరధర్మము గాదురా.

ధన—ఓహో! నీనోటినుండి యెంత దొడ్డమాట వచ్చినది! పట్టుపడిన నన్నుఁ బరిహసించినప్పు డీధర్మ మెందుఁ బోయినది?

విరా—నీధర్మము స్వాచరణమునందు నీకుఁ బనికిరాకపోయి నను బరోపదేశమునకయినను బనికి వచ్చుచున్నది. మే మన్నది సత్యము కాక పరిహాస మయినట్లు నీవేల తలఁచెదవు? నీమరణవిష యమున నీ కింకను సందేహమున్న—

సుశ—(తనలో) ఇతఁడు నన్ను వధింపఁ గృతనిశ్చయుఁడయి యున్నట్టే కనఁబడు చున్నాఁడు. ఓధైర్యమా! నేను బ్రార్థించు చున్నను నావద్దనుండక పరుగెత్తెద వేమి? ఓభయమా! నిన్నెవరు రమ్మన్నారు? నామనసు చొచ్చి యిట్లు కలఁచెద వేమి? (ప్రకాశ ముగా) తమ్ముఁడా! నోటమాట—

సత్య—(తనలో) ఇతఁడు నిశ్చయముగా నాయన్నగారే. వీ రన్నమాట యసత్యము కాదు. (ప్రకాశముగా) అన్నయ్యా! తడఁ బడఁబోకు. వీరితో నీపక్షమున నేను మాటాడెదను.—ఓకరుణాళు లారా! చేతఁజిక్కినశత్రువునుజంపఁ జూచుటమీకిది యేటిపౌరుషము?

ధన—నేను త్తరము చెప్పెదను. ఓభటులారా! "వీఁడు సురా పానము చేసిన వానివలెఁ బ్రేలుచున్నాఁడే"

సత్య—తులువమాటలాడుటకుమీ కిప్పుడుసమయముమవచ్చినది.

ధన—ఓభటులారా! "వీని కేమైన నున్మాద మున్నదా?" "ఇట్లు కాఱుచు ప్రేలుచున్న యీతులువనాలుక కోయక కత్తిచేతఁ బట్టుకొని యూరక చూచుచున్నారేమి?" ఓరత్నసేనా! నన్నెఱుఁగు దువా? నేటిప్రాతఃకాలమునం దీమాటలు నీచే ననిపించుకొన్న ధనగుప్తుఁడను నేను. నీమాటలు మరల నీకప్పగించివేసినాను. నే నిప్పుడైనను నీకు స్మరణకు వచ్చినానా?

సుశ—(తనలో) వీఁడు మే మప్పు డన్నమాట లెత్తిపొడుచు చున్నాఁడు. ఇఁక మాటకుమాట యని వీరిని గదలించినఁ బ్రయో జనము లేదు. మంచిమాటలతో వీరిమనసు కరఁగింపఁ జూచెదను. (ప్రకాశముగా) ఓవిరాటమహారాజా! నీ వేమో కరుణాసాగరుఁడ వని చెప్పుకొందు రే? నీకీ నిష్కరుణత యెక్కడనుండి వచ్చినది?

సుధే—(రహస్యముగా) ఓప్రాణవల్లభా! నీవీతనిప్రాణములు గొనఁగూడదు.

విరా—(రహస్యముగా) ఓహృదయేశ్వరీ! ఎప్పుడును నేనీతని వధింపఁ దలఁచుకోలేదు. వినోదార్థముగాఁ గొంతతడ వీతని నొక యాట యాడించి విడిచిపెట్టెదను. నీవితనిపక్ష మవలంబించి మా టాడు చుండుము. (ప్రకాశముగా) ఓసుశర్మా! కరుణయన్న దివ్య వాక్కు నీనోటనుండి వచ్చి చెడిపోవుచున్నది—ఓప్రాణేశ్వరీ! "పా పము! ఈదొరగారి భార్యకు పసుచుఁదనముతోనే వైధవ్యదుఃఖము సంభవించుచున్నదిగదా!"

సుధే—ఓప్రాణనాథా! మనమూలమున మనశత్రువునకు సహిత మట్టివిపత్తు పుట్టరాదు.

కంకు—(రహస్యముగా) అమ్మా! నీవు నీపూనికను విడువక యేలాగుననైన నీతని విడిపింపుము.

సుధే—(రహస్యముగా) ఓకంకుభట్టారకా! దయార్ద్రహృద యులైన రాజుగారిచిత్త మెన్నఁడైనఁ గ్రూరకార్యమునకుఁ జొరఁ బాఱునా? మీరు నిర్విచారముగా నుండుఁడు.

సుశ—అమ్మా! ఈసభలో నీకొక్కదానికిఁ దక్క మఱి యెవ్వరికిని నామీఁద దయపుట్ట కున్నది.

వలలుఁడు—ఏలపుట్టును? ఆమెవలె నిక్కడ మఱియెవ్వరును స్త్రీలులేరు. పిఱికితనముచేత స్త్రీతో సమానుఁడవు నీవు మఱి

యొకఁడ వున్నావు. మీయిద్దఱికిని దక్క నిక్కడ మఱియెవ్వరికిని నీమీఁద జాలిపుట్టదు.

సుశ—(తనలో) ఓ భాగ్య దేవతా! నన్నీతనిచేతఁ జిక్కించిన చెఱుపుతోఁ దృప్తినొంది యీతనిడెందమందు నామీఁద దయనైనఁ బుట్టింపరాదా? నమ్మించి చెఱిచిన యీభాగ్య దేవత నేల పేరుకొన వలెను?

క. భాగ్యమునె నమ్ముకొన్న య
భాగ్యుఁ డెవఁ డభీష్టసిద్ధి పడయంగలుగున్
భాగ్యము నమ్మించి ననున్
భోగ్యావసరమున మోసపుచ్చదె నేఁడున్?

ఇఁక నే నీరాజునే కనికరము పుట్టునట్లు ప్రార్థించెదను.

విరా—ఓసుశర్మా! పాపపరిహారార్థముగా నీశ్వరప్రార్థనము చేసి యాసన్నమరణమునకు సంసిద్ధుఁడవు కమ్ము.

సుశ—(తనలో) ఎప్పుడో రోగములచేత విడువవలసిన యీ శరీరము నిప్పుడే విడుచుట కోర్చుకొందునుగాని యావలి నరకబాధలను దలఁపునఁ దెచ్చి నామనస్సు నన్ను భయపెట్టుచున్నది. ఏమి! ఈమనోవేదన! నామనస్సులో నిప్పుడు వేయి తేళ్ళును జెఱ్ఱులును ప్రాఁకుచున్నట్టున్నవి. (ప్రకాశముగా) ఓరాజా!—(అని తలవంచుకొనుచున్నాఁడు)

విరా—ప్రేలుమొగము వేసికొనుటయే కాని మొగము పైకెత్తి దేవుని వేఁడికోవేమి?

వల—హృదయము పాపములతో నిండియున్నప్పుడం దీశ్వరునిఁ బ్రవేశపెట్టుట కవకాశ మెక్కడ నుండును?

క. సుజనుఁ డెపుడైన దేవుని
భజియించుచుఁ బ్రీతితోడఁ బ్రాణము విడుచున్

కుజనుఁడో యీశ్వరభయమున
నిజముగఁ జా వన్న మేటినెగులునఁ బొగులున్.

ఈశ్వరసాన్నిధ్యమునకుఁ బోవ హర్షము నొందుపుణ్యాత్ములు వేఱు; ఈపాపపుబొందిని వదలలేక యీశ్వరునికి దూరదూరములఁ దొలఁగుచుండు వీనివంటివారు వేఱు. ఈపాపాత్ముని కీశ్వరుని పేరెత్త నోరాడునా?

సుశ—(తనలో) ఓలజ్జా! భయమునకుఁ దోడు నీవుకూడ నన్నుఁ జేరి బాధించుచున్నా వేమి? ఛీ! నన్ను విడిచి తొలఁగిపో. (ప్రకాశముగా) ఓమహారాజా! ఈదీనునియెడఁ గరుణచూపుము. నీ వేయీశ్వరుని ప్రార్థింప నన్ను నియోగించితివో యాయీశ్వరునికిఁ బ్రీతికరముగా వర్తింప నిన్నుఁ బ్రార్థించెదను.

క. పరమాపకారి యంచును
గురు కోపమునఁ బగ తీర్పఁ గోరుటకంటెన్
బరమేశ్వరునికి రిపునెడఁ
గరుణను జూపుటయె ప్రీతికర మగుఁ జుమ్మా.

క. నీ విట్టెడ దయ చూపుము
దేవసమానుఁడవు గాఁగఁ దివిరెద వేనిన్
దేవగుణమె దయ ధరణిన్
గేవల రాక్షసగుణంబె నిర్దయత కడున్.

వివేకియైనవాఁడు తొలుదొల్తఁ గోపమును నిర్మూలముచేయవలెను.

ఉ. కోపముతోడఁ దుల్యమగు ఘోరతమాఘము లేదు; కోపమే
పాపులఁ జేయు మానవుల; భ్రాతల మాతలఁ జంపఁ జేయు; స
ద్రూపహితోపదేశములఁ దోఁపఁగనీక, నశింపఁ జేసెడున్
జూపును విన్కినిన్ గనులు శ్రోత్రములుం గలవారి కేనియున్.

(అని కన్నీరు విడుచుచున్నాఁడు)

కంకు—(తనలో) ఈదివ్యవాక్యము లీక్రియాశూన్యునినోటి నుండి వెడలినప్పుడే యింత శ్లాఘ్యములుగా నున్నప్పుడు క్రియా వంతుల నోటినుండి వచ్చినవ్వు డెట్లుండునో! లోకములో నెట్టి దుష్పథవర్తులును దెలిసియే యింద్రియములకు దాసులగుదురుగదా!

సుధే—ఓప్రాణనాథా! దీనులకన్నులనుండి వెడలు నీరు చూచి నేను గహింపలేను. మీకు నామీఁద దయగలదేని యీతని కన్నుల నుండి వెడలి పాఱుచున్నట్లుగా మీహృదయమునుండి కరుణామృత రసప్రవాహమును బాఱించి యీతనికుటుంబమును సంతోషవార్థిం దేల్పుఁడు.

కంకు—ఓసుశర్మా! నీవు చేసిన యుపకారమునకుఁ బశ్చాత్తాప పడి మీదాసుఁడనని రాజుగారిని శరణు చొరుము. శరణాగతరక్షణ దీక్షాదక్షుఁడు.

వల—ఈకఠినాత్ముని కన్నులనుండినీరు భయముచేతఁ గాలువ కట్టుచున్నది కానియును తాపముచేతఁ గాదు. వీఁడుదయనీయుఁడు కాఁడు.

సుశ—నాకన్నులనుండి నీరను తాపముచేతనే వెడలుచున్నది.

సుధే—ఓమనోనాయకా! ఇతఁడన్నట్లీ బాష్పధారలు పశ్చాత్తాపముచేతనే వెడలుచున్నపక్షమున గంగాప్రవాహమువలె హృదయాంతరాళమందలి పాపమును గడిగి వేసియే వెడలిన వనుటకు సందేహము లేదు. అందుచేత శుద్ధుఁడైనయితఁ డిప్పుడు దేవర వారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడు.

విరా—ఓసుశర్మా! దేవిగారిదయ వలన నీవు బ్రతికిపోయినావు. ఇఁక నీవారివద్దకు నీవు పో. (అని బంధములు విడిపించుచున్నాఁడు.)

సత్య-ఓమహారాజా! ఇక్కడమీ దాసుఁడుమఱియొకడున్నాఁడు

విరా—నిన్నును క్షమించినాము. ఓసుశర్మా! నేను మొదటి నుండియు నిన్నుఁ జంపఁ దలఁచుకోలేదు. నీధైర్యాదులను శోధించి నీకును నాకును గలభేదమును జూపి మఱి నిన్ను విడువవలయునని

యించుకసే పీకపటనాటకమును నడిపినాను. పశ్చాత్తప్తుఁడవగుటచే నీ విప్పుడు నాకు శత్రుఁడవుగాక పరమమిత్రుఁడ వయినావు. మాతో వచ్చి నీవును నీతమ్ముఁడును మాయింట నాతిథేయుసత్కారములొంది మఱిపోండు. ఇది నాహృదయపూర్వక మైనప్రార్థన.

సుశ—ఓమహారాజా! కత్తిచేతఁగాక నీయాదరముచేత నిజముగా నే నిప్పుడు చంపఁబడినవాఁడ నయినాను. చంపవలసిన శత్రువే తనయెడ దయ చూపుటకంటె మానవంతునకు మరణము వేఱే మఁండును?

విరా—సుశర్మా! ఈయువమానదుఃఖము మనసునం దుంచుకోక మఱచిపొమ్ము. ఈపరాభవమరణముచేత నీశ్వరుఁడు నీకు నీతిమంతమయిన నూతనజన్మమును బ్రసాదించుగాక! ఓకంకుభట్టా! ఈరాత్రి సేనలను సుఖనిద్ర చేయ నియమింపుము. మనమును గొంతసేపు విశ్రమింతము.

కంక—దేవర యాజ్ఞాపించినట్లు చేసెదను. సేనలను దోడుకొని వచ్చుట కయి పురమున కరిగియున్న మనశతానీక శంఖాద్యనుజతనూజులకీవిజయవార్తను దెలుపధనగుప్తునినిప్పుడపంపవలెను.

విరా—ధనగుప్తా! నీ విప్పుడ పోయి సేనలతోఁ బనిలేదని మన శతానీకసూర్యదత్తాదులతోడఁ జెప్పి వారిని వాఁగింపుము.

ధన—మహాప్రసాదము. (అని పోవుచున్నాఁడు.)

విరా—ఓవలలా! దామగ్రంథీ! తంత్రీపాలా! నానిమిత్తము మీ రత్యంత ప్రయాసపడి యున్నారు, విశ్రమింపఁ బొండు.

వలలాదులు—కార్యసాఫల్య మయినందున మాశ్రమను మేము పరిగణింప దేవర వారిఁక విశ్రమింప విజయంచేయవచ్చును.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

595

వివేకదీపిక

596

వివేకదీపిక

ప్రథమాంకము

---

౧. రంగము—సీతారామయ్యగారి గృహములోని చావడి.

[తనలోఁదానే యేమోమాటాడుకొనుచు నారాయణమూర్తి ప్రవేశించుచున్నాఁడు.]

నారా—(తనలో) నేనిప్పుడెంత క్రూరకృత్యమును చేయఁదలఁచుకొనుచున్నాను. ఏకగర్భవాసమునఁ బుట్టినదానిని చంపుటయన్న నేదో మనస్సులో భీతిపుట్టి దేహముకంపించుచున్నది. నాచెల్లెండ్రందఱిలోను జానకి బహుసాత్వికురాలు గుణవంతురాలు. అయినను చెట్టు చెడుకాలమునకు కుక్క మూతిపిందె యన్నట్లు నేఁటి కాలమునకు దానికిట్టి దుర్బుద్ధి పుట్టినది కాఁబోలును. ఏమోదాని యేడుపది యేడుచునని యింతవఱకును సహించి యూరకుండుచునే వచ్చినాఁడను. ఇప్పుడింటనున్న పుణ్యస్త్రీలను గూడ జారత్వమునకు దింపనారంభించినది. ఇంక నేనిది చూచి సహింపలేను. మొన్న గోపాలశాస్త్రిగాఁడు నాభార్యతో గుసగుసలాడుచు నొంటిగా పడకగదిదొడ్డిలోఁ గనఁబడ్డప్పుడే వానిని చావఁగొట్టి సాగనంపినాను. ఆ దెబ్బలచేత వాఁడింక పదిదినములదాఁక మంచముమీదనుండిలేవఁడు. జానకి యాలోచనలేక యీపని జరిగినదనితోఁచదు. మగఁడుగల యిల్లాండ్రనుగూడ పాడుచేయ మొదలు పెట్టినది గనుక, ఏపాపమునకైన నొప్పుకొని యిప్పుడు నేను కొనితెచ్చిన పాషాణము దీనికే వస్తువులోనో పెట్టి లోపలికిచ్చెదను. కులమున కపకీర్తి తెచ్చిన

యిటువంటి పాడుముండలు బ్రతుకటకంటె వేగిరముచచ్చుటయే మేలు. ఇంటనున్న యీ దుష్టాంధ్ర సాహాయ్యములేక నేనెట్లు జానకికి విషము పెట్టఁగల్గుదును? నా యభిప్రాయము అమ్మతోఁగాని నాన్నగారితోఁగాని చెప్పుదునా? చెప్పినను కడుపునఁ బుట్టినదానికి విషము పెట్ట వారొప్పుకొందురా! అరుగో బాబయ్యగారీ లాగున వచ్చుచున్నారు. మఱియొకవిధముగా నీ ప్రస్తావనము నాయనయొద్దఁ దెచ్చిచూచెదను.

[సీతారామయ్యగారు ప్రవేశించుచున్నారు]

సీతా—ఏమోయి నారాయణమూర్తీ! హారతికర్పూరమును తీసికొనివచ్చుటకు వెళ్ళి యింత సేపాలస్యము చేసినావు? ఇప్పుడైన తీసికొనివచ్చినావా? మఱచిపోయినావా?

నారా—(తనలో చెప్పుదునా?)

సీతా—(తనలో) వీఁడేమో రెండుదినములనుండి పరధ్యానముగా నుండి యెప్పుడును తనలోఁదానేమో యాలోచించుకొనుచున్నట్లు కనఁబడుచున్నాఁడు. వీనికి లోపల నేదోగొప్ప యాలోచన యున్నది. (బిగ్గఱగా) కూటాడ వేమి? హారతికర్పూరము తెచ్చినావా?

నారా—ఏమిటి? హారతికర్పూరమా? ఇదిగో తెచ్చినాను. (అని యొక పొట్లమును చేతికిచ్చుచున్నాఁడు.)

సీతా—(విప్పిచూచి) ఇది హారతికర్పూరము లాగున లేదే—

నారా—(తనలో) మనస్సు చెదరియుండుటచేత నొకపొట్లము నియ్యఁబోయి మఱియొకపొట్లము నిచ్చినాను. (అని చప్పున తండ్రి చేతిలోనుండి యాపొట్లమును బుచ్చుకొని బిగ్గఱగా) పొరపాటునమఱి యొకపొట్లము నిచ్చినాను. ఇదిగో ఇది హారతికర్పూరము. (అని రెండవపొట్లమును చేతికిచ్చుచున్నాఁడు.)

సీతా—(తనలో) ఈవేళ వీనిస్థితిచూడఁగా నేమోవింతగాఁ గనఁబడుచున్నది. మనసులో నేమో యాలోచించుకొనుచు పరధ్యానముగానుండి రెండవమాఱడిగిన దాఁక నామాటనే వినిపించుకొన్నాఁడుకాఁడు? హారతికర్పూరమడిగిన మఱియొక పొట్లమును చేతిలోఁబెట్టి తత్తరపడి చేతిలోనుండి పుచ్చుకొన్నాఁడు. హారతి కర్పూరమును పుచ్చుకొని తిన్నగాఁ లోపలికిరాఁక నడవలో గూరుచుండి యేమో యాలోచించుచున్నాఁడు. సంగతి యడిగిచూచెదను. (బిగ్గఱగా) నారాయణమూర్తీ! నీవు మొదట నా చేతికిచ్చినపొట్ల మేమిటి? ఒంటరిగాకూరుచుండి నీ విప్పుడాలోచించుచున్న సంగతి యేమిటి?

నారా—(తనలో) ఈయన తనంతట తానే నన్నడుగుచున్నారు గనుక చెప్పివేసెదను. (బిగ్గఱగా) పొట్లమా—పొట్లమా—పొట్లమాండి? అదిపటికపొడుము—పటికముక్కలు. తమతో వేఱే యొకసంగతి మనవి చేయవలెను. ఒకనిమిషము దగ్గరగావచ్చి కూర్చుండండి.

సీతా—ఏమో చెప్పు (అని చెంతఁజేరి కూరుచున్నాఁడు)

నారా—మన యింటజరుగుచున్న యల్లరి చూచుచున్నారు గదా? మనకు నలుగురిలోను తలయెత్తుకొని తిరుగుటకు వల్లపడకున్నది. ఎప్పుడు నేదోషము నెఱుఁగని సద్వంశమున నాఁడుముండలమూలమున నేఁటికాలమున కపకీర్తిపాలు కావలసిన యోగ్యతటస్థించినది.

సీతా—నీవన్నది నాకు తెలిసినది. అన్నపూర్ణసంగతి చెప్పుచున్నావు. అదియు మనవంటబ్రాహ్మణుఁడు కామఁడును ముట్లగదిలో నుండఁగా పట్టుకొని మొన్నరాత్రికుఱ్ఱవాండ్రేమో యల్లరిచేసినారని మీఅమ్మ నాతోఁజెప్పఁగా మేమిద్దఱము నింతసేపు దుఃఖించినాము. దానిగతి యీలాగుననుండఁగా మనమేమిచేయఁగలము? మగనికిని

దానికిని మూడేండ్లు హెచ్చుతగ్గుగాఁజూచి పెండ్లిచేయఁగా వాఁడు వివాహమయిన మూడవయేటనే కాలముచేసినాఁడు.

నారా—దాని గ్రహచారమునకు మనమేమి చేయఁగలము? లోకములోనివారివలె మీరు వందలును వేలును పుచ్చుకొని చిన్న దానిని ముసలివానికిని తెగులుగొంటునకును గట్టిపెట్టలేదుగదా? దాని కర్మమున కెవరుకర్తలు? పూర్వజన్మసుకృతముచేత దాని కీజన్మమున విధవాత్వము సంభవించినది. ఎవరికయినను బుద్ధితిన్నగా నుండవలెను.

సీతా—మనముకూరుచుండి మాట లెన్నియైనను జెప్పవచ్చును గాని వయసులోనున్న వారికి కామము జయించుట మాత్రము శక్యముకాదు. నీవు రెండవభార్యయెదిగి కాపురమునకువచ్చులోపల రెండు సంవత్సరములు తిన్నగానుండలేక మూడుసారులు రోగములు తగిలించుకొని మంచమెక్కినావు. రజస్వలయగుట మూడుమాసములకే దానిమగఁడుపోగా నిత్యమును విధవకూఁతురింట నుండఁగాఁజూచి దుఃఖముసహింపలేక ప్రేరుసుకోసివేసి దానిని మూడునెలలత్తవారియింటనే యట్టెయుంచినాను. అక్కడనున్న కాలములో మంచి మాటలాడి దాని మఱఁదియే దానిని భంగపఱచి వలలో పడవేసినాఁడని వదంతికలిగినది. తరువాత నత్తవారు దానికితిన్నగాతిండియే పెట్టక బట్టయేయియ్యక సకలబాధలునుపెట్టి యొకనాఁడు మధ్యాహ్నమిక్కడకుఁ దీసికొనివచ్చి దిగవిడిచిపోయినారు. పడుచుతనములోనున్న విధవ యింటనుండెనా బంధువులకందఱకును దానినడత నెట్లుకాపాడుదుమాయనియొకవిచారము; అదికొంచెముదుర్వృత్తిలో ప్రవేశించియేమైనఁదెచ్చుకొన్నయెడపాపమును దాచినలుగురికన్నులు ననేలాగునఁగప్పుదుమాయని మఱియొకవిచారము. అప్పుడునీ చెల్లెలు మూడు నెలల గర్భముతోనున్నదట. మన యాఁడువాండ్రుగర్భవిచ్ఛి

త్తునకై యేమిపాట్లుపడినారోగాని యది యప్పుడు నెలదినములు తీసి కొని చచ్చిబ్రతికినది. కులమునకు వెఱచి తల్లిదండ్రులు తమ బిడ్డల విషయములో నెన్ని పాతకములకయిన లోఁబడవలెను.

నారా—బిడ్డలో బిడ్డలోయని కొట్టుకొనువారి కెన్ని దేవతలకు మ్రొక్కుకొన్నను సంతానము గలుగదు. ఎప్పుడును సంతానము గలుగఁజేయువలదని నిత్యమును కోటివేల్పులకు మ్రొక్కుచుండు బాలరండల కొక్కమాఱు కక్కూర్తిపడఁగనే కడుపునిలుచును. రండాగర్భము నిలిపియుంచుటయు సిగ్గుపాటే: విచ్ఛేదము చేయుట యంతకంటెను సిగ్గులచేటు.

సీతా—అప్పు డత్తవారిమీఁద నాకు దేహముమండి కొన్ని నెలలు పోయినతరువాత దీనిచేత బావగారిమీఁద న్యాయసభలో జీవనాంశమునకు వ్యాజ్యము వేయించినాను. అప్పు డేమిచెప్పను? తమ్మునిభార్యకు జీవనాంశము లేకుండఁ జేయుటకయి తనకు పిత్రార్జితమయిన సొత్తేమియుఁ జెందలేదనియు తనయొద్దనున్న సొమ్ము స్వార్జితమనియు వాదించెనుగాని న్యాయాధిపతిసంవత్సరమునకు పది యేనురూపాయలు భరణమిచ్చున ట్లాతనిమీఁద తీర్పుచేసినాఁడు. చూచితివా! లోకములో మగఁడుచచ్చి యేడ్చుచున్న యనాథల కొక్కపూట తిండికి సగముసరిపోవు జీవనాంశ మియ్యవలసివచ్చునని వారిమగల భాగమునంతయు వేసికొని తమది స్వార్జితమనియు వారు వ్యభిచారిణులనియు వాదించి జ్ఞాతులెట్టి యక్రమములకు లోఁబడుదురో!

నారా—అవును. మనలో భర్తలు తమ యనంతరము భార్యల సుఖజీవనములకయి యాధారము నేర్పఱిచి పోకుండుట నష్టకరముగానే యున్నది. అయినను స్వల్పజీవనాంశ మేర్పడుట బాల విధవల కామమును తగ్గించుటకొక సాధనముగా నున్నందున, ఒక

పక్షమున నాకది యుక్తముగానున్నట్టే తోచుచున్నది. ఇప్పుడు చాలీచాలని యొంటిపూట తిండితోనే విధవలలో నెన్ని ఘోరకృత్యములైన జరగుచున్నవి. ఇఁక బాలవిధవలకే రెండుపూటలును కడుపునిండ తిండియున్న వాండ్రను పట్టపగ్గము లుండునా?

సీతా—వారికిబొత్తిగా తిండిలేకపోయినను జీవించియున్నంత వఱకు స్వభావసిద్ధమయిన కామము వారిని విడువనేరదు. సమస్తమును దెలిసి, యింద్రియనిగ్రహముచేసి, సంసారబంధమును కోసివేసి దేహమును కృశింపఁజేసి, అడవులలో కందమూలఫలాదులు తినుచు తలక్రిందుగా తపస్సుచేయు మహర్షులే యప్పుడప్పుడు కామవికారమునకు లోనయి వివేకము పోగొట్టుకొని స్త్రీలవలలో పడుచుండఁగా విద్యాగంధమే లేకపోవుటచేత యుక్తాయుక్తవివేకముచాలక మూఢురాండ్రయి యుప్పును పులుసును దినుచు మంచివయసులోనుండి పట్టణములలో, గాపురముచేయు ననాథయువతులకు కామబాధకు లోనుగాకుండ తప్పించుకొనుట శక్యమగునా? బలవంతములగు నింద్రియములు మనస్థైర్యముగల విద్వాంసులనే యాకర్షించుచుండఁగా, వాని ఢాకకోర్చుటకింక నబలలెంతటివారు? అదియెఱిఁగియే పూర్వము వ్యాసమహర్షి "బలవానింద్రియగ్రామో విద్వాంసమపికర్షతి" యను సత్యవచనమును వ్రాసియున్నాఁడు. అందువిషయమయిన కథను నీవు విన్నావా?

నారా—వినలేదు. దయచేసి కొంచెము చెప్పుఁడు.

సీతా—ఆ మహర్షియొక్క శిష్యులలో నెల్ల విద్వదగ్రగణ్యుఁడయిన జైమినిముని పైవచనమును గురునింట లేని సమయమునఁ జూచి గురువుగా రబద్ధమును వ్రాసినారనుకొని "విద్వాంసం నాపకర్షతి" యని దానిని దిద్దెను.

నారా—తరువాత నేమి జరిగినది?

సీతా—గురునింటికి వచ్చి తన శిష్యుఁడన్లు దిద్దుట తెలిసి కొని యాతని మనోదార్ఢ్యమును పరిశీలింపఁ గోరి యొక నాఁటి సాయంకాలమునఁ దానొక స్త్రీవేషమును వేసికొని సమస్తాభరణము లను ధరించుకొని మేలిముసుఁగుతో సంజవేళ నా జైమిని యొద్దకు వచ్చి యాయాశ్రమమునం దనకారాత్రి పరుండుటకయి తావిమ్మని మందస్వరముతో వేడుకొని, అతఁడొక యింటినిజూపఁగా నందుఁ బ్రవేశించి దీపము వెలిగించుకొని కూరుచుండెను.

నారా—అటు పిమ్మట వృత్తాంత మేమి?

సీతా—ఆ రాత్రి గురువేవేళకు నింటికి రాలేదు. చీఁకటి పోయి కామిజనుల హృదయాహ్లాదకరముగా పిండి యాఱవోసినట్లు వెన్నెల కాయఁజొచ్చెను. వసంతకాలమగుటచే హృదయముల కామాగ్ని రవులుకొనుచు మలయమారుతము చల్లగా వీచుచుండెను. ఆశ్రమమునందలి పుష్పలతలు కమ్మతావులను వెదఁజల్లుచు నా సుందరి కొప్పులోని పూలదండల పరిమళమును తలఁపింపసాగెను. అప్పుడొంటిగా నున్నంచున నా ఋషికుమారుని మనసంతయు గదిలో నున్న సుందరీమణి మీఁద నే పోయెను. అతఁడు విద్యాంసుఁడగుటచే హృదయమును పలువిధముల మరలించుకొనుచు వచ్చెనుగాని కడపట కాముఁడే బలవంతుఁడయి యాతని నపస్కారుని జేసి తనకు లోఁబఱుచుకొనెను. ఆతఁడు కామాని యాజ్ఞకు లోఁబడి దాసుఁడయి యా సుందరియున్న గదితలుపువద్దఁజేరి మెల్లగా పిలిచెను. ఆమె పలుకకపోఁగా నంతకంత కధికమగుచున్న యింద్రియముల నిర్బంధమునకు తాళఁజాలక రాగాంధుఁడయి యొక్కసారి తలుపు తీయవలయునని బహువిధముల దీనత్వముతో ప్రార్థించి యడిగెను. అప్పుడును లోపలినుండి ప్రత్యుత్తరము రాలేదు.

నారా—అతఁ డంతటితోనైనఁ దెలివి తెచ్చుకొని యూరకున్నాఁడా? మఱి యేమైన సాహసకార్యమునకుఁ జొచ్చినాఁడా?

సీతా—కాముఁడు తనకు లోఁబడినవానిచేత నేమి చేయింపఁజాలఁడు? కాముని కఱపులకు లోనయి యా విద్వాంసుఁడు కాలహరణమున కోర్వజాలక వలపు వెఱ్ఱి తలకెక్కి నిచ్చెన వేసికొనిగోడపయికెక్కి గదిలోనికి దుమికెను. అప్పు డాతని యవస్థ నేమని చెప్పను! లోపల దీపము వెలుతురున వయసు పడుచునకు మాఱుగా నగలు తీసికొని ముసలిముని వేషముతో నున్న తన గురువును జూచి యతం డద్భుతమును భయమును సిగ్గును పెనఁగొన మాటరాక నిశ్చేష్టితుఁడయి కొంతసేపు చిత్రపు ప్రతిమవలె నిలువఁబడెను. అంత నతఁడు గురువుచేత ప్రబోధితుఁడై యచట నుండజాలక లోపలికివెంటనే వెళ్ళి "విద్వాంసమపికర్షతికర్షతికర్ష త్యేవ"యని ముమ్మాఱు వ్రాసెను. అడవులయం దినుపగోచులను కట్టుకొని యొంటిగానుండు విద్వాంసుల పాట్లే యిట్లుండఁగా నిఁక బహువిధ మాయోపాయములు పన్ని యింద్రియములకు లోఁడు దుష్టపురుషులుకూడ తమ్మాకర్షింప సుందరసుందిరములయందు వాసము చేయు ముద్దరాండ్రకు మనసు నిలుపుకొనుట శక్యమగునా?

నారా—పూర్ణముగా శక్యము కాదుగాని పెద్దవారు చూచియుఁజూడ నట్టూరకుండక బాలవితంతువులను గొంచెము నిర్బంధములోనుంచి కాచుచున్నచో వారు తిన్నఁగా నుండక యేమిచేయఁగలుగుదురు?

సీతా—పాతివ్రత్యము నీతిచేత నిలువవలెనుగాని నిర్బంధముచేత నెంతసేపు నిలుచును? ఏడుమేడలలోపలిమేడలోనుంచి చుట్టును వేయిమందిని కావలియుంచుచున్నను కొన్ని రాజాంతఃపురములలో జారత్వము జరుగుచునే యుండుటను మనము వినుచుండుటలేదా?

అట్టి రాజులే నిర్బంధముచేత వ్యభిచారమును మాన్పఁజాలకుండఁగా మనమా యింక నాపఁగలవారము? మనయన్నపూర్ణ చెడుతిరుగుళ్లు చూచి సహింపలేక మనముకొంచెము నిర్బంధపెట్టినతోడనే పూర్వమది యేమి చేసినదో చూడలేదా?

నారా—కామాతురులయినవా రేమిచేసినను జేయుదురు. వారికి సిగ్గుండునా? పాపభీతి యుండునా?

సీతా—పయివా రెవ్వరును లోపలికి వచ్చుటకు వీలులేక పోయినందున నిర్బంధమునకు సహింపలేక యొక నాఁటి రాత్రి చాకల సామిగానిని తీసికొని నగలతో లేచిపోయి యావలివీధిని శూద్రయింటఁ బ్రవేశించినది. కన్నకడుపగుటచేత నెట్టి దుర్గుణరాలయినను దానిని విడిచిపెట్టియూరకుండ మనశ్శాంతి యందఱకును దెలిసిన మఱింత యవమానమునకు హేతువగునని యెంచి వెంటనే వర్తమానము తెలిసినందున మఱునాఁటిరాత్రియే దానినిబతిమాలుకొని రహస్యముగ నింట దెచ్చిపెట్టుకొని యప్పటినుండియునదియెట్లు తిరుగుచున్నను చేయునది లేక చూచియు చూడనట్టూరకుండుచున్నాము. గట్టిగా నేమయిన నన్నచో నలుగురిలోను రవ్వయగుటయే కాక మఱునాఁడే యది వీధి కెక్కును. అది మొదలుకొని యది గర్భస్రావములను శిశుహత్యలను ప్రతిసంవత్సరము నెన్నిటినో చేయుచున్నది. మనలో వితంతువివాహములు లేకపోవుటవలనఁగదా యీయనర్థములెల్లను మూడుచున్నవని యెన్ని పాపములకయిన నొడిగట్టి సహించుచున్నాము. దాని నేమయిన నన్నచో మనగర్భవాసమునఁ బుట్టినదానిని మనమే నలుగురిలోను రవ్వచేసి యల్లరిపడుదుమనియు, అది యిల్లు విడిచి వీధికెక్కినను తెగించి నూతిలోనో గోతిలోనో పడినను మనమే యప్రతిష్ఠ పాలగుదుమనియు, ఏమియుననక లోలోపలనె కృశించి కుములుచు దుఃఖమునుమ్రింగు

కొనుచు పయికందటితోపాటు తిరుగుచున్నాము. ఎక్కడకు వెళ్ళినను, ఎవ్వరేమి యెత్తిపొడుపుమాట యందురో యను భయమే కాని తిన్నగా తలయెత్తుకొని పదిమందిలోను సంతోషముగా తిరుగుటకు నోచుకోలేదుగదా! ఎవ్వరే వితంతువుల వ్యభిచారాది దుశ్చేష్టలప్రచారము తెచ్చినను మనవిషయమేయనిమనసులోనలుకుపుట్టుచుండును.

నారా—మన కన్నవస్త్రములకు లోపము లేకపోయినను దైవము మనలను సుఖపడనియ్యందలంచుటలేదు. ఏజన్మముననో మీదంపతులకు గర్భశత్రువులయిన యీముండలు మీకు పుత్రికలుగా పుట్టి మిమ్ము దుఃఖపెట్టి యీప్రకారముగా తమ పగసాధించుకొనుచున్నారు.

సీతా—అమ్మవారి జాడ్యములలో సామిగాని బాధ వదిలిపోయినది గదా యని కొంచెము తల తడవి చూచుకోగానే యిప్పుడు వంట బ్రాహ్మణుఁడు కామిగానిబాధ యంతకంటె నెక్కువయినది. ఇల్లంతయు వానికి దోచిపెట్టుచున్నది. మనయింటఁ దెచ్చిన వానిలో నుప్పులోనుప్పును పప్పులో పప్పును సగము వాని యింటనే యుండును. ఇంటిదొంగ నెవ్వరు మాన్పఁగలరు? మొన్న మనయింట పోయిన మిరియాలపేరు విషయమయి కూడ నాకు దీని మీదఁనే యనుమానమున్నది. అది గట్టిగా దీనిపనియే కాని మఱి యొకరిపనిగాదు. గృహచ్ఛిద్రము బయలఁపెట్టరాదు గనుక, ఏమి జరిగినను నోరుమూసికొని యూరకుండవలెను. నోరు తెఱచి యేమయిన నన్న నెప్పుడు వీధికెక్కునోయనియే భయమగుచున్నది.

నారా—ఇంటనుండి వ్యభిచరించుచు కలకాలము తల్లిదండ్రులను వ్యధపెట్టువారికంటె నిల్లువిడిచి లేచి పోవువాండ్రే యుత్తమురాండ్రని చెప్పవలసియున్నది. ఇల్లు విడిచి వీధికెక్కినవారు తామొక్కరు మాత్రమే సంకరురాండ్రయి చెడిపోవుచున్నారు. ఇల్లు

వదలక మాలకూడంతయు నింటనే కలుపువారు తాము మాత్రమే కాక కులమువారి నందఱిని సంకరులను జేసి కుటుంబమున కంతకు నవమానము తెచ్చుచున్నారు. కాఁబట్టి యింటి కపకీర్తి తెచ్చు ముండలను లేవఁగొట్టుటయే మంచిది.

సీతా—అది నిజమే కాని కడుపున పుట్టిన బిడ్డలు చెడి లేచి పోవుచుండఁగా చూచి యూరకుండుట కెట్టి రాతిగుండెవానికిని బుద్ధి పుట్టదు. మావంటివాండ్రు జీవించుట కిది కాలము కాదు. వయసులో నన్నపూర్ణకంటె నలుదేండ్లు చిన్నదయినను మన జానకి కింత పాప ము లేదు. అది బహు బుద్ధిమంతురాలు! దానికి నలుగురు నేనును కొందరో యని భయము మున్నది; ఇది నీకు తగదని చెప్పిన వినవేచ్చినది.

నారా—ఇఁక జానకిబుద్ధి యడుగ నక్కఱలేదు. దానిసంగతి మీకు బొత్తిగా తెలియదు. అది వెనుక బుద్ధిమంతురాలుగానే యుండెను గాని దానిసంగతి యిప్పుడు బొత్తిగా చెడిపోయినది. దాని తేనెమాటలును స్నానములును జపములును జూచి మీరు భ్రమ పడుచున్నారు. అది మేకవన్నెపులి; లోలోపలనె గొంతుకలు కోయును. మొన్నటివఱకును నేనును మీవలెనే మోసపోయి నాను. ఇప్పుడు దాని పేరు చెప్పిన నాయొడలు మండుకొని పోవుచున్నది.

సీతా—అది మనయింట చిన్న మెత్తు వస్తువొకరికిచ్చినదని నే నెవరినోటను వినలేదు. అది తనయత్తవారి యింటికడనుండి తెచ్చుకొన్న సొమ్మునే నోముల క్రిందను వ్రతముల క్రిందను దాన ధర్మముల క్రిందను వ్యయపెట్టుకొనుచున్నది కాని మనసొమ్ము పూచి కపుడకయైనను పుచ్చుకొని యెఱుఁగదు. ఇంకను దాని సొమ్మే మఱదండ్రకును చెల్లెండ్రకును పెట్టుచున్నది. నెలకును పదియేడు దిన ములకును సందయినప్పు డెప్పుడో మనజానకి కాపురమున పట్టలేక మహారహస్యముగా మనలోపల పురాణము చెప్పు గోపాలశాస్త్రులతో

నేమో యేడ్చుచుండునని వెనుక నాతో మీతల్లి యప్పు డప్పుడు చెప్పుచువచ్చినది. అదియు నెవ్వరికిని తెలియదు. నీవు మొన్న గోపాలశాస్త్రిని కొట్టినప్పటినుండియు నతఁడు మనయింటికి వచ్చుట మానుకొన్నాఁడు. ఇఁక లక్షవరహాలిచ్చినను తాను మనయిల్లు త్రొక్కి చూడనని నీమేనమామయొద్ద నొట్టు కూడ పెట్టుకొన్నాఁడట. దానిని మనమొక్కసారి చాటునకు పిలిచి చీవాట్లువేసిన పక్షమున, తన మునుపటి గుణమును మానుకొనునని నాకు గట్టినమ్మకమున్నది.

నారా—దాని మొగము మండిరిలెండి. పుట్టెను పుట్టినబుద్ధి పుడకలతోఁ గాని పోదు. అది పిడికెడు బూడిద యగువఱకును దాని గుణ మాలాగున నుండునదియే కాని నడుమ మాఱునది కాదు. పెద్దదానివలె దానియేడుపేమో యది యేడిచి యూరకున్న—

సీతా—ఏమో చెప్పబోయి సగము చెప్పి యూరకున్నావేమి? ఆమాట కడతేఱఁజెప్పు దానియేడుపది యేడిచి యూరకుండక మెవరి నేమి చేసినది?

నారా—గాడిదకొడుకును మొన్న గోపాలశాస్త్రిగాఁ డిని కొట్టిన దెందుకనుకొన్నారు?

సీతా—ఎందు కేమి? మనజానకి యతనితో మాటాడుచుండఁగా నీకంటఁ బడ్డదేమో యనుకొన్నాను.

నారా—అందుకుఁ గాదు.

సీతా—మఱి యెందుకు?

నారా—యెందుకయిననేమి? నేనిప్పుడు మీతో చెప్పను. జానకిముండ పేరును శాస్త్రిగాడిపేరును తలఁచుకొన్న నాకిప్పుడు శరీరమంతయు రవులుచున్నది. కోపమాపుకోలేక వారికి నేనేమిహాని తలఁతునో మీరాసంగతి నన్ను గ్రుచ్చి యడుగకండి.

సీతా—నాయనా! శాంతించు. వారిమీఁద నీ కెందుకో విశేషాగ్రహము కలిగినట్లున్నది. వారేమయిన నకార్యకరణము చేయుచుండఁగా నీవు ప్రత్యక్షమునఁ జూచితివా యేమి? కొంచెము నిమ్మళించి కారణమేమో నాతోఁజెప్పు.

నారా—మానవంతుఁడు తనవారు మఱియే నేరము చేసినను సహించునుగాని అంకుతనము చేసినప్పుడుమాత్రము సహించియూరకుండలేఁడు. నిజమయిన పౌరుషము గలవాఁడు జారత్వము జరుగుచుండఁగాఁ జూచినప్పుడు తత్క్షణమే యిద్దఱినిగూడ కత్తెడయిన పొడిచివేసి యక్కడనే గొయ్యిత్రవ్వి పాతిపెట్టునుగాని మానభంగమునకోర్చి వారి నవతల కడుగుపెట్టనియ్యఁడు. (అని కోపముచేత వణకుచున్నాఁడు.)

సీతా—నాయనా! చిన్నవాఁడవు నీవేమియు నెఱుఁగవు. పెద్దవాఁడను నామాటవిను తొందరపడఁబోకు. దుడుకుతనముచేసి వాండ్రవిషయమున నీవేమయివ పాపకార్యమున కొడిగట్టెదవు సుమా? ఇప్పుడుకాలము బొత్తిగా మంచిదికాదు. తనహానియు లోకనిందఁగూడ వచ్చును. కోపము పాపమునకు కారణమగును. కార్యము మించినతరువాత విచారపడి చేసెడిపనిలేదు. నిష్కారణముగా మన మందఱము నప్రతిష్ఠపాలును నవమానము పాలునుకూడ కావలసివచ్చును. మా ముసలిప్రాణములను జూచియైన శాంతము వహించు. మునుపటికంటె నీవిప్పుడు క్రొత్తగా విశేషమేమి చూచినావో నాతో దాఁచక చెప్పితివా. నేనుదానికి తగిన ప్రతిక్రియ చేసెదను. (అని కన్నీరు నించుచున్నాఁడు.)

నారా—(లోపలినుండివచ్చి దుఃఖము నాపుకొనుచు) మీరేమియు ప్రతిక్రియ చేయనక్కఱలేదు. నేనొక క్రూరకృత్యమేమియుఁ జేయఁదలఁచుకోలేదు. ఇదివర కొకవేళఁ జేయఁదలఁచుకొన్నను

మీదంపతుల నిద్దఱినిజూచి యిప్పు డప్రయత్నమును మానుకొన్నాను. మీమనస్సును ఖేదపెట్టుకొనకుఁడు. నామూలమున మీకెంతమాత్రమును మనోవ్యథ కలుగనియ్యను. మీ కోడలిని మాత్రము వెంటనే పుట్టినింటికి పంపివేయుండి.

సీతా—(తనలో) వీనికేమో భార్యమీఁద సందేహముతోచినది. మరియొకరి విషయమయినచో వీనికింత కోపమురాదు. (బిగ్గఱగా) గోపాలశాస్త్రి నీభార్యతో నేమయిన మాటాడినాఁడని నీకను మానము కలిగినదా? కిట్టనివారెవరైన నీతో నటువంటి చెడుమాట చెప్పినారా?

నారా—జరిగినదేమో జరిగినది. దీనికంతకును మన జానకి ముండయే కారకురాలు. అది పోయినఁగాని మనయింటిపీడ వదలదు. దాని నేలాగునైన విఱుగడ చేసికోవలెను. నాకు గోపాలశాస్త్రిగాడిమీఁద నెలదినముల క్రిందటనే యొకసారి కొంచెము సందేహము కలిగినది. ఆగాడిదకొడుకును నీకోడలును మొన్న గదిదొడ్డిలో నొంటిగా మాటాడుచుండఁగా నేను ప్రత్యక్షముగా కన్నులారచూచినాను. తమ్ముఁ డడ్డముగాకుండినయెడల మొన్ననే వారిద్దఱిప్రాణములను పుచ్చుకొనియుందును. వాఁడు బ్రాహ్మణవేషముతో నున్న చండాలుఁడు గాని పండితుఁడు కాఁడు.

సీతా—ఇంట జనువుగాతిరుగుచున్నాఁడు కనుక, అది నీకు కోపమువచ్చునని యెఱుఁగక యతనితో నేమోమాటాడియుండును. అంతమాత్రముచేత దానియందొక దోషారోపణముచేయుట ధర్మము కాదు. లోకములో నీ వొక్కఁడవే కాదు, పడుచుభార్యలను గలవాఁడనును భార్య పరపురుషునితో మాటాడినంత మాత్రమున నీవలెనే యనుమానపడుచుందురు. వారికి హృదయములోఁగల యపనమ్మికయే పలువిధములయిన యనుమానములను పుట్టించి వారిని

బాధించుచుండును. మనసులో లేనిపోనిసందేహము పెట్టుకొని యల్లరి పడఁబోకు. నేరము స్పష్టముగాఁ గనఁబడువఱకును నీవు దాని నేమియుఁ జేయునని యిప్పుడు నాచేతిలో చేయివేయుము.

నారా—పూర్వకాలపు మనుష్యులు గనుక మీరెప్పుడును పిన్నవాండ్రేమి కానిపనిచేసినను దానికి మంచియుద్దేశము కల్పన చేయుటకే చూచుచుందురు. ఈకాలపువాండ్ర మాయలును కృత్రిమాలోచనలును మీకు తెలియవు. మీతో నాకు వాదమెందుకు? ఇఁక నాకాభార్య యక్కరలేదు. తత్క్షణము పుట్టినింటికి పంపివేయండి.

సీతా—అలాగుననే పంపివేసెదను. నీవు వట్టివెఱ్ఱివాఁడవు. నీకిప్పుడున్న కోపముమీఁద యుక్తాయుక్తము లాలోచించుకోలేకున్నావు. కొంచెము శాంతివహించి పెద్దవాఁడను నేనన్నమాట కొట్టివేయక నెమ్మదిగా నీలోనీవు విచారించుకో. నీవిప్పుడు చెప్పునది మాత్రమే కోపకారణ మయినయెడల, నీభార్యయెడలవిశేష దోష మేమియు నాబుద్ధికిఁ గనఁబడదు. ఇందులో జానకి తప్పిద మేమున్నది?

నారా—అది యేమోకాని యీ మూడుదినములనుండియు జానకియన్న పేరే నాచెవికి శూలమువలె సోఁకి నామనస్సును వ్యాకులపెట్టి బాధించుచున్నది. దాని దురాలోచనయే లేకపోయినయెడల శాస్త్రిగారితో నిర్భయముగా రహస్యము మాటాడుటకు నీకోడలికి గుండెలుండునా? వారాడుకొన్న మాటలేవో నాకువినఁబడినవికావు. జానకి నేమిచేసినను పాపములేదు. దానికి తగిన శిక్ష చేయవలెను.

సీతా—(తనలో) మాటాడిన కొలఁదిని వీనికి జానకిమీది కోప మంతకంతకు హెచ్చుచున్నది. వీఁ డేమి దుర్ణయమునకు సాహసించునో యని నామనస్సు పరితపించుచున్నది. (గద్గదస్వర

ముతో బిగ్గఱగా) నీ యిప్పటి యౌద్ధత్యము చూడఁగా జానకికేదో యపాయము చేయుదువని నాకు భయమగుచున్నది. నీవు దాని కేమయిన హాని తలఁచుకొన్న యెడల ముందుగా నన్ను ధన్యునిఁ జేసి యా పాపపువార్త నాచెవి సోఁకకుండ పిమ్మట నీమనసువచ్చి నట్లు చేయుము. దానిని చిన్నప్పటినుండియు ప్రాణముకంటె నెక్కు వగా—(అని యేమో చెప్పఁబోయి మాటరాక కన్నుల నీరు గ్రక్కుకొనుచు తలవంచుకొని యూరకున్నాఁడు.)

నారా—(కన్నుల నీరుపెట్టుకొని) నానిమిత్తమున మీరు మనసులో ఖేదము నొందఁబోకుఁడు. కోపోద్రేకముచేత దేహము తెలియక యేమో నోరికి వచ్చినట్లెల్లను ప్రేలినాను. అది నాకు మాత్రము తోడఁబుట్టినది కాదా? నాకు మాత్రము దానిమీఁద ప్రేమలేదా? దాని విషయమై ద్రోహము తలఁచుటకు నేనంత క్రూరకర్ముఁడనా? మీపాదములతోడు దానికి నేనేమియు హాని చేయను. మీరు నిర్విచారముగా నుండుఁడు.

సీతా—నిజముగా దానియెడ తప్పిదమున్నదనియే నీకు తోచిన యెడల, నీకోపశాంతికయి నీవు దానికే శిక్షచేయుమన్నను జేసెదను. నీవు దానికి కీడు దలఁపఁబోకు.

నారా—అట్లయినచో రేపు మంచి దినము చూచి దాని శిరోజములు తీసివేయించండి. అవి వదలెనా దాని దుర్గుణములును వదలును; అంతటితో నాకోపమును చల్లారును.—ఎవరో వచ్చు చున్నారు నేను లేచి వెళ్ళెదను.

[అంత పార్వతి ప్రవేశించుచున్నది]

పార్వ—నాన్నా! భోజనానికి ప్రొద్దెక్కింది. చిన్నన్నయ్య కనిపెట్టుకొని వున్నాఁడు వేగిరం లెండి.—పెద్దన్నయ్యా! నీవుకూడా లేచి మడిగట్టుకో.

నారా—నాకిప్పు డాఁకలిగాలేదు. మీరందఱును భోజనములు కానిండి. నాకు వీధిలో పనియున్నది. నేను వెనుకవచ్చి భోజనముచేసెదను. (అని లేచి వీధిలోనికి వెళ్ళుచున్నాఁడు.)

సీతా—ఇదిగో వచ్చుచున్నానని చెప్పు. (అని లేచి పడక గదివంక నడుచుచున్నాఁడు.)

పార్వ—స్నానానికి రాకుండా మళ్ళీ గదిలోనికి వెళ్ళుతూ వున్నారేమి? వేగిరంరండి. (అని వెళ్ళుచున్నది)

---

౨. రంగము—ఆగృహములోనే పడకగది

[సీతారామయ్యగారు ప్రవేశించుచున్నారు]

సీతా—భోజనమునకు లేవవలసినదని లోపలనుండి రెండు మూడు వర్తమానములు వచ్చినను నాకు లేవతోచకున్నది. నా కిందాఁకటి యాఁకలియంతయు నేరుయిపోయినదో కాని యిప్పుడు భోజనముమీఁద బుద్ధియేపుట్టకున్నది. ఆమాటలువిన్నప్పటినుండియు నాకు గుండెలలో రాయిపడి యేమి యాలోచింతమన్నను తోచకున్నది; ఇంతకుమునుపు శ్యామలాంబవచ్చి నాతో నేమిచెప్పినదో నేనేమి బదులుచెప్పి దానిని పంపివేసినానో నేనెఱుఁగకున్నాను; నిప్పులలో పొరలించినట్లు నామనస్సు పరితపించుచున్నది; మెత్తని పఱుపుమీఁద పరున్నను నాదేహమిప్పుడు ముళ్ళమీఁద పరుకొన్నట్టున్నది, గోవిందరావువలె నారాయణయూఁడు శాంతస్వభావుడు కాఁడు. నాతోమాటాడినంతసేపును వానిచిహ్నములుచూపుఁగా నెవరిప్రాణముల కెగ్గుతలంచునోయని నాగుండెలు కొట్టుకొనుచున్నవి. ఆలోచింపఁగా మొదట వాఁడు నాదేతలఁ బెట్టిన ప్రాణము పాషాణమేమో యని యిప్పుడు నాకు సందేహము గలుగుచున్నది.

NARLA MEMORIAL LIBRARY V. R. NARLA Acc. No. P. T. I.

అప్పుడు వాడు దాని పేరు చప్పున చెప్పక తడవుకొనుటయు నాచేతి లోని పొట్లమును తత్తరపడి పుచ్చుకొనుటయు వాఁడు తరువాత నాతో సంభాషించిన సంగతులును విచారింపఁగా నదియేదోవిష మయి యుండుట నిశ్చయము. అప్పుడే నాకీసందేహము గలిగిన నాచేతిలోఁ బెట్టిన పొట్లమును మరల నియ్యకయే పోయియుందును; వానిమాటలవలన వానికి జానకిమీదనే గొంతుకవఱకు కోపము న్నట్లు కనబడినది. నాదీనత్వము దుఃఖమును జూచి పయికప్పుడు దాని కేహానియుఁ జేయనన్నాఁడుకాని వాని మాటయందు నాకు బొత్తిగా విశ్వాసము కలుగకున్నది. దేవుఁడు మన కుటుంబమున కేమివిపత్తు తెచ్చిపెట్టనున్నాఁడో!

[ఇంతలో సుభద్రమ్మ ప్రవేశించుచున్నది]

సుభ—ఏమి? నేనెన్నిసార్లు వర్తమానం పంపినా మీరు భోజనానికి లేవకుండావున్నారు? స్నానంకోసంపెట్టిన వేణ్ణీళ్ళన్నీ చల్లారిపోతూ వున్నవి. విశాలాక్షి అన్నంకోసం యేడుస్తూవున్నది. దానికీవేళ ప్రొద్దున్న చద్దన్నం లేకపోయింది. మీరువచ్చి దేవతా నివేదన చేస్తేనేకాని దాని కన్నం పెట్టవల్లకాదు. వేగిరంలెండి.

సీతా—(తనలో) ఇంతకును దాని గ్రహచార మెట్లున్నదో! కాఁదలఁచియున్నదేమో కాకమానదు.

సుభ—(మఱింత దగ్గఱకు వెళ్ళి) నేను చెప్పిందేమిన్నీ విని పించుకోకుండా మీలోమీరే యేమిటో మాట్లాడుకుంటూవున్నారు. మీరిప్పుడేమో పరధ్యానంగా వున్నారు. సంగతి యేమయినావుంటే భోజనం చేసినతరువాత ఆలోచించుకోవచ్చును. ముందుగా భోజ నానికి లేచిరండి.

సీతా—(నిట్టూర్పు విడిచి) ఇప్పుడు నాబ్రతుకు భోజనము నకు లేచినట్లే యున్నది.

సుభ—(తొట్రుపాటుతో) యేమి? అలాగంటారు?

సీతా—ఏమియు లేదు. భోజన మక్కఱలేకయే యిప్పుడు నా కడుపునిండుగా నున్నది.

సుభ—మనవాఁడు గోపాలశాస్త్రుల్లను కొట్టిన దెబ్బలచేత అతఁడు వాయువుచేసి చావలేదుగదా? అందుకోసం యేమయినా మనకు దివాణంవారివల్ల మాటవచ్చేటట్టు వున్నదా యేమి?

సీతా—అటువంటి దేమియు నిదివఱకు పొసఁగలేదు. మన యింటిసంగతి తలఁచుకొన్ననే నాకు మనుగడమీఁద రోతపుట్టుచున్నది.

సుభ—అన్నపూర్ణనుగురించి కొత్తసంగతి యేమయినా విన్నారా యేమి? దాని చర్య చూస్తే మొదటినుంచీ నా కనుమానంగానే వున్నది. దాని మూలాన్నే మన కుటుంబాని కెప్పుడో ముప్పుమూడుతుంది.

సీతా—మన మెప్పుడు ననుకొననిది యిప్పుడు మఱియొకటి వచ్చినది. మఱియొకదాని వలన కీడు మూడ సిద్ధముగా నున్నది. జానకి—జానకి—(అని చెప్పలేక కన్నులనీరు పెట్టుకొనుచున్నాఁడు)

సుభ—(తొందరపడి) జానకేమిటి? అదివఱకిజోలికిపోయేది కాదే. దానికేమి ఆపద రాఁబోవుచున్నది? దాని దగ్గిరడబ్బంతా దోచుకొని మీదిమిక్కిలి గోపాలశాస్త్రుల్లరచ్చకీడ్చి దాని కేమయినా ద్రోహంతలఁచుకొన్నాడా యేమిటి? సాక్ష్యం నిమిత్తం సభల కెక్కవలసిన దుర్యోగం తటస్థించలేదుగదా?

సీతా—అటువంటి దేదియుఁ గాదు. వాని యిల్లు వల్లకాడుగాను గోపాలశాస్త్రి మూలముననే మన కొంప కూలిపోవలసిన యోగము సంభవించినది. నీ పెద్దకోడలేమో మొన్న గోపాలశాస్త్రితో మాటాడుచుండఁగా నీ పెద్దకొడుకు చూచినాఁడట. అప్పటినుండియు వానికి భార్యమీద ననుమానము తగిలి దానిని

పుట్టినింటికిఁ బంపివేయు మనుచున్నాఁడు. జానకి యాలోచనమీఁదనే యాపని జరిగియుండునని వానికి సందేహము తోచి జానకిని పొడిచి వేయవలెనని యున్నది.

సుభ—అందుచేతనే కాఁబోలు మొన్న మీ రింట్లో లేనప్పుడు గోపాలశాస్త్రుల్లను కర్ర పుచ్చుకొని చావదెబ్బలు కొట్టినాడు. అప్పుడు మన గోవిందరావు వుండి అడ్డం వెళ్ళినమూలంగా గాని లేకపోతే అప్పటి కోపంమీఁద ఆతణ్ని చంపివేసిపోను. నారాయణ మూర్తికి కోపం వచ్చినప్పుడు వళ్ళు తెలియదు. ఆ రాత్రి గదిలోనికి వెళ్ళింతరువాత పెళ్ళాన్నికూడా బెత్తంతో కొట్టినాడు. తెల్లవారి లేచివచ్చినతర్వాత చూస్తే దానికి వీపుమీఁదనూ చేతులమీఁదనూ అడ్డంగా దద్దుర్లు తేలినవి.

సీతా—అప్పటి నారాయణమూర్తి మాటలవలన భార్యకు ప్రాణహాని చేయునని తోఁచదుగాని పుట్టినింటికిఁ బంపివేయుమని మరలమరల నడుగుట చూడఁగా నొకవేళ వాఁడు దాని నొల్లడేమో యని సందేహము గలుగుచున్నది. వానికోప మంతయు నిప్పుడు జానకిమీఁద నున్నది. దాని కేమయిన హాని చేయునేమోయని నా హృదయము తల్లడిల్లుచున్నది.

సుభ—ఒకవేళ కోపంమీఁద వాఁడు వూరికే అట్లా అన్నా డేమో కాని వాడికి జానకిమీఁద మిక్కిలిప్రేమ.

సీతా—ఆ ప్రేమయంతయు నిప్పుడు నడచినది. వట్టిమాటలు మాత్రమే కాదు వానియొద్ద విషముకూడఁ జూచినాను. నిజముగా దాని కేదోహాని-(అని చెప్పలేక కన్నులనీరు పెట్టుకొనుచున్నాఁడు)

సుభ—అయ్యో! నా కడుపున పుట్టినతొమ్మండుగురిలోనూ యిప్పుడు యిద్దరు మగవాళ్ళున్నూ అయిదుగురాడవాళ్లున్నూ వున్నారు. అన్నపూర్ణ తరువాతవాడు చెట్టంత కొడుకు మన సాంబ

శివుడు పోయి నాలుగేళ్ళు నిండా కాలేదు. వాడిప్పుడు బ్రతికివుంటే మొన్నటి సప్తమికి యిరవయిరెండేళ్ళు వెళ్ళును. జానకి వాడికంటె రెండేళ్ళు చిన్నది.

సీతా—పోయినవాండ్రను తలచుకొని యిప్పుడు దుఃఖించిన నేమి కార్యమున్నది? వారిని మఱచిపో.

సుభ—నిత్యమూ వాణ్ని జ్ఞాపకం చేస్తూ సుందరమ్మ యింట్లో వుండఁగా వాణ్ని యేలా మఱిచిపోను? వాడికంటె అయిదేళ్లు చిన్నదిగదా అని మేనరికం చేసుకొన్నందుకు దాని కయిదో తనం చేసేయోగం లేక సుందరమ్మ మూల పట్టినది. ఆపుకుందామన్నా ఆగకుండా దాన్ని తలుచుకున్నప్పుడల్లా నాకు లోపలినుంచి దుఃఖం పొర్లిపొర్లి వస్తూవుంటుంది. ఆ దుఃఖంతోటే కృశిస్తూవుండగా నిరుడు నాపురంచేస్తూవున్న నా అంతకూఁతురు మహాలక్ష్మి నన్ను భంగపెట్టి పోయింది. దానితో వెనకటి దుఃఖం మరచిపోయి పదిహేనేళ్ళ యీ కూతురిని మింగుకొన్నందుకు బెంగపెట్టుకొని రాత్రీ పగలూ కంటికీ నేలకూ యేకధారగా యేడుస్తూవుండగా తరువాత నెల్లాళ్ళకే శ్యామలాంబ మొగుడు పోయినాడని పిడుగువంటి వర్తమానం వచ్చింది.

సీతా—మరచిపోవుచున్న దుఃఖములనన్నిటిని జ్ఞాపకముచేసి నాకు మఱింత విచారమును కలిగించుచున్నావు.

సుభ—ఈ దుఃఖాలు యెల్లకాలమూ మనని యీలాగు బాధపెడుతూ వుండేవేగాని మఱిచిపోదామన్నా మరువుకు వచ్చేవికావు. పదమూడేళ్ళది యిక శ్యామలాంబ బ్రతుకెట్లా తెల్లవారుతుంది? అది నేడో రేపో సమర్తాడడానికి సిద్ధంగావున్నది. దాని బతుకెవరు చూచి సంతోషించను? దాన్ని చూచినప్పుడల్లా మనస్సు కలుక్కుమని యేడవకుండా వూరుకుందామన్నా వాటంతటఅవే కళ్ళమ్మణి

నీళ్లు వస్తూవుంటవి. చదువుకున్నది గనుక అదే నాకు ధైర్యంచెప్పి దైవగతి యిట్లావుండగా యేడిచిన ప్రయోజనంయేమనివోదారుస్తూ వుంటుంది. నారాయణమూర్తి పెద్దపెళ్ళాము యేమహూర్తాన్న దారితీసిందోకాని తరువాత వరుసగా మనయింట్లో అయిదారు ప్రాణాలు లేచినవి. పోగా మిగిలిన అయిదుగురు కూతుళ్ళలోనూ యిప్పుడు ముగ్గురుమూలపట్టినారు. ఆలాగయినా వాళ్ళను చూచుకుంటూ వుండడానికి ఋణం లేకుండా యిప్పుడు నారాయణమూర్తి కిటువంటి దుర్బుద్ధికూడాపుట్టవలెనా?(అని పెద్దపెట్టున నేడ్చుచున్నది)

సీతా—(దుఃఖము మ్రింగుకొనుచు)ఇంకను మగఁడు బాగున్న వారిద్దఱున్నారు గదా? ఆ యిద్దఱినిజూచి సంతోషించు. తక్కిన ముండమోసినవారినిజూచి దుఃఖించుచున్న మనము బాధపడి వారికి బాధకలుగఁజేయుటయేకాని యందువలన మఱియేమియుఫలము లేదు

సుభ—ఆయిద్దరయినా పసుపూ కుంకం తిన్నగావుండి పదికాలాలపాటు బ్రతికి బట్టకట్టవలెనుగదా? ఎదిగి పెద్దవాళ్ళయిసమస్త సుఖాలూ అనుభవిస్తూ కని పెంచుతూ వుండవలసినకాలంలో వాళ్ళ బ్రతుకట్లా అయినది. యాభైయేళ్లు దాటి రాత్రి మనం గదిలో పడుకుని సుఖం అనుభవిస్తూంటే మొన్నమొన్న మన కడుపునపుట్టిన వాళ్ళు వొంటిగా యిపతలకూలి నిద్రపట్టక యేడుస్తుండవలసిన గతి పట్టింది. అప్పుడు మనసులో యెంత దుఃఖంవుండునో! వాళ్ళ దుర్యోగమే ఆలాకాగా ఇఁక పసికూన లెప్పుడో యెదిగి కాపురం చేస్తూ సుఖపడుదురనా మనంసంతోషం పడవలసినది? మనపార్వతికి వెయ్యేళ్ళకూ పదోయేడు వచ్చినది; విశాలాక్షికింకా ఆరో యేడు వెళ్ళనేలేదు. వీళ్ళయినా నాలుగు కాలాలపాటు మగనితో కాపురం చేసి వాళ్ళకడుపున నాలుగుకాయలు కాయగా నేనుచూస్తానోలేదో?

సీతా—విచారించబోకు. చిన్నవాండ్రే యయిదవతనముచేసి సంతానవంతు రాండ్రగుదురు.

సుభ—అలాకాదు. లోకములో దేవుడు వెధవముండల కెక్కడలేని ఆయువూ పోస్తాడు; మెరుగుడు పురుగులులాగు పచ్చగా వున్నవాళ్ళను యిట్టే యెత్తుకపోతాడు. మొగుళ్ళ ఆయుష్షూ వాళ్ళ ఆయుష్షూకూడా వాళ్ళకేపోసి వెధవవాళ్ళకెప్పుడూ భగవంతుఁడు చావుపెట్టడు. అన్నపూర్ణపోయి మన మహాలక్ష్మి బ్రతికివుంటే యెంత బాగావుండును!

సీతా—దాని చెడుతిరుగుళ్ళుచూచి విసుగుపుట్టి నీవుపయికాలాగున ననుచున్నావే కాని లోపల నీకు విధవకూఁతురు మాత్రము చావవలెనని యుండునా! ఒక్కదినము వెనుక అన్నపూర్ణ లేచిపోయి యవతలనుండఁగా మఱునాఁడు దానిని మరల నింటికి తీసికొనివచ్చిన దాక నీళ్ళును నన్నమును తినక పరితపించినావు.

సుభ—ఏమిచెయ్యను? మోహంకోసివేసి వూరుకుందామన్నా కానీ కన్నకడుపు వూరుకోనియ్యక అలాయేడిపిస్తూవుంటుంది. ఈ సంసారంలో వున్నంత మట్టుకు మోహపాశాలు తెంపుకోలేము. నారాయణమూర్తినిమీరు కూకలు వేసి వాడికిపుట్టినదుర్వృత్తినుంచి వాణ్ణియేలాగయినా మళ్ళించలేకపోయినారా? వాడిదగ్గిర మీకు విషం కనఁబడ్డప్పుడు మీరు తప్పకుండా లాక్కోవలసిందే.

సీతా—వానిదగ్గిరది విషమని వాడావలకు పోయిన తరువాత నాకు స్ఫురణకువచ్చినది. నేను బహువిధముల మందలించి సాహస కార్యమునకు దిగవలదని బుద్ధిచెప్పినాను. వానిహృదయములో కని కరముతోఁచునట్లగా జానకిస్థితిని దలఁచి కన్నుల నీరుపెట్టుకొన్నాను. నావ్యాకులత్వమునుజూచి వాఁడప్పటికేమియుఁ జేయనని నాచేతిలో చేయివేసినాఁడు. కాని వానిధోరణిచూడఁగా వాఁడంతటితో తన

దుర్వృత్తినుండి మళ్ళుకొనునని నాకు నమ్మకముతోఁచలేదు. పయి కేనున్నను మనసులో వానికి కోపము రాజుచునేయున్నది.

సుభ—వాడి కోపం చల్లార్చ డానికి యేమిసాధనం ఆలోచించినారు?

సీతా—జానకికి శిరోజములు తీయించి వేసి దానిని కురూపిని జేసిన పక్షమున తనకోపము శాంతించునని నాతో వాఁడే మొట్ట మొదట చెప్పినాఁడు. దానికేమియు నపాయము రాకుండ కాపాడ వలెనన్నచో మనమాపనిని సాధ్యమయినంత శీఘ్రముగానే చేయించ వలెను.

సుభ—మన పెద్దదానికి యిరవై అయిదేళ్ళు వున్నవి. అది నారాయణమూర్తికంటె నాలుగేళ్ళన్నర చిన్నది. అన్నపూర్ణకు తలవెంట్రుకలు వుండగా చిన్నదానికి జానకికి ముందర్తిగా తలవెంట్రుకలు తీయించివెయ్యడం బాగావుండదు. ఒకవేళ అన్నపూర్ణతో నేనుచెప్పినా తల గొరిగించుకోడాని కది వొప్పుకోదు. యేమిచేతును?

సీతా—అన్నపూర్ణతో మన మెవరముచెప్పినను కార్యము లేదు. మెల్లఁగా నీవు జానకితోనే యీ సంగతిచెప్పి దానినొడఁ బఱపుము. ఈలోపుగా నన్నగారేమి పెట్టినను తినకుండ భద్రముగా నుండుమని దానితో నిప్పుడే తప్పక చెప్పు.

సుభ—(లోపలనుండి దుఃఖముగా కన్నులు తుడుచుకొనుచు) మన పెద్దప్రాణాలు రెండూ తిన్నగావుండగానే మన గర్భవాసాన్న పుట్టినబిడ్డలను తలగొరిగించి ముసుగువేసి మూలకూర్చోపెట్టడానికి చూస్తూవున్నాము. కులానికి వెఱచి మనము యీలాంటి పని చెయ్యడానికి లోబడుతూవున్నాము. ఛీ! దిక్కుమాలిన కులము! వాళ్ళుబ్రాహ్మణకులంలో పుట్టక తురకవాళ్ళ యింట్లోనో

దూదేకులవాళ్ళ యింట్లోనో పుట్టినా మళ్ళీ పెళ్ళిచేసుకొని సుఖంగా వుండివుందురు. మనలో మగవాడికి పెళ్లాంపోతే అరవైయేళ్ళవాడ యినా శవం యింటికాడనుంచి కదలకమునుపే మళ్ళీ మూడేళ్ళదాన్ని చేసుకోవడానికి బేరాలు మొదలుపెడుతాడు; మూడేళ్ళదానికి మొగుడుపోయినా సమస్తసుఖాలూ వదలిపెట్టి యావజ్జీవం చచ్చిన వాడిజీవానికి వుసూరుమని యేడుస్తూ కడగళ్ళుపడుతూ వుండవలసి నదే. యీక్రూరాచారం మనలో యేకాలమందు దయాదాక్షి ణ్యాలులేని యేకటికి ముండాకొడుకు పెట్టినాడో కాని మానిపించే దిక్కులేక బహుఘోరకృత్యములు జరుగుతూ వున్నవి. యిరవై యేళ్ళలోపు వాళ్ళకయినా మొగుడుపోయినప్పుడు మళ్ళీపెళ్ళివుంటే యెంతయినా అనుకూలంగా వుంటుంది. జానకి గోవిందరావుకంటే రెండేళ్ళు చిన్నది. గోవిందరావుకింకా మీసాలయినా రాలేదు. పోనీ దానిమాట యేలావున్నా మన శ్యామలాంబవంటి వాళ్ళకయినా రెండోపెళ్ళి చేయించి యేమహానుభావుడయినా పుణ్యంకట్టుకుంటే యిస్పటి దుర్మార్గాలు ముప్పాతికమట్టుకువదలి లోకం సుఖపడుతుంది. విధవపిల్లలు కలవాళ్ళ కందరికీ వివాహాలుచేస్తే బాగుగావుంటుందని లోపల యెంతోఅభిలాష వున్నది. లోకానికి వెఱచి యెవ్వరూ సాహసం చెయ్యలేక లోలోపలనే యేడుస్తూఊరుకుంటారు. ముందుగా చొరవచేసి వక్కరొక్క వివాహంచేస్తే తరువాత వక్కమాటు నూరు వివాహాలవుతవి.

సీతా—మన గోవిందరావు కప్పుడే పదునెనిమిదవయేడు ప్రవేశించినట్టున్నది. లోకములో జరుగుచున్న మాలకూళ్ళన్నియు చూడఁగా నాకిప్పుడు విధవావివాహము లుండుటయే యోగ్యముగా నుండునని తోఁచుచున్నది. పదియేను సంవత్సరముల క్రిందట ఈప్ర

యత్నము జరగినప్పుడు నేనే పనిచేసి చెడఁగొట్టినాను. అది యన్న పూర్ణవివాహమయిన మఱుసటి సంవత్సరము. అప్పటికి నాకీకష్టము లేమియు నాటుకోలేదు. ఇప్పుడు మరల నట్టిప్రయత్నము జరుగు చున్నది. మనవారు నలుగురు నంగీకరించి వివాహములు జరగనారం భించినపక్షమున మన శ్యామలాంబకు: గూడ వివాహము చేయుదము.

సుభ—బంధువులందరూ మనల్ని వదలి వేసినా చెయ్యవలసిందే. రెండోపెళ్లి లేకపోవడంచేత జరుగుతూవున్న చెప్పరాని ఘోరపాత కాలకంటె వేయి వెలులయినా మంచిదే. ముండామోసిన పడుచు వాళ్ళల్లో జరుగుతూవుండే అక్రమాలున్నూ రహస్యాలున్నూ మగ వాళ్ళకు మీకు బాగా తెలియవు. మీరు మహాయోగ్యురాలని సం తోషించే జానకివంటిదానికి మొగుడు పోయినతరువాత ఇదివరకు రెండు కడుపులువచ్చినవి. చెప్పకుంటే సిగ్గులచేటు. అదియెంతో యోగ్యురాలేఅవును. అయినా నడివయస్సులో వున్నప్పుడు కామము జయించడానికి యెవరితర మవుతుంది?

సీతా—శివశివా! విధవావివాహములు లేకపోవుటవలన నీ జగత్తులో నెన్నిదుష్కార్యములయినను జరుగుచున్నవి. నీవు ప్రత్య క్షముగా చెప్పనక్కఱలేదు. ఇంట నిటువంటిదుశ్చేష్టలు జరుగుచుం డఁగా చేయునదిలేక సహించి యూరకుండి రాత్రిందివములు లోలో పలనె కృశించి దుఃఖించుచుండుటకయి దేవుఁ డీప్రకారముగా మన కాయువుపోసినాఁడు. ఇఁక జానకికి శిరోజములు తీసివేయించ వలసినదే.

(అని కన్నులనుండి దిగజాఱు నీరు పైబట్టతో తుడుచు కొనుచున్నాఁడు.)

[అప్పుడు విశాలాక్షిని వెంటబెట్టుకొని జానకి
ప్రవేశించుచున్నది]

జాన—విశాలాక్షీ! నేను చద్దన్నముతినలే దాకలవుతూ వున్నది. వేగిరం భోజనానికి లెమ్మని నాన్నగారిని పిలువు.

విశా—నాన్నా! అన్నానికిలే.

సీతా—ఇదిగో వచ్చుచున్నాను. మీరుపొండి. (అని జానకి మొగమువంకఁ జూచి తలవంచుకొని దుఃఖించుచున్నాఁడు)

సుభ—బాబయ్యగారిని నేను భోజనానికి తీసుకువస్తాను. మీరు లోపలికి వెళ్ళండి. (అని కంట తడిపెట్టుచున్నది)

జాన—విశాలాక్షి భోజనానికి తాళలేకుండావున్నది. నాన్నగారిని వేగిరం తీసుకుని వస్తానని చెప్పివచ్చి నీవు కూడా యిక్కడ అట్టే కూర్చున్నావా? మీరు వచ్చిందాకా నేనూ వెళ్ళను.

సీతా—వచ్చుచున్నాను. స్నానమునకు నీళ్లు సిద్ధముగా నుంచు. (అని కన్నులు తుడుచుకొనుచు లేవఁగా నందఱును వెంట వెళ్ళుచున్నారు)

---

3. రంగము—ఆగృహములోనే పడమటియిల్లు.

(జానకియు, సుభద్రమ్మయు ప్రవేశించుచున్నారు)

జాన—అమ్మా! యిందాకా నాన్నగారూ నీవూ పడకగదిలో యేమో చాలాసేపు రహస్యం మాట్లాడినారు. అందులో నాసంగతి యేమైనా వచ్చిందా యేమిటి? నాన్నగారు నావంక చూచి కళ్ళనీళ్లు పెట్టుకొని తలవంచుకుని కిందచూస్తూ వూరుకున్నారు. నీవుకూడా నామొఖం కేసిచూచి వ్యసనపడ్డట్టు కనపడ్డావు. మీ యిద్దరికీకూడా అలాగు దుఃఖం రావడానికి కారణం యేమిటి? అప్పటి నుంచీ విన్నీసంగతి యెప్పుడడిగి తెలుసుకొందామా అని లోపల

తొందరపడుతూ సమయం దొరక్కపోవడంచేత యింతసేపటి వారా నిరీక్షిస్తూవున్నాను. ఇప్పుడు మనము ఒంటిగావున్నాము గనుక నాతో ఆసంగతి చెపుతావా?

సుభ—నీసంగతే చెప్పకుని యింతసేపు నాన్నగారూ నేను కూడా దుఃఖపడ్డాము. మాకీబిడ్డలే కలుగకపోయినట్టయితేహాయిగా వుండివుందుము. సంతానము లేనివాళ్ళకు బిడ్డలు లేకపోయినారు గదా అని అప్పుడప్పుడు కొంచెం విచారంతప్ప మరి యేవిచారమూ వుండదు. నిత్యమూ బిడ్డలుకన్నవాళ్ళ కన్నీ దుఃఖాలే. అందులోనూ బిడ్డలు దుశ్చరిత్రం కలవాళ్ళయితే తల్లిదండ్రుల దుఃఖం యింతంత అని చెప్పడానికి అలవికాదు. మీ మూలాన్న మాకు మనస్సుకు యెంతమాత్రం నెమ్మదిలేకుండా యెప్పుడూ ఖేదపడుతూ వుండవల సినగతి వచ్చింది.

జాన—(తనలో) యిప్పుడు నాకు మళ్ళీ కడుపువచ్చినసంగతి యేమైనా తెలిసివుండునా? నేనీ మూడుమాసాలనుంచీ మామూలు ప్రకారం నెల కొకపర్యాయం మూడు దినములూ వాకిటవున్నట్టు నటిస్తూనే వున్నానే. చాకలిముండ వకవేళ గ్రహించి యేమయినా రహస్యంగా పేలివుండదుగదా? మరినకలాగు తెలుసుకోవడానికి కడుపయినా అంతయెత్తుగా కనఁబడడంలేదు. అయినాకానీ తొందర పడక మెల్లిగా సంగతియేమో అడిగి తెలుసుకుందాము. నేడుకాక పోతే రేపయినా యీరహస్యం అమ్మతో చెప్పకతప్పదు. నాదుర్న డత సహించి నన్నాదరించి కడుపులో పెట్టుకోవడానికి తల్లీదండ్రీ కాకుండా నాకు వేఱే ఆప్తులు యెవరున్నారు? (బిగ్గరగా) అమ్మా! నానిమిత్తంగా మీదంపతుల కిద్దరికీ దుఃఖం కలుగుతూవున్న సంగతి నేను బాగా యెఱుగుదును. మీపెద్దప్రాణాల మనస్సుకు బాధకలుగ కుండా నడుచుకోవలెననే నాయావచ్ఛక్తినీ వుపయోగిస్తూవున్నాను.

అట్లావున్నా కానీ పాపిష్ఠియవ్వనము నన్ను మోహపెట్టి మధ్యమధ్య నన్ను తనవలలో పడవేసుకుని నాకు నళ్ళు తెలియకుండా వున్న కాలంలో నాచేత కొన్ని కానిపనులు చేయించి మీకు మనోవేదన కలిగేటట్టు చేస్తూవున్నది. కార్యం అయిపోయినతరువాత నేనుపశ్చాత్తాపం తెచ్చుకొని యికముం దెప్పుడూ మళ్లీ యిటువంటిపనిలో ప్రవేశింపనని నిశ్చయంచేసుకుంటూవచ్చినా, సమయంవచ్చినప్పుడు నాబుద్ధి భ్రమించిపోయేటట్టుచేసి కామము తన సమ్మోహనవిద్యచేత నన్ను లోబరుచుకుంటూ వుంటుంది. అప్పుడు నాయింద్రియములే నాకు స్వాధీనంకావు; అవి నామాట వినక కామాదులతోచేరి నామీఁద తిరగఁబడి నన్ను దుష్కార్యంలోకి దింపుతూవస్తవి. ఇది వరకు జరిగినది యేలావున్నా యింకముందు మీ మనస్సుల కెంత మాత్రమూ నొప్పి కలుగకుండా ప్రవర్తించడానికి నా యావచ్ఛక్తినీ ధారపోసి సర్వవిధాలా ప్రయత్నంచేస్తాను. అవతల భగవంతుడి సంకల్ప యేలావుంటే అలా అవుతుంది. వెధవవాళ్ళకు పెళ్ళిలేకుండా చేసినందుకు దేవుడు వాళ్ళకు కామంకూడా లేకుండా చేసినట్టయితే లోకంలో యిటువంటి దుష్కర్మలు లేకుండా అందరూ యెంత సుఖపడుదురు! అలా చెయ్యడానికి యిష్టంలేకపోతే వెధవముండలందరూ వక్కమాటుగా చచ్చేటట్టయినా చెయ్యరాదా? చంపకుండానూ బ్రతికించి కామమూ తీసివెయ్యక పెళ్ళిలేకుండానూ చేసి యీలాగు బాధపెట్టడానికి దేవుడికి మేమేమి ద్రోహంచేసినాము? దిక్కుమాలిన దేవుడు మనుష్యులకంటెనూ దుర్మార్గుడు. నేను చచ్చిపోయి మన మహాలక్ష్మి బాగావుంటే యీవిచారం లేకుండా మీకెంత సంతోషంగా వుండును? విధవదానికి నాకీచక్కదనమూ యవ్వనమూ బ్రతుకూ యెందుకు? యికనయినా భగవంతుడు వేగిరం నన్నీలోకాన్నుంచి తీసుకొని పోరాదా? (అని యేడ్చుచున్నది.)

సుభ—యెందు కేడుస్తావు వూరుకో. నీ పూర్వజన్మకర్మం అలాగువున్నది. మాకడుపున పుట్టినవాళ్లీప్రకారంగా అడలుతూ వుండగా యేమీ చెయ్యలేక మాస్తూ వూరి కేవుండడంచేత యీదుఃఖ మంతా మాదేకానినీదికాదు. (అని కన్నుల నీరు పెట్టుకొనుచున్నది.)

జాన—మావల్ల మీకు రెండువిధాల దుఃఖం సంభవిస్తూ వున్నది. మీకళ్ళముందర మేమీప్రకారంగా దుఃఖ మనుభవిస్తూ వుండగా చూడలేక వకదుఃఖము? మేమెప్పుడయినా బుద్ధి గడ్డితిని కామోద్రేకంచేత యేదైనా అకార్యానికిలోబడితేమరివకదుఃఖము, మీయెన్నిదుఃఖాలైనా నేనువక్కరాత్రివంటిగాపడుండిమీరు గదిలో పడుకున్న కాలంలోపడే క్షోభలో నూరోపాలుకయినా సమానం కావు. అటువంటి స్థితిలో మేము యావజ్జీవమూ వకటే రీతిగా రాత్రింపగళ్లు విరామములేకుండా పొందవలసిన దుఃఖం యింతంతని చెప్పడానికి యెవరికైనా అలవి అవుతుందా?

సుభ—అవును. అలవికానిమాట నిజమే. మీరు పడే బాములు తలుచుకుంటేనే నాగుండెలుబద్దలై మనసు దహించుకొని పోతుంది. మాకే అట్లావుండగా నిజంగా ఆకష్టాలనుభవించే వారికి దుఃఖం మీకు యెట్లావుండునో.

జాన—నావంటివాళ్ళకు గలిగే దుఃఖంఅనుభవంవల్లం తెలుసుకోతగ్గదేకాని అది యీలాటిదని మాటలవల్ల చెప్పడానికి శక్యమయినదికాదు. ఇటువంటి కష్టజీవనం జీవించడం కంటె చావైనా వెయ్యిరెట్లు మేలుగా వుంటుంది. అయినా తనకష్టాలను ఆప్తులయిన వారితో చెప్పుకొన్నప్పుడు దుఃఖము కొంత శాంతించి మనసులో బరువు చాలా తగ్గిపోతుంది. లోకంలో నాకు నీకంటె ఆప్తులు మరి యెవరూ లేరు గనుక నాకడుపులో వున్నదాన్ని నీతో చెప్పి వేసి కొంత వూరట పొందుతాను.

సుభ—నీకథ మొదటినుంచీ నాకు తెలియనిది యేమీ లేదు. గడిచిపోయినదాన్ని మళ్ళీ జ్ఞాపకంచేసి నాకు దుఃఖం మెక్కువ చెయ్యడం తప్ప మరేమీ లాభం కలుగదు. అయినా కానీ అలా చెప్పడంవల్ల నీకు దుఃఖశాంతి కలుగుతుందని నమ్ముతున్నావు గనుక నేను కొంచెం శ్రమకయినా ఓర్చుకుని నీ సుఖంకోసం నీ వేమి చెప్పినా గుండె రాయిచేసుకుని వింటాను. ఏమీదాచక చెప్పదలచు కొన్నదంతా మనసు విడిచి చెప్పు.

జాన—ఆ బ్రతికివున్న నాలుగుదినాలయినా నీ అల్లుడు నా మీద యెంత ప్రేమగలిగి వుండేవాడో నీకే తెలుసునుగదా? ఆయన నే నంటే ప్రాణం విడిచేవారు; యింట్లో యెవ్వరైనా నన్ను కాస్త మాట అంటే కలిపించుకుని వచ్చేవారు. నేను కాపురానికి వెళ్ళిన సంవత్సరానికల్లా పదిలంకణాలు చేసి అటువంటి మొగుడు కాలం చెయ్యడం చేత కొండవిరిగి మీద పడ్డట్టు వుండి యేమీ తోచక దుఃఖసముద్రంలో మునిగిపోయి నాకిక యీప్రపంచముతో పనిలే దనుకొని యేలాగయినా ప్రాణం పోగొట్టుకోవలెనని నూతివద్దకు పది మాట్లు పరుగెత్తుకొని పోయినాను. అప్పు డందరూ వచ్చి నన్ను పట్టుకొని లోపలికి తీసుకొనివెళ్ళి మీరు వచ్చినదాకా రాత్రింపగళ్లు వకరు విడిచి వకరు నావద్ద కనిపెట్టుకుని వుండి నన్ను మీకు వప్ప గించినారు. నా అత్తవారి తాలూకు సొమ్మంతా పట్టుకునినన్ను మీ రిక్కడికి తీసుకువచ్చిన తరువాత సమేతూ నేను తిన్నగా అన్నం తినక నీళ్ళు తాగక మనోవ్యాధిపెట్టుకొని మంచం పట్టివక్కమోస్త రుగా యేడుస్తూ వుంటే నాన్నగారూ నీవూ ప్రతిదినం నా మంచం వద్దకు వచ్చి వేదాంతం మాటలు చెపుతూ నన్ను ఓదారుస్తూ వుండేవారు గదా?

సుభ—అవును. అప్పటి నీ అవస్థ చూచినవాళ్ళు నీ వీలాగు మళ్ళీ భూమిమీఁద అడుగుపెట్టి మనుష్యులలో కలిసి తింటూ తిరుగుతావని యెవరూ అనుకోలేదు. నీవు చచ్చిపోతావని నేనువక్క తెనూ చాటున కూర్చుండి యేడ్చేదాన్ని. నీ నిమిత్తమయ్యే నాన్నగారు మన యింట్లో పురాణకాలక్షేపం వకటి పెట్టి నిన్నెట్లాగో బలవంతం చేసి తన మీద వట్టుపెట్టుకుని తీసుకనివచ్చి పురాణం వినడానికి నిన్ను గదిగుమ్మములో కూర్చుండపెట్టేవారు. తరువాత తరువాత నీవు పురాణం వినవలెననే అపేక్షచేత గదిగుమ్మంలోనుంచి లేచివచ్చి యెవరూ లేనప్పుడు యివతల కూర్చుంటూ వుండి ఆ ధ్యానంతో కొంత దుఃఖం మఱచిపోయి నెలదినములకు కొంచెం కోలుకున్నావు.

జాన—మొదటి పదిదినాలూ మీ నిర్బంధంచేత వూరికే గుమ్మంలోకూర్చుండేదాన్నే కానిశాస్త్రుల్లుగారేమిచదివేవారో యేమి అర్థంచెప్పేవారో యేమీ నా చెవిని చొచ్చేదే కాదు. అటుతరువాత సీతాదేవిమొదలయిన వారికి ఆపదసంభవించినపట్టుచదివిఅర్థంచెప్పేటప్పుడు కొంచంవినవలెనని బుద్ధిపుట్టి నా వలెనే పూర్వపువాళ్ళు కూడా కష్టపడేవారుగదా అని వాళ్ళవిషయమయి కొంత జాలిపుట్టి అందులో నా దుఃఖం మఱచిపోయి వాళ్ళకోసం మనసులో విచారించేదాన్ని. అందువల్ల నాకు రోజుకురోజు కొంచెం ధైర్యంకలగడం ఆరంభించినది. నేను గదిలోనుంచి యివతలకు రాకుండావున్నమూడు నెలలలోనే నా పెద్దపదినెగారు నాదిగొంగయేడుపనీ, యింట్లో పని చెయ్యవలసివస్తుందని మొద్దులాగున తిని మంచము నడుమెక్కి కూర్చుండి లేచి రాననీ, దుంగలాగున యెల్లకాలమూ కూర్చుండబెట్టి పనిచెయ్యడం కష్టమనీ, వారి ముందరనూ వీరి ముందరనూ నాకు వినపడేటట్టుగా సణగడం ఆరంభించినది; పిల్లిమీదనూ యెలుకమీదనూ పెట్టి నన్ను దెప్పేది. నా వ్రాత యీలాగయిపుట్టిల్లు చేర

బట్టిగదా అడ్డమయిన వాళ్ళూ నన్నాడి పోసుకోడానికి సందు కలిగిందని తెల్లవారగట్ట కొండంత చీకటి వుండగానే లేచి యెవరికంటా పడకుండా లోపలపాచి అంతా చేసేదాన్ని. తన సొమ్ము తాను తింటూవున్నా కానీ మగడుపోయి పుట్టింటికి చేరగానే అన్న పెళ్ళాలికీ తమ్ముల పెళ్ళాలకీ వాళ్ళ బ్రతుకంటే యెంతో తేలికగా వుంటుంది. ఇఖ ముండామోసి పుట్టిల్లు చేరేవాళ్ళు డబ్బులేని వాళ్లే అయిన పక్షమున, వదినెగార్లూ మరదళ్ళూ ఆడేరోతమాటలన్నిటికీ తల కాయవొగ్గివక్కపూట పట్టెడు మెతుకులకోసం యెవరేమి కాని కూతలుకూసినా పడుతూనలుగురు నవుకర్లపెట్టు యింటిపని అంతా చేస్తూ బిగ్గరగా యేడిస్తే యెవరేమనుకుంటారో అనిపయికి రాకుండా దుఃఖంలోపలనే మింగుకొంటూ యెవరూ లేకుండా చూచి అందరూ పడుకున్న తరువాత దొడ్లో దూరంగా వెళ్ళి యేడిచి రావలెను. అటువంటి నీచమయిన బ్రతుకు బ్రతకడంకంటె వురిపెట్టుకొని గుక్కెడు ప్రాణంవక్కమూటు పోగొట్టుకుంటే యీ బాధలన్నీ నిముషంలో విరగడ అయిపోతవి.

సుభ—నీకటువంటి కష్టాలేమీ యిదివరకు సంభవించలేదు గదా? మేమిద్దరమూ బాగావున్నంతకాలము యిఖనైనా నీ కటువంటి కష్టాలు రానియ్యము. నీవదినెగారు నిన్నొకసారియేమో అన్నదని తెలిసి చాటుకుపిలిచి దాన్ని నాన్నగారున్నూ నేనున్నూ కూడా చెడచీవాట్లు పెట్టినాము. మొగుడుకర్రపుచ్చుకుని దాన్ని యెముకలు విరగకొట్టినాడు. అప్పటినుంచీ అదినిన్నెప్పుడూ పల్లెత్తు మాట అనలేదు.

జాన—అటుతర్వాత ఆవిడయేమనడానికీ యెంత కాలంబ్రతికింది? ఆరోనెల కడుపుతో పుట్టింటికి వెళ్ళి నీళ్ళాడి అక్కడనే కాలం చేసింది. ఆధీనంతప్పి పుట్టిల్లుచేరేవాళ్ళకు అన్నపెళ్ళాలవల్ల బాధలు

లేకపోయినా దానినిమించేబాధలు యిక లక్షవుంటవి. ఎవరిమాటో చెప్పనక్కరలేదు. యేకగర్భవాసమందుపుట్టి నాయందెంతో ప్రేమ గలిగిన నాఅన్నగారేంద్ర లేవడంతోనే నేనెప్పుడయినా కనఁబడ్డట్టయితే ప్రొద్దున్నే లేచి వెధవముండ మొఖంచూచినాను, నేడేమో కీడుమూడుననీ దుశ్శకునమయిందనీ విసుక్కునేవాడు. ఇకపరాయి వాళ్లు వెధవల మొగంచూస్తే తిట్టడంఆశ్చర్యం కాదు. మొగుడు పోయి అనాథలయి దుఃఖపడుతూండేవారని తమంతటతాము వెళ్ళి చూచి ఆదరించడానికి బదులుగా అట్టివాళ్ళ పొడకనఁబడ్డప్పుడెల్లా దుశ్శకునమయిందని బంధువులుసహితం తిడుతూవుంటారు. దైవంచేసిన వంచనకు తోడు మనుష్యవంచనకూడా యీలావున్నప్పుడు, అలా గంటి పాపిష్ఠిబ్రతుకు బ్రతకడంకంటె చావడమే వుత్తమము.

సుభ—మనకు చావవలెననివున్నా కాలంరాని దేచావురాదు. యెంతటివారికీ జన్మాంతర ప్రారబ్ధంయెంతకాలం అనుభవించవలెనో అంతకాలమూ అనుభవించకతీరదు.

జాన—పూర్వజన్మంలో నేను యెవరికియేమి అపకారంచేసి నానో యెరుగనుకాని యీ జన్మంలో మాత్రము నేనిటువంటి కష్టా లనుభవిస్తూవున్నాను. నీఅల్లుడు పోయినకొత్తరికంలో వెనుక నేను పెట్టుకునే నగలుచూచినా కట్టుకునేచీరెలు చూచినా దుఃఖం ఆపు కున్నా పొర్లిపొర్లివచ్చేది. వాటిని చూచినప్పుడల్లా దుఃఖంపట్టలేక వకనాడు నగలనన్నిటిని తెగనమ్మించివేసి రొక్కంచేసుకున్నాను; చీరెలు నాపెట్టెలో లేకుండా మరదలికి కొన్నీ చెల్లెళ్లకు కొన్నీ యిచ్చివేసినాను. అప్పటికీ నా దుఃఖమేమీ పోలేదు.

సుభ—వక్కమాటు వూరుకో యెవరో నడచినట్టు చప్పు డయినది. ఎవరయినా వస్తూవున్నారేమో!

[శ్యామలాంబ చాటున ప్రవేశించుచున్నది]

శ్యామ—(తనలో) అమ్మ నడిచినట్టు చప్పుడవుతూవున్నది వూరుకోమంటూవున్నది. దీన్నిబట్టిచూస్తే వాళ్లేమో రహస్యంమాట్లాడుకుంటూవున్నట్టున్నారు. నేనీతడికెచాటున కూర్చుండి వాళ్ళను కనేమాటలు వింటూయుంటాను. వాళ్లు తలుపుతీసినపక్షానికివాళ్ళకు కనఁబడకుండా వెంటనే యీదోవనుదొడ్లోకి వెళ్ళవచ్చును. (అని తడికెచాటున కూరుచున్నది)

జాన—(ఆలకించి) నాకేమీచప్పుడువినబడలేదు. నీవువూరికే అలాఅనుకున్నావు గాని యెవరూరావడంలేదు. నామాటకడితేరావిను. నాయీడువాళ్లు నగలుపెట్టుకున్నా మంచిచీరెకట్టుకున్నా నా వ్రాత యిలా అయిందిగదా అని విచారంకలిగేది; నాయీడువాళ్ళు శుభకార్యాలలో పేరంటానికి వెళుతూవున్నా భోజనానికి వెళుతూవున్నా నాబ్రతుకు బండలయిందికదా అని దుఃఖంకలిగేది; నాతో కూడా చిన్నప్పుడాడుకునేవాళ్ళు బిడ్డలను కనిపెంచుతూ వుండడం చూచి నాకటువంటియోగ్యతపట్టలేదుగదాఅని కడుపుపగిలిపోయేది. పొరుగువాళ్ళయింట్లో వివాహమయినా వెళ్ళి వేడుకచూడడానికి నోచుకోలేదుగదా? పొరుగింటిమాటదాకాయెందుకు? మన యింట్లో నేశుభకార్యం జరుగుతూవున్నా నలుగురితోనూకలిసిసంతోషంగా తలయెత్తుకొని తిరగడానికివల్లలేదు. దైవమింతచేశాడుగదా అని యేడుస్తూబయటికిరాకయేమూలనోవొదిగివుండవలెను. వెయ్యిమాట లెందుకు? మనయింట్లో యేదో పండుగో పబ్బమోవచ్చి అందరికీ వేడుకగావుండే సంతోషదినం నాకుమాత్రం దుఃఖదినంగావుండేది.

శ్యామ—ఇప్పుడు అప్పచెప్పిందంతానిజము. మొన్న చిన్న చెల్లెలిపెళ్ళిలో నేను తిరుగుతూవుంటే పేరంటాళ్లంతా మొఖంముడుచుకోవడం అసహ్యించుకోవడం చూస్తే నాకూ యిప్పుడిప్పుడే యీ

సంగతులు అనుభవంలోకి వస్తూవున్నవి. అందులోనూ వకముసలి ముత్తైదువ నీ వెంతచిన్నదానవైనా వైధవముండవుగదా పునిస్త్రీల లోకి యెందుకువచ్చినావని నామొగమీదనేఅన్నది. నాకప్పుడెంతో దుఃఖం వచ్చింది. వాళ్ళు యేమిమాట్లాడుకుంటారో విందాము.

సుభ—అంత మనోవ్యాధిలోనూ నీకు పురాణకాలక్షేపం వకటి కొంచెం దుఃఖోపశమనానికి కారణమయింది.

జాన—కొంతనిజమేకాని, ఆపురాణకాలక్షేపమే నాకు మరి వకవిధమైన దుఃఖాన్ని తెచ్చిపెట్టింది. నాకు పురాణం వినవలెననే అపేక్ష అంతకంతకు యెక్కువయి మీరువున్నప్పుడూ లేనప్పుడూ కూడా శాస్త్రుల్లుగారిచేత మంచికథలు చదివించి అర్థం చెప్పించుకోవ డానికి మొదలు పెట్టినాను. వాటిలో తార, అహల్య మొదలయిన వాళ్ళకథలు యెంతో మనోహరంగావుండేవి. అందులోనూ చక్కని వాడు కావడమేకాకుండా వయస్సులో వుండడంచేత శాస్త్రుల్లుగా రాయాభాగములకు అభినయిస్తూ అర్థంవిప్పిచెప్పేటప్పుడు నామనస్సు వెన్నవలె కరగడాని కారంభించినది. మీరెవ్వరూలేనప్పుడుశాస్త్రుల్లు గారు తారాచంద్రాదుల సంభోగప్పట్లుచదివి చేతులుతిప్పుతూమళ్ళీ మళ్ళీ అర్థంవివరించేటప్పుడు వొక్కొక్కమాటు నామనసు తానటు వంటిసుఖం పొందడానికి ఉవ్విళ్ళూర మొదలుపెట్టేది. మళ్ళీఅంతలో అటువంటి తలపులు పాపహేతువులనితోచి బుద్ధిమళ్లించుకుంటూ వచ్చేదాన్నిగాని, అంతకంతకు మనస్సుకూ కామానికీ దెబ్బలాటే జరగడం ఆరంభించింది.

శ్యామ—నాకిప్పుడీసంగతులేమీ తెలియకుండావున్నవి. పెద్ద దాన్నయినతరువాత నాసంగతీ యిట్లాగే అవుతుందేమో.

జాన—పాపభయంచేత ముట్టమొదటనామనస్సెంతోదృఢం గానిలిచి లోబడకుండా పోరాడుతూవచ్చినా, పాతివ్రత్యానికి విరు

గుడుమందయిన శాస్త్రుల్లగారి వేదాంతోపదేశమున్నూ రోజుకు రోజు వృద్ధిపొందుతూవున్న నాయింద్రియములున్ను పాపిష్ఠియవ్వన మున్నూ మూడూకూడా యేకమయి పోరాడి నామనస్సునులోబరుచుకొని వేసటపొందించడంచేత నామనస్సుబలహీనమయి కామపరాధీనమైపోయింది. అప్పటికిన్నీ బొత్తిగా చావకుండా మూర్ఛపోయి వున్న నా మనసు మధ్యమధ్య తెలివివచ్చినప్పుడెల్లా లోపలహీన స్వరంతో మొరపెడుతూవున్న ధర్మదేవతయొక్క హితబోధవినడానికి ప్రయత్నపడుతూ వచ్చిందిగాని, మీరు మమ్మల్ని యింటికాడ దిగబెట్టిసింహాచలయాత్రవెళ్లినప్పుడు శాస్త్రుల్లగారు చేసినమాయచేత దుర్బలమయిన ఆహితబోధ యెంతమాత్రమూ చెవిని జొరక వకనాడుకొచెం కక్కూర్తికి లోబడ్డాను. మొదట ఆకార్యానికి దిగకుండానే వుండవలెను గాని వకసారి దిగిన తరువాత యిక ఆపుకోవడానికి యెవ్వరికీ శక్యం కాదు. మీరు యాత్రసేవించుకొని తిరిగి వచ్చేవరకూ మేమాప్రకారం స్వేచ్ఛగా దేహం తెలియకుండావివేకంపోయి సుఖసాగరంలో మునిగి తేలుతూవుండగా నాకంతలో— యేమి చెప్పను నాపాపఫలము?

శ్యామ—కడుపు వచ్చింది కాబోలును. ఈమాటలువింటేనే నాదేహం కంపం యెత్తుతూవున్నది.

సుభ—నీకు వక్కత్తికేకాదు. యువ్వనంలో వున్న వాళ్ళకెంతటి వాళ్ళకూ కామాన్ని జయించడానికి శక్యంకాదు. భర్తతో నిత్యం సుఖిస్తూవుండేవాళ్ళే కామంచేత కన్నుగానక మహామోహంలో పడుతూవుండగా కామం జయించడానికి నీవంటి దాని కెక్కడ సాధ్యమవుతుంది.

శ్యామ—అయ్యో! యికముందు నాబ్రతు కేమవుతుందో!

జాన—అప్పుడేమి చెప్పుదును? నాఅంతరాత్మ అకస్మాత్తుగా దీర్ఘనిద్రలోనుంచి మేలుకొని నామనస్సు చిల్లులు పడేటట్టుగా దూషించడాని కారంభించినది; మనసులో దాని పోటెక్కడకు వెళ్ళినా మానక అంతకంత కెక్కువై మనోవ్యథ బలము కావడాని కారంభించినది. ఆబాధ పోగొట్టుకోవడానికి వుపాయ మేమీతోచక ప్రాణత్యాగం చేసుకోవడానికి నిశ్చయించుకుని వకనాడు రాత్రి గోదావరిలో పడవలెనని యెవరూ చూడకుండా వెళ్లి కంఠం లోతు వరకూ దిగి చావడానికి మనసొప్పక ప్రాణాలమీది తీపిచేత తడి బట్టలతో మళ్ళీ యింటికి వచ్చినాను.

శ్యామ—నా కీసంగతి వింటేనే దుఃఖం వస్తూవున్నది. అది నిజంగా బాధపడేటప్పుడు యెలావుండేదో?

సుభ—అప్పుడు నీమనస్సు పడ్డ పరితాపం యెంతయినా దుస్సహంగా వుండి వుండును. వకనాడు రాత్రి పదిసారులు తలుపు తీసి వెలుపలికి లోపలికీ పోతూవస్తూవుండి తరువాత మేముపడుకున్న గది దొడ్డితలుపు గుంజడం మొదలుపెట్టినావు. అప్పుడు నేను లేచి వచ్చి యేమిటని అడిగినాను. మొట్టమొదట నీవెంతసేపటికిన్నీ చెప్పక మరీమరీ బుజ్జగించి అడిగినమీదట మెల్లిగా నీకు కడుపు వచ్చినసంగతి చెప్పినావు. అది విన్న తరువాత నాకారాత్రి నిద్రే పట్టలేదు?

జాన—అప్పుడు నీతో నిజమంతా చెప్పకపోయినా యిప్పుడు చెపుతాను. నే నారాత్రి మీపడకగది దొడ్డి తలుపు గుంజినది తలుపు తీసుకుని వెళ్ళి నూతిలో పడవలెనని. నీవు చేసిన బోధవల్ల బ్రతికినానే కాని లేనియెడల నేనారాత్రి యేలాగయినా తప్పకుండా ఆత్మహత్య చేసుకుందును. నీవు నన్ను నివారించి యేమేమో బోధించి ఘోరకలధానిచేత గర్భవిచ్ఛిత్తు చేయించుకోవడానికినన్నూ

డబరిచినావు. వకపాపకార్యానికి వడిగట్టినవాళ్ళు రెండోపాపకార్యానికి వెనుక తీయరు గనుక కులమునకు వెరచి మనసు రాయి చేసుకుని యెలాగో అపాపకార్యానికి సహితం నేను వప్పుకున్నాను.

శ్యామ—ఈమాటలువిన్న కొద్దీ లోపలదడపుట్టి నాకువణుకెత్తుతూవున్నది. అయ్యో! మనకులాచారం యెంతపాడుగావున్నది! రంకుతనమూ, గర్భస్రావాలూ, శిశుహత్యలూ, స్త్రీహత్యలూ మొదలయిన ఘోరపాతకాలు చేయడానికై నాప్రోత్సహపెడుతూవున్నది. గాని యీదుర్మార్గపుకులాచారం దిక్కుమాలిన బాలవెధవలకు పునర్వివాహమంగీకరించి వాళ్ళకుద్దేశలను తొలగించడానికి అనుమతింపదుగదా? నేను తిన్నగా వుండలేకపోతే మళ్ళీవివాహమయినా ఆడుతానుగాని రంకుతనంలో ప్రవేశించి యిలాగంటి అకార్యాలకెన్నడూ లోపడను. రామ! రామ! యీ దిక్కుమాలిన కులంలోఆడవాళ్ళకు మళ్ళీపెళ్ళిలేక పోఁబట్టికదా యీపాపపు మాటలన్నీ వింటూవున్నాను!

జాన—ఆపాపానికీ లోనయి సాధారణంగా మనవూళ్లోరండా గర్భాలు దిగఁబడడానికి మందిచ్చే యెరకలదానివద్దనే మంచుపుచ్చుకున్నా కొన్నిదినాలు వల్ల మాలిన కడుపునొప్పిచేత బాధపడ్డానే కానికడుపుమందరడంచేతనో మరి యేహేతువుచేతనో చూలుకిరగక యెప్పటివలెనే సంతాపముపాలు కావలసిన దాన్నయినాను.

సుభ—ఆప్రయత్నం వ్యర్థమయినతరువాత నీవు మరింత బెంగపెట్టుకుని తిన్నగా తిండి తినడంమానివేసి గదిలోనుంచి యివతలకులేచిరాక మనోవ్యాధిచేత మరింత కృశింపసాగినావు. కూతురికి కడుపువచ్చిందని సంతోషించి సూడిదలనుచేసి పెట్టడానికి మారుగా యీ కడుపెందుకు వచ్చిందా అని పిండముపడి పోవడానికి మందులు పెట్టవలసినయోగం నాకుతటస్థించినది. లోకంలో పగవాళ్ళయినా

యెప్పుడూ ఆడపిల్లలను కనకూడదు. నీవుపడ్డ పరితాపంచూచి మగడు పోయిన క్రొత్తరికంలో నైనా నీకంత దుఃఖం కలిగిందో లేదోనని నా కప్పుడు సందేహంతోచింది.

జాన—ఆభేదం నేనంతగా చెప్పలేనుగాని నాకప్పుడు కలిగిన ఆరాటం వర్ణించడానికి బ్రహ్మకైనా శక్యంకాదు. తోడిపెళ్ళవలె సంతానంలేకపోయిందని విచారించడానికి బదులుగా నాకీకడుపెందుకు వచ్చిందా అని యేడవ మొదలుపెట్టినాను. కడుపుతో వున్నప్పుడు జరిగేశ్రీమంతమూ, సూడిదెలూ మొదయిన సంతోషకార్యాలికి మారుగా నిద్రలేకపోవడం,తిండితినకుండా వుండడం, పరితాపపడడం మొదలయిన దుఃఖాలపాలయి కృశించడం సంభవించింది. యిలా కొన్ని నెలలు జరిగిన తరువాత వకనాడురాత్రి నొప్పులారంభించి పదిఘడియల ప్రొద్దుపోయేటప్పటికి ముద్దులుమూటకట్టే మగశిశువు పుట్టినాడు. ఆశిశువుమొగం చూడగానే నాకప్పుడు కలిగిన దుఃఖం యింతాఅంతా అని చెప్పడానికివల్లకాదు. అదివరకుశిశువుపుట్టగానే చంపిపారవెయ్యవలెనని మనస్సులో యెన్నివిధాలనిశ్చయించుకున్నా, పుత్రవాత్సల్యం యెటువంటిదో కాని ఆశిశువుమొగంచూచి చంప డానికి బుద్ధిపుట్టక యేమి చెయ్యడానికిన్నీ కూడా తోచకమనస్సులో వెయ్యితేళ్ళున్నూ జెఱ్ఱులున్నూ కుట్టినట్లుండ బహుబాధ పడ్డాను. నేనెంతపాపాత్మురాలినీ కఠినచిత్తురాలినీఅయినా నాహృదయంలో అప్పుడు యెక్కడలేనిదయా ప్రేమా పుట్టుకొనివచ్చి కడుపున గన్న బిడ్డను చేతులారా చంపుకోవడంకంటె కులమూబంధువులనూ వదిలి పెట్టి మాలమాదిగలలో కలియడమయినా వుత్తమమనినిశ్చయించు కున్నాను. నేనుయీలాగు తొక్కటపడుతూ పిల్లవానికేసిచూచి మన సులో యేగుడిసేటివాళ్ళ కడుపుననై నాపుట్టక నాకడుపున యెందుకు పుట్టినావని విచారిస్తూవుండగా, ఇంతలో అప్పవచ్చిపిల్లవాడిగొంతుక

నొక్కబోయిందిగాని నేనేచివాలున లేచి అడ్డపడి దానినవతలికి తోసి పిల్లవాణ్ని గట్టిగా ఒమ్మున అదుముకున్నాను.

సుభ—నీవు కాగాఅంతసంకోచించినావుగాని అన్నపూర్ణయితే నిమిషంలో అటువంటిబిడ్డలను నలుగురికి గొంతుకలు సులిమివేసును. అది మిక్కిలీ రాతిగుండెది: దానికి నీలాగు జాలీగీలీలేదు. దానిచేతి మీదుగా యిదివరికయిదారుగురు పిల్లలు స్వర్గస్థులయినారు.

శ్యామ—అయ్యో! యీచండాలపు ఆచారంవల్ల యేలాగంటి క్రూరకృత్యాలు జరుగుతూవున్నవి! ఆఆచారమే యిప్పుడు నా యెదటికి మనిషయివస్తే యేమిపాపం వచ్చినాకానీ నాకసితీరేటట్టుగా వక్కసారి గొంతుకపిసికి వీళ్ళాపిల్లవాణ్ని చంపదలచుకొన్నట్టుగాచంపి వేసి లోకానికంతా బాధలేకుండా నివారణంచేస్తును. ఇక్కడ అట్టే వుంటే పిల్లవాణ్ని చంపినమాటకూడా వింటానేమో వెళ్లిపోదునా! చిన్నప్పయ్య యీమాటుచెప్పబోయేమాట విని తరువాత వెళ్ళి పోతాను.

జాన—బిడ్డనువేగిరం వదలిపెట్టుమనినీవూఅన్నపూర్ణాకూడా నన్ను తిట్ట మొదలుపెట్టినా నామనస్సప్పుడు నిప్పులలోపెట్టి పొర్లించి నట్లువుండి కులంవదిలి పెట్టడానికీ శిశువునువదిలి పెట్టడానికీ కూడా తోచక మరేమిచెయ్యడానికీ కొంతసేపాలోచన పాలుపోక చిట్టచివ రకు చిన్నప్పటినుంచీ నన్నుపెంచి పెద్దదాన్ని చేసిన తల్లిదండ్రులను వదలిపెట్టడంకంటె అప్పుడుపుట్టిన శిశువును వదలిపెట్టడమే మంచిదని యెంచుకొని చంపడానికి మాత్రము వప్పుకోక తెగించి తెలతెల్ల వారేసమయాన్ని మెల్లిగా బిడ్డనెత్తుకుని వీధివయిపుకువెళ్ళి యొక పట్టాన్ని కిందపడవెయ్యడానికి చేతులురాక సంశయించి యెవరైనా వచ్చి చూచిపోతారేమో అనేభయంచేత విధిలేక చివరకు యెవరూ లేకుండాచూచి యెంగిలివిస్తళ్లు వేసేకుండులో ముందుగా పాతబట్ట

వకటిపరిచి వళ్ళువత్తుకోకుండా మెల్లిగాపిల్లవాణ్ని వానిమీదపరుండ బెట్టి పయినబట్టకప్పి చటుక్కున యివతలకువచ్చి గుండెలు తటతట కొట్టుకోగా దొడ్డి గుమ్మములోనిలుచుండి కాకులువచ్చి పొడిచిపోత వేమో అని విచారంచేత దూరాన్నుంచి చూస్తూవుంటిని. ఇంతట్లో పెంట లెత్తుకపోయేవాడువచ్చి పిల్లయేడుపు విని మగశిశువునుచూచి సంతోషించి కావిడి అక్కడఅట్టే పెట్టి పిల్లవాణ్ని తీసుకుని యింటికి చక్కాపోయినాడు. మనస్సుకు కొంచెం వూరటగలిగి నేనున్న లోప లికివచ్చినాను గాని నాధ్యానమంతా పిల్లవాడిమీదనేవున్నది. నే నప్పటినుంచీ దొరికినపిల్లవాడు బాగావున్నాడా లేదా అని వాణ్ని అడిగి తెలుసుకుంటూ యిప్పటికీ అప్పుడప్పుడు వాడికేమయినాయిస్తూ వుంటాను. వాడు మొన్నపిల్లవాణ్ని తనతోకూడా తీసుకునివచ్చి నాకు చూపించినప్పుడు పాతచేతిరుమాలు నావద్దవుండగా యిచ్చి నాను. గుమ్మడిపండువలె పిల్లవాడెంతో చక్కగావున్నాడు. వాణ్ని చూచినప్పుడు నాకెంతో దుఃఖంవచ్చింది. గొప్పవాళ్ళకడుపున పుట్టి బ్రాహ్మలలో వుండి వుద్యోగాలు చేస్తూవూళ్ళేలవలసినవాడికి అడ్డ మయినవాళ్ళయిళ్ళవద్దా పెంటలుతుడుస్తూ ముక్కునీళ్ళు యెత్తుతూ మనయెదుటనే నీచంగా జీవించవలసి వచ్చిందిగదా? (అని యేడ్చు చున్నది.)

శ్యామ—ఇకనేనిక్కడవుండి యీదుఃఖవార్తలు వినలేను వెళ్ళిపోతాను (అని లేచి వెళ్ళుచున్నది.)

సుభ—ఏడవఁబోకు నీవు కొడుకునెప్పుడు వీథిలోపారవేసి నావో వాడప్పుడే పోయినాడనుకో.

జాన—నావంటి నిర్భాగ్యురాలి కడుపున పుట్టిన వాళ్ళకు యేదురవస్థా కలగకుండా యెందుకుపోతుంది? మొదటిశిశువును పార వేసినతరువాత యిఖనెప్పుడూ కామానికిలోబడి కక్కూర్తిపడకూడ

దని నియమంచేసుకుని కట్టుగావుండవలెనని పెద్దవొట్టుపెట్టుకున్నాను. ఆవొట్టుప్రకారం కొన్ని మాసాలున్నతరువాత నాబుద్ధిఅంతాయేమ యిపోయిందో కాని క్రమక్రమంగా మొదట అనుకున్న మాటలన్నీ మరిచిపోయి శాస్త్రుర్లవలలోబడి మళ్ళీయెప్పటిలాగు శాస్త్రుర్లతో రహస్యంగా తిరగడాని కారంభించినాను.

సుభ—ఆపదమ్రొక్క లెప్పుడూ ఆపదపోయిన తరువాత స్థిరంగావుండవు. వయసులోవున్న వాళ్ళకు పురుషుడు వంటిగాతటస్థ మయితే మనసు నిలుపుకోవడానికి యెక్కడనో లక్షకూ కోటికీ వక్కత్తెకుగాని అందరికీ సాధ్యంకాదు.

జాన—అటుతరువాత శాస్త్రుర్లమీద అంతకంతకు మోహం యెక్కువయి నోములూ వ్రతాలూ పేరుపెట్టి అందరికీ తెలిసేటట్టుగా కొంతా యెవరికీతెలియకుండా రహస్యంగాకొంతా నాదగ్గరవున్న డబ్బంతా శాస్త్రుర్లకు దోచిపెట్టినాను. మీపెద్దప్రాణాలు సుఖంగా వున్నంతకాలమేకాని అవతల తోడబుట్టినవాళ్ళు తిండిపెట్టక నన్ను వెళ్ళగొట్టినట్టయితే నేను ముష్టియెత్తుకో వలసినదానినో, అటుకులు కొట్టుకోవలసినదానినో, పూటకూళ్ళు పెట్టుకో వలసినదానినో అవు తాను. అప్పుడు కామంచేత నాకు వళ్లూపయీ తెలిసిందికాదు. అలావుండగా నాకు ధనంపోవడమే కాకుండా మళ్ళీగర్భంవచ్చింది. ఈసారి నాకు మునుపటంత మనోవేదన కలుగనందున, ఆరంభంలో కడుపు దింపుకోవడానికి ప్రయత్నం చెయ్యక వుపేక్షచేసినాను. ఈ గండంగడిచి పిండంబయటపడ్డపక్షానికి యిఖ నెప్పుడూ జారత్వం చెయ్యనని మాత్రం ఆదినాలలో నిత్యమూ కోటివేల్పులకు మ్రొక్కు కుంటూవుండేదాన్ని. తొమ్మిది నెలలూ నిండినతరువాత ఆడపిల్లను కనడమూ, దాన్ని శాస్త్రుల్ల తీసుకువచ్చిన మంత్రసానికియిచ్చివెయ్య డమూ అంతాసేను తెలియనే తెలుసును.

సుభ—రెండోసారి పిల్లనిచ్చివెయ్యడానికి నీవు మొదటమాటంత విచారంపడలేదు. వకటి రెండుమాట్లయిన తరువాతక్రమంగా విచారం తక్కువవుతుంది.

జాన—యెందుకుచేతనోగాని రెండోసారి నా మనస్సుకు మొదటిమాటు కలిగినంతబాధ తోచలేదు. ఆమంత్రసానిముండ పిల్లదాన్ని తీసుకొనివెళ్ళి బోగంపల్లవపాణికి రెండురూపాయల కమ్ముకున్నదట. ఇప్పుడు పిల్లది దానియింటనే పెరుగుతూవున్నది. దుర్మార్గమయినయీకులాచారంవల్ల నాకు కలిగిన సంతానం మాలవాడియింట్లో పెరిగి వీధులువూడ్చుకోవలసిన వాళ్ళున్నూ బోగంవాళ్ళయింట్లోపెరిగి తన్నుకన్నవాళ్ళతోనూ వ్యభిచరిస్తూ గజెకట్టుకునిప్రతిచోటా ఆడవలసినవాళ్ళున్నూ అవుతూవున్నారు. నాపాపంయిలాగు పండిపోగా యెవరిననవలసిన పనియేమున్నది? అన్నయ్య మొన్న శాస్త్రులనుకొట్టి వెళ్ళగొట్టినాడు గనుక, నాకిప్పుడు బుద్ధివచ్చింది. యిక అటువంటిగుణంవదిలి తిన్నగా వుంటాను.

సుభ—ఏతిన్నగా వుండడానికైనా యికనీవు భూమిమీద బ్రతికి బట్టకడితేగదా? యేనిమిషాని కేమవుతామో వకదినంమనది కాదు. మీకర్మంయిలా కాలిపోయింది. కూతుళ్ళకు పురుళ్ళుపోసి మనమలినీమనమరాళ్ళనీయెత్తిపెంచడానికిమారుగాగర్భస్రావాలకూ శిశుహత్యలకూ తోడుపడవలసిన పాపం నాకు తటస్థమయింది. యేదియెలావున్నా నాకు యిప్పుడు నీ బ్రతుకును గురించే ముఖ్యంగా విచారంగావున్నది. (అని యేడ్చుచున్నది.)

జాన—నాబ్రతుకునుగురించి నీవిప్పుడు భయపడవలసినంత వుపద్రవం యేమీ పుట్టలేదే, యెందుకేడుస్తావు? భగవంతుఁడు నావంటి వెధవముండను కష్టాలనుభవిస్తూవుండడానికి యెల్లకాలం బ్రతికిస్తాడు.

సుభ—చావంటే యెంతసేపురావలెను? నీసంగతినీవిప్పుడేమి యెరక్కుండా వున్నావు. నీ అన్నగారు — నీఅన్నగారు — (అని యేడ్చుచున్నది)

జాన—(తొట్రుపాటుతో) నాఅన్నగారేమిటి? కడితేరా చెప్పకపోతే నన్ను చంపుకు తిన్నట్టుసుమా? నిజము చెప్పు.

సుభ—నీవేమో తనభార్యను శాస్త్రుల్లవద్దకు పంపినావని నీఅన్నగారు నీమీద మహాకోపంగా వున్నాడు.

జాన—రామరామ! నేనాపాపంయేమీ యెరుగను. ఆ అనుమానంచేతనే కామోలును మూన్నాళ్ళనుంచి నన్ను చూచినచోట నల్లా కొరకొరలాడుతూ నెటికలువిరుస్తూ తిరుతూవున్నాడు. హేతు వేమో అని నేను లోపల విచారిస్తూనేవున్నాను. నీపాదాలతోడు యిందులోనేనేదోషంయెరుగను. నేను చెడిపోయినందుకే రాత్రిం బగళ్ళు విచారిస్తూవున్నదాన్ని మగడుగల యిల్లాళ్లనుకూడా దుర్నడ తలోకి దింపుతానా? నాసంగతి దైవానికి తెలుసును.

సుభ—నీ వింటులో యేదోషమయినా యెరుగుదువో లేదో కాని నీ అన్నగారు మాత్రం నీమీఁదనే అనుమానపడి నీకువిషం పెట్టడానికికూడా ప్రయత్నంచేస్తూవున్నాఁడట. వాడు నీకేమిపెట్టినా తినబోకు.

జాన—నీకుకూడా నామీఁద అనుమానం వున్నట్టున్నది. తరువాత అంతానీకే తెలుస్తుంది. నాకు యిదివరకు వచ్చినఅపకీర్తికి తోడు యీఅపఖ్యాతికూడారాకుండావుంటే, విషంపెట్టినందుకువాడికి నే నెంతో కృతజ్ఞురాలనై వుంటాను. చావుకోసం యెదురుచూస్తూ వుండిన్నీ ఆత్మహత్య చేసుకోవడానికీ సాహసించలేక బాధపడుతూ వున్నాను. వాడు నాకు నిజంగా విషమేపెట్టినపక్షానికి వక్కనాటి

శ్రమతో యావజ్జీవమూ పొందవలసిన కష్టమంత విరగడై పోతుంది. మనలో విధవై జీవించడంకంటే వేరే తప్పిదంలేదు.

సుభ—మీ నాన్నగారి దుఃఖంచూచి వా డాప్రయత్నం మానుకొన్నట్టున్నాడు. నీశిరోజాలు తీయించి వేయించవలసిందని మాత్రం వా డిప్పుడు గట్టిపట్టు పట్టినాడు. మొగుడుపోయినతరువాత నీ కీతలవెంట్రుక లెందుకు? తల దువ్వుకోనా పువ్వులు ముడుచుకోనా? నామాటవిని నీఅన్నగారి కోరిక చెల్లించు.

జాన—అయ్యో! వాడు నాకష్టం గట్టెక్కించేమార్గం మళ్ళీ మానుకున్నాడా? ఆడవాళ్ళకు తలగొరిగించడంకంటె వక్కమాటు తలతరిగి వెయ్యడమేమంచిది. చిన్నప్పటినుంచీ చమురురాచి పెంచుకొని ప్రాణంతో సమానంగా చూచుకుంటూవున్న పుట్టుకతోనే దేవుడుదయచేసిన అలంకారాలను చూస్తూచూస్తూ మంగలవాడి కత్తికి వప్పగించి యెలా ప్రాణాలు నిలుపుకోగలుగుతాను? (అని కన్నీరు నించుచున్నది.)

సుభ—అమ్మాయీ! దుఃఖంఆపుకో. నీకీఅలంకారాలు వున్నా లేకపోయినావకటే, యెవరుమెచ్చుకుంటారు? యెవరుచూచి సంతోషిస్తారు? అవివుండడంవల్ల దువ్వుకోవడమూ చమురురాసుకోవడమూ లేక నీకూబాధగావుంటుంది: చూస్తూవుండడంవల్ల మాకూ దుఃఖంగావుంటుంది; నీవు బుద్ధిమంతురాలవుగనుక నామాటవిని నన్నూ నాన్నగారినీకూడా సంతోషపెట్టు.

జాన—అమ్మా! నీపాదాలికి నమస్కారంచేస్తాను. ఇప్పుడు మాత్రం నాకు శిరోజాలు తీయించేప్రయత్నం మాన్పించు. నాకు యిప్పుడు తలవెంట్రుకలు తీయించుకోవడానికీ వేరేబాధకంవున్నది.

సుభ—ఆబాధకంయేమిటో నాతోచెప్పు. నీకుబాధకలిగే పని నేనుమాత్రంచేస్తానా?

జాన—నీకు తెలియని దేమున్నది? నాకిప్పుడు మళ్ళీ—నేను చెప్పలేను.

సుభ—నీకు మళ్ళీ కడుపువచ్చిందా యేమి?

జాన—నీవు గ్రహించికూడా, ఆమాటమళ్ళీ నానోటనే యెందుకు పలికిస్తావు? ఈకడుపు దిక్కుమాలినముండకు నాకు రాక పోతే పెద్దన్నయ్య పెళ్ళానికి రారాదూ?

సుభ—అయ్యో! నాకిప్పుడు మళ్ళీకొత్తవిచారం తెచ్చిపెట్టి నావు. ఎన్నోమాసమో వేగిరంచెప్పు.

జాన—మూడో మాసం.

సుభ—అలాగయితే యింకా ముదరలేదు. మునుపు రెండు సారులూ యుక్తకాలంలోచెప్పక కార్యం చెడగొట్టినావు. ఈమాటు తప్పకుండా లేతలోనే తగినమందువేసి ముందుగా జాగ్రతపడవలెను. ఈవూళ్లో ముసలియెరకలదితప్ప యిటువంటిపనులలో సాధకురాలు మరియెవతెలేదు. అది రెణ్నెల్లక్రింద మీ అప్పగారికోసం వచ్చింది. అప్పటినుంచీ మళ్ళీ యెక్కడాజాడలేదు. రేపే వర్తమానం పంపి దాన్ని పిలిపించవలెను.

జాన—ఏమో నీమనసునచ్చిన వుపాయంచెయ్యి. నాబ్రతు కెప్పుడూ దుఃఖాలపాలే అవుతూవున్నది. తక్కువజాతి వాళ్ళల్లోవలె మనలో మారుమనుములయినా—

సుభ—అమ్మాయీ! యెవరో వస్తూవున్నారు. కళ్ళు తుడుచుకో.

[శ్యామలాంబ ప్రవేశించుచున్నది.]

శ్యామ—(తనలో) అప్పటినుండి వీళ్ళింకా మాట్లాడు కుంటూనే వున్నారు. జానకి తనకష్టాలే యింతసేపూ చెప్పి యేడు

స్తూవున్నది కామల్సును. (బిగ్గరగా) అమ్మా! నాన్నగా రెందుకో నిన్ను పిలుస్తూవున్నారు. నీతో యేమో మాట్లాడవలసి వుందట.

సుభ—నాన్నగారు పక్కరేవున్నారా ? మరి యెవరైన కూడా వున్నారా?

శ్యామ—నాన్నగారు భోంచేసి వెళ్ళి గదిలో పడుకుని యే వేళకూనిద్రపట్టక లేచివచ్చి నన్నుపిలిచి కాళ్ళుపట్టుమన్నారు. నేను కాళ్ళుపిసుకుతూవుండగానే వక్కకునుకుపోయి యింతలో నిద్రలో వులిక్కిపడిలేచి యేమీతోచనట్టువుండి యేమిటని నేనడిగితే యేమీచెప్పక నిన్ను పిలుచుకుని రమ్మన్నారు.

సుభ—ఆయన కేదో దుస్వప్నం వచ్చివుంటుంది. జానకీ! నేను నాన్నగారి దగ్గరకు వెళ్ళివస్తాను. నీవూ శ్యామలాంబా యిక్కడ మాట్లాడుకుంటూ కూర్చుండండి. (అని వెళ్లుచున్నది.)

జాన—మళ్ళీ వేగిరంరా.—చెల్లీ! మనం దొడ్లోతులసికోట దగ్గరకు వెళదామురా. నిన్ను వొకసంగతి అడగవలెను. (అని యిద్దరును వెళ్ళుచున్నారు.)

ద్వితీయాంకము

ప్రథమరంగము—సీతారామయ్యగారిగృహము.

[నారాయణమూర్తియు, గోవిందరావును ప్రవేశించుచున్నారు.]

గోవిం—అన్నయ్యా! నిన్న నేను పాఠశాలకు వెళ్ళినప్పుడు మనయింటి కెవరో రాజ పురుషులు వచ్చి నాన్నగారితో నేమో చాలాసేపు మాటాడిపోయినారట. రెండుమూడు దినములనుండి నాన్నగారేమోచిన్నపోయియున్నారు; అట్లుండుటకు కారణమేమని

నేను రెండుమూడుసారు లడిగిననునామాట వినిపించుకోక మరియొక ధోరణి తెచ్చుచువచ్చినారు. అందుచేత నేనా ప్రశ్న వేయుట నాన్న గారి కిష్టములేదని మాటాడక యూరకున్నాను. రెండుమూడు దినములనుండి రాజభటుఁ డెవఁడో మనయింటిచుట్టును తిరిగిపోవుచున్నాఁడు. మన యిరుగుపొరుగులవా రిద్దఱును ముగ్గురును గుంపులుగూడి యేమో చెప్పుకొనుచు నేను వెళ్ళగానే మాటాడుకొనుట మాని వేయుచున్నారు. రాజభటులు మన యింటి కెందుకు రావలెనో కొంచెము చెప్పెదవా?

నారా—వందమంది రాజభటులువచ్చినను, ఇప్పుడు మన నేమియుఁ జేయలేరు. రెండవవారికి తెలియకుండ రాత్రివేళ శవమును దహనము చేయించివేసినాము. ఆరాత్రివేళ వాహకులను కుదుర్చుటకును స్మశానభూమికి కట్టలు చేరవేయించుటకును నేనెంతయుయినను శ్రమపడ్డాను. ఇప్పుడీకుట్రయంతయు మనసీళ్ళకావళ్ళ బ్రాహ్మణుఁడు కామయ్యగాఁడు చేయుచున్నాఁడు. వానిని వెళ్ళఁగొట్టి వేసినాము కాని గాడిదకొడుకుకు వానికేవిషము పెట్టవలసినది.

గోవిం—సుందరమ్మవదినె పాముకఱచి చావలేదా యేమిటి? విషవైద్యుఁడువచ్చి చాలసేపు మంత్రించినాఁడే.

నా—అదిచచ్చిన తరువాత విషవైద్యుని పిలుచుకొనివచ్చినాము. మన సాంబశివుఁడు పోయినతరువాత దానినడత తిన్నగానే యున్నదికాని యేలాగుననో కొన్ని నెలలక్రిందట కామయ్యగాఁడు దానినికూడ నంటుకొన్నాఁడు. అమ్మ యీ సంగతి నాతో చెప్పి దానికి గర్భోత్పత్తికూడ అయినదని కన్నులనీరు పెట్టుకొన్నది. అమ్మయు నేనును కొంతసే పాలోచించి చేయవలసినపని నిశ్చయించి వెంటనే కామయ్యగాడిని మనయింటికడనుండి వెళ్ళఁగొట్టివేసినాము; అమ్మతరువాత రెండవవారెఱుఁగకుండ పాకపుచలిమిడిలో పాషా

ణముకలిపి మరదలికిపెట్టినది. పాషాణము మొదట నేనొకరి నిమిత్తము తెచ్చినాను; అది చివరకు మఱియొకరినిమిత్తముపయోగించినది. దైవమే వేళకెవరికేవిధముగా ముప్పుపెట్టునో యెవ్వరికిని తెలియదు తెల్లవారినదాఁక శవమట్టేయున్న నేమయినవచ్చునని తొందరపడి యారాత్రియే యన్నిపనులను కానిచ్చినాము. మేమాపని యెంత రహస్యముగా జరిగించినను, ఏలాగుననో కొంచెము పయికిపొక్కినది. రాజపురుషులకు వందరూపాయలిచ్చి వారినోళ్ళుకట్టినాము. సాక్ష్యము రాదుగనుక రక్షకభటులకుకూడ పదిరూపాయిలు పాఱవేసిన తీఱిపోవును.

గోవిం—మనకేమియు నపాయమురాక తప్పిపోయినను, మీరు చేసిన పనిమాత్రము మహాదారుణమయినది. మీకాసంగతి తెలిసినప్పుడు వదినెచు పుట్టినింటికడ దిగవిడిచి రావలసినది; తమ కడుపులోఁ బెట్టుకొని యాదరించుటకు తల్లిదండ్రు లొప్పుకొన్న పక్షమున వేఱేయుంచి యామెకు భరణమియ్యవలసినది. ఆవిడకిప్పుడు పదునెనిమిది సంత్సరముల వయస్సు. మగఁడు లేకపోయిన తరువాత వయస్సులోనున్నదా రొకప్పుడయిన భంగపడ కుందురా? కోడలుమాత్రమే కాక సాక్షాత్తుగా నన్నగారికోమార్తెకు విషము పెట్టుట కమ్మకెట్లుచేతులువచ్చినవి? మీరు చేసిన ఘోరకృత్యము విన్నమాత్రమున నాశరీరము పులకరించుచున్నది. మనసు కొట్టుకొనుచున్నది. రవంత కులాచారమును మీఱుటకు సాహసింపలేక నోట వచింపరాని కిరాతకృత్యములకు లోఁబడుచున్నాము. కటకటా! మనమత మింక కాల్పనా? నీవే మహాకార్యము నిమిత్తము మొట్టమొదట విషము తెచ్చినావో యా శుభవార్త కూడ నాకుఁ జెప్పితివా, విని సంతోషించెదను.

నారా—(దేహము కంపింప) చేసినపాపము చెప్పిన బోవు నని పెద్దలు చెప్పుదురు గనుక, నీకేమియు దాచక చెప్పెదను. జానకి చేసిన దుష్కార్యమొకటి చూచి కోపమువచ్చి దానికి పెట్టుటకయి మొట్టమొదట పాషాణమునుకొన్నాను. తరువాత అమ్మయొక్కయు బాబమ్మయొక్కయు దుఃఖమును చూచి దానికి హానిచేయవలెనన్న బుద్ధి నాకు మాఱిపోయినది. ఇప్పుడు నీవన్న మాటలమీఁద నామనస్సు చెదరి దేహము కంపమెత్తుచున్నది. మించిపోయినదానికి విచారించి చేసెడికార్యము లేదు. విషము పెట్టినతరువాతపశ్చాత్తాపము తెచ్చుకొని, అమ్మకూడ బహుదుఃఖించినది. ఘోరపాతకమున కొడిగట్టుకొన్నానుగదాయని నాకెంతో పరితాపము కలుగుచున్నది. అన్నపూర్ణమూలమున నిదియంతయు పుట్టినది. దాని దుర్బోధవలననే సుందరమ్మ చెడిపోయినది.

గోవిం—అన్నపూర్ణను, జానకిని నిందించిన కార్యమేమియు లేదు. స్వభావమును మళ్ళించుకొనుట కెవ్వరికిని శక్యము గాదుగనుక వయసులో నున్నంతవఱకు వారిని దూషించవలసినపని లేదు. తప్పిదమంతయు మనకులమువారిలోనే యున్నది. అనాథ యువతులసౌఖ్యమునకయి న్యాయమయినమార్గము నవరోధించి వారిని బాధపెట్టుచుండుటవలన నా తప్పిదమంతయు మనదేకాని మఱియొకరిదికాదు. దయావిహీనులమయి యటువంటి కాఠిన్యమును వహించినతరువాత మన కా దుష్కృతఫల మనుభవించకుండ తీఱునా? బాలవిధవలకు వివాహ మంగీకరించినంగాని యీ పాపములేమియు పోవు. అంతవఱకును నీ మాలకూళ్ళన్నియు నీలాగున నుండవలసినవే.

నారా—స్త్రీలకు పునర్వివాహము లేకపోవుట కలియుగము పుట్టినప్పటినుండియు నున్నదికాని నిన్న మొన్న వచ్చినదికాదు. ఎన్ని కష్టములు వచ్చినను పూర్వాచార కులాచారములను మాత్రము

మీఁటరాదు. పడుచుతనములో భర్తలుపోయినను పరపురుషుని మొగము చూడక పతివ్రతలుగా నున్నవారు లోకములో నెంతమంది యున్నారు కారు? మనయింటిలోకాఁగా పాప మీలాగున పండినది.

గోవిం—మనయొక్కరింట మాత్రమే యీలాగుననున్నదని నీవు భ్రమపడుచున్నావు గాని యించుమించుగా లోకమంతటను ఈవిధముగానే యుండును. చిన్నతనములో మగలుపోయినవారిలో తిన్నగానుండునది యెక్కడనో నూటికి కోటికి నొకానొకతె యుండునుగాని బాలవిధవలలో ముప్పాతిక మూడువీసము లెప్పుడోయొక సారియైనను కక్కూర్తిపడినవారుగానే యుందురు. నీవన్నట్లు పతివ్రతలుగానుండు కొందఱిలోనైనను విశేషభాగము సమయము దొరకకపోవుటచేతను బంధుజనులు నిర్బంధపఱుచుటచేతను పంజరములో చిక్కుకొన్న చిలుకవలె స్వేచ్ఛావిహారమున కవకాశములేక యాప్రకారముగా నుండవలసినవా రగుదురేకాని నిర్మలచింతచేతఁ గాదు. మన గ్రామము సంగతియంతయు మనము చెప్పలేకపోయినను మన వీధిసంగతి మాత్రము మనము విచారింతము.

నారా—మనవీధిలో నింటింటను ఒకరిద్దఱు బాలవిధవ లుండనే యున్నారు. వారిలో తిన్నగానుండువా రొకరిద్ద ఱుందురేమో కాని మొత్తముమీఁద నందఱును చెడుతిరుగుళ్ళు తిరుగువారుగానే కనబడుచున్నారు.

గోవిం—వారా యొకరిద్దఱును కనఁబడుచుండలేదు. ఆస్త్రీ తిన్నగానున్నదని వ్రేలుపడచి నాకొక్కదానిని పేరెత్తి చెప్పుము. దానిచరిత్రమంతయు నే నిప్పు డేకరువుపెట్టెదను. సోమయాజులు గారి విధవకూఁతురు మొన్న బహిరంగముగా తురకవాని తీసుకొని లేచిపోయి రాజవీధిలో గుడిసెవేసికొని వానితో కాపురమున్నది. ఆసోమయాజులుగారును సోమిదేవమ్మయు పెద్దతనములో పడుచున్న

దుఃఖము తలఁచుకొన్న నాకు గుండెలు బ్రద్దలగుచున్నవి. పాపమా బ్రాహ్మణుఁడీయూఱు నెలలనుండియు నిల్లువిడిచి వీధిలోనికి రాలేదు.

నారా—ఒక్కొక్క పాడుముండపుట్టి కులమున కంతకు నప్రతిష్ఠ తీసికొనివచ్చును. నాలుగు సంవత్సరముల క్రిందట మనయింటి యెదుట కంసాలివానిని తీసికొని లేచిపోయిన పాపిముండ బ్రతుకిప్పుడేమయినదో విన్నావా? వాఁడు దానివద్దనున్న నాలుగువందల రూపాయల నగలును తీసికొని యొకనాఁడు దానితో చెప్పకుండ పాఱిపోయినాఁడు. ఆముండ తరువాత రోగములు తగిలించుకొని తిండిలేక సకలబాధలుపడి చివరకు పంతులుగారిలోపల నంట్లుతోముకొని యెంగిలి మెతుకులుతిని జీవించుచున్నది. ఆనగలు నాలుగు లాగుకొని యాతురకవాఁడు దారిపట్టినతరువాత సోమయాజులగారి కొమార్తె గతియు నీలాగేయగును.

గోపిం—ఒక్క సోమయాజులుగారి కొమార్తెగతియే యేమి? మనలోని స్త్రీపునర్వివాహములేని క్రూరాచారమువలననలక్షలకొలఁది కులస్త్రీల కిట్టిగతియే పట్టుచున్నది. కొందఱిగతి యింతకంటె నిర్భాగ్యకరమయినదిగా నున్నది. మొన్న యీ పట్టణములోనే గొప్ప యింటబుట్టిన వెలగపూడివారి చిన్నదానికి సంభవించిన దురంతము చూచి జాలిపడి కన్నులనీరుపెట్టుకొనివారొక్కరైననులేరు. అంతమంది గొప్పపనులలోనున్న బంధువులుండియు నేమియుం జేయఁజాలక యాచిన్నదాని నురితీయుటకయి మాలవానికొప్పగించి యూరకున్నారు. అవిరుద్ధపుసంగతి జరిగిన తరువాత నేమియు సంబంధము లేని నావంటివానికి సహితము రెండుదినములవఱకును రాత్రి నిద్ర పట్టినదికాదు. అట్టిస్థితిలో తల్లిదండ్రులకును దోడబుట్టినవాండ్రకును బంధువులకును నెంతవిచారముగా నుండునో! ఇంకనాకుటుంబ మెప్పుడయినఁ దలయెత్తుకొని పదిమందిలోను తిరుగ గలుగునా? ఈయప

కీర్తి చేత గృహ మజమానుఁడుకుంగిపోయి సరి వారి మొగము చూచుచు గ్రామము లోనుండ లేక యిల్లువిడిచి సకుటుంబముగా నేఁటో రేపో కాశికి లేచిపోవుటకయి సిద్ధముగా నున్నాఁడు.

నారా—పాపమా చిన్న దానికి మరణశిక్ష విధించునప్పుడు న్యాయాధిపతికి సహితము కన్నులనుండి నీరు కారినది. అతఁడు జంతు హింసచేసి మాంసభక్షణము చేయు హూణుఁడయినను, ఈ విషయములో మిక్కిలిదయాళుఁడుగా కనఁబడినాఁడు. శిక్షాస్మృతినిమీఱి వర్తించుట కధికారము లేక యిష్టములేక పోయినను న్యాయాధిపతి యాకఠినశిక్షను విధింపవలసినవాఁడయినాఁడు. ఆచిన్నదాని నురి తీసిన దినమున మనగ్రామ మశేషమును చూడవెళ్ళినది. ఉరికొయ్య మీఁటను త్రొక్కినమాలవాఁడు సహితము చిన్నదానినిచూచియేడిచి యందఱిలోను బ్రాహ్మణకులమును పట్టుకొని చెడఁదిట్టినాఁడు. వాని మాట లప్పుడందఱిమనసులోను శూలములవలె నాటుకొని యెల్ల వారును కులాచారమును నిందింపసాగిరి. భాగ్యవంతులుగదా డబ్బు లాగుదమని యెవ్వరో దుర్మార్గు లీవ్యవహారమును పయికి తెచ్చినారు. ఆచిన్నదిచప్పున దండవిధాయియొద్ద ప్రథమవిమర్శనలో నేతననేరము నొప్పుకొన్నది. ఎంతధనము వ్యయమయినను పయికివచ్చినతరువాత తప్పించుట కెవ్వరికిని సాధ్యమయినదికాదు. తెల్లవారిలేచిన మన గ్రామములో నిటువంటి వ్యవహారములు ప్రతి దినమును లక్షలు మన చెవులకు వినఁబడుచుండును. అవియన్నియు పయికివచ్చుచున్నవా యేమిటి? కాలమును కర్మమును సమకూడినప్పు డేదోయొకటిపయికి వచ్చుచుండును.

గోవిం—ఈఘోరపాతకముల కెల్లనుమనకులాచారముమూలా ధారమయియున్నది. సర్వానర్థములకును జన్మస్థానమయిన యీ కులాచారము నశించెనా యిప్పుడు నేను పండుగుచేసిపిండివంటిలతో

పదివేలమందికి విందుచేసెదను. ఆచిన్నది తనయుక్కృత్యము బయులఁ బడ్డతరువాత బ్రతికియుండుటకంటె మరణము నొందుటయే మేలని యెంచుకొని తనయపరాధము నొప్పుకొనియుండును. ఒకవేళ శిక్ష తప్పించుకొన్నను, కులమువారామెను మరల జాతిలోనికి రానియ్యరు గదా? ఇఁక నామె యెల్లకాలమును జాతిభ్రష్టురాలై సమస్తమును విడిచి దుఃఖైకమూలమయిన చెడుబ్రదుకు బ్రదుకవలెను. అట్టి నీచపు మనుగడకంటె చావే వేయిరెట్లుత్తమమైనది.

నారా—అట్లయిన, రాజశాసనము బహుకాలము కష్టపడకుండ నిమిషములో ప్రాణముపోఁగొట్టి యామెకుపకారమే చేసినది.

గోవిం—క్రూరమయిన కులాచారమూలమునవచ్చెడిబాధను తప్పించి యాచిన్నదాని విషయములో రాజశాసనమొకవేళఁగొంచె ముపకారము చేసివను, అనాథలైన ముద్దరాండ్రవిషయమయి కులాచారమువలెనే రాజశాసనము నిర్దయమయినదిగానే యున్నది. ఈ యనర్థములకెల్లను కారకుఁడయిన దుర్మార్గుని రాజశాసనముగాని కులాచారముగాని సిగపువ్వుతెంపదు. బహువిధమాయోపాయములు పన్నినిర్దోషురాండ్రయిన ముగ్ధస్త్రీలను తమవలలోఁబడవైచి భంగపరచు దుష్టపురుషులను నిర్భయముగా విహరించుటకు విడిచిపెట్టి, అట్టి కఠినచిత్తుల దుష్ప్రయత్నములచే మోసపోయి తమ పాతివ్రత్యమును పోఁగొట్టుకొని మూలలనడఁగి యున్న యభాగ్యురాండ్రయిన యబలలను బాధించుటకయి కులాచారమును రాజశాసనమునుకూడఁ గలిసి తమ క్రౌర్యమునంతను జూపును. ఆచిన్నదాని దురవస్థకంతకును కృష్ణశాస్త్రికారకుఁడు; అతఁడు వారియింట దేవతార్చనకని ప్రవేశించి మెల్లగా నాచిన్నదానిని భంగపెట్టినాఁడు. ఈహానికెల్లను మూలకుడయినవాఁడు మహాగౌరవముతో మన యందఱి యిండ్లలోను తిరుగుచునే యున్నాఁడు; వానిదోషమునలన భాగ్యహీనురాలయిన

యాచిన్నదిమాత్రము మన్నుకొట్టుకొని పోయినది. ఆకృష్ణశాస్త్రి యొక్క విధవ చెల్లెలిదివఱకు పదికడుపులు దింపుకొని యెంతమందినో పిల్లలను చంపినది. దానినెవ్వరును నేమియుఁ జేయఁజాలరు.

నారా—ఇటువంటివి విచారించిన ప్రతి గృహమునందును కొంచెముగానో గొప్పగానో యుండనేయుండును. మనమెంతో యోగ్యురాలనుకొనుచుండినదీక్షితులవారికూతురంతటిదానికిప్రమాదమువలన నిటువంటిపాపమే సంభవించినది. ఆమె తండ్రితో గంగాపూజ చేయుచున్నదినములలోనే కడుపురాఁగా, శిశువు జననమయిన తరువాత బిడ్డను చొడ్డిలోనే గోయిత్రివ్వి పాతిపెట్టి తోడఁబుట్టిన వాఁడే యప్పకువిషముపెట్టి చంపివేసినాఁడు. ఈకలిమహిమయిట్లుండఁగా మనమేమి చేయఁగలము?

గోవిం—కాలమునునిందించుట వట్టివెఱ్ఱితనము. యోగ్యతాయోగ్యతలు మనుష్యులలోనున్నవి కాని కాలములో నేమియు లేదు. మనదుష్ప్రవర్తనము నంతను మనము కాలముమీఁద త్రోచివైచి పయికి మనము నిర్దోషులముగాఁ గనఁబడఁజూచుచున్నాము. అనాథలయిన యువతుల సౌఖ్యమునకు మనమున్యాయమయిన మార్గమును నిరోధించుటవలన వారు ప్రకృతిని జయింపలేక యింద్రియ దౌర్బల్యమువలనను కామపీడవలనను కామకప్రేరణమువలనను పురికొల్పఁబడి యున్మత్తురాండ్రయి కానిమార్గమునఁ బ్రవర్తించి తమకును తమవారికిని బహువిధవిపత్తులను తెచ్చిపెట్టవలసిన వారగుచున్నారు. వివాహమయిన మూఁడోనెలనేపోయిన గోపాలశాస్త్రి మేనల్లునిభార్య మొన్ననెవరినో తీసికొనిలేచివచ్చినదట. మనమింత ప్రయత్నము చేసినను, మనవీధినున్న బాలవిధవలలో నొక్కతెను మంచిదానిని చెప్పలేకపోయితిమి. కొందఱు బ్రాహ్మణ విధవలు శుభ్రముగా చాకలవాళ్ళను మంగలవాళ్ళను జీతములకే యుంచు

కొన్నారు; మఱికొందఱెవరు దొరకిన వాండ్రితోనెల్ల నేమ్చుచు భ్రూణహత్యలును, శిశుహత్యలును జేయుచు కులములోనేయుండి గౌరవహాని లేకుండ మనయందఱియిండ్లలోను నిశ్శంకముగా తిరుగుచున్నారు. మఱియొకవీధివారి నడిగినచో తమవీధియే యీవిషయమున మిక్కిలి పాడుగానున్నదని చెప్పుచున్నారు. ఏయూరివారినడిగినను, ఈదుర్మార్గముల విషయమై తమ గ్రామములో నున్నంత మాలకూ డెక్కడనులేదని చెప్పుదురు. మానుషస్వభావ మంతటను నేకరీతిగానే యుండునుగనుక, వయస్సులోనున్న స్త్రీలకుస్వభావమును జయించుట కెక్కడను శక్యముగాదు. తప్పిదము మనయందు పెట్టుకొని వృథాగా కాలమును దూషింపక, అందఱునుజేరి యీ పాప నివారణమునకై యేదైన నొక యుపాయము నాలోచించవలెను.

నారా—అటువంటి దుర్మార్గురాండ్ర నందఱిని చంపివేయుట తప్ప నాకు మఱియొక యుపాయమేమియుఁ గనఁబడలేదు. స్త్రీలు దుర్మార్గురాండ్రని యెఱిఁగియే త్రికాలవేదులయిన మనమహర్షులు స్త్రీలకు సహగమనము విధించినారు. వర్ణవివేచనములేని యీమ్లేచ్ఛులు మన దేశమునకు ప్రభువులుగావచ్చి మన శాస్త్రములు మంటంగలిపి మాణిక్యమువంటి మన సదాచారమును మాన్పివేసినారు. అందుచేత విధవమండ లెక్కువయి యీదుర్మార్గములకన్నిటికిని లోనయి బ్రాహ్మణవర్ణమున కవమానమును సిగ్గును తెచ్చుచున్నారు.

గోవిం—ఇప్పుడు విధవలను కులమువారు కలకాలముపెట్టెడు తుదిలేనిబాధలకంటె నొక్కమాఱు బ్రతికియుండఁగానే కాల్చిచంపుటయే మంచిదయినను, అహింసమాత్ర మెప్పుడును క్రూరకృత్యము కాకపోదు. మన పరిపాలకులకు లిప్పుడు దయాళురు కనుకనే యీ క్రూరాచారమును మాన్పియున్నారు. ఆ దురాచారము బహు

కాలమునుండి వచ్చుచుండుటచేతను దానివలన మనకేమియు బాధ లేదు గనుకను మనకది యిప్పుడంత క్రూరకృత్యముగా కనఁబడు చుండలేదు. ఆ యాచారమును పురుషుల విషయమునకు మార్చి, భర్తపోయిన తోడనే భార్య సహగమనము చేయవలసినదని బ్రహ్మచర్యము చేయవలసినదని చెప్పుటకు మాఱుగా నెంతచిన్న పిల్లయైనను భార్యపోయినతోడనే యామెశవముతోఁగూడకట్టిబ్రతికి యున్న భర్తను తగులఁబెట్టవలసినదనిగాని తలగొఱిగించి విరూపిని జేసిగాని తిన్నగా తిండిపెట్టక మాడ్చి శక్తికిమించినపని చేయించుచు వీధిమొగము చూడకుండ భర్తను మూలనదిమిపెట్టి మరల పెండ్లి లేకుండఁ జేయవలసినదనిగాని విధియుండి యాప్రకారముగా జరుగు చున్నచో, అది క్రూరాచారమగునో కాదో మనకప్పుడు తెలియును. అట్టిదురాచారములను తొలఁగించి ప్రజాసౌఖ్యము వృద్ధిచేయుట ప్రభుత్వమువారి కర్హకృత్యమే. మనలోవిధవావివాహము నెలకొల్పి నచో మన మిప్పుడనుకొన్న దోషములన్నియు నివారణమగును.

నారా—ఎన్నిదోషములు పోయినను బ్రాహ్మణులుమాత్ర మది చేయఁదగిన పనికాదు. విధవావివాహము మనశాస్త్రమెంత మాత్రము నంగీకరింపదు.

గోవిం—విధవావివాహము శాస్త్రసమ్మతమని మనపట్టణము లోనె కొందఱు సభలుచేసి వాదింపఁ బోవుచున్నారు. దొరతనము వారుకూడ విధవావివాహము ధర్మవివాహమేయనియు వారికిపుట్టిన సంతానము గనుక వారు దాయార్హులనియు రాజశాసనమునుజేసి పీఠికలో మనహిందూధర్మశాస్త్రములు స్త్రీపునర్వివాహము నంగీక రించుననికూడ వ్రాసియున్నారు.

నారా—ఏమివ్రాసినను మతాంతరులమాట మనమునమ్మ రాదు. వారేలాగుననైనను మనలను బ్రాహ్మణులనుండి చెడఁగొట్టి

యందఱితో సమానులనుగాఁ జేయవలెనని చూచుచున్నారు. విధవా వివాహము శాస్త్రసమ్మతమని వాదించువారు జాతిభేదమక్కఱలే దను మతాంతరుల పుస్తకములను జదివినవారే. శాస్త్రములకు వారు చెప్పినయర్థము విశ్వసింపరాదు. హూణభాషచదువుకొని రెండుపరీక్షలలో తేఱఁగానే నీకుకూడ నిటువంటి దుర్బుద్ధి పుట్టు చున్నది.

గోవిం—శాస్త్రములు ప్రమాణముకదా? విధవావివాహము శాస్త్రసమ్మతమని మన పండితు లొప్పుకొన్నపక్షమున జరిగించ వచ్చును.

నారా—మనపండతు లొప్పుకొన్నప్పటిమాట చూతము. వారిని బ్రహ్మదిగివచ్చునను ఒప్పించలేఁడు. మనలో నెటువంటిపండితు లున్నారనుకొన్నావు?

గోవిం—ఓకవేళ పండితులందఱు నంగీకరించిన పక్షమున, మన శ్యామలాంబకు వివాహము చేయుటకు నీవొప్పుకొనెదవా?

నారా—అటువంటి పాపపుమాటలనఁబోకు. శాస్త్రమంగీ కరించినను, మనవంటి అగ్రవర్ణములలో చేయరాదు. గొల్లలు మొదలగు వారి తోడిపాటిగా మనలో కూడ మాఱుమనుములున్న పక్షమున బ్రాహ్మణవర్ణమున కాధిక్యమేముండును? మనము కూడ తక్కువ వర్ణములవారితో సమానులము కామా?

గోవిం—ఇప్పుడు జరుగుచున్నట్టుగా గర్భస్రావములును, శిశు హత్యలును, స్త్రీహత్యలును, హీనజాతిసంభోగమునుజరుగుచుండుట చేత మనగౌరవము పోక యుండు తక్కిన జాతులవారివలె శాస్త్ర సమ్మతమయిన పునర్వివాహమును మనస్త్రీలకుఁ జేసి యీదోష ములనన్నింటిని పోఁగొట్టినందువలననా మన గౌరవముపోవును?

నారా—నాకీయుక్తులతో పనిలేదు. శాస్త్రమంగీకరించునని పండితులందఱు నొప్పుకొని నాన్నగారు కూడ సమాధానపడ్డ మీదట నే నప్పుడేమియు చేయక యూరకుండెదను. నే నప్పుడేమియు నడ్డము రాకపోవుటయే విధవావివాహము శాస్త్రసమ్మత మనువారికి మహోపకారము. కలి ముదురుచున్నది; ఇఁక నెవరు పట్టుకొన్నను వర్ణసంకరము కాక మానఁదు. పనియున్నది నేను వెళ్ళిపోయెదను.

[అని లేవఁగా నిద్దఱును వెళ్ళుచున్నారు.]

ద్వితీయరంగము—పాపమ్మయిల్లు.

[వంట బ్రాహ్మణుఁడు కామయ్య ప్రవేశించుచున్నాఁడు.

కామ—(తనలో) నారాయణమూర్తి వట్టి కిరాతుఁడు. తండ్రితో చెప్పి నన్ను వెళ్ళఁగొట్టించి వేసేఁడు. అప్పటినుంచీ అన్నపూర్ణతో మునుపటిలాగు స్వేచ్ఛగా తిరగడానికి వీలులేకుండా వున్నది. అయినా కానీ యీపాపమ్మ అవ్వ పుణ్యమాఅని రోజుకు వకపర్యాయమయినా యిక్కడ చూచుకోవడం సంభవిస్తూవున్నది. ఎలాగయినా ప్రయత్నంచేసి అన్నపూర్ణను యిల్లు లేవతీస్తాను. మొన్న నేను చెప్పినప్పుడే వప్పీనప్పడంగావుండి చూతామని సగం సమాధానం కనబరిచింది. నారాయణమూర్తిగాడు సుందరమ్మను విషంపెట్టి నిమిషంలో చంపివేసినాఁడు. నేను వాళ్ళయింట్లో అట్లే వున్నట్టయితే ఆదుర్మార్గుడు నాపనీఅంతేచేసును. ఒకవిధంగా లేచి రావడమే మంచిదయింది. తీరా సుందరమ్మను దహనంచేసి వేసిన తరువాత తెలిసింది కాని లేకపోతే వాళ్ళకొంపతీసివేస్తును. ఎప్పుడయినా వాళ్ళకుటుంబానికి గొప్ప అపకారంచేసి నాపగ తీర్చుకుం

టాను. అందులోనూ జానకమ్మమీఁద నాకు మహాకోపంగావున్నది శాస్త్రుల్లతో యేడుస్తూ నాతో రమ్మంటే వచ్చింది కాదు.

[ఇంతలో పాపమ్మ ప్రవేశించుచున్నది.]

పాప—నాయనా! నీవెంత సేపైంది వచ్చి?

కామ—ఇప్పుడేవచ్చినాను. ఇంకా అన్నపూర్ణమ్మరాలేదు. ఈవీధికి పుణ్యాత్మురాలవు నీవొక్కత్తెవున్నమూలంగా మావంటి వాళ్ళ కందఱికి ఆధారం దొరికింది.

పాప—నేను ముసలిముండనయినాను. మునుపు నాకాలంలో పడుచువాళ్ళందరూ యింటిముందర పడికాపులుపడి వుండేవారు. ఆకాలం పోయింది. యిప్పుడు నేను చేసే వుపకారమల్లా డబ్బుపుచ్చుకొని మీవంటి పడుచువాళ్ళకు కొంచెం స్థలం యివ్వడం తప్ప మరేమీ లేదు.

కామ—ఆసహాయంమాత్రం మాటలతో వున్నదాయేమిటి? యీవీధిని యిన్ని యిళ్ళువున్నవి. యేరండా కొడుకయినా యేరండ ముండయినా యింతమాత్రం వుపకారం కట్టుకుంటూవున్నారా? అన్నపూర్ణమ్మ వచ్చేవేళ మించినట్టున్నది.

పాప—యింకా మించలేదు. యింట్లో వాళ్ళందరూ భోజనానికి మడికట్టు కోవడంతోనే వస్తుంది. దానికి రావడానికి సమయం దొరకవలెనా? అక్కరలేదా?

కామ—యీలోగా వూళ్ళోకబుర్లేమయినావుంటే చెపుదూ.

పాప—యేమి కబుర్లున్నవి? మన యింటి వెనకాలను కాపురంవుండే సుబ్బమ్మ కడుపు దింపుకోవడానికి మందుపుచ్చుకొని పిండంపయికి రాక రాత్రి చచ్చిపోయింది.

కామ—ఆమనిషి పొట్టియెఱ్ఱవెధవ కాదూ?

పాప—అవును, ముప్ఫయ్యేళ్ళనుంచి. మన యింటికి తరుచుగా వస్తూపోతూవుండేది.

కామ—మనలో పడుచుముండలు కడుపులు దింపుకుంటూ వుండడమూ పిల్లలను కని చంపివెయ్యడమూ మందులుతిని చావడమూ మహా యెక్కువవుతూవున్నవి. యిలాగు వుండడంకంటె పడుచుముండలనందరినీ యెవరినైనా కట్టుకుని కాపురం చెయ్యమంటే బాగా వుంటుంది.

పాప—నాయనా! లోకంలో మన కళ్ళముందరనే యెన్ని విరుద్ధాలైనా పుడుతూవున్నవి. యెవళ్లో దుర్మార్గపు ముండవాళ్ళు వెధవవాళ్ళకు పెళ్ళిచేయించడానికి మనవూళ్ళోసభలుచేస్తారట. కలియుగం యింకా యేమి వున్నది! చాటుగా పిల్లలను గన్నా కడుపులు దింపుకున్నా యేమి యేడిచినా బాగా వుంటుంది కాని వెధవముండలు బహిరంగంగా పెళ్ళిచేసుకుంటారా?

కామ—నామతానికి పెళ్ళిచేసుకుంటేనే బాగా వుంటుందని తోస్తూవున్నది. అలాగంటి పెళ్ళివుంటే నేను యెవతెనయినా కట్టుకుని సుఖంగావుందును. డబ్బుగల వాళ్లు ముసలిముండా కొడుకులు సహితమూ మూడోపెళ్లికీ నాలుగోపెళ్ళికీ మూడేళ్లపిల్లలను చేసుకుని ముండామోయించడంచేత, యిప్పుడు పిల్లలకు కరువువచ్చి సాధారణ పురుసార్లకు యెక్కడా పిల్లలు దొరకడంలేదు. ధనాశచేత తండ్రి ముండాకొడుకులు కూతుళ్ళను వెయ్యింటికీ రెండువేలింటికీ రూపాయల కెత్తుకెత్తు అమ్ముకుంటూవున్నారు. డబ్బు తెచ్చుకోలేనివాళ్ళు బ్రహ్మచారులై యెల్లకాలమూ తిన్నగావుండలేక అడ్డమయిన గుడిసేటిముండలతోనూ యేడిచి సంకటాలు తగిలించుకొని బాధపడిచస్తూవున్నారు; కొందరు సంసారులను లేవతీస్తూవున్నారు. నేను చిన్నప్పటినుంచీ చెమటవూడ్చి సంపాదించిన యేడువందలరూపాయ

లూ నామామగారి మొగాన్నిపోసి నాలుగేళ్ళపిల్లను పెళ్ళిచేసుకుంటే అది పెద్దది కాకుండానే లంఖణాలుచేసి చచ్చిపోయింది.

పాప—మళ్ళీయేమయిన పెళ్లిప్రయత్నం యెక్కడనైనా చేస్తూవున్నావా?

కామ—నేను ప్రయత్నం చేస్తూవుంటేమాత్రం యెలాఅవుతుంది? రెండోపెళ్ళివాడనని డబ్బు యెక్కువ తెమ్మంటారు. మొన్న మూడేళ్ళపిల్లను తొమ్మిదివందలరూపాయలకు బేరంచేసినాను. ఇంతలోకే నేతి వెంకయ్యగాడు అడ్డంవచ్చి తాను వెయ్యిరూపాయలు పూర్తిగా యిస్తానని నాకంటె యిరవై యేళ్లు పెద్దవాడయినా పిల్లను తానుచేసుకున్నాడు.

పాప—దానిముండామోసిన రూపాయలు ఆవెయ్యిరూపాయలూ నీవే యిస్తాననకపోయినావా?

కామ—మొదటిపెళ్లి అయినకాడినుంచీ నీళ్లుమోసీ వంటలు చేసీ నాలుగువందలరూపాయలు కూడబెట్టినాను. జీతం లేకుండా బదులుతీరిందాకా వడ్డీకింద నవుకరీచెయ్యడానికి వప్పుకుని వకచోట అయిదువందలరూపాయలు బదులు మాట్లాడినాను. వక్క వంద రూపాయలు తక్కువయినవి. ఆరూపాయలు తరువాత యిస్తానని పెళ్ళిచేసుకొని మోసంచెయ్యవలెనని చూచినానుగాని, ఆముండా కొడుకు నామాట నమ్మక ముందుగా రూపాయలక్కడపెడితేనేగాని పిల్ల నివ్వనన్నాడు. వెంకయ్యగాడు పునాసాతారావెళ్ళి నలభయి యేళ్ళు యేకాధ్వర్యంగా పీనుగులను మోసి డబ్బు సంపాదించినాడు గనుక, వెయ్యిరూపాయలున్నూ తక్షణం పారపోసినాడు.

పాప—అన్నపూర్ణమ్మను పెళ్ళినిమిత్తం వందరూపాయలు సహాయం చెయ్యవలసిందని అడక్కపోయినావా?

కామ—పెళ్ళికని చెప్పితే యివ్వదలుచుకొన్నదయినా యివ్వదు. దానికి వేరేయెత్తు వున్నది. సీతారామయ్యగారి నగలపెట్టె ఆయనపడుకునే గదిలో భోషాణంలో వుంటుంది. నేనుయింట్లోఅట్టే వుంటే, ఆసొమ్మెలాగయినా తర్లిస్తును. తాళంచెవి యెలాగయినా సంగ్రహించుమని అన్నపూర్ణమ్మకు బోధిస్తూవున్నాను. మాప్రయత్నం సాగితే రెండు వేలరూపాయలకు తక్కువదొరకవు. ఆసొమ్ముతో ఆవిడలేచి రావడంతోనే సొమ్ము రహస్యంగా దాస్తానని చెప్పి వున్నది. దానికి వకకన్ను గుడ్డిది. అయినాకానీ యింతపెద్దపిల్ల మరివకతె దొరకదు.

పాప—తీరా వచ్చినతరువాత ద్రోహంచేసి డబ్బుపుచ్చుకుని దాన్ని మధ్య పదిలివేస్తావా?

కామ—నా పెళ్ళాం యెదిగి కాపురానికివచ్చేదాకా వదలిపెట్టను. అప్పటిదాకా చావకుండా బ్రతికివుంటేఅప్పటిమాటచూతాము. నీవిందులో పనిచేసి నాకుసహాయం చేసేటట్టయితే వచ్చిన సొమ్ములో నీకు వందరూపాయలు యిస్తాను.

పాప—అలాగైతే నీకు కావలసినంత సహాయంచేస్తాను. నా శక్తిచూడు. నీవు వుంచుకొన్నన్నాళ్లు వుంచుకొని నగలుతీసుకుని తరువాత నీవు దాన్ని యేనూతిలోనైనా రాత్రివేళ తోసివెయ్యవచ్చును. నిన్ను యెవరు పట్టుకుంటారు? అంతగాపైకివస్తే కడుపు నొప్పిచేత పడిందనవచ్చును.

కామ—తరువాత యేలాగైనా చూతాము. నీశక్తిఅంతా నీకార్యంలో కనపడవలెను.

పాప—వూరుకో అన్నపూర్ణమ్మ వస్తూవున్నది.

(అన్నపూర్ణ ప్రవేశించుచున్నది.)

అన్న—ఝాము సేపటినుంచీ వత్తాయంటే తీరుబడి అయింది కాదు. ఇదివరదాకా యెవరితోనో మాట్లాడుతూకూర్చుండి యిప్పుడే నాన్నగారు లోపలికి భోజనానికి వెళ్ళినారు. వెళ్ళడంతో నేయిలాగు చక్కావచ్చినాను.

పాప—నీకోసం కామయ్య రెండుఘడియలనుంచీకనిపెట్టుకుని వున్నాడు. అమ్మాయీ! యీకామయ్య బహుదొడ్డ బ్రాహ్మణుడు సుమీ. యెవరినినమ్మితే వాళ్ళకు ప్రాణంకోసియిస్తాడు.

కామ—అవ్వా! నామీద దయచేత నీవుపూరికే అలాగు పొగుడుతూవున్నావుకాని నేనెంతటివాణ్ని?

పాప — యీకబుర్లకేమికాని, మీకోసం యెవరైనా వస్తారు మీరు మాట్లాడుకోవలసిన సంగతులు ముందరమాట్లాడుకోండి. మీరు రహస్యం మాట్లాడుకుంటారేమో నేను అవతలికి వెళ్ళుదునా?

కామ—రరిసరి! మాకు నీవు వినకూడని రహస్యాలు యేమి వుంటవి? మనముగ్గురికీ దేహాలు మాత్రమే భేదంకాని మనస్సులు వక్కటే.

అన్న—అవ్వా! వెళ్ళవద్దు. మారహస్యం నీవూ వినవచ్చును.

కామ—బోషాణం తాళంచెవి సాధ్యమయినదా?

అన్న—నిన్న దొరికించేగాని తీరాగదిలోనికి వెళ్ళేటప్పటికి నా అన్నగారు కూడావచ్చినారు. అందుచేత సాధ్యమయిందికాదు. అప్పుడు మరిచిపోయి బాబయ్యగారి తాళంచెవి పదుపుమీద దిగబెట్టి యివతలకు వచ్చినారు. అటువంటిసమయం మరివకప్పుడు దొరకదు.

కామ—మన కన్నిటికీ పానకంలోపుల్లలాగు నారాయణ మూర్తే అడ్డంవస్తూవుంటాడు. నన్ను యింట్లో వుండనియ్యకుండా అతఁడే లేవకొట్టినాఁడు.

అన్న—వాడు మహాచెడ్డవాడు. అన్నీ కనిపెడుతూవుంటాడు. యీమధ్య వాడిభార్యవిషయమయి అనుమానము జానకి మీఁద పడిపోయింది కాని నామీఁద నేపడినట్టయితే వాడునిశ్చయంగా నన్ను చంపివేసును. నేను శాస్త్రుల్లను దానివద్దకు పంపడంచేత అనుమానము జానకిమీఁదకు పోయింది.

పాప—అదేమిటి?

అన్న—నేను కామయ్యకు యేమయినా యింట్లోవస్తువులు యివ్వబోతూవుంటే నావదినెగారు అడ్డంవస్తూవుండేది. వకరోజు నేను చెంబులో నెయ్యిపోసి దాసీదానిచేత పంపుతూవుంటే మెల్లిగా మొగుణ్ని తీసుకువచ్చి చూపింది. వాడుపట్టుకుని దాసీదాన్నీ నన్నూ కూడా కటికకర్రతో కొట్టినాడు. ఇలాకాదని నేను మెల్లిగా మంచి మాటలువేసి నావదినెగారితో స్నేహంచేసి మాయింట్లో పురాణం చెప్పే శాస్త్రుల్లతో యిలాకాచేసినాను. అప్పటినుంచీ యేమయినా అంటే తనగుట్టు బయలుపెడతానేమోనని నావదినెగారు నేనుయేమి తీసుకునివెళ్ళినాయెవరితోనూ చెప్పక వూరుకుంటుంది. తనపెళ్లాము శాస్త్రుల్లతో మాట్లాతూవుండగా వకనాడు నా అన్నగారు చూచి జానకిమీఁద అపోహపడి దాన్నిచంపడానికి ప్రయత్నంచేసినాఁడు.

కామ—ఈమాటలకేమిగాని సొమ్ముతీసుకుని నీవు లేచి రావడంమాట యేమిచేసినావు? ముందస్తిగా నాకాసంగతి చెప్పు. నీకు నామీఁద నిజంగా మోహం వున్నదీ లేనిదీ యిందులో తెలుస్తుంది. భుజంగరావు పంతులుగారి కిమగోనీళ్ళు తెస్తానని చెప్పి నీవు వచ్చినావేమో చూచిపోదామని వెళుతూ వెళుతూయిలావచ్చినాను.

వారు నాకోసం కనిపెట్టుకువుంటారు. యేదోవొకమాట చెప్పు. నేను వేగిరం వెళ్ళవలెను.

అన్న—నేనూ రాత్రీపగలూ ఆసంగతే ఆలోచిస్తూవున్నాను. నాకు యెటూతోచకుండా వున్నది. చిన్నప్పటినుంచీ పెంచి పెద్ద దాన్ని చేసి యెన్ని కార్యాలుచేసి గా కడుపులో పెట్టుకునే తల్లినీతండ్రినీ వదలిపెట్టడానికి వకపట్టాన్ని ప్రాణంవప్పకుండా వున్నది. ఆ ముసలి వాళ్ళిద్దరూ బాగా వున్నంతమట్టుకూ మనం యిలాగే వుందాము.

కామ—నేను మొన్న ఝాముసేపూ బోధించినదంతా గంగలోకలిసి వ్యవహారం మళ్ళీ మొదటికి వచ్చింది. నీవిలా అనుకుంటూవుండగానే నారాయణమూర్తి యెప్పుడో విషంపెట్టి నిన్ను చంపివేస్తాడు. అక్కడితో అన్నీ కుదురుతవి.

పాప—అన్నపూర్ణా! నీ సుఖం నీవు బాగావిచారించుకో. తల్లి దండ్రులూ తోడబుట్టినవాళ్ళూ అని అలోచిస్తే నీకు సుఖంరాదు.

అన్న—ఎవరో వస్తూవున్నారు చూడుకో.

[పురుషోత్తమరావుపంతులు ప్రవేశించుచున్నాడు.]

పుర—ఏమోయి కామయ్యా! ఇదిగో నీళ్ళు తెచ్చెదనని చెప్పి యిక్కడికువచ్చి వీరితో మాటలు వేసినావా? భుజంగరావు మడికట్టుకొని మంచినీళ్ళు రాలేదని దేవతార్చన చేసికొనుటకు వల్లకాక కనిపెట్టుకొని కూర్చున్నాడు. వేగిరము లేచివెళ్ళు.

కామ—ఇదిగో నిమిషంలో కావిడి వప్పగించివస్తాను. (అని నీళ్ళకావిడి భుజముమీద వేసికొని వెడలిపోవుచున్నాడు.)

పుర—ఏమి అయ్యా! ఏమో మీరందఱును మహాశ్చర్యముగా మాటాడుకొనుచున్నారు?

పాప—యీవూళ్ళో యిప్పుడు యేమిమాటలు వున్నవి నాయనా? యెవళ్ళోపోఖిరీ ముండాకొడుకులు వెధవముండలకు పెళ్ళి చేస్తామని బయలుదేరినారట. యిప్పుడందరికీ వినాశకాలం వస్తూ వున్నది. యింతకాలమయింది యిటువంటి దుర్న్యాయం మేమియెన్నడూ యెరగము నాయనా.

అన్న—(తనలో) యీముండ తాను మహాపతివ్రతలాగు అందరినీ చెడతిడుతూ వున్నది. చిన్నతనంలో మొగుడుపోతే అడ్డమయినవాళ్ళతోనూ తిరిగి యిళ్ళూవాకిళ్ళూ సంపాదించి యీముండ యిప్పుడు వీరపతివ్రత అయింది. ఆడవాళ్ళకు రెండోపెళ్ళి వుంటే మేమంతా యీ యేడుపులేకుండా సుఖంగా కాపురంచేస్తూ వుందుముగదా?

పురు—ఒకవిధముచేత విధవావివాహములు యుక్తముగానే యున్నట్టుతోచుచున్నవి. ముసలివాండ్రకు భార్యలుపోయినను చిన్నపిల్లలనే వివాహము చేసికోవలెను. ఎన్నియో సంవత్సరములకు గాని యాచిన్నపిల్ల లెదిగి కాపురమునకు రాదు. ఈలోపల మగవాండ్రు తిన్నగానుండలేక కక్కూర్తిపడి రోగములు తగిలించుకొని తాముబాధపడి యాచిన్నపిల్లల దేహములుకూడ చెడఁగొట్టవలసి వచ్చును.

పాప—పెద్దవాళ్ళయినా పెళ్ళాలెదిగి కాపురానికి వచ్చేవరకూ వుండేవారు లేరా?

పురు—ఉన్నారుగాని, అట్టివారివిషయములో భార్యలు రజస్వలలు కాకమునుపే తొందరపడి గర్భాదానముచేయుదురు. ఆపిల్ల లారాత్రియేడిచి యిల్లెగిరిపోవునట్టుగదిలో అల్లరిచేయుదురు; చిన్నతనమగుటచేత గృహకృత్యములు చక్కఁబెట్టుకొనుటకు చేతఁగాక యిల్లు పాడుచేయుదురు. అదిగాక ముసలిభర్తలకును పడుచు భార్యలకును

మనసెప్పుడును కలియదు. అందుచేత గుడికి మేకపోతు వెళ్ళినట్టుగా విధిలేక గదిలోనికి వెళ్ళినను ముసలికంపని ప్రక్కకొత్తిగిలి యా భార్యలు మంచపుపట్టెలను కౌగిలించుకొని పరుందురు. ఆలాగున నయిన నింటఁబడియుండక వయసులోనున్నపురుషులతో జారత్వమున కారంభింతురు. రెండవ పెండ్లివాండ్రు యుక్తవయస్సువచ్చినవిధవలను వివాహమాడెడుపక్షమున నీతొందర లేమియు నుండవుగదా?

పాప—కలికాలమందరికీ యిలాగంటిబుద్ధులేపుడుతూవున్నవి.

పురు—అవ్వా! మీయింటికి మాకోడలు రాలేదుగదా?

పాప—లేదు నాయనా!

పురు—నేను వెళ్ళుదునా? (అని వెళ్ళుచున్నాఁడు.)

పాప—(తనలో) పయికి లోకానికివెరచి యేమన్నా వెధవలకు పెళ్ళిళ్ళువుంటేనే బాగావుంటుంది. (బిగ్గఱగా) అన్నపూర్ణా! యీ వెధవల పెళ్ళిళ్ళు నీకు యెలాగువున్నవి?

అన్న—దిక్కుమాలిన పెళ్ళిళ్లులే. ఎవళ్లోపొయ్యేకాలంవచ్చి యిటువంటి పాపకార్యం తలపెట్టినారు. అవ్వా! యిప్పుడు వచ్చిన ముసలాయన యెవరు?

పాప—భుజంగరావుపంతులుగారి పినతండ్రి. ఈయన చెప్పిన సంగతులన్నీ తన అనుభవంచేత చెప్పినాడు. యేడెనిమిది సంవత్సరాల క్రిందట రెండోపెళ్ళి చేసుకున్నాఁడు. పెళ్ళాముప్పుడు పదహారేళ్ళది; దానిమీద బహుఅనుమానం. వక్కనిమిషంకనఁబడకపోతే యేమివుపద్రం వచ్చిందో అని వూరంతా తిరుగుతాడు. వీడెంత అనుమానంపడి యేడుస్తూవున్నా దానిపని అది రహస్యంగా చేసుకుంటూనే వుంటుంది.

అన్న—బాబయ్యగారు భోంచేసిలేచేవేళఅయింది వెళ్లుదునా?

పాప—కామయ్య చెప్పినమాట యేమిచేసినావు?

అన్న—నేనూ రాత్రీపగలూఅదే ఆలోచిస్తూ యేమిచెయ్యడానికీతోచకుండా కొట్టుకుంటూవున్నాను. అటుచూస్తే తల్లిదండ్రుల మీది మోహం తప్పలేకుండా వున్నాను. యిటుచూస్తే కామయ్య మీది మోహం మరీయెక్కువగా వున్నది. ఇతణ్నీ విడవలేను.

పాప—నీసుఖంమాట బాగాఆలోచించుకో. నీ మొగుడు బాగావుండి కాపురంచేస్తూవుంటేమాత్రము నీవు తల్లిదండ్రులను వదిలిపెట్టవాయేమిటి? నీవుయిలాగు ఆలస్యంచేస్తూవుంటే కామయ్య మనసు విరిగిపోతుంది. నీకు యిటువంటి మంచివాడు మళ్ళీ మరివకడు దొరకడు. మీరనుకొన్నట్లు డబ్బుతీసుకు లేచివస్తివా మీరిద్దరూ యావజ్జీవమూ మొగుడూ పెళ్ళాలకంటె యెక్కువగా సుఖపడుతూ హాయిగా వుండవచ్చును. వకవేళ మొగుడు బ్రతికివున్నా నీకింత సౌఖ్యమూ స్వతంత్రమూవుండదు. నామాట తోసివెయ్యక బాగా ఆలోచించుకో. నీమేలుకోసం చెపుతూవున్నాను.

అన్న—యేమిచేసేదీ రేపాలోచించి చెపుతాను. (అని వెళ్ళబోవుచున్నది.)

పాప—నీకు చెవులో వకరహస్యం చెపుతాను. నామాట విని పో.

అన్న—యిప్పుడుకాదు. ఆనకమళ్ళీ మస్తానులే. (అని వెళ్ళుచున్నది.)

తృతీయరంగము—పఠనమందిరము.

[వందలకొలఁది లాక్ష్యలును వైదికులును కూరుచుండియుండఁగా బాపన్నశాస్త్రిగారును, వీరరాఘవరావుగారును, మిత్రబృందముతో ప్రవేశించుచున్నారు.]

బాప—శ్రీనివాసాచార్యులుగారూ ! మనవారింకను వచ్చినారు కారు. ఆహ్వానపత్రిక లందఱికి నందినవా?

శ్రీని—అందినది. వారందఱును వేణుగోపాలరావుగారితో వత్తురు. వామనశాస్త్రులుగారును గోపాలశాస్త్రిగారును, పరబ్రహ్మ సోమయాజులుగారును వారియింటియొద్దనే యున్నారు.

వీర—నాగయ్యపంతులుగారు వచ్చినారు. ఇఁక వేణుగోపాల రావుగారు వచ్చిన నందఱును వచ్చినట్టే.

శ్రీని—అదిగో వారును వచ్చుచున్నారు. వేణుగోపాలరావు గారూ దయచేయండి.

(వేణుగోపాలరావుగారును పండితులును ప్రవేశించుచున్నారు)

వీర—కుమారశాస్త్రులవారు రాలేదేమి?

వామ—వారీదినము సభకురారు. వారికి వేరేపనియున్నది.

వీర—శ్రీరామపండితులవారు వచ్చినారా?

శ్రీరా—నేనందఱికంటెను ముందుగా నేవచ్చి కూరుచున్నాను. విధవావివాహము వలన నష్టములకంటె లాభము లెక్కువగా నున్నవని మీరు సాధింపఁగలిగిన పిమ్మటఁగదా శాస్త్రమున్నదా లేదా యను సంశయమును విచారింపవలయును? విధవావివాహము వలన లాభము లేమియు లేవనియు విశేషముగానష్టములే యున్నవనియు నేను మీతో వాదించెదను. చేతనయినపక్షమున మీరు నాతో యుక్తి వాదము చేయుఁడు.

వామ—వారు చెప్పినమాట సయుక్తికముగానున్నది. వారితో యుక్తివాదముచేసి మెప్పించి మీశక్తి సభవారికందఱికిని గనఁబఱుపవలెను.

పర—శ్రీరామపంతులుగారు లౌక్యములోనున్నను, వైదికమునందుఁగూడ అఖండ ప్రజ్ఞగలవారు. మొన్న మాబంధువులపక్షమున న్యాయవాదిగానుండి న్యాయసభలో నింటిమీఁదిపెంకు లెగిరి

పోవునట్లుగా వాదముచేసినారు. ప్రతివాదిపక్షమున వచ్చిన న్యాయ వాది లేచి యేమో చెప్పఁబోవునప్పటికి, ఆయనచుట్టలు తాగినసంగతి యెత్తుకొని నలుగురిలోను చీవాట్లుపెట్టి గదిమి చేయిపట్టుకొని ఆయ నను కూర్చుండఁబెట్టినారు. అటువంటివారితో వాదముచేసి గెలిచిన పక్షమున మీశక్తి కనఁబడును.

వీర—మీయభీష్టప్రకారముగానే చేసెదను. ఎవ్వరినైన సభవారగ్రాసనా సీనులనుగా నియమింపుఁడు.

శ్రీని—నేను వేణుగోపాలరావు పంతులుగారి నగ్రాసనాసీను లుగా నుండగోరుచున్నాను. సభవారికందఱికి నిష్టమా?

వీర—అందఱికిని పరమసమ్మతమే. శ్రీనివాసాచార్యులుగారు చెప్పినమాట దేవతలైనను మెచ్చుకోఁదగియున్నది.

వేణు—నేను తగినవాఁడను కాకపోయినను, సభవారంద ఱును నన్ను మన్నించి యగ్రాసనమందుఁ గూర్చుండ నియమించు చున్నారు గనుక వారియాజ్ఞ మీఱఁజాలక యంగీకరించుచున్నాను. పరబ్రహ్మసోమయాజులుగారు నాయందలి దయచేత నన్నాప్రకార ముగా శ్లాఘించుచున్నారే కాని నేను వట్టి వ్యర్థుఁడను. (అని కూరు చున్నాడు)

పర—మీరు మీవిధేయతను గనఁబఱుచుటకయి యట్లను చున్నారే కాని కేవలము మీరవతారపురుషులు.

బాప—వీరరాఘవరావుగారూ! అంతకంతకు ప్రొద్దుపోవు చున్నది. శీఘ్రముగా ప్రసంగ మారంభింపుఁడు.

వీర—(లేచి) వాదమారంభించుటకు ముందుగా నేను సభ వారితో కొన్ని మాటలు మనవిచేసికొనుచున్నాను. తమరందఱును సావధానముగా వినవలెను.—

వివేకనిధులారా! కాలమహిమచేత నేనిప్పుడు చేయఁబోయెడి విన్నపము మీలో కొందఱి చెవులకు వెగటుగాతోచునని నేనెఱుఁగని వాఁడనుఁగాను. అయినను మరభీరువుగా విడిచి పారమార్థికచింతతో పరిశీలించు నిష్పక్షపాతబుద్ధుల కెల్లను సత్యముబోధపడుటకు సందేహముండదు గనుక, మీమనసుల కెక్కునట్లుగా రసపుష్టిగల ప్రౌఢవాక్యములతో నుపన్యసించుటకు నేనించుకయు సమర్థుఁడను గాకపోయినను దయయు బాల్యమున భర్తలను పోఁగొట్టుకొన్న మన దేశపు యువతుల మరణస్థితి నన్ను బహువిధములఁ బ్రేరేపనాపక్షమున నున్న సత్యముయొక్క బలమును నమ్ముకొని యిటువంటి పండితసింహులముందఱ నా బాల్యవాక్యములను పలుకఁ సాహసముచేయుచున్నాను. క్షమింపుఁడు మనలోని క్రూరాచారమునుబట్టి పతివిహీనలయిన యబల లిప్పుడు మనదేశములో ననుభవింపవలసిన దుర్దశను తలంచుకొన్న మాత్రమున పగవారికయినను మనస్సు కలుక్కుమనకమానదు మనమెంతనిర్బంధ పెట్టినను, ఎన్ని సుబోధలుచేసి స్వర్గమువచ్చునని యాశపెట్టినను, బాలవిధవలనందఱిని మన మెన్నటికిని పతివ్రతలనుగా జేయఁజాలము. సమస్తసంగములను త్యజించి దుంపలును ఫలములును, తినుచు మహారణ్యములలో తపస్సుచేయు ఋషులవంటి సమస్తము తెలిసి నమహానుభావులుసహితము కామము జయింపలేకపోయిరని మనము వినుచుండగా, ఉప్పును పులుసును తినుచు నింద్రియ సుఖానుభవమునకు నిదానములయిన పట్టణములయందు వయస్సులోనున్న సుందరపురుషమధ్యమున సదామెలఁగుచు తమయింద్రియములకుఁదోడు దుష్టపురుషుల ప్రయత్నములుకూడఁ దమ్మెప్పుడును కామోపభోగములకయి ప్రోత్సాహపఱుపనిద్యాగంధమేని లేకపోవుటవలన యుక్తాయుక్తవివేకము చాలకున్న యనాథయువతు లింద్రియనిగ్రహముచేసి పతివ్రతలుగా నుండఁగలుగుదురు

రని మనమెట్లు ప్రతీక్షింపఁగలము? మనచేతనయిన పని వారి శిరో జములను ఆభరణములను తీసివేయింపఁ గలిగినను, లోపలనున్న కామమును మాత్రము తీసివేయింపఁజాలము. వారి కామమేవిధముగా నయినను శాంతి పొందవలయును గనుక మనము క్రమమయిన మార్గమును చూపకపోవుటవలన వా రక్రమములకు లోఁబడవలసిన వారయి గూఢముగా వ్యభిచరించుచున్నారు. మానవంతుడగువాఁడు తనవారేయితరదోషము చేసినను సహించి యూరకుండఁ గలుగునుగాని వ్యభిచారము చేసినవ్యక్తి మాత్రము చూచి యూరకుండఁజాలఁడు. తక్కిన నేరమువలనఁ జేసిన వారికే యపకీర్తివచ్చును గాని అంకు తనమువలనఁ చేసిన వారికి బంధువులకును మాత్రమే కాక కులము వారి కందఱికిని గూడ అప్రతిష్ఠకలుగును. అందుచేతనే యభిమాన ధనులగు పురుషులు తమ స్త్రీలు వ్యభిచరింపఁగాఁ జూచినప్పుడు తోడఁబుట్టిన పడుచులనైనను, కూఁతులనైనను, కోడండ్రనైనను, వది నెలనైనను, మఱదండ్రనైనను, మఱియెవ్వరినైనను, వారివిటులతోఁ గూడ నంతము నొందించి యవమానమున కోర్వలేక యొకానొక ప్పుడు తాము కూడ నాత్మహత్యలు చేసికొందురు. ఇందువలన వ్యభిచారమెంత హేయమయినదో మీరే యూహించుకోవచ్చును. ప్రజాసౌఖ్యమున కయి ధర్మశాస్త్రములను జేసి వాని ప్రకారముగా మహాజనులను నడిపించి పేరుపొందిన యార్యులయొక్క సంతతివార మని పేరుపెట్టుకొనియు, మీరు హారు చేసిన ధర్మశాస్త్రప్రకార ముగా నడిపించుటకయినను పూనుకోకపోవుట యటుండఁగా మీది మిక్కిలి హారియాజ్ఞలను మీఱి శాస్త్రసమ్మతమయిన పునర్వివా హము చేసికో నియ్యక యోగ్యురాండు కాఁదగిన గతిలేని యనాథ కామినులను సకల బాధలును పెట్టి వేశ్యలకన్నను హీనముగా వ్యభి చరించుటకై దింపుట మీకు సిగ్గుల చేటుకాదా? అందువలన మీకు

గలుగుచున్న నష్టములయినను మీరు చూచుకొనుచున్నారా? సద్వంశమునఁ బుట్టిన మీ బాలవితంతువులు వంటబ్రాహ్మణులతోను, మ్లేచ్ఛభటులతోనుచాకలివాండ్రతోను, ఇతరహీనజాతులవారితోను చెడి తిరుగుచుండుట మీకు ప్రతిష్ఠగానే తోఁచుచున్నదా? అట్టి బాలవిధవలు తమ యుపపతుల వృత్తికయి యింటఁ గల వస్తువు లెత్తుకొనిపోయి వాండ్రకు పెట్టుచుండుట గాని తమ నేరము మాసి పోవుటకయి సాధ్యమయినంతవఱకు పుణ్యస్త్రీలను సహితము జారత్వమున ప్రవేశపెట్టి యందఱిని తమవంటివారినిగాఁ జేయుచుండుట గాని మీదృష్టికి నష్టములుగా గనఁబడుచుండలేదా? ఇంటనుండి రహస్యముగా వ్యభిచరించుట కిష్టములేని బాలరండలు తమ బంధువర్గము మీఁది ప్రేమానుబంధమును త్రెంపుకొని యేతురకవానినో యేదూదేశులవానినో తీసికొని లేచిపోయి బహిరంగముగా వీధిలో గుడిసె వేసుకొని పడుచుకొనుచుండుట మీకపఖ్యాతిగా నుండలేదా? వారు చేసిన చీఁకటి తప్పునకు ఫలముగా సంప్రాప్తములయిన గర్భములను దింపుకొనుటయు, మందులు వికటించి యట్టి సమయముల యందు కడుపులోని పిల్లలతోకూడ తల్లులు చచ్చుటయు, దైవయత్నముచే మనుష్య ప్రయత్నములన్నియు విఫలములయి శిశువులు జనింపఁగా మెడలునులిమి చంపుటయు, మీకించుకయు పాపకృత్యములుగా తోఁచుచుండలేదా? చంపి పాఱవేయఁబడియున్న లేఁత శిశువులను జూచి నప్పుడు మృగపక్ష్యాదుల మెడలు విఱిచి పచ్చినెత్తురు త్రాగు కిరాతులకయినను దయపుట్టుచుండఁగా రక్తసంబంధముగల మీకేల కనికరము పుట్టదు? కొందఱు శిశువులను జంపక మాలమాదిగల కియ్యఁగా నుత్తమవంశమునందుఁ బుట్టినయీబిడ్డలు పెద్దపెరిగి మీముందఱనే పెంటలూడ్చుచు నీచపుపనులు చేయుచుండుట మీకు కన్నులపండువుగా నున్నదా? మీ వేడుకకయి కన్నులు

తెఱవనిపిల్లలకు మంగళసూత్రమను మిషమున మెడకొక త్రాడు కట్టి గుడికి మేకపోతును తీసికొనిపోవునప్పుడు మెడకు వేపరొట్ట కట్టి నట్టుగా చేతికొక తోరమును కట్టి, వాద్యముల మ్రోతతో వివాహమని పేరుపెట్టి యదియేమో కన్యావరులకే తెలియని యొకతంతు నడిపి, తరువాత భర్త పోయినాఁడన్న దుఃఖవార్త కుటుంబమునందు తను దుఃఖ సముద్రమున మునుఁగా ప్రాణాధికులయిన తమ ముద్దుల కూఁతులను బ్రదికియున్నంత కాలమును దుస్సహవైధవ్యదశకుఁ దెచ్చిన దురదృష్టమును తలఁచుకొని తలలువీడ ఱొమ్ములు బాదుకొనుచు పెద్దపెట్టున రోదనముచేసెడు జననీజనకుల మొగములవంక తెల్లపోయి చూడుడు "అమ్మా! యేలయేడ్చెదవు!" "నాయనా! యేలయేడ్చెదవు?" అని యెఱుఁగని ప్రశ్నలు వేయుచు తమకు ముందు ప్రాపింపబోయెడి దురవస్థ లేశమయినను తెలియక నడయాడెడు పసిబాలికలస్థితి చూచుటకు మీకు వినోదకరముగా నున్నదా? నిర్దోషురాండ్రయిన యాపసిబిడ్డల దుర్దశచూచినను మీకు గుండెలు బద్దలయి యట్టివారికయినను పునర్వివాహము చేయవలెనను బుద్ధి జనింపకున్నదా? శిశుహత్యాదులు జరగునప్పుడు దొరతనమువారు పట్టుకొని సహాయులుగా నున్నవారిని సహితము శిక్షించుచు కులమునకు వెఱచి కన్న బిడ్డలకు సహితము చంపవెనుక తీయని మాతలను మాలవానిచేత నురితీయించుచుండుట మీకు సంతోషకరముగానే యున్నదా? ఈపయిని జెప్పినవన్నియు మీకు పుణ్యకర్మలుగానే తోఁచుచున్నవా? శాస్త్రసమ్మతమైన పునర్వివాహమొక్కటిమాత్రమే మీమనస్సులకు పాపకర్మముగా కనిపించుచున్నదా? ఓమహాజనులారా! మీరొక్క నిమిషము పాక్షికవృత్తిని విడిచి నేను జెప్పిన యంశములను సమబుద్ధితో విచారించి స్త్రీ పునర్వివాహమున కనుజ్ఞయిచ్చి శుద్ధమయిన యీహిం

దూజాతి కంతకు నపకీర్తికరముగా నున్న యీ దురాచారకళంకమును బాపుకొందు. ఒకవేళ బాలవిధవలలోఁ గొందఱు వ్యభిచారాది దోషములులేనివారైనను వారి బ్రదుకు సహితము విరామములేని దుఃఖపరంపరతో నిండియుండును. మగఁడు పోయిన కూఁతురు గుమ్మము వెలుపలఁబడి యేడ్చుచుండఁగా రాత్రులు తల్లిదండ్రులు నిర్విచారముగా సుఖమనుభవించుటకంటె శీఘ్రముగామరణమునొంది స్వర్గసుఖమనుభవించుట చాలమేలు. చిన్నప్పటినుండియు ప్రేమతోఁ బెంచి తమ ప్రాణములతో సమానముగాఁ జూచుకొనుచున్న తల్లిదండ్రులే కులాచారమునకు దాసులై కరుణమాలిజీవితేశ్వరునిపోగొట్టుకొనిదుఃఖసాగరమునందుమునిఁగితమయండఁజేరినకొమార్తెల నాదరించి పతిశోకమును మఱచునట్లుచేయుటకు మాఱుగా తాము నడుమఁబెట్టిన యాభరణములను మాత్రమే కాక భగవంతుఁడు పుట్టుకతోనే దయచేసిన సిడుదశిరోజములను గూడ తీయించి మఱింత దుఃఖ మధికముచేసి, నొసట కస్తూరి తిలకమునకు మాఱుగా బూడిదయును చేతుల బంగారుకంకణములకు మాఱుగా రాగిపట్టెలను పెట్టించి, నిన్నటివఱకును మూడు పూటలు భోజనము చేయ నలవాటుపడిన ప్రాణమును శోషిల్లఁజేసి యొకపూట మూడుజాముల కిన్ని మెతుకులు వేసి చచ్చియుఁ జావకుండ నిలుపుచు, ఇంటఁగల పనియంతయు వారిచేతనే చేయించుచు, వారిని జీవచ్ఛవములనుగా నుంచి యావజ్జీవమును దుఃఖించునట్లు చేయుట హిందూజాతి కంతకు నవమానకరముగా నున్నది. పరులవలని బాధలక్కఱలేక ప్రాణవల్లభులుపోవుట చేతనే దుర్వారవ్యథలపాలయి కృశించుచు నెల్లవారికినిదయనీయులు కాఁదగిన యనాథయువతులను నిష్కరుణులయి మనవారు పెట్టుచున్న బాములను బట్టి "విధవ" యనగానే యెల్లవారికిని జాలిపుట్టవలసినదానికి మాఱుగా తన్నామోచ్చారణమేకర్ణకఠోరముగా వినఁ

బడుచు, ఎవ్వనినైనను "విధవా" యన్నమాత్రమున నసహ్యపడి వాఁడెంత నీచుఁడయిన నది గొప్పతిట్టుగా భావించుకొని మండిపడు నట్లు తటస్థించినదిగదా? అనాథలను బాధపెట్టుచున్నారన్న యీ నిందను పోఁగొట్టుకొనుటకు ప్రయత్నము చేయుట హిందువయిన వానికెల్లనవశ్యకర్తవ్యము. కాఁబట్టి యాచారమును పాటిగాఁబట్టక మీ బుద్ధిచేత చక్కఁగా నాలోచించుకొని యితరుల దూషణము లను లక్ష్యము చేయక మీ యంతరాత్మ సంతోషించునట్లుగా పని చేయుఁడు.

శ్లో. యత్కర్మకుర్వతో స్యస్యా త్పరితోషోంతరాత్మనః
తత్ప్రయత్నేన కుర్వీత విపరీతంతు వర్జయేత్.

ఏ పని చేసిన తన యంతరాత్మ సంతోషించునో యాపనినే చేయవలయుననియు, అంతరాత్మ కతుష్టికరమయిన పనిని మానవల యుననియు, పయిన జెప్పిన ధర్మమునేమనుస్మృతి బోధించుచున్నది. లోకమునకు నష్టకరమయిన పనిని శాస్త్రముపిధించుచున్నను దానిని మానుకొనుట మనకు పరమధర్మము.

శ్లో. పరిత్యజే దర్థకామౌ యౌస్యాతాం ధర్మవర్జితౌ
ధర్మంచాప్యసుఖోదర్కం లోక విక్రుష్టమేవచ.

ధర్మవిరుద్ధములయిన యర్థకామములను విడువవలయుననియు అసుఖకరమును లోకమునకు శోకకరమునైన ధర్మమునైనను విడువ వలయుననియు, మనుస్మృతియే ఘోషించుచున్నది. ఇట్లు చెప్పుట చేత శాస్త్రము స్త్రీపునర్వివాహమును నిషేధించునని నా యభి ప్రాయము కాదు. కావలయునేని స్త్రీపునర్వివాహము సమస్తశ్రుతి స్మృతి పురాణసమ్మతమని నేనిప్పుడే చూపెదను.

శ్రీరా—అక్కఱలేదు. మీరు యుక్తిచేత సాధించినపిమ్మటఁ గదా శాస్త్రముమాటచూచుకోవలెను. మీరింతసేపు శ్రమపుచ్చు

కొని చెప్పినారుగాని, మీ వాక్యములలో నొక్కటియు యుక్తి కనఁ బడదు. మీరు చెప్పినమాటలన్నియు నే నొక్క నిమిషములో యుక్తులు చెప్పి ఖండించెదను.

వీర—మీరు సెలవిచ్చెడు ప్రబలయుక్తు లేవో వినవలెననినా మనస్సు మిక్కిలి కుతూహలపడుచున్నది. దయచేసి వాదమున కుప క్రమింపుఁడు.

శ్రీరా—మీరు యుక్తులనుకొని యింతవఱకును జెప్పిన యసంబద్ధపు మాటలను సయుక్తికముగా ఖండించివేసి, సభవారందఱును మెచ్చునట్లుగా నిరాక్షేపములయిన నా యుక్తులను ప్రతివాదుల ముఖములు ముడుచుకొనిపోవునట్లుగా దివ్యవాగ్గుంభనలతో నుపన్యసించి సర్వసమ్మతచుగునట్లుగా విధవావివాహము కూడ దన్న పరమసిద్ధాంతమును స్థాపించెదను.

త్రివి—ఆహాహాహా! ఆత్మస్తుతియు పరనిందయులేని మహానుభావులు మీ రెంతపనియైనను జేయఁగలవారే. మీకు నమస్కారము. మీయొద్దనున్నశక్తి భగవంతుని యొద్ద నయినను లేదు.

శ్రీరా—మీ రేమో పరిహాసముగా మాటాడుచున్నారు. మా సామర్థ్యము మీ కేమి తెలియును? మే మిప్పుడు చేయునది పరమత నిరాకరణపూర్వక స్వమత సిద్ధాంత స్థాపనమని మీకు కొంచెము శాస్త్రజ్ఞానమున్న తెలియకపోదే.

వేణు—త్రివిక్రమరావుగారు పరిహాసకులు. మీరు వారి మాటలకు కోపపడి. వివాదము పెట్టుకోక, మీ ప్రసంగముకానిండి.

శ్రీరా—చిత్తము. ప్రతివాదులవాదము ఖండించెదను. సభవారు నా యుక్తులు భక్తిశ్రద్ధలతో వినవలెను:—మనలోని విధవల యవస్థచూచి పగవారి మనస్సు కలుక్కుమను నన్నమాట సత్యము కాదు. పగవారిమాట యటుండగా శిష్టాచారావలంబులయిన మన

వారి కందఱికినిగాని సర్వజ్ఞులయిన మన పండితసార్వభౌములకుఁగాని విధవలస్థితిచూచిమనస్సుకలుక్కుమనకపోవుటయేగాకపైగా ఈదుర్వివాహములయిపోవునేమోయని మనస్సు దహించుకొనిపోవుచున్నది. స్త్రీలుకామముజయింపలేరన్నసంగతి యున్మత్తప్రలాపముగానున్నది. కామముచేత చచ్చిపోయినవా రెవ్వరునులేరు. ఇఁక మనకు కలుగదని నిరాశ చేసికొన్నవారికి సంభోగముమీఁద కోరికయే కలుగదు. గజశాలలయందు బంధింపఁబడియున్న యేనుఁగులును అశ్వశాలలయందు కట్టఁబడియున్నగుఱ్ఱములును, పంజరములలోపెట్టఁబడియున్న పక్షులును ఎన్నికామమును, జయింపఁగలిగినవికావు? ఆప్రకారముగానే స్త్రీలనుకూడ తగినంత నిర్బంధములోనుంచిన యెడల వారును తిన్నఁగానే యుందురు. స్త్రీలకు స్వాతంత్ర్యము కూడదన్న ధర్మశాస్త్రకర్తల యాజ్ఞమీఱఁజేయమనవారిప్పుడు స్త్రీలకుస్వేచ్ఛగలుగఁజేసి చెఱపివేయుచున్నారు. సంసర్గము జరగకుండనుంచుటవలన గజాశ్వాదులకు శరీర దార్ఢ్యముగలిగి చక్కఁగా పనిచేయునట్లే సంభోగము లేకపోవుటవలన విధవలును బలిసిమనకు చక్కఁగాపనిచేయుటకుసమర్థురాండ్రగుదురు. విధవలలో వ్యభిచారమున్నదనిప్రతిపక్షులేయొప్పుకొనుచున్నారుగదా? తలగొఱిగించికురూపినిజేసి యొంటిపూటనేతిండిపెట్టి కడుపుమాడ్చి యలంకారములు తీసివేసి వ్రతాదులచే దేహముకృశింపఁ జేయుచుండఁగానే వ్యభిచారము మానకుండఁగా అవియన్నియు నున్నపక్షమున బొత్తిగానే పట్ట పగ్గములుండునా? మన పూర్వులు త్రికాలవేదులు గనుక, దూరము విచారించియే మహత్తరములైన యీనిర్బంధముల నన్నిటిని విధించినారు. ఇప్పటివారన్ని నియమములను క్రమముగా నడపకపోవుటచేత వ్యభిచారాది దోషములు కలుగుచున్నవి. అది స్వయంకృతాపరాధమేగనుక, స్త్రీల యెడల దయతలంచిన పాపఫల మనుభవింపవలసినదే. వర్ణాశ్రమా

చార ధర్మములుగల యీకర్మభూమిలో నిహలోక సుఖమునుబట్టి దయచూడుమనుటకంటె పిచ్చి వేఱేలేదు. కాఁబట్టి శాస్త్రనియమములకు లోఁబడి నీచపు సంభోగమందు తలఁపుకట్టిపెట్టి కష్టపడినపక్షమున, విధవకు పరలోకసుఖ ప్రాప్తికలిగి మరణానంతరము బహుసహస్ర సంవత్సరములు భర్తతో సంభోగ సుఖము వచ్చును. పునర్వివాహము నిమిత్తము ప్రయత్నము చేసినపక్షమున, మనము విధవలకాసుఖము చెడఁగొట్టి పాపముకట్టుకొన్నవారమగుదుము. గర్భస్రావములు, శిశుహత్యలు, మొదలయినవి జరుచున్నవన్న విషయములో పయియుత్తరమే ప్రతివాదులను మూకీభావము నొందింపఁజాలియుండును. విధవలనుజూచి పుణ్యస్త్రీలు చెడుచున్నారన్నమాట హాస్యాస్పదముగానున్నది. అనుభవముగల వారనుభవము లేనివారికొక సంగతిని నేర్పుట లోకములో సహజమయి యుండఁగా, మిథున కర్మానుభవము లేని విధవలే మిథునకర్మానుభవముగల సభర్తృకలకుపదేశింతురనుట పిచ్చిమాట. పుణ్యపాపములనుగుర్తెఱింగి ప్రవర్తించుటయే వివేకముగాని యుక్తివిబట్టి ప్రవర్తించుట వివేకము కాదు. ఈలోకములో విధవలు బాధలనుభవించుటవలనపుణ్యముగలుగును.

త్రివి—మీధోరణి కడ్డమువచ్చుచున్నాను. దయాస్వరూపుండయిన భగవంతుఁడు నిష్కారణముగా విధవలనీలోకమునమాత్రము బాధపడ నియమించునా?

వేణు—ప్రసంగము చేయుచుండఁగా నడుమమీరుమాటాడకూడదు.

శ్రీరా—అడుగనిండి. నేనిటువంటివారికి లక్షమంది కయినను సదుత్తరములిచ్చి సమాధానము చెప్పఁగలను. విధవలకీకష్టములు భగవంతుఁడు పెట్టలేదు. స్త్రీలుపూర్వజన్మమున చేసికొన్న పాపముచేత

వారికీగతివచ్చినది. పూర్వజన్మమున నేమిచేసినారో యది వారిజన్మమున ననుభవింపక తీరదు.

త్రివి—సరిసరి అట్లయినయెడల వారిపూర్వజన్మస్థితియు మీ పూర్వజన్మస్థితియుకూడ నాకు తెలిసిపోయినవి.

శ్రీరా—అదేమి?ఎగతాళిచేయుచున్నారు. మీకేమి తెలిసినది?

త్రివి—పూర్వజన్మమునందా స్త్రీవంటివారు మీరును, మీవంటి వారాస్త్రీలును, అని మీరుసూచించినమార్గమువలన నేనూహించితిని.

శ్రీరా—అనఁగానేమో మీమాటలు నాకర్థము కాలేదు.

త్రివి—బుద్ధిమంతులు మీకర్థముకాని దేమున్నది? ఇప్పటి విధవలు వెనుకటిజన్మమునందు మీవంటి పండితులయి విధవావివాహము కూడదని వాదించి, అప్పటి విధవలను దుఃఖపెట్టియుందురు. ఆపాప ఫలముచేత నప్పటి పండితులీజన్మమున విధవలయిపుట్టి పురాకృతదుష్కృతఫల మనుభవించుచుండఁగా, తమపగసాధించుకొనుటకయి యీకాలపువిధవలు నిషేధవాదులరూపమున నవతరించివిధవావివాహము కూడదని యీప్రకారముగా వారిని బాధపెట్టుచుండియుందురు. లేకున్న మీరుచెప్పిన ప్రకారముగా విధవలిట్లు దుఃఖపడుచుండుటకును, వారిట్లు వాదించుటకును కారణ మగపడదు.

వీర—మీరువాదములోకూడ హాస్యమే మొదలుపెట్టినారేమి! ఇవి సభలలో ననవలసినమాటలుగావు.

శ్రీరా—విధవాసంభోగమునందలి యపేక్షచేతస్వప్రయోజనపరులయిమీరందఱువిధవావివాహము కావలెనని వాదించుచున్నారు,

త్రివి—విధవలకు వివాహమయినయెడల, మీరెప్పుడనుభవించుచున్న వితంతువులతోడి సంభోగసుఖము పోవునేమోయను భయముచేత మీరుస్త్రీపునర్వివాహముకూడదనివాదించుచున్నారు.

వీర—త్రివిక్రమరావుగారూ! ఎదుటివారొకవేళ తొందర పడినను మనమిట్లు తొందర పడుట న్యాయముకాదు. మీరిప్పుడను కొన్నమాటలు సభలో నుచ్చరింపదగినవికావు.

వేణు—త్రివిక్రమరావుగారూ! ప్రసంగమధ్యమునమాటాడఁ గూడదని నేను మీతో మొదటనే చెప్పియున్నాను. శ్రీరామమూర్తి గారూ! మీప్రసంగముపూర్తికానిండి.

శ్రీరా—ఈస్త్రీ పునర్వివాహము లేకపోవుటవలన దేశమునకు కలుగుచున్న లాభము లిన్నియన్నియని వక్కాణించుటకు మనుష్య మాత్రుడనైన నాకు శక్యముకాఁదు. విధవావివాహమువలన వితం తువులకు ప్రసవమరణములు మాత్రమేకాక, పుత్రాదిమరణములు మొదలైన సంసారదుఃఖములు కలుగును; జనసంఖ్య యెక్కువగుట వలన పంటలుచాలక దేశమునకు కాటకములు సంభవించును; ఒత్తుగానున్న సస్యములు దుర్బలములగునట్లేజనులును బలహీనులును వ్యాధిబాధితులు నగుదురు. ఇప్పుడు బీటినేలలుగానున్న భూములు సేద్యము చేయఁబడుటచేత మేఁతలేక పశువులు చచ్చును; మను ష్యులు మఱింతయెక్కువయినసేద్యములకు చోటులేక యందఱును నశింతురు; విధవలు లేకపోయిన నింటిపని చేయువారులేక యనేక కుటుంబములకు కష్టములు వచ్చును; వ్రతాదులులేక బ్రాహ్మణులకు వృత్తులునశించి జీవనములు చెడిపోవును. చెప్పఁబూనుకొన్న నిటు వంటి యుక్తులిఁక లక్షయున్నవి. బుద్ధిమంతులగువారు నావాదము యొక్క సారమునుగ్రహించి ప్రతివాదులు చేసెడి దుర్వాదమును నమ్మిమోసపోక సదాచారగరిష్ఠులుకండు. [అనికూరుచున్నాడు.]

వీర—మీరు చెప్పినదానిలో—

శ్రీరా—మీరు మొదట వాదముచేసినారు; తరువాత నేను మీవాదము పూర్వపక్షముచేసి స్వమతసిద్ధాంతస్థాపనము చేసినాను. అక్కడితో సరిపోయినది. మీఱిక మాటాడకూడదు. మీరు చెప్పిన తరువాత నేనును నేను చెప్పినతరువాత మీరును చెప్పుచునేవచ్చినచో, అనవస్థాదోషము సంభవించును. మిమ్మే కడపట చెప్ప నిచ్చినపక్షమున, పామరులు మీదుర్బోధనమ్మి చెడిపోదురు. మన పూర్వులకంటె మీరిప్పుడు మహాబుద్ధిమంతులు బయలుదేఱినారు. జగత్తు పుట్టినప్పటినుండి యీ యాచారము ప్రపంచములో నెక్కడనులేదు. నేఁటికాలమునకు మీరువచ్చి నాలుగు ముక్కలు చెప్పఁగానే సాగుననుకొన్నారా?— వేణుగోపాలరావుగారూ! మీధర్మసందేహము మీరు తీర్చవలెను.

వేణు—వీరరాఘవరావుగారిఁక చెప్పగూడదు. వారివంతయిపోయినది.

వీర—ఈ హిందూదేశమే ప్రపంచమంతయు నని మీరు భ్రమపడుచున్నారు. ఈ భరతఖండ మీభూమిలోని యైదుఖండములలో నొకఖండములో పదియాఱవవంతయినను లేదు. ఈయొక్క దేశములోతప్ప మిగిలిన యన్ని దేశములలోను స్త్రీపునర్వివాహమున్నది. ఈదేశములో సహితము శూద్రులలో—

వేణు—మీరు మాటాడకూడదన్నను నామాట వినిపించుకోకుండ నున్నారు.

శ్రీని—చెప్పనిండి. నేను కొన్ని యుక్తులు చెప్పవలసియున్నవి. నాతోవాదముచేయుమనండి. వీరిప్పుడుచెప్పిన దోషములనన్నిటిని విధవావివాహము లేకపోవుట కారోపించుచున్నారేకాని నిజముగా నందువలన విశేషబాధకములేమియు లేవు.

వీర—ఊరకే యిట్టిమాట లనుటవలన నేమిప్రయోజనము? నే నిప్పుడు చెప్పినయంశములలో క్రమముగా నొక్కొక్కదానినే యెత్తుకొని యిది యిట్టిదికాదని చెప్పుఁడు.

శ్రీని—మీరు విధవావివాహము లేకపోవుటచేత జారత్వము వృద్ధిపొందుచున్నదని గదా చెప్పినారు? విధవావివాహములుచేసెడు పక్షమున ప్రపంచములో జారత్వ మంతయు పోవునని మీరు వ్రాసి యియ్యఁగలరా? అట్లు జారత్వమంతయు మీరు పోఁగొట్టగలిగిన యెడల నే నిప్పుడు విధవావివాహములు చేయించెదను. వితంతూద్వాహమువలనను జారత్వము పోనియెడల, ఈ వివాహములతో ప్రయోజనమేమి?

వీర—విధవావివాహములు చేయుట వలన జారత్వము బొత్తిగా పోకపోయినను విశేషభాగము తగ్గిపోవుననుటకు సందేహములేదు; అంతియకాక శిశుహత్యలును, భ్రూణహత్యలును, నశించును. దోషములనన్నిటిని నివారించుటకు మనము శక్తులము కాము గనుక, కొన్నిటిని పోఁగొట్టుటవలన ప్రయోజనమేమనుట యుక్తాయుక్తముకాదు. మీరుచెప్పిన హేతువుమీఁద లోకములోని సత్కార్యముల నన్నిటిని మానవలసివచ్చును. నేరముల నన్నిటిని పట్టుకొనలేరు గనుక, ఆరక్షకభటులను తీసివేయవలసివచ్చును. ఔషధములవలన రోగములన్నియు కుదురుచుండలేదుగనుక, వైద్యముతో పనిలేదనవలసి వచ్చును. అట్లనుటకు మతిమంతుఁ డెవ్వఁడైన సాహసించునా? మందులవలన రోగములన్నియు నివారణ కాకపోయినను, బహువ్యాధులు కుదిరి మొత్తముమీఁద సుఖాభివృద్ధి కలుగుచున్నది. ఆప్రకారముగానే విధవావివాహము వలన బహుదోషములు నివారణమయి సుఖాభివృద్ధి కలుగును.

శ్రీని—లోకములో మగఁడుగల స్త్రీలుమాత్రము వ్యభిచరించుచుండలేదా! వ్యభిచారము చేసినవారిని మనము శిక్షింపవలయునేకాని, వారికి పెండ్లిచేసినయెడల దొంగ దొంగతనముచేయునని దొంగకు ధనమిచ్చిన ట్లుండదా?

వీర—పుణ్యస్త్రీలు తమ కామశాంతికయి న్యాయమయిన మార్గమున్నను వ్యభిచరించుచున్నారుగనుక దొంగలవలెనే వారును దండార్హు లగుదురు. ఆఁకలిగొనియున్న యొకమనుష్యుని భోజన పదార్థములతో నిండియున్న యొకగదిలోపెట్టి తాళము వేసి, న్యాయముగాపాటుపడి సంపాదించుట కవకాశము కలుగనియ్యక నిరోధించి, క్షుద్బాధకు తాళలేక వాఁడాగదిలోని యాహారపదార్థములలో నొకదానిని తినెనని శిక్షించుట యెంత యుక్తమయిన కార్యమో మీరేయాలోచింపుఁడు. అట్టిస్థితిలో వివేకముగలవారండఱును పయి నిర్బంధములను బెట్టి శిక్షించువారిని క్రూరులందురేగాని క్షుత్తుతీర్చుకొనుటకయి పదార్థభక్షణము చేసినవానిని దోషినిగా భావింపరు. ఆప్రకారముగానే కామపీడితలయి యువతులను కాముక జనమధ్యమున వసించునట్లుచేసి, కామశాంతికయి వారికున్నన్యాయమయిన మార్గమును నిరోధించి, అందుచేత వారక్రమములకు దిగవలసివచ్చినప్పుడు క్రమమయిన మార్గమును చూపుదమనుటకు మాఱుగా వారిని శిక్షింతుమనుట క్రూరకృత్యముగాదా?

శ్రీని—స్త్రీలకు కామ మంత యాపుకోశక్యముగానిదిగా నుండునా? కామశాంతి కలుగకపోయిన చచ్చిపోరుగనుక వారెందుకు పతివ్రతలుగా నుండరాదు?

వీర—సయినుండి యితరులుమాటలెన్నియైనను జెప్పవచ్చునుగాని కష్టములు నడుచుకొనివారికే కాని తెలియవు. పురుషుఁడు మాత్రము కామముతీర్చుకొనకున్నమరణమునొందునా? భార్యపోయిన

తరువాతనతఁడు మాత్రమెందుకు, ద్వితీయవివాహముచేసికోవలెను? విద్యావివేకములు గలిగి స్థిరచిత్తులమని చెప్పికొనుపురుషులకే కామమును జయింపశక్యము కానప్పుడు, ఇఁక మూర్ఖురాండ్రయి స్వభావచంచలలైయుండు స్త్రీలకా యింద్రియ నిగ్రహముచేయుట శక్యమగును?

శ్రీని—స్త్రీలకును పురుషులకును కామము సమానమా?

వీర—మనశాస్త్రములు పురుషులకంటె స్త్రీల కెనిమిదిరెట్లు కామమెక్కువ యని చెప్పుచున్నవి? "కామశ్చాష్టగుణోభవేత్" అనుశ్లోకమును మీరెప్పుడును వినలేదా యేమి? మనశాస్త్రము లెట్లున్నను స్త్రీపురుషులకు కామము సమానమనియే నేను భావించెదను. నేనిప్పుడు వాదమునిమిత్తము మీకనుకూలముగా నుండునట్లు పురుషులకంటె స్త్రీలకు కామముతక్కువయనియే యొప్పుకొనెదను. అంత మాత్రముచేత స్త్రీలకు కామనివారణ సదుపాయమక్కఱలేదని మీరు సాధింపఁగలుగుదురా? రామయ్యకంటె భీమయ్యకాఁకలి తక్కువనియే స్థిరపడినను, అంత మాత్రముచేత భీమయ్యకు తిండిపెట్టక మాడ్చిచంపవలయునని మతిమంతుఁడెవ్వఁడైన సాధింపఁజూచునా?

శ్రీని—స్త్రీలకు కామమెనిమిదిరెట్లయిన, ఎనమండ్రుభర్తల నేలకట్టిపెట్టరాదు?

వీర—ఒకభర్తయే కూడదనివాదించువారు కామినుల కెనమండ్రుభర్తలను గట్టుమనుట, ఆఁకలిచేత బాధపడువాని చేతులు కట్టిపెట్టి యొక కబళమయినను తిననియ్యక నిర్బంధించిన మహానుభావుఁడు వాని కొక్కసారిగా నెనిమిది బిందెలయన్నము నేలపెట్లరాదని యడిగినట్లున్నది. బహుభర్తలుండుటవలన నష్టములు తమకువిశదము కానట్లున్నవి. మనపెద్దల యనుగ్రహమువలన దుర్ణితికి పట్టుకొమ్మలయి పలుకుటుంబములను గూలఁద్రోచిమన దేశమున

కంతకు నవమానమును దెచ్చుచు వివాహాద్యుత్సవసమయములయందు మనగృహములను పావనముచేయుచున్న వేశ్యలస్థితినికొంచెముజ్ఞప్తికి దెచ్చుకొన్న, మీరు నన్నా ప్రశ్నను వేయకయేయుందురు. మన దేశమున బోగము వాండ్రుబహుభర్తలను గలిగియుండుటవలన సంభవించు సౌఖ్యముమ మనవంటివారికి బోధించుట కేమోయనునట్లుగా కెన్నటికిని తఱుగని పదవివలె నిత్యకళ్యాణమును పచ్చతోరణమును గానుండి మన కుపదేష్టలగుచున్నారు.

శ్రీని—దానికేమిగాని యొకసారి సంభోగించుటవలన చెడిపోయిన స్త్రీల కెవరాశపడుదురు? అట్టిస్త్రీతోడి సంభోగము రోఁత గానుండదా?

వీర—మనకానీతియే యుండునేని, మనలోనెవ్వరును పయికి పెద్దమనుష్యులవలె పగలెల్లను వేషములు వేసికొని జుట్టుచివర ముడి వేసికొని తిరుగుచు చీఁకటిపడఁగానే భార్యలనువిడిచిపెట్టిలంజెలయిండ్లకు వేంచేసెడు మహానుభావు లుండకయే పోదురు; లోకములో వ్యభిచారమే లేకపోవును; వేశ్యలందఱును మహాపతివ్రతలే యయి యుందురు, బాలవిధవల కిప్పటివలె వ్యభిచారముదోషమును, గర్భస్రావాదిపాతకములు సంభవించికయే యుండును. నిత్యమును కన్నకన్నవారితో నెల్లను గలియు వేశ్యలపాదము లాశ్రయించి తమధనమును కొల్లపెట్టు మహాపురుషులకు,ఎప్పుడో భర్తపోయిన కులస్త్రిని వివాహమాడుట రోఁతగా కనఁబడవలసినదే. మనలో చిరకాలము నుండి యట్టియాచారము తప్పియుండుటవలనను, మనవారు వారికి కటాక్షించియున్న వికృతవేషమువలనను, మొట్టమొదట కొందఱికంటికి వారిరూప మసహ్యముగాఁ గనఁబడవచ్చును. అట్టివారికన్నులకయినను పయివేషముమాఱి సువాసినీచిహ్నములుకనఁబడినపిమ్మట మొదటియట్లుండదు, అదివఱకు భర్తలతోడి సంభోగసుఖమనుభ

వించినవారిమాట యటుండనిచ్చినను, అట్టిదోషమేమియు నెఱుంగని బాలవిధవలకయినను మీరు వివాహము నంగీకరించెదరా?

శ్రీని—విధవలు వివాహము చేసికోవచ్చునని యేమాత్రమవకాశమిచ్చినను ఒకభర్తపోయిన మఱియొకనిని వివాహమాడవచ్చునని పడుచుతనములోనున్న స్త్రీలు ముసలిమగలకు విషముపెట్టిచంపివేయుదురు. అప్పుడు శిశుహత్యలకు బదులుగా పతిహత్య లెక్కువగును.

వీర—మీరిప్పుడు చెప్పినది మిక్కిలి లోకానుభవవిరుద్ధము. ఒక్కహిందూదేశములో తప్ప ప్రపంచములోని సమస్తదేశముల యందును స్త్రీలకు పునర్వివాహ మున్నదిగదా? ఏదేశములోనైన భార్యలు భర్తలను చంపుచున్నారా? ఏదేశము మాటో మన కేటికి? మనదేశములోనే గొల్లలు మొదలయినవారిలో మాఱుమనుషులున్నవిగదా? వారిలోపతిహత్యలు జరుగుచున్నట్లు వినియున్నారా? పురుషులు పునర్వివాహము చేసికోవచ్చునని భార్యలనెక్కడనైనను జంపుచున్నారా? తెలిసినయెడల తనప్రాణముమీఁదికి వచ్చునని నేస్త్రీయైనను జేయసాహసించునా? అటువంటి దుర్మార్గురాలినినమ్మి యెవ్వఁడైనను మరలపెండ్లిచేసికొనునా? ఇట్టినష్టములు మనబుద్ధికల్పితములేగాని నిజముగా కలుగునవి కావు.

శ్రీని—మీరింత ప్రయాసపడి వాదించుటకు విధవలు తమకు పెండ్లికావలయునని మీతో మొఱవెట్టుకొనుచున్నారా? మీకీకంత శోషణ మెందుకు?

వీర—మంచివారి కొకఁడయాపదనుచూచి సాహాయ్యము చేయుటకు వారు మొఱపెట్టికోనే యక్కఱలేదు. అంతేకాక యిది వారు మొఱపెట్టుకోవలసిన యంశమును గాదు. పురుషులకెన్ని స్వాతంత్ర్యములున్నను, ఎవ్వరైనను గర్భాదాన విషయమునఁగాని వివాహ

విషయమునందాని యితరులతో మొఱ్ఱలిడుచున్నారా? సిగ్గుచేతను, మనలోని క్రూరాచారముచేతను, మనవారు వహించిన కఠినచిత్తత చేతను, వారు మనలను ప్రార్థించకపోయినను వారికష్టములనుజూచి నను స్త్రీపునర్వివాహము లేకపోవుటవలనఁ గలుగుచున్న యనర్థము లను జూచినను మానవజన్మమెత్తినవానికెల్లను వితంతువివాహముల కయి పనిచేయుట విధిగా నేర్పడుచున్నది.

శ్రీని—ఈయనయెంతసేపు చెప్పినను, సారవంతమయినమాట యొక్కటియు కనఁబడలేదు. మాయుక్తులలో నొకదానికిని సమా ధానము రాలేదు. వారివాదము పడిపోయినది; మావాదము స్థిర పడినది. శాస్త్రచర్చతో పనిలేకయే మేము గెలిచినాము. ఇఁక విధ వా వివాహముల విషయమయి యెన్నఁడును సభలులేకుండ చేయు వలెను. అగ్రాసనాధిపతిగారు పక్షపాతముఁడిచిపెట్టి న్యాయమయిన మాట చెప్పవలెను.

వేణు—యుక్తులకేమి? ఏపక్షమునైననుజెప్పవచ్చును. ఒక వేళనొకరు తిన్నఁగా యుక్తి చెప్పలేకపోయినను, అదివారిదౌర్బల్యమే కాని వాద దౌర్బల్య మెన్నటికిని కానేరదు. ఆచార్యులుగారు చెప్పిన యుక్తు లనుకూలముగానే యున్నవి.

శ్రీరా—ఏమి? నేను చెప్పినయుక్తు లనుకూలముగా నున్నవి కావా?

వేణు—మీరు చెప్పిన యుక్తులును దివ్యముగానే యున్నవి. యుక్తులకేమి? మనకు శాస్త్రముప్రమాణము. పయిభానువారము నాఁడు శాస్త్రవాదము చేయుటకయి మీరందఱు నిక్కడకు దయ చేయవలెను. పండితులు ముఖ్యముగా విజయంచేయవలెను.

పర—వేణుగోపాలరావుగా రందఱును మెచ్చుకొనునట్లుగా న్యాయము సెలవిచ్చినారు. యుక్తివాదములోమనమే గెలిచినాము.

మనకిది శుభసూచకము. శాస్త్రవాదములలోను మనకే జయము కలుగును.

వామ—తథాస్తు! అందఱును సంతోషముతో నిండ్లకునడు వండి. (అనఁగా నందఱును వెళ్ళుచున్నారు)

తృతీయాంకము

ప్రథమరంగము—వేణుగోపాలరావుగారి గృహము.

[వేణుగోపాలరావుగారును, శ్రీనివాసాచార్యులుగారును కూరుచుండి మాటాడుచుండఁగా వామనశాస్త్రిగారును, కుమారశాస్త్రి గారును, గోపాలశాస్త్రిగారును, పరబ్రహ్మసోమయాజులు గారును ప్రవేశించుచున్నారు]

వేణు—(లేచి) దయచేయండి. శాస్త్రులవారికందఱికి నమస్కారము. (అని చేతులు జోడించుచున్నారు)

శాస్త్రి—ఆచంద్రార్కం వంశాభివృద్ధిరస్తు. రాజద్వారే రాజభవనే సర్వదా దిగ్విజయమస్తు. తథాస్తు.

వామ—మీరేమో రహస్యము మాటాడుకొనుచున్నట్టు న్నారు మేముండఁవచ్చునా?

వేణు—మాకు రహస్యమేమున్నది? మన సభవిషయమయి యే మాటాడుచున్నాము. ఎంతప్రయత్నమయినను చేసి వారిప్రయత్నము చెడఁగొట్టవలెను.

కుమా—మొన్నజరిగిన సభవిషయమయి జనులేమి యభిప్రాయపడ్డారని మీరు విన్నారు?

వేణు—నేనుమఱియొకలాగున విన్నానుగాని జనులందఱును మనయుక్తులు దివ్యముగానున్నవని మిక్కిలి సంతోషించుచున్నారని శంకరశాస్త్రులుగారు శ్రీనివాసాచార్యులుగారితో మనవిచేసినారట.

కుమా—ఆయన యేమిచెప్పినారోగాని నేను మొన్నటి సభకు రాలేదుగనుక వాదమెట్లున్నదని బహుజనుల నడిగినూచి నాను. మనపక్షమం దభిమానముగలవారు కొందఱుతప్ప జనులంద ఱును వారి యుక్తులే బాగున్నవని చెప్పుచువచ్చినారు. యుక్తులెట్లు న్నను శాస్త్రము మాత్రము వారివాదమునకు ప్రతికూలముగానున్న దని నేను కనబడినవారితో నెల్ల చెప్పుచున్నాను.

వామ—మీరాలాగున సెలవిచ్చెదరేమి? విధవల యవస్థ చూచిన పగవారి మనస్సు కలుక్కుమనుచున్నదన్న మాటకు బదు లుగా విధవావివాహము లయిపోవునేమో యనియే శిష్టాచార సంపన్నులయిన పండితుల మనస్సులు దహించుకొని పోవుచున్నవని శ్రీరామపండితులవారు చెప్పిన యుక్తి యెంత సరసముగానున్నది? దానికి వారేమి సమాధానము చెప్పఁగలరు?

పర—నే నీసంగతినే సీతారామయ్యగారి కొమారుఁడు గోవిందరావుతో ప్రశంసించి నప్పుడు, అతఁడు మంచి సమాధాన మునే చెప్పినాఁడు.

వామ—మన మనసులలో నాలాగుండుట కేమి కారణము చెప్పినాఁడు?

పర—చిరకాలాచారమువలన నట్లుతోఁచుటసహజమనియు, దురభిమానమును వదలి న్యాయైకదృష్టితోఁ జూచినప్పుడు దయ పుట్టకుండదనియు, బహు కాలాచారమువలన మనలో పలువురకు నరబలు లిచ్చునప్పుడు లేశమయినను జాలిలేకుండుట మీరుచూచు చున్నారు కారా యనియు, చెప్పినాఁడు.

కుమా—ఇన్నిమాటలు చెప్పుచున్నాము గాని యిప్పుడు లోకములో జరుగుచున్న దారుణకృత్యములనుజూచినప్పుడు విధవల విషయమయి మనకు మాత్రము నిజముగా జాలిపుట్టుచుండుటలేదా?

పరబ్రహ్మ సోమయాజులుగారి మేనకోడలి కొమార్తెకు వివాహమయిన నెలలోపలనె మగఁడు పోయినాఁడు. ఆపిల్లను తలఁచుకొన్నప్పుడు మాకందఱకు నెంతదుఃఖము—

వామ—మనపక్షములో నున్నవారు మీరే యీలాగున సెలవిచ్చుచుండఁగా, ఇతరుల మాట చెప్పవలసిన దేమున్నది?

కుమా—మనలో మనమాట గనుక చెప్పినాను గాని యితరుల ముందఱ నే నీప్రకారముగా చెప్పుదునా? మీరేమియు సందేహపడఁబోకుఁడు.

వేణు—మీరు గోవిందరావు నెందుకుచూచినారు? ఆతఁడు వీరరాఘవరావుగారితోఁ గలిసి యెప్పుడును తిరుగుచున్నాఁడే.

పర—ఈదినము సభలో చెప్పుటకు వీరరాఘవరావుగారేమి యాలోచించుచున్నారో జాడతీయుటకయి మొన్నటిదినము వారి యింటికి వెళ్ళినాను.

వామ—గోవిందరావు వీదినమున సభకురాఁడు. నిన్నరాత్రి యతని యప్పగారు కొంత సొమ్ముతో వంట బ్రాహ్మణుని తీసుకొని లేచిపోయి బహిరంగముగా నంగడివీధిలోప్రవేశించినదట. సిగ్గుచేత వారి కుటుంబములోని వా రెవరును పయికిరాకున్నారు.

పర—ఆ లేచిపోయినదాని పేరెవరు?

వామ—పేరేమో నాకు తెలియదు గానీ యామె సీతారామయ్యగారి పెద్దకూఁతురట. మనగోపాలశాస్త్రిగారికి తెలియును.

గోపా—అన్నపూర్ణ. సీతారామయ్యగారికిరజస్వలకానివిధవ కూఁతు రొకతెయున్నది. ఆచిన్నదాని కేలాగునైన వివాహము చేయించనలెనవి గావిందరావు కభిప్రాయమున్నట్లుకనఁబడుచున్నది.

వామ—సీతారామయ్యగా రందుకొప్పుకొందురా! ఒప్పుకొనరు.

పర—ఒకవేళ కూఁతురు లేచిపోయినందుచేత నొప్పు కొందురేమో?

వేణు—ఒక్క కూఁతురు కాదుగదా పదిమంది కొమార్తెలు లేచిపోయినను పెద్దలొప్పుకోరు. నిన్న గాక మొన్ననాఅప్పకోడలు లేచిపోయినది. నేనేమయిన నొప్పుకొనుచున్నానా? ఒకవేళ లోపల నభిప్రాయమున్నను లోక భీతిచేతనయినను మానివేయుదురు.

పర—నేను చూచుచున్నాను. లోపల నూటిలో తొంబది తొమ్మిదిపాళ్లు ప్రతిమనుష్యునకు విధవావివాహములు కావలెననియే యున్నది. పయి కెవ్వరును లోకభీతిచేత మాటాడరు.

శ్రీని—ఎవరికేలాగున్నను, మనము చేతనయినంత ప్రయత్నముచేసి విధవావివాహములు మాన్పినామన్న ప్రతిష్ఠను పొందవలెను.

వేణు—దానికేమి యాలోచన? శంకరాచార్యులవారికి వ్రాసి యీ ప్రయత్నము చేయుచున్నవారి కాంక్షపత్రిక తెప్పింతమా? డబ్బు కావలసిన నేనిచ్చెదను.

వామ—ఆ ప్రయత్నము దివ్యముగా నున్నది. ఇప్పుడే యా ప్రకారముగా చేయుదము.

శ్రీని—ఇప్పుడు కాలము మంచిది కాదు. హూణప్రభుత్వమవుటచేత మనస్వాములవారి యధికారము చక్కఁగా చెల్లదు. ఇదియే మనస్వదేశరాజుల యధికారమైన పక్షమున, ఈపాటికిప్రయత్నము చేసినవారి నందఱిని రాతిగానుగలలో పెట్టి యాడించలేకపోయినామా? ఈదినము సభ జరగనిండి తరువాత మాట చూచుకొందము.

పర—వారేమో గ్రంథములువిస్తారముగా వెదకుచున్నారట. ఇదివఱకే వారి శాస్త్రాధారము లనేకములు దొరికినవట!

వామ—వారికెన్ని దొరికిననేమి? అవియన్నియు నే నొక నిమిషములో ఖండించివేసెదను. అందులో నెవరైన నాతో సమానముగా మాటాడఁగలరా?

వేణు—మీరు చెప్పిన మాట బాగున్నది. జనులు యుక్తులను గ్రహించినట్లు శాస్త్రమును గ్రహింపలేరు. మీరు మాత్రము విడువకుండ గబగబయేవో శ్లోకములను చదివి వారు చెప్పినదెల్లను కాదనుచుండవలెను. అప్పు డందఱును మీరే గెలిచినారనుకొందురు. అందుకు సందేహము లేదు.

కుమా—అందఱునుగాకపోయినను కొందరైనను శాస్త్రము సహితము గ్రహింపఁ గలిగినవా రుందురు. శాస్త్రవిషయంలో మనము బహుజాగ్రతగా నుండవలెను. లౌకికయుక్తులలో నెట్లున్నను పండితులమని పేరుపెట్టుకొని శాస్త్రములో మనము తగిన సమాధానము చెప్పలేకపోయినపక్షమున మిక్కిలి యవమానకరముగానుండును.

వామ—వారికి పుస్తకముల నేమియు నియ్యకుండ గ్రామములోని వైదికుల నందఱితోను ముందుగా చెప్పవలెను. ఎవ్వరైనవారి కొక పుస్తకము నెరువిచ్చినను, ఒక్క శ్రుతివచనమునకర్థము చెప్పినను, వారిని బహిష్కారము చేసెదమని భయపెట్టవలెను.

వేణు—కుమారశాస్త్రిగారు చెప్పిన యంత మాలోచించవలసియే యున్నది. మన ప్రతిపక్షులు బహుగ్రంథములను జూచుచున్నారని నేనును విన్నాను. ధనమునకాశపడి పండితులలో నెవ్వరయినను వారి పక్షమునకు రావచ్చును. వామనశాస్త్రిగారూ! మీరీవిషయమున ధర్మశాస్త్రము లేవి చూచినారు?

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
Acc. No.

వామ—ఏమియు చూడనక్కర లేదు. విధవావివాహము కూడదని కాశీపండితులు వ్రాసిన పుస్తకము నావద్దనున్నది. అది యిక్కడ మఱి యెవ్వరియొద్దను లేదు. దానితో నేనెంతమందినయి నను జయింపఁగలను.

కుమా—మేము ధర్మశాస్త్రపండితులమని పేరేగాని మాలో నెవ్వరియొద్దను ధర్మశాస్త్ర గ్రంథములు లేవు. ఆయనయొద్ద తర్క గ్రంథములున్నవి; నాయొద్ద వ్యాకరణ గ్రంథములున్నవి; కాశీపండితుల పుస్తకములో లేని క్రొత్తసంగతులను వారుతీసికొనివచ్చిన పక్షమున మనము సభలో నోరెత్తలేక యూరకుండవలసివచ్చును.

వేణు—అందుకు నేనొక యుపాయము చెప్పెదను వినండి. పనియున్నదని చెప్పి యీదినముకూడ కుమారశాస్త్రిగారు సభకు రాకయే యుండవలెను. అందఱును వచ్చి చెప్పలేకపోవుటకంటె మొదటవాదము ధోరణి కనిపెట్టి యొకరు చెప్పలేకపోయిన మఱు సటిసభయందు మఱియొక రాలోచించుకొనివచ్చి సమాధానము చెప్పవచ్చును. ఒకదినమున వాద మొకపుంతనువచ్చిన మఱియొక దినము దానిని మఱియొకపుంతకు దింపి వాదింపవచ్చును. అక్కడ కును మనము జయింపలేక పోయినపక్షమున వారిని జాతినుండిబహిష్కారము చేసెదమని బెదరింపవచ్చును. మన మోడిపోతిమని మాత్ర మెన్నఁడు నొప్పుకొనఁ గూడదు.

వామ—ఊరంతటను మనము గెలిచితిమనియే యింటింటికిని పోయి చాటవలెను. శాస్త్రమున్నదన్నమాట మనము ప్రాణము పోయినను, ఒప్పుకొనఁ గూడదు.

శ్రీని—వేణుగోపాలరావుగారు చెప్పిన యాలోచనకంటె మంచియాలోచన మఱియొకటి యేమియు నాకు తోఁచలేదు. అదే సర్వోత్కృష్టమయినది. ఆప్రకారముగా చేయుదము. మనముగెలిచి

నట్టు గ్రామములో వదంతి వేయించుట యెంతపని! అదిమాశాస్త్రిల చేత నిమిషములో నేను చేయించఁగలను.

వేణు—భోజనముల వేళ అయినది లేతమా! మధ్యాహ్న మందఱు నీత్రోవనే దయచేయువలెను. మన మందఱము కలిసి వెళ్ళుదము.

[అప్పు డందఱును పోవుచున్నారు.]

ద్వితీయరంగము—పఠనమందిరము.

[పండితులతో వేణుగోపాలరావుగారును, వీరరాఘవరావుగారు మొదలయిన వారును ప్రవేశించుచున్నారు.]

వీర—పండితు లందఱును దయచేసినట్లున్నారు. ఈపాటికి సభ యారంభింపవచ్చునా? ఒక్క కుసూరశాస్త్రిగారు రాలేదు.

పర—వారిదినమున రారు. సభ మొదలుపెట్టవచ్చును. క్రిందటి మాఱువలెనే వేణుగోపాలరావుగా రగ్రాసనాసీనులుగా నుండవలెనని నాకోరిక.

వేణు—నాకంటె శ్రీనివాసాచార్యులుగా రగ్రాసనాసీను లుగా నున్న ననుకూలముగా నుండును.

శ్రీని—కాదుకాదు. వేణుగోపాలరావుగారే యుండవలెను.

త్రివి—మీ రిద్దఱును తగవులాడుచున్నారు. మీ యిద్దఱి బదులు నేనుందునా?

వామ—త్రివిక్రమరావుగా రిక్కడకూడ హాస్య మాడు చున్నారు.

వీర—హాస్యముగాదు. నిజముగానే యగ్రాసనాసీనులుగా మఱియెవ్వరైన నుండవలెను. వారిరువురును మాకు ప్రతిపక్షకోటి

లోనివారు. ఎవ్వరితోనుసంబంధము లేనివారు మఱియొకరుండుటయే యుభయపక్షములవారికిని క్షేమకరము.

వామ—అట్లయిన సాంబసదాశివరావుపంతులుగా రగ్రాసనాసీనులుగా నుండుట మీకు సమ్మతమా? మావారందఱు నొప్పుకొందురు.

వీర—ఆయనయుండుటకు మాకేమాక్షేపణమును లేదు.

వామ—పంతులుగా రగ్రపీఠమునకు దయచేయవలెను.

సాంబ—నాకేమియు తెలియకపోయినను, మీరందఱునన్ను నియమించుచున్నారు గనుక విఘ్నేశ్వరునివలె నేను పీఠముమీఁద కూరుచుండి మీరు చెప్పెడిది వినుచుండెదను.

వీర—నేనిఁక మొదలుపెట్టవచ్చునా?

వామ—అవశ్యము మొదలుపెట్టవచ్చును. మీవాదమునకు వేదములలో నెక్కడనైన నాధారమున్నదేమో మొదట కనఁబఱుపుఁము.

వీర—ఒకటికాదు. అనేకాధారములున్నవి. వానినెల్లను వరుసగా చూపెదను.

శ్రుతి. ఉదీర్ష్వ భిజీవలోక మితాసుమేత ముపశేషఏహి.

హస్తగ్రాభస్యదిధిషోస్త్వ మేతత్పత్యుర్జనిత్వమభిసంబభూవ॥

అను నారణ్యకశ్రుతి మావాదమునకు మిక్కిలి బలమయినది.

వామ—మీ వాదమునకు బలముగానుండు శ్రుతులు మఱి యేమియు లేవా?

వీర—శ్రుతి. యాపూర్వం పతింవిత్వా అథాన్యం విందతే పతిం।పంచౌదనంచ తావజం దదాతో నవియోషతః॥ సమానలోకో భవతి పునర్భువాపరః పతిః ॥ యోజం పంచౌదనందక్షిణాజ్యోతిషం దదాతి॥

అను నాథర్వణశ్రుతి మొదటిదానికంటెను మావాదమునకు బలవత్తరమయినది.

వామ—ఈ రెండునుతప్ప మీ వాదమున కక్కఱకువచ్చు శ్రుతులు లేవా?

వీర—కావలసినన్ని యున్నవి. మొట్టమొదట మీరీశ్రుతుల యర్థమును విచారించి మా వాదమును స్థాపించుటకివి చాలవని సాధించఁ గలిగినపిమ్మట నేను తక్కిన శ్రుతులను జెప్పెదను.

వామ—అలాగున కాదు. మీ కున్న యాధారముల నన్నిటిని చెప్పివేసినమీఁదట నే నొక్కసారిగా వాని నన్నిటిని ఖండించి వేసెదను.

వీర—స్త్రీ పునర్వివాహమును స్థాపించు మఱికొన్ని శ్రుతి వాక్యములను గూడ నుదాహరించెదను.

శ్రుతి. ఇయంనారీ పతిలోకం వృణానా నిపద్యత ఉపత్వా మర్త్య ప్రేతం. విశ్వపురాణ మనుపాలయంతీ తస్యైప్రజాంద్రవిణం చేహధేహి॥ అను యజుర్వేద వచనమున,

శ్రుతి. తస్మాదేకస్య బహ్వ్యోజాయాభవన్తి।నైకస్యైబహవస్సహపతయః॥ అను ఋగ్వేద వచనమును,

శ్రుతి. ఉదయ త్మతయో దశయాః పూర్వే అబ్రాహ్మణాః॥ బ్రహ్మచేత్ హస్తమగ్రహీత్ సఏవ పతిరేకధా॥ బ్రాహ్మణః ఏవ పతిర్న రాజన్యోనవైశ్యః। తత్సూర్య ప్రబ్రువన్నేతి పంచభ్యో మానవేభ్యః॥ అను నాథర్వణచనమును,

శ్రుతి. సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిదఉత్తరః।తృతీయోఅగ్నిష్టే పతిస్తురీయస్తేమనుష్యజాః॥ అనుఋగ్వేదవచనమును,

శ్రుతి. కుహస్విద్దోషా కుహవస్తో రశ్వినా కుహాభిపిత్వం।కరతః కుహోషతుః కోవాంశయుత్రా విధవేదదేవరం మర్యన్న యోషా

కృణుతేసధస్థఆ॥ అను ఋగ్వేదవచనమును, వేదము స్త్రీ పునర్వివాహము నంగీకరించునని సూచించుచున్నవి.

వామ—"దేవర" మని నియోగమునుగూర్చి చెప్పిన యీ కడపటి శ్రుతి మీ కేమి యుపయోగకరము?

వీర—నియోగముగాక దేవరునితోడి వివాహమునే వేదము విధవకు చెప్పుచున్నది. అందుచేతనే పయి శ్రుత్యర్థమును వివరించు నిరుక్తము స్పష్టముగా,

నిరుక్తము॥ క్వస్విద్రాత్రౌ భవధః క్వదివాక్వాభిప్రాప్తిం కురుధః-క్వవసధః। కోవాంశయనే విధవేవ దేవరం దేవరః కస్మాద్వితియో వరఉచ్యతే॥

ద్వితీయవరుఁడనియే చెప్పుచున్నది.

వామ—(పరబ్రహ్మసోమయాజులతో రహస్యముగా)ఇదేమి? వీరు కాశీపుస్తకములో లేని శ్రుతులను జదువుచున్నారు?

పర—(రహస్యముగా) వారు చెప్పిన యర్థమెల్లను కాదని వారిమాట చొరకుండ కేకలు వేయండి. తరువాతచూచుకొందము.

వీర—నేను శ్రుతివాక్యములను జదువుచుండగా వినక మీ రిద్దఱు నేమో మాటాడుకొనుచున్నారు.

వామ—నాయర్థమునకన్న వేదార్థ ప్రకాశాఖ్య వ్యాఖ్యానమునందు శ్రీవిద్యారణ్యులవారు చేసిన ప్రతిపదార్థమునే నేనిక్కడఁ జెప్పెదను:—

హేనారీ! త్వమ్ ఇతాసుం=గతప్రాణం, ఏతం=పతిం, ఉపశేషే=ఉపేత్యశయనం కరోషి; ఉదీర్ష్వ=అస్మాత్పతిసమీపాదుత్తిష్ఠ; జీవలోకమభి=జీవంతం ప్రాణిసమూహమభిలక్ష్య, ఏహి=ఆగచ్ఛ; త్వమ్,హస్తగ్రాభస్య=పాణిగ్రాహనతః, దిధిషోః=పునర్వివాహేచ్ఛోః,

పత్యుః, ఏతత్, జనిత్వం=జాయాత్వం, అభిసంబభూవ, అభిముఖ్యేన సమ్యక్ ప్రాప్నుహి.

త్రివి—మీరు సంస్కృతముతో నేమో చెప్పుచున్నారు. మాం కేమియు తెలియుచుండ లేదు. మీరాశ్రుత్యర్థమును తెనుఁగునఁ జెప్పుఁడు.

వామ—తెనుఁగునఁ జెప్పుట శాస్త్రసమ్మతము గాదు—

సాంబ—అందఱికిని దెలియుటకై తెలుఁగుతో కూడ చెప్పనిండి.

వీర—ఈశ్రుతికి విద్యారణ్యులవారు వ్రాసిన భాష్యార్థమును తెనుఁగుతో జెప్పుచున్నానుగనుక దయచేసి యందఱును వినుండి.

నారి—ఓనారీ (త్వమ్=నీవు), ఇతాసుం=గతప్రాణుఁడయిన, ఏతం = ఈపతినిగూర్చి, ఉపశేషే = సమీపమున పడియున్నావు; ఉదీర్ష్వ=(పతిసమీపమునుండి) లెమ్ము. జీవలోకమభి=జీవించియున్న ప్రాణిసమూహమునుజూచి; ఏహి=రమ్ము. త్వమ్=నీవు, హస్తగ్రాభస్య=ప్రాణిగ్రాహకుఁడును, దిధిషోః=రెండవమాఱు వివాహమాడ నిచ్ఛగలవాఁడును (అయిన), పత్యుః=భర్తకు, ఏతత్=ఇటువంటి, జనిత్వం—భార్యాత్వము, అభిసంభూవ=అభిముఖ్యముచేత చక్కఁగా పొందుము.

ఊర్ధ్వదైహిక కాండమునందలి పూర్వక్రియయందు విధింపఁబడిన సహగమనమును జేయుటకు మృతభర్తృక భీతురాలయిన యెడల, సహగమనముచేయని యాస్త్రీయొద్ద బంధువులీమంత్రమును చదువవలయును. "ఓనారీ! ప్రాణముపోయిన యీపెనిమిటియొద్ద నేల పడియుండెదవు? జీవించియున్నవారిని జూచి లేచిరా. పునర్వివాహమును జేసికొన గోరువానికి భార్యవుకమ్ము" అనునర్థమిచ్చెడి మీ మంత్రమును మఱఁది మొదలగువారెవ్వరైన పెనిమిటిపోయిన స్త్రీ

యొద్దఁజదివియామె నూఱడించి లేవఁదీయవలెను. "తాముత్థాపయ త్యన్యోవాబ్రాహ్మణ ఉదీర్ష్వనారీతి" యనునది యీమంత్రమునకు వినియోజక వాక్యమయిన కల్పసూత్రము. దీనినిబట్టి వేదమువిధవా వివాహమును విధించుచున్నదని స్పష్టముగాలేదా?

వామ—మీరు చెప్పినదంతయు కేవల శాస్త్రవిరుద్ధమయిన యర్థము. స్త్రీ మృతుఁడయిన భర్తయొద్ద పరుండవలెనని విధి యున్నదా? దానిని లేవతీయుట యెందుకు? మీరుచెప్పినయర్థ మబద్ధ మని యీ సభవారి కందఱికిని—

వీర—తొందరపడకండి. శాస్త్రులవారు కొంచెమోపిక చేయవలెను. మృతభర్తృకను ప్రేతమువద్ద పరుండఁబెట్టవలయునని విధియును గలదు. ఇదివర నుదాహరించిన "ఇయంనారీ" యను మంత్ర మప్పుడు చెప్పవలసినదే. "అత్రపత్నీముపనిపాతయతీయం నారీతి" యని కల్పసూత్రము 'ఇయంనారీ' త్యాది మంత్రమునుజెప్పి ప్రేతపత్నిని భర్తృశవసమీపమున పరుండఁబెట్టవలయునని విధించు చున్నది.

త్రివి—'ఇయంనారీ' యని మంత్రముననుఁ గూడ నర్థము సెలవించి.

వీర—హేమర్త్య=ఓమనుష్యుఁడా, ఇయంనారీ=ఈస్త్రీ, పతి లోకం = పెనిమిటివైన నీలోకమును, వృణానా = కోరుచున్నదై, ప్రేతం=ప్రేతవగు, త్వా=నిన్ను ఉప=సమీపమునందు, నిపద్యత= పడియున్నది. పురాణం=ప్రాచీనమగు, విశ్వం=ప్రపంచమును, అను పాలయంతీ=అనుసరించి వర్తించుచున్నది. తస్యై = ఆమెకొఱకు, ప్రజాం=సంతానమును, ద్రవిణంచ=ధనమును, ఇహ=ఈలోకము నందు, ధేహి=వృద్ధిపొందునట్లు చేయుము.

ఓమృతుఁడా! నీభార్యనీలోకమును గోరి ప్రేతవగు నీసమీప మునపడి యున్నది; ప్రాచీనమయిన యీ ప్రపంచధర్మము ననుసరించి ప్రవర్తించుచున్నది కాఁబట్టి దీనికి సంతానము ధనమును వృద్ధి పొంది బాగుండునట్లు చేయుమని యర్థ మిచ్చెడి యీ మంత్రమును శవమువద్ద భార్యపడియుండఁగా ప్రేతమునుద్దేశించి బంధువులు పఠింతురు. 'ఇయంనారి'యను మంత్రముచేత నీభార్యకుసంతానము కలిగి బాగుండునట్లు చేయుమని ప్రేతమునుగోరుటయు, 'ఉదీర్ష్వనారి'యను మంత్రముచేత మృతునియొద్దపడి యేలయేడ్చెదవు మఱియొకనికి భార్యవుకమ్మని ప్రేతపత్ని నూఱడించుటయు, వేదము నిస్సందేహముగా విధవావివాహమును విధించుచున్నట్లు మీకు స్పష్టపడలేదా?

వామ—సంతానము బాగుండునట్లు చేయుమన్నమాత్రము చేత నట్లూహించుటకు వీలులేదు. ఇప్పుడుచెప్పిన సంతాన మిదివఱకున్నదేకాని యింకముందు కలుగఁబోవునది కాదు.

వీర—సూ. "ఏతన్మంత్రద్వయం సపుత్రకాయానాస్తి" పయి రెండు మంత్రములును సంతానవంతురాలికి లేవని సూత్రకారులు విధించుటవలన మీయర్థమున కెంత మాత్రము నవకాశము లేదు.

వామ—అట్లయిన నీచెప్పినసంతాన ముత్తరజన్మమునందని యూహింపవలయును.

వీర—అట్లు చెప్పినయెడల 'తస్యై'యనుపదము బాధించును. ఉత్తరజన్మమునందనెడు పక్షమున నామె యొక్కతెకొఱకేసంతానమభివృద్ధికావలెనని కోరుట యసందర్భము. దంపతుల యుభయుల కొఱకునని చెప్పవలసియుండును. ఆజన్మమునఁగూడ విధవయేయయి యప్పుడుకూడ నీమెకొఱకే సంతానము నిలువవలెననుట యెంతపరిహాసాస్పదమయినమాట! అదిగాక యీ శ్రుతిలో నుత్తరజన్మమని

సూచించుపదమయినను లేదుగనుక మీరుచేసిన యర్థము మతిమంతు డెవ్వఁడును నొప్పుకొనఁడు.

వామ—మేమీ శ్రుతులు రెండును సహగమన పరములే యనియు, ఈసంతానము, వివాహము మొదలయినవి, పరలోకము ననే యనియు సాధించెదము.

వీర—అప్పుడు సహితము 'తస్యై' యను పదము బాధించనే బాధించును. ఆమెకొఱకు కనుటకుమాఱుగా నిద్దఱికొఱకునని యుండ వలసియుండును. అదిగాక 'యిహ' యనుపదము మఱింత బాధించును. శ్రుతిలోనే(ఇహ) యీలోకమున ననియుండఁగా మీరుపరలోకమున ననియెట్లుసాధింపఁ గలుగుదురు? ప్రేతపత్ని భర్తతో ననుగమనము చేయుచున్నప్పు డామెకొఱకు సంతానము బాగుండవలెనన్న నెట్లు పొసఁగియుండును? ఆమెజీవించియున్నఁగదా యామెకొఱకని చెప్ప వలసియుండును. ఉత్తరజన్మమున ననికాని పరలోకముననని కాని చెప్పెడు పక్షమున మొదటి శ్రుతిలోని "దిధిషు" శబ్దముపొసఁగదు. "పునర్భూదిధిషూరూఢాద్విస్తస్యాదిధిషుఃపతిః" అను నిఘంటువును బట్టి రెండుమాఱులు వివాహము చేసికొను స్త్రీ పునర్భవనియు, పునర్భవును వివాహమాడువాడు దిధిషువనియుగదా చెప్పబడుదురు మొదటిభర్త దిధిషుఁడెట్లు కాఁగలఁడు?

వామ—మీరెంతమాత్రమును శాస్త్రసమ్మతమయిన యర్థ మును శిష్యులెవ్వరును విశ్వసింపరు. మీవాదముతో యుక్తి యెంత మాత్రమును లేదు. ఎంతసేపువిన్నను మీనోటినుండియున్నియు కుయు క్తులే వచ్చుచున్నవిగాని మంచియుక్తి యొక్కటియుఁ గనఁబడదు. వేదమెక్కడనైన మగఁడుచచ్చి యేడ్చుచున్నదానినిపునర్వివాహము చేసికొమ్మని చెప్పునా? అది యెంతవిరుద్ధము? ఇప్పుడెవరైన నట్టి స్త్రీతో నీవు బరల పెండ్లిచేసికొమ్మని యన్నపక్షమున—

పర—మీరు కొంచెము తాళి నన్నొక్కసారి మాటాడనిండి ఉదీర్ష్వారి యను శ్రుతికి—

వీర—వామనశాస్త్రులవారూరక నాయర్థము పార్థమని దూషించుటయే కాని నేను చెప్పిన యర్థ మీహేతువుచేత సరియయినది కాదని చూపఁగలిగినవారు కారు. భార్య పోయినప్పుడు పురుషుని జేరి బంధువులు మొదలయినవారు 'చచ్చినదాని నిమిత్త మేడ్చిన కార్యములేదు. నీవు మరల వివాహము చేసికోవచ్చు'నని యోదార్చుచుండుట సర్వసాధారణమయియే యున్నది. మనలో పురుషునకు పునర్వివాహమున్నది గనుక, ఆమాట యెంతమాత్రమును తప్పుగా తోఁచుచుండలేదు. ఆ ప్రకారముగానే స్త్రీలకుఁ గూడ పునర్వివాహముండిన నట్టియోదార్పుమాటలు సహజముగానే తోఁచుననుటకు లేశముగాని సందేహములేదు. మనలోఁ గొంత కాలమునుండి స్త్రీ పునర్వివాహము నిలిచిపోవుటవలన, అట్టిమాట లాచారాభావమును బట్టి యిప్పుడు చెవుల కొకలాగున వినఁబడు చున్నవి. వేదములో నట్లు చెప్పుటలో నేదియు విరుద్ధము లేదు.

పర—ఆమాటలు పోనిచ్చి నన్నొక్కమాట మనవి చెయ్యనిండి.

వీర—మీరు చెప్పెడిదేమో చెప్పండి.

పర—శ్రుతిలో 'హస్తగ్రాభస్య' 'పత్యుః' అని భూతార్థద్యోతకములయిన పదములుండుటచేత పరలోకమున ఆపతికే మరల భార్యవుకమ్మని వామనశాస్త్రిగారు చేసిన యర్థమును నొక విధమున సయుక్తికముగానే కనఁబడుచున్నది. అయినను—

వీర—వ్యాకరణశాస్త్రము నభ్యసించియు మీరు కూడ నాపదములు భూతార్థకద్యోతకములని చెప్పుట వింతగానున్నది.

వామ—హస్తగ్రాభస్యపదమెట్లున్నను దానియర్థమును వివరించు 'పాణిగ్రాహవతః?' అనునది స్పష్టముగా భూతార్థకముగా కనఁబడుచుండలేదా? మతుప్రత్యయము భూతార్థకమునందుఁగాక మఱియెప్పుడు వచ్చును.

వీర—బుద్ధిమంతుఁడు లోనుగాఁగల మతుబంతములు భూతకాలద్యోతకములో సర్వకాలద్యోతకములో వ్యాకరణపండితులయిన పరబ్రహ్మసోమయాజులుగారి నడిగి తెలిసికొండి.

పర—ఆయంశ మట్లుండనిండి. హస్తగ్రాభస్య యనుచో షష్ఠికి సంబంధార్థమును గల్పించి పాణిగ్రాహకుని సంబంధుఁడయిన దిధిషువగు పతికనఁగా దేవరునికని యర్థముచేసి యీశ్రుతిని నియోగపరము చేయవచ్చును. అప్పుడు మీరు చేసిన యాక్షేపము లేమియుఁ బట్టవు. ఇయంనారి యను శ్రుతికిని విరోధము పొసఁగదు. "శాస్త్రీయపదానాం శాస్త్రీదేవ శక్తికల్పనా" అను న్యాయమును బట్టి "దిధిషు" శబ్దమునకు "శ్లో॥ భ్రాతుర్మృతస్య భార్యాయాం యోనురజ్యేత కామతః। ధర్మేణాపి నియుక్తాయాం సజ్ఞేయోదిధిషూపతిః" అను మనుస్మృత్యనుసారముగా దేవరుఁడనియే యర్థము చేయవలెను.

వీర—శ్రుతిలో నియోగమును సూచించు పదములయినను లేవు. మనుస్మృతిలోనైనను "దిధిషూపతి" యనియున్నదిగాని "దిధిషు" వనియుండలేదు. పునర్వివాహముచేసికొను స్త్రీయొక్క భర్తదిధిషువని స్పష్టముగానిఘంటువునందుఁగనబడుచుండగాఆయర్థమును గైకొనక దిధిషూపతియని గ్రహించిపిమ్మట యతనికి దేవరుఁడని యర్థముచెప్పవలయుననుట యేమిసహేతుకముగా నున్నది? ఆమనుస్మృతిలోనే "అయంద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః..... ... ... తతః ప్రభృతి యో మోహాత్ ప్రమీతపతికాంస్త్రియం। నియోజ

యత్యపత్యార్థం తంవిగర్హంతిసాధవః॥'' నియోగము పశుధర్మమని విద్వాంసులచేత గర్హింపఁబడుచున్నదనియు, సంతతికొఱకు కన్యపురుష నియోగమును సాధువులెల్లను నిందించుచున్నారనియు, నియోగము దూషింపఁబడియున్నది. మీరు చెప్పిన న్యాయమునుబట్టియే పయి శ్రుతిని సాధునిందితమయిన నియోగపరముగాఁ జేయుటకంటె 'నష్టేమృతే' త్యాది శాస్త్రవిహితమయిన పునర్వివాహ పరమునుగాఁ జేయుటయే నిర్బాధకముగాను పదములను బట్టి యుచితముగాను గనఁబడుచున్నది.

పర—మనము మొట్టమొదట మఱియొకటి యాలోచింపవలయును. మీరు చెప్పిన 'యుదీర్ష్వ నారి' యనునది మంత్రముగాని బ్రాహ్మణములోని విధివాక్యము కాదు. కల్పసూత్రకారుల విధివాక్యము లున్నప్పుడే కాని మఱియొకప్పుడు మంత్ర ప్రతిపాదితార్థము లనుష్ఠేయము లేకావు. సూత్రము స్థాపనక్రియనుమాత్రమే చెప్పుచున్నదిగాని పునర్వివాహమును జెప్పుచుండలేదు. అదిగాక భారద్వాజసూత్రము "యావజ్జీవం ప్రేత పత్న్యాదకోపస్పర్శ మేకభుక్తమధశ్శయ్యా బ్రహ్మచర్యం క్షౌరలవణ మధుమాంసవర్జనంచ'' యని ప్రేతపత్నికి యావజ్జీవమును బ్రహ్మచర్యమునే విధిగాఁ జెప్పుచున్నది. మంత్రముకన్న సూత్రము బలమయినదిగనుక స్త్రీకిపునర్వివాహము కూడదు.

వీర—కల్పసూత్రము వేదార్థప్రతిపాదకములయిన షడంగములలో నొకటియే కాని వేదములోఁ జెప్పఁబడిన విధులను నిషేధింపశక్తికలది కాదు. సర్వత్ర యీసూత్రమే ప్రవర్తించుననెడుపక్షమున, శాస్త్రసిద్ధములనఁబడు సహగమనాదులుకూడ లేకపోవలసి వచ్చును. కాఁబట్టి పునర్వివాహమునుగాని సహగమనమునుగాని కైకొనని విధవలకుమాత్రమే యీసూత్రమువలన పయినిర్బంధము

లన్నియు విధింపఁబడినవని చెప్పకతీఱదు. అట్లు కానిపక్షమున సహగమనమును పునర్వివాహమును విధించెడి యనేకస్మృతివచనములు నిష్ప్రయోజనములు కావలసివచ్చును. పరమప్రమాణములయిన శ్రుతిస్మృతులు నిష్ప్రయోజనములనియు ప్రవర్తకములు కావనియు నెవ్వరును జెప్ప సాహసింపఁజాలరు. అంతేకాక కొన్ని స్మృతులు పయి సూత్రములోఁ జెప్పిన నిర్బంధములఁ గొన్నిటిని సంవత్సరము వఱకును కొన్నిటిని నాఱుమాసములవఱకును మాత్రమే యవలంబింపవలయునని విధించుచున్నవి.

"శ్లో. సంవత్సరం ప్రేతపత్నీ మధుమాంసం విసర్జయేత్
అధశ్శయ్యాతషణ్మాసానితిమౌద్గల్యభాషితం." బోధాయనులు

ఇత్యాది వచనములనుబట్టి వివాహమాడెడి స్త్రీ సంవత్సరమునకు లోపు కాలములో మాత్రమే యీనిర్బంధములకు లోఁబడి యుండవలెననియు, పునర్వివాహము చేసికొని స్త్రీ యావజ్జీవమును లోఁబడి యుండవలెననియు సూత్రమునకు వ్యవస్థయేర్పఱుపవలసి యుండును. మఱియును "తస్మాదేకస్యబహ్వ్యోజాయాభవన్తి" యిత్యాది శ్రుతి స్త్రీకి పునర్వివాహము విధించుచున్నది.

పర—ఆశ్రుతి విధియని చెప్పవల్లకాదు. లిఙ్గ, లోట్, తవ్యప్రత్యయములను గలిగియున్నప్పుడు మాత్రమే విధాయకత్వ మేర్పడును కాని వర్తమానార్థకక్రియను గలిగియున్నప్పుడు విధికాదు.

వీర—వర్తమానార్థక క్రియకూడా విధ్యర్థమునం దుపయోగింపఁబడుటగలదు. "వ్రీహీన్ప్రోక్షతి" మొదలగు పెక్కుచోట్ల వర్తమానబోధకక్రియలు విధిబోధకములుగా నున్నవి.

వామ—మొదట తస్మాదేకస్యయను శ్రుతియొక్క యర్థవిచారముచేసి, ఆశ్రుతి యెందు కక్కఱకువచ్చునో చూడవలెను.

త్రివి—అందఱికిని దెలియుటకై యాశ్రుతికి తెనుఁగున ప్రతి పదార్థమును జెప్పుఁడు.

వీర—తస్మాత్ ఆకారణమువలన, ఏకస్య ఒకపురుషునకు, బహ్వ్యోజాయాః=బహుభార్యలు, భవన్తి=అగుదురు, ఏకస్యై=ఒకస్త్రీకొఱకు, బహవఃపతయః=బహుభర్తలు, సహ=ఏకకాలమునందు=న (భవన్తి)=కారు.

వామ—ఈశ్రుతియొక్క యుత్తరభాగమునందలి యొకస్త్రీకేకకాలమునందు బహుపతు లుండరను వాక్యమువలన భిన్నకాలములయం దుండవచ్చునని చెప్పెడుపక్షమున, పూర్వభాగమునుబట్టి యొకపురుషునకు భిన్నకాలములయందు బహుభార్య లుండఁగూడదని మీయుక్తిప్రకారముగానే యేర్పడి మొదటికే భంగమువచ్చును.

వీర—పూర్వభాగమునందు ఏకకాలమని సూచించుపదమేదియు లేఁకగనుక, పురుషున కేకకాలమునందే బహుభార్యలగుదురని చెప్పుట కెంతమాత్రము నవకాశము లేదు. సమకాలమునందుఁగాని భిన్నకాలమునందుఁగాని పురుషునకు బహుభార్య లుండవచ్చుననియే యీశ్రుతివలన స్పష్టపడుచున్నది. స్త్రీవిషయమున నేకకాలమని బోధించు సహశబ్దమును వేసియుండుటవలన, స్త్రీ కేకకాలమునందు బహుపతులుండరనియు భిన్నకాలమునందు వేఱుపతి యుండవచ్చుననియు స్పష్టమగుచున్నది. వేదపురుషుని యభిప్రాయమదియే కాని పక్షమున, వృథాగా సహశబ్దమును ప్రయోగించియుండఁడు.

వామ—భిన్నకాలమనఁగా మీతాత్పర్యమేమి? భిన్నక్షణమా? పతిజీవిత యావత్కాలమా? భిన్నక్షణమని చెప్పెడుపక్షమున స్త్రీకి నిమిషమున కొకపతి యుండవచ్చునని యేర్పడి లోకవిరుద్ధమగును. పతిజీవిత యావత్కాలము ననెడుపక్షమున, నష్టాదినిమిత్త

ములయందు మఱియొక పతిని జేసికొనవచ్చునను మీవాదమే పడి పోవును.

వీర—ఒక స్త్రీ విధ్యుక్తప్రకారముగా నొకనికిభార్యయయిన తరువాత నాతని పతిధర్మమునకు భంగము కలిగించి శాస్త్రవిహిత మయిన కారణ మగపడువఱకు నాతఁ డామెకు పెనిమిటియే యగునుగనుక, సహశబ్దప్రయోగమునుబట్టి భిన్నక్షణములయందు వేఱుభర్త లుండవచ్చునాయని ప్రశ్నమునకే యవకాశముండదు. నష్టత్యాజ నిమిత్తములయందు శాస్త్రము స్త్రీపునర్వివాహమును విధించుచున్నదిగనుక, శాస్త్రవిహితమయిన యాకాలమే సమయ భేదమగును. అప్పుడేవిధమయిన బాధకమును లేదు. భారతవ్యాఖ్యా నమునందు నీలకంఠాచార్యులవారును పయిశ్రుతికి "సహేతియుగ పద్బహుపతిత్వనిషేధో విహితో నతు సమయభేదేన" అని వ్రాసి యున్నారు.

వామ—నీలకంఠాచార్యులు వ్రాసినదానిని మేమునమ్ముము. మాకంటె నతని యాధిక్యమేమి?

వీర—ఆ యర్థముసరియైనది కాదనుటకు మీకేమి యాధార మున్నది? భాష్యమునందు సహిత మీ యర్థమే వ్రాయఁబడి, "గ్రహణం సహశబ్దస్య పర్యాయాద్బహ వోథ వాః స్యురితి ప్రతిపత్త్యర్థం ప్రాజాపత్యవచోయథా॥" యనువచన ముదహరింపఁ బడియున్నది.

వామ—'బహవోథవా' యనుచోట 'బహవః' 'అథవాః' అని పదచ్ఛేదయుచేసి పతిభిన్నులును పతిసదృశులు నగువారు పలువు రుండవచ్చునని సాధించెదను.

వీర—మీరు వ్యాఖ్యానమునందలి శ్లోకములో 'నథవా' యని పదచ్ఛేదము చేసెదరుగాని మూలమునందలి "సహపతయః"

అనుదాని నెట్లు 'అపతయః' అని పదవిభాగము చేయఁగలుగుదురు? అట్లు చేయలేకపోయినయెడల మీయర్థమెట్లు సిద్ధించును?

పర—అదికాదు. మేము పర్యాయమనఁగా జన్మపర్యాయమని సాధించెదము?

వీర—మూలములో జన్మపర్యాయమని సూచించు పదము లేనిది మీవాదము నిలువదు. ఉత్తరజన్మమునందుఁగూడ స్త్రీకాభర్తయే మరల భర్తయగునన్న మీ వెనుకటి మాటకే మీవాదము విరుద్ధమగుచున్నది.

వామ—మీరు కుయుక్తులెన్నిపన్నినను మీవాదము నిలువదు. పర్యాయ మనఁగా జన్మపర్యాయమని సోమయాజులుగారు చెప్పినది సర్వశాస్త్ర సమ్మతమయిన యర్థము, వేదములో నెక్కడను స్త్రీపునర్వివాహమన్న పేరైనను లేదు.

వీర—స్త్రీపునర్వివాహము కూడునని కంఠోక్తిగా వేదమునందుఁ జెప్పఁబడిన పెక్కు ప్రమాణములను నేను జూపినను మీరు నిరాధారముగా వేదమునం దెక్కడను స్త్రీపునర్వివాహమన్న పేరే లేదనుచున్నారు. 'యాపూర్వ' మను శ్రుతికి మీరేమైన విశేషార్థమును గల్పింపఁగలరా?

త్రివి—ఏదీ? ఆశ్రుతికి తెనుఁగున ప్రతిపదార్థము సెలవిండి.

వీర—యా=ఏస్త్రీ, పూర్వం=మొదటను, పతిం=భర్తను, విత్వా= పొంది, అథ = అనంతరము, అన్యంపతిం = మఱియొక భర్తను, విందతే=పొందుచున్నదో, తౌ=వారు (ఆదంపతులు), అజం=మేఁకను, పచౌదనంచ=అయిదు విధములయిన ఆహారములను, దదాతః=ఇత్తురేని, నవియోషతః = ఎడఁబాయరు. యః= ఎవఁడు, అజమ్=మేఁకను, పంచౌదనం=పంచవిధాహారమును, దక్షిణాజ్యోతిషమ్ = దక్షిణాసువర్ణమును, దదాతి = ఇచ్చుచున్నాఁడో,

పరఃపతిః= (అటువంటి) రెండవభర్త, పునర్భువా=పునర్భువుతోడ, సమాలోకః=సమానలోకము గలవాఁడు, భవతి=అగుచున్నాఁడు.

వామ—ఈ శ్రుతి మీవాదమున కెంతమాత్రమును పనికి రాదు.

వీర—ఒక స్త్రీ పూర్వమొకభర్తను వివాహము చేసికొని తరువాత మఱియొకనిని పునర్వివాహము చేసికొనెడుపక్షమున నజాపంచౌదనమను కర్మనుచేసి వారు సమానలోకమును పొందుదురని స్పష్టముగానున్న యీశ్రుతియే పునర్వివాహమునకుఁ బనికిరానిపక్షమున మఱియేశ్రుతి పనికివచ్చును? స్త్రీకి భర్తలోకము వచ్చునని శాస్త్రము చెప్పుచున్నది గనుక, ద్వితీయవివాహము చేసికొనెడి స్త్రీకే భర్తయొక్క లోకము కలుగునని శంకకలుగఁగా ద్వితీయ భర్తలోకమే కలుగుననియీశ్రుతిసందేహనివారణముచేయుచున్నది.

వామ—ఇది యంధునిమిత్తమయి చెప్పఁబడిన శ్రుతికాదు. స్త్రీ పునర్వివాహము శ్రుతినిషిద్ధము. మీరుచదివిన శ్రుతిచేతనే నారీపునర్వివాహము కూడదని నేను సాధించెదను. మీరుచెప్పిన యర్థముచొప్పుననే స్త్రీ పునర్వివాహము చేసికొన్నయెడల నజాపంచౌదనము చేయవలసినట్లు కనఁబడుచున్నదిగదా? అజాపంచౌదనమొక ప్రాయశ్చిత్తము. ప్రాయశ్చిత్తము చేసికోవలయునన్న మాత్రముననే యదియొక పాపకార్యముగా నేర్పడి స్త్రీ పునరుద్వాహము నిషిద్ధమని సిద్ధాంతమగుచున్నది. సురాపానముచేయువాఁడు ప్రాయశ్చిత్తము చేసికొన్నయెడల పాపము పోవునని వేదములోనున్నంత మాత్రమున సురాపానము వేదవిహితముకానట్లే పునర్వివాహము చేసికొన్న స్త్రీయును భర్తయుఁగలిసి యజాపంచౌదనమును చేయవలయునన్న మాత్రమున స్త్రీ పునర్వివాహమును వేదసమ్మతము కానేరదు.

వీర—అజాపంచౌదనము ప్రాయశ్చిత్తమని యెక్కడనుగను పట్టదు. స్త్రీపునర్వివాహమువలన పాపమువచ్చుననియు, ఆపాప మజాపంచౌదనమువలన పరిహారమగుననియు, పయిశ్రుతి చెప్పుచుం డలేదు. అజాపంచౌదనము శ్రేయఃప్రాప్తికై చేయు నొకకర్మవిశే షముగా మాత్రము కనఁబడుచున్నది. యజ్ఞముచేసినయెడల స్వర్గ భోగము కలుగునని చెప్పినట్లే, అజాపంచౌదనము చేయుటవలన పునర్భవును భర్తయు మరణానంతరమున సహితము సమానలోక మున సుఖింతురని చెప్పఁబడియున్నది. దీనిచేత స్త్రీపునర్వివాహము సిద్ధాంతమే యగుచున్నది. అదిగాకయథర్వణవేదమందలి ఊతయత్ప తయ, యనువచనము స్త్రీపునర్వివాహమునుస్థాపించుచునేయున్నది.

త్రివి—అశ్రుతికిఁగూడ తెనుఁగర్థము సెలవిండి.

వీర-ఉత=మఱియును, యత్=ఏది, స్త్రియాః,=స్త్రీకి, పూర్వే= పూర్వులయిన, అబ్రాహ్మణాః=బ్రాహ్మణులుకానివారు, దశప తయః=పదిమందిభర్తలు (అయి), బ్రహ్మ=బ్రాహ్మణుఁడు, హస్త మగ్రహీత్ చేత్=పాణిగ్రహణము చేసినపక్షమున, సఏవ—అతఁడే, ఏకధా=ఏకవిధముగా, పతిః=పెనిమిటి. బ్రాహ్మణఏవ=బ్రాహ్మణుఁడే పతిః=భర్త; నరాజన్యః=రాజన్యుఁడుకాఁడు; నవైశ్యః=వైశ్యుఁడు కాఁడు; తత్=అది, సూర్యః=సూర్యుఁడు, ప్రబ్రువన్=చాటుచు, పంచభ్యో మానవేభ్యః=అయిదువిధములయిన మనుష్యులకొఱకు, ఏతి=తిరుగుచున్నాఁడు. ఒకస్త్రీకి మొదట బ్రాహ్మణులు కానివారు పదిమందిపతులనయినను కడపట బ్రాహ్మణుఁడు పతియగునేని, ఆతఁడే యామెకు భర్తయనియు మరణానంతర మతని తోడిలోకమే గలుగుననియు శ్రుతితాత్పర్యము.

వామ—ఆహాహాహా! ఈయర్థ మెంత సొగసుగా నున్నది. ఒకస్త్రీ మొదట నొక శూద్రునిని, వాఁడుచచ్చిన నొక వైశ్యుని,

వాఁడు మృతినొందిన నొక క్షత్రియుని, ఈ ప్రకారముగా పది మంది లోకాంతరగతు లయినపిమ్మట నొక బ్రాహ్మణుని వివాహము చేసుకొమ్మని వేదము విధించుచున్నదఁట! లోకములో నింత కంటె విరుద్ధ మేమున్నది? నిజముగా మీ యర్థము నంగీకరించి బ్రాహ్మణుఁడు మంగలదానిని చాకలదానినివివాహము చేసికొన్నచో వర్ణాశ్రమధర్మములు చెడి లోకమంతయు పాడుకాదా? కాఁబట్టి మీరు చెప్పిన యర్థము సరియయినదికాదు. వేద మింత విరుద్ధ మయిన సంగతి చెప్పునా?

వీర—శ్రుత్యర్థమును విచారింపక మీరూరక పరిహసించిన కార్యము లేదు. పూర్వకాలమునందు బ్రాహ్మణుఁడు బ్రాహ్మణేతర జాతుల స్త్రీలను వివాహము చేసుకొనెడి యాచారము లేదనిగాని, ఆయాచారము శ్రుతిస్మృతిసమ్మతము కాదని కాని మీరు చెప్పఁ గలరా? విక్రమార్క చరిత్రమును చదివిన మీకీసంగతి విశదమగు ననుటకు సందేహము లేదు. పూర్వకాలమునందు బ్రాహ్మణుఁడు బ్రాహ్మణేతరస్త్రీలను మాత్రయే కాక వారి విధవలను సహితము వివాహమాడెడి యాచారమున్నట్లు ఈశ్రుతి సాక్ష్యమిచ్చుచున్నది.

వామ—మేమాయర్థము నొప్పుకొనము. ఇది బ్రాహ్మణుని యాధిక్యమును చెప్పవచ్చిన శ్రుతియే కాని యొక స్త్రీకి పదిమంది భర్తలయిన తరువాత బ్రాహ్మణుఁడు భర్త కావచ్చునని చెప్పవచ్చి నదికాదు. శ్రుతికర్తయొక్కయుద్దేశములను గ్రహించెడి శక్తి మా యొద్దలేదు. శ్రుతివాక్యమునకు నేను జెప్పిన యర్థముతప్ప మఱి యొక యర్థము కాదు. వేదము జెప్పినది విరుద్ధమని మీరు మాటి మాటికి ననుచుండుటకు మీకేమి యాధారమున్నదో నేనూహింపఁ జాలకున్నాను.

వీర—పదములిచ్చెడి యర్థమును గట్టిపెట్టి యుద్దేశములను గ్రహించెడిశక్తి మాయొద్ద లేదు. శ్రుతివాక్యమునకు నేను జెప్పిన యర్థము తప్ప మఱియొక యర్థము రాదు. వేదము చెప్పినది విరుద్ధమని మీరు మాటిమాటికి ననుచుండుటకు మీకేమి యాధారమున్నదో నే నూహింపఁజాలకున్నాను.

వామ—మాకు కావలసినన్ని యాధారములున్నవి. లోకాచారమే గొప్ప యాధారము. మీవాదమున కనుకూలముగా నున్నవని మీరు తెచ్చిన శ్రుతివాక్యముల యర్థవిచారమయినతరువాత వేదమునుండియే విధవావివాహము కూడదనుటకు కావలసినన్ని నిదర్శనములను జూపెదను.

వీర—"సోమః ప్రథమః" యను శ్రుతియొక్క యర్థమును గూడ చిత్తగింపుఁడు.—(ఓ చిన్నవారా!), తే=నీకు, సోమః=చంద్రుఁడు, ప్రథమః=మొదటిభర్తయని, వివిదే=తెలియఁబడుచున్నాఁడు గంధర్వః=గంధర్వుఁడు, ఉత్తరః=తరువాతి పెనిమిటియని, వివిదే=తెలియఁబడుచున్నాఁడు; అగ్నిః=అగ్నిహోత్రుఁడు, తే=నీకు తృతీయః=మూడవ, పతిః=భర్త, తే=నీకు, తురీయః=నాలవవాఁడు, మనుష్యజాః=మనుష్యునివలనఁ బుట్టినవారు.

వామ—ఈశ్రుతి మీ వాదమున కెందుకు పనికివచ్చును?

వీర—నాలవభర్త మనుష్యుఁడని చెప్పక మనుష్యునివలనఁ బుట్టినవారని బహువచనప్రయోగమును చేసియుండుటచేత స్త్రీపునర్వివాహము కూడదని యేర్పడుచున్నది.

వామ—"తురీయః" అనుచోట నాలవవాఁడని యేకవచన బోధకముగా నున్నది. "మనుష్యజాః" అనుచో బహువచనము ప్రయోగింపఁబడియున్నది. శ్రుతికర్తయొక్క యభిప్రాయమేమీరు

చెప్పినదయినపక్షమున, నాలవవారని బహువచనమే ప్రయో బడియుండును.

వీర—నాలవవాఁడని యేకవచనమును ప్రయోగించుటలోనే విశేషసారస్యమున్నది. తరువాత మనుష్యునివలనఁ బుట్టినవారని బహువచనము ప్రయోగించియు మొదట నాలవవాఁడని యేకవచనము వేయుటవలన, స్త్రీకి బహుభర్తలుండవచ్చినను, ఒకకాలము నందొకనికంటె నధికభర్తలుండఁగూడదని తెలియవచ్చుచున్నది.

వామ—నాలవవాఁడని చెప్పుటచేతనే మీయర్థము పడిపోయినది. శ్రుతికన్యకు నలువురు భర్తలను మాత్రమే విధించుచున్నది. అందు మొదటి ముగ్గురును సోమగంధర్వాగ్నులు; నాలవవాఁడు మనుష్యుఁడు. కన్యకు మరల వివాహముచేసిన యెడల వాఁడయిదవవాఁ డగును గనుక నలుగురు భర్తలనే విధించిన శ్రుతి కట్టి వివాహము విరుద్ధమగును.

వీర—మీరు స్త్రీ కెన్ని వివాహములు చేసినను మనుష్యేతరు నెన్నఁడును భర్తను జేయరు గనుక, శ్రుత్యనుసారముగా మనుష్యుఁ డెప్పుడును నాలవవాఁడే యగును. అందుచేత మీయాక్షేపణమేమియు పొసఁగియుండలేదు. స్త్రీకి పునర్వివాహము చేసినను మనుష్యుడగుటచే నాభర్త నాలవవాఁడేయయి మీయాక్షేపణమున కవకాశము లేకపోవును.

వామ—అట్లయిన వేదపాఠము తప్పు. "మనుష్యజః" అని యేకవచనముండవలెను. సర్వజ్ఞుఁడయిన యీశ్వరుఁడు వ్యాకరణజ్ఞానము లేనివానివలె 'తురీయ' యని విశేషణము నేకవచనముగాను దాని విశేష్యమయిన 'మనుష్యజా' యను దానిని బహువచనముగాను ప్రయోగించునా? వేదాధ్యాయముచేసిన ఋషులును బ్రాహ్మణులును ప్రమాదవశమున మీరు చెప్పిన తప్పు పాఠమును

గ్రహించి యుందురు. అంతేకాని వేదపురుషుని భావము నేను చెప్పినదే వేదములో నున్న గూఢార్థము మీకేమియు తెలియక యపార్థములను జేయుచున్నారు.

వీర—ఇఁక—వేదపాఠమును తమవంటి పెద్దలు సంస్కరించవలెను గాని నావంటివారి కటువంటి సామర్థ్యము లేదు. తొల్లిటి పెద్దలు సహితము వైదిక ప్రయోగములను మన మాక్షేపింపరాదనియే నియమము చేసియున్నారు. అయినను మీరు చెప్పినట్లు సంస్కరించినను మీవాదమునకు లాభముగాని మావాదమునకు నష్టము గాని కలుగదు. మనుష్యుఁడని యేకవచనమేయున్నను, అది జాతి వాచకమయి యందఱు భర్తలకును పనికివచ్చును. ఏభర్తయయినను మనుష్యుఁ డగుటచేత నాలవవాఁడేయగును గనుక, మీరు చేసిన పూర్వార్థమును మార్పును నంగీకరించినను మీ కావగింజంతయు లాభము కలుగలేదు.

వామ—మీరన్నియు కుయుక్తులు చెప్పుచున్నారు. మీరెంత చెప్పినను మీ వాదము గెలువదు. ఇట్టి యక్రమమయిన వాదమును సభవా రెవ్వరైనను నంగీకరింతురా? ఒక్కసభవారే కాదు. లోకములో కర్మభూమియందు పుట్టి శ్రుతిస్మృతి శిష్టాచారములు ప్రమాణమనుకొనువా రెవ్వరైన మీరు చెప్పిన యర్థము సరియైనదని యొప్పుకొందురా? మీరు చేసిన యర్థమును నమ్ముకొని యాచరణముచేసిన పక్షమున లోకమంతయు వర్ణసంకరము కాదా? మీ రెన్నివిధముల మాయోపాయములు చేసినను శిష్టులెవ్వరును మీ మాటలను విశ్వసింపరు.

వీర—వర్ణసాంకర్యము కలుగకుండ లోకమునురక్షించుటకై మీరు చేసెడి సదర్థమును జూపి మీవాదమును స్థాపించుట కాధారభూతములుగా నున్న శ్రుతిప్రమాణములను వివరింపరాదా?

వామ—మీ వాదమును ఖండించుటకయి యెన్నో శ్రుతి ప్రమాణములు కావలెనా? ఒక శ్రుతివాక్యముతో మీ రెంత కాలమో కష్టపడి యపార్థకల్పముచేసిన దుర్బలప్రమాణముల నన్నిటిని జంఝామారుతము దూదిపరకల నెగరఁగొట్టివేసినట్లు తుప్పున నెగరఁగొట్టెదను.

శ్రుతి॥ యదేకస్మిన్ యూపే ద్వేరశనే పరివ్యయతి తస్మా దేకో ద్వేజాయే విందతే॥ యన్నైకాగ్ం రశనాం ద్వయోర్యూపయోః పరివ్యయతి తస్మాన్నైకా ద్వాపతీ విందతే.

అను శ్రుతిని మీరెప్పుడయిన విన్నారా? వినియుండిన పక్షమున స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమని యింత సాహసము చేయుటకు మీరు బయలుదేఱరు. ఇది విధవావివాహము నెంత స్పష్టముగా నిరసించుచున్నదో చూడుఁడు.

త్రివి—ఈశ్రుత్యర్థమేమో నాకు తెలుఁగుమాటలతో సెలవియ్యవలెను.

వామ—ఒకపురుషున కిద్దఱు భార్యలుండవచ్చును గాని, యొక స్త్రీకిద్దఱు భర్తలెంతమాత్రము నుండఁగూడదని యీశ్రుతి స్పష్టముగాఁ జెప్పుచున్నది. ఇంతకంటె తేటతెలుఁగేమి కావలెను?

త్రివి—వాక్యమును జదివి ప్రతిపదార్థమును నొక్కసారి సెలవిచ్చెదరా?

వీర—ప్రతిపదార్థమును నేను జెప్పెదను వినుఁడి:—

యత్=ఎందువలన, ఏకస్మిన్ యూపే—ఒక స్తంభమునందు, ద్వేరశనే=రెండుత్రాళ్ళు, పరివ్యయతి=కట్టఁబడుచున్నవో, తస్మాత్=అందువలన, ఏకః=ఒకఁడు, ద్వేజాయే ఇద్దఱుభార్యలను, విందతే=పొందుచున్నాఁడు; యత్=ఎందువలన, ఏకాగ్ంరశనాం=ఒకరశనను,

ద్వయోర్యూపయోః = రెండుయూపములకు, నపరివ్యయతి = కట్టు చుండ లేదో, తస్మాత్=అందువలన, ఏ కా=ఒక తె, ద్రౌపతీ=ఇద్దఱు భర్తలను, నవిందతే=పొందుచుండ లేదు.

ఇదేనా మీయర్థము? ఇంతకంటె విశేషార్థము నేమయినఁ గల్పించెదరా?

వామ—మీరు చెప్పిన యర్థము సరిగానేయున్నది. స్త్రీ పునర్వివాహము కూడదనుట కింతకంటెను విశేషార్థమేదికావలెను?

త్రివి—ఈయర్థమునుబట్టి విచారింపఁగా నేక కాలమునందు మాత్రమే స్త్రీ కిద్దఱు భర్తలుండరని శ్రుతిచెప్పుచున్నట్టు కనఁబడు చున్నది.

వామ—ఏక కాలమునందు మాత్రమే కాక భిన్న కాలముల యందుఁగూడ స్త్రీకి బహుభర్త లుండగూడదనియే ప్రతితాత్ప ర్యము. వేదవాక్యములలో కాలనిర్ణయము లేకపోవుటచేతనే సర్వ కాలములయందునని మీకు స్ఫురించుచుండ లేదా?

వీర—ఆసంగతి తరువాత చూచుకొందము. ముందుగా నేను చేసెడి యాక్షేపణలకు సమాధానము చెప్పుఁడి. వేదము, బ్రాహ్మ ణము, మంత్రము, అర్థవాదము నని మూడుభాగములు కలదిగా నుండును. బ్రాహ్మణమనఁగా విధివాక్యము గనుక, అది స్వతః ప్రమాణము; మంత్రములు విధివాక్యైక వాక్యతచేతఁగాని, కల్ప మాత్రకారుల విధివాక్యబలముచేతఁగాని ప్రమాణములగునుగాని స్వతఃప్రమాణములు గావు; అర్థవాదము లెప్పుడును ప్రమాణములే కావు. పయిశ్రుతిలోని స్త్రీ కిద్దఱుభర్తలుండరు లోనుగాఁగల భాగ మర్థవాదమే గనుక, అది ప్రమాణము కానేరదు.

వామ—అది యర్థవాదముకాదు మంత్రము.

వీర—"లౌకిక దృష్టాన్తేన రశాద్వయమ్ విధత్తే"—అను భాష్యమునుబట్టి చూచినను, సందర్భమునుబట్టి చూచినను, ఈశ్రుతి యూపమునకు రశనను గట్టుటనుగూర్చి చెప్పవచ్చినదే కాని వివాహమును గూర్చి చెప్పవచ్చినది కాదు; ఒకపురుషునకెట్లు ఇద్దఱు భార్యలుందురో యాప్రకారముగా నొకయూపమునకు రెండు రశనలను గట్టవచ్చుననియు, ఒకస్త్రీకేప్రకారముగా నిరువురుభర్తలుండరో యారీతినే యొకరశనను రెండుయూపములకుఁ గట్టరనియుదాని తాత్పర్యము. ఇదియంతయుమంత్రమేయయినను, ప్రత్యేకవిధివాక్యముగాని సూత్రకారుల వినియోజక వాక్యముగాని లేక మంత్ర మెంతమాత్రమును ప్రమాణముకాదు. వేదమున బ్రాహ్మణభాగమునం దెక్కడను నారీ పునర్వివాహమును నిషేధించు విధివాక్యము కానరాదు; వినియోజక వాక్యమయిన కల్పసూత్రము "అగ్నిష్ఠంద్వాభ్యాగ్ రశనాభ్యాంపరివీయ" యని రశనాబంధమును మాత్రమే విధించుచున్నది. కాఁబట్టి యొకపురుషుఁ డిద్దఱుస్త్రీలను బొందుననియు నొకసుందరి యిద్దఱు పతులను బొందదనియుఁ జెప్పెడివాక్యము విధివాక్య సన్నిధానమునఁ బఠించెడి యర్థవాదమే యగును.

వామ—ఆభాగముకూడ మంత్రముతోఁ జేరిన దేయగుటచేత వినియోజకవాక్య మగ్నిష్ఠయూపమునకు రశనాద్వయ బంధనమును మాత్రమే విధించుచున్నను సంబంధమునుబట్టి తక్కినభాగమును ప్రమాణ మగును.

వీర—"ఉదీర్ష్వనారీ" యను మంత్రముయొక్క వినియోజక వాక్య ముత్థాపనక్రియను మాత్రము చెప్పుచున్నను మంత్రము పునర్వివాహము చేసికొందువుగాని లెమ్మని పలుకుటవలన నేకవిషయ మగుటంజేసి సంబంధమునుబట్టి స్త్రీపునర్వివాహమున కనుజ్ఞయయినట్లు, ఇక్కడ పోలికచేతతప్పనుటయేసంబంధమునులేని భిన్నవిషయ

ములయిన రశనాబంధన వివాహబంధములయందు రశనావిధానము చేత వివాహవిధానము కానేరదు. మీరు చెప్పిన సంబంధమునుబట్టి మాత్ర మగ్నిష్ఠయూపమునకు రశనాద్వయబంధనమును మాత్రమే విధించుచున్నను, ఏకవిషయ మగుటంజేసి యగ్నిష్ఠయూపమునకును సమీపమునందున్న మఱియొక యూపమునకును జేర్చి యేకరశనను గట్టఁగూడదన్న యుత్తరార్థమునందలి నిషేధముకూడ ప్రమాణము కాఁగలదు.

వామ—వినియోజకవాక్య మెట్లున్నను మూలమునుబట్టి రశనాబంధమే దృష్టాంతముగాను వివాహము దార్ష్టాంతికముగాను గనఁబడుచున్నది గనుక వివాహవిషయమునఁగూడ నీశ్రుతిప్రమాణ మగునని నేతలఁచెదను.

వీర—మీరట్లు తలఁచుట కాధారము లేశమయినను లేక పోయినను వాదమునిమిత్తము క్షణకాలము మీ తాత్పర్యముతోనే నేను నేకీభవించెదను. అప్పుడుసహాత మీశ్రుతి మీ వాదమునకెంత మాత్రము ననుకూలపడదు.

వామ—ఎందుచేత? మీరాయర్థము నొప్పుకొన్న పక్షమున నారీ పునరుద్వాహము కూడదని నిమిషములో సాధించెదను.

వీర—ఎన్నిపాట్లుపడినను మీ రావిషయమును సాధింపఁ జాలరు? ఏకకాలమునం దొక స్త్రీకిరువురుభర్తలుండరనితప్ప మఱి యొక యర్థ మీశ్రుతికి స్థిరపడదు.

వామ—వేదవచనములో నేకకాలమునందనిగాని కాలభేద మునందనిగాని లేకపోవుటవలన సర్వకాలములయందని మనమర్థము చేయవలెను.

వీర—సాధారణముగా నొకపురుషున కిద్దఱుభార్య లన్నతో డనే యేకకాలమునం దిద్దఱుభార్య లున్నారనియే యూహకలుగును

గాని పూర్వము మృతినొందిన భార్యయు నిప్పుడు జీవించియున్న భార్యయుఁ గలిసి యిద్దఱుభార్యలన్న యూహకలుగదు; అదేప్రకారముగా స్త్రీ కిద్దఱుభర్తలన్నను, ఏకకాలమునందనియే యూహింపఁదగియుండును. అందుచేత పయి నిషేధ మేకకాలమునం దొకయింతి కిరువురు పతు లుండరనుటయందే ప్రవర్తించుననుట స్పష్టము. అదిగాక కల్పసూత్రాది షడంగముల ననుసరించియే యెప్పుడును శ్రుతి వాక్యమున కర్థనిర్ణయము చేయవలెను. దీనికి వినియోజకవాక్యమయిన "అగ్నిష్ఠం ద్వాభ్యాగ్ రశనాభ్యాం పరివీయ" యను కల్పసూత్రి మగ్నిష్ఠయూపమున కేకకాలమునందే రెండుత్రాళ్ళను కట్టవలయునని విధించుచున్నది గనుక, దృష్టాంతమునుబట్టి పూర్వార్థమునకు పురుషున కేకకాలమునం దిద్దఱు భార్యలుండవచ్చునన్నయర్థము సిద్ధించుచున్నది; అగ్నిష్ఠయూపమునకును మఱియొకయూపమునకును గలపి యొకత్రాటి నేలాగునఁ జుట్టబెట్టరో యాలాగుననే యేకకాలమున నొకకామిని కిరువురు పతులుండరని యుత్తరార్థము వలన సిద్ధించుచున్నది.

వామ—ఒకయూపమునకుఁ గట్టినరశనను మఱియొకయూపమునకుఁ గట్టఁగూడదన్న విధులు ప్రత్యేకముగ నున్నవిగనుక, ఒక పురుషుఁ డనుభవించిన స్త్రీని మఱియొకపురుషుఁ డెప్పుడు ననుభవింపఁగూడదనియు నేర్పడును.

వీర—ఈమంత్రము యూపసామాన్యమునకు రశనాబంధనమును విధింపవచ్చినది కాదనియు, విశేషముగా యూపైకాదశినీ ప్రకరణములో నగ్నిష్ఠయూపమునకు రశనాద్వయబంధమును విధించునదియనియు నిదినఱకే చెప్పియున్నాను. అగ్నిష్ఠమునునది పదునొకండు యూపములలో నగ్నికి సమీపముననుండు నడిమియూపము. కాఁబట్టి యేకయూపమునకు సమకాలమునందుఁగాని భిన్న

కాలముల యందుగాని వేఱువేఱురశనలను కట్టుదురా కట్టరాయని యు, ఏకరశనను సమకాలమునందుఁగాని భిన్నకాలమునందుఁగాని వేఱుయూపములకుఁ గట్టుదురా కట్టరాయనియు, ఇక్కడ విచారణీయముకాదు. ఆయావిషయములను దెలుపుట కితరశ్రుతులును కల్పసూత్రములు నుండును. ఈశ్రుతియేక కాలమునుగూర్చియే చెప్పుచున్నదిగనుక, కామినికి బహుపతిత్వనిషేధమును నేక కాలమునందే యగును. అంతేకాక "ఉదీర్ష్వనారీ" ఇత్యాది శ్రుతులకు విరుద్ధము కాకుండ నీశ్రుతి కర్థనిర్ణయము చేయవలెను.

వామ—"ఉదీర్ష్వనారీ" యను మంత్రములోని పునర్వివాహ మాభర్తకే పరలోకమున నని వెనుక నే చెప్పియున్నానుగనుక మీరా యంశము నెత్తుకోఁగూడదు.

త్రివి—అవును మీరు వెనుక నే సెలవిచ్చినారు. ఈభార్యబ్రహ్మచర్యముచేసి మరణమునొంది పరలోకమునకు వెళ్ళునప్పటికి, ఆభర్త మఱియొకజన్మమెత్తి యుండవచ్చును. అప్పుడు పరలోకమునందు సహితమామెకు భర్తదొరకక మరల నక్కడనుబ్రహ్మచర్యమే యాచరింపవలసివచ్చును. ఒకవేళ నుత్తరజన్మమునందైనను మొదటిభర్తతోడి పొందు లభించవచ్చునన్నపక్షమున, పురాకృతదుష్కృతము చేత నతఁడు పిల్లియో యెలుకయో యయి పెట్టెడునెడల నామె కప్పుడుపిల్లితోడనో యెలుకతోడనో సౌఖ్యముసంభవించును. మీరు చేసినయర్థము దివ్యముగాను నిరాక్షేపముగాను నున్నది.

వీర—ఈమాటల కేమికాని శ్రుతిలోని వర్తమానార్థబోధక క్రియాపదములు గూడపయిని జెప్పిన బహుపతిత్వనిషేధ మేకకాలమునందు మాత్రమేయని తెలుపుచున్నవి.

వామ—వర్తమానార్థక క్రియాపదములువిధ్యర్థమును తెలుపవచ్చునని మీరొకచోటఁ జెప్పియున్నారు కాదా?

వీర—ఒకానొకచోట నట్టి ప్రయోగములుకనఁబడినను, అవి యిక్కడ వర్తమానార్థద్యోతకములు కావనుట కాధారమేమియు గనఁబడదు. మఱియును విద్యారణ్యులవారు భాష్యమునందుపరివ్యయతి=పరివేష్టయతి, విందతే=అనుభుంక్తే, నవిందతే=నప్రాప్నోతి, అని వర్తమానార్థకములుగానే చెప్పియున్నారు. ఇవిగాక యీశ్రుతి యేకకాలమందేయని చూపుట కితరాధారము లనేకములుగలవు.

వామ—ఇప్పుడు చూపిన యాధారము లెంతచప్పగా నున్నవో యిఁకముందు చూపఁబోయెడి యాధారములును పండితులకంత చప్పగానే యుండును. మీవాదములో వట్టి పిచ్చియే కానిసారమేమియు లేదు. మీది శాస్త్రమర్యాద తెలిసిన వాదముకాదు.

వీర—నాది యెట్టివాదమయినను సాంతముగాచిత్తగించిమీ ససారమయిన శాస్త్రసమాధానములను సెలవిండి. వ్యాఖ్యానములను జేసిన మనపూర్వులును నేనుజెప్పిన యర్థమునే చెప్పియున్నారు. పండితమండలాగ్రగణ్యులయిన మాధవాచార్యులవారుపరాశరస్మృతి వ్యాఖ్యానమునందు స్థూల సూక్ష్మ ధర్మవిచారమునుజేయుచు, పైకి ధర్మముగాఁ గనఁబడు ద్రౌపదీ వివాహమునందలి బహుపతిత్వమును సూక్ష్మధర్మమునుగా జెప్పి, ద్రుపదుఁడు లోకవేదవిరుద్ధమని చెప్పిన వాక్యము నందుకొని, "తిర్యక్ష్వపి ఏకస్యాం గవివృషభద్వయయుద్ధదర్శనాత్" తిర్యగ్జంతువులయందు సహితమొకయావు విషయమయి రెండుగిత్తలు పోరాడుట చూచుచుండుటవలన లోకవిరుద్ధము స్ఫుటమేయనియు, "వేదేష్వేవంశ్రూయతే" వేదమునందు నిటులే చెప్పఁబడియున్నదని, "ఏకస్యబహ్వ్యో" యను శ్రుతిని, "యదేకస్మిన్ యూపే" యను శ్రుతినిగూడ నుదాహరించియున్నారు. మాధవాచార్యులవారిచ్చిన దృష్టాంతమువల్లను, వేదమును ఈయర్థమునే యిచ్చుచున్నదని కంఠోక్తిగాఁ జెప్పుటవల్లను, పయిశ్రుతిద్వయమును

ఏకకాలమునందుమాత్రమే స్త్రీలకు బహుపతిత్వ నిషేధము చేయుచున్నదని మాధవాచార్యులవారి తాత్పర్యమయినట్లు కరతలామలకముగాఁ గనఁబడుచున్నది.

వామ—ఊరకే యట్టివృత్తాంతము నిచ్చినారేకాని మాధవాచార్యులవారి మతము మీరు చెప్పినదికాదు. పండితులమతము పండితులకేగాని గోచరముకాదు. ఇంతకంటె మీరుచెప్పెడి దేమయిననున్నదా?

వీర—భారతమునందును పూర్వోక్తమయిన "తస్మాదేకస్య" యను ఋగ్వేద వచనమును, ఈశ్రుతియుఁగూడ ద్రౌపదీ వివాహఘట్టమున నేకకాలమునందు స్త్రీలకు బహుపతిత్వము నిషేధమని చూపుటకే యుదాహరింపఁబడియున్నది. మ్రిపదుఁ డీ రెండుశ్రుతుల యర్థమును మనసునందుంచుకొనియే,

శ్లో॥ ఏకస్యబహ్వ్యోవిహితా మహిష్యఃకురునందన
నైకస్యాబహవోలోకే శ్రూయంతే పతయఃక్వచిత్॥

అని స్త్రీల కేకకాలమునందు బహుపతిత్వనిషేధమును జెప్పి, ఏకకాలమునందు ద్రౌపదిని యుధిష్ఠిరాధిపతుల కయిదుగుర కిచ్చి వివాహముచేయుట యక్రమమని చెప్పియున్నాఁడు.

వామ—ఏకకాలమునందు బహుపతిత్వనిషేధము నెఱింగియుండియు ద్రౌపతి నేకకాలమున నేప్రకారముగా నేవురుభర్తల కిచ్చి వివాహము చేసినాఁడు?

వీర—ఏకకాలమనఁగా నేకక్షణమని యర్థముచేసి, ఒకరితరువాత నొకరికిచ్చుట యేకకాలము కాదని యభిప్రాయ పడుటవలన ద్రౌపదీవివాహము జరిగినది. అప్పుడు యుధిష్ఠిరుఁడు,

శ్లో॥ సర్వేషాం ధర్మతః కృష్ణా మహిషీనోభవిష్యతి।
ఆనుపూర్వేణ సర్వేషాం గృహ్ణాతుజ్వలనేశరాన్॥

అని 'ధర్మమార్గమున మాయందఱకు ద్రౌపది భార్య కాఁగలదు; జ్యేష్ఠానుక్రమముగా నందఱి బాణములను అగ్నిసమీపమున గ్రహించునుగాక' యని ద్రుపదునితోఁ జెప్పెను.

వామ—ఏక కాలమనఁగా మీయభిప్రాయము నట్టిదేయయి యుండవచ్చును.

వీర—నాయభిప్రాయ మట్టిది కాదు. మన పెద్దలట్టి యర్థము చేయ సాహసించినను, వెనుక చెప్పినట్లు నష్టత్వాదినిమిత్తముల యందు వివాహమాడవచ్చునన్న శాస్త్రవిహితమయిన కాలమే భిన్నకాలమనియు, తద్వ్యతిరిక్తమయిన కాల మేకకాలమే యనియు నానిశ్చిత తాత్పర్యము.

వామ—మీవన్నియు కుశ్శంకలును కుయుక్తులు నే కాని శాస్త్ర సమ్మతమయిన నాయాక్షేపణలకు తిన్నని సమాధాన మొక్కటియు రాలేదు. స్త్రీపునర్వివాహ మశాస్త్రీయము. నావాదమువల్ల 'యదే కస్మిన్ యూపే' అనుశ్రుతి స్త్రీపునర్వివాహమును నిషేధించుచున్నట్లు స్థాపనమయినది.

వీర—ఒకవేళ శ్రుతికి వాదమునిమిత్తమయి మీయర్థమునే యొప్పుకొని యేకకాలమునందుఁగాని భిన్నకాలములయందుఁగాని స్త్రీలకు ద్విపతిత్వనిషేధమునే చెప్పినను, అప్పుడుసహితము శాస్త్ర సమన్వయరీతిచేత సామాన్యవిశేష వ్యవస్థనుజేయఁగా స్త్రీకిద్దఱు భర్తలు కూడరన్న యీసామాన్యవిధి భర్తృమరణము సంభవించునప్పుడు పునర్వివాహము చేసికోవచ్చునని విధించి "ఉదీర్ష్వనారి" యను విశేషవిధిచేత బాధింపఁబడి మృతభర్తృక యయినప్పుడు తప్ప స్త్రీకిఁ బునర్వివాహము లేదని సిద్ధాంతమగుచున్నది.

వామ—మీదంతయు నప్రమాణ్యవాదము. ఇక్కడ నుత్సర్గాపవాద న్యాయముపట్టదు. అందుచేత సామాన్యవిశేష వ్యవస్థను చేయుటకు వీలుపడదు.

వీర—మీరు సహేతుకముగా నుత్తరమును జెప్పక నేను జెప్పినదెల్లను దప్పని వితండవాదము చేయుచున్నారు. మీకనుకూలముగా నిమిషకాలము శ్రుతిద్వయమునకును విశేషసామాన్యభావముచేత వ్యవస్థచేయుట కవకాశము లేదనియే యొప్పుకొన్నను, అప్పుడయినను.

"శ్లో॥ ధర్మజిజ్ఞాసమానానాం ప్రమాణం పరమంశ్రుతిః।
శ్రుతిద్వైధంతు యత్రస్యాత్తౌధర్మావుభౌస్మృతౌ॥"

అను మనువచనమునుబట్టి శ్రుతి ద్వివిధమైనచో రెండును ప్రమాణములే యగును గనుక వికల్పముగా స్త్రీపునర్వివాహ మంగీకార్యమే యగును.

వామ—మీరుచెప్పిన గొడవయేమో నాకు తెలిసినది కాదు మీరీ శ్రుతివిషయమయి యసంగతముగా పదిసంగతులు చెప్పినారు. మీనిశ్చితాభిప్రాయమేమో యూహించుటకు తోచకున్నది.

వీర—నేను చెప్పినదానిలో నసంగతమేదియు లేదు. వివాహ విషయమును బోధించెడి యీశ్రుతిభాగ మర్థవాదముగనుక ప్రమాణమే కాదనియు, ఒకవేళ ప్రమాణమగునని యొప్పుకొన్నను ఏకకాలమునందనితప్ప వేరర్థముగాదనియు, భిన్నకాలములయందుఁ గూడనని యర్థమువచ్చునని యంగీకరించినను ఇది సామాన్యవిధియయి మృతభర్తృక వివాహముచేసికోవచ్చునన్న విశేషవిధిచేత బాధింపఁబడుననియు, అట్లు బాధింపఁ బడదన్నను పరస్పరవిరుద్ధములగు రెండు విధులున్నచో ధర్మము వికల్పమగునుగనుక ఇష్టమున్నచో స్త్రీపున

ర్వివాహము చేయవచ్చుననియేసిద్ధాంతమనియు, అనేకవిధములచేతఁ జెప్పి యేవిధమునఁ జూచినను మీవాదము నిలువదని స్థాపించినాను.

వామ—బహుచక్కఁగా స్థాపించినారు!

శుత్రి॥ సమాయుషాసంప్రజయా సమగ్నేవర్చసాపునః
సంపత్నీ పత్యాహంగచ్ఛే మమాత్మాతనువామమ॥

అను కృష్ణ యజుర్వేదమునందలి యీ మంత్రమును అగ్ని బ్రాహ్మణ సన్నిధిని యజమానపత్ని పఠించుచున్నది. "పునఃసంపత్నీ పత్యాహంగచ్ఛే" యను వాక్యమునకు "అనేక పత్యాపునః పునః పత్నీ భూత్వా సంగచ్ఛే-వియోగః కదాచిదపిమాభూదిత్యర్థః" అని వ్రాసిన భాష్యము నాలోచింపఁగా నీజన్మమం దీభర్తతో నెప్పుడును వియోగము లేకుండునటులు చేయుమని యగ్నిని బ్రార్థించుట స్పష్టమయి యున్నది. అట్లుండఁగా వేదము పునర్వివాహము నంగీకరించునన్న నెట్లు నమ్మఁదగియుండును ?

వీర—సాధ్వియెప్పుడును తనకు పతితోడి వియోగము లేకుండునట్లు చేయవలయునని ప్రార్థించినమాత్రమున నారీపునర్వివాహము లేదని యెట్లేర్పడును? తనవారు దీర్ఘాయుష్మంతులు కావలయునని యెల్లవారును గోరుదురు. దైవయోగముచేత మరణాదికమువలన వియోగము సంభవించినప్పుడు, "ఉదీర్ష్వనారీ" త్యాది మంత్రము నందలి యనుజ్ఞనుబట్టి యిష్టమున్నచో వివాహము చేసికోవచ్చును.

వామ—మీరన్నియు నపార్థములే చెప్పుచున్నారు. ఎవరిది న్యాయపక్షమో యగ్రాసనాసీనులై మధ్యవర్తులుగానున్న సాంబశివరావుపంతులుగారు సెలవియ్యవలెను.

వీర—మనతో నెవ్వఁడితోను జెప్పకుండ సాంబశివరావుపంతులుగారు తమ పీఠము నుండి దిగి నడిచినారు.

పర—సాంబశివరావుపంతులుగారు లేకపోయిన, మన శ్రీనివాసాచార్యులవారి నడుగరాదా? మనపట్టణములో కపటమువిడిచి నిష్పక్షపాతముగాఁ జెప్పువారు వారికంటె మఱియెవ్వరున్నారు? వామనశాస్త్రిలగారివాదము శాస్త్రసమ్మతమైనదని యింతపిల్లవాని కయినను తెలియునే.

త్రివి—(తనలో) శ్రీనివాసాచార్యులుగారు నిష్కపటముగా జెప్పుదురఁట! లోకములోని కాపట్యమంతయు మూర్తీభవించి, ఆయన రూపమున నవతరించినది. ఆయన యెప్పుడయిన మనసులో నున్నది ధారాళముగాఁ జెప్పునా? అయినను సభలో నేమిచెప్పునో చూతము.

వేణు—పరబ్రహ్మసోమయాజులుగారు బ్రహ్మణ్యులు. వారి కోరిక శ్రీనివాసాచార్యులుగారు చెల్లించవలెను.

శ్రీని—నా కీవిషయము పూర్ణముగాఁ దెలియదు. కర్మనిష్ఠులు మీరే సెలవియ్యవలెను.

వేణు—అలాగునఁగాదు. మాయుందఱిలోను మీరే బహుబుద్ధిమంతులు, మీరే సెలవియ్యవలెను.

శ్రీని—నన్ను గొప్పచేసి యింతమంది కోరుచున్నారు గనుక మూర్ఖపుపట్టుపట్టి చెప్పకుండుట మంచిదికాదు. నాయభిప్రాయమును జెప్పినప్పుడు మీ రెవ్వరును కోపపడకుండవలెను. నాకు వేదవిషయములో విశేషపరిచయములేదు. వీరరాఘవరావుగారు శ్రమచేసి బహుదూరము చెప్పినారుగాని వారివాదము ప్రస్తుతాంశమున కంతగా సంబంధించినట్టు కనఁబడదు. వామనశాస్త్రిగారు సంగ్రహముగాఁ జెప్పినను, చెప్పిన రెండుముక్కలును వారివాదమును స్థాపించజాలినవిగాను సుబోధముగానుఉన్నట్టు నా మతమునకు తోఁచినది.

పర—(చప్పట్లుకొట్టి) మా వాదము గెలిచినది; మా వాదము గెలిచినది.

హామ—మేము శాస్త్రమర్యాదనుమీఱి యొక్కముక్క చెప్పము.

వేణు—ఇఁక సభచాలించి, యీసారి స్మృతివిషయమయిన చర్చచేయవచ్చును.

త్రివి—ఇంతటితోనే మొగము మొత్తినది. ఇఁక వేఱే ధర్మశాస్త్రచర్చతో పనిలేదు.

వేణు—ఆలాగున సెలవియ్యవద్దు. మీవాదము పూర్ణముగా విన్నపిమ్మటగాని యిదమిద్ధమిని చెప్పనల్లకాదు.

వీర—వాదముయొక్క బలాబలములు మధ్యవర్తులు చెప్పక పోయినను జనులు మనసులకయినను తెలియక మానవు. పయిభాను వారమునాఁడు మరల సభ జరగనిండి. ఇప్పటికి వెళ్ళుదము.

[అందఱు నిష్క్రమించుచున్నారు.]

సంపూర్ణము.

బాక్స్ ప్రెస్, రాజమండ్రి—1950

ADVA 103B119

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA103B119
పుస్తకం పేరు	కందుకూరి వీరేశలింగకవికృత గ్రంథములు 02
తారీఖు	31 December 2025
ముందు అట్ట	UCS
వెనుక అట్ట	UCS
మొత్తం పేజీలు	739
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	68, 251
లేని పేజీలు	[redacted] 463TO470
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
స్కానింగు చేసినది	
పరిస్థితి	good

సాక్షి 396 / V

68, 251